

వెంకూ

లండన్‌లోని ప్రపంచ ప్రఖ్యాత బ్రిటిష్ లైబ్రరీలో

మన 'కరోనోస్టాల్జియా', 'ష్.. వైరస్' పుస్తకాలు

ష్.. వైరస్

కరోనోస్టాల్జియా 2.0

వెంకూ

డిప్యూటీ న్యూస్ ఎడిటర్, 'ఈనాడు'

Shhh... Virus

(Coro Nostalgia 2.0)

by **VENKU**

M.S.R.Venkata Ramana

Deputy News Edtor, **EENADU**

H.No: 5-4-1564/P-19WP

Sharada Nagar Phase -IV

Bhagyalata Colony Vanasthalipuram

HYDERABAD - 70

venku1968@gmail.com

+91 80084 55788

శ్రీ ఎమ్మెస్సార్ వెంకటరమణ (వెంకూ)కు..

'కరోనోస్టాల్జియా', 'ష్.. వైరస్' శీర్షికలతో మీరు రచించిన రెండు పుస్తకాలను పరిశీలించాను. చైనాలో కరోనా వైరస్ ఉద్భవించినప్పటి నుంచి తాజాగా టీకా పరిణామాల వరకు ప్రతి అంశాన్ని చక్కగా స్పృశిస్తూ.. ప్రజల్లో నెలకొన్న అపోహలను, వాటిని నిర్వీర్యం చేసేందుకు జరిగిన ప్రయత్నాలను కరోనా సమయంలో మీతోపాటు, మీ స్నేహితులు, ఇతరుల అనుభవాలను మీ పాత్రికేయ ప్రావీణ్యాన్ని జోడిస్తూ రెండు పుస్తకాలను తీసుకొచ్చిన మీ చొరవను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

కరోనా పుట్టుపూర్వోత్తరాలకు ఆత్మకథను జోడిస్తూ, ఈ మహమ్మారి కారణంగా ప్రపంచం ఎదుర్కొంటున్న క్లేశాలను, అంతిమ సంస్కారాలకు ఆ నలుగురు కూడా దొరకని పరిస్థితిని వివరిస్తూ.. బాధితుల కుటుంబ సభ్యుల మానసిక సంఘర్షణకు అక్షరరూపం కల్పించిన తీరు హృదయానికి హత్తుకుంది. దీనికితోడు కథాంశంలో అక్కడక్కడ సందర్భానుసారంగా గుల్జార్, తిలక్ వంటి వారి కవితలను, రుద్రం నమక చమకాలను, వాల్మీకి శ్లోకాలను ప్రస్తావించడాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను.

ఓవైపు సమాచారాన్ని అందిస్తూనే మరోవైపు జర్నలిస్టుగా ప్రతి అంశాన్ని స్పృశిస్తూ.. భూమండలం మీద జరుగుతున్న పరిణామాలను సునిశితంగా గమనించాల్సిన అవసరాన్ని, జీవ వైవిధ్యాన్ని కాపాడడానికి నడుం కట్టాల్సిన అవసరాన్ని చాలా చక్కగా వివరించారు.

అంతిమంగా ప్రకృతి పరిరక్షణతోనే మానవ మనుగడ అనే సందేశం ఆకట్టుకునే విధంగా ఉంది. పాఠకుడిని తర్వాతి పేజీకి తీసుకువెళ్లేందుకు కావాల్సిన ఉత్సుకతను కలిగించేలా, ఆసక్తిని పెంపొందించేలా ఉండే మీ రచనాశైలి ఇకపైనా ఇలాగే కొనసాగాలని ఆకాంక్షిస్తూ మిమ్మల్ని మరోసారి అభినందిస్తున్నాను. స్వతహాగానే సాహితీ ప్రేమికుడై శాంతాబయోటిక్స్ అధినేత శ్రీ వరప్రసాద్ రెడ్డి గారు, చక్కటి రచనలను, రచయితలను ప్రోత్సహించేందుకు సంకల్పించిన ప్రయత్నంలో భాగంగా ఈ రెండు పుస్తకాలను ప్రచురించేందుకు ముందుకు వచ్చిన నేపథ్యంలో వారికి కూడా అభినందనలను తెలియజేస్తున్నాను.

– ముప్పవరపు వెంకయ్యనాయుడు

భారత ఉపరాష్ట్రపతి

తెలుగువారి ముద్దుబిడ్డ, ఉపరాష్ట్రపతి
శ్రీయుత ఎం.వెంకయ్యనాయుడుగారి ఆశీస్సులు

सत्यमेव जयते

भारत के उपराष्ट्रपति

VICE-PRESIDENT OF INDIA

శ్రీ ఎమ్మెస్సార్ వెంకటరమణ (వెంకూ)కు,

నమస్తే

'కరోనోస్టాల్జియా, ష్.. వైరస్ శీర్షికలతో మీరు రచించి, పంపిన రెండు పుస్తకాలను పరిశీలించాను. చైనాలో కరోనా వైరస్ ఉద్భవించినప్పటినుంచి తాజాగా టీకా పరిణామాల వరకు ప్రతి అంశాన్ని చక్కగా స్పృశిస్తూ.. ప్రజల్లో నెలకొన్న ఆపోహలను, వాటిని నివ్వీర్యం చేసేందుకు జరిగిన ప్రయత్నాలను. కరోనా సమయంలో మీతోపాటు, మీ స్నేహితులు, ఇతరుల అనుభవాలకు మీ పాత్రికేయ ప్రావీణ్యాన్ని జోడిస్తూ రెండు పుస్తకాలను తీసుకొచ్చిన మీ చొరవను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

కరోనా పుట్టుపూర్వోత్తరాలకు ఆత్మకథను జోడిస్తూ, ఈ మహమ్మారి కారణంగా ప్రపంచం ఎదుర్కొంటున్న క్లేశాలను, అంతిమ సంస్కారాలకు ఆ నలుగురు కూడా దొరకని పరిస్థితిని వివరిస్తూ.. బాధితుల కుటుంబ సభ్యుల మానసిక సంఘర్షణకు అక్షరరూపం కల్పించిన తీరు హృదయానికి హత్తుకుంది. దీనికితోడు కథాంశంలో అక్కడక్కడ సందర్భానుసారంగా గుల్జార్, తిలక్ వంటి వారి కవితలను, రుద్రం నమక చమకాలను, వాల్మీకి శ్లోకాలను ప్రస్తావించడాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను.

ఓవైపు సమాచారాన్ని అందిస్తూనే, మరోవైపు జర్నలిస్టుగా ప్రతి అంశాన్నీ స్పృశిస్తూ.. భూమండలం మీద జరుగుతున్న పరిణామాలను సునిశితంగా గమనించాల్సిన అవసరాన్ని, జీవ వైవిధ్యాన్ని కాపాడడానికి నడుం కట్టాల్సిన అవసరాన్ని చాలా చక్కగా వివరించారు.

అంతిమంగా ప్రకృతి పరిరక్షణతోనే మానవ మనుగడ అనే సందేశం ఆకట్టుకునే విధంగా ఉంది. పాఠకుడిని తర్వాతి పేజీకి తీసుకెళ్లేందుకు కావాల్సిన ఉత్సుకతను కలిగించేలా, ఆసక్తిని పెంపొందించేలా ఉండే మీ రచనాశైలి ఇకపైనా ఇలాగే కొనసాగాలని ఆకాంక్షిస్తూ మిమ్మల్ని మరోసారి అభినందిస్తున్నాను.

స్వతహాగానే సాహితీ ప్రేమికుడైన శాంతాబయోటిక్స్ అధినేత శ్రీ వరప్రసాద్ రెడ్డి గారు, చక్కటి రచనలను, రచయితలను ప్రోత్సహించేందుకు సకల్పించిన ప్రయత్నంలో భాగంగా ఈ రెండు పుస్తకాలను ప్రచురించేందుకు ముందుకు వచ్చిన నేపథ్యంలో వారికి కూడా అభినందనలు తెలియజేస్తున్నాను.

ము ప్పవరపు వెంకయ్యనాయుడు

(ముప్పవరపు వెంకయ్యనాయుడు)

జూలై 29, 2021,

న్యూఢిల్లీ



కరోనా హైరానా చరిత్ర

భూగోళం అంతా ఒక్కసారిగా ఆవరించిన కరోనా ఈ శతాబ్దపు చారిత్రక సంఘటన. ఈ సృష్టిలో ఎన్నో వింతలూ, శోధనకు అందని పాలపుంతలూ, సమాధానాలు దొరకని సంఘటనలూ జరిగాయి - జరుగుతున్నాయి, జరగనున్నాయి. వాటిని ఆయా సమయాల్లో అనుభవించినవారికి కొన్ని విషయాలే అతి స్వల్పంగా తెలిసే అవకాశం ఉండవచ్చునేమో కానీ, కాలం గడిచిపోయాక, సంవత్సరాలు, దశాబ్దాలు దొర్లిపోయాక, ఈ అనుభవాలు, సంఘటనలూ, వాటి పూర్వాపరాలూ ఏవీ గుర్తుండవు - కొన్ని సందర్భాల్లో నమ్మశక్యం కానంత వింత విషయాలుగా అభూత కల్పనలుగా మిగిలిపోతాయి.

అలాంటి చారిత్రక సంఘటనలను అచ్చంగా, నిజాయతీగా, జరిగినది జరిగినట్లుగా, ఈ కాలంనాటి స్థితిగతుల్ని మానవలోకంలో ఏర్పడ్డ కల్లోల విలాపాల్ని, అయోమయాల్ని, అవగాహనా సామర్థ్యాన్నీ (అలాగే అవగాహనా రాహిత్యాన్ని కూడా) విభిన్న దేశాల స్పందనలనీ, ఆ సమయంలో వాడిన సాంకేతిక, వైజ్ఞానిక మార్గాలనీ, ఆర్థిక ప్రతిపత్తుల విపత్తుల కరాళ నృత్యాలనీ,

మరణ మృదంగ నాదాల విలయాల వలయాల్ని అక్షరీకరించాలి. అలాంటప్పుడే ఆ అనుభవాలు, ఆ విపత్తు నుండి కాపాడుకోడానికి చేసిన ప్రయత్నమూ, ఆ ప్రయత్నం ఏ మేరకు ఎలాంటి ఫలితానిచ్చిందన్న నిజాలూ, ప్రతి ప్రయత్నం తాలూకూ గెలుపులు, ఓటములు రానున్న తరాలకు తెలిసివస్తాయి. అంతేకాకుండా అవకాశవాదుల విజృంభణలూ, దయామయుల చేయూతలూ, ప్రభుత్వ చేతనాచేతన అవస్థలూ, శుష్కవాగ్దానాలూ, నిష్క్రియా పర్వాలూ, అటు అతిశయోక్తులూ ఇటు అర్థసత్యాలు లేకుండా అక్షరీకరించినట్లయితే ముందు తరాలకు ఈ రచనలు కరదీపికలుగా మిగిలిపోతాయి. కరోనా వ్యాప్తి - దాని తాలూకు పరిణామాలు, కరిగిపోయిన జీవనాలూ, వెలిసిపోయిన జీవితాలూ, స్తంభించిన వ్యాపారాలు, ఊడిన ఉద్యోగాలు చరిత్రపుటల్లోకి ఎక్కాలి. ఇంకా, కార్పొరేట్ అసుపత్రుల్లో చేరి బతికి కూడా ఆర్థికంగా బలైపోయినవారూ, ఇంత సంక్షోభంలో కూడా అవకాశవాద రాజకీయ నాయకుల పదవీవ్యామోహంతో ఎన్నికల నిర్వహణలూ, ఇలా ఎన్నో అర్థాలకు, అనర్థాలకు అక్షరరూపం ఇవ్వడం మన సమకాలీన రచయితల ధర్మం.

ఈ ధర్మాన్ని మిత్రులు శ్రీ వెంకూగారు పాటించి, తనకున్న రచనా విభూతిని, వైభవాన్ని వినియోగించి, కరోనా మొదటి, రెండో దశలపై **'కరోనా-నోస్టాల్జియా', 'ష్.. వైరస్'** అనే పుస్తకాలకు పురుడుపోశారు.

పుస్తకం తెరిచి చదవడం మొదలుపెడితే చివరి పేజీ దాకా చదవనిదే పుస్తకాన్ని మూయలేనంత ఉత్సుకతను నింపారాయన.

ఈ పుస్తకాలు భావితరాలకు కరదీపిక

నేటి సమాజానికి జ్ఞాపిక

నిన్నటి మొన్నటి కరోనా బాధితులకు

లేదా కరోనా వంచితులకు సంతాప వాచిక.

డా॥కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి

శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు

"మానవుడే మహనీయుడు..
మానవుడే మాననీయుడు..
మంచిని తలపెట్టినచో మనిషికడ్డు లేదులే
ప్రేరణ దైవానిదైన సాధించును నరుడే
దివిజ గంగ భువికి దించిన భగీరథుడు మానవుడే
సుస్థిర తారగ మారిన ధ్రువుడు కూడా మానవుడే
సృష్టికి ప్రతి సృష్టి చేయు విశ్వామిత్రుడు నరుడె
జీవకోటి సర్వములో శ్రేష్ఠతముడు మానవుడే
మానవుడే మహనీయుడు"

మనిషి గొప్పతనాన్ని చాటుతూ సినీ కవి ఆరుద్ర రాసిన పాట ఇది. ఆయన రాసిన అక్షరాలు నిజమేనని రుజువుపరుస్తూ మానవ సేవలో తరించే మహనీయులు ఎందరో!

అలాంటివారిలో ఒకరు.. వైద్య నారాయణుడు అనే మాటకు మారుపేరైన డాక్టర్ శ్రీనివాస్ గునుకుల.

జనగామ జిల్లాలో సాధారణ మధ్య తరగతి కుటుంబంలో పుట్టారు శ్రీనివాస్. తండ్రి ఆర్టీసీలో ఉద్యోగి. తల్లి గృహిణి. చిన్నప్పటి నుంచి పట్టుదలతో చదివి మెడికల్ సీటు సాధించారు. సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చేసిన ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. వైద్యంలో ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి అక్కడే హృద్రోగ నిపుణుడిగా స్థిరపడ్డారు.

తన మంచితనం, ప్రతిభా సామర్థ్యాలతో ఎంతో పేరు తెచ్చుకున్నారు.

డాలస్ నుంచి టెక్సాస్ వరకు ఉన్న ఎన్నో మెడికల్ సొసైటీల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు. ఎన్నో అవార్డుల్ని, గౌరవ పురస్కారాలను అందుకున్నారు.

ఎంత ఎత్తుకు ఎదిగినా.. ఎంత దూరం ఎగిరినా మూలాలు మరచిపోని మంచి మనిషి ఆయన.

జీవన యానంలో రెక్కలు కట్టుకుని సుదూర ప్రాంతాలకు ఎగిరిపోయినా.. ఏ కొమ్మ మీదైనా కాసేపు విశ్రాంతిగా కూర్చుని, ఎగిరివచ్చిన దూరాన్ని గురించి ఓసారి ఆలోచించినప్పుడు మన ఊరు, మన వాడ.. అక్కడి మన మనుషులు తప్పకుండా గుర్తుకొస్తారు ఎవరికైనా. మూలాల గురించిన బెంగ ఏర్పడుతుంది. మాతృభూమికి, కన్నతల్లి లాంటి ఊరికి ఏదైనా చేయాలనిపిస్తుంది. కానీ అవకాశం లేదనో, సమయం వెచ్చించలేమనో ఊరుకుంటారు చాలామంది.

శ్రీనివాస్ మాత్రం అలా కాదు. తన సొంత ఊరైన ధూల్మిట్ట అభ్యున్నతి కోసం ఎంతో తపించేవారు. చిన్నప్పుడు తాను చదువుకున్న బడికి వివిధ సదుపాయాలు కల్పించారు. బెంచీలు, కుర్చీల వంటి ఫర్నిచర్ సమకూర్చడంతోపాటు విద్యార్థుల కోసం మరుగుదొడ్లు కట్టించారు. ధూల్మిట్టతోపాటు చుట్టుపక్కల ఐదారు ఊళ్లలో తరచుగా వైద్య శిబిరాలు ఏర్పాటుచేసేవారు. అంతేకాదు ఆరోగ్య సమస్యలపై.. ముఖ్యంగా గుండె జబ్బులపై గ్రామీణ ప్రాంతాల వారికి అవగాహన కల్పించడం కోసం లోకల్ రేడియో ద్వారా వారాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేవారు.

హృద్రోగ నిపుణుడైన ఆయనకు గుండె లోతుల గురించి, గాయపడిన గుండెల వేదన గురించి బాగా తెలుసు. అందుకే ఎంతోమందికి గుండె జబ్బుల వైద్యానికి సాయపడేవారు. అమెరికా నుంచి వస్తూ చాలామంది బ్యాగు నిండా పిల్లలకు చాక్లెట్లు పట్టుకొస్తుంటారు. డాక్టర్ శ్రీనివాస్ మాత్రం బ్యాగునిండా హృద్రోగులకు అవసరమైన స్టెంట్‌లు కొని పట్టుకుని వచ్చేవారు. అప్పట్లో మన దేశంలో నాణ్యమైన స్టెంట్‌లు దొరకడమే గగనంగా ఉండేది. అందుకే ఆయన వాటిని పట్టుకొచ్చి ఇక్కడ అవసరమైన పేద రోగులకు పంచేవారు. ఆయన నిలువెత్తు మానవత్వానికి మచ్చుతునక ఇది.

సంపాదించడమొక్కటే కాదు.. ఈ సమాజానికి కొంత తిరిగి ఇవ్వాలన్న తపన ఆయనది. బయో సైన్స్ రిసెర్చ్ ల్యాబ్ కోసం.. గుండె చికిత్సల ఆసుపత్రికి ఏకంగా లక్ష డాలర్లు విరాళంగా ఇచ్చి తన ఉదారత చాటుకున్నారు.

తత్వశాస్త్రంలో మానవత్వం అనేది ఒక వ్యక్తి ఆస్తులు, అంతస్తులు, మతం, ప్రాంతం, భాష జాతీయత, ఇతర ఎలాంటి వ్యత్యాసాలు, వైరుధ్యాలతో సంబంధం లేకుండా అత్యంత విలువైనదిగా అభివర్ణించే స్థానం. అలాంటి సమున్నత స్థానానికి నిజమైన చిరునామా డాక్టర్ శ్రీనివాస్ గునుకుల.

కరోనా మహమ్మారి విజృంభిస్తున్న వేళ మానవత్వాన్ని భూతద్దంలో వెతుక్కోవలసి వస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో.. వృత్తిపరంగా, వ్యక్తిగతంగా కూడా అనుక్షణం పేదల కోసం తాపత్రయపడిన డాక్టర్ గునుకుల శ్రీనివాస్ వంటి మానవతావాదికి ఈ పుస్తకాన్ని అంకితం ఇవ్వడం ఉత్తమోత్తమం అని భావిస్తున్నాం..

వెంకూ (రచయిత)

డా॥కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి (ప్రకాశకులు)

కరోనా రెండోదశ భారత్‌ను ఉక్కిరిబిక్కిరి చేసేసింది.. ముఖ్యంగా 2021 ఏప్రిల్, మే, జూన్ నెలల్లో విధ్వంసం సృష్టించింది. 2020తో పోలిస్తే ఈ వైరస్ 'వాయు' వేగంతో వ్యాపించడంతో భారీ సంఖ్యలో కేసులు, మరణాలు వెలుగుచూశాయి. దేశంలో ఎన్నడూలేనంతగా సంక్షోభ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆసుపత్రుల్లో పడకల్లేవ్.. ఆక్సిజన్ సిలిండర్లు లేవు.. చివరకు శ్మశానవాటికల్లో అంతిమ సంస్కారాలకు సైతం చోటు దొరకని దుస్థితి అందరినీ కలచివేసింది.. మూడో ముప్పు కూడా తప్పదనే వార్తలు కలరవపరుస్తున్నాయి.. ఇలా ఇంకెన్ని దశలు ఉంటాయో కూడా చెప్పలేని పరిస్థితి.

ప్రపంచాన్ని ఇంతగా కల్లోలపరుస్తున్న కరోనా వైరస్ సహజంగా ఉద్భవించింది కాదని.. ఇదొక జీవాయుధమని.. ఇది చైనా ముద్దుబిడ్డ అనే ఆరోపణలు ఎన్నో. దీని మూలాలపై సందేహాలు.. అనుమానాలు ఎన్నెన్నో!!

అంటువ్యాధులు, మహమ్మారులు ప్రకోపించిన ప్రతి సందర్భంలో ఆ సూక్ష్మ క్రిమి (వైరస్) ఎక్కడి నుండి వ్యాప్తి చెందింది.. మూలాలెక్కడన్న మీమాంశ ఎప్పుడూ తలెత్తుతుంది. కరోనా మాత్రం జంతువు నుండి మనిషికి వ్యాపించే వ్యాధి (జునెటిక్) కాదని జీవాయుధ పరిశోధన సంస్థ (బయోలాజికల్ ఆర్మ్స్ రిసెర్చ్ ల్యాబ్)లో తయారుచేసిందనే వాదనలు, అనుమానాలు ప్రపంచాన్ని కుదిపేస్తున్నాయి.

ప్రకృతిసిద్ధంగా సంభవించే మహమ్మారులకు, వైరస్‌లను జీవాయుధాలుగా ప్రయోగించడానికి మధ్య తేడా ఉంది. జీవాయుధం- దొంగచాటుగా దెబ్బతీసి.. శత్రువును ముప్పుతిప్పలు పెట్టి, లొంగదీసుకునే సాధనం. దొంగచాటు యుద్ధం. చరిత్రలో మానవాళి పట్ల దుర్మార్గంగా వ్యవహరించిన సామ్రాజ్యవాదుల దుష్ట చరిత్రను పరికిస్తే జీవాయుధాల గుట్టలెన్నో కనిపిస్తాయి.

కరోనా వైరస్ ఎలా పుట్టిందన్న అంశంపై దర్యాప్తు జరపాలని అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ తమ దేశ నిఘాసంస్థలను ఆదేశించడంతో దీనిపై మరోసారి చర్చ మొదలైంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సమగ్ర విచారణ జరిపి, నిజాన్ని నిగ్గుతేల్చి, విశ్వ ప్రజానీకంలో విశ్వాసాన్ని పాదుకొల్పాలి. కరోనా మీద టెలిగ్రాఫ్, గార్డియన్ వంటి అంతర్జాతీయ పత్రికల నుంచి 'ఈనాడు' వరకు.. బీబీసీ, వాల్‌స్ట్రీట్ జర్నల్, నుంచి సీఎన్‌ఎన్ వరకు వివిధ వెబ్‌సైట్లలో వచ్చిన, వస్తున్న సమాచార సమాహారమిది. 2020లో కొవిడ్ తొలిదశలో 'కరోనోస్టాల్జియా' పుస్తకం ద్వారా ఈ మహమ్మారి పుట్టుపూర్వోత్తరాల గురించి కొంత చర్చించిన మీదట ఈ రెండో పుస్తకం ద్వారా దాని సమగ్ర స్వరూపం, కరోనా మూలాలు, దేశంలో అది సృష్టించిన విధ్వంసం గురించి వివరించే ప్రయత్నం చేశాను. 75వ స్వాతంత్ర్య దిన వేడుకల వేళ అనుకోని ఈ సంక్షోభంపై భారతమాత అంతరంగం ఆవిష్కరించే యత్నమిది..

- వెంకూ

అక్షరాలా కృతజ్ఞతలు

అక్షరాలు దిద్దించిన అమ్మ నాన్నలకు

అక్షర సేద్యంలో అవకాశమిచ్చి
జీవితానికొక అర్థాన్ని కల్పించిన
'ఈనాడు' గ్రూపు సంస్థల ఛైర్మన్
శ్రీయుత రామోజీరావు గారికి..

అక్షరాలా పాత్రికేయ పాఠాలు నేర్పిన గురువు
శ్రీయుత బూదరాజు రాధాకృష్ణ గారికి..

అక్షరయానంలో అండగా నిలిచిన
సీనియర్ సహచరులకు..

ఈ అక్షరాలను చరిత్రలిఖిత దీక్షగా అభివర్ణించిన
శ్రీయుత కోడూరు వరప్రసాద్‌రెడ్డి గారికి..

నేను రాసిన ప్రతి అక్షరాన్నీ మెచ్చుకుంటూ
నన్ను ప్రోత్సహించిన ఎందరో మిత్రులకు..

కరోనా సమాచారం కోసం చాలా వెబ్‌సైట్లను వెతకాల్సి వచ్చింది.. ఎన్నో పత్రికల్లోని వార్తలు సేకరించాల్సి వచ్చింది. అలాగే ఫేస్‌బుక్, ట్విటర్ వంటి సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సమాచారాన్ని కూడా వెతికాను. ఎంతోమంది పాత్రికేయులు, రచయితల విలువైన అక్షరాల్లోంచి కొన్నింటిని సంగ్రహించాల్సి వచ్చింది. వారందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు..

కరోనా భారతానికి రన్నింగ్ కామెంటరీ..

పేరు తెలిస్తేనో, ఫొటో చూస్తేనో, చిన్న పరిచయంతోనో - ఒక వ్యక్తి స్వభావాన్ని, ఆలోచనా ధోరణిని, బేరీజు వేయలేం! కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యక్షంగా కలిసి తెలుసుకునే అవకాశం అసలే లేనందున కాస్త శ్రమపడితే సోషల్ మీడియాలో మంచి మిత్రులు దొరుకుతారు. ఫేస్‌బుక్ వాడడంలో కొంత న్యూసెన్స్, కొన్ని సమస్యలు, మరికొన్ని తలనొప్పులు, ఇంకొన్ని ఆరోగ్య సమస్యలూ ఉన్నాయి. అయినా కూడా ప్రయోజనాలు చాలానే ఉన్నాయి.

గత ముప్పయ్యేళ్లలో ఏడు ఊళ్లలో ఉద్యోగం చేశాను. ఎన్నో రంగాలకు చెందిన, వివిధ నేపథ్యాలు కలిగిన వ్యక్తులు పరిచయం. కానీ ఎవరి బాధ్యతల్లో వారు ఉండడం, దూరాభారం వల్ల అవి స్నేహాలుగా మారకుండా అలాగే ఉండిపోయేవి. అయితే నా వరకు పరోక్షంగా, ప్రత్యక్షంగా తెలిసిన మిత్రులతో మళ్లీ కనెక్ట్ కావడానికి ఫేస్‌బుక్ చాలా దోహదపడింది. నేను మద్రాసులో ఉండగా ఫేస్‌బుక్ ద్వారా ఎన్నో ప్రాంతాల నుంచి ఎంతోమంది మిత్రులు సిసలైన సన్నిహితులుగా మారారు. అలా ఫేస్‌బుక్ ద్వారా లభించిన మిత్రుడు వెంకూ. దాదాపు ఒకేరకమైన నేపథ్యం, మధ్యతరగతి జీవితం, కష్టపడే తత్వం, నిరంతర శ్రమ - మా ఇద్దరి స్నేహం మనగలగడానికి పునాది. ఇంతవరకు కలిసే అవకాశం రాలేదు. ఐదారేళ్ల క్రితం 'అమర్‌నాథ్ యాత్రకు వెళ్దాం వస్తారా?' అని నేను మద్రాసులో ఉండగా వెంకూ సంప్రదించారు. నా ఉద్యోగ వ్యవహారాల కారణంగా కలిసి వెళ్లలేదు. కానీ, ఆ చొరవే నన్ను తనకు మానసికంగా దగ్గర చేసింది.

జర్నలిస్టుల స్వభావాల గురించి విశ్లేషణలు వద్దుగానీ, ఏపూటకాపూట ఉద్యోగం చేసుకుంటూ.. కుటుంబ అవసరాలు, నిద్రను చూసుకుంటే చాలనే పరిస్థితి దాపురించింది నేడు వారికి. ఆసక్తి, హాబీ, పరిశోధన అనేవి వారి దరికి రాని కాలమిది. కొందరు మాత్రం సదా ఉత్సాహంగా శ్రమిస్తూ, పరిశోధిస్తూ పనిచేస్తుంటారు. అలాంటి పాత్రికేయ మిత్రులు 5 - 10 శాతం కంటే ఎక్కువ ఉండరు. ఆ కోవలోకి వస్తారు వెంకూ. ప్రపంచాన్ని కుదిపేస్తున్న పెను విపత్తు కరోనా మీద 250 పైచిలుకు పేజీల పుస్తకం వెలువరించడం మామూలు విషయం కాదు. కనుక, పుస్తకం బాగోగులు చూడకుండానే - ఆ ప్రయత్నానికే వెంకూ అభినందనీయుడు అనొచ్చు.

సాగింపు, కొనసాగింపుల కాలమిది! అదే పరంపరలో మన వెంకూ కరోనాపై రాసిన రెండో పుస్తకమిది. మొదటిది 'కరోనోస్టాల్జియా'.. ఇది 'కరోనోస్టాల్జియా - 2.0'.

'నా పుస్తకం చూసే ఆసక్తి, సమయం ఉన్నాయా?' అని కొన్నివారాల క్రితం సంప్రదించారు వెంకూ. 'ఆకాశవాణి' ఉద్యోగ విరమణ తర్వాత కూడా ఇలాంటి అదనపు పనులు చేయకపోతే ఎలా? మెయిల్లో పుస్తకం పంపారు. నేను చదివేలోపు రివైజ్డ్ వెర్షన్ పంపారు.

క్రీస్తు శకం, క్రీస్తు పూర్వం లాగా ఇకముందు కరోనాకు పూర్వం, కరోనా తర్వాత.. అని చెప్పుకోవలసినంతగా మొత్తం ప్రపంచం ప్రభావితమైపోయింది. అధికారం, పరపతి, ప్రాచుర్యం, సౌకర్యం, సాంకేతిక పరిజ్ఞానం - అనే మనకు తెలిసిన చాలా సదుపాయాల పరిమితులను కరోనా కొట్టిపడేసింది. ప్రపంచంలోని ప్రతి వ్యక్తీ కరోనాకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావితమయ్యారు. కరోనా విశ్వరూపం ప్రజ్వరిల్లుతోంది. ఈ విశ్వరూపాన్ని విరచించడానికి, ఈ కరోనా భారతాన్ని వివరించడానికి ఎంతమంది వేదవ్యాసులు కావాలో, మరెంతమంది సంజయులు కావాలో తెలియదు. వెంకూ మాత్రం తెలుగు సంజయుడిలా ఆ బాధ్యతను నెత్తిన ఎత్తుకున్నాడు.

ప్రస్తుతం రకరకాల మార్గాల్లో కరోనాపై వచ్చి పడుతున్న మంచి, చెడు సమాచారాల మధ్య ఎవరికివారు ధృతరాష్ట్రుల్లా మారిపోయారు! కనుక వెంకూ రచన 'కరోనోస్టాల్జియా 2.0' అవసరమే.

ఎన్నో పత్రికలు, మరెన్నో న్యూస్ వెబ్‌సైట్ల నుంచి సేకరించిన మంచి ఫొటోలతో సహా కరోనా రాకడ, అంటువ్యాధుల బోగట్టా, మహమ్మారుల చరిత్ర, వైద్యపరమైన గత వైభవం, రాజకీయాలు నిండిన ప్రపంచగతి, అంతర్జాతీయ రాజకీయంగా మారిపోయిన వైరస్, ఇంగితం కోల్పోయి రాజకీయం చేస్తున్న పార్టీలు, బాధ్యత మరచిపోయిన వ్యవస్థలు, వృత్తులు, వ్యక్తులు.. ఇలా బోలెడు షేడ్స్‌ను హ్యూమన్ ఇంట్రెస్టింగ్ స్టోరీస్‌తో కలిపి వడ్డించాడు.. ఈ కరోనా సమాచార విందు!

ఏదో ఒక రిఫరెన్స్ పాయింట్, ఏదో ఒక సందర్భం కావాలి కదా.. దానికి ఒక ఆసరాగా, అవకాశంగా 'భారతమాత స్వగతం' అనే టెక్నిక్‌ను ఆశ్రయించారు రచయిత. ఇది బాగానే పనిచేసింది.. గతాన్ని, వర్తమానాన్ని, భవిష్యత్తును తెరిపారా చూడడానికి! ఆమేరకు వెంకూ విజయుడే! దానికి సహకరించాయి మంచిమంచి ఫొటోలు. వాటిలో కొన్ని గుండెల్ని మెలితిప్పుతాయి. వాటికి క్యాప్షన్స్ కూడా ఉంటే బాగుండేది.

సరే, రచయిత కరోనా గురించి ఏం తేల్చారు అని అడగొద్దు. పాలిటిక్స్, మెడిసిన్, బిజినెస్, మీడియా రంగాల్లో ఎవరి మొరాలిటీ స్థాయి ఏమిటి - అనే దాన్నిబట్టి వాటి గతి, ప్రభావం ఉంటాయి. కనుక ఈ విషయంపై శషబిషలు అనవసరం.

చివరగా ఇంకో విషయం చెప్పుకోవాలి. కంప్యూటర్, టీవీ, మొబైల్, ఆన్‌లైన్ వ్యవహారాలు వచ్చాక అంతా అర్థంలేని కుదింపుల వ్యవహారమైంది. చివరకు జర్నలిజం కూడా! విజ్ఞానం, ఆహ్లాదం, అవగాహన కల్పించే బాధ్యతను పక్కనపెట్టింది. మింట్ దినపత్రిక, క్యారవాన్ వంటి పిరియాడికల్స్‌లో మళ్లీ లాంగ్ ఫార్మ్ జర్నలిజం, నేరేటివ్ జర్నలిజం వంటి ప్రయోగాలు జరుగుతున్నాయి.

తెలుగు పాత్రికేయుడిగా వెంకూ కరోనా మీద అలాంటి ప్రయత్నం చేయడం, ఇంత వివరణాత్మకంగా పుస్తకం వెలువరించడం ముదావహం, అభినందనీయం!

డాక్టర్ నాగసూరి వేణుగోపాల్

రచయిత, విశ్రాంత సంచాలకులు,

రీజనల్ అకాడమీ ఆఫ్ బ్రాడ్‌కాస్టింగ్ అండ్ మల్టీమీడియా,

ప్రసార భారతి, హైదరాబాద్

Very creative and interesting..



Dr Rakesh Mishra

Indian biological scientist

CCMB Former Director

It is my great pleasure to write a few preface words for **Venku's** book **Shhh.. Virus** He has touched many shades of the pandemic, people and what can be expected in future. The book explores origin of virus and speculates what might have led to damage of this magnitude to the society. The style of the analysis and presentation in the book reflect investigative journalism that makes his book unique.

The scientists investigate the biology of the virus, its genetic makeup and clinical aspects to look for counter measures (vaccines, drugs), preventive measures, and to understand the origin and spread of the virus. This book, to complement that, uncovers various aspects of the socio, economical and geopolitical aspects that might also have influenced the spread of the virus.

This is very important aspect and will probably attract more attention of writers in coming months. For those who would like to learn multiple aspects the pandemic, especially the social aspect, this book will go long way. It highlights examples of how a human help poured in for those in need – in form of food, shelter, or even in graveyards for respectful last rituals. In the midst of suffering and disasters, these were some of the better displays of humanity.

I offer my best wishes to **Venku** for his very creative and interesting work and I look forward to reading many more from him.

Dr Rakesh Kumar Mishra *is an Indian scientist specializing in genomics and epigenetics. Mishra retired as the 6th director of* ***CSIR - Centre for Cellular and Molecular Biology*** *in Hyderabad, India, on the April 30th, 2021. He is currently the Director of* ***Tata Institute for Genetics and Society (TIGS)****, Bengaluru and holds J. C. Bose Fellowship at* ***CCMB.***

Many shades of the human sufferings

Dr Venkateswarlu Chamcha

Virologist

Senior Scientist, Merck & Co, Inc,

Harleysville, Pensylvania, **USA**

In modern society social media is one big uncontrolled source of negativity and a lot of ill information. Wait! Not all the time. When the covid outbreak broke like a wildfire, many people started providing whatever information they knew based on the news reports. These tons of information, most of the time, has nothing to do with the virus, disease, infection and the spread. This was something distrubed me and gave some sense of thought to correct this and provide the proper information as much as i can. Being a Virologist I thought many people were missing the facts and may be putting themselves at risk. With that being in mind, I started putting some videos on Facebook.

One day I saw a gentle man called **Venku** messaging me with his appreciation of facts and later asked me to come on the news channel. I am giving all this intro just to introduce how facebook helped me to connect with a great writer, critic and great human being in **Venku**. The current book **Shhh.. Virus** brought out all these qualities of **Venku** the author.

The book **Shhh.. Virus** is a very unconventional narration of many shades of the human sufferings, human help, geopolitical situations, ruler's adamency and many more but all related to Coronavirus pandemic. Well one may ask, why these many shades in one book? Usually people write either medical books focused on disease and disease causing agents or their counterparts such as vaccines or other medical interventions.

However the beauty of this book is to touch on other aspects which are very important to learn especially when one of the biggest crises on the planet happens. Well one may ask, why do we need to learn outside of the disease or prevention methodologies? I was asking this very question until Venku asked me to read this book. What I realized is that when a crisis happens, it teaches many things from which we can learn and be prepared when such an unfortunate event happens in future. Venku brought this aspect in his book very well.

Well do we really need to learn so many things from this Outbreak? It only comes once in a while and may not be applicable all the time? So, how can I apply this knowledge? Well, I think this is where the writer in Venku came up at his best. He started on how some historical events such as world wars, great spanish flu etc. have occurred and how they just blew up?

Is it human error or nature's anger? or what did we learn from them and what did Corona teach to human beings? did Corona bring out the real & hidden human beings in many people? Yes. For all these questions Venku tried to give justice and presented as they had happened without any bias. So, I enjoyed a lot while reading this book and I am sure every reader will feel my very thoughts. I extend my warm regards to **Venku** and I thank him for giving me this opportunity to express these thoughts.

ప్రియ భారత పుత్రులారా..

ఎవరీ వృద్ధనారి అనుకుంటున్నారా..

నేనే.. మీ అందరినీ కన్నతల్లిని..

మీరంతా 'ప్రియ భారత జనయిత్రీ దివ్యధాత్రి' అని ప్రేమగా పిలుచుకునే భారతమాతను..

75వ స్వాతంత్ర్య దిన వేడుకలకు మీరంతా ఉద్యుక్తలవుతున్న వేళ.. నాకెంతో గర్వంగా దిగ్విజయంగా అనిపించింది. ఎంతో ఆనందంగా మీ ముందుకు వద్దామనుకున్నా. కానీ.. అనుకోకుండా తలెత్తిన కరోనా విపత్తుతో నా బిడ్డలంతా కకావిలకమవుతున్న పరిస్థితి చూసి నా గుండెలు అవిసిపోతున్నాయి.. నా కడుపు

తరుక్కుపోతోంది.. నా హృదయం ద్రవించిపోతోంది.

కురుక్షేత్ర మహాసంగ్రామంలో మాదిరిగా ప్రాణాలెదురొడ్డి ఈ మహమ్మారితో పోరాడుతున్న విషాదకర సమయంలో మీకు నాలుగు ధైర్య వచనాలను చెప్పాలనే ఉద్దేశంతో మీ ముందుకొస్తున్నాను.

మీ అందరినీ కన్న తల్లిగా ఓ మాట చెబుతున్నాను..

నేటి సంక్షోభాన్ని చూసి తల్లడిల్లిపోకండి..

ఇలాంటి విపత్తులెన్నింటినో ఎదురొడ్డి నిలబడ్డ చరిత్ర మనకుంది..

ప్రకృతి వైపరీత్యాలనే కాదు.. ఎందరో విదేశీయుల దండయాత్రలను, దమనకాండలను, ఎన్నో ఉత్పాతాలను ఎదుర్కొని వీరోచితంగా పోరాడి గెలుపొందిన వీరులను కన్నభూమి ఇది..

'ఇచట పుట్టిన చిగురు కొమ్మయిన చేవ' అన్న అల్లసాని పెద్దన మాటలు గుర్తుతెచ్చుకోండి..

★ ★ ★

పుణ్యభూమిగా పేరొందిన భరతఖండమిది..

వేదవేదాంగాలకు, ఎన్నో శాస్త్రాలకు పుట్టినిల్లు ఇది..

తర్కశాస్త్రానికి గని..

ఆయుర్వేదానికి పురిటిగడ్డ భరతఖండం..

వ్యాసుడు, వాల్మీకి, ఆదిశంకరచార్యులు, రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, రమణ మహర్షి, కబీరు, గురునానక్.. ఇంకా ఎందరో దైవాంశ సంభూతులు ఈ పుణ్యభూమిలో జన్మించి ప్రపంచానికే గురువులయ్యారు.

'సర్వేజనా సుఖినోభవంతు' అంటూ విశ్వమానవాళి క్షేమాన్ని కోరిన దేశమిది.

'సత్యమేవ జయతే' ఉపనిషత్తులు బోధించిన సారమిది..

రామాయణ, భారత, భాగవత ఇతిహాస సంపద, మహోన్నత వారసత్వం, మహోజ్వల స్వాతంత్ర్య పోరాటం.. భిన్నత్వంలో ఏకత్వం మన సొంతం.

అందుకే ఒకప్పుడు విశ్వగురువుగా విలసిలింది ఈ భారతావని.

ఇప్పటి పరిస్థితుల్ని చూస్తే కొండంత విచారం.. మరెంతో దుఃఖం కలుగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితిని.. ప్రపంచగతిని.. భారత్‌లో కొవిడ్ విలయాన్ని.. ఈ మహమ్మారికి పుట్టు పూర్వోత్తరాలను ఒకసారి మీకు ఎరుకపరిచే యత్నమిది..

venku1968@gmail.com

మనిషికి మనిషే శత్రువు

మొన్న స్వైన్‌ఫ్లూ.. నిన్న ఎబోలా..
ఇప్పుడు కరోనా వైరస్.. పేరు ఏదైతేనేం.. ఏదో ఒక మహమ్మారి..
ఎక్కడో పుట్టడం.. అత్యంత వేగంగా ప్రపంచాన్ని చుట్టేయడం..
కంటికి కనిపించని శత్రువు ఇది.

భూమ్మీద జనాన్ని తగ్గించే క్రమంలో ప్రకృతి నుంచే ఇలాంటి వైరస్‌లు పుట్టుకొస్తున్నాయేమో అని సంప్రదాయవాదులెవరైనా అనబోతే.. కాదు కాదు, మానవ తప్పిదాలే కారణమని అంటారు శాస్త్రవేత్తలు.

వైరస్ కావొచ్చు, బ్యాక్టీరియా కావొచ్చు.. తమ రూపాల్ని, స్వరూపాల్నీ, స్వభావాల్ని మార్చుకోవడం మానవాళిపై ప్రతాపం చూపడం ఎప్పటినుంచో ఉన్నదే.

venku1968@gmail.com

మందులు కనిపెట్టాం, కనిపెడుతూ ఉన్నాం.. కనిపెడుతూనే ఉంటాం..

అలాగే కొత్త కొత్త వైరస్‌లు కూడా పుట్టుకొస్తూనే ఉంటాయి.

కరోనా వైరస్ మాత్రం ప్రమాదకరంగా విస్తరిస్తోంది. సాధారణ దగ్గు, జలుబు, జ్వరంతో మొదలై ప్రాణాలు తోడేసే స్థాయికి చేరడం ఆందోళనకరం. సహజంగా.. ప్రకృతిసిద్ధంగా తయారయ్యే వైరస్‌లకు అంత ఉద్ధృతి ఉండదని.. ఇదేదో కృత్రిమ వైరస్ కావచ్చనేది ఇప్పుడు ప్రపంచాన్ని తొలిచేస్తున్న అనుమానం. అందుకే ఈ మహమ్మారిని మనిషే సృష్టించాడా? అనే సందేహాలు తలెత్తుతుండడం ఆసక్తికరమైన విషయం.

ప్రపంచ దేశాలు అనుమానిస్తున్నట్లుగా ఈ వైరస్ జీవాయుధమా? వుహాన్‌లోని ప్రయోగశాల నుంచే లీకయిందా? దీని పుట్టుకలో గబ్బిలాల పాత్ర ఎంత? చైనా చెబుతున్నట్లు వుహాన్‌లోని వన్యప్రాణుల మాంసం విక్రయ మార్కెట్ దీని వ్యాప్తికి ఎంతవరకు కారణం? లేక వైరస్ వ్యాప్తి నిజంగా కుట్రేనా? అలా అయితే దానిపై నిపుణులు ఏమంటున్నారు? అనేవి ఇప్పుడు ఆసక్తికర అంశాలు.

మొదటి ప్రపంచయుద్ధం నాటి నుంచే.. ఇంకా చెప్పాలంటే మనిషిలో 'జాత్యహంకారం', 'ఆధిపత్య కాంక్ష' మొదలైనప్పటి నుంచే శత్రుపక్షాలపై దాడులకు వాడిన 'జీవాయుధం' అంశం మళ్లీ తెరమీదకు వచ్చింది. ఇది చైనా ప్రపంచం మీద ప్రయోగించిన జీవాయుధమని అమెరికా సహా పలు దేశాలు బలంగా విశ్వసిస్తున్నాయి.

అది నిజమేనా??

తన ఆర్థిక శక్తిని, ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు చైనా తయారు చేసిందా?

ప్రపంచ దేశాల మీదకు తనకు కావలసిన సమయంలో జీవాయుధంగా ఉపయోగించే ఉద్దేశంతో ఈ వైరస్‌ను చైనా ప్రభుత్వమే తయారు చేయించిందా? అది లీక్ కావడంతో ఇంతటి పెనుముప్పు సంభవించిందా? దీనికి సంబంధించి ఇప్పటికైతే తగినన్ని ఆధారాలు

లేవుగాని, ప్రస్తుత అక్కడ పరిస్థితులు చూస్తుంటే అలానే అనిపిస్తుంది. దీన్ని నిర్ధారించడానికి గట్టి సాక్ష్యాధారాలు ప్రస్తుతం ఎవరివద్దా లేకపోవడంతో కరోనా పుట్టుక, వ్యాప్తిలోని మర్మాన్ని నిగ్గదీసే బాధ్యతను ప్రపంచ దేశాలు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ)కు కట్టబెట్టాయి.

కరోనా మహమ్మారి వల్ల మానవాళికి జరిగే నష్టాన్ని ఇప్పటికిప్పుడు నిర్దిష్టంగా అంచనా వేయలేనప్పటికీ- దశాబ్దాలపాటు దీని ప్రభావం దేశాల ఆర్థిక, సామాజిక, దౌత్య సంబంధాలపై ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తలకిందులైపోయింది.

ఈ వైరస్ సోకే విధానం, విజృంభించే తీరు అసాధారణ రీతిలో ఉందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. చాలా కొద్దికాలంలోనే ఇది ఖండాలకతీతంగా అన్ని దేశాలనూ చుట్టుముట్టేసింది. ప్రజలను కొన్ని నెలలపాటు స్వీయ నియంత్రణకు, గృహ నిర్బంధానికి గురిచేసింది. వాణిజ్య, ఉద్యోగ వ్యవహారాలను లాక్‌డౌన్ ద్వారా స్తంభింపజేసింది. జనం పిట్టల్లా రాలిపోతున్నారు. ఐక్యరాజ్యసమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ దీన్ని రెండో ప్రపంచయుద్ధం తరవాత సంభవించిన అతి పెద్ద సంక్షోభంగా వ్యాఖ్యానించారు.

వైరస్ జననం, గమనం, విస్తృతిని పరిగణనలోకి తీసుకున్న అమెరికా సైనిక నిఘా వర్గాలు వైరస్ వ్యాప్తిని 'పాక్షిక జీవ యుద్ధం' (క్వాసీ బయోవార్)గా భావిస్తున్నాయి. .

ప్రకృతిసిద్ధంగా సంభవించే మహమ్మారులకు; జీవాయుధాలకు మధ్య తేడా ఉంటుంది. డాలస్‌లోని బేలోర్ యూనివర్సిటీ వైద్య కేంద్రంలోని జీవ రోగనిర్ధారణ శాస్త్రవేత్త డాక్టర్ స్పెషార్ రీడల్ అభిప్రాయం ప్రకారం 'జీవాయుధం- చేతికి మట్టి అంటకుండా శత్రువును లొంగదీసుకునే సాధనం'. అదొక ప్రత్యామ్నాయ యుద్ధం. సైన్యం ప్రమేయం లేకుండా ఆర్థిక మూలాలను దెబ్బతీస్తూ, ప్రజలను అశాంతికి గురి చేస్తూ శత్రువును దొంగదెబ్బతీయడం



జీవాయుధ యుద్ధ విధానం. చైనా జీవాయుధాల తయారీలో భాగంగా ఈ వైరస్‌ను రూపొందించిందనీ.. ప్రమాదవశాత్తూ అది ల్యాబ్ నుంచి లీక్ అయిందనే ఓ వార్త దావానలంలా వాప్తి చెందుతోందిప్పుడు. అవును, అణుబాంబుల కంటే ప్రమాదకరమైనవి ఈ జీవాయుధాలు. ఇరాక్ యుద్ధం సమయంలో వీటి గురించి విన్నాం. ఇప్పుడు మళ్లీ జీవాయుధమనే మాట ప్రపంచమంతా మారుమోగుతోంది. అదే నిజమైతే.. మనిషికి మనిషే శత్రువు అన్న విషయం ఇంకోసారి నిరూపితమవుతుంది!

వైరస్‌ల పుట్ట చైనా..

చైనాలో వైరస్‌లు పుట్టడం, ప్రపంచ దేశాలకు వ్యాపించడం కొత్తేం కాదు. 1956లో ఆ దేశంలో ఉద్భవించిన ఏషియన్ ఫ్లూ చాలా దేశాలను అతలాకుతలం చేసింది. చైనాతో పాటు సింగపూర్, హాంకాంగ్, అమెరికాలో 20 లక్షలమందికి పైగా బలయ్యారు. 2013లో హెచ్7ఎన్9గా పిలిచే తొలి బర్డ్ ఫ్లూ కేసు డ్రాగన్ కంట్రీలోనే నమోదైంది. బంగ్లాదేశ్, ఈజిప్ట్, భారత్, ఇండొనేషియా, వియాత్నం దేశాలకు వ్యాప్తించింది. 2002లో వెలుగులోకి వచ్చిన సార్స్ కారణంగా 20కిపైగా దేశాల్లో 774 మంది మృత్యువాతపడ్డారు. ఇప్పుడు ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ కూడా చైనా బిడ్డే అనేది అనుమానం!

కరోనా చైనాలోని వుహాన్ అనే ప్రాంతంలో మొదటగా బయటపడి అక్కడ నుంచి

ప్రపంచవ్యాప్తంగా పాకిందనే విషయం తెలిసిందే. ఇది గబ్బిలాల నుంచి పుట్టిందని కొంతమంది భావిస్తున్నారు. అసలు జీవరాశుల నుంచి పుట్టింది కాదని, కృత్రిమంగా తయారుచేసిందనేది కొందరి వాదన. వుహాన్‌కు దాదాపుగా 20 మైళ్ల దూరంలో సముద్ర జీవులు, వన్య ప్రాణుల విక్రయాల మార్కెట్ ఉంది. అక్కడకు కొద్దిదూరంలోనే పీ4 వైరాలజీ ల్యాబ్ ఉంది. ప్రపంచాన్ని వణికించిన సార్స్ తదితర వైరస్ నమూనాలను ఈ ల్యాబ్‌లో పొందుపరిచారు. అక్కడే కరోనా వైరస్‌ను కూడా సృష్టించారని, అక్కడి నుంచే అది లీక్ అయిందనేది తాజా అనుమానం.

వుహాన్‌లో తొలి కేసు నమోదైనప్పుడు హఠాత్తుగా చైనా ఉపాధ్యక్షుడు వాండ్ కిషన్ ఈ ప్రాంతంలో రహస్యంగా పర్యటించారనే కథనం ఒకటి ప్రచారంలో ఉంది. అంత రహస్యంగా అక్కడ పర్యటించవలసిన అవసరం ఏమిటనేది అందరి అనుమానం.

నిజానికి ఈ రకమైన వాదనను చైనా చాలాసార్లు ఖండించింది. కానీ.. చైనా మూడో ప్రపంచ యుద్ధాన్ని జీవాయుధాలతో ప్రారంభించాలన్న కుతంత్రంతోనే కరోనా వైరస్‌ను తయారు చేసి ప్రపంచం మీదికి వదిలిందన్నట్లు మరికొన్ని కథనాలు ప్రచారంలోకి వచ్చాయి.. ఇదే క్రమంలో బహిర్గతమైన ఓ డాక్యుమెంట్ డ్రాగన్ కుతంత్రాలను వెల్లడిస్తోంది. పాశ్చాత్య మీడియా దీని ఆధారంగా అనేక కథనాలను వెలుగులోకి తెస్తోంది. ఐదేళ్ల క్రితం నాటి ఈ డాక్యుమెంట్‌లో చైనా మిలిటరీ శాస్త్రవేత్త ఒకరు మూడో ప్రపంచ యుద్ధం గురించి ప్రస్తావించారు. 'సార్స్ వైరస్ జాతి నుంచి తయారు చేసిన జీవాయుధంతో మూడో ప్రపంచ యుద్ధం జరుగుతుందని' ఆ మిలిటరీ శాస్త్రవేత్త చైనా ప్రభుత్వ ఆరోగ్య అధికారితో చర్చించినట్లు ఆ డాక్యుమెంట్ ద్వారా తెలుస్తోంది. అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ దీనిని స్వాధీనం చేసుకుంది.

చైనా మిలిటరీ శాస్త్రవేత్తలు, ప్రజారోగ్యశాఖ అధికారులు సార్స్ కరోనా వైరస్

ఆయుధీకరణ గురించి మాట్లాడినట్లు ఆ పత్రం వెల్లడించింది. ఆస్ట్రేలియన్ న్యూస్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ వెబ్‌సైట్ **న్యూస్.కామ్** కథనం ప్రకారం.. 'ద అన్‌నాచురల్ ఆరిజన్ ఆఫ్ సార్స్ అండ్ న్యూ స్పయిసెస్ ఆఫ్ మేన్ మేడ్ వైరసెస్ ఏజ్ జెనెటిక్ బయోవెపన్స్' అనే డాక్యుమెంట్‌లో చైనా మిలిటరీ సైంటిస్టు మూడో ప్రపంచ యుద్ధం సార్స్ జాతికి చెందిన జీవాయుధాలతో జరుగుతుందని అంచనా వేశారు. అభిప్రాయపడ్డారు. 'కరోనా వైరస్‌లను జీవాయుధాల కొత్త శకంగా ప్రస్తావిస్తూ, కృత్రిమంగా హ్యూమండైజ్ వైరస్‌గా మార్చవచ్చని.. తరువాత తరంలో వాడే ఆయుధాలు మునుపెన్నడూ చూడనట్లుగా ఉంటాయని' ప్రస్తావించారు. కరోనాను కొత్తరకం ఆయుధంగా అభివర్ణించారు.

చైనా ప్రభుత్వ ప్రయోగశాలలో సార్స్-కొవ్-2 వైరస్ తయారైనట్లుగా చైనీస్ వైద్య నిపుణురాలు, వైరాలజిస్ట్ లి-మెంగ్ యాన్ ఆరోపించిన ఆ డాక్యుమెంట్ సంచలనం రేపుతోంది. డ్రాగన్ నిజంగానే కరోనాను ఇలాంటి జీవాయుధంగా సృష్టించి ఉంటే.. ఆ దేశాన్ని వెలి వేయాలని అమెరికా సహా పలు యూరోపియన్ దేశాలు డిమాండ్ చేస్తున్నాయి.

జీవాయుధం అంటే ఏమిటి?

కొన్నిరకాల సూక్ష్మక్రిములు, బ్యాక్టీరియా, లేదా వ్యాధికార క్రిములను శత్రువులు లేదా శత్రుదేశాల మీద ప్రయోగించడాన్నే జీవాయుధం అంటారు. సంప్రదాయ ఆయుధాలైన తుపాకులు, మందుగుండు లేదా బాంబుల వంటివి లేకుండా చాపకింద నీరులా సాగించే యుద్ధకాండ అన్నమాట. ఇలా కృత్రిమంగా జీవాయుధాలను తయారుచేసి మారణాయుధాలుగా ఉపయోగించిన దాఖలాలు చరిత్రలో ఎన్నో ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో విషపూరిత బ్యాక్టీరియాలను, క్రిములను తయారుచేసి ఉపయోగించారు.

ఆంత్రాక్స్ జబ్బును కలగజేసే బాసిలస్ అంత్రాసిస్ అనే బ్యాక్టీరియా క్రిములు ఇందుకు ఉదాహరణ. ఆంత్రాక్స్ సోకినవారు బతికి బయటపడడానికి అవకాశం చాలా తక్కువ. ఇటువంటి రోగాలు సోకిన మనుషులు తీవ్ర అస్వస్థతకు గురై మరణిస్తారు.

ఇలాంటి జీవాయుధాలను యుద్ధ సమయంలో శత్రుసైన్యాన్ని నిర్వీర్యం చేయడానికి ఉపయోగించేవారు.

ఇప్పుడు కరోనా వైరస్ వ్యాప్తి తీరును చూశాక ఇది జీవాయుధమనే అనుమానాలు బలపడుతున్నాయి.

అయితే కొవిడ్-19 ప్రమాదకరమైన వైరసే కానీ, జీవాయుధాలతో పోలిస్తే మరణాల శాతం అంత ఎక్కువ కాదు. కాబట్టి అది జీవాయుధమని చెప్పలేమనేది కొందరి వాదన



మధ్యయుగాల నుంచే జీవాయుధాల జాడ్యం!

జీవాయుధాలనే మాట ప్రపంచ దేశల్లో చాలా ఏళ్ల నుంచే వ్యాప్తిలో ఉంది. ఒకరకంగా చెప్పాలంటే చరిత్ర పుట్టినప్పటి నుంచే ఉంది. వైరస్, బ్యాక్టీరియా, ఫంగస్, కొన్ని రసాయనాలను జీవాయుధాలుగా పరిగణిస్తారు. వీటివలన మానవులు, పశువులే కాదు, మొక్కలు కూడా నాశనం అవుతాయి, విశేషమేమింటే.. మనిషిలో ఆధిపత్య పోరు.. సామ్రాజ్యవాదం మొదలైన మధ్యయుగాల నుంచే జీవాయుధాల జాడ్యం ఉన్నట్లు చరిత్ర చెబుతోంది. అసలు వీటిని ఎప్పటి నుంచి వినియోగిస్తున్నారో, ఎవరు వినియోగిస్తున్నారో, వాటి తయారీలో ఏ దేశాలకు ఎంత సామర్థ్యం ఉందో చూద్దాం. యుద్ధోన్మాదులు, ప్రపంచాన్ని ఆక్రమించుకోవాలని చూసిన వారు వీటిని ఉపయోగించినట్టు చరిత్ర చెబుతోంది. నిజానికి ఏదైనా ఒక ప్రమాదకర వైరస్‌ను హతమార్చే క్రమంలో మానవ కల్యాణం కోసం.. మరొక వైరస్‌ను రూపొందించేందుకు ప్రతి దేశానికీ అవకాశం ఉంది. ఆ ముసుగులో ఆయుధాలు తయారు చేస్తున్నాయన్నదే అసలు సమస్య. .

● క్రీస్తు పూర్వం 600 సంవత్సరంలో క్రిసా ముట్టడి సమయంలో రాజు సోలోన్ ఒకరకమైన పువ్వుల నుంచి సేకరించిన రసాన్ని ప్రయోగించి శత్రుదేశంలోని ప్రజలకు విరేచనాలు, ఇతర వ్యాధులు కలిగించినట్టు చరిత్రలో నమోదై ఉంది.

● 1155 సంవత్సరంలో రాజు బార్బోసా ఇటలీ టోరోంటానాలోని మంచి నీటి బావుల్లో శవాలను పడవేసి కలుషితం చేశారని చెబుతారు.

● 1346లో జెనోయీస్-తార్తార్ల మధ్య నేటి ఉక్రెయిన్‌లో ఆధిపత్య పోరు సమయంలో ప్లేగు వ్యాధి వ్యాపించింది. ఓటమి దశలో ఉన్న తార్తార్లు ప్లేగు సోకి మరణించిన వారిని ఫిరంగులకు కట్టి శత్రు ప్రాంతాల మీదకు ప్రయోగించారట. దాంతో జెనోయీస్ దళాలు

వెనక్కు తగ్గాయి. ఈ పరిణామం గురించి గాబ్రియల్ డే ముసిస్ నమోదు చేశాడు. వెనక్కు తగ్గిన జెనోయీస్‌లు (ఇటాలియన్లు) తమతో పాటు ప్లేగు వ్యాదిని కూడా వెంట పట్టుకువెళ్లారు. ప్లేగు వ్యాధిగ్రస్తులను, బహుశా దానిని వ్యాపింప చేసే ఎలుకలను కూడా తమ నౌకల్లో తీసుకుపోయి ఉంటారని గాబ్రియల్ పేర్కొన్నాడు. ఆ తరువాత ప్లేగు ఐరోపా, ఆఫ్రికా, ఆసియాలో మన దేశంతో సహా అనేక దేశాలకు వ్యాపించింది. ఐరోపాలో రెండున్నర కోట్లమంది దానికి బలయ్యారు.

● 1495లో ఫ్రెంచి సైనికులను హతమార్చేందుకు స్పెయిన్ రాజులు ఇటలీలోని నేపుల్స్‌లో కుష్టు వ్యాధిగ్రస్తుల రక్తం కలిపిన మద్యం సరఫరా చేయించారట. .

● 1675లో విషంతో కూడిన బుల్లెట్లను వినియోగించరాదని జర్మనీ-ఫ్రెంచి సైన్యం అంగీకారానికి వచ్చాయి.

● 1710లో రష్యన్ చక్రవర్తి ప్లేగుతో మరణించినవారి శవాలను ఫిరంగులకు కట్టి స్వీడన్ పట్టణాలలో విసిరేయించడం ద్వారా అక్కడ ప్లేగును వ్యాప్తి చేయించాడట.

● 1763లో బ్రిటిష్ పాలకులు అమెరికాను ఆక్రమించుకొనే క్రమంలో అక్కడి స్థానిక గిరిజనుల (నేటివ్ అమెరికన్స్) నుంచి ఎదురైన ప్రతిఘటనను అణచివేసేందుకు మశూచి వ్యాప్తిని ఒక ఆయుధంగా వాడుకున్న దుర్మార్గం గురించి చరిత్రలో నమోదైంది. మశూచి వ్యాధిగ్రస్తులు వాడిన దుప్పట్లను గిరిజనులకు పంపిణీ చేశారు. వాటివలన ఎదురైన దుష్పరిణామాల గురించి బ్రిటిష్ సైనిక అధికారులు నమోదు చేశారు. ఫలితంగా దాదాపు 200 సంవత్సరాల పాటు అమెరికాలో మశూచి వ్యాప్తి చెందింది. ఇలాంటి వాటిని పని గట్టుకొని వ్యాపింపచేశారా లేక సహజంగానే తలెత్తాయా అనేది నిర్ధారించటం అంతసులభంగా కాదని నిపుణులు చెబుతున్నారు.

● నెపోలియన్ చక్రవర్తి 1797లో ఇటలీలోని మంటువాలో మలేరియా వ్యాధి వ్యాపింప చేసేందుకు మైదానాలు వరద నీటితో నిండేలా చేశాడని చెబుతారు.

● అంతర్యుద్ధ సమయంలో 1863లో అమెరికాలోని బానిస వ్యవస్థ కొనసాగాలని భావించిన తిరుగుబాటు రాష్ట్రాలు యూనియన్ సైనికులకు ఎల్లోఫీవర్, మశూచి రోగులు వాడిన వస్త్రాలను విక్రయించేట్టు చేశాయి.

మొదటి ప్రపంచ యుద్ధంలో దారుణం..

● మొదటి ప్రపంచ యుద్ధంలో రష్యా, రుమేనియాల్లో కలరా, ప్లేగు, అంత్రాక్స్ వ్యాపింప చేసేందుకు నౌకల్లో ఆ వ్యాధులు సోకిన గుర్రాలు, పశువులను ఎగుమతి చేసేందుకు జర్మనీ పథకం వేసిందని వార్తలు వచ్చాయి. దాని మీద విచారణ జరిపిన నానాజాతి సమితి కమిటీ జీవాయుధాలను ఉపయోగించలేదు కానీ జర్మన్లు రసాయనిక ఆయుధాలు వాడినట్లు పేర్కొంది.

● మొదటి ప్రపంచ యుద్ధంలో గుర్రాలకు సెంబరోగం (చీమిడి కారటం) వచ్చే అంత్రాక్స్ పౌడర్‌ను జర్మనీ, ఫ్రెంచి గూఢచారులు ప్రయోగించారు.

రెండో ప్రపంచ యుద్ధంలో దుర్మార్గం

చరిత్రలో మానవాళి పట్ల దుర్మార్గంగా వ్యవహరించిన సామ్రాజ్యవాదుల దుష్ట చరిత్రను పరికిస్తే జీవాయుధాల గుట్టలెన్నో కనిపిస్తాయి. రెండో ప్రపంచయుద్ధంలో జపాన్ సామ్రాజ్యవాదులు ఆపరేషన్ చెర్రీ బ్లోసమ్స్ పేరిట జీవాయుధాలతో అమెరికా సహా అనేక దేశాల మీద దాడి చేయాలనే పథక రచన చేశారు. అందుకోసం ప్రత్యేక దళాన్నే ఏర్పాటు చేశారు. 1932 నుంచి 1942 వరకు పరిశోధనలు చేసి వాటిని రూపొందించారు. తొలుత ప్రయోగాల్లో భాగంగా తన ఆక్రమణలో ఉన్న చైనాలోని హార్బిన్, కొరియా, మంచూరియా ప్రాంతాల్లో కలరా, ప్లేగు, అంత్రాక్స్, మశూచి వంటి ప్రమాదకర క్రిముల్ని వాడారు. (జపాన్ మిలిటరీ జరిపిన బాక్టీరియా బాంబు దాడుల కారణంగా ఐదు లక్షల ఎనభైవేల మందికి



పైగా మరణించినట్లు 2002లో జరిగిన ఒక అంతర్జాతీయ సమావేశంలో వక్తలు వెల్లడించారంటే అప్పటి పరిస్థితి అర్థమవుతుంది) ఒక్క చైనాలోనే ప్లేగు, కలరా, ఆంత్రాక్స్ వంటి వాటితో నాలుగు లక్షలమంది మరణించారని అంచనా.

ప్లేగు బ్యాక్టీరియాతో దాడికి ప్రణాళిక..

నిజానికి రెండో ప్రపంచ యుద్ధంలో జీవాయుధాల దాడికి గురైన బాధిత దేశం చైనా.. అమెరికన్లు జపాన్ పెరల్ హార్బరు మీద దాడి చేసిన తరువాత 15 కోట్ల ప్లేగు బాక్టీరియాను మోసుకుపోయే ఈగలు, ఎలుకలతో అమెరికా మీద దాడి చేయాలని జపాన్ ఏర్పాట్లు చేసుకుంది. అనుకోని పరిణామాల వల్ల వాటిని మోసుకుపోయే బెలూన్ నిర్దేశిత స్థలాన్ని చేరలేదు. ఆ తర్వాత మరోసారి దాడికి ప్రణాళిక వేసినా అందుకు కొద్దివారాల ముందే జపాన్ లొంగిపోయింది. దాంతో పన్నాగం నెరవేరలేదు. యుద్ధం ముగిసిన తరువాత సోవియట్ జరిపిన విచారణలో **జీవాయుధాల తయారీ బృందం నేత షిరోషిని** జపాన్ విడిచి పోయినా 12 మంది జపనీయులకు శిక్షలు తప్పలేదు.

పది వేలమంది ఖైదీలపై ప్రయోగం..

జీవాయుధాల తయారీ కోసం జపాన్ ఐదు శివారు ప్రాంతాల్లో 150 భవనాలను ఉపయోగించినట్లు బయటపడింది. దాదాపు మూడువేల మంది శాస్త్రవేత్తలను ఇందుకోసం వినియోగించినట్లు చరిత్ర చెబుతోంది. కనీసం పదివేల మంది ఖైదీలపై వాటిని ప్రయోగించగా వారంతా తీవ్ర వ్యాధులతో మరణించినట్లు తేలింది. వారిలో మూడువేల మంది కొరియా, చైనా, సోవియట్, మంగోలియా, అమెరికన్, బ్రిటిష్, ఆస్ట్రేలియన్ యుద్ధ ఖైదీలు ఉన్నట్లు బయట పడింది. సామ్రాజ్యవాదం.. జాతుల మధ్య వైరం ఇంత

దుర్మార్గంగా ఉండేవన్నమాట! జపాన్ జీవాయుధాల విషయం బయటపడ్డాక 1942 నుంచి అమెరికా పెద్ద ఎత్తున వాటిని రూపొందించేందుకు పూనుకుంది.

1972లోనే జీవాయుధాలపై తీర్మానం..

నిజానికి రసాయనిక, జీవాయుధాల తయారీపై ప్రపంచవ్యాప్తంగా నిషేధం ఉంది. వాటివల్ల శత్రుదేశ సైనికులకే కాక సామాన్యులకు కూడా ముప్పు ఉంటుంది. కానీ, కొన్ని దేశాలు తమ బయోలాజికల్ వార్‌ఫేర్‌లో భాగంగా రహస్యంగా ప్రమాదకర వైరస్‌లను తయారు చేస్తుండడమే అసలు ప్రమాదం. జీవాయుధ ప్రయోగాన్ని యుద్ధనేరంగా పరిగణిస్తూ.. మానవ మేధను సమాజహితం కోసం తప్ప వినాశనానికి వినియోగించరాదని 'కస్టమరీ ఇంటర్నేషనల్ హ్యూమానిటేరియన్ లా' హితవు పలుకుతోంది.

వైరస్‌లు, విషవాయువులను జీవాయుధాలుగా అభివృద్ధి చేయడం, ప్రయోగించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రపంచదేశాలు 'బయో వెపన్ కన్వెన్షన్'లో 1972లోనే తీర్మానాలు చేసుకోవడం ఈ సందర్భంగా ప్రస్తావనార్హం. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత 22 సంవత్సరాలకు 183 దేశాలు జీవాయుధాల నియంత్రణ ఒప్పందంపై సంతకం చేశాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ వాటి తయారీ, సేకరణ, నిల్వ, వినియోగానికి సిద్ధపడబోమని అంగీకారం తెలిపాయి. వైద్య అవసరాలకు మాత్రం కొన్ని మినహాయింపులు ఇచ్చారు. ఉదాహరణకు ఏదైనా ఒక ప్రాణాంతక వైరస్‌ను హతమార్చేందుకు మరొక వైరస్ తయారు చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నమాట. ఇప్పుడు ఆ ముసుగులోనే కొన్ని దేశాలు జీవాయుధాలను తయారుచేస్తుంటాయనే అనుమానాలున్నాయి. అమెరికా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఉత్తర కొరియా తదితర 16 దేశాల్లో రహస్యంగా ఇలాంటి ప్రయోగాలు జరుగుతున్నాయనే సందేహాలు ఎన్నో! రసాయనిక ఆయుధాలను రూపొందించకూడదని అనేక దేశాలు

సంతకాలు చేసినా 1975 వరకు అమెరికా అందులో భాగస్వామి అయ్యేందుకు మొరాయించింది.

ఇప్పటికీ అనేక దేశాలు రసాయనిక ఆయుధాలు తయారుచేస్తున్న విషయం బహిరంగ రహస్యమే! వాటికీ, జీవాయుధాలకు పెద్ద తేడా ఉండదు. ఉదాహరణకు వియత్నాంను ఆక్రమించుకొనేందుకు అమెరికా దాడుల జరిపిన సమయంలో కలుపు మొక్కలను నాశనం చేసే పేరుతో ఆరెంజ్ ఏజెంట్ అనే రసాయనాన్ని పెద్ద ఎత్తున చల్లారు. యాభై సంవత్సరాల తరువాత కూడా అక్కడ అనేకచోట్ల కలుపు మొక్కలే కాదు అసలు ఏ మొక్కా బతకని పరిస్థితులు నెలకొన్నాయి. ఆ ప్రాంతాలలో పుట్టుకతో పిల్లల్లో లోపాలు, కేన్సర్, మధుమేహం వంటి వ్యాధులకు అమెరికా చిమ్మిన విషమే కారణమని తేలింది. అణ్వాయుధాలను అత్యాధునికంగా ఎలా తయారు చేస్తున్నారో వైరస్‌లను కూడా ఏదో ఒక ముసుగులో అలాగే తయారు చేస్తున్నారనేది పర్యావరణవేత్తల సందేహం.

● రెండో ప్రపంచ యుద్ధం తరువాత కొరియాపై దాడి సమయంలో అమెరికా జీవాయుధాలను ఉపయోగించిందనే ఆరోపణలు వచ్చాయి. అయితే తమ దగ్గర జీవాయుధాలు ఉన్నాయి కానీ వాటిని ఉపయోగించలేదని బుకాయించింది. ఇతర దేశాలు కూడా ఇలాగే రహస్యంగా జీవాయుధాలను తయారు చేసి తమ మీద ప్రయోగిస్తాయేమోనని అమెరికా భయపడుతూ ఉంటుంది.

● 1980-88 మధ్య ఇరాక్-ఇరాన్ యుద్ధంలో అమెరికా అందజేసిన శరీన్, ఇతర గ్యాస్‌లను ప్రయోగించినట్టు ఇరాక్‌పై విమర్శలు వచ్చాయి. తరువాత కాలంలో వాటి నిల్వలు ఇంకా ఇరాక్ వద్ద ఉన్నట్టు అనుమానించిన అమెరికా సద్దాంహుస్సేన్ మానవ వినాశక ఆయుధాలను గుట్టలుగా నిల్వచేసినట్టు ప్రచారం చేసిన విషయం తెలిసిందే. అయితే ఇరాక్‌తో యుద్ధానికి దిగి దాడులకు పాల్పడి సద్దాంహుస్సేన్‌ను అంతమొందించిన

అమెరికాకు అలాంటివేమీ దొరకనేలేదు.

● ఇరాక్‌పై దాడి, దురాక్రమణ సమయంలో అమెరికా 1990-91లో తన సైనికులను రసాయన ఆయుధాల నుంచి రక్షించుకునేందుకు అవసరమైన మాస్క్‌లు అందచేసింది. జీవ, రసాయన ఆయుధాలను ఎలా కనిపెట్టాలో శిక్షణ ఇచ్చిందంటే అర్థం.. వాటి తయారీ ఇంకా సాగుతోందనే కదా! లక్షా 50 వేల మంది సైనికులకు ఆంత్రాక్స్ నివారణ వాక్సిన్లు వేసింది. ఆంత్రాక్స్ సోకితే బయటపడడం కోసం 5 లక్షల మంది సైనికులకు నెల రోజులకు సరిపడా ఔషధాల నిల్వల్ని అందుబాటులో ఉంచింది.

● రష్యా-చైనా సరిహద్దుల సమీపంలో అమెరికన్లు ప్రయోగశాలల్లో జీవాయుధాలను అభివృద్ధి చేస్తున్నారని, వాటి పరిసరాలలో తట్టు (మీజిల్స్) వంటి ప్రమాదకర అంటువ్యాధులు వ్యాపిస్తున్నాయని దాని మీద విచారణ జరపాలని రష్యా కోరింది.

● ప్రపంచంలోని 25 దేశాలలో అమెరికన్లు బయో ప్రయోగశాలలను ఏర్పాటు చేశారు. మధ్య ప్రాచ్యం, ఆఫ్రికా, ఆగ్నేయాసియా, అప్పటి సోవియట్ రిపబ్లిక్‌లో అవి ఉన్నాయి. ఒక్క ఉక్రెయిన్‌లోనే 16 ఉన్నాయంటే అమెరికా తీరును చేసుకోవచ్చు.

● అమెరికాలోని మేరీలాండ్‌లోని ఫ్రెడరిక్ అనే ప్రాంతంలో ఫోర్డ్ డెట్రిక్ ప్రయోగశాలలో ఎబోలా వంటి వ్యాధుల కారకాల గురించి పరిశోధనలు చేశారు. దాని మీద వార్తలు రావటంతో 2019లో మూసివేశారు. గత రెండు దశాబ్దాలలో ఇంటా బయటా ఉన్న అమెరికన్ ప్రయోగశాలలో అనేక వందల ప్రమాదాలు జరిగి ప్రమాదకరమైన వైరస్, బాక్టీరియాలు బయటపడినట్లు **యుఎస్ఏ టుడే** పేర్కొన్నది అమెరికాలో ఇలాంటి సమస్యలున్న కారణంగా అసలు విషయాలను దాచి ఇతర దేశాలలో పరిశోధనలు నిర్వహిస్తోంది అగ్రరాజ్యం.

2015లోనే చైనా కుట్ర..!

"కరోనా.. చైనీస్ వైరస్. అది ముమ్మాటికీ చైనీస్ వైరసే"..

అమెరికా అధ్యక్షుడిగా ఉన్న డొనాల్డ్ ట్రంప్ పదే పదే ఈ వ్యాఖ్యలు చేశారు.

ఒక్క డొనాల్డ్ ట్రంపే కాదు చాలామంది చైనానే అనుమానించారు. చైనా మాత్రం ఖండిస్తూ వచ్చింది. అయితే చైనాకు, కరోనాకు ఉన్న లింకుపై గత రెండేళ్లలో ఎన్నో సందర్భాల్లో ఎన్నో సంచలన విషయాలు బయటకు వస్తుండడం విశేషం.

కరోనా వైరస్ ప్రపంచాన్ని కకావికలం చేస్తున్న వేళ- అన్ని వేళ్లూ వుహాన్ (చైనా)లోని పీ4 ల్యాబ్ వైపు చూపిస్తున్నాయి. వైరస్ పుట్టుకకు ఈ ప్రయోగశాలే వేదిక అనే వాదనలు ఎన్నో! వైరస్ వ్యాప్తిలో చైనా కుట్ర కోణం ఉందనేది ప్రపంచదేశాల అనుమానం.. ఇంతమంది అనుమానిస్తున్నట్లుగా ఈ వైరస్ వుహాన్‌లోని ప్రయోగశాల నుంచే లీకయిందా? ఇది నిజంగా జీవాయుధమేనా? వైరస్ వ్యాప్తిలో గబ్బిలాల పాత్ర ఎంత? చైనా చెబుతున్నట్లు వుహాన్‌లోని వన్య ప్రాణుల విక్రయాల మార్కెట్ ఎంతవరకు కారణం? వైరస్ సృష్టి, వ్యాప్తి నిజంగా కుట్రేనా? అలా అయితే దానిపై నిపుణులు ఏమంటున్నారు.. అనేవి ఇప్పుడు ఆసక్తికర అంశాలు.

కరోనా లీకేజీ విమర్శలు వచ్చాక.. ల్యాబ్ రికార్డులను చైనా అధీనంలోకి తీసుకోవడం.. బయటి ప్రపంచానికి చెప్పకపోవడం అనుమానాలను పెంచింది. చైనా చెప్పిన సమాచారాన్నే ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచంపై రుద్దడం కరోనా పుట్టుకపై మరిన్ని అనుమానాలకు తావిస్తోంది.. జనవరిలో చైనాకు వెళ్లిన దర్యాప్తు బృందాన్ని కూడా బాగా ఇబ్బంది పెట్టింది. 'నేచర్', 'సైన్స్' పత్రికల మాజీ ఎడిటర్ నికోలస్ వేడ్ ఇప్పుడు రాసిన కథనంతో మరోసారి చైనా కోణం వార్తల్లోకి ఎక్కింది. యూఎస్‌కు చెందిన ప్రసిద్ధ పత్రికలతోపాటు యూకే,

ఆస్ట్రేలియాకు చెందిన ప్రమఖ మీడియా సంస్థలు తరచూ ఏదో ఒక ఆధారాన్ని వెలికితీస్తూనే ఉన్నాయి. అలాగే ప్రపంచంలోనే ప్రముఖులు అనదగిన శాస్త్ర, సాంకేతిక నిపుణులు చైనా వైపు వేలు చూపిస్తూనే ఉన్నారు.

ప్రపంచం ఒకలా.. చైనా మరోలా

"కరోనా.. చైనీస్ వైరస్. అది ముమ్మాటికీ చైనీస్ వైరసే".. అమెరికా అధ్యక్షుడిగా ఉన్న డొనాల్డ్ ట్రంప్ పదే పదే ఈ వ్యాఖ్యలు చేశారు. ఒక్క డొనాల్డ్ ట్రంపే కాదు చాలామంది చైనానే అనుమానించారు. డ్రాగన్ మాత్రం ఖండిస్తూ వచ్చింది. అయితే తాజాగా చైనాకు, కరోనాకు ఉన్న లింకుపై సంచలన విషయాలు బయటకు రావడంతో ఈ అంశం మరోసారి చర్చనీయాంశమైంది. మూడో ప్రపంచ యుద్ధం కోసం చైనా కుట్రచేసిందని.. జీవాయుధంగా కరోనా వైరస్‌ను తయారు చేసిందని అనేక పాశ్చాత్యదేశాల పత్రికలు కోడై కూస్తున్నాయి. **'వీకెండ్ ఆస్ట్రేలియా'** అనే వార్తా సంస్థ ఓ కథనాన్ని ప్రచురించింది. సార్స్ కరోనా వైరస్ రూపంలో జీవాయుధాన్ని తయారు చేసి ప్రపంచం మీదకు వదిలిందనేది ఈ కథనం సారాంశం. 2015లో చైనా శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు రాసిన రీసెర్చ్ డాక్యుమెంట్‌ను ఈ వార్తా సంస్థ బయటపెట్టింది. ఆస్ట్రేలియన్ స్ట్రాటజిక్ పాలసీ ఇన్‌స్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ **పీటర్ జెన్నింగ్స్ 'న్యూస్.కామ్.ఏయూ'**తో మాట్లాడుతూ.. కరోనా వైరస్‌ను జీవాయుధాలుగా వాడేందుకు చైనా సైంటిస్టులు చెందిన పలురకాల స్ట్రెయిన్‌లను సృష్టించారని ఆరోపించారు. కచ్చితంగా చైనాయే ఉద్దేశపూర్వకంగా ఈ వైరస్‌ను తయారుచేసిందని అన్నారు. అందుకే డబ్ల్యూహెచ్‌వోతో పాటు ఇతర దేశాల సంస్థలు వుహాన్‌కు వెళ్లి పరిశోధిస్తామంటే.. ఒప్పుకోలేదని పేర్కొన్నారు. ఒకవేళ వుహాన్‌లో మార్కెట్ నుంచే వైరస్ వ్యాపిస్తే.. విచారణకు ఎందుకు సహకరించడం లేదనేది ఆయన ప్రశ్న. వుహాన్ సమీపంలోనే వైరాలజీ ల్యాబ్ ఉందని.. 2015లోనే జీవాయుధం గురించి చర్చించినట్లు ఈ పేపర్ల ద్వారా బయపడిందని.. ఈ పరిణామాలన్నింటినీ చూస్తుంటే కరోనా వైరస్‌ను చైనాయే తయారుచేసిందని స్పష్టమవుతోందని తెలిపారు. లీకైన ఈ రీసెర్చ్ పేపర్స్ ఫేక్ కాదని.. నిజమైనవేనని ఓ సైబర్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్ ధ్రువీకరించినట్లు **'న్యూస్.కామ్.ఏయూ'** వెల్లడించింది.

ఎందుకిన్ని అనుమానాలు?

కరోనా మహమ్మారి వుహాన్‌లోని ఓ మార్కెట్‌లో బయటపడిందని చైనా తొలి నుంచి చెబుతున్నది. అందరూ నిజమనే నమ్మారు. అంతకన్నా ముందే కరోనా కేసులు వచ్చినట్టు వెల్లడికావడం, వైరస్ గురించి చైనా ప్రపంచానికి ముందే సమాచారం ఇవ్వకపోవడంతో అనుమానాలు మొదలయ్యాయి. వైరస్ పుట్టుకపై ప్రపంచ ఆరోగ్య సంస్థ దర్యాప్తునకు అనుమతినివ్వకపోవడం అనుమానాలను మరింత పెంచింది. అదే సమయంలో చైనా నుంచి



పాకిన వైరస్ పశ్చిమదేశాల్లో మరణమృదంగం మోగిస్తుంటే చైనాలో కేసులు ఒక్కసారిగా పడిపోవడం అందరినీ విస్మయపరచింది. అమెరికా అప్పటి అధ్యక్షుడు ట్రంప్ వైఖరితో ఆ దేశం ఆత్మరక్షణలో పడిన వేళ ప్రపంచంపై ఆధిపత్యం సాధించేందుకు చైనా ఈ జీవాయుధాన్ని వదిలిందనేది ప్రపంచ దేశాల అనుమానం.

పచ్చి అబద్ధం: చైనా

కరోనా వైరస్‌ను జీవాయుధంగా మార్చాలని ఆరేళ్ల కిందట తమ మిలిటరీ శాస్త్రవేత్తలు చర్చించుకొన్నారంటూ ప్రసారమైన కథనాలు 'పచ్చి అబద్ధం' అని చైనా ఖండించింది. తమ దేశంపై బురద జల్లడానికి అమెరికా అల్లిన కట్టుకథ అని ఆరోపించింది. 'అమెరికా వందల సంఖ్యలో బయో ల్యాబ్‌లు నిర్వహిస్తున్నది. అంటే ఆ దేశం బయోవార్ కోసం పరిశోధనలు జరుపుతున్నదని భావించవచ్చా' అని ఎదురు ప్రశ్నించింది.

జీవాయుధం వెనక అమెరికన్ శాస్త్రవేత్త!

కరోనా వైరస్ వ్యాప్తికి కారణంగా అనుమానిస్తున్న జీవాయుధం తయారీ వెనుక ఉన్నది ఓ అమెరికన్ శాస్త్రవేత్తా? ఈ పరిశోధనలో చైనా నుంచి ఆర్థిక సాయం పొందుతూ, సహకరిస్తున్నది ఆయనేనా? అమెరికాలో సంభవించిన కొన్ని పరిణామాలు, చైనా నుంచి వెలువడ్డ కొన్ని కథనాలు ఈ అనుమానాన్ని మరింత బలపడేట్లు చేస్తున్నాయి. నిపుణుల అంచనా ప్రకారం.. **చార్లెస్ లీబర్** అనే ఆ శాస్త్రవేత్త వుహాన్ విశ్వవిద్యాలయంలో ఓ జీవ-రసాయన ల్యాబ్‌ను నెలకొల్పి - జీవాయుధాల రూపకల్పనలో పరోక్షంగా సహకరిస్తున్నారు. ఆ పరిశోధనా క్రమంలోనే కరోనా వైరస్ బయటకు లీకై వుహాన్‌ను కమ్మేసిందన్నది తాజా వాదన. దీనిని ఎవరూ ధ్రువీకరించకపోయినప్పటికీ ఈ వైరస్ వ్యాప్తికి, వుహాన్ విశ్వవిద్యాలయ ల్యాబ్‌లో పరిశోధనలకు కచ్చితంగా సంబంధం ఉండే

ఉంటుందని శాస్త్రప్రపంచం నమ్ముతోంది. అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో కెమిస్టుగా పనిచేస్తున్న ప్రొఫెసర్ చార్లెస్ లీబర్ నానోటెక్నాలజీలో నిపుణుడు. ఎంతోమందికి మార్గదర్శకుడు. అలాంటి గొప్ప సైంటిస్టును 2021 జనవరి 28న ఎఫ్‌బీఐ అధికారులు అకస్మాత్తుగా అరెస్టు చేశారు. చైనా నుంచి ఆర్థికసాయాన్ని అందుకుంటూ ఆ విషయాన్ని అమెరికా ప్రభుత్వానికి చెప్పకుండా దాచడమే ఆయన అరెస్టుకు కారణం. అమెరికా చట్టాల ప్రకారం ఏ పౌరుడైనా విదేశీ సాయం పొందినపుడు ఆ వివరాలను ప్రభుత్వానికి తెలియపరచి అనుమతి తీసుకోవాలి. మరో కీలకాంశం ఏంటంటే.. లీబర్‌తో పాటు మరో ఇద్దరు రిసెర్చి విద్యార్థులను కూడా ఎఫ్‌బీఐ అరెస్టు చేసింది. వారిలో ఒకరు.. చైనా సైన్యంలో లెఫ్టినెంట్‌గా పనిచేస్తున్నారు. రెండో వ్యక్తి లోగాన్ నుంచి చైనాకు విమానం ఎక్కబోతుండగా అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 21 అత్యంత శక్తిమంతమైన జీవపరిశోధన శాంపిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. చార్లెస్ లీబర్‌ను రెండు రోజుల పాటు నిశితంగా ప్రశ్నించాక.. ఏకంగా 10 లక్షల డాలర్ల పూచీకత్తు మీద ఆయనకు స్థానిక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దేశం విడిచిపోరాదని ఆంక్ష పెట్టింది. ఈ కేసు గురించి బయటకు పొక్కాక- హార్వర్డ్ విశ్వవిద్యాలయం ఆయన పరిశోధనలను ఆపేసి, సస్పెండ్ చేసింది. ఆయనను సెలవుపై పంపేసి, క్యాంపస్‌లో అడుగుపెట్టవద్దని ఆంక్ష విధించింది. లీబర్ వద్ద 18 మంది విద్యార్థులు రిసెర్చ్ స్కాలర్లుగా ఉన్నారు.

చైనా వలలో పడ్డారా!

థౌజండ్ టాలెంట్స్ ప్లాన్ పేరిట చైనా ఓ ప్రతిష్ఠాత్మక పరిశోధన కార్యక్రమాన్ని సాగిస్తోంది. దీని కింద విదేశాల్లో లబ్ధప్రతిష్ఠులైన వారిని ఆకర్షించి తమ వర్సిటీల్లో పరిశోధనలు సాగిస్తోంది. ఆ క్రమంలోనే చార్లెస్ లీబర్‌నూ సంప్రదించింది. ఆయనకు నెలనెలా 50,000 డాలర్లు వేతనం ఇస్తుండడమే కాకుండా, ఇతర వ్యక్తిగత ఖర్చుల నిమిత్తం మరో 1,50,000 డాలర్లు చెల్లిస్తోంది. 2012-17 మధ్య కాలంలో ఆయన పూర్తిగా చైనాకు పనిచేశారు. 15 లక్షల డాలర్ల ఖర్చుతో- వుహాన్ విశ్వవిద్యాలయంలో ఓ పరిశోధనా ల్యాబ్‌ను ఏర్పాటు చేయడమూ ఆయనతో ఒప్పందంలో భాగం. వుహాన్ వర్సిటీతో ఒప్పందం విషయాన్ని చార్లెస్ లీబర్ అటు హార్వర్డ్‌కు కానీ, ఇటు అమెరికన్ ప్రభుత్వానికి కానీ చెప్పలేదు. అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్ (డీవోడీ) నుంచి 2008 నుంచి దాదాపు 15 మిలియన్ డాలర్ల విలువైన గ్రాంట్లు పొంది హార్వర్డ్‌లో సైతం రిసెర్చ్‌ను కొనసాగించారాయన.

చైనా సాగిస్తున్న 'థౌజండ్ టాలెంట్స్ ప్లాన్'పై ఎప్పటినుంచో అమెరికాకు అనుమానం ఉంది. అది తమ దేశానికి, ఇతర దేశాలకు చెందిన అగ్రశ్రేణి శాస్త్రవేత్తలను ఆకర్షించి- మేధాసంపత్తి హక్కులను హరిస్తుందన్నది అమెరికా భయం. దాన్ని దెబ్బతీయాలని



ఎప్పటినుంచో ప్రయత్నిస్తోంది. అలాంటి ప్లాన్‌కు హార్వర్డ్ ప్రొఫెసర్ పనిచేస్తారని అమెరికా ఊహించలేదు. లీబర్ అరెస్టుతో కరోనా వైరస్ వ్యాప్తికి కారణాలపై శాస్త్రలోకంలో విస్తృత చర్చ మొదలైంది. నిజంగానే ఈ వైరస్ వుహాన్ విశ్వవిద్యాలయంలోని ల్యాబ్‌లో సాగుతున్న పరిశోధనల్లోనే డెవలప్ అయిందా? నిజమైతే లీకేజీకి కారణాలేంటి? బయటకు చెప్పకపోయినా లీబర్ అరెస్టుకు- కరోనా అభివృద్ధికి మధ్య సంబంధం ఏదైనా ఉందా, అరెస్టు చేసిన ఇద్దరు చైనా స్కాలర్ల నుంచి బయటపడ్డ వయల్స్‌లో ఏముంది? వంటి వాటిపై ఎఫ్‌బీఐ ఆరాతీస్తోంది.

కెనడా నుంచి చైనా తస్కరించిందా?

'గ్రేట్ గేమ్ ఇండియా' పోర్టల్ కథనం ప్రకారం.. ఈ వైరస్ మూలాలు కెనడాలో ఉన్నాయి. 'చైనాకు చెందిన ఇద్దరు బయోలాజికల్ వార్ ఫేర్ ప్రోగ్రాం ఏజెంట్లు ఈ వైరస్‌ను గుట్టు చప్పుడు కాకుండా చైనాకు తీసుకెళ్లారనేది' ఆ కథన సారాంశం.

అదెలాగో చూద్దాం..

"2012 జూన్ 13న సౌదీకి చెందిన 60 ఏళ్ల వ్యక్తి ఏడు రోజులపాటు జ్వరం, దగ్గు, శ్వాస సంబంధ సమస్యలతో బాధపడుతూ జెడ్డాలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. ఆయనకు పొగ తాగే అలవాటు లేదు, దీర్ఘకాలికంగా మందులేవీ తీసుకోవడం లేదు. ఈజిప్షియన్ వైరాలజిస్ట్ డాక్టర్ అలీ మహ్మద్ జాకీ ఆ పేషెంట్ ఊపిరితిత్తుల్లో కరోనా వైరస్ ఆనవాళ్లు ఉన్నాయని అనుమానించారు. నెదర్లాండ్స్‌లోని ఎరాస్మస్ మెడికల్ సెంటర్‌లో వైరాలజిస్ట్‌గా పని చేసే **రోన్ ఫౌచిర్**ను సంప్రదించారు. జాకీ పంపిన శాంపిల్‌ను పరీక్షించిన ఫౌచిర్ ఓ శాంపిల్‌ను కెనడాలోని నేషనల్ మైక్రోబయాలజీ ల్యాబ్‌లో పని చేసే డాక్టర్ ఫ్రాంక్ ప్లమ్మర్‌కు అందజేశాడు. అక్కడి ల్యాబ్ నుంచి చైనా ఏజెంట్లు వైరస్‌ను తస్కరించారు.

2019 మార్చిలో అనుమానాస్పద వస్తువు ఒకటి కెనడా ల్యాబ్ నుంచి చైనాకు వెళ్లింది.

విచారణలో చైనీస్ వైరాలజిస్టులు దీన్ని కెనడా ల్యాబ్ నుంచి పంపించారని తేలింది" అని ఆ కథనం చెబుతోంది. భారత్‌ను దెబ్బతీయడం కోసమే చైనా ఈ జీవాయుధాన్ని తయారు చేసిందనే కథనాలు ప్రచారంలోకి వచ్చాయి.

ఆధారాలు లేవు కానీ అనుమానాలెన్నో!

కరోనా చైనా జీవాయుధం అనడానికి ఎలాంటి ఆధారాలు లేవు కాబట్టి దీనికి వుహాన్‌లో ప్రయోగశాలే కారణమని తాను నమ్మడం లేదని ఆస్ట్రేలియా డిఫెన్స్ అనలిస్ట్ డాక్టర్ మాల్కమ్ డేవిస్ ట్వీట్ చేశారు. కానీ బయో సైన్స్‌లో చైనా భారీ ఎత్తున పెట్టుబడులు పెడుతుండటం, నైతికతకు కట్టుబడి ఉండని ఆ దేశ వైఖరి అనుమానాలకు తావిస్తోంది. చైనా కరోనా వైరస్ విషయంలో నోరు మెదపకపోవడంతో సందేహాలు మరింతగా పెరుగుతున్నాయి.

ఇజ్రాయెల్ విశ్లేషకుడు ఏమంటున్నారు?

చైనా ల్యాబ్‌లో జీవాయుధం తయారు చేస్తూ ఉండొచ్చని ఇజ్రాయెల్ లెఫ్టినెంట్ కల్నల్ డానీ షోహమ్ అనుమానం వ్యక్తం చేశారు. ఆయన మెడికల్ మైక్రోబయాలజీ నుంచి డాక్టరేట్ పొందారు. ఈ మాజీ సైనిక నిఘా అధికారి చెబుతున్నదాని ప్రకారం.. యుద్ధ వ్యూహాల్లో భాగంగా చైనా వుహాన్‌లోని వైరాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో జీవాయుధాలను తయారుచేస్తోంది. 'వుహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ' చైనా సర్కారు అధికారికంగా ధ్రువీకరించిన బీఎస్ఎల్-4 (బయోసేఫ్టీ లెవెల్ 4) లేదా పీ4 (పాథోజెన్ లెవెల్ 4)గా వ్యవహరించే వైరాలజీ కేంద్రాన్ని కరోనా వంటి వైరస్‌లను నియంత్రించేందుకు పరిశోధనల కోసం 2018లో దీన్నినిర్మించారు. అక్కడ చైనా తన జీవాయుధ యుద్ధ కార్యక్రమంలో భాగంగా కరోనా వైరస్‌లతోపాటు, ఎబోలా, నిఫా వైరస్ తదితర సూక్ష్మజీవులపై పరిశోధనలు చేస్తోందని డానీ షోహమ్ ఆరోపిస్తున్నారు.

పూర్తి దర్యాప్తు జరగాలి: అమెరికా, బ్రిటన్ శాస్త్రవేత్తల డిమాండ్

కొవిడ్-19 మహమ్మారి మూలాలను తేల్చడానికి మరింత పరిశోధన జరపాలని అమెరికా, బ్రిటన్ శాస్త్రవేత్తలు డిమాండ్ చేశారు. వుహాన్‌లో వైరాలజీ ల్యాబ్ నుంచి ఈ వైరస్ ప్రమాదవశాత్తు విడుదలై ఉంటుందన్న వాదనపైనా దృష్టి సారించాలని కోరారు. ఈ శాస్త్రవేత్తల్లో భారత సంతతికి చెందిన ఇమ్యునాలజీ, అంటువ్యాధుల నిపుణుడు రవీంద్ర గుప్తా కూడా ఉన్నారు. ఆయన కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నారు. మిగతావారు కూడా మామూలువాళ్లు కాదు సుమా.. హార్వర్డ్, స్టాన్‌ఫర్డ్, మాసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) వంటి అగ్రశ్రేణి వర్సిటీల పరిశోధకులు ఉన్నారు. వారు రాసిన లేఖ **'సైన్స్'** జర్నల్‌లో ప్రచురితమైంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) డైరెక్టర్ జనరల్, అమె

రికా, 13 దేశాలు, యూరోపియన్ యూనియన్ కోరుతున్నట్లుగా కరోనా మహమ్మారి మూలాలపై స్పష్టత అవసరమని వారు కోరారు. ఈ వైరస్ మూలాలను గుర్తించేందుకు భాగస్వామ్య పక్షాలతో కలిసి పనిచేయాలని డబ్ల్యూహెచ్‌వోను ప్రపంచ ఆరోగ్య అసెంబ్లీ 2020 మేలో కోరింది. ఆ మేరకు చైనా-డబ్ల్యూహెచ్‌వో ఉమ్మడి అధ్యయన బృందం ఏర్పడింది. మొదటిదశలో సమాచారం, డేటా, నమూనాలను.. సేకరించి విశ్లేషించింది. "కరోనా వైరస్ సహజసిద్ధంగా వచ్చిందా లేక ల్యాబ్ నుంచి లీకైందా అన్నదానిపై ఇతమిత్థంగా తేలలేదు. ఒక జంతువు నుంచి వచ్చి ఉండటానికే ఆస్కారం ఎక్కువగా ఉందని వారు నివేదిక ఇచ్చారు. ల్యాబ్ ద్వారా లీకై ఉండటానికి అవకాశం దాదాపుగా లేదని తెలిపారు. నిజానికి ఈ రెండు సిద్ధాంతాలపై సరైన పరిశీలన జరగనేలేదు" అని అమెరికా, బ్రిటన్ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ల్యాబ్ నుంచి లీకై ఉంటుందన్న వాదనకు బలమిచ్చే ఆధారాలపై సరైన అధ్యయనం జరగలేదని డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ జనరల్ వ్యాఖ్యానించిన విషయాన్ని వారు గుర్తు చేశారు. అన్ని రంగాల నిపుణులతో కూడిన దర్యాప్తు అవసరమంటున్నారు వాళ్లు.

పీ-4 ల్యాబ్‌ను ఎందుకు మూసేసినట్లు?

2019 డిసెంబరు 31న కరోనాకు సంబంధించి మొదటి కేసును గుర్తించినట్లు చైనా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో)కు సమాచారం అందించింది. అయితే వాస్తవానికి డిసెంబరు 1నే తమ దవాఖానాలో కరోనా కేసులు నమోదయ్యాయని, వీటికి సీ ఫుడ్ మార్కెట్‌కు ఎలాంటి సంబంధం లేదని వుహాన్‌లోని జిన్‌ఇన్‌టాన్ దవాఖానా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ గ్వాన్ చాలింగ్ వెల్లడించారు. ఆ తరువాత రోజుల్లో వచ్చిన మొత్తం 99 కేసుల్లో 49% కేసులకు మాత్రం ఆ మార్కెట్‌తో సంబంధం ఉందని పేర్కొన్నారు. అంటే మిగిలిన 51% కేసులతో ఆ మార్కెట్‌కు ఎలాంటి సంబంధం లేదని వారే ఒప్పుకున్నట్టు అర్థమవుతుందని ప్రముఖ పల్మనాలజిస్ట్, మెడికల్ జర్నలిస్ట్ డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్ అభిప్రాయపడ్డారు. వుహాన్‌లోని పీ4 ల్యాబ్‌ను అకస్మాత్తుగా మూసివేయడం అనుమానాలకు తావిచ్చింది. ఆ ల్యాబ్‌లో పనిచేస్తున్న శాస్త్రవేత్తలకు తొలుత వైరస్ సోకి ఉంటుందని, వారి నుంచి స్థానికులకు వ్యాప్తి చెంది ఉండొచ్చనే వాదన అప్పుడే మొగ్గతొడిగింది.

కరోనాను ఇలా పుట్టించొచ్చు.. నాంజీ మిలిటరీ ఇన్‌స్టిట్యూట్

2018లోనే నాంజీ మిలిటరీ ఇన్‌స్టిట్యూట్ వైద్య పరిశోధనా విభాగం కరోనా వైరస్‌ను ఎలా సృష్టించవచ్చో కొంత సమాచారాన్ని ఇచ్చింది. ఈ వైరస్‌ను ఐసోలేట్ చేసి.. నాచురల్ మ్యుటేషన్ కాకుండా.. రీకాంబినేషన్ టెక్నిక్ ద్వారా 100 శాతం సమానమైన అమైనో యాసిడ్ సీక్వెన్స్‌తో ల్యాబ్‌లో వేరు చేయగలమని, తయారు చేయగలమని వివరించింది. అనేక అనుమానాలకు కేంద్రస్థానంగా మారిన చైనాలోని 'వుహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ'కి అమెరికా ప్రభుత్వం దాదాపు 3.7 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 28.22

కోట్లు) గ్రాంట్‌గా ఇచ్చినట్లు **'ద డెయిలీ మెయిల్'** వెల్లడించింది. వుహాన్ నుంచి వెయ్యి మైళ్ల దూరంలోని యునాన్‌లో ఉన్న గుహల నుంచి గబ్బిలాలను సేకరించి అక్కడ పరిశోధనలు చేస్తున్నట్లు తెలిపింది. ప్రమాదకర పరిశోధనలకు అమెరికా నిధులు అందివ్వడంపై అక్కడి చట్టసభ సభ్యులు మండిపడుతున్నారు. వైరస్ బారినపడిన జంతువులను, లేదా పరిశోధనలతో అనారోగ్యం బారిన పడిన వాటిని ఆ తర్వాత మార్కెట్‌లో విక్రయించి ఉండొచ్చని ఆరోపించారు.

ఎన్నెన్నో కథనాలు.. మరెన్నో అనుమానాలు

కరోనా గురించి ఐదేళ్ల కిందటే చైనా శాస్త్రవేత్తలు చర్చించినట్టు, వైరస్‌తో జీవాయుధాల తయారుచేయడంపై ప్రస్తావించినట్టు ఆస్ట్రేలియా న్యూస్ వెబ్‌సైట్ **'ఏ'** పత్రిక కూడా కథనం రాసింది. 'సార్స్ కృత్రిమ పుట్టుక, మానవులు సృష్టించిన కొత్త జాతుల జీవాయుధం' అనే పేరుతో కథనం ప్రచురించింది. జీవాయుధంతో దాడి చేస్తే శత్రుదేశం వైద్య వ్యవస్థ కుప్పకూలిపోతుందని చైనా సైన్యం భావిస్తోందని వ్యాఖ్యానించింది. కరోనా 2019లో వ్యాప్తి చెందినప్పటికీ చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (సీపీఎల్ఏ) శాస్త్రవేత్తలు ఇలాంటి వైరస్‌తో ఆయుధాల తయారీ గురించి అంతకు ఐదేళ్ల ముందు నుంచే చర్చిస్తున్నట్టు వివరించింది. దీనికి సంబంధించిన ఆధారాలు, పత్రాలు అమెరికా విదేశీ వ్యవహారాల శాఖకు లభ్యమైనట్లు మరికొన్ని మీడియా సంస్థలు పేర్కొన్నాయి. కొవిడ్-19పై పుట్టుకపై స్వీయ దర్యాప్తులో భాగంగా అమెరికా అధికారులకు ఈ పత్రాలు చేజిక్కాయని తెలిపాయి. సీపీఎల్ఏ కమాండర్లు ఎంతటి దుర్మార్గాలకు పాల్పడతారో ఇవి రుజువు చేస్తున్నాయని యూకే పత్రిక **'ద సన్'** పేర్కొంది. వివిధ రకాల వైరస్‌లను సైనిక అవసరాలకు ఎలా వాడుకోవచ్చేనేది శాస్త్రవేత్తలు ఆలోచించడం సుస్పష్టమని 'ఆస్ట్రేలియన్ స్ట్రాటజిక్ పాలసీ ఇన్‌స్టిట్యూట్' (ఏఎస్‌పీఐ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీటర్ జెన్నింగ్స్ వ్యాఖ్యానించారు. సైనిక అవసరాలకు ఉద్దేశించిన వ్యాధికారక క్రిమి ప్రమాదవశాత్తూ ల్యాబ్ నుంచి బయటకు వచ్చిందనే వాదనకు ఇది బలం చేకూరేలా ఉందని అన్నారు. 'వుహాన్ మార్కెట్ నుంచి వైరస్ వ్యాపించి ఉంటే దానిపై దర్యాప్తునకు చైనా వెంటనే సహకరించేది. కానీ వైరస్ మూలాల్లోకి వెళ్లాలనగానే డ్రాగన్ వ్యతిరేకించింది' అనే అయన కూడా గుర్తుచేశారు. చైనా ప్రభుత్వ డాక్యుమెంట్లు లీకైనప్పుడు సైబర్ సెక్యూరిటీ నిపుణుడు రాబర్ట్ పోటర్ వాటిని విశ్లేషించి అవి నకిలీవి కాదని తేల్చడం గమనార్హమని అన్నారు. డ్రాగన్ పరిశోధకుల ఆలోచన విధానం ఎలా ఉందో ఈ పత్రం వెల్లడిస్తుందని జెన్సింగ్ వ్యాఖ్యానించారు.

కొవిడ్19 జీవాయుధం కాదనేవారూ ఉన్నారు..

కరోనా వైరస్ వ్యాప్తి మొదలైన నాటినుండే, ఇది ప్రయోగశాలలో తయారైన వైరసేనన్న

అనుమానాలు కూడా వైరస్ కన్నా వేగంగా వ్యాప్తి చెందుతుండగా.. అవన్నీ నిజం కాదనే వాదనలు మరికొన్ని వినిపిస్తున్నాయి.

అమెరికా శాస్త్రవేత్తలు కొందరు ఇది చైనాలోని వూహాన్ ప్రయోగశాలలో తయారైందన్న అనుమానాన్ని లేవనెత్తుతుండగా, చైనీయులు ఈ వైరస్ అమెరికా సైనిక విభాగం వారు సృష్టించారని ప్రచారం చేశారు. కానీ ఈ వైరస్‌ల మీద పనిచేసే శాస్త్రవేత్తలు మాత్రం కొవిడ్-19 మానవుల చేతిలో తయారైంది కాదని, గబ్బిలం లేదా అలుగు నుండి సోకే వైరస్‌లకు దీనికి ఎంతో సామ్యం కనిపిస్తోందని అంటున్నారు. నిజంగా కొవిడ్-19 మనుషులను చంపడానికి తయారు చేసిన జీవాయుధమే అయి ఉంటే ఇంతకుముందే తెలిసిన అత్యంత ప్రమాదకరమైన క్రిములను మారణాయుధంగా తయారు చేసి ఉండేవారు కదా.. కొత్తగా కనిపెట్టడం దేనికనేది కొందరి వాదన. వారు ఈ వైరస్ జన్యుకణాలను (ఆర్.ఎన్.ఎ) క్షుణ్ణంగా పరిశోధించి వంశవృక్షాన్ని తయారుచేయగలిగారు. దాని సాయంతో వైరస్ పుట్టుపూర్వోత్తరాలు చెప్పవచ్చు. వాళ్లు మాత్రం ఇది గబ్బిలం వంటి క్షీరదాలు, అలుగు వంటి జంతువుల నుండి మానవులలోకి ప్రవేశించి ఉంటుందని భావిస్తున్నారు.

కరోనా వైరస్ వుహాన్ ల్యాబ్ నుంచి ప్రబలిందనడానికి ఆధారాల్లేవని ఆ పరిశోధనశాల నిర్మాణానికి సహకరించిన ఫ్రాన్స్ ప్రభుత్వం ప్రకటించింది. అమెరికా అత్యుత్తమ డాక్టర్లలో ఒకరైన ఆంథోనీ ఫౌచీ కూడా ఈ వైరస్ ల్యాబ్ నుంచి వచ్చిందన్న ఆరోపణలను కొట్టిపారేశారు. ఈ వైరస్ ల్యాబ్ నుంచి వచ్చిందనడానికి ఆధారాల్లేవని లండన్‌లోని కింగ్స్ కాలేజీకి చెందిన బయోసెక్యూరిటీ పరిశోధకురాలు ఫిలిప్పా లెంట్జోస్ వెల్లడించారు. కాకపోతే ఈ వ్యాధి ఎక్కడి నుంచి మొదలైందో కూడా తెలియడంలేదని చెప్పడం గమనార్హం.

ఎందుకిన్ని అనుమానాలు?

వుహాన్ (చైనా)లోని పీ4 ప్రయోగశాలే కరోనాకు పురిటిగడ్డ అనేది ఇప్పుడు హాట్ టాపిక్. వైరస్ వ్యాప్తిలో చైనా కుట్ర కోణం ఉందన్న విమర్శలూ అందులో భాగమే. వుహాన్‌లోని హునాన్ సీఫుడ్ మార్కెట్‌లో రొయ్యలు విక్రయించే మహిళే కరోనా వైరస్ పేషెంట్ జీరో (తొలి రోగి) కావచ్చనే అనుమానాలున్నాయి. ఇప్పటికీ సజీవంగా ఉన్న ఆ మహిళకు వైరస్ ఎలా సోకిందో మాత్రం చెప్పలేకపోతున్నారు. ఆ మార్కెట్లో గబ్బిలాలను విక్రయించరని **'ఫాక్స్ న్యూస్', 'ఎన్‌టీడీ మీడియా'** సంస్థల పరిశోధనలో తేలింది. చాలా మహమ్మారులు ప్రబలినప్పుడు ప్రపంచ ఆరోగ్య సంస్థ పేషెంట్ జీరోను కనుగొంటుంది. ఇది ఆ మహమ్మారిపై పరిశోధనల్లో అది కీలకం. కానీ, కొవిడ్-19 విషయంలో ఇది ఇప్పటికీ సాధ్యం కాలేదు. వుహాన్‌లో 2019 డిసెంబరు 1నే తొలికేసు నమోదైందని.. దానికి సముద్రజీవుల మార్కెట్‌తో సంబంధం లేదని ప్రఖ్యాత మెడికల్ జర్నల్ **'ద లాన్సెట్'**లో ప్రచురించిన పరిశోధన పత్రం పేర్కొంది. అంటే 2019 నవంబరులోనే ఇది సోకితే.. ఇంక్యుబేషన్ సమయం దాటాక డిసెంబరులో రోగి ఆసుపత్రికి వచ్చారన్నమాట! ఈలోపు ఆ

వ్యక్తి నుంచి చాలామందికి వ్యాపించి ఉంటుంది. తర్వాత వైరస్ జన్యు సమాచారం బహిర్గతం చేయడంపై చైనా ఆంక్షలు విధించింది.

పీ 4 ల్యాబ్ కథ ఏమిటి?

సార్స్ ప్రబలిన తర్వాత.. అత్యంత ప్రమాదకరమైన వైరస్‌లపై పరిశోధనలు చేసేందుకు వుహాన్ శివార్లలో పీ 4 స్థాయి పరిశోధనశాలను నిర్మించారు. 3,000 చదరపు మీటర్ల వైశాల్యంలో ఉన్న ఈ ల్యాబ్ నిర్మాణానికి ఫ్రాన్స్‌కు చెందిన అలైన్ మెరియక్స్ కన్సల్టెంట్‌గా వ్యవహరించింది. 2018లో దీనిని వినియోగంలోకి తీసుకొచ్చారు. ఇందులో దాదాపు 1500 రకాల వైరస్‌లను నిల్వచేసి పరిశోధనలు చేస్తున్నారు. విదేశాల నుంచి అత్యంత ప్రమాదకరమైన వైరస్‌లను ఇక్కడకు తరలించినట్లు 2019లో ఆరోపణలు వచ్చాయి. చైనాకు చెందిన డాక్టర్ జియాంగ్యూ క్యూని కెనడాలోని నేషనల్ మైక్రోబయాలజీ లేబొరేటరీ (ఎన్ఎంఎల్) నుంచి వైరస్, సమాచారం తరలించారనే ఆరోపణలపై వెనక్కి పంపించారు. ఎన్ఎంఎల్‌లో పనిచేస్తుండగానే 2017-18 మధ్యలో జియాంగ్యూ వుహాన్ ల్యాబ్‌కు వచ్చినట్లు తేలింది. ఆ తర్వాతే అక్కడ ఎబోలా, నిఫాలపై పరిశోధనలు మొదలయ్యాయి.

అమెరికా 3.7 మిలియన్ డాలర్ల గ్రాంట్

విశేషమేమిటంటే.. అనేక అనుమానాలకు కేంద్రస్థానంగా మారిన చైనాలోని 'వుహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ'కి అమెరికా ప్రభుత్వం దాదాపు 3.7 మిలియన్ డాలర్ల గ్రాంట్‌గా ఇచ్చినట్లు **'ద డెయిలీ మెయిల్'** వెల్లడించింది. ఒబామా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు దీనికి అమెరికా నుంచి ఆర్థిక సాయం అందింది. గతంలో పలువురు అమెరికా పరిశోధకులు దీనిని సందర్శించి వెళ్లారు. 'బ్యాట్ ఉమెన్' షీయెంగ్ లీ ఇక్కడ పరిశోధనలు చేస్తున్నారు. వుహాన్ నుంచి వెయ్యి మైళ్ల దూరంలోని యునాన్‌లో ఉన్న గుహల నుంచి గబ్బిలాలను

సేకరించి అక్కడ పరిశోధనలు చేస్తున్నట్లు **'ద డెయిలీ మెయిల్'** తెలిపింది. ప్రమాదకర పరిశోధనలకు అమెరికా నిధులు అందివ్వడంపై అక్కడి చట్టసభ సభ్యులు మండిపడుతున్నారు. వైరస్ బారినపడిన జంతువులను, లేదా పరిశోధనల్లో వినియోగించిన వాటిని ఆ తర్వాత మార్కెట్‌లో విక్రయించి ఉండొచ్చని కూడా ఆరోపించారు.

వాస్తవాలను తొక్కిపెట్టారా?

కరోనా వైరస్ ప్రబలిన వెంటనే అంతర్జాతీయ పరిశోధకులను పీ4 ల్యాబ్‌కు రానివ్వకుండా చైనా కట్టడి చేయడం, ఈ వైరస్ గురించి సోషల్ మీడియాలో సమాచారం తెలిపిన వైద్యుడు లీ వెన్‌లియాంగ్‌ను వేధించడం, సమాచారాన్ని బయటి ప్రపంచంతో పంచుకోకపోవడం.. ఇవన్నీ అనుమానాలను పెంచేశాయి. ఒక దశలో ఈ వైరస్ అమెరికా నుంచి వచ్చిన సైనికులు వ్యాప్తిచేశారని కూడా చైనా ప్రచారం చేసింది. తర్వాత ఈ వైరస్ ఇటలీ నుంచి వ్యాపించిందంటూ చైనా పత్రికలు కథనాలు రాశాయి.

కఠిన ఆంక్షలు..

షాంఘైలోని పుడాన్ యూనివర్సిటీకి చెందిన ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ కళాశాల 2020 ఏప్రిల్ 10న చైనా అకాడమీ ఆఫ్ సైన్సెస్ నుంచి వచ్చిన నోటీస్‌ను పబ్లిష్ చేసింది. అందులో కరోనా వైరస్ పుట్టుకపై చేసిన పరిశోధనలను మూడు దశల్లో పరిశీలించి ఆమోదం తెలిపాకే ప్రచురించాలని పేర్కొంది. దీనిపై కలకలం రేగడంతో ఆ నోటీసును తొలగించింది. వుహాన్‌లోని చైనా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జియో సైన్సెస్ కూడా ఇలాంటి నోటీసునే జారీ చేసి తర్వాత తొలగించింది. చైనా అకాడమీ ఆఫ్ సైన్సెస్ నేరుగా అధ్యక్షుడికి

జవాబుదారీగా ఉంటుంది. అదే సంస్థ పరిధిలో వుహాన్‌లోని పీ4 వైరస్‌ల ప్రయోగశాల కూడా ఉంటుంది.

ప్రయోగాలు చేసిన జీవుల్ని అమ్ముకుంటున్నారా?

చైనా ప్రయోగశాలల్లో ఉపయోగించిన జీవులను ఆ తర్వాత ఉద్యోగులు కొందరు దొంగతనంగా బయటకు తీసుకువచ్చి మార్కెట్లో అమ్ముకుని సొమ్ము చేసుకుంటారనే ఆరోపణలు చాన్నాళ్లుగా ఉన్నాయి. లి నింగ్ అనే పరిశోధకుడు ఇలా చేసినట్లు తేలడంతో 2020 జనవరి 2న న్యాయస్థానం 12 ఏళ్ల జైలు శిక్ష విధించింది. వుహాన్లోని పీ4 ల్యాబ్‌లో ఉపయోగించిన జీవిని కూడా ఇలా సముద్ర జీవుల మార్కెట్‌కు తరలించారా? అనే అనుమానాలున్నాయి. ల్యాబ్‌కు సంబంధించిన ఏ సమాచారం బయటకు పొక్కడానికి వీల్లేదని 2020 జనవరి మొదటి వారంలో ఈ ల్యాబ్ డైరెక్టర్ జనరల్ ఉద్యోగులకు మెయిల్ చేసినట్లు **'ది ఎపోక్ టైమ్స్'** పరిశోధనాత్మక కథనంలో పేర్కొంది. 2016లో 'చైనా ఎక్స్‌పర్మెంటల్ యానిమల్ ఇన్ఫర్మేషన్' ప్రకారం ఒక్క హుబే ప్రావిన్స్‌లోనే 3,00,000 జంతువులను వినియోగించి ప్రయోగాలు చేశారు.



లోపాల పుట్ట.. వుహాన్ ప్రయోగశాల

అమెరికా నిపుణులు 2018 జనవరిలో పీ4 ల్యాబ్‌ను సందర్శించి, అక్కడి లోపాలను గమనించి తమ దేశానికి సమాచారం అందించారనే వార్తను **'వాషింగ్టన్ పోస్ట్'** ప్రచురించింది. 2018 మే 29న **'చైనా డైలీ'** ట్విటర్‌లో పోస్టుచేసిన ఫొటోలను ఆంగ్ల పత్రిక **'ద సన్'** వెలుగులోకి తెచ్చింది. ఈ చిత్రాల్లో వైరస్‌లను భద్రపర్చే రిఫ్రిజిరేటర్ సీల్ ఊడిపోయి కనిపిస్తుండటం కలకలం రేపింది. అమెరికా చీఫ్ ఆఫ్ జాయింట్ స్టాఫ్ మార్క్ ఎ మెల్లి కూడా.. కరోనా వైరస్ ఈ ల్యాబ్ నుంచి వచ్చిందా? అనే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పడం గమనార్హం. అమెరికా అధ్యక్షుడు (అప్పటి) డొనాల్డ్ ట్రంప్ అనుకూల మీడియా **'ఫాక్స్ న్యూస్'** కూడా కథనాన్ని ప్రచురించడంతో ఈ వాదనకు బలం చేకూరింది. ఈ వైరస్ జన్మస్థానాన్ని వెతికి పట్టేందుకు కేంబ్రిడ్జికి చెందిన డాక్టర్ పీటర్ ఫ్రాస్టర్ నేతృత్వంలోని బృందం రంగంలోకి దిగింది. వైరస్ 2019 సెప్టెంబరు నుంచి డిసెంబరు మధ్యలో వ్యాపించి ఉంటుందని వారు అంచనా వేశారు.

గబ్బిలాలపై ఆమె పరిశోధనలు

ఈ మొత్తం వివాదంలో గబ్బిలాల్లోని కరోనా వైరస్‌లపై పరిశోధనలు నిర్వహిస్తున్న **'షీయెంగ్ లీ'** అనే మహిళా శాస్త్రవేత్త పేరు చాలా కీలకమైనది. ఆమెను **'బ్యాట్ ఉమన్'** అని పిలుస్తుంటారు. 2010లో ఆమె కరోనా వైరస్ స్పైక్ ప్రొటీన్‌పై పరిశోధనలు చేశారు. మనిషిలోని ఏసీఈ2 రిసెప్టర్లకు ఈ వైరస్ సోకగలదని గుర్తించారు. 2013లో దీనిని ధ్రువీకరిస్తూ పరిశోధన వ్యాసాన్ని రాశారు. ఆమె కృత్రిమ వైరస్‌లపై పరిశోధనలు చేసి

విమర్శల పాలయ్యారు. "కరోనా వైరస్ మనిషిలోకి ప్రవేశించడానికి గ్వాంగ్‌డాంగ్, గ్వాంగ్‌జీ, యునాన్ ప్రావిన్స్‌ల వాతావరణం అనుకూలంగా ఉంటుంది. మధ్య చైనాలోని వుహాన్లో ఇది ప్రబలుతుందని నేను అనుకోలేదు. కొంపదీసి మా ల్యాబ్ నుంచి లీక్ కాలేదు కదా?" అని ఆమె వ్యాఖ్యానించినట్లు **'సైంటిఫిక్ అమెరికన్'** పత్రిక పేర్కొంది. ఆ తర్వాత ఆమె మాట మార్చినా అప్పటికే దుమారం రేగింది. దీంతో 2020 ఫిబ్రవరిలో ఆమె ఖండించాల్సి వచ్చింది.

కృత్రిమంగా తయారుచేయడం సాధ్యం కాదా?

"సార్స్-కోవ్-2 జన్యుక్రమంలో హెచ్ఐవీ, మలేరియా పరాన్నజీవికి సంబంధించిన జన్యువులు ఉండటం అనుమానాలకు ప్రధాన కారణం. ఈ వైరస్ లక్షణాలు సహజసిద్ధంగా లేవు. వుహాన్ ప్రయోగశాలలో పెను ప్రమాదం జరిగింది" అని 2008లో నోబెల్ విజేత, ప్రముఖ వైరాలజిస్టు లుచ్ మౌంటెనియర్ (ఎయిడ్స్‌కు వ్యాక్సిన్ కనుగొనే క్రమంలో ఈ వైరస్ లీక్ అయిందని అంతర్లీనంగా చెప్పారు) అంటున్నారు. ఈ ఆరోపణలను వుహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (డబ్ల్యూఐవీ) డైరెక్టర్ యువాన్ జిమింగ్ ఖండించారు. వైరస్‌ను కృత్రిమంగా తయారుచేయడం సాధ్యం కాదని ఆయన తేల్చిచెప్పారు.

"వారు కావాలని చేస్తే.. తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారు. పొరపాటున లీక్ కావడానికి, ఉద్దేశపూర్వకంగా చేయడానికి మధ్య పెద్ద తేడా ఉంది. ఆ రెండింట్లో ఏది జరిగినా వారు మాకు విషయాన్ని తెలియజేసి, మమ్మల్ని ల్యాబ్‌లోకి అనుమతించి ఉండాలి. కానీ అలా చేయలేదు. ఏదో తేడా జరిగిందని చైనాకు తెలుసు. వారు ఇబ్బందికర పరిస్థితిలో పడినట్లున్నారు. అమెరికాతో పోలిస్తే చైనాలోనే ఎక్కువమంది ఈ మహమ్మారికి బలై ఉంటారు." అని అమెరికా అధ్యక్షుడు (అప్పటి) ట్రంప్ కుండ బద్దలుకొట్టారు.

'కొవిడ్-19 మహమ్మారి పుట్టుక, దానిపై ప్రపంచం స్పందించిన తీరుపై స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలని ఆస్ట్రేలియా డిమాండ్ చేసింది. 'సంక్షోభాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఎదుర్కొన్న విధానంపై కూడా విచారణ జరగాలి. చైనాలో మహమ్మారి చెలరేగినప్పుడు డబ్ల్యూహెచ్‌వో తీరు సరిగాలేదు. సమస్య తీవ్రతను కప్పిపుచ్చిందన్న ట్రంప్ విమర్శలతో మేం ఏకీభవిస్తున్నాం' అని పేర్కొంది

వైరస్‌ను సృష్టించే సామర్థ్యం ప్రస్తుతం మానవులకు లేదు!

"వుహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ డైరెక్టర్ యువాన్ జిమింగ్ ఈ ఆరోపణలను ఖండించారు. తమ సంస్థలో పరిశోధనల తీరు, వైరస్‌లు, నమూనాలను నిర్వహించే విధానంపై తమకు పూర్తి అవగాహన ఉందని, ఆ వైరస్ తమ దగ్గర నుంచి బయటకు రాలేదని ప్రకటించారు. అసలు లీకేజీకి అవకాశమే లేదన్నారు. తమ వద్ద కఠిన నియంత్రణలు ఉన్నాయని, పరిశోధనలకు సంబంధించి నియమావళి ఉందని చెప్పుకొచ్చారు.

ఊహాగానాల ఆధారంగానే ఆరోపణలు చేస్తున్నాన్నారు. ఇలాంటి సాకులతో తమ పరిశోధనల్లో జోక్యం చేసుకోవాలన్నది వారి ఉద్దేశంగా కనపడుతోందనే అనుమానం వ్యక్తంచేశారు. కరోనా వెలుగులోకి వచ్చాక సదరు వైరస్‌కు సంబంధించిన జన్యుపటాన్ని ఆవిష్కరించి అందుబాటులో ఉంచామని, చికిత్సలు, టీకాలకు సంబంధించి తాజా పరిశోధన వివరాలను ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో)కు సమర్పించామని చెప్పారు. "ఒక సైంటిస్టుగా, శాస్త్ర, సాంకేతిక అంశాల మేనేజర్‌గా ఒక్క విషయాన్ని చెప్పగలను. వైరస్ మా దగ్గర నుంచి లీక్ కావడం అసాధ్యం. వైరస్‌ను కృత్రిమంగా తయారుచేయడానికి అసాధారణ మేధస్సు, భారీగా శ్రమ అవసరం. అందువల్ల ఇలాంటి వైరస్‌ను సృష్టించే సామర్థ్యం ప్రస్తుతం మానవులకు ఉందని నేను విశ్వసించడంలేదు" అని వివరించారాయన. నిజానిజాలు నిలకడమీద తేలాల్సిందే!

2020 జనవరిలోనే సమాచారం..

కరోనా గురించి అగ్రరాజ్యానికి ముందే సమాచారం ఇచ్చామని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి హువా చున్ యుంగ్ పేర్కొన్నారు. 2019 డిసెంబరు 27న కొన్ని అనుమానిత కేసులను గుర్తించామని అధికారికంగా ఈ విషయాన్ని డబ్ల్యూహెచ్‌ఓతో పాటు అమెరికా, ఇతర దేశాలకు తెలియజేశామని ఆమె తెలిపారు. ఆ కేసులపై డిసెంబరు 29న ఎపిడమాలాజికల్ సర్వేను చేపట్టామన్నారు. ఓ రోజు తర్వాత వుహాన్ హౌజ్ కమిషన్ ఎమర్జెన్సీ ఆదేశాలు జారీ చేసిందన్నారు. చైనా హెల్త్ కమిషన్ ఆధ్వర్యంలో డిసెంబరు 31న వైద్య నిపుణులను విచారణ కోసం వుహాన్‌కు పంపించామని తెలిపారు. చైనాకు చెందిన సీడీసీ.. వైరస్‌కు చెందిన జన్యుక్రమాన్ని జనవరి 11న వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినట్లు చెప్పారు. తర్వాత జనవరి 23న వుహాన్‌ను షట్‌డౌన్ చేయాలని ఆదేశించామని. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు కఠిన నిర్ణయాలు తీసుకున్నామని, తమ ప్రయత్నాలను డబ్ల్యూహెచ్‌వో కూడా మెచ్చుకుందని ఆమె వెల్లడించారు.

భారత్ పక్కలో బల్లెం..

అమెరికా సహా ప్రపంచదేశాలన్నీ అనుమానంగా చూస్తున్న క్రమంలో అభాసుపాలవుతున్న చైనా.. తన చేతికి మట్టి అంటకుండా మిత్రదేశం పాకిస్థాన్‌లో ఓ కొత్త జీవాయుధం తయారు చేయడానికి పూనుకుందని ఆస్ట్రేలియా పత్రిక **'ద క్లాకన్'** అనుమానాలను వ్యక్తం చేసింది. ఆంత్రాక్స్ తరహా అత్యంత ప్రమాదకర వైరస్‌లు.. బ్యాక్టీరియాల అభివృద్ధికి చైనా-పాకిస్థాన్ కలిసి రహస్య ప్రాజెక్టును నడుపుతున్నాయని ఈ పరిశోధక పత్రిక సంచలన కథనాన్ని ప్రచురించింది. చైనా తన మిత్రదేశం పాకిస్థాన్‌తో కలిసి భారత సరిహద్దుల్లోని పాకిస్థాన్‌లో గల రావల్పిండిలో ఉన్న 'డిఫెన్స్ సైన్స్ అండ్

THE WEEKEND AUSTRALIAN

WWW.THEAUSTRALIAN.COM.AU | FOR THE INFORMED AUSTR

PHILLIP ADAMS

What is your earliest memory?

TOUGHEST CALL

MAGAZINE

Sports broadcaster Karen Tighe on the virus that stole her memory

MAGAZINE

CLICK & CONNECT

Beyond sex robots - intimacy in the digital age

BEIJING'S MILITARY SCIENTISTS WARNED OF BIOLOGICAL WEAPONS DEPLOYED IN WORLD WAR

'Virus warfare' in China files

What really happened in Wuhan

టెక్నాలజీ ఆర్గనైజేషన్ ల్యాబ్‌లో ఈ కొత్త బయోవెపన్ తయారీకి పరిశోధనలు చేస్తున్నదని ఆ పత్రిక ప్రచురించింది. దీనికి సంబంధించి పాకిస్థాన్ సైన్యానికి చెందిన రావల్పిండిలోని 'డిఫెన్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆర్గనైజేషన్'తో చైనా ఒప్పందం చేసుకున్నట్టు తెలిపింది. విశేషం ఏంటంటే ఈ భారీ బయోవెపన్ ఖర్చు అంతా చైనాదేనట.. కానీ చైనా భూభాగంలో చేయకుండా పాకిస్థాన్‌లో ప్రయోగాలు చేస్తుందని ఆ పత్రిక తెలిపింది. ఇందులో పాకిస్థాన్ ఆరోగ్యశాఖకు.. పాకిస్థాన్ యూనివర్సిటీలకు పాత్ర లేకుండా మొత్తం వ్యవహారాన్ని స్వయం ప్రతిపత్తి గల రావల్పిండి 'డిఫెన్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆర్గనైజేషన్'కు అప్పగించడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొంది. చైనా పరిశోధకులే మొత్తం తతంగం నడిపిస్తున్నారని తేల్చింది. ఆంత్రాక్స్ జాతికి చెందిన 'సీసీహెచ్.ఎఫ్.వీ' అనే వైరల్ ఫీవర్‌పై పాకిస్థాన్‌లో చైనా సైంటిస్టులు పరిశోధనలు చేస్తున్నారు. ఈ వైరల్ ఫీవర్‌తో ప్రపంచవ్యాప్తంగా 25 శాతంమంది మరణించే అవకాశం ఉందని సమాచారం.. అంత భయంకరమైన జ్వరం వచ్చిన వ్యక్తులు కోలుకోవడం చాలా కష్టం అని చైనా పరిశోధకులు కనిపెట్టారు. రిస్క్ ఎక్కువగా ఉండడంతోనే అందరూ అనుమానిస్తున్న చైనాలో చేయడం కంటే పాకిస్థాన్‌లో బెటర్ అని దుకాణం ఇక్కడికి మార్చినట్టు సమాచారం. ఇలా పొరుగున ఉన్న భారత్ సహా ప్రపంచదేశాలకు ఈ కొత్త వైరస్ పెనుముప్పు కావచ్చని ఆ పత్రిక కథనాలు వెలువరించింది.

ఆస్ట్రేలియన్ పత్రిక కథనం వెనుక కథ ఏమిటి?

'ద ఆస్ట్రేలియన్' పత్రిక కథనంపై ఎంతో దుమారం రేగడంతోపాటు భిన్నకోణాలు వెలుగులోకి వచ్చాయి. మూడో ప్రపంచ యుద్ధం వస్తే అది జీవ ఆయుధాలతోనే జరుగుతుందని.. అందుకోసం వాటిని తయారు చేయటం గురించి చైనా మిలిటరీ

శాస్త్రవేత్తలు చేసిన సమాలోచనల 2015 నాటి రహస్య పత్రం తమకు దొరికిందంటూ **'ద ఆస్ట్రేలియన్'** పత్రిక పేర్కొడం వెనుక చాలా కథే ఉందనేది ఇక్కడ ప్రస్తావనార్హం. యూకేకు చెందిన **'ద సన్'** పత్రిక పేర్కొన్నదాని ప్రకారం అమెరికా విదేశాంగ శాఖ నుంచి పత్రాలు తీసుకొని ఆస్ట్రేలియన్ పత్రిక చైనా జీవాయుధ పరిశోధన కథనం రాసింది. కొవిడ్-19 మూలాలను శోధించే క్రమంలో మిలిటరీ, చైనా ప్రజారోగ్య అధికారులు రాసిన పత్రాలు తమకు దొరికాయని అమెరికా అధికారులు చెప్పారట. అమెరికా వైమానిక దళ కల్నల్ మైఖేల్ జె కఫ్ మూడో ప్రపంచయుద్ధం జీవాయుధాలతో జరుగుతుందని చెప్పిన విశ్లేషణను పరిగణనలోకి తీసుకొని చైనా శాస్త్రవేత్తలు సార్స్ వైరస్‌తో జీవాయుధాన్ని తయారు చేయటం గురించి చర్చించారట (2003లో చైనాలో సార్స్ వైరస్ వ్యాపించింది).

ఆ కథనానికి ఆధారం ఏమిటి?

ఆస్ట్రేలియన్ పత్రిక పేర్కొన్న పత్రాలు నకిలీవైతే కాదని ఇంటర్నెట్ నిపుణులు చెప్పేశారు. అసలింతకీ ఆ కథనానికి ఆధారం ఏమిటి? ప్రపంచంలో వైరస్‌తో జీవాయుధాలను తయారు చేసి యుద్ధాలలో వినియోగించే అంశాల గురించి కొందరు నిపుణులు వెలిబుచ్చిన అభిప్రాయాలను, ఇతరత్రా అనేక అంశాలను పేర్కొంటూ చైనా మిలిటరీ వైద్యుడైన గ్జు డెహౌంగ్ 2015లో ఒక పుస్తకాన్ని ప్రచురించారు. ఆ పుస్తకం అమెజాన్ ద్వారా ప్రపంచమంతా అమ్ముడుపోయింది. అమెరికా విదేశాంగశాఖ ఆ పుస్తకంలోని అంశాలను రహస్య పత్రాలని చెప్పటం.. వాటిని గుడ్డిగా ఆస్ట్రేలియన్ పత్రిక నమ్మి నిజమే అని ప్రచురించిందా అనే సందేహాలను లేవనెత్తుతున్నారు కొందరు. అంత రహస్యం అయితే అమెరికా అధికారులు తమ పత్రికలకు ఇవ్వకుండా ఆస్ట్రేలియా పత్రికను ఎంచుకోవటం ఏమిటి అనేదే ఈ సందేహానికి అసలు కారణం.

అమెరికా పెట్టిన చిచ్చు కారణంగా ఆస్ట్రేలియా, చైనాల మధ్య ఈమధ్య కాలంలో వాణిజ్యపోరు సాగుతోంది. ఆస్ట్రేలియాతో వాణిజ్య చర్చలను నిరవధికంగా వాయిదా వేసినట్లు కొన్నాళ్ల క్రితం చైనా ప్రకటించిన నేపథ్యంలోనే ఈ వార్తలు వెలువడ్డాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంటే చైనా వ్యతిరేకతను రెచ్చగొట్టేందుకు, ఆస్ట్రేలియా భుజం మీద నుంచి తుపాకి కాల్చాలనేది అమెరికా ఎత్తుగడ అనేది వారి వాదన.

విదేశాల నుంచి సార్స్ మహమ్మారి?

చైనాలో 2002, 2004 సంవత్సరాలలో బయటపడిన సార్స్ మహమ్మారి విదేశాల నుంచి అసహజ పద్ధతిలో జన్యుమార్పిడి జరిగి వచ్చిన వైరస్ (ఇది కూడా కరోనా వైరస్ రకాలలో ఒకటి) కావచ్చు అని చైనా రచయిత తన పుస్తకంలో అభిప్రాయపడ్డారు. చైనాకు వ్యతిరేకంగా విదేశాల్లో ఉగ్రవాదుల జీవాయుధాల తయారీని కూడా కాదనలేమని





THE EYES OF DARKNESS * 333

"I'm not interested in the philosophy or morality of biological warfare," Tina said. "Right now I just want to know how the hell Danny wound up in this place."

"To understand that," Dombey said, "you have to go back twenty months. It was around then that a Chinese scientist named Li Chen defected to the United States, carrying a diskette record of China's most important and dangerous new biological weapon in a decade. They call the stuff 'Wuhan-400' because it was developed at their RDNA labs outside of the city of Wuhan, and it was the four-hundredth viable strain of man-made microorganisms created at that research center.

"Wuhan-400 is a perfect weapon. It afflicts only human beings. No other living creature can carry it. And like syphilis, Wuhan-400 can't survive outside a living human body for longer than a minute, which means it can't permanently contaminate objects or entire places the way

సంపాదకుడు, చైనా మిలిటరీ వైద్యుడైన గ్జు డెహౌంగ్ పేర్కొన్నారు. ప్రపంచంలో జీవాయుధాల ప్రయోగాలు, యుద్ధంలో వాటి వినియోగం గురించి కూడా అందులో చర్చించారు. 1941లోనే అమెరికా బయోవెపన్స్‌పై పరిశోధన ప్రారంభించిందని, తరువాత వాటి తయారీకి ల్యాబ్‌లను ఏర్పాటు చేసిందని ఆయన పేర్కొన్నారు. 1940-45 సంవత్సరాల మధ్య జపాన్ జీవాయుధాలను ఉపయోగించి తూర్పు చైనాలోని ఝెజియాంగ్, హునాన్ రాష్ట్రంలో ప్రయోగించి ప్లేగు వ్యాధి వ్యాపింపజేసిందని కూడా రచయిత ప్రస్తావించారు. ఇన్ని అంశాలుండగా వాటన్నింటినీ పక్కన పెట్టి చైనా శాస్త్రవేత్తలు చైనాలో సార్స్ నుంచి జీవాయుధాల గురించి చర్చించినట్లుగా ఆస్ట్రేలియన్ పత్రిక కథనం వండి వార్చిందనేది కొందరి ఆరోపణ.

ఇదిగో తోక.. అదిగో పులి..

అమెరికన్ రచయిత **డీన్ కూన్జ్** ఎప్పుడో నాలుగుదశాబ్దాల క్రితమే కరోనా గురించి జోస్యం చెప్పారంటూ కరోనా వైరస్ బయట పడిన కొత్తలో వార్తలు వచ్చాయి. డీన్ 1981లో రాసిన **'ద ఐస్ ఆఫ్ డార్క్‌నెస్'** అనే పుస్తకంలో 'వుహాన్ -400' అనే జీవాయుధం, అది పనిచేసే తీరు, జనాలను ఎలా హతమారుస్తుందో, దాన్ని ఎలా తయారు చేస్తారో చెప్పించాడు అంటూ ఆ నవలను విక్రయించే అమెజాన్ వెబ్‌సైట్ 2008నాటి నవల చిత్రాన్ని సామాజిక మాధ్యమంలో పోస్టు చేసింది. ఒక పేజీలో జీవాయుధం గురించి, మరొక పేజీలో నవల ముఖచిత్రం ఉన్నాయి. ఇంకేముంది అది వాస్తవమే అని చాలామంది నమ్మారు. అయితే తరువాత ఈ కథ ఊహించని మలుపు తిరిగింది. గూగుల్‌లో వెతికిన కొందరికి కొత్త అంశం కనిపించింది. అదే నవలలో అదే పాత్రధారులు రష్యన్లు గోర్కీ పట్టణంలో తయారు చేసిన 'గోర్కీ-400' అనే జీవాయుధం గురించి చరించినట్లు వెలుగులోకి వచ్చింది.

అది ఆ నవల 1981నాటి ముద్రణలో ఉంది. కానీ ఆ తర్వాత గోర్కీ కాస్తా 2008 ముద్రణ నాటికి వుహాన్‌గా మారిపోయిందనే విషయం వారికి అర్థమైంది.

పేర్లు ఇలా తారుమారు...

అమెరికా, ఐరోపాలోని అనేకమంది రచయితలు, సినిమా దర్శకులు, కథకులు 1991 ముందు వరకు సోవియట్ యూనియన్, ఇతర తూర్పు ఐరోపా దేశాలలోని సోషలిస్టు వ్యవస్థలను దుర్మార్గమైనవిగా చిత్రీకరించి సొమ్ము చేసుకోవటం తెలిసిందే. అమెరికన్లు, సిఐఏ ఏజెంట్లు అసాధారణ తెలివితేటలు ఉన్నవాళ్లుగా, సోవియట్ ఏజెంట్లు తెలివితక్కువవారిలా చిత్రించిన సినిమాలు చాలా వచ్చాయి. సోవియట్, ఇతర సోషలిస్టు వ్యవస్థలు కుప్పకూలిపోయాక వారు కొత్త కథలను అల్లటం ప్రారంభించారు. అమెరికా ప్రధాన ప్రత్యర్థిగా అనూహ్యంగా చైనా ముందుకు వచ్చింది. 1991 తరువాత వచ్చిన సినిమాల్లో, రష్యన్లకు బదులు చైనీయులు విలన్లుగా, విదూషక పాత్రధారులుగా మారిపోవటాన్ని చూడవచ్చు. ఇందులో భాగంగానే కొత్త నవల రాయటం దండగని.. పేర్లు, స్థలాలను మారిస్తే చాలని రచయిత, ప్రచురణకర్తలు భావించి ఆ మేరకు మార్చి ప్రచురించినట్లు అర్థమవుతోందని జర్నలిస్టు ఎం.కోటేశ్వరరావు విశ్లేషించారు.



శాస్త్రవేత్తల దుస్సాహసమే కారణమా?

అణుశాస్త్రవేత్తల పత్రిక కథనం

అణుశాస్త్రవేత్తల పత్రిక 'ద బులెటిన్.ఓఆర్‌జీ' 2021 మే 5న ప్రచురించిన కథనం వుహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ ల్యాబ్‌పై అనుమానాలను పెంచేసింది. కరోనా వైరస్ పుట్టుకకు ల్యాబ్ వేదికగా మారిందా? వైరస్ పుట్టుకపై దర్యాప్తును వారే పక్కదోవ పట్టిస్తున్నారా? అంటే సరైన సమాధానం దొరకదు. కానీ, పరిణామాలు.. దర్యాప్తులు తీరు ఆద్యంతం అనుమానాస్పదంగానే ఉంటున్నాయి. ఈ కథనాన్ని రాసిన నికోలస్ వేడ్ కేంబ్రిడ్జిలో నేచురల్ సైన్స్ డిగ్రీ చేశారు. 79 ఏళ్ల నికోలస్ గతంలో 'నేచర్', 'సైన్స్' వంటి పత్రికలకు ఎడిటర్‌గా చేశారు. వైరస్ పుట్టుకపై దర్యాప్తు చేయాలనే ఒత్తిడి రాకుండా కొందరు శాస్త్రవేత్తలు ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించినట్లు పేర్కొన్నారు. దీనిలో అమెరికా, చైనా శాస్త్రవేత్తల పాత్ర ఉందంటున్నారు నికోలస్ వేడ్.

ఎవరీ పీటర్.. ?

చైనాలో తొలుత కొవిడ్ వ్యాప్తిని గుర్తించినప్పుడు అక్కడి అధికారులు అది ఎక్కడి నుంచి పుట్టిందో వెల్లడించలేదు. ఆ తర్వాత వుహాన్ మార్కెట్ గురించి తెరపైకి వచ్చింది. అంతేకాదు సార్స్, మెర్స్ వ్యాపించినప్పుడు కరోనా వైరస్ గబ్బిలం నుంచి పునుగుపిల్లి (సివెట్) వంటి ఒక జంతువులోకి ప్రవేశించి అక్కడి నుంచి మనిషిలోకి చేరి సార్స్ వ్యాధిని పుట్టించింది. ఇక గబ్బిలం నుంచి ఒంటెలోకి చేరిన వైరస్‌తో మెర్స్ వ్యాధి పుట్టింది. కానీ,

సార్స్‌కోవ్-2లో మాత్రం అది గబ్బిలం నుంచి ఏ జీవిలోకి ప్రవేశించిందో కనుగొనలేదు. దీంతో వుహాన్ ల్యాబ్ నుంచి లీకైందన్న ప్రచారం ఊపందుకోవడంతో కొందరు వైరాలజిస్టుల బృందం లాన్సెట్‌కు ఓ లేఖ రాసి ఈ వాదనను ఖండించింది. "కొవిడ్-19 సహజమైనది కాదనే ప్రచారాలను ఖండిస్తున్నాం. అది పూర్తిగా అడవి జంతువుల నుంచి వచ్చింది" అని వివరించారు. ఈ లేఖ వల్ల తమకు ఎటువంటి ప్రయోజనాలు లేవని పేర్కొన్నారు. అయితే వైరస్ ఎక్కడి నుంచి వచ్చిందో నిర్ధారణ కాకుండానే ఒక వాదనను శాస్త్రవేత్తలు ఎలా తోసిపుచ్చుతారని నికోలస్ వేడ్ ప్రశ్నించారు.

న్యూయార్క్‌లోని ది ఎకోహెల్త్ అలయన్స్ సంస్థ అధ్యక్షుడు, వైరాలజిస్టు పీటర్ డెస్జాక్ ఈ లేఖకు సంబంధించి ఆర్గనైజింగ్, డ్రాఫ్టింగ్ బాధ్యతలు చూశాడు. అదే పీటర్‌కు చెందిన సంస్థ వుహాన్ ఇన్‌స్టిట్యూట్‌కు కరోనా వైరస్‌లపై పరిశోధనలకు నిధులను సమకూర్చింది! ఈ విషయాన్ని ఆయన లేఖలో ప్రస్తావించలేదు. నైతికంగా ఇది తప్పు అని వేడ్ విమర్శించారు.

గబ్బిలాల నుంచి నమూనాలు..

యునాన్ ప్రావిన్స్‌లో గుహల్లో పనిచేస్తుండగా 2012 ఏప్రిల్‌లో ఆరుగురు కార్మికులు జ్వరం, పొడిదగ్గు వంటి లక్షణాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ముగ్గురు మరణించారు. మిగిలిన వారు నెలల తరబడి ఆసుపత్రి పాలయ్యారు. బతికిన వారిలో సార్స్ రోగుల్లో వచ్చే యాంటీబాడీలు కనిపించాయి. ఈ విషయం బ్యాట్ ఉమెన్, వుహాన్ ల్యాబ్ శాస్త్రవేత్త **షీఝెంగ్ లీ**కి తెలిసింది. ఆమె బాధితుల నుంచి, గుహల్లోని గబ్బిలాల నుంచి నమూనాలు సేకరించారు. వాటిని వుహాన్ ల్యాబ్‌లో విశ్లేషించి ఆర్ఏటీజీ - 13 వైరస్‌గా గుర్తించారు. ఈ వైరస్ జన్యువులు నేటి సార్స్‌కోవ్-2 జన్యువులతో చాలామటుకు సరిపోతున్నాయి. షీఝెంగ్ లీ ఉత్తర కరోలినా విశ్వవిద్యాలయానికి చెందిన రాల్ఫ్ ఎస్

బెరిక్‌తో కలిసి కరోనా వైరస్‌లపై ప్రయోగాలు చేశారు. సార్స్-1 జన్యువులతో వీరు 2015లో కొత్త వైరస్‌ను సృష్టించినట్లు వేడ్ కథనంలో పేర్కొన్నారు. ఇది మనుషుల శ్వాస వ్యవస్థను సోకగలదు. ది ఎకోహెల్త్ అలయన్స్ అధిపతి పీటర్ డెస్జాక్ 2019 డిసెంబరులో ఇచ్చిన ఓ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'ఏడేళ్లు కష్టపడి చేసిన ప్రయోగాల్లో 100 వరకు కొత్త రకం వైరస్‌లను అభివృద్ధి చేశాం' అని వెల్లడించిన మాటలను వేడ్ తన కథనంలో ఉటంకించారు.

'గెయిన్ ఆఫ్ ఫంక్షన్' (మ్యుటేషన్) పరిశోధనలపై అనుమానాలు..

పీటర్ డెస్జాక్ సమకూర్చిన నిధులతో వుహాన్ ల్యాబ్‌లో 'గెయిన్ ఆఫ్ ఫంక్షన్' (మ్యుటేషన్) పరిశోధనలు జరుగుతున్నాయని నమ్ముతున్నారు. అన్ని రకాల వైరస్‌లు మనుషులకు సోకవు. కానీ, వాటిలో మార్పులు జరిగితే (మ్యుటేషన్లు) మనుషులకు సోకే ప్రమాదం ఉంది. అందుకే అలాంటి వైరస్‌లను గుర్తించి వాటిలో మార్పులు చేసి పరిశీలిస్తారు. ఈ క్రమంలో అవి ల్యాబ్ నుంచి లీకైతే పెను ప్రమాదం తలెత్తవచ్చు. అందుకే ఇటువంటి ప్రయోగాలను అమెరికాలో 2014లో నిషేధించారు. కానీ, ట్రంప్ వచ్చాక అనుమతులు పునరుద్ధరించారు. ఆ సమయంలోనే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌కు అనుబంధ సంస్థ అయిన ఎన్ఐఏఐడీ నుంచి వుహాన్ ల్యాబ్‌కు నిధులు అందాయి. దీని డైరెక్టర్ ఆంటోనీ ఫౌచీ మాత్రం తాము నిధులు ఇవ్వలేదని ఇటీవల వెల్లడించారు. ద ఎకోహెల్త్ అలయన్స్‌కు నిధులు ఇచ్చామే తప్ప గెయిన్ ఆఫ్ ఫంక్షన్ ప్రయోగాల కోసం కాదని తేల్చిచెప్పారు.

కరోనా వ్యాప్తికి ముందే శాస్త్రవేత్తలకు అస్వస్థత?

వుహాన్ ల్యాబ్ విషయంలో మరో సంచలన వార్త బయటకు వచ్చింది. అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థల నివేదికల ఆధారంగా **వాల్‌స్ట్రీట్ జర్నల్** ఒక కథనాన్ని ప్రచురింది. కరోనా వ్యాప్తికి ముందే శాస్త్రవేత్తలకు అస్వస్థతకు గురయ్యారనేది ఆ కథనం సారాంశం. ఇప్పటికే అణుశాస్త్రవేత్తల జర్నల్ **'బులెటిన్.ఓఆర్‌జీ'**లో ల్యాబ్ లీకేజీపై కథనం వచ్చి సంచలనం సృష్టించింది. వీటిల్లో వేటికి చైనా ఆధారాలు చూపించి ఖండించలేదు. కేవలం తమపై దుష్ప్రచారంగానే కొట్టిపారేసింది. తాజాగా అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ఫాక్ట్ షీట్‌లోని విషయాలు బయటకు రావడంతో మరోసారి చైనా పాత్రను ప్రశ్నిస్తున్నాయి.

బాహ్య ప్రపంచంలో సార్స్‌కోవ్-2 వైరస్ వ్యాపించడానికి ముందే వుహాన్ ల్యాబ్‌లోని చాలామంది పరిశోధకులు అస్వస్థతకు గురయ్యారు. వీరందరిలో కొవిడ్ 19 లేదా సాధారణ ఫ్లూలో కనిపించే జ్వరం, పొడిదగ్గు వంటి లక్షణాలు ఉన్నాయి. ఒక నమ్మకమైన అంతర్జాతీయ భాగస్వామి నుంచి అమెరికా ఇంటెలిజెన్స్ వద్దకు ఈ సమాచారం వచ్చింది. చాలా కచ్చితమైన సమాచారం వెల్లడించినట్లు కొందరు అధికారులు **వాల్‌స్ట్రీట్**తో పేర్కొన్నారు. కానీ, వారు ఎందుకు జబ్బుపడ్డారో కారణం మాత్రం తెలియలేదని తెలిపారు.

శాస్త్రవేత్తల అంచనాలకు తగ్గట్టే..

చాలామంది వైరాలజిస్టులు, అంటువ్యాధుల చికిత్స నిపుణులు 2019 నవంబరులోనే కొవిడ్-19 వుహాన్‌లో వ్యాపించి ఉంటుందని చెబుతున్నారు. 2020 మార్చిలో హడ్సన్ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో నాటి అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపియో మాట్లాడుతూ.. "లెవల్ 4 ల్యాబ్‌లో కరోనా వైరస్‌లపై పనిచేస్తున్న ముగ్గురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరందరిలో ఇన్‌ఫ్లుయెంజా లక్షణాలు ఉన్నాయి. వీరంతా ఒకే వారంలో తీవ్ర అస్వస్థకు గురికావడం కానీ, ఆసుపత్రిలో చేరి చికిత్స పొందడం కానీ జరిగాయి. పరిశోధకులు జబ్బుపడటమే మొదటి క్లస్టర్ కావచ్చు" అని పేర్కొన్నారు. పాంపియో గతంలో నిఘా సంస్థ సీఐఏ డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. ఆయన ఎంతమంది జబ్బుపడ్డారో అంకెతో సహా చెప్పారు.

అమెరికా తప్పుదోవ పట్టిస్తోంది..

ఈ కథనంపై **వాల్‌స్ట్రీట్ జర్నల్** చైనా విదేశాంగ శాఖను వివరణ కోరగా.. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన నివేదికను ఉటంకిస్తూ సమాధానం చెప్పింది. ల్యాబ్ నుంచి లీకయ్యే అవకాశం లేదని పేర్కొంది. అమెరికా ఈ ప్రచారంతో ప్రపంచాన్ని తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించింది. గతంలో కూడా చైనా ఈ వైరస్ తమ దేశంలో పుట్టలేదని.. బయట నుంచి వచ్చిందని ప్రచారం చేసింది. ఒక దశలో అమెరికాలోని మేరీల్యాండ్‌లో ఉన్న ఫోర్ట్‌డెట్రిక్ సైనిక స్థావరంలోని ల్యాబ్ నుంచి వచ్చిందని కూడా ఆరోపించింది. 2021 జనవరిలో వుహాన్ ల్యాబ్‌కు వచ్చిన నిపుణుల బృందంతో **బ్యాట్ ఉమెన్ - షీఝెంగ్ లీ** మాట్లాడుతూ.. 'తమ ల్యాబ్ నుంచి వైరస్ లీక్ కాలేదని తెలిపారు. తమ సభ్యుల్లో ఇప్పటికీ కరోనావైరస్ యాంటీబాడీలు లేవు' అని పేర్కొన్నారు. అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ఫ్యాక్ట్‌షీట్ మాత్రం

Navigating The Coronavirus

ISSUE No. 7
WSJ
EXTRA

Q&A

STUDENT LOANS: THE BASICS

What is happening with student loans?

A: The federal government is suspending monthly payments and interest accruals on most of the $1.5 trillion in federal student debt for half of this year.

As a result, from March 13 to Sept. 30, an eligible borrower's balance will be frozen, with no financial penalties.

షీ చెప్పిన మాటలు ఎంత వరకు నమ్మశక్యం అనే అంశంపై సందేహాలను వ్యక్తం చేసింది. ఈ ఫ్యాక్ట్‌షీట్‌లో చైనా ల్యాబ్‌ల్లో జరిగిన పలు ప్రమాదాలు, పీఎల్ఏతో కలిసి చేసిన పరిశోధనలను కూడా పేర్కొన్నారు.

నిపుణుల బృందానికి నో..

ప్రపంచ ఆరోగ్య సంస్థ పంపిన నిపుణుల బృందం చైనాలో 76,000 కొవిడ్ కేసుల్లో 92 మంది అక్టోబరు-డిసెంబరు మొదటి వారం మధ్యలో అస్వస్థకు గురైనట్లు గుర్తించింది. వారి డేటాను ఇవ్వాలని కోరగా చైనా తిరస్కరించింది. ఇక వుహాన్‌లోని బ్లడ్‌బ్యాంక్ నమూనాలు ఇవ్వాలని.. వాటిల్లో 2019 డిసెంబరు కంటే ముందు నమూనాలను పరిశీలిస్తామని పేర్కొంది. కాని, వ్యక్తుల ప్రైవసీకి భంగం కలుగుతుందని తొలుత పేర్కొంది. ఆ తర్వాత ఇచ్చేందుకు అంగీకరించినా.. ఆ నమూనాలు పరిశీలించే అవకాశం ఇప్పటి వరకూ నిపుణులకు కల్పించలేదు.

జన్యుమార్పిడితో పదేపదే విరుచుకుపడే అవకాశాలు?

కరోనా వైరస్ ఇప్పటితో పోయేది కాదనేది ప్రపంచవ్యాప్తంగా పలువురు శాస్త్రవేత్తల అంచనా. సరికొత్త జన్యుమార్పిడి (మ్యుటేషన్లు)తో పదేపదే మానవాళిపై విరుచుకుపడే అవకాశాలు ఉన్నాయని వారు అభిప్రాయపడుతున్న ప్రస్తుత తరుణంలో- ఈ తరహా మహమ్మారులను ఉగ్రమూకలు జీవాయుధాలుగా వినియోగించుకోకుండా ప్రపంచదేశాలు జాగ్రత్త వహించాల్సి ఉంది. భావితరాలకు ఇటువంటి మహమ్మారుల నుంచి నిరంతరం ముప్పు పొంచి ఉందనే హెచ్చరికల నేపథ్యంలో- ఇటువంటి సవాళ్లను ముందుగానే ఊహించి దీటుగా ఎదుర్కోవాలని నిపుణులు అంటున్నారు.

చైనా శాస్త్రవేత్తల సృష్టే.. బ్రిటన్, నార్వే శాస్త్రవేత్తల తాజా అధ్యయనం

కరోనా వైరస్ చైనా శాస్త్రవేత్తల సృష్టే అని తాజాగా బ్రిటన్, నార్వేకు చెందిన శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అది గబ్బిలాల నుంచి సహజంగా ఉద్భవించినట్లు కనిపించేలా రివర్స్ ఇంజినీరింగ్‌కు ప్రయత్నించినట్లు స్పష్టం చేశారు. ఈ కథనం బ్రిటన్‌కు చెందిన **'డైలీ మెయిల్'**లో ప్రచురితమైంది. పూర్తి నివేదిక త్వరలోనే సైంటిఫిక్ జర్నల్‌లో ప్రచురితమయ్యేందుకు సిద్ధమైంది.

కరోనా వైరస్ ల్యాబ్‌లోనే సృష్టించారనడానికి తమ దగ్గర ఆధారాలు ఉన్నాయని బ్రిటిష్ ప్రొఫెసర్ అంగూస్ డాల్‌గ్లిష్, నార్వే శాస్త్రవేత్త డాక్టర్ బిర్గర్ సొరెన్‌సెన్ తమ నివేదికలో పేర్కొన్నారు. ఆంకాలజీ ప్రొఫెసర్ అంగూస్ డాల్‌గ్లిష్ హెచ్ఐవీ వ్యాక్సిన్ రూపకల్పనలో విశేష కృషి చేస్తున్న వారిలో ఒకరు. వైరాలజిస్ట్‌గా ఉన్న సొరెన్‌సేన్ కరోనా వైరస్‌ను ఎదుర్కొనే 'బయోవాక్-19' వ్యాక్సిన్ రూపకల్పనలో కీలక వ్యక్తి.

ప్రత్యేక ముద్రలే ఆధారం?

వ్యాక్సిన్ పరిశోధనలో భాగంగా.. ఈ ఇద్దరు శాస్త్రవేత్తలు కరోనా వైరస్‌ను జన్యుక్రమాన్ని విశ్లేషించారు. కరోనా సహజ సిద్ధంగా ఉద్భవించింది కాదని చెప్పే 'ప్రత్యేకమైన ముద్రలు' గుర్తించారు. ధనావేశితం కలిగిన నాలుగు అమైనో ఆమ్లాలు ఒకే శ్రేణిలో ఉండడాన్ని వీరు ప్రముఖంగా ప్రస్తావించారు. కృత్రిమంగా తయారు చేస్తేనే ఇటువంటిది సాధ్యమవుతుందని వాదిస్తున్నారు. కరోనా వైరస్ సహజ ప్రక్రియలో ఉద్భవిందనడానికి ఉన్న అవకాశాలు తాము చేసిన పరిశోధనల్లో చాలా తక్కువగా కనిపించాయని అభిప్రాయపడ్డారు. అది గబ్బిలాల నుంచి సహజసిద్ధంగా వ్యాపించిందని చెప్పడానికి చైనా శాస్త్రవేత్తలు ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. ఇదే విషయాన్ని గతేడాది నుంచి చెబుతున్నప్పటికీ అంతర్జాతీయ సంస్థలు, మెడికల్ జర్నల్‌లు తమ నివేదికను పట్టించుకోలేదని వారు వాపోయినట్లు బ్రిటన్ మీడియా వెల్లడించింది. వీరి పరిశోధనకు సంబంధించిన 22 పేజీల పూర్తి నివేదిక త్వరలోనే ప్రచురితం కానుంది.

వుహాన్ మీద పెరుగుతున్న అనుమానాలు..

- కరోనా వైరస్ మూలాలపై మూడు నెలల్లో తేల్చి ఓ నివేదిక ఇవ్వాలని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అమెరికా ఇంటలిజెన్స్ విభాగాన్ని 2020 జూన్‌లో అదేశించారు. ఈ నిర్ణయాన్ని చైనా తప్పుబట్టింది.
- వైరస్ పుట్టుకపై దర్యాప్తు చేయాలనే ఒత్తిడి ప్రజల వైపు నుంచి రానీయకుండా కొందరు శాస్త్రవేత్తలు ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించినట్లు **న్యూయార్క్ టైమ్స్**లో తాజాగా ఓ కథనం ప్రచురితమైంది.
- కరోనా వైరస్ బాహ్య ప్రపంచంలోకి వ్యాపించక ముందే వుహాన్ ల్యాబ్‌లోని చాలా

మంది పరిశోధకులు అస్వస్థతకు గురైనట్లు **వాల్‌స్ట్రీట్ జర్నల్** కథనం వెల్లడించింది.

● చైనా శాస్త్రవేత్తలు జీవాయుధాల గురించి కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆస్ట్రేలియా మీడియా పేర్కొంది.

● కరోనా మూలాలపై ప్రపంచ ఆరోగ్య సంస్థ నేతృత్వంలోని బృందం జరిపిన అధ్యయన ఫలితాలు అస్పష్టంగా ఉండడంతో మరోసారి వీటిపై మరింత దృష్టి సారించాల్సి ఉందని డబ్ల్యుహెచ్‌వో చీఫ్ అభిప్రాయపడ్డారు. అంతకుముందు వెళ్లిన దర్యాప్తు బృందానికి చైనా అధికారులు సరైన సమాచారం అందించలేదనే ఆరోపణలు ఉన్నాయి.

● కరోనా మానవ తయారీ, వుహాన్ ల్యాబ్‌లోనే దాని మూలాలు అంటూ వచ్చే పోస్టులను తొలగిస్తున్న ఫేస్‌బుక్ తాజాగా వెనక్కి తగ్గింది. ఇకనుంచి మ్యాన్‌మేడ్ అంటూ చేసే పోస్టులను తొలగించబోమని.. ఈ విషయంలో తమ విధానాన్ని మార్చుకున్నామని ప్రకటించింది. ఇలా కరోనా మూలాలు మానవ సృష్టే అనే కోణంలో వెలువడుతున్న నివేదికలతో చైనాపై ఒత్తిడి పెరుగుతున్నట్లు అంతర్జాతీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

వైరస్ మూలాలపై దర్యాప్తు జరగాల్సిందే.. భారత్ డిమాండ్

చైనాలో కరోనా మూలాలపై సమగ్ర దర్యాప్తు జరపాల్సిందేనని భారత్ డిమాండ్ చేసింది. వైరస్ ఎలా ఏర్పడిందన్న అంశంపై దర్యాప్తు జరపాలని అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ తమ దేశ నిఘాసంస్థలను ఆదేశించడంతో ప్రపంచవ్యాప్తంగా కరోనా పుట్టుకకు సంబంధించిన వివరాలపై మరోసారి చర్చ మొదలైంది. అమెరికాతో పాటు ఆస్ట్రేలియా కూడా వుహాన్‌లో కరోనా పుట్టుకపై విచారణ జరపాలని కోరింది.

డబ్ల్యుహెచ్‌వో విచారణ మొదటి అడుగు మాత్రమే

కొవిడ్-19కు సంబంధించి వుహాన్‌లో ప్రపంచ ఆరోగ్యసంస్థ (డబ్ల్యుహెచ్‌వో) దర్యాప్తు జరిపింది. అయితే ఆ విచారణ సాగనీయకుండా చైనా అధికార యంత్రాంగం అడుగడుగునా అడ్డంకులు సృష్టించింది. ప్రపంచ ఆరోగ్యసంస్థ ఎట్టకేలకు విచారణను పూర్తిచేసింది. అందరూ ఊహించినట్లే గబ్బిలాల నుంచి వైరస్ ప్రబలి ఉంటుందని ఆ నివేదికలో వెల్లడించింది. ల్యాబ్‌లోంచి లీక్ అనేది వాస్తవం కాకపోవచ్చని పేర్కొంది. ఈ విచారణ మొదటి అడుగు మాత్రమేనని పూర్తిగా దర్యాప్తు జరిపితే అన్ని అంశాలు వెలుగులోకి వస్తాయని భారత్ పేర్కొంది. డబ్ల్యుహెచ్‌వో సభ్యుల బృందంలోని ఒకరు దీనిపై మాట్లాడుతూ వుహాన్‌లో తమ పరిశోధనల్లో గబ్బిలాల నుంచి ఒక జంతువుకు, అనంతరం మానవులకు సోకి ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ దర్యాప్తు మొదటి దశ మాత్రమేనని ఇంకా పలు దఫాలుగా విచారణ చేపట్టాలని ఆయన చెప్పడంతో చైనా మూలాలపై మరిన్ని అనుమానాలు పెరుగుతున్నాయి

వుహాన్‌పై 'డ్రాస్టిక్' చెప్పిన విషయాలు..

వుహాన్ ల్యాబ్ లీక్ విషయంలో ఒక ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ గ్రూప్ చైనాకు కొరకరాని కొయ్యగా మారింది. కొవిడ్-19 పుట్టుకపై అధ్యయనం చేసేందుకు ప్రపంచవ్యాప్తంగా నిపుణులు, ఉత్సాహవంతులు కలిసి దీనిని ఏర్పాటు చేశారు. డ్రాస్టిక్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ గ్రూపు.. వుహాన్‌కు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలు, పత్రాలను బహిర్గతం చేస్తోంది. దీనిలో కొందరు భారతీయులు కూడా ఉన్నారు. కొవిడ్ వెలుగులోకి రావడానికి మూడు నెలల ముందు వుహాన్ ల్యాబ్ వైరస్ డేటా బేస్‌ను ఆన్‌లైన్ నుంచి తొలగించడాన్ని ఈ గ్రూప్ ప్రశ్నిస్తోంది.

హ్యాకర్ల ముప్పుగా చెబుతున్న చైనా..

2019లో కరోనావైరస్ సమాచారాన్ని ఆన్‌లైన్ నుంచి చైనా తొలగించింది. అందులో 22,000 వైరస్ నమూనాల సమాచారం ఉంది. వీటి జన్యుక్రమాల వివరాలు కూడా ఉన్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ దర్యాప్తు బృందం వెళ్లినప్పుడు.. చైనా శాస్త్రవేత్త 'షీఝెంగ్ లీ'ని ఈ అంశంపై ప్రశ్నించినట్లు తెలుస్తోంది. దానికి ఆమె.. కరోనా మహమ్మారి ఉద్ధృతంగా ఉండటంతో ఆ సమాచారం కోసం హ్యాకర్లు యత్నాలు చేస్తున్నారనీ. ఆ కారణంగా ఆన్‌లైన్ నుంచి ఆ డేటాను తొలగించినట్లు పేర్కొన్నారు. వాస్తవానికి ఈ డేటాను 2019లో సెప్టెంబరులో తొలగించారు. అప్పుడు కొవిడ్19 గురించి ప్రపంచానికి తెలియదు కదా? హ్యాకర్లు ఆ సమాచారం కోసం ఎందుకు ప్రయత్నిస్తారు? లేకపోతే సెప్టెంబరులోనే 'షీఝెంగ్ లీ'కి వైరస్ వ్యాప్తి విషయం తెలిసి ఉండాలి అనే అనుమానాలు సహజంగానే తలెత్తుతున్నాయి. ఎందుకంటే కొవిడ్-19 చైనా చెబుతున్నట్లు డిసెంబరులో

మొదలు కాలేదని దాని జన్యుక్రమాన్ని విశ్లేషించిన శాస్త్రవేత్తలు పదేపదే చెబుతున్నారు.

చైనా సైన్యం చేతిలో ఆ ల్యాబ్?

వుహాన్ ల్యాబ్లో పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ జోక్యం ఎక్కువగానే ఉందని 2020 సంవత్సరంలో అమెరికాకు చెందిన **'ఎపోక్ టైమ్స్'** పత్రిక కథనం పేర్కొంది. ఆ కథనం ప్రకారం.. 2002లో సార్స్ వ్యాపించడంతో.. భవిష్యత్తులో ఇటువంటి వైరస్‌లను అడ్డుకోవడానికి పీ 4 ల్యాబ్ నిర్మించేందుకు సాయం చేయాలని 'ద చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' ఫ్రాన్స్‌ను కోరింది. నాటి ఫ్రాన్స్ ప్రధాని రాఫారిన్ అంగీకరించారు. ఫ్రాన్స్‌కు చెందిన ఆర్టీవీ అనే సంస్థ ఇంజినీరింగ్ బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. కానీ, దానిని తొలగించి చైనా సైన్యంతో సంబంధాలున్న ఐపీపీఆర్ అనే సంస్థకు బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత నుంచి అక్కడ బయోకెమికల్ ఆయుధాలపై ప్రయోగాలు జరుగుతున్నాయని ఫ్రాన్స్ అనుమానిస్తోందని ఈ కథనం పేర్కొంది.

వైరస్ లీకవ్వగానే సైన్యం రంగ ప్రవేశం..

వుహాన్‌లో కరోనావైరస్ వ్యాపించి.. జంతువుల నుంచి వచ్చిన అంటురోగంగా ప్రచారం జరుగుతున్న సమయంలోనే అక్కడి పీ 4 ల్యాబ్ నిర్వహణను పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ తన చేతుల్లోకి తీసుకొంది. వుహాన్‌లో వ్యాపించిన గుర్తుతెలియని న్యుమోనియా గురించిన వివరాలు ఎక్కడా మాట్లాడకూడదని 2020 జనవరి 2వ తేదీనే ల్యాబ్ డీజీ నుంచి అందరికీ ఆదేశాలు వెళ్లాయి. పైగా దానికి సంబంధించిన పరిశోధన పత్రాలు ప్రచురించవద్దని పేర్కొన్నారు. పక్షంరోజుల తర్వాత ఆ ల్యాబ్ పగ్గాలను పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ బయోకెమికల్ నిపుణురాలు చెన్ వుయ్ చేతికి ఇచ్చారు. తర్వాత వారంరోజులకే చైనాలో బయో సెక్యూరిటీ చట్టాన్ని పెడుతున్నట్లు అధ్యక్షుడు షీజిన్‌పింగ్ ప్రకటించారు. వైరస్ నమూనాల మొత్తాన్ని సీల్ చేసినట్లు వార్తలు వచ్చారు. ఆ ల్యాబ్‌లో పరిశోధకురాలిగా పనిచేసిన హువాంగ్ యాన్ లింగ్ వివరాలను ఇన్‌స్టిట్యూట్ వెబ్‌సైట్ నుంచి తొలగించారు. ఆమె తొలి పేషెంట్ అనే అనుమానాలు ఉన్నట్లు నాటి **'ఎపోక్ టైమ్స్'** కథనంలో పేర్కొంది. అలాగే వైరస్ వ్యాప్తి విషయాన్ని బాహ్య ప్రపంచానికి వెల్లడించిన డాక్టర్ లీ వెన్‌లియాంగ్ వంటి వారిని చైనా ప్రభుత్వం తీవ్రంగా వేధించింది. సరైన దర్యాప్తు జరిగి వాస్తవాలు తెలిసేవరకూ వుహాన్ ల్యాబ్‌పై అనుమానపు మేఘాలు కమ్ముకునే ఉంటాయి. కానీ చైనా ఇక్కడ ఎట్టి పరిస్థితుల్లో దర్యాప్తునకు అనుమతి ఇవ్వకపోవచ్చు!!



ఆధారాలు ఉన్నాయన్న మన శాస్త్రవేత్తల జంట

కరోనా వైరస్ చైనాలోని వుహాన్ ప్రయోగశాలలోనే పుట్టిందని భారత్‌లోని **పుణెకు చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ మొనాలీ రాహల్కర్, డాక్టర్ రాహుల్ బాహులికర్** కూడా చెబుతున్నారు.. తాము చేసిన పరిశోధనల్లో లభించిన ఆధారాల ద్వారా అది నిర్ధారణ అయిందని చెప్పారు. గనిలో దొరికిన ఓ వైరస్ జన్యుక్రమంలో చైనా శాస్త్రవేత్తలు మార్పులు చేస్తున్న క్రమంలో కరోనా ఉద్భవించి ఉంటుందని పేర్కొన్నారు. భార్యాభర్తలైన మొనాలీ, రాహుల్ 2021 జూన్‌లో ఓ వార్తాసంస్థతో వైరస్ పుట్టుకపై తమ పరిశోధనలకు సంబంధించిన కీలక విషయాలను వెల్లడించారు. కరోనా వైరస్ 'సార్స్-కొవ్-2' పుట్టుక మూలాన్ని తెలుసుకునేందుకు 2020 ఏప్రిల్‌లో మేం పరిశోధనలు ప్రారంభించాం. సార్స్-కొవ్-2కు దగ్గరి బంధువుగా పరిగణించే 'ఆర్ఏటీజీ 13' వైరస్, 2012లో చైనాలో చోటుచేసుకున్న కొన్ని పరిణామాలు మా దృష్టిని ఆకర్షించాయి. ఆ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాం. దక్షిణ చైనాలోని మొఝియాంగ్‌లో వాడుకలో లేని ఓ రాగి గని ఉండేది. అందులో పేరుకుపోయిన గబ్బిలాల విసర్జితాలను తొలగించే బాధ్యతలను 2012లో ఆరుగురికి అప్పగించారు. ఆ విసర్జితాలను తాకినా, వాటిపై నడిచినా వాటి రేణువులు కొన్ని వాతావరణంలో కలుస్తాయి. అవి అలర్జీకి కారణమవుతాయి.

అన్నీ కొవిడ్ లక్షణాలే..

గనిలో గబ్బిలాల విసర్జితాలను తొలగించిన ఆరుగురు కార్మికులు కొన్నాళ్లకే తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. ప్రస్తుతం కొవిడ్ బాధితుల్లో ఉన్నట్లే.. జ్వరం, దగ్గు, రక్తం గడ్డకట్టడం

వంటి లక్షణాలు వారిలో కనిపించాయి. అలసట, న్యుమోనియాను కూడా వారిలో వైద్యులు గుర్తించారు. వారి రేడియోలాజికల్ రిపోర్టులు, సీటీ స్కాన్లు ఇప్పుడు కొవిడ్ బాధితులవి ఉన్నట్లే ఉన్నాయి. తర్వాత బ్లాక్ ఫంగల్ ఇన్‌ఫెక్షన్లూ బయటపడ్డాయి. నాడు బాధితులకు అందించిన ఔషధాలు- ప్రస్తుతం కొవిడ్ చికిత్సలో వినియోగిస్తున్న తరహావే. యాంటీవైరల్ యాంటీబయోటిక్ మందులను కూడా ఇచ్చారు. పరిస్థితి విషమించడంతో బాధితుల్లో ముగ్గురు మృతిచెందారు. గనిలో పనిచేసిన ఆరుగురికీ 'ఆర్ఏటీజీ13' సోకినట్లు నిర్ధారణ అయింది.

కొంపముంచిన ప్రయోగాలు!

వుహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ శాస్త్రవేత్తలు మొఝియాంగ్ గని నుంచి 'ఆర్ఏటీ జీ13'ను సేకరించారు. ప్రయోగాల్లో భాగంగా వారు వైరస్ జన్యుక్రమంలో మార్పులు చేసి నట్లు అనుమానాలు ఉన్నాయి. ఆ మార్పుల వల్లే కరోనా అవతరించి ఉండొచ్చు. మనుషు లకు నేరుగా, వెంటనే సోకేలా దాని నిర్మాణం ఉంది. ప్రయోగశాలలోనే వైరస్ రూపుదిద్దు కొని ఉండొచ్చని ఆ గుణాలు సూచిస్తున్నాయి. సముద్ర జీవులను విక్రయించే మార్కెట్ నుంచి సార్స్-కొవ్-2 పాకిందని ఎక్కువగా ప్రచారం జరుగుతోంది. కానీ దాన్ని నిర్ధారించే ఆధారాలేవీ లేవు అని పుణే శాస్త్రవేత్తల దంపతులు చెబుతున్నారు.

వుహాన్ వ్యూహంలో ఫౌచీ?

కరోనా వైరస్ వుహాన్ ల్యాబ్ నుంచి బయటకు వచ్చి ఉండొచ్చనే వాదనలు బలపడేకొద్దీ అమెరికాకు చెందిన అంటువ్యాధుల చికిత్స నిపుణుడు ఆంటోనీ ఫౌచీపై స్వదేశంలోనే విమ ర్శలు పెరిగిపోతున్నాయి. రిపబ్లికన్లు అయితే ఆయనను ఓ అబద్ధాలకోరుగా దుమ్మెత్తి పోస్తు

న్నారు. 2021 సంవత్సరంలో ఫౌచీ ఈ మెయిల్స్ కొన్ని బహిర్గతం కావడంతో వారు ఆరో పణలను తీవ్రతరం చేశారు. కరోనా పుట్టుక విషయంలో చైనాను సమర్థించేలా గతంలో ప్రకటనలు చేసి అమెరికన్లను తప్పుదారి పట్టించారని, ఆయనపై చట్టసభల సభ్యుల కమిటీతో విచారణ జరిపించాలనీ రిపబ్లికన్ పార్టీకి చెందిన సెనెటర్ జోష్ హావ్‌లే కోరారు. వుహాన్ ల్యాబ్‌లో ఏం జరిగిందో నిజంగా ఆయనకు తెలియదా? లేదా అన్నీ తెలిసే.. అబద్ధాలు చెప్పారా? అని వారు అనుమానాలను వ్యక్తంచేస్తున్నారు.

ఫౌచీ ఈ-మెయిల్స్ బహిర్గతం

ఇటీవల సమాచార స్వేచ్ఛ కింద ఫౌచీ ఈ మెయిల్స్ కొన్ని బహిర్గతం అయ్యాయి. తొలినాళ్లలో ల్యాబ్ లీక్ సిద్ధాంతాన్ని బలంగా వ్యతిరేకించిన ఫౌచీ.. ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ 'వుహాన్ ల్యాబ్ నుంచి వైరస్ లీకయ్యే అవకాశాలను కొట్టిపారేయలేం' అని అన్నారు. కరోనా వ్యాపించిన తొలినాళ్లలో డాక్టర్ ఫౌచీకి.. ఇమ్యూనాలజిస్టు క్రిస్టియన్ అండర్సన్ ఒక ఈమెయిల్ పంపించారు. అందులో 'కరోనా వైరస్‌కు ఉన్న అసాధారణ లక్షణాలు చూస్తుంటే దీనిని ల్యాబ్ సెట్టింగ్స్‌లో మార్చారేమో అనిపిస్తోంది' అని పేర్కొన్నారు. కానీ తర్వాత ఆయనే ల్యాబ్ లీక్ సిద్ధాంతానికి ఆధారాల్లేవు అంటూ పత్రాన్ని సమర్పించారు. ఈ వైరస్ సహజంగానే జంతువుల నుంచి మనుషుల్లోకి వ్యాపించిందనే వాదనలను అప్పట్లో బలపరిచిన డాక్టర్ ఫౌచీ తాజాగా ల్యాబ్ లీక్‌పై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అక్కడ మేమనుకున్నట్లే అన్నీ జరగవు..

2020 ఫిబ్రవరిలో డాక్టర్ ఫౌచీ తన సహాయకుడు హ్యూజ్ ఔచిన్‌క్లోస్‌కు ఒక మెయిల్ పంపారు. అందులో కరోనా వైరస్‌లపై చేసిన గెయిన్ ఆఫ్ ఫంక్షన్స్ (మ్యుటేషన్స్)పై పరిశోధన పత్రం ఉంది. దానికి అతను స్పందిస్తూ.. 'విదేశాల్లో జరిగిన ఈ పరిశోధనకు మనకు ఏమైనా సంబంధాలు ఉన్నాయేమో తెలుసుకుంటాను' అని పేర్కొన్నారు. ఎన్ఐహెచ్ నిధులను కరోనా వైరస్ పరిశోధనలకు వెచ్చించడంపై 'న్యూస్ నేషన్ నౌ' కార్యక్రమంలో ఫౌచీ స్పందించారు. తాము 'నమూనాల సేకరణకు' మాత్రమే ఎకో హెల్త్ ఫౌండేషన్‌కు నిధులు సమకూర్చామని వెల్లడించారు. కానీ, వుహాన్ ల్యాబ్‌లో అన్నీ మేము అనుకున్నట్లే జరుగుతాయని హామీ ఇవ్వలేనని తెలిపారు. తన ఈమెయిల్స్‌ను తప్పుగా అన్వయించుకొంటున్నారని పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్.. 'నేను అప్పుడే చెప్పాను. కరోనా వైరస్ వెనుక చైనా కుట్ర ఉందని. ఆ మాటే నిజమైంది' అని వ్యాఖ్యానించారు. డాక్టర్ ఫౌచీ సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు చాలా ఉన్నాయని ట్రంప్ పేర్కొన్నారు.

అయితే అంటువ్యాధుల నిపుణుడిగా ఫౌచీ అనేకమంది శాస్త్రవేత్తలతో మాట్లాడుతుంటారని, అంతమాత్రాన ఆయనను వుహాన్ ల్యాబ్ కుట్రలో భాగస్వామిని చేయడం తగదని కొందరు అంటున్నారు. కరోనా కట్టడి విషయంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫౌచీతో తరచూ విభేదించి అభాసుపాలయ్యారు. ట్రంప్ మాదిరిగా ఫౌచీ చైనాపై నిరాధారమైన విమర్శలను చేయలేదు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే బైడెన్ వైరస్ వ్యాప్తికి విజయవంతంగా అడ్డుకట్టవేయగలిగారు. ఫౌచీ సూచనలు, సలహాలతోనే ఇది సాధ్యమైంది. ప్రజల్లో బైడెన్, ఫౌచీల పలుకుబడి ఏమాత్రం తగ్గలేదు. ఈ నేపథ్యంలో తాజాగా వెలుగులోకి వచ్చిన ఈమెయిల్స్‌ను అవకాశంగా మలచుకొని రిపబ్లికన్ నేతలు ఫౌచీపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్ని విమర్శలు వచ్చినప్పటికీ డాక్టర్ ఫౌచీకి మద్దతుగానే నిలుస్తామని శ్వేత సౌధం స్పష్టం చేసింది. దేశానికి ఆయన ఓ తరగని ఆస్తి లాంటివారని ప్రశంసించింది. బైడెన్ కూడా ఫౌచీపై పూర్తి విశ్వాసాన్ని వ్యక్తంచేశారు.

కరోనా మూలాలను 'చెరిపేస్తున్న' చైనా!

కరోనా వైరస్ వుహాన్ ల్యాబ్ నుంచే లీక్ అయిందనే అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. అందుకు బలాన్నిచ్చే సమాచారాన్ని కప్పిపుచ్చేందుకు చైనా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా కరోనా జన్యుక్రమానికి సంబంధించిన తొలినాళ్ల నివేదికలను అంతర్జాతీయ డేటాబేస్ నుంచి చైనా తొలగిస్తున్నట్లు సమాచారం. కొవిడ్ మూలాలపై ప్రపంచ ఆరోగ్య సంస్థ మరోసారి దర్యాప్తునకు సిద్ధమవుతోన్న వేళ చైనా యత్నాలను అమెరికా శాస్త్రవేత్తలు మరోసారి బయటపెట్టారు. కరోనా వైరస్ విజృంభించిన తొలినాళ్లలో చైనా విడుదల చేసిన వైరస్ టెస్ట్ సీక్వెన్సులను అంతర్జాతీయ డేటాబేస్‌ల నుంచి తొలగిస్తున్నట్లు అమెరికాలో ప్రముఖ వైరాలజిస్ట్ జెస్సీ బ్లూమ్ తెలిపారు. ముఖ్యంగా కరోనా మూలాలు కనిపించకుండా చేసేందుకే నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ (ఎన్ఐహెచ్)కు సంబంధించిన 'సీక్వెన్స్ రీడ్ ఆర్కైవ్' నుంచి వాటిని తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. వైరస్ వెలుగుచూసిన సమయంలో వుహాన్‌లో నమోదైన కేసులకు సంబంధించిన నమూనాల సమాచారమే తొలగించిన వాటిలో ఎక్కువగా ఉందన్నారు. కొవిడ్ మూలాలు, విస్తృతిని అర్థం చేసుకోవడంలో అత్యంత కీలకమైన ఇటువంటి డజనుకుపైగా నివేదికలను చైనా తొలగించినట్లు తెలిపారు. వైరస్ పరిణామ క్రమంపై గందరగోళం సృష్టించడానికే ఈ పన్నాగాలు పన్నినట్లు భావిస్తున్నామన్నారు. వుహాన్‌లోని స్థానిక మార్కెట్‌లో కరోనా వైరస్ వెలుగుచూడక ముందే నగరంలో పలుచోట్ల వైరస్ ఆనవాళ్లు ఉన్నాయని పేర్కొన్నారు.

అమెరికా చేతిలో 'వుహాన్' రహస్యాలు?

చైనా ప్రభుత్వంలోని ఉన్నతస్థాయి అధికారి ఒకరు ప్లేటు ఫిరాయించి, అమెరికా పంచన చేరినట్లు 2021 జూన్‌లో వార్తలు గుప్పుమన్నాయి. వుహాన్‌లోని వివాదాస్పద వైరాలజీ ల్యాబ్ నుంచి కరోనా వైరస్ లీకైందనడానికి ఆధారాలనూ బైడెన్ సర్కారుకు అందించినట్లు ప్రచారం జరుగుతోంది. అందువల్లే ఈ మహమ్మారి మూలాలపై అమెరికా కొత్తగా దృష్టి పెట్టి, విచారణకు ఆదేశించినట్లు సమాచారం. సదరు అధికారికి చైనాలోని గూఢచర్య విభాగాలు, భద్రత వ్యవస్థలతో గట్టి సంబంధం ఉంది. ఆయన ప్లేటు ఫిరాయించిన మాట నిజమే అయితే చైనా గూఢచారి విభాగానికి, రహస్య కార్యకలాపాలకు ఎదురు దెబ్బ తగిలినట్లే. ఆ అధికారి పేరు డాంగ్ జింగ్‌వెయ్. చైనా మినిస్ట్రీ ఆఫ్ స్టేట్ సెక్రటరీ విభాగంలో వైస్ మినిస్టర్.

నిజానికి ఇది 'గువాన్‌బు' అనే గూఢచర్య సంస్థ. శత్రు గూఢచర్య కార్యకలాపాలను తిప్పికొట్టడానికి ఉద్దేశించిన కౌంటర్ ఇంటెలిజెన్స్ ఆపరేషన్లకు ఆయన 2018 ఏప్రిల్ నుంచి నేతృత్వం వహిస్తున్నారు. కొంతకాలంగా ఆయన ఆచూకీ తెలియడంలేదని చైనా సామాజిక మాధ్యమాల్లో జోరుగా వార్తలు వచ్చాయి. తర్వాత.. ఆయన అమెరికాకు పరారైనట్లు ప్రచారం మొదలైంది. అమెరికాకు వలస వెళ్లిన చైనా విదేశాంగ శాఖ మాజీ అధికారి, ప్రజాస్వామ్య అనుకూలవాది హన్ లియాంచావో 2021 జూన్ 16న చేసిన ట్వీట్‌తో ఈ అంశం వెలుగులోకి వచ్చింది. చైనాలో తియానన్మెన్ స్క్వేర్ ఊచకోత తర్వాత హన్.. అమెరికాకు పారిపోయారు. డాంగ్ అదృశ్యంపై డ్రాగన్ కూడా ఆందోళన చెందుతోంది. .

అప్పగించాలన్న చైనా.. అమెరికా ససేమిరా

తన కుమార్తె డాంగ్ యాంగ్‌తో కలిసి హాంకాంగ్ మీదుగా 2021 ఫిబ్రవరిలో డాంగ్ అమెరికాకు చేరుకొన్నట్లు హన్ పేర్కొన్నారు. ఆయన కథనం ప్రకారం.. మార్చిలో అలాస్కాలో జరిగిన అమెరికా-చైనా సమావేశంలో డాంగ్ అంశం ప్రస్తావనకు వచ్చింది. ఆయనను అప్పగించాలని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకన్, జాతీయ భద్రత సలహాదారు జాక్ సలైవాన్‌ను చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యి కోరారు. ఈ అభ్యర్థనను అమెరికా తోసిపుచ్చింది.

అమెరికాలో గూఢచర్యం, విదేశాంగ విధానాలపై కథనాలు రాసే **'స్పై టాక్'** న్యూస్ లెటర్ కూడా డాంగ్ ఫిరాయించి ఉండొచ్చని పేర్కొంది. అది నిజమైతే చైనా చరిత్రలోనే అతిపెద్ద 'వెన్నుపోటు' అవుతుందని వ్యాఖ్యానించింది. మరికొన్ని అమెరికా పత్రికలు కూడా డాంగ్ చైనా నుంచి పారిపోయినట్లు కథనాలను ప్రచురించాయి. ప్రస్తుతం ఆయన 'అమె

రికా డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ' (డీఐఏ) అదుపులో ఉన్నట్లు పేర్కొన్నాయి. ఈ నేప థ్యంలో వుహాన్ ల్యాబ్‌లో జీవాయుధ పరిశోధనలకు సంబంధించిన ఆనవాళ్లను చైనా సర్కారు చెరిపేస్తున్నట్లు పేర్కొన్నాయి.

డ్రాగన్ ప్రత్యేక ఆయుధ వ్యవస్థలు, వుహాన్ ల్యాబ్‌లో చైనా సైన్యం కార్యకలాపాలు, కొవిడ్ కారక సార్స్-కొవ్-2 వైరస్ మూలాలు, అమెరికాలో ఉన్న చైనా వేగుల వివరాలు తది తరాలపై డాంగ్‌కు పూర్తి సమాచారం ఉంది. వీటికి సంబంధించి 'టెరాబైట్ల కొద్దీ డేటా'ను ఆయన డీఐఏకు అందించినట్లు **'రెడ్ స్టేట్'** పత్రిక పేర్కొంది.

స్వదేశంలోనే ఉన్నారంటున్న చైనా

డాంగ్ అంశంపై చైనా అధికారికంగా స్పందించలేదు. కానీ ఆ దేశ పత్రికల్లో మాత్రం 2021 జూన్ 18న డాంగ్ ఒక కౌంటర్ ఇంటెలిజెన్స్ సదస్సులో పాల్గొన్నట్లు అధికార కమ్యూ నిస్టు పార్టీ మద్దతున్న వార్తా వెబ్‌సైట్ ఒకటి పేర్కొంది. విదేశీ శక్తుల తరపున పనిచేస్తున్న నమ్మకద్రోహుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించినట్టు డాంగ్ పేర్కొన్నట్లు తెలిపింది.

చైనా 10 లక్షల కోట్ల డాలర్లు చెల్లించాల్సిందే.. ట్రంప్

కరోనా మూలలపై పరిశోధనలు మరోసారి చైనా వైపు వేలు చూపిస్తున్న వేళ.. అమె రికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2021 జూన్‌లో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొవిడ్‌తో జరిగిన నష్టానికి చైనా నుంచి అమెరికా సహా ప్రపంచ దేశాలు పరిహారాన్ని డిమాండ్ చేయా లని పిలుపునిచ్చారు. "కనీసం 10 ట్రిలియన్ (10 లక్షల కోట్ల) డాలర్లను చైనా పరిహారం కింద చెల్లించాలి. ఆ దేశం చేసిన నష్టం కంటే ఈ మొత్తం చాలా తక్కువ. ఎన్నో దేశా లను అది నాశనం చేసింది. దానికి బాకీ ఉన్న దేశాలు తమ అప్పును, పరిహారం సొమ్ములో 'డౌన్‌పేమేంట్'గా భావించి రద్దు చేసుకోవాలి" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అన్ని చైనా వస్తువులపైనా అమెరికా 100 శాతం పన్నులు విధించాలని సూచించారు. దీంతో చైనా సైనిక సామర్థ్య పెంపునకు అడ్డుకట్ట వేయడమే కాక ఎన్నో కంపెనీలు తిరిగి అమెరికా వస్తా యని అన్నారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ను చైనా లెక్క చేయదని ఆయన వ్యాఖ్యా నించారు. బైడెన్ ప్రభుత్వంపైనా ట్రంప్ పలు ఆరోపణలు చేశారు.

కరోనా కథలో ట్విస్ట్..

అమెరికాపై చైనా ఎదురుదాడి

అమెరికాలో 2019 డిసెంబరు ప్రారంభంలోనే కరోనా కేసులు వెలుగు చూసినట్టు అక్కడి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్స్ (ఎస్ఐహెచ్) సంస్థ అధ్యయనంలో బయటపడటంతో కరోనా కథ కీలక మలుపు తిరిగింది. ఈ నివేదికను ప్రస్తావించిన చైనా శాస్త్రవేత్త ఒకరు కరోనా పుట్టుకపై జరిగే తదుపరి దర్యాప్తును అమెరికాలోనూ చేపట్టాంటూ ఎదురుదాడికి దిగడం తాజా సంచలనం! అమెరికా ఎన్ఐహెచ్ ప్రచురించిన అధ్యయనం ప్రకారం.. దేశంలో కరోనా తొలి కేసు రికార్డుల్లోకి ఎక్కకమునుపే ఐదు రాష్ట్రాల్లో కనీసం ఏడు కరోనా కేసులు నమోదయ్యాయి. తొలి కేసు రికార్డుల్లోకి నమోదవడానికి కొన్ని వారాల మునుపే అమెరికాలో కరోనా వ్యాప్తి ఉన్నట్టు ఈ అధ్యయనం తేల్చింది.

ఈ పరిమాణంపై చైనా అంటువ్యాధుల నిరోధక సంస్థ చీఫ్ జెంగ్ గువాంగ్ స్పందిస్తూ సంక్షోభం తొలినాళ్లలో అమెరికా కరోనా నిర్ధారణ పరీక్షలు తక్కువగా నిర్వహించిందని ఆయన తెలిపారు. అంతేకాకుండా.. సూక్ష్మజీవులపై పరిశోధనలు జరిపే బయోసేఫ్టీ ల్యాబ్స్ అమెరికాలోనే ఎక్కువగా ఉన్నాయంటూ ప్రస్తావించిన ఆయన కరోనా మూలాలపై అగ్రరాజ్యంలోనూ దర్యాప్తు జరగాలని కోరారు. కరోనా పుట్టుకకు మూలాలు అనేకం ఉన్నాయనే విషయాన్ని తాజా అధ్యయనం రుజువు చేసిందని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి కూడా వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో ప్రపంచ దేశాలు ప్రపంచ ఆరోగ్య సంస్థకు సహకరించాలని కూడా ఆయన కోరారు. కరోనా పుట్టుకకు చైనాలో జరిగిన రహస్య పరిశోధనలే కారణమని అనేక దేశాలు అనుమానిస్తున్న సమయంలో ఈ పరిణామానికి అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది.

ఆర్థికంగా బలీయమైన చైనా, అమెరికా పరస్పర ఆరోపణలు సమస్యను మరింత జటిలం చేస్తున్నాయనేది మాత్రం వాస్తవం!



మానవ చరిత్రలో ఎన్నో మహమ్మారులు

మనిషి స్వార్థం కోసం, సామ్రాజ్యవాదం కోసం జీవాయుధాలను తయారుచేస్తుండగా.. మానవాళి మేరమీరినతనాన్ని అడ్డుకోడానికి అప్పుడప్పుడు ప్రకృతే అంటువ్యాధులతో వికటాట్టహాసం చేసి మానవుడిని కట్టడిలో పెడుతుందా? నిజమేనేమో!!

మానవ సమాజం, నాగరికత విస్తరిస్తున్నాయి. అనేక రూపాల్లోకి మారుతున్నాయి. కంటికి కనిపించని సూక్ష్మజీవులు కూడా అదే స్థాయిలో రూపాంతరం చెందుతూ ఎన్నో భయంకరమైన అంటువ్యాధుల రూపంలో మానవాళిని వెంటాడుతూనే ఉన్నాయి. కొన్నిసార్లు ప్రపంచగతిని కూడా మార్చేస్తున్నాయి. చరిత్ర పూర్వ కాలం నుండి ఇప్పటి వరకు ఎన్నోరకాల అంటువ్యాధులు ఈ భూమండలాన్ని చుట్టుముట్టాయి. ఎక్కడో ఆఫ్రికాలో పుట్టిన మనిషి మెరుగైన జీవనాన్ని వెతుక్కుంటూ ఖండతరాలకు ప్రయాణించి భూమండలం మొత్తానికి వ్యాపించాడు. గుహల్లో పెరిగిన ఆదిమానవుడి కాలం నుంచి నేటి ఆధునిక మానవుడి వరకు ఆహారపు అలవాట్లలో గణనీయమైన మార్పులు వచ్చాయి. ప్రకృతిని జయించాలనే లక్ష్యంతో, సంపదను పోగేసుకొనే దురాశతో మనిషి ప్రకృతిని, సహజ వనరులను కొల్లగొడుతూ పర్యావరణ సమతుల్యతను ధ్వంసం చేస్తున్నాడు. కుక్కలు, మేకలు, పందులు, పశువులను పెంపుడు జంతువులుగా చేసుకున్నాడు. ఎలుకలు, బొద్దింకలు, దోమలు, గబ్బిలాల నుంచి అడవి జంతువుల వరకు అన్నింటితోనూ మమేకమైపోయాడు. మనిషి అడవుల్లోకి చొరబడి వన్యప్రాణులతో ఇంతకుముందెన్నడూ లేనంతగా కలిసిపోతుండడంతో వాటి నుంచి రకరకాల వైరస్‌లు మానవాళిలోకి చొరబడుతున్నాయి.

చరిత్ర పుటలు తిరగేస్తే కొత్త కొత్త వైరస్‌లతో రకరకాల రోగాలు పుట్టుకొచ్చి మనిషిని



వణికిస్తున్న ఉదంతాలు ఎన్నో కనిపిస్తాయి. వైరస్‌లు రూపం మార్చుకుంటూ మానవాళిపై దాడులు చేస్తూనే ఉన్నాయి. ఒకప్పుడు మనుషుల దూర ప్రయాణాలు చాలా పరిమితంగానే ఉండేవి. అందువల్ల మనిషి నుంచి మనిషికి సంక్రమించే అంటువ్యాధులు ఆయా ప్రాంతాలకే పరిమితమయ్యేవి. శాస్త్ర సాంకేతిక రంగాల్లో వచ్చిన విప్లవాత్మక మార్పు, ప్రపంచీకరణ పర్యవసానంగా ప్రపంచ స్వరూపమే మారిపోయింది. ఫలితంగా ప్రాణాంతకమైన అంటువ్యాధుల వ్యాప్తి కూడా అంతే వేగంగా సాగిపోతోంది.

● **ప్లేగు వ్యాధి (ఎలుకల ద్వారా వ్యాపించే వ్యాధి):** రోమ్‌లోని కాన్‌స్టంట్‌నోపుల్, ఈజిప్ట్ నుండి మధ్యధరా సముద్రం మీదుగా ఐరోపా, ఆసియా, ఉత్తర ఆఫ్రికా, అరేబియా ప్రాంతాలకు ఎలుకల ద్వారా కార్చిచ్చులా వ్యాపించిన ప్లేగు వ్యాధి ఆనాటి ప్రపంచ జనాభాలో దాదాపు సగంమందిని అంటే.. మూడు నుండి ఐదు కోట్ల మంది ప్రజల ప్రాణాలను బలిగొన్నదని అంచనా.

● **బ్లాక్ డెత్ (గజ్జలలో బిళ్లలు కట్టడం):** ప్లేగు వ్యాధిని వ్యాప్తి చేసే సూక్ష్మజీవులు అంతరించి పోలేదు. 800 సంవత్సరాల అనంతరం తిరిగి క్రీస్తుశకం 1347లో బ్లాక్ డెత్ రూపంలో ఐరోపాను కబళించాయి. నాలుగేళ్లలో 20 కోట్లమంది ప్రాణాలను బలిగొన్నదని చరిత్ర చెబుతోంది. అప్పట్లో ఆ అంటువ్యాధిని నిరోధించే శాస్త్రీయ పరిజ్ఞానం లేదు. రాకపోకలు పెరగడం వల్ల ఇది ఒకరి నుండి మరొకరికి సోకుతోందని గమనించడంతో కొత్తగా తీరానికి చేరిన నావికులను నెల రోజులకు పైగా ఒంటరిగా ఉంచి, వారికి ఎలాంటి అనారోగ్యం లేదని నిర్ధారించుకున్నాకే అనుమతించే వారు. అలా అప్పటి నుంచే క్వారంటైన్/ దిగ్బంధం అనే విధానం అమల్లోకి వచ్చింది.

● **గ్రేట్ ప్లేగ్ ఆఫ్ లండన్:** బ్లాక్‌డెత్ తర్వాత 1348 -1665 మధ్య, రెండేసి దశాబ్దాలకు ఒకసారి చొప్పున దాదాపు 40 సార్లు అంటువ్యాధులు ప్రబలాయి. ప్రతిసారి బ్రిటన్ రాజధాని లండన్ జనాభాలోని 20 శాతంమంది మృత్యువాతపడ్డారు. వ్యాధిగ్రస్తులను వేరు చేసి

ఒంటరిగా దిగ్బంధంలో ఉంచడానికి వీలుగా 1500 సంవత్సరం ప్రారంభంలోనే తొలిసారిగా శాసనాన్ని రూపొందించి, బ్రిటిష్ ప్రభుత్వం అమలు చేసింది. 1665-66లో గ్రేట్ ప్లేగ్ ఆఫ్ లండన్ ఏడు నెలల కాలంలో లక్షమందిని బలిగొని అత్యంత విషాదకరమైనదిగా చరిత్రలో నిలిచిపోయింది.

● 1545-48 కాలంలో కోకోలిజ్ట్ లీ అంటువ్యాధి మెక్సికో, మధ్య అమెరికా, 16వ శతాబ్దంలో అమెరికన్ ప్లేగు, గ్రేట్ ప్లేగ్ ఆఫ్ మార్సీల్లే (1720-23) ఫ్రాన్స్, రష్యన్ ప్లేగు (1770-72), ఫిలడెల్ఫియా ఎల్లో ఫీవర్ (1793), ఫ్లూ (1889-90) వ్యాపించాయి. వీటన్నింటి కారణంగానే అంటువ్యాధుల నిరోధక చట్టం -1897 (ద ఎపిడెమిక్ డిసీజ్ యాక్ట్) రూపుదిద్దుకుంది.

● **స్మాల్ పాక్స్ (మశూచి/అమ్మవారు):** ఐరోపా నుండి ప్రబలిన ఈ అంటువ్యాధి మహమ్మారిగా మారి ప్రపంచాన్ని సర్వనాశనం చేసింది. ఐరోపా, ఆసియా, అరబిక్‌లలో మశూచి శతాబ్దాలపాటు స్థానిక వ్యాధిగా మారిపోయింది. క్రీస్తుశకం 18వ శతాబ్దంలో మశూచి వైరస్‌కు వాక్సిన్ కనుగొన్నారు. 1980ల నాటికి మశూచిని పూర్తిగా నిర్మూలించామని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది.

● **కలరా:** ఈ వ్యాధి 19వ శాతాబ్దం తొలినాళ్లలో, భారతదేశంలోని గంగా నదీ తీరంలో కలరా పుట్టి, ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందని చెబుతారు.. ప్రతి ఏటా పదుల వేల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయని పరిశోధకుల అంచనా. తాగునీటి ద్వారా సంక్రమించే ఈ అంటువ్యాధిని అభివృద్ధి చెందిన దేశాల్లో పూర్తిగా నిర్మూలించినప్పటికీ తృతీయ ప్రపంచ దేశాలను ఇంకా వెంటాడుతూనే ఉంది.

● **అమెరికన్ పోలియో (1916):** ఈ వ్యాధి ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ప్రాణాలను బలి తీసుకుంది. మరెందరినో వికలాంగులుగా మార్చింది. న్యూయార్క్‌లోని రాక్ ఫెల్లర్ ఇన్‌స్టిట్యూట్ నుండి పోలియో వైరస్ తప్పించుకొని ఉండవచ్చన్న అనుమానాలున్నాయి. .

● **ఇన్‌ఫ్లుయెంజా (విషపడిశం):** 1918-1920: మొదటి ప్రపంచ యుద్ధం ముగింపు సమయంలో ఈ అంటువ్యాధి ప్రబలింది. ఐరోపా, అమెరికా, పసిఫిక్ ప్రాంతాలలో వ్యాపించింది. స్పానిష్ ఫ్లూగా కూడా పిలిచే ఈ వైరస్ పుట్టుక ఎక్కడో నిర్ధారించలేకపోయారు. ప్రపంచ జనాభాలో దాదాపు మూడో వంతు జనాభాకు సోకింది. కోటీ డబ్బై లక్షల నుండి ఐదు కోట్ల మంది మరణించి ఉండవచ్చని భావించారు. వ్యాధిగ్రస్తుల ఊపిరితిత్తుల కణాలను సేకరించి, జన్యుపరమైన పరీక్షలు నిర్వహించి ఇది పక్షి జాతుల నుండి మనుషులకు సోకి ఉండవచ్చని నిర్ధారణకు వచ్చారు. అడవుల్లోని జలపాతాలు ఆ సూక్ష్మ క్రిములకు నిలయాలని పేర్కొన్నారు.

● ఆధునిక యుగంలో ప్రపంచాన్ని గడగడలాడిస్తూ.. లైంగిక సంపర్కం ద్వారా ఖండాంతరాలకు వ్యాపించిన అంటువ్యాధి ఎయిడ్స్. నిజానికి 1920 దశకంలోనే పశ్చిమ ఆఫ్రికాలో హెచ్.ఐ.వి. (హ్యూమన్ ఇమ్యునో డిఫిషియెన్సీ వైరస్) లక్షణాలను పోలిన



వైరస్ ఉందని, 1981 నాటికి అది హెచ్.ఐ.వి./ఎయిడ్స్ (అక్వర్డ్ ఇమ్యునో డిఫిషియెన్సీ సిండ్రోమ్) రూపంలో ప్రపంచ మానవాళిలో ఎంతోమందిని కబళించిందని వైరాలజిస్టులు నిర్ధారించారు.

- **హెచ్1ఎన్1 స్వైన్ ఫ్లూ (2009-10):** మెక్సికోలో పుట్టి, విస్తరించింది.
- **ఎబోలా వైరస్:** 2013-16 పశ్చిమ ఆఫ్రికా, గుయానాలో పుట్టి ఉండవచ్చని అంచనా. నేటికీ నిర్ధారణ కాలేదు. గబ్బిలం నుండి మనిషికి సోకినట్లుగా అనుమానం. తరువాత మనిషి నుండి మనిషికి వ్యాప్తి చెందింది. ఇటలీ, స్పెయిన్, యూకే., అమెరికా వరకు వ్యాపించింది. కాకపోతే చాలా దేశాల్లో తక్కువ కేసులు నమోదయ్యాయి. మొత్తం 11,310 మరణాలు సంభవించినట్లు నిర్ధారించినా, అంతకంటే ఎక్కువే ఉండవచ్చనేది కొందరి వాదన.
- **హెచ్2ఎన్2 (ఏషియన్ ఫ్లూ):** 1957-58 కాలంలో ప్రపంచవ్యాప్తంగా మహమ్మారిగా మారి పది లక్షల మందిని కబళించింది. ఈ వైరస్ పుట్టుక చైనాలోని ఘీజోవ్. మొదటి కేసు ఫిబ్రవరి 1957లో నమోదైంది.
- 1990 దశకం మధ్య భాగంలో ఆస్ట్రేలియాలో హెండ్రా వైరస్ గబ్బిలాల నుండి గుర్రాలకు, గుర్రాల నుండి మనుషులకు వ్యాప్తి చెందింది. నిఫా వైరస్, సార్స్-కొవిడ్1, ఇప్పుడు సార్స్ కొవిడ్-2కు కూడా గబ్బిలాలే నిలయాలని భావిస్తున్నారు.
- 1994 నుండి హాంగ్‌కాంగ్, వియత్నాం, థాయ్‌లాండ్, కెనడా, అమెరికా తదితర ప్రాంతాల పౌల్ట్రీఫారాల నుండి ఆకస్మికంగా చాలా అంటువ్యాధులు వ్యాపించాయని అంచనా.



ప్రపంచ చరిత్రను మార్చేసిన

అంటువ్యాధులు!

ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజల జీవనశైలిని కరోనావైరస్ మహమ్మారి మార్చేస్తోంది. చరిత్రలో చూస్తే ఇలా ప్రబలిన వ్యాధులు.. సామ్రాజ్యాల పతనం నుంచి.. వలస రాజ్యాల విస్తరణ వరకూ శాశ్వత ప్రభావాలు చూపిన ఉదంతాలు ఉన్నాయి.

I. సామ్రాజ్యవాదానికి బాటలు వేసిన బ్లాక్ డెత్

మనదేశం దాదాపు రెండు శతాబ్దాల పాటు బ్రిటిష్ వలస పాలకుల వలస పాలనలో మగ్గిపోవడానికి కొన్నిరకాల అంటువ్యాధులే కారణమంటే నమ్మగలరా! యూరప్‌లో 1350వ సంవత్సరంలో చెలరేగిన ప్లేగు అక్కడి మూడోవంతు జనాభాను తుడిచిపెట్టేసింది.. కోట్లాది మంది పిట్టల్లా రాలిపోయారు. బ్యుబోనిక్ ప్లేగుగా భావించే ఆ మహమ్మారి వల్ల జనాభా తగ్గిపోవడంతో రైతుల సంఖ్య కూడా కనిష్ఠానికి చేరుకుంది. వ్యవసాయ శ్రామికుల కొరత తలెత్తింది. కూలీలకు ఎక్కువ వేతనాలు చెల్లించాల్సి వచ్చేది. భూస్వామ్య వ్యవస్థ విచ్ఛిన్నమవటం మొదలైంది. ఫలితంగా పశ్చిమ యూరప్.. ఆధునికీకరణ బాట పట్టింది. మనుషుల్ని పనిలో పెట్టుకోవడం చాలా ఖరీదైన వ్యవహారం కావటంతో.. కూలీల స్థానంలో యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించుకోవలసిన అవసరం ఏర్పడింది. అంతేకాదు ప్లేగు మహమ్మారి యూరోపియన్ వలసవాదాన్ని ప్రోత్సహించిందనే వాదన కూడా ఉంది. అప్పటివరకూ సముద్ర ప్రయాణం, కొత్త ప్రాంతాల అన్వేషణ అత్యంత ప్రమాదకరంగా

పరిగణించేవారు. కానీ స్వదేశంలో మరణాలు దారుణంగా పెరిగిపోవడంతో బతుకుజీవుడా అంటూ జనం సుదీర్ఘ సముద్ర ప్రయాణాలకు సిద్ధపడ్డారు. అలా యూరోపియన్ వలసవాదం మొదలైందన్నమాట. ఆ క్రమంలోనే భారత్‌లో కూడా వలసపాలన వేళ్లూనుకుంది. ఆర్థికవ్యవస్థ ఆధునికీకరణ బాటపట్టింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని కనిపెట్టే వ్యాపారాల్లో పెట్టుబడులు పెరిగాయి. విదేశీ విస్తరణలకు ప్రోత్సాహం లభించాయి. ఫలితంగా ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన ప్రాంతాల్లో పశ్చిమ యూరప్ ఒకటిగా అవతరించటానికి తోడ్పడ్డాయని భావిస్తారు.

2. వాతావరణ మార్పులకు కారణమైన మశూచి..

పదిహేనో శతాబ్దం చివర్లో ప్రబలిన అంటువ్యాధులు ప్రపంచ వాతావరణంలో పెనుమార్పులకు దారి తీశాయంటే మీరు నమ్మగలరా! బ్రిటన్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్ శాస్త్రవేత్తల అధ్యయనం ప్రకారం.. యూరప్‌లోని జనాభా కేవలం 100 సంవత్సరాల్లో 6 కోట్ల నుంచి 60 లక్షలకు పడిపోయింది. అప్పటి ప్రపంచ జనాభాలో ఇది దాదాపు 10 శాతం. అంటే నూటికి తొంభైమంది చనిపోయారన్నమాట. వలసల ద్వారా సంక్రమించిన అంటువ్యాధులే ఈ మరణాలకు ప్రధాన కారణం. మశూచి (స్మాల్‌పాక్స్) చాలామందిని బలితీసుకుంది. తట్టు (మీజిల్స్), ఫ్లూ (ఇన్‌ఫ్లుయెంజా), బ్యుబోనిక్ ప్లేగ్, మలేరియా, డిప్తీరియా, టైఫస్, కలరా వంటి వ్యాధులు చాలామంది ప్రాణాలను హరించాయి. అనూహ్య ప్రాణనష్టం, భయానక మానవ విషాదం మొత్తం ప్రపంచం మీద ప్రభావం చూపాయి. జనాభా తగ్గిపోవటంతో అడవుల ఆక్రమణలు, సాగు వంటివి గణనీయంగా తగ్గిపోయాయి. సువిశాలమైన భూమి మళ్లీ సహజమైన అడవులుగా మారిపోయింది. అది దాదాపు 5.60 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ఉంటుందని



అంచనా. అంటే ఫ్రాన్స్ విస్తీర్ణంతో సమానం. అంత భారీ విస్తీర్ణంలో చెట్లు, అడవులు పెరగటం వల్ల వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ తగ్గిపోయింది. (ఇది అంటార్కిటికాలోని మంచు పొరల్లో నమోదైంది.) ప్రపంచంలోని చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తగ్గాయి. దీంతోపాటు అదే సమయంలో భారీగా అగ్నిపర్వతాల విస్ఫోటనాలు జరగటం, సౌర కార్యకలాపాలు తగ్గటం వల్ల చాలా భూభాగాల్లో ఉష్ణోగ్రతలు పడిపోయి 'చిన్నపాటి మంచు యుగానికి' దారితీశాయని శాస్త్రవేత్తలు భావిస్తారు. విషాదం ఏమిటంటే, దీనివల్ల అత్యంత ప్రభావితమైన ప్రాంతాల్లో యూరప్ ఒకటి. అక్కడ పంటలు పండక కరవులు తలెత్తాయి.

3. ప్లేగు.. మింగ్ సామ్రాజ్య పతనం

అంటువ్యాధుల కారణంగా సామ్రాజ్యాలు పతమవడం గురించి తెలుసా మీకు? చైనాలో అదే జరిగింది. ఆ దేశాన్ని మింగ్ రాజవంశం దాదాపు మూడు శతాబ్దాల పాటు పరిపాలించింది. ఆ కాలంలో తూర్పు ఆసియా అంతటా అది భారీ సాంస్కృతిక, రాజకీయ ప్రభావం చూపింది. కానీ.. అదంతా ఒక్కసారిగా దారుణంగా అంతమైపోయింది. అందుకు పాక్షిక కారణం ప్లేగు విజృంభించటం. చైనాలోని ఉత్తర ప్రాంతానికి 1641లో ఈ మహమ్మారి ప్రవేశించింది. భారీ సంఖ్యలో ప్రాణాలను హరించింది. కొన్ని ప్రాంతాల్లో జనాభాలో 20 నుంచి 40 శాతం మందిని బలితీసుకుంది. అప్పటికే కరవు, మిడతల దండుల దాడులతో సతమతమవుతున్న సమయంలో ప్లేగు కూడా పంజా విసిరింది. పొలాల్లో పంటలు లేవు. జనానికి తిండి లేదు. కరవు కారణంగా ప్లేగు వల్ల చనిపోయిన వారి శరీరాలను కొంతమంది తినటం మొదలైనట్లు కూడా వార్తలు వచ్చాయి. బ్యుబోనిక్ ప్లేగు, మలేరియా రెండూ ఏక కాలంలో విజృంభించటం ఈ సంక్షోభానికి కారణం కావచ్చు. ఉత్తర ప్రాంతం నుంచి వచ్చే ఆక్రమణదారులు ఈ వ్యాధిని వెంటబెట్టుకుని వచ్చి ఉండవచ్చు. వారు చివరికి

మింగ్ సామ్రాజ్యాన్ని కూలదోశారు. తొలుత బందిపోటు దాడులు, ఆ తర్వాత మంచూరియా ప్రాంతానికి చెందిన క్వింగ్ రాజవంశం ఆక్రమణలు కొనసాగాయి. వారు చివరికి మింగ్ రాజవంశాన్ని కూల్చేసి తమ సామ్రాజ్యాన్ని స్థాపించారు. అది మరికొన్ని శతాబ్దాలు కొనసాగింది. మింగ్ సామ్రాజ్యాన్ని అప్పటికే అవినీతి, కరవు పీడిస్తున్నప్పటికీ.. ప్రాణాంతకమైన ప్లేగు మహమ్మారిలా దేశమంతటా విజృంభించటం.. ఆ సామ్రాజ్యం పతనమవటానికి దోహదపడింది.

4. ఎల్లో ఫీవర్ ఫలితం.. యూఎస్ వైశాల్యం రెట్టింపు

హైతీలో ఒక వ్యాధి విజృంభించటంతో తలెత్తిన పరిణామాల వల్ల ఉత్తర అమెరికా నుంచి ఫ్రాన్స్ గెంటివేతకు గురికావాల్సి వచ్చింది. దానివల్ల యునైటెడ్ స్టేట్స్ (అమెరికా సంయుక్త రాష్ట్రాలు) విస్తీర్ణం, బలం పెరిగాయి.. యూరప్ వలస శక్తుల మీద బానిసల తిరుగుబాటు అనంతరం 1801లో ఫ్రాన్స్‌తో ఒప్పందం చేసుకున్న టోసాయింట్ లావెర్చర్ హైతీని పాలించాడు. ఫ్రాన్స్ నాయకుడు నెపోలియన్ బోనపార్టీ తనను తాను జీవితకాల గవర్నర్‌గా ప్రకటించుకున్నాడు. హైతీ దానిని వ్యతిరేకించడంతో ఆ దీవిని పూర్తిగా తన నియంత్రణలోకి తెచ్చుకోవాలనుకున్న నెపోలియన్.. వేలాదిమంది సైనికులను యుద్ధానికి పంపించాడు. యుద్ధ రంగంలో వారు దాదాపు విజయం సాధించారు కానీ.. ఎల్లో ఫీవర్ మాత్రం వారిని చావుదెబ్బ తీసింది. దాదాపు 50,000 మంది సైనికులు, అధికారులు, వైద్యులు, నావికులు చనిపోగా.. కేవలం 3,000 మంది మాత్రమే తిరిగి ఫ్రాన్స్ చేరుకోగలిగారు. ఆఫ్రికాలో పుట్టిన ఈ వ్యాధి నుంచి యూరప్ బలగాలకు సహజమైన రోగనిరోధక రక్షణ లేదు. తన సైనికులు ఓడిపోవటంతో నెపోలియన్ హైతీని వదిలిపెట్టేశాడు. దానితో పాటు ఉత్తర అమెరికాలో ఫ్రాన్స్ వలస ఆకాంక్షలకు కూడా నీళ్లు

Help Bar Deadly Influenza From Seattle

By DR. J. D. TUTTLE,
State Health Commissioner

Don't get into crowds, don't cough or sneeze without using a handkerchief, get plenty of fresh air, and when the symptoms of a cold appear isolate yourself as far as possible from others.

By SURGEON GENERAL RUPERT BLUE,
U. S. Public Health Service

First there is a chill, then fever, headache, backache, reddening of the eyes, aches all over the body and general prostration. Persons so attacked should go to bed at once and call a physician.

NIGHT EXTRA — FOR INFORMATION on any subject—the time of day, movement of trains, mails and so on— Call Main 300

MEMBER ASSOCIATED PRESS.

The Seattle Daily Times

TIMES WHISTLE SIGNALS
ONE LONG BLAST — Fire Department alarm. Turn to page 2 for place.
TWO LONG BLASTS — Air raids. Turn to page 2 for place.
THREE LONG BLASTS — Fire Department recall.
FOUR LONG BLASTS — Air raids practically assured. Turn to page 2 for place.
FIVE LONG BLASTS — Fire Department recall.
SIX LONG BLASTS — Air raids practically assured. Turn to page 2 for place.
SEVEN LONG BLASTS — Germany sues for peace.

12 Pages. SEATTLE, WASHINGTON, SATURDAY EVENING, OCT. 5, 1918. Price 3c On News Stands. Daily, Twelve 1c.

CHURCHES, SCHOOLS, SHOWS CLOSED

EPIDEMIC PUTS BAN ON ALL PUBLIC ASSEMBLIES

MR. LOVERING'S COMMENT

Tweet is victory, Boy Liberty Sleuth!

GERMANY PLAYS ITS LAST BIG CARDS.

Commencing the other day with the appointment of Prince Maximilian as Imperial Chancellor, James W. Gerard, former American ambassador to Germany, declared that he was suspected that when they finally sought peace, they would employ either Prince Maximilian or Dr. Solf, who was so opposed to a break with America, as the two Germans were America's best friends.

It is an interesting coincidence that both Maximilian and Solf are in the new German cabinet, the former as Premier and the latter as foreign secretary.

Left there in the ministry are Philip Scheidemann, leader of the socialist majority in the Reichstag; Maximilian Erzberger, the Centrist leader, and Gruber, another Centrist. Here is a cabinet with a foreign secretary and secretary of state for the imperial labor office.

In making these sophisticated appointments Germany is playing its last big card. By the elevation of Scheidemann, Erzberger, Gruber and Solf to cabinet rank, Allies and not even people that a new democratic regime has assumed control of the empire's affairs. Based on this ground, a new power office may be created for the Allies to deal with.

Moreover, the Allied world and, in particular, America must realize that these have accepted places at the behest of the Kaiser, that they have not yet been elected by the German people as the Junker ruling element in Germany, and that they can be displaced just as easily as they have been elevated to office.

Maximilian is declared by Gerard to be antimilitaristic in his views. Erzberger is a Centrist. Scheidemann, Scheidemann has been elected, in several occasions, the willing tool of the autocratic Reich vision is clearer than that, of the average German parliament. Solf is a former governor, a willingness to sacrifice himself to his political fortunes for principle.

After armistice has surrendered, these men might be big enough to unseat the Junker ruling element in Germany, but now, as previously, no force in that country can be assured only by a combination of military operations on the bags seals that the Allied governments had planned for the closing months of the present year and the early months of 1919.

There will be no peace in the world until a defeated Germany begs for an armistice on the terms that Bulgaria has accepted.

VIENNA PLAYING GERMANY'S GAME.

The same obstruction appeals to Austria. Dispatches which evidently are intended to be misleading, explanations designed to make Austria's attitude appear less hostile, fundamentally opposed views as to the future policies of the country.

Attempts are being made to combine the Ukraine and the representatives of Austrian Poland, Austria-Hungary and Hungary with indifferent success. The ancient lines of cleavage between these nations being intensified by their internal disagreements over the Peace Ministry's war and peace policies.

This political turmoil, this obvious effort to create a situation that would enable Austria-Hungary to break away immediately from Germany and embark on a foreign policy of its own.

The statement in the Dual Monarchy that "nothing is to be done" to Austria-Hungary, that "nothing is to be done" cause imperative and, in the meantime, will desperately back every effort the autocracy of Germany can make to involve the Allies in discussions intended to bring about a compromise peace.

—P. H. L.

—See Page Two for Bias —

Dr. W. S. Solf Heads Hun Foreign Office

COPENHAGEN, Saturday, Oct. 5.—Dr. W. S. Solf, German colonial secretary, has been appointed German imperial foreign secretary, it is officially announced in Berlin today.

Maximilian Erzberger, the Centrist leader, has been appointed secretary of state, without portfolio. Herr Bauer, the socialist leader, has been appointed secretary of state for the imperial labor office.

Dr. Solf was Governor during the war in and also as colonial secretary, with Dr. Gruber as under secretary.

SEATTLE TO MAKE FIGHT ON DISEASE

Mayor and City Health Officer Will Permit None but Gatherings in Open Air.

POLICE ORDERED TO CLOSE PUBLIC PLACES

The following order was posted at the police station this afternoon:

General Order No. 93—On account of the epidemic of influenza, or Spanish influenza coming in, all theatres, churches, schools and places of public assembly will be closed until further orders. By order of the Board of Health and Mayor.

(Signed) J. F. WARREN, Chief of Police.

EVERY place of indoor public assembly—lodge or society, including session, church, school, theatre, dance hall, saloon, churches and dance halls at noon today were ordered closed immediately by Mayor Hanson and City Health Officer J. D. Tuttle as a means of combating the spread of Spanish influenza in Seattle. The only public gatherings permitted will be those in the open air.

Notices were sent to churches to close into attorneys's mail-box, and pastors were told to notify their congregations. No services shall be held tomorrow. The police at once were instructed to close all places of public assembly.

The order, issued by the school board, applied to an immediate clash. Supt. Cline had issued a statement that the action of the mayor was hysterical and a "panicky thing to do." If the order is not rescinded, the superintendent of schools declared, he would have to close the schools, but he supposed, he added, he would have to close them anyway.

Drug Stores to Stay Open.

Mayor Hanson and Health Officer Tuttle decided that the Board of Health could not order drug stores to remain open because of the influenza epidemic.

Reports to the Health Department this morning indicate that influenza is spreading rapidly in Seattle. Health officer Tuttle said that "there are now more than enough cases to become many of them are very serious and some are fatal. Pneumonia cases have been reported, however, in no alarming number."

A previous order issued by Chief of Police Warren at the request of Mayor Hanson and Health Officer Tuttle, which was not enforced, at all police officers were instructed to see that the order was enforced, and that violations of it were not made.

Officers were given instructions to "use persuasion and explain the situation to the offenders in any other way or public place."

Quarantine Necessary.

City Health Commissioner McBride at noon roughly estimated the number of influenza cases in Seattle at between 1,000 and 1,500. This estimate, he said, was based on the number of cases reported to the health department and on information with physicians of the city this morning.

Quarantine of the period of the epidemic is imperative, said Dr. McBride, "especially in Seattle. We must do everything possible to keep the people from the spread of this disease. Even in the shipyards and on other war work."

"Today the disease gave a start at Bremerton, where there are 10,000 men, and at the naval training station at Puget Sound, where there are 20,000 men. If we do not quarantine, we can see what this would mean to the war work and the shipyards. We can see what it would mean to the people of Seattle, and I don't mean the shipyard workers.

"I feel that we are warning in time. We can, I am sure, stop every man and woman in Seattle with regard to its spread. We can do it if we do it now. I have asked the mayor to call in the shipyard workers.

"We have found a way to guard against the epidemic. At the first sneeze which has been taken in Bremerton, we can stop it. We can do it

(Continued on Page Three.)

BANK CLEARINGS

Clearings	SEATTLE.	$7,454,017.39
Balances		1,020,000.00
Clearings	Portland.	$4,823,401.00
Balances		840,441.00
Clearings	Spokane.	$1,618,341.00
Balances		278,484.00
Clearings	Tacoma.	$1,179,773.00
Balances		236,119.00

(Continued on Page Five.)



—Special Liberty Loan Cartoon by Tom Thurlby of The Times Art Staff.

ONLY ONE-HALF OF CITY'S QUOTA TO LOAN SUBSCRIBED

Official Figures Given Out at Noon Today Show Total of $13,198,000.

(For Editorial Comment See Page 4.)

"I am a Liberty Loan Slacker. I am a Liberty Loan Slacker. I am a Liberty Loan Slacker."

BLAST SHATTERS DOZENS OF TOWNS IN NEW JERSEY

Tons of T. N. T. Blow Up at Morgan Shaking Country for 50 Miles; Death Toll Heavy.

NEW YORK, Saturday, Oct. 5.—After a series of explosions that shook a dozen towns in Northern New Jersey, even in a shattered condition this afternoon as a consequence of a massive disaster which visited the Morgan shipyards, at 3 o'clock, a concentrated explosion and raging

(Continued on Page Four.)

FULL COLOR MAP OF THE WESTERN FRONT WILL APPEAR IN THE SUNDAY TIMES TOMORROW MORNING

This is the most satisfactory map that has been issued in printed form. It shows the principal towns and railroads involved in the fighting between the Meuse and the Vesle, Germany and Belgium. It shows as well as the German regime in Belgium, the Hindenburg line, the German advance in 1914 and the fall of 1918, as well as the Hindenburg line and the German retreat. It is being issued on the Web and good for following the progress of the war by following along in the map appearing.

(Continued on Page Four.)

NEW WAGE SCALE IN SHIPYARDS TO RUN FROM AUG. 1

No Seattle Worker Will Lose by Delay of Macy Board to Announce Its Awards.

Mr. Jermane's Dispatch.

WASHINGTON, Saturday, Oct. 5.—It is reported that the government men will be ready to announce its wage scale covering the country as a whole, including the Pacific coast, in the shipyards late next week or so. But when its order goes into effect it will be in the nature of a "back pay" order to Seattle workmen will be a dollar and a half, President Wilson is expected to issue a proclamation on the Macy commission to announce its decisions.

The original wage toward a wage scale was made by the Macy board in Seattle, and this was in effect only in city. They met men represented the Metal Trades Council and asked them to send representatives to the national capital for conference with the national Macy board. This was done, the representatives of the metal trades during the first week in September, and the Macy board made a wage scale for the Seattle yards, which both sides gave their approval. The Macy board then left for the Pacific coast and stopped on the journey to the east of coming upon the original scale was so high that it was felt it was too high, and that the scale was reduced. The men in the yards made a protest against these changes over this original scale.

To Coordinate War Labor.

Long before the foul-up matter came up, President Wilson had had in his plan to coordinate all the war labor of the country. This work was being done by the War Labor Board, headed by William H. Taft, President Wilson, who is still away in Canada, is chairman of the board, and Frank P. Walsh, of Kansas City, is chairman of the board of review. The board has been working on the problem of the wage scale in the shipyards, and the general criticism of the government where there have been no agreements.

The labors of the President

(Continued on Page Two.)

AMERICANS AND FRENCH SMASH FOE

Associated Press Summary.

FRENCH and American troops are smashing into the German positions in Champagne and have forced the enemy of withdraw from valuable ground in the hill country near the Suippe River, says today's Associated Press summary of news from the fronts of war.

East and west of the Argonne and northwest of Rheims there has been heavy fighting, to the advantage of the Allies.

On the northern sector hostilities apparently have quieted down.

For advancing over the heights of Champagne and Argonne the French and Americans attacked the Germans in the eastern part of the will northwest of Rheims, in the Argonne forest and in the Meuse region, and hurriedly toward the river Aisne. Just what the Germans have done, Just what the Germans have done.

Gain in Deep Pocket.

Between the Suippe and Rheims the Germans are still holding a deep pocket, which they will retire from it completely, the Germans are expected to be endangered by the French attack northwest of Rheims, which is aimed at Laon, the key to the German position along the Aisne, and coupled with great vigor. By Sunday the French attack northwest of Rheims had reached the outskirts of Sapogne.

Beyond the canal to forty open country, the French are now in a position to take in the rear the enemy salient east of Rheims. In the last five days the French have taken 5,000 prisoners and 41 guns.

Fight With Desperadoes.

West of the Argonne the Germans are fighting desperately to stop the advance of General Gouraud toward Vouziers, the Germans have lost Grandpre, and the German attacks from Somp against the French line south of Sommepy have failed.

Part of the forces after having taken important positions, the American troops have advanced to the Kriemhilde defensive line. The actual front defense is most elaborate, reaching from Brieulles-sur-Meuse, on the north and left the Americans are successfully following up their earlier gains.

North of St. Quentin the British and French continue their great offensive. Cambrai, the Germans have lost important ground, the British have forced forward for substantial gains, while the French have taken Vendhuile and made no material height. Prisoners taken Friday in this region by the British and French aggregate 1,200.

Have Begun Withdrawing.

Word comes from Berlin that the Germans have begun to withdraw apparently as speedily as in the first two days after the British attack on the Somme. Some of this important region White the British advanced toward Lille and Douai, the Germans have begun plans to Flanders and to widen the Belgian coast, the Germans are evacuating the German sections in Belgium, and the British are pushing the American troops across the Meuse into east of the Argonne forest. They occupied all along the line, Friday

(Continued on Page Two.)

U.S. TROOPS SMASH HUNS IN ARGONNE

Americans Attack Along Extended Front and Capture Several Villages From Foe.

PARIS, Saturday, Oct. 5.—American troops attacked again this morning between the Meuse and the Argonne, this official report issued. The advance of some points has reached more than two miles, and the Germans have lost heavily.

Hundreds of prisoners have been taken in fresh fighting, according to the official report. The Germans have been in contact with the last defense of the Kriemhilde line, which is the last line of defense behind the Hindenburg line.

WITH THE AMERICAN ARMY IN CONTINUOUS OF VIGIRON, Saturday, Oct. 5.—(By Associated Press.)—The attack on Saturday and Sunday was the most extensive undertaken by the Germans on American line and with most determined resistance during the war.

The American advanced behind a terrific barrage. This bombardment of the enemy lines began at 5:30 o'clock, the shells falling each minute along the entire front.

This was frequently increased to fifty a minute at 6:45 o'clock.

(Continued on Page Two.)

THE WEATHER

Tonight and Sunday, rain; gentle southwesterly winds.

TEMPERATURE AT NOON TODAY, 57

Temperature during last twenty-four hours: Maximum, 57; minimum, 52. Relative humidity, 93 per cent. Sunrise, 7:14 a. m. Sunset, 6:41 p. m.

TIDES AT SEATTLE TOMORROW.

First low, water 7:04 a. m., 3.8 ft. Second low, water 12:38 p. m., 4.7 ft. First high water 1:14 a. m., 16.8 ft. Second high water 7:42 p. m., 16.0 ft.

వందేళ్లనాటి అమెరికన్ పత్రికలో ఆనాటి లాక్‌డౌన్ వార్తలు

వదిలేశాడు. హైతీ తిరుగుబాటును అణచివేయటానికి నెపోలియన్ బలగాలు రంగంలోకి దిగిన రెండేళ్ల తర్వాత.. ఫ్రాన్స్ నాయకుడు 21 లక్షల చదరపు కిలోమీటర్ల భూమిని యూఎస్ ప్రభుత్వానికి అమ్మేశాడు. (దీనినే లూసియానా కొనుగోలుగా వ్యవహరిస్తారు.) దీంతో అమెరికా విస్తీర్ణం రెట్టింపైంది.

5. ఆఫ్రికాను వలసపాలనలోకి నెట్టేసిన ఆఫ్రికా రిండర్‌పెస్ట్..

ఆఫ్రికాలో జంతువులను బలితీసుకునే ఒక ప్రాణాంతక వ్యాధి.. ఆ ఖండాన్ని యూరప్ వలసపాలకుల ఆక్రమణలోకి నెట్టేసింది. ఇది ప్రజలను నేరుగా చంపిన మహమ్మారి కాదు. పశువులను పొట్టనపెట్టుకుంది. 1888 నుంచి 1897 వరకూ రిండర్‌పెస్ట్ వైరస్ (పశువుల్లో ప్లేగు) ఆఫ్రికాలోని పశుసంపదలో 90 శాతాన్ని మట్టుపెట్టేసింది. హార్న్ ఆఫ్ ఆఫ్రికా, వెస్ట్ ఆఫ్రికా, సౌత్‌వెస్ట్ ఆఫ్రికాలలో ప్రజా సమాజాలు దారుణంగా దెబ్బతిన్నాయి. పశువుల మరణంతో ఆహారలేమి తలెత్తింది. జనం తిండి లేక మాడిపోయారు. సమాజం కుప్పకూలింది. ప్రభావిత ప్రాంతాల నుంచి జనం వలసల రూపంలో పారిపోయారు. భూములు దున్నటానికి ఎడ్లే ఆధారం కనుక వ్యవసాయం మీద ఆ వ్యాధి తీవ్ర ప్రభావం చూపింది. పశువుల ప్లేగు సృష్టించిన కల్లోలం.. యూరప్ దేశాలు 19వ శతాబ్దంలో ఆఫ్రికాలోని భారీ భూభాగాలను ఆక్రమించుకోవటానికి తోడ్పడింది.. రిండర్‌పెస్ట్ విజృంభించటానికి కేవలం కొన్ని సంవత్సరాల ముందే యూరప్ దేశాల వలస ప్రణాళికలు మొదలయ్యాయి. 1884- 1885లో బెర్లిన్‌లో జరిగిన ఒక సదస్సులో - బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, పోర్చుగల్, బెల్జియం, ఇటలీ సహా యూరప్‌కు చెందిన 14 దేశాలు.. ఆఫ్రికా భూభాగం మీద తమ ఆక్రమణల గురించి చర్చలు జరిపి మ్యాపులు తయారు చేసుకున్నాయి. ఆ వ్యాధి ఆఫ్రికా ఖండం మీద అత్యంత దారుణమైన ప్రభావం చూపింది. 1870లలో ఆఫ్రికా భూభాగంలో కేవలం 10 శాతం మాత్రమే యూరప్ వలస పాలకుల ఆధీనంలో ఉండేది. కానీ 1900 సంవత్సరం నాటికి దాదాపు 90 శాతం భూమి వలస పాలకుల చేతుల్లోకి వెళ్లిపోయింది. 1890ల ఆరంభంలో ఎరిత్రియాలోకి ఇటలీ ప్రవేశించింది. అందుకు పాక్షిక కారణం ఇథియోపియాలో తలెత్తిన కరవు. దానివల్ల అక్కడ మూడోవంతు జనం చనిపోయారు

గొప్ప సంజీవని పెన్సిలిన్

మానవులు శారీరక క్లేశాలను తగ్గించుకోడానికి తమకు తెలిసిన, కనిపెట్టిన వైద్య విధానాలను, ప్రక్రియలను ఉపయోగిస్తూనే ఉన్నారు. తన చుట్టూ ఉండే చెట్టు చేమల నుంచి, ఆకు అలముల నుంచే మానవుడు మందులు కనిపెట్టడం మొదలైంది. గ్రీకులు, రోమన్లు, చైనీయులు, అరబ్బులు, భారతీయులు ఎక్కడి సమూహాలు అక్కడ వారివారి అనుభవంలో నేర్చుకొన్న విధానాల ఆధారంగా మనుషుల బాధలను తగ్గించడానికి వైద్యం చేసుకుంటూనే ఉన్నారు. ఎన్నో వందల సంవత్సరాల పాటు భారతీయ వైద్య విధానమైన ఆయుర్వేదం మానవ చికిత్సకు సాధనమైంది. యూరప్‌లో గేలన్ (130-215 ఎ.డి.) ప్రతిపాదించిన వైద్య సిద్ధాంతం ఆధారంగా 1500 సంవత్సరాల పాటు వైద్యం జరిగింది. వెసాలియస్ అనే శాస్త్రవేత్త దేహ నిర్మాణాన్ని (అనాటమీ), విలియం హార్వే అనే ఇంకొక శాస్త్రవేత్త దేహధర్మాల్ని (ఫిజియాలజీ) శాస్త్రీయంగా అధ్యయనం చేసే వరకూ గేలన్

సిద్ధాంతం ప్రకారమే వైద్యం జరిగింది.

అసలు మానవుడి ఆయుర్దాయం 100-110 సంవత్సరాలు. అయితే వంద సంవత్సరాల క్రితం వరకూ సగటు ఆయుర్దాయం 30-40 సంవత్సరాల మధ్యనే ఉండేది. ఈరోజు అభివృద్ధి చెందిన దేశాలలో సగటు ఆయుర్దాయం 80 సంవత్సరాలకు పైగా ఉంటే మన దేశంలాంటి వాటిలో 69 సంవత్సరాలకు పైగా ఉంది. ఆయుర్దాయంతో పాటు శిశు మరణాల రేటు వంటి అనేక ఆరోగ్య సూచికలన్నింటిలో ఇంత అభివృద్ధికి కారణం ఎందరెందరో శాస్త్రజ్ఞుల కృషే.

అనేకరకాల వ్యాధుల నియంత్రణ, నివారణలో గొప్ప సంజీవని పెన్సిలిన్. వందేళ్ల క్రితం వరకూ యాంటీబయాటిక్స్ అనే మందులే లేవు. మొట్టమొదటి యాంటీబయాటిక్ పెన్సిలిన్‌ను 1942లో ఉపయోగించారు. ఇప్పుడు మనం వాడే మందులన్నీ (ఫార్మకాలజీ)ఆ తర్వాత కనిపెట్టినవే. అన్ని దేశాల వివిధ కాలాల పాత వైద్యాలలోని ఉపయోగపడే అంశాలన్నిటిని ప్రయోగ నిరూపణ పూర్వకంగా మిళితం చేసుకున్నదే ఆధునిక వైద్యం.

భూమండలం మీద మనమే ఆఖిరా?

భారతీయ పురాణాల్లో యుగాంతం గురించి చాలా పెద్ద వివరణే ఉంటుంది. హిందూ కర్మసిద్ధాంతం, వేదాలు దీని గురించి చాలా వివరంగా చర్చించాయి. ప్రపంచం మొత్తం నాశనమై మళ్లీ పునరుజ్జీవనం పొందిన ఉదంతాలునిజంగానే జరిగాయని శాస్త్రవేత్తలు ఆధారాలతో సహా నిరూపించారు. ఇప్పటికి ఐదుసార్లు యుగాంతాలు జరగ్గా ఇప్పుడు మనం ఆరో యుగాంతం వైపు సాగిపోతున్నామని తెలుసా!

కరోనా మహమ్మారి మానవాళిని చుట్టుముట్టేసింది.. తెలిసినవాళ్లో, దగ్గరివాళ్లో ఎవరో ఒకరు.. మన ఫోన్ కాంటాక్ట్ లిస్టులోంచి నిశ్శబ్దంగా జారిపోవడం.. మన ఫేస్‌బుక్ ఫ్రెండ్స్‌లిస్టులో స్తబ్ధుగా మారిపోవడం మన అనుభవంలోకి వస్తున్నాయి.

ఇదంతా మనకు తెలిసి జరిగేది. కానీ మనకు తెలియకుండానే ఈ భూమండలం మీది నుంచి నిత్యం ఎన్నో రకాల జీవజాతులు, జంతుజాతులు అంతరించిపోయి నిశ్శబ్దంగా అదృశ్యమైపోతున్నాయని.. ఇది గొలుసుకట్టులా సాగి సాగి.. మనిషి మనుగడ దగ్గరే ఆగుతుందని మీకు తెలుస్తుందా? ఇవన్నీ చూస్తుంటే.. 'ఈ భూమండలం మీద మనదే

ఆఖరు బ్యాచా? అనే సందేహం తలెత్తుతుంది కూడా. వచ్చే పదేళ్ల కాలంలో పెనుమార్పులు జరగబోతున్నాయని, మానవాళికి రెండు దశాబ్దాల్లోనే ముప్పు ఎదురుకాబోతోందని కూడా శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ఆరోసారి యుగాంతం!

జీవుల అంతర్ధానం అనగానే డైనోసార్లు కనుమరుగవటమే గుర్తుకొస్తుంది. భారీ ఆకారాలతో భూమిని ఏలిన డైనోసార్లు భూమిని ఢీకొట్టిన గ్రహ శకల ప్రభావంతో పూర్తిగా అంతరించిపోయాయి. ఇది మనకు కాస్త సమీప కాలంలోనే జరిగింది. నిజానికి దీనికన్నా ముందే నాలుగుసార్లు ఈ భూమండలం మీది జీవులు పెద్ద ఎత్తున అంతర్ధానమయ్యాయి. ఇప్పుడు మనం ఆరో మహా అంతర్ధాన కాలంలో జీవిస్తున్నాం. గతంలో అన్నీ ప్రకృతిసిద్ధంగా జరగ్గా.. ఈసారి యుగాంతానికి మనిషి వ్యవహరిస్తున్న తీరే కారణం కావడం విషాదం. ఇంతకీ మహా అంతర్ధానాలు ఎలా సంభవిస్తాయి? వీటి నుంచి మనం నేర్చుకోవలసిందేంటి? ఇవి మళ్లీ జరగకుండా ఆపటమెలా?

మామూలుగా అయితే మనకేమీ తెలియకపోవచ్చు. ఎలాంటి తేడా కనిపించకపోవచ్చు. కానీ భూమ్మీద మనిషితో సహ జీవనం చేసే జీవులు శరవేగంతో అంతరించిపోతున్నాయి. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) చెబుతున్న ప్రకారం.. గత 50 ఏళ్లలోనే వెన్నెముక గల ప్రాణులు (సకశేరుకాలు) సగటున 68% మేరకు తగ్గిపోయాయి. ప్రస్తుతం 35 వేల జాతులు అంతరించే దశలో ఉన్నాయి. ఒక్క 20వ శతాబ్దంలోనే దాదాపు 543 సకశేరుకాలు అంతర్ధానమైనట్టు పరిశోధన పత్రాలు పేర్కొంటున్నాయి. దీనికి ఒకరకంగా మనమే కారణం. పారిశ్రామిక విప్లవం ఆరంభమైనప్పట్నుంచే ఇది మొదలైంది. గ్రీన్‌హౌజ్ వాయువుల ఉద్గారాలు, ఓజోన్ పొర తగ్గటం దగ్గర్నుంచి అడవుల నరికివేత, ప్లాస్టిక్ వ్యర్థాలు, జంతువుల అక్రమ వ్యాపారం వరకూ అన్నీ పర్యావరణానికి హాని చేస్తూనే ఉన్నాయి. జీవుల మనుగడను ప్రమాదకర పరిస్థితుల్లోకి నెట్టేస్తూనే ఉన్నాయి. వాతావరణ మార్పులు, జీవ జాతుల అంతర్ధానం సహజమైన ప్రక్రియేనని వాదించేవారు లేకపోలేదు. ఒకరకంగా ఇది నిజమే కావొచ్చు కూడా. ఆ మాటకొస్తే తొలి ఐదు మహా అంతర్ధానాలు మనిషి లేనప్పుడే జరిగాయి. కానీ అప్పటితో పోలిస్తే అంతర్ధాన ప్రక్రియ ఇప్పుడు మరింత వేగంగా సాగుతుండటమే ఆందోళనకరం.

'కీలక మలుపులో' మనం

ప్రస్తుతం మనమున్న కాలాన్ని వర్ణించటానికి కొత్త పదం ఒకటి ప్రాచుర్యంలోకి వచ్చింది. ఆ పదం 'హింజీ'. తెలుగులో 'కీలక మలుపులో' అని చెప్పొచ్చు. ఈ కాలం మానవ చరిత్రలో అతి ప్రభావశీలమైన కాలం అని చెప్పటానికి ఈ పదాన్ని వాడుతున్నారు. మన కాలంలో జరుగుతున్న సంఘటనలు రాబోయే కొన్ని వేల ఏళ్ల పాటు మానవాళి

భవిష్యత్తును శాసించబోతున్నాయనే అంశంపై ప్రఖ్యాత తత్వవేత్తలు, పరిశోధకుల మధ్య సంవాదం జరుగుతోంది. 'ద హింజ్ ఆఫ్ హిస్టరీ' అంటే 'చారిత్రక మలుపు' అనే ఈ వాదం.. మనమంతా ఇప్పుడు ఆ కీలక మలుపులో ఉన్నామని ప్రతిపాదిస్తోంది. డెరెక్ పార్ఫిట్ అనే తత్వవేత్త తన 'ఆన్ వాట్ మేటర్స్' అనే పుస్తకంలో 'మనం చారిత్రక మలుపులో నివసిస్తున్నాం' అని రాశారు.

'గత రెండు దశాబ్దాల శాస్త్ర, సాంకేతిక ఆవిష్కరణలను గమనిస్తే ప్రపంచం ఇంత వేగంగా మునుపెన్నడూ మారలేదు' అని ఆయన పేర్కొన్నారు. ఈ 'చారిత్రక మలుపు కాలం' సిద్ధాంతం మేధావుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన తత్వవేత్త విల్ మాక్ ఆస్కిల్ గత ఏడాది ఒక ఫోరంలో లోతైన విశ్లేషణ పోస్ట్ చేయటంతో ఇది మొదలైంది. ఈ ప్రశ్నపై ఇతర పరిశోధకుల నుంచి అనేక విశ్లేషణలు మొదలయ్యాయని బీబీసీ న్యూస్ పోర్టల్ తెలిపింది.

ఈ కాలం 'కీలక మలుపు' అనే వాదాన్ని సమర్థించే వారి వాదనలు ఏమిటంటే.. ముందుగా.. ఇది 'విపత్తుల కాలం' అనే అభిప్రాయం ఒకటి ఉంది. భూగోళానికి దీర్ఘకాలిక విధ్వంసం కలిగించే ప్రమాదం అసాధారణ స్థాయిలో ఉన్న కాలంలో మనం జీవిస్తున్నామనే ఆలోచన అది..

'మన భూమి 4.5 కోట్ల శతాబ్దాలుగా మనుగడలో ఉంది. కానీ ఈ శతాబ్దం విశిష్టమైనది: ఒక జీవజాతి - మన జీవజాతి -చేతుల్లో ఈ భూగోళం భవిష్యత్తు ఉంది'.అని బ్రిటన్ ఖగోళ శాస్త్రవేత్త మార్టిన రీస్ అన్నారు. 'జీవావరణాన్ని సరిచేయలేనంతగా దెబ్బతీసే పద్ధతులను, నాగరికతను దుర్గతి పట్టించే సాంకేతికతను మనం వాడుతున్నాం' అంటారు రీస్. ఈ విధ్వంసక శక్తులు మన వివేకాన్ని తుడిచిపెట్టేస్తున్నాయని టోబీ ఆర్డ్ పేర్కొన్నారు. మనం 'కొండ చరియ' అంచున నిల్చున్నామని.. ఒక్క తప్పటడుగుతో అధోగతి పాలవుతామనే అర్థంలో ఆయనో పుస్తకం రాశారు. ఈ శతాబ్దంలో మానవాళి అంతమయ్యే అవకాశాలు ఆరింట ఒకటిగా ఉందని ఆర్డ్ అంచనా వేశారు. అణు యుద్ధం, ప్రాణాంతక జీవాయుధాల తయారీ వంటి వాటిని మనం సృష్టించామని.. దీనివల్ల మన కాలం 'కీలక మలుపు' అవుతుందన్నదది ఆర్డ్ అభిప్రాయం. నాగరికతకు పెనుశాపంలా మారిన అంశాల గురించి మనం పెద్దగా పట్టించుకోవడంలేదు. సూపర్-కరోనా వైరస్ వంటి బయో-వెపన్ల తయారీ మీద ప్రపంచ నిషేధం విధించే ఐక్యరాజ్యసమితి బయోలాజికల్ వెపన్స్ కన్వెన్షన్‌కు ఉన్న నిధులు.. ఒక సగటు మెక్‌డొనాల్డ్ రెస్టారెంట్ కన్నా తక్కువే ఉన్నాయి.. ఇలాంటి ఎన్నో అంశాలను ఆయన చర్చకు తీసుకువచ్చారు..

మనమే కారణమా?

శిలాజాలు మనకన్నా ముందు నివసించిన జీవులనే కాదు, మనుషులు లేని సమయంలో అవి ఎంతకాలం సహజంగా మనుగడ సాగించాయనేదీ తెలియజేస్తాయి. దీన్నే నేపథ్య

వేగం (బ్యాక్‌గ్రౌండ్ రేట్) అంటారు. ఇది ఏటా ప్రతి 10 లక్షల జీవులకు ఒక జాతి అంతరించటంతో సమానం. ప్రస్తుతం మానవ చర్యల మూలంగా ఈ వాస్తవ నేపథ్య వేగం లక్షలాది రెట్లు ఎక్కువగా పెరిగిపోయింది. అంటే జీవులు సహజంగా అంతరించే వేగంతో పోలిస్తే ఇప్పుడు చాలా చాలా త్వరగా అంతరిస్తున్నాయనే అర్థం. మానవ కార్యకలాపాలు లేనట్లయితే అంతరించిపోయిన జీవజాతుల్లో కొన్ని 800 ఏళ్ల నుంచి 10 వేల ఏళ్ల వరకు ఇంకా మనుగడ సాగించి ఉండేవని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. కొవిడ్ మహమ్మారి నేపథ్యంలో పరిశీలిస్తే ఇదే నిజమేననీ అనిపిస్తుంది. నాసా లెక్కల ప్రకారం- కొవిడ్ ఆరంభంలో పలు దేశాల్లో విధించిన లాక్‌డౌన్ల ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా కర్బన ఉద్గారాలు 17%, నైట్రోజన్ ఆక్సైడ్ స్థాయులు 20% పడిపోయాయి. జలవనరులు తేటపడ్డాయి. పట్టణాలు, నగరాల్లో జంతువులు రోడ్లపైకి వచ్చి స్వేచ్ఛగా షికారు చేయటమూ చూశాం. ఇవి భూగోళం తిరిగి కోలుకుంటోందనే ఆశలు రేకెత్తించాయి. కానీ అదంతా తాత్కాలికమే. మనుషుల రాకపోకలు, చర్యలు యథావిధిగా మొదలయ్యాక అంతర్ధాన వేగం మునపటి స్థితికే చేరుకుంది.

యుగాంతంలో ముంగిట్లో..

లక్షల ఏళ్ల క్రితం అగ్నిపర్వతాలు, ఉల్కాపాతాలు భూమి మీద జీవరాశుల్ని సమూలంగా నాశనం చేసేశాయి. ఇప్పుడు మనుషులు అంతకంటే ఎక్కువ ప్రమాదాన్నే తీసుకొస్తున్నారు. మనుషుల ప్రభావం భూగ్రహం మీద ఎంతగా పడిందంటే, భూమి చరిత్రలోనే ఓ కొత్త శకం మొదలైందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మనుషులంతా ప్రమాదకరమైన పరిస్థితుల్లోకి వెళ్తున్నారని హెచ్చరిస్తున్నారు. తాము ఊహించినదానికంటే ఎక్కువ నష్టాన్నే మనుషులు పర్యావరణానికి కలిగిస్తున్నారని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్‌కు చెందిన శాస్త్రవేత్తలు

సైమన్ లెవిస్, మార్క్ మెస్లిన్ చెబుతారు. ప్రకృతి విపత్తులు, ఇతర సహజమైన చర్యల కంటే ఎక్కువగా మానవ చర్యల వల్లే మట్టి, రాళ్లు, ఇతర ఖనిజాలు ఉండాల్సిన చోటు నుంచి మరో చోటికి తరలిపోతున్నాయని వాళ్లంటారు.

ఏటా మనుషులు ఉత్పత్తి చేసే కాంక్రీట్‌తో భూమిపైన 2 మి.మీ. మందంలో ఓ పొరను ఏర్పాటు చేయొచ్చు. సముద్ర గర్భంలో మైక్రో ప్లాస్టిక్‌లు పోగైపోతున్నాయి. భూమిపై ఉండే చెట్లలో సగం ఎప్పుడో కొట్టేశాం. జీవజాతులు అంతరించిపోవడం అనేది చాలా మామూలు విషయంలా మారిపోయింది. భూమ్మీద చోటు చేసుకునే సహజమైన చర్యల కారణంగా గాల్లో నుంచి ఎంత నైట్రోజెన్ దూరమవుతుందో.. ఫ్యాక్టరీలు, వ్యవసాయం కారణంగా కూడా అంతే నైట్రోజెన్ దూరమవుతోంది. ఫలితంగా కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు పెరిగిపోయి వాతావరణం చాలా వేగంగా మారిపోతోంది.

ఈ లెక్కలన్నింటినీ గమనిస్తే.. పెరిగిన ఆధునికత, సాంకేతికత కారణంగా ప్రపంచంలోని 750 కోట్ల మంది ప్రజలూ రాబోయే రోజుల్లో ఆరోగ్యంగా జీవించే అవకాశాలు తగ్గిపోతున్నాయని, మొత్తం జాతి వినాశనానికి దారి తీస్తోందనే ఆందోళన తలెత్తుతోంది.

వ్యవసాయం నుంచే మొదలు

ఓసారి చరిత్రను గమనిస్తే, పర్యావరణంలో సమూల మార్పులకు మూడు పరిణామాలు ప్రధానంగా కారణమయ్యాయని తెలుస్తోంది. 10,500 ఏళ్ల క్రితం మొదలైన వ్యవసాయ విప్లవం కారణంగా వాతావరణంపై ప్రభావం పడటం ప్రారంభమైంది. ఆపైన 1492లో యూరోపియన్లు అమెరికాలో అడుగుపెట్టిన తరవాత చోటు చేసుకున్న పరిణామాలు, వాణిజ్య కార్యకలాపాల కారణంగా మరో మార్పు మొదలైంది. ఇక మూడోది.. రెండో ప్రపంచ యుద్ధం. అది ముగిశాక అన్ని దేశాలు అభివృద్ధి దిశగా అడుగేశాయి. ఉత్పాదకతతో

పాటు వినియోగం పెరిగిపోయింది. ఆ ప్రభావం వాతావరణ మార్పులకూ దారితీసింది.

పర్యావరణంపై ప్రతికూల ప్రభావం

అంతర్జాతీయంగా ఆర్థిక వృద్ధి జరిగేకొద్దీ, ప్రజల జీవన విధానం మారే కొద్దీ వాతావరణ మార్పులూ పెరిగిపోతున్నాయి. విద్యుత్ వినియోగంతో పాటు ఉత్పాదకతా పెరిగిపోయాయి. ఈ రెండూ ఎంత పెరిగితే పర్యావరణంపై అంత ప్రతికూల ప్రభావం కూడా పడుతుంది. ముందు భూమ్మీద ఇతర జీవజాతులకూ బతికే హక్కు ఉందని మనం గుర్తిస్తే, భూ ఉపరితలంపై కనీసం యాభై శాతం స్థలాన్ని వాటి కోసం వదిలేస్తే, వాతావరణంలో సానుకూల మార్పు దానంతటదే మొదలవుతుంది. ప్రస్తుత శకాన్ని శాస్త్రవేత్తలు 'ఆంత్రోపొసీన్' అని నిర్వచిస్తున్నారు. అంటే వాతావరణం, పర్యావరణంపైన మనుషుల ప్రభావం అత్యధికంగా ఉన్న శకం అని అర్థం. (శాస్త్రవేత్తలు సైమన్ లెవిస్, మార్క్ మెస్లిన్‌లు రాసిన పుస్తకం 'ద హ్యూమన్ ప్లానెట్'లో చర్చించిన అంశాలివి)



ఐదు యుగాంతాలు

అతి తక్కువ భౌగోళిక సమయంలో (దాదాపు 28 లక్షల సంవత్సరాల కాలంలో) సుమారు మూడొంతుల జీవులు మరణించటాన్ని మహా **యుగాంతం**గా శాస్త్రవేత్తలు పేర్కొంటారు. ఇలాంటివి ఇప్పటివరకు భూమ్మీద ఐదు సంభవించాయి. వీటిని పరిశీలిస్తే మనం చేయకూడని పనులేంటో అర్థమవుతుంది.

44 కోట్ల ఏళ్ల క్రితం ఆర్డోవిసియన్-సిలురియన్ యుగాంతం

పగడాలు (కోరల్స్), బ్రాకియోపాడ్స్ వంటి ప్రాణులు నీటి లోతుల్లో నివసిస్తూ, ఇంకా భూమి మీదికి అడుగుపెట్టని కాలంలో జరిగిన అంతర్ధానమిది. వాతావరణ మార్పుతో సముద్రాల ఉష్ణోగ్రత మారిపోవటం దీనికి మూలం. ఫలితంగా మహా సముద్రాల్లో 85% జీవులు అంతరించిపోయాయి. ఆర్డోవిసియన్ కాలంలో దక్షిణ మహాఖండం గోండ్వానాలో పెద్దఎత్తున మంచు గడ్డకట్టటంతో ప్రపంచవ్యాప్తంగా సముద్ర మట్టాలు తగ్గిపోయాయి. దీంతో జీవుల ఆవాసాలు, ఆహార చట్రం దెబ్బతిన్నాయి. సంతానోత్పత్తి తగ్గిపోయింది. చివరికి జీవులు పెద్ద సంఖ్యలో అంతరించిపోయాయి.

36.5 కోట్ల ఏళ్ల క్రితం లేట్ డెవోనియన్ యుగాంతం

డెవోనియన్ కాలాన్ని 'చేపల యుగం'గానూ పిలుస్తుంటారు. అది భూమి మీద జీవుల పరిణామం ఆరంభమవుతున్న కాలం. వీటిల్లో చాలావరకు మహా సముద్రాల నుంచి భూమి మీదికి చేరుకున్నవే. చెట్లు, పువ్వుల వంటివి ఈ రెండో మహా అంతర్ధానానికి



కారణమయ్యాయని భావిస్తుంటారు. చెట్లు వేళ్లను రూపొందించుకోవటం మొదలెట్టాక అవి రాళ్లూ రప్పలను మట్టిగా మార్చటం ఆరంభించాయి. పోషకాలతో కూడిన ఈ మట్టి సముద్రాల్లోకి చేరుకోవటం వల్ల నాచు (ఆల్గే) పెద్దఎత్తున పుట్టుకొచ్చింది. ఇవి మహా సముద్రాల మీద భారీ 'మృత ప్రాంతాలు' ఏర్పడేలా చేశాయి. నీటిలోని ఆక్సిజన్‌ను ఆల్గే స్వీకరించటంతో అక్కడి సముద్ర ప్రాణులకు ఊపిరి ఆడలేదు. వీటి ఆహార చక్రం అస్తవ్యస్తమైంది. అగ్ని పర్వతాలు పేలటం వల్ల సముద్రాల్లో ఆక్సిజన్ శాతం తగ్గిపోయి ఉండొచ్చన్నది కొందరు శాస్త్రవేత్తల మరోవాదన. ఏదేమైనా మారిన పరిస్థితులను తట్టుకోలేని జీవులు పెద్ద ఎత్తున మరణించాయి. సుమారు 75% జీవులు అంతరించాయి.

25.3 కోట్ల ఏళ్ల క్రితం పర్మియన్-ట్రయాసిక్ యుగాంతం

భూమ్మీద సంభవించిన అతిపెద్ద జీవుల అంతర్ధానం ఇదే. అందుకే దీన్ని 'మహా మరణం' అనీ అంటారు. ఇది భూగోళం మీది జీవుల్లో 90% ప్రాణులను అంతం చేసింది. దీనికి మూలం అగ్ని పర్వతాలు విపరీతంగా పేలటం. పర్మియన్ కాలం చివర్లో ప్రస్తుతం సైబీరియా ఉన్న ప్రాంతంలో భారీగా అగ్నిపర్వతాలు విస్ఫోటమయ్యాయి. వాతావరణంలోకి పెద్ద ఎత్తున కార్బన్ డయాక్సైడ్ విడుదలైంది. గ్రీన్‌హౌజ్ ప్రభావంతో భూమి వేడెక్కింది. సముద్ర మట్టాలు పెరిగిపోయాయి. సముద్ర జలాల్లో కార్బన్ డయాక్సైడ్ కలవటంతో ఆక్సిజన్ తగ్గిపోయి ప్రాణులు విలవిల్లాడిపోయాయి. దీంతో 96% సముద్ర జీవులు అంతరించిపోయాయి. ఆమ్ల వర్షం కురవటంతో నేల మీద 70% జీవులు అంతరించాయి.

20.1 కోట్ల ఏళ్ల క్రితం ట్రయాసిక్-జురాసిక్ యుగాంతం

అది డైనోసార్లు ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న కాలం. దురదృష్టం కొద్దీ ఆ సమయంలోనే పెద్ద సంఖ్యలో అగ్ని పర్వతాలు పేలటం మొదలైంది. నాలుగో మహా

అంతర్ధానానికి కారణమేంటన్నది స్పష్టంగా తెలియదు. కానీ ప్రస్తుతం అట్లాంటిక్ మహా సముద్రం ఉన్న ప్రాంతంలో భారీగా అగ్ని పర్వతాలు పేలాయని శాస్త్రవేత్తలు భావిస్తుంటారు. దీంతో పర్మియన్ కాలంలో మాదిరిగానే వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ స్థాయులు పెరిగి, వాతావరణం మారిపోయింది. కార్బన్ డయాక్సైడ్ మోతాదులు పెరగటంతో భూ ఉపరితలం కింద గడ్డకట్టిన మంచు నుంచి మిథేన్ వాయువు విడుదలైందనీ కొందరు శాస్త్రవేత్తలు భావిస్తుంటారు. కారణమేదైనా భారీ మొసళ్లు, ఆకాశంలో ఎగిరే టెరోసార్స్ సైతం కనుమరుగయ్యాయి. దాదాపు 80% జీవులు అంతరించాయి.

6.6 కోట్ల ఏళ్ల క్రితం కె-పీజీ యుగాంతం

ఇది డైనోసార్లు చనిపోయిన రోజుగా పేరొందింది. దీనికి మూలం భూమిని భారీ గ్రహ శకలం ఢీకొట్టటం. ప్రస్తుత మెక్సికోలోని యుకటన్ ప్రాంతంలో 13 కిలోమీటర్ల వెడల్పు గల గ్రహ శకలం గంటకు 72 వేల కి.మీ. వేగంతో ఢీకొట్టింది. దీంతో సుమారు 1,450 కిలోమీటర్ల మేర భూమి దగ్ధమైంది. ఎగిసిన ధూళి, దుమ్ముతో నెలల కొద్దీ వాతావరణం నల్లబడిపోయింది. సూర్యరశ్మి అందక చెట్లు ఎండిపోయాయి. డైనోసార్ల ఆహార చట్రం అస్తవ్యస్తమైంది. ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తగ్గి, తీవ్రమైన చలి నెలకొంది. ఫలితంగా 18 కోట్ల ఏళ్ల పాటు సాగిన డైనోసార్ల జీవనయాత్ర ముగిసిపోయింది. సుమారు 75% జీవులు కనుమరుగయ్యాయి. ఆకాశంలో ఎగిరే, భూమిలో దాక్కొనే, సముద్రం లోతుల్లోకి వెళ్లగల జీవులు బతికి బయటపడ్డాయి.

మరో 20 ఏళ్లలో మానవాళికీ ముప్పు?

వచ్చే పదేళ్ల కాలంలో పెనుమార్పులు జరగబోతున్నాయని, మానవాళికి రెండు దశాబ్దాల్లోనే ముప్పు ఎదురుకాబోతోందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

మానవాళి భవిష్యత్తు గురించి అధ్యయనం చేస్తూ వచ్చే యాభై ఏళ్లలో జీవన నాణ్యత పడిపోతుందని.. ఆహారోత్పత్తి, పారిశ్రామిక ఉత్పత్తి పతనమైపోతాయని, క్రమంగా మానవ జనాభా తగ్గిపోతుందని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-ఎంఐటీ పరిశోధకులు 1972లో అంచనా వేశారు. కేవలం ఆర్థిక వృద్ధిపైనే దృష్టి సారించి పర్యావరణ, సామాజిక మార్పులను పట్టించుకోకపోతే 21వ శతాబ్దంలోనే మానవ సమాజం పతనమైపోతుందని హెచ్చరించారు. 'లిమిట్స్ టు గ్రోత్' పేరుతో వారు రాసిన పుస్తకం అప్పట్లో సంచలనం సృష్టించింది. కొంతమంది 'ఇదంతా అతిశయోక్తి' అని కొట్టిపారేశారు. కానీ.. వారి అంచనాలను ప్రస్తుత పరిస్థితులతో పోలిస్తే అవి నిజమయ్యే దిశగా పరిణామాలు సంభవిస్తున్నాయని ప్రముఖ వృత్తి సేవల సంస్థ కేపీఎంజీ ఇంటర్నేషనల్‌కు చెందిన గయా హెర్రింగ్టన్ అనే పరిశోధకురాలు అభిప్రాయపడ్డారు. మానవుల తీరు ఇలాగే కొనసాగితే దశాబ్దకాలంలో ఆర్థికాభివృద్ధి.. 2040 నాటికి మానవ సమాజం పూర్తిగా పతనమైపోతాయని హెచ్చరించారు.

1972లో ఎంఐటీ పరిశోధకులు ఈ అధ్యయనం చేస్తూ 1900 నుంచి 2060 దాకా మానవ సమాజ వికాసం గురించి అంచనా వేశారు. అందులో ప్రపంచ జనాభా, జనన, మరణాల రేటు, పారిశ్రామికోత్పత్తి, ఆహార ఉత్పత్తి, వైద్య, విద్యా సేవలు, పునరుత్పాదక ఇంధనాల వినియోగం, కాలుష్యాన్ని ఆధారంగా తీసుకున్నారు. అప్పట్లో దీనికి 'వరల్డ్ 1' అనే కంప్యూటర్ ప్రోగ్రామ్‌ను వినియోగించారు. ఆ ప్రోగ్రామ్‌ను రాసింది ఎంఐటీకి చెందిన జెర్రీ ఫాస్టర్.

1900 నుంచి జనాభా ఎలా పెరుగుతూ వచ్చింది.. జీవన నాణ్యత 1900 నుంచి 1940 దాకా ఎలా పెరిగిందీ... అక్కడి నుంచి పెరుగుదల వేగం మందగించి.. 2020కి పతాకస్థాయికి చేరి ఆ తర్వాత ఎలా పతనమయ్యేది... ఆ ప్రోగ్రామ్ ద్వారా గ్రాఫ్‌ల రూపంలో చూపారాయన. 1972 తర్వాత జీవన నాణ్యత ఎలా పడిపోబోయేది కూడా ఆ

ప్రోగ్రామ్ సరిగ్గానే ఊహించగలిగింది. 2020ని మానవ నాగరికతకు శిఖరస్థాయిగా ఆ ప్రోగ్రామ్ ఊహించింది. "2020 నాటికి ప్రపంచం పరిస్థితి విషమంగా మారుతుంది. దాన్ని నివారించడానికి ఏమీ చేయకపోతే జీవననాణ్యత సున్నాకు పడిపోతుంది" అని 1973లో ఫాస్టర్ హెచ్చరించారు.

"కాలుష్యం మనుషుల ప్రాణాలు తీయడం మొదలుపెట్టే స్థాయికి చేరుకుంటుంది. దానివల్ల జనాభా తగ్గిపోవడం మొదలై.. 2040-2050 నాటికి ప్రపంచ జనాభా 1900 కన్నా తక్కువకు పడిపోతుంది" అని ఫాస్టర్ 1973లో హెచ్చరించారు. అప్పట్లో ఫాస్టర్ బృందం ఈ అంచనాలకు వినియోగించిన నమూనానే కేపీఎంజీ పరిశోధకురాలు హెర్రింగ్టన్ కూడా వాడారు. అయితే వరల్డ్ 1 ప్రోగ్రామ్‌కు బదులు.. దాని మూడోతరం వెర్షన్ 'వరల్డ్ 3' ప్రోగ్రామ్‌ను వినియోగించారు. మనిషి పర్యావరణాన్ని ఎంత విచ్చలవిడిగా వాడేశాడు అనే అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నారు. మానవుల తీరులో ఎలాంటి మార్పులూ రాకుంటే పదేళ్లలోనే ఆర్థికాభివృద్ధి మందగించిపోతుందంటున్నారు హెర్రింగ్టన్.. 2040 నాటికి మానవ సమాజం పూర్తిగా పతనమయ్యే ముప్పు పొంచి ఉందని ఆమె హెచ్చరిస్తున్నారు. అయితే.. సాంకేతికంగా ఇంకా పురోగతి సాధించి, ప్రజాసేవలపై మరింత ఎక్కువ పెట్టబడి పెట్టగలిగితే మాత్రం ఈ ముప్పు నుంచి తప్పించుకోవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ అధ్యయన ఫలితం ఏల్ జర్నల్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఎకాలజీ ప్రచురిచింది.

ఆపగలిగేది మనమే

జీవుల ఆరో అంతర్ధాన ప్రక్రియ వేగం పుంజుకున్నప్పటికీ దీన్ని ఆపగలిగిందీ మనిషే. కొవిడ్-19 విజృంభణ నేపథ్యంలో వన్యప్రాణి మార్కెట్లు పర్యావరణానికే కాదు, ఆరోగ్యానికీ హానికరమేనన్న స్పృహ పెరగటం కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. వియత్నాం ప్రభుత్వం వన్యప్రాణుల దిగుమతి, అక్రమ వన్యప్రాణి మార్కెట్లపై నిషేధం విధించింది. చైనాలోనూ కొన్ని ఆంక్షలు పెట్టారు. ఇలాంటి ప్రయత్నాలు ప్రపంచవ్యాప్తంగా అమలైతే మంచి ఫలితం కనిపిస్తుందనటం నిస్సందేహం.

మనుషుల్నే కాదు.. జీవుల్నీ లెక్కించాలి..

పదేళ్లకొకసారి మన దేశంలో జనభా గణన జరుగుతుంటుంది. కొద్దిపాటి తేడాలతో ప్రతి దేశంలోనూ ఇలాంటి కసరత్తు సాధారణమే. పాడి పశువులు, ఇళ్లలో పెంచుకునే జంతువులను లెక్కించడం కూడా కొద్దోగొప్పో జరుగుతోంది. కానీ అసలు భూమండలం మీద బతుకుతున్న జీవుల సంఖ్యను లెక్కించడం సాధ్యమేనంటారా? ఉపగ్రహ చిత్రాలు, కృత్రిమ మేధ మేళవింపుతో అంతరిక్షం నుంచే జంతువులను ఎప్పటికప్పుడు వీటిని పర్యవేక్షించొచ్చు అని చెబుతున్నారు శాస్త్రవేత్తలు. ఇటీవల ఆఫ్రికా గడ్డి మైదానాల హైరిజల్యూషన్ ఫొటోలతో పరిశోధకులు ఆల్గోరిథమ్ రూపొందించారు. వేలాది మైళ్ల

విస్తీర్ణంలో ఏనుగులను లెక్కించారు. పెద్ద జంతువులనే కాదు.. చిన్న ప్రాణులను, పొదల్లో దాగిన వాటిని గుర్తించే విధంగానూ దీన్ని తీర్చిదిద్దే దిశగా శాస్త్రవేత్తలు ప్రయత్నాలు ఆరంభించారు. ఉదాహరణకు- పెంగ్విన్ల కాలనీల సైజును బట్టి వాటి సంఖ్యను లెక్కించటం, పాద ముద్రల ఆధారంగా చిన్న జంతువుల గుంపులను పసిగట్టటం.

మళ్లీ బతికిద్దాం.. ఇలా

క్లోనింగ్ ప్రక్రియ మరో పరిష్కారం కానుంది. సుమారు 30 ఏళ్ల కిందట చనిపోయిన బ్లాక్ ఫుటెడ్ ఫెర్రెట్ క్షీరదం నుంచి కొత్త జంతువును విజయవంతంగా క్లోన్ చేసినట్టు 2020 సంవత్సరంలో శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఉత్తర అమెరికాలో నివసించే ఇవి 1980 వరకు చిన్న గుంపుగా కనిపించేవి. క్రమంగా అంతరించే ముప్పులో పడ్డాయి. దీంతో 1980లో చనిపోయిన ఆడ ఫెర్రెట్ జన్యు ప్రతి నుంచి క్లోన్ చేశారు. ఇలా క్లోన్ చేసిన జంతువులను కొంతకాలం తర్వాత తిరిగి అడవుల్లో విడిచిపెట్టే అవకాశముందని శాస్త్రవేత్తలు ఆశిస్తున్నారు.

భారత్‌లో కొవిడ్ రెండోదశ కరాళ నర్తనం

మనిషి స్వయంకృతమో.. లేక ప్రకృతిసిద్ధంగానే పుట్టిందో ప్రస్తుతానికి తెలీదు కానీ.. కొవిడ్ మహమ్మారి మాత్రం ప్రపంచదేశాలను కల్లోలపరుస్తోంది. అమెరికా, రష్యా, బ్రెజిల్, ఇటలీ సహా ఏ దేశానికీ మినహాయింపు లేదు.

2021 మే, జూన్ నెలల్లో భారత్‌లో కొవిడ్ రెండో దశ కరాళ నర్తనం చేసింది..

ఇద్దరేసి కొవిడ్ రోగులు ఆస్పత్రిలో ఒకే పడకపై యాతన పడటం, స్వయంగా కొనుక్కున్న ఆక్సిజన్ సిలిండర్‌ను అంటిపెట్టుకుని పడక కోసం ఎదురుచూస్తున్న మరో అభాగ్య రోగి- పడకలు దొరక్క ఆసుపత్రుల ఆవరణలోనే కన్నుమూయడం వంటి దృశ్యాలు మనసుల్ని కలచివేయడమే కాదు, జాతికి సిగ్గుచేటుగా నిలిచాయి.

ఆసుపత్రుల్లో ఆక్సిజన్ కొరతను తీర్చడమెలా అన్న అంశంపై దేశ ప్రధానమంత్రి స్వయంగా సమీక్షా సమావేశాన్ని నిర్వహించవలసి వచ్చిందంటే, పరిస్థితి ఎంత దిగజారిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఇది సర్కారీ వైఫల్యానికి పక్కా నిదర్శనం.

సాధారణంగా ఆక్సిజన్ లభ్యత, అవసరం, సరఫరాల గురించి సమీక్షించి, చర్యలు తీసుకోవలసిన బాధ్యత దిగువ, మధ్యశ్రేణి ప్రభుత్వ యంత్రాంగాలది. అది కూడా సంక్షోభం విరుచుకుపడటానికి ముందు చేయాల్సిన పని. కొవిడ్ మొదటిదశ ముగిసిన ఏడాది తర్వాత కూడా.. కొవిడ్ రెండో ఉద్ధృతి విరుచుకుపడవచ్చని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నా కూడా ప్రభుత్వ యంత్రాంగం అజాగ్రత్తగా ఉండిపోయిన ఫలితంగా దేశంలో మరణ మృదంగం మోగింది. కొవిడ్ దశలవారీగా విజృంభిస్తుందనీ, దాన్ని అదుపుచేసే మందులు లేవని తెలిసి కూడా స్థానిక, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ముందుగానే ఎందుకు నివారణ, నియంత్రణ చర్యలు తీసుకోని ఫలితంగా లక్షలమంది అమాయకులు బలైపోయారు. ఎన్నో కుటుంబాలు తీవ్ర సంక్షోభంలో చిక్కుకుపోయాయి.

ఇది చాలా ఆందోళనకర పరిణామం. ఇంతవరకు ప్రకృతి ఉత్పాతాలు, అల్లర్లు, ఇతర కల్లోలాలు జరిగినప్పుడల్లా స్థానిక స్థాయిలో మాత్రమే సంస్థాగత వైఫల్యాలు కనిపించేవి. మధ్య, ఉన్నత స్థాయి పాలనా యంత్రాంగాలు పరిస్థితిని చక్కదిద్దడానికి వేగంగా, సమర్థంగా పనిచేసేవి. అందువల్లనే మన వ్యవస్థలు అనేక సంక్షోభాలను అధిగమిస్తూ వచ్చాయి. కానీ, ఇటీవలి కాలంలో పాలనా యంత్రాంగం అతిగా కేంద్రీకృతమైంది. ఇబ్బందిపెట్టే ప్రశ్నలు అడగడానికి ఎవరూ సాహసించని పరిస్థితి నెలకొంది. ప్రజాస్వామ్యంలో ఇది అత్యంత అవాంఛనీయ ధోరణి. భారత్ వంటి సువిశాల దేశంలో అధికారాలు, కార్యనిర్వహణ భారాలు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం గుప్పిట్లో ఉండటం మంచిది కాదని మన రాజ్యాంగ నిర్మాతలు భావించారు. అందుకే రాష్ట్రాలు, స్థానిస సంస్థలకు కూడా అధికారాలు, విధులు, బాధ్యతలు పంచారు. కానీ, ప్రస్తుత తరం నాయకులు అధికార వికేంద్రీకరణ భావనను తలకెక్కించుకోవడానికి సిద్ధపడడంలేదు.

నెలలో కోటి కేసులు, 10 వేల మరణాలు!

సరిగ్గా 30 రోజుల వ్యవధిలో దేశ వ్యాప్తంగా కోటి కేసులు, 90 వేలకుపైగా మరణాలు చోటుచేసుకున్నాయి! తొలి ఉద్ధృతిలో ఇన్ని కేసులు రావడానికి 325 రోజులు, మరణాలు సంభవించడానికి 238 రోజులు పట్టాయి. రెండోదశలో అంతకు పదిరెట్ల వేగంతో మహమ్మారి చుట్టుముట్టేసింది! ఇప్పటివరకూ మొత్తం కేసుల్లో మరణాలు 1.09% కాగా, ఒక్క మేనెలలో నమోదైనవి 0.88%గా ఉన్నాయి. రేటు పరంగా తక్కువే అయినా.. వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆప్తులు, స్నేహితుల మరణవార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. తొలిదశలో కనిపించని భయానక పరిస్థితి అంతటా అలుముకొంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం సగటున 20.06% పాజిటివిటీ రేటు నమోదైంది. ఇంత భారీస్థాయిలో ప్రస్తుతం మరే దేశంలోనూ వైరస్ విస్తరించడం లేదు. 2021 ఏప్రిల్ ద్వితీయార్ధంతో పోల్చితే... మే తొలివారంలో 8.07% కేసులు, 49% మరణాలు పెరిగాయి.

ప్రజల దగ్గర నుంచి ప్రభుత్వం వరకు అన్నిరకాలుగా విఫలం కావడం వల్లనే కొవిడ్ కేసులు విజృంభించి ప్రాణాలతో చెలగాటమాడాయి. దేశం ఆర్థికంగా కోలుకోలేనంతగా దెబ్బతీశాయి. భారతీయులకు కరోనా వైరస్ పెద్దగా సోకదనే తప్పుడు ప్రచారం అందర్నీ నిర్లక్ష్యంలోకి నెట్టి, బాధ్యతారహితంగా ప్రవర్తించేలా చేసింది. కొవిడ్ మొదటి దశ ముగిశాక ప్రజలు జాగ్రత్తలు పాటించకుండా ఇష్టారాజ్యంగా తిరగడం, ప్రభుత్వాలు దీన్ని నివారించకుండా ఉదాసీనత పాటించడం పరిస్థితిని దిగజార్చింది. అతి ధీమాతో ముందస్తు నియంత్రణ ప్రణాళికను గాలికి వదిలేశారు. నీతి ఆయోగ్ మొదలుకొని వివిధ ప్రభుత్వ విభాగాల వరకు ఇదే అశ్రద్ధ. గతేడాది చేదు అనుభవాల నుంచి అవి ఏమీ

నేర్చుకోకపోవడం వల్లనే ముంచుకొస్తున్న ముప్పును ముందే గ్రహించలేక, విపత్తును ఎదుర్కోవడానికి సన్నద్ధం కాలేకపోయాయి. రాజకీయ నాయకులు ఇలా విఫలమయ్యారంటే కొంతవరకు అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ యంత్రాంగం అన్ని స్థాయుల్లో విఫలమవడం మాత్రం జీర్ణించుకోలేనిది. వ్యవస్థలను నడిపేవారు, ప్రణాళికలను రచించి అమలు చేసేవారు కూడా విఫలం కావడం చాలా ఆందోళనకరం. వ్యక్తుల వైఫల్యం కన్నా వ్యవస్థల వైఫల్యం ఎంతో ప్రమాదకరం.

ఆరోగ్యపరమైన అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి ముందస్తుగా తగు వసతులు ఏర్పాటుచేసుకోకపోవడం, రెమ్‌డెసివిర్ వంటి ముఖ్యమైన మందులను కావలసిన పరిమాణంలో ఉత్పత్తి చేయకపోవడం, ఆస్పత్రి పడకలను పెంచకపోవడం, ఆక్సిజన్‌ను నిల్వచేసుకోకపోవడం వంటి వైఫల్యాలు ప్రభుత్వ యంత్రాంగపరంగా, సంస్థాపరంగా జరిగినవే. 2020 మే నెల నుంచి 2021 జనవరి చివరి వరకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు 38,867 వెంటిలేటర్లను సరఫరా చేసిందని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి ఫిబ్రవరిలో రాజ్యసభలో ప్రకటించారు. అంటే ప్రభుత్వం 139 కోట్ల భారతీయులకు రోజుకు కేవలం 144 వెంటిలేటర్లను సరఫరా చేయగలిగిందన్నమాట. ప్రతి 90 లక్షలమంది భారతీయులకు ఒక్క వెంటిలేటర్ చొప్పున అందించిందని అర్థం. ప్రభుత్వ పణాళికా లోపం, అజాగ్రత్తలకు ఇదే ప్రతీక. అన్ని అవసరాలనూ మార్కెట్టే తీరుస్తుందనీ, ప్రభుత్వం కేవలం ప్రోత్సాహక పాత్ర పోషించాలన్న తప్పుడు అవగాహన ఈ దురవస్థకు మూలకారణం.

అమెరికా కూడా ప్రైవేటుకు అప్పగించేయలేదు..

టీకాల విషయంలో కూడా అదే ధోరణి! లాభాపేక్ష, దురాశ, నష్ట భయం, భావి అవకాశాల గురించి మాత్రమే ప్రైవేటు సంస్థలు పట్టించుకుంటాయి. తమ వ్యాపార వృద్ధి కోసమే అవి తపిస్తాయి తప్ప మానవ సంక్షేమం కోసం పాటుపడవు. అయినా, ప్రభుత్వం

వ్యాక్సినేషన బాధ్యతను పూర్తిగా ప్రైవేటుకే వదిలేసింది. జనాభాలో కనీసం 80 కోట్లమందికి టీకాలు వేస్తే కానీ, సామూహిక రోగనిరోధక శక్తి ఏర్పడదు. ఒక్కో వ్యక్తికి రెండు డోసులు వేయాలి కాబట్టి, కనీసం 160 కోట్ల డోసులు అవసరం. ఇంతటి బృహత్తర భారాన్ని పూర్తిగా ప్రైవేటు రంగానికి వదిలేసి ప్రభుత్వం పెద్ద తప్పు చేస్తోందనే వాదనలను వినేవారేరి?

ప్రైవేటు విపణికి పట్టం కట్టే అమెరికా సైతం ఇలాంటి తప్పు చేయలేదు. అక్కడ పూర్వ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ తమ జనాభా కోసం భారీఎత్తున టీకాలు ఉత్పత్తి చేయడానికి డాలర్లు కుమ్మరించారు. రక్షణ ఉత్పత్తుల చట్టాన్ని మళ్లీ ప్రయోగించి ప్రైవేటు కంపెనీలన్నీ దేశ అవసరాలకే ఉత్పత్తి సాగించాలి తప్ప ఎగుమతులు చేయకూడదని నియంత్రణ విధించారు. పూర్తిగా మార్కెట్‌కే వదిలేయకుండా ప్రభుత్వం సారథిలా వ్యవహరించాలనే అవగాహన వారిలో కనబడింది. భారత ప్రభుత్వం ఇలాంటి జాగరూకత ప్రదర్శించలేదు. ప్రతిదీ మార్కెట్‌కు వదిలేయకుండా భారత్ ఇమ్యునోలాజికల్స్ వంటి ప్రభుత్వ వ్యాక్సిన్ ఉత్పత్తిదారులకు నిధులు కేటాయించాల్సింది. ప్రభుత్వం సంస్థలు సరసమైన ధరలకు భారీఎత్తున టీకాలు ఉత్పత్తి చేయగలిగేవి. ప్రైవేటీకరణే తారకమంత్రమంటున్న ప్రభుత్వం ఈ వాస్తవాన్ని పట్టించుకోలేదు.

భారత్‌లో 42 లక్షలమంది మృతి?

'న్యూయార్క్ టైమ్స్' అంచనా..

భారత్ ప్రకటిస్తున్న కరోనా కేసులు, మరణాల గణాంకాల్లో వాస్తవమెంత? క్షేత్రస్థాయిలో వాస్తవిక పరిస్థితులపై 'న్యూయార్క్ టైమ్స్' వార్తాపత్రిక సేకరించిన సమాచారంలో నివ్వెరపరిచే విషయాలు వెలుగుచూశాయి. ఇందుకోసం 12 మందికిపైగా నిపుణుల సహకారాన్ని తీసుకున్నారు. మూడు సీరో సర్వేల సమాచారం, గణాంకవేత్తల సూచనలు ప్రాతిపదికగా అంచనా నివేదికను రూపొందించారు. 2021 మే 24 నాటికి దేశంలో కరోనా కేసులు 2.69 కోట్లు, మరణాలు 3.07 లక్షలు ఉన్నాయని భారత ప్రభుత్వం చెబుతోంది. అధికారిక లెక్కల కంటే కరోనా కేసులు 26 రెట్లు ఎక్కువగా నమోదై ఉంటే 70.7 కోట్లకు, మరణాలు 42 లక్షలకు చేరి ఉండొచ్చని పేర్కొనడం గమనార్హం. గ్రామీణ ప్రాంతాల్లో చాలావరకు కొవిడ్ మరణాలు ఇళ్ల వద్దే సంభవించడం, కొవిడ్‌కు సంబంధించిన యంత్రాంగం పటిష్ఠంగా లేకపోవడం వల్ల అధికారిక కేసులు, వాస్తవిక గణాంకాల మధ్య భారీ వ్యత్యాసం ఏర్పడిందని నిపుణులు విశ్లేషించారు. 'వాస్తవిక కొవిడ్ కేసులు'.. 28.5 రెట్లు ఎక్కువ ఉండొచ్చని మొదటి సీరో సర్వే (2020 మే 11 -జూన్ 4), 26.1 రెట్లు ఎక్కువగా ఉండొచ్చని మూడో సీరో సర్వే (2020 డిసెంబరు 18 - 2021 జనవరి 6) తెలిపాయని న్యూయార్క్ టైమ్స్ గుర్తుచేసింది. భారత్ వంటి భారీ జనాభా ఉన్న దేశంలో సర్వేలు వాస్తవిక పరిస్థితిని అంచనా వేయలేవని అమెరికాలోని యేల్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అసోసియేట్ ప్రొఫెసర్ డాన్ వేన్‌బర్గర్ అభిప్రాయపడ్డారు. "దడ పుట్టిస్తున్న రెండో

కరోనా వేవ్ ప్రారంభమవడానికి ముందే జనవరిలో భారత్‌లో మూడో జాతీయ సీరో సర్వే జరిగింది. నమోదైన కేసుల కంటే వాస్తవిక కేసులు 26 రెట్లు ఎక్కువే ఉండొచ్చని అది అంచనా వేసింది. 'న్యూయార్క్ టైమ్స్' ఆ లెక్కన గణించినా భారత్‌లో కరోనా కేసులు 70 కోట్లు, మరణాలు 42 లక్షలు దాటాయి" అని సెంటర్ ఫర్ డిసీజ్ డైనమిక్స్, ఎకానమిక్స్ అండ్ పాలసీ డైరెక్టర్ డాక్టర్ రామనన్ లక్ష్మీనారాయణ్ అంచనా వేశారు.

భారత్‌లో 52 కోట్లమందికి కరోనా?

సీఎన్ఎన్ వార్తా సంస్థ సంచలన కథనం

కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న కరోనా కేసులు, మరణాల సంఖ్య నిజానికి అంతకు 30 రెట్లు అధికంగా ఉన్నాయని, కేసుల సంఖ్య కూడా సర్కారు చెబుతున్న దానికంటే చాలా ఎక్కువగా ఉందని దిగ్గజ మీడియా సంస్థ సీఎన్ఎన్ అంటోంది. ఆ మేరకు ఆధారాలతో ఓ సంచలన కథనాన్ని ప్రచురించింది. ఆ కథనం ప్రకారం భారత్‌లో ఇప్పటి వరకు కరోనా బారిన పడ్డవారి సంఖ్య 52 కోట్లు, మరణాలు 9.90 లక్షలుగా ఉన్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం 2021 ఏప్రిల్ 27 నాటికి మొత్తం 1.76 కోట్ల మంది కరోనా బారిన పడగా, 1.98 లక్షలమంది కొవిడ్‌తో చనిపోయారు. భారత్‌లో ప్రభుత్వం వెల్లడిస్తున్న గణాంకాలకు మరో 30 రెట్లు ఎక్కువగా కేసులు, మరణాలు నమోదయ్యాయని శాస్త్రవేత్తలు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు నిజాలను దాచిపెడుతున్నాయని ఆరోపిస్తున్నారు.

వనరుల లేమి, మానవ తప్పిదాలు, పరీక్షలు తక్కువగా ఉండడం వంటి కారణాలతో లెక్కలు తక్కువగా ఉంటున్నాయని చెబుతున్నారు. అధికారిక లెక్కలకంటే కేసుల సంఖ్య, మరణాలు ఎక్కువగానే ఉన్నాయని దిల్లీలోని సెంటర్ ఫర్ డిసీస్ డైనమిక్స్, ఎకనామిక్స్ అండ్ పాలసీ డైరెక్టర్ రామనన్ లక్ష్మీనారాయణన్ అన్నారు. సెకండ్‌వేవ్‌లో అధికారిక లెక్కలకు మంచి మరణాలున్నాయన్నారు. వాషింగ్టన్ వర్సిటీకి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవాల్యుయేషన్స్ భారత్ భవిష్యత్‌పై ఆందోళన వ్యక్తం చేసింది. మొదటివేవ్‌తో పోలిస్తే సెకండ్‌వేవ్‌లో భారత్‌లో పరీక్షల సంఖ్య పెరిగింది. 2020 ఏప్రిల్ మూడో వారంలో రోజుకు 5 లక్షల పరీక్షలు నిర్వహించగా, 2021లో రోజుకు 20 లక్షలకు చేరుకుందని డబ్ల్యూహెచ్‌వో చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ సౌమ్య స్వామినాథన్ పేర్కొన్నారు. అయినా భారత్ ఉన్న పరిస్థితుల్లో 20 లక్షల పరీక్షలు చాలా తక్కువన్నారు. కరోనాతో ఇళ్లలో చనిపోయేవారి లెక్కలను ప్రభుత్వం బయటపెట్టడంలేదని కమ్యూనిటీ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ హేమంత్ షేవాడే పేర్కొన్నారు. హోమ్ ఐసొలేషన్‌లో ఉన్నవారు చనిపోతే, వాటిని కరోనా మరణాలుగా లెక్కించడంలేదన్నారు.

అన్ని దేశాలవీ దొంగ లెక్కలేనా!

ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ కొవిడ్ మరణాలను తక్కువ చేసి చూపుతున్నట్లు వాషింగ్టన్ విశ్వవిద్యాలయం వేదికగా పనిచేస్తున్న స్వతంత్ర ప్రపంచ ఆరోగ్య పరిశోధన సంస్థ 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవాల్యూయేషన్ (ఐహెచ్ఎంఈ)' పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా 2021 మే నాటికి కొవిడ్‌తో 69 లక్షల మంది చనిపోయి ఉంటారని ఈ సంస్థ అంచనా వేసింది (మేనాటికి దాదాపు 32.64 లక్షల మంది చనిపోయినట్లు వివిధ దేశాలు వెల్లడించిన గణాంకాలు చెబుతున్నాయి). భారత్‌లో కొవిడ్ మరణాల సంఖ్య 6.54 లక్షలుగా పైగా ఉండొచ్చని పేర్కొంది. ఈ మేరకు అధ్యయన నివేదికను మేనెలలో విడుదల చేసింది.

ఈ సంస్థ 59 దేశాల్లోని 198 రాష్ట్రాల్లోని పరిస్థితులను అధ్యయనం చేసింది. "అన్ని రకాల సమాచారాన్ని (డేటాను) విశ్లేషిస్తే.. ప్రస్తుతం లెక్కల్లో చెప్పినదాని కన్నా ఎక్కువగానే మరణాలున్నట్లు నిర్ధారించుకొని వాస్తవానికి దగ్గరగా రావడానికి ప్రయత్నించాం. మరణాలు అధికంగా సంభవించడానికి రకరకాల కారణాలున్నాయి. చాలామంది ప్రజలు ఆసుపత్రులకు దూరంగా ఉన్నారు. కొన్ని దేశాల్లో ఆందోళన (డిప్రెషన్)తోపాటు, మందుల వినియోగం పెరిగిపోయింది. ఇలాంటి కారణాల వల్ల కొన్ని మరణాలు పెరిగి ఉండొచ్చు. విభిన్న రకాల ఆంక్షల కారణంగా ప్రపంచవ్యాప్తంగా 5% మేర రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గాయి. లాక్‌డౌన్‌ల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఫ్లూ, రెస్పిరేటరీ సినిస్టియల్ వైరస్ (ఆర్ఎస్‌వీ) మరణాలు తగ్గాయి. కొవిడ్ తీవ్రంగా ఉన్న సమయంలో హృద్రోగం, దీర్ఘకాల ఊపిరితిత్తుల సమస్య ఉన్నవారు కూడా మరణిస్తున్నారు. ఇలాంటి లెక్కలన్నింటినీ కలిపి చూసినప్పుడు

మరణాలు అధికారిక లెక్కల కంటే ఎక్కువే ఉన్నాయని అర్థమవుతోంది. ఈ విశ్లేషణతో కొవిడ్ ప్రభావం ఇప్పటివరకు ఊహించిన కంటే ఘోరంగా ఉన్నట్లు తెలుస్తోంది" అని ఆ సంస్థ పేర్కొంది.

ఇప్పటి నుంచి 2021 సెప్టెంబరు నాటికి ప్రపంచవ్యాప్తంగా 20 లక్షల మరణాలు సంభవించే అవకాశం ఉందని, అందులో సగం వరకు భారత్‌లో ఉండే ప్రమాదం ఉందని సంస్థ ప్రొఫెసర్ క్రిస్టోఫర్ జేఎల్ ముర్రే తెలిపారు. ప్రధానంగా తూర్పు ఐరోపా, మధ్య ఆసియాలో మరణాలను తక్కువగా చూపుతున్నట్లు పేర్కొన్నారు. ఈజిప్ట్‌లో ప్రభుత్వం చెప్పిన లెక్కల కంటే 10 రెట్లు ఎక్కువ మరణాలున్నట్లు అధ్యయనంలో తేలిందన్నారు. పరీక్షలు ఎక్కువ చేయకపోతే లెక్కలోకి రాని కొవిడ్ మరణాలు అధికంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. ఈ గణాంకాలన్నింటినీ సరిపోల్చుకొని తాము ఈ అంచనా వేసినట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనారోగ్య సమస్యలపై ఏళ్లతరబడి పనిచేస్తున్న అనుభవంతో ఈ లెక్కలు వేసినట్లు వెల్లడించారు. 155 దేశాల్లో 6,500 మందితో కలిసి తాము పనిచేస్తున్నట్లు వివరించారు.

మృతుల లెక్క... తప్పుల తడక! వాషింగ్టన్ విశ్వవిద్యాలయం అంచనా

ప్రపంచవ్యాప్తంగా కొవిడ్ మరణాలకు సంబంధించి తాజా అధ్యయనమొకటి విస్తుపోయే విషయాలను బయటపెట్టింది! మృతుల సంఖ్యను లెక్కించడంలో పలు దేశాలు పారదర్శకంగా వ్యవహరించలేదని అభిప్రాయపడింది. భారత్‌లో 2021 మే నెల 3 నాటికి వాస్తవ కరోనా మరణాలతో పోలిస్తే.. 4.3 లక్షల మరణాలు తక్కువగా నమోదయ్యాయని అంచనా వేసింది. అమెరికా, రష్యా లెక్కల్లోనూ గణనీయమైన తేడాలు ఉన్నాయని తెలిపింది. 'కొవిడ్‌తో మొత్తం మరణాల అంచనా' పేరుతో 'యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్

హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవాల్యుయేషన్ (ఐహెచ్ఎంఈ)' ఈ అధ్యయన నివేదికను వెలువ రించింది.

ఆ అధ్యయనం ప్రకారం.. కొవిడ్ మరణాల లెక్కింపులో బ్రిటన్ మెరుగ్గా వ్యవహరిం చింది. ఉన్నంతలో ఆ దేశం కాస్త కచ్చితమైన గణాంకాలను బయటపెట్టింది. రష్యాలో అధి కారిక గణాంకాలకు, వాస్తవ లెక్కలకు మధ్య చాలా వ్యత్యాసముంది. అమెరికాలో మర ణాలు వాస్తవ లెక్కల కంటే 3.3 లక్షలు తక్కువగా నమోదయ్యాయి. వ్యాధి నిర్ధారణ పరీక్షలు తగిన సంఖ్యలో జరగకపోవడం మృతుల లెక్కల్లో తేడాలకు ప్రధాన కారణాల్లో ఒకటి. కరోనా మహమ్మారి విజృంభణ సమయంలో వారం వారం నమోదైన మరణాలు, అంతకుముందు సీజన్లలో చోటుచేసుకున్న మరణాల సగటును పోల్చిచూడటం ద్వారా ఐహెచ్ఎంఈ తాజా అధ్యయనాన్ని నిర్వహించింది.

దేశం	అధికారికంగా మరణాల సంఖ్య	వాస్తవ మరణాల అంచనా
భారత్	2,21,181	6,54,395
అమెరికా	5,74,043	9,05,289
మెక్సికో	2,17,694	6,17,127
బ్రెచ్కీజిజిల్	4,08,680	5,95,903
బ్రిటన్	1,50,519	2,09,661
రష్యా	1,09,334	5,93,614

(లెక్కలు - 2021 మే 3 నాటికి)

రాష్ట్రాల్లో దిగజారిన పరిస్థితులు

హైదరాబాద్‌కు చెందిన శ్రీకాంత్ తండ్రి 60 ఏళ్ల మాధవరావు ఒక ఆసుపత్రి నుంచి మరొక ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా దారిలో అంబులెన్స్‌లోనే మరణించారు. అప్పటికి వాళ్లు నాలుగు ఆసుపత్రులకు వెళ్లినా బెడ్స్ లేని కారణంగా వెనుదిరిగారు. "నా తండ్రికి సరైన సమయంలో వైద్యం అంది ఉంటే ఆయన ప్రాణాలు దక్కేవి. ఎవరూ కూడా మాకు సహాయం చేయలేదు" అని శ్రీకాంత్ అన్నట్లుగా ఒక వార్తా సంస్థ రిపోర్ట్ చేసింది. కరోనా వైరస్ రెండోదశ భారతదేశంలో అల్లకల్లోలం సృష్టించింది. పల్లె, పట్నం అని లేదు.. నగరం, మహానగరం అని లేదు.. ఎక్కడ చూసినా అంబులెన్సులు, శవాలే.. చనిపోయిన వారిని తీసుకెళ్లడానికీ ఎదురుచూడక తప్పడం లేదు. చాలా రాష్ట్రాల్లో పరిస్థితులు రోజురోజుకూ దిగజారిపోయాయి. పరిస్థితి అదుపులోనే ఉందని ప్రభుత్వం అంటోంది. కానీ వాస్తవాలు మరోలా ఉన్నాయి. కొవిడ్-19 సెకండ్ వేవ్ ప్రమాదకరంగా మారింది.

రెండో దశలో ఈ మహమ్మారి ఎవ్వరిని వదిలి పెట్టడం లేదు. పిల్లలను సైతం వదిలి పెట్టడం లేదు. చిన్నారులపెనా అధికంగా దాడి చేస్తుండడంతో తల్లిదండ్రులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. 10 నుంచి 15 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారిపై ఎక్కువగా కరనా దాడి చేసింది. 1-8 మధ్య వయసున్న వారిలో స్వల్ప లక్షణాలు కనిపించాయి.

గత ఏడాది కూడా పిల్లలకి కరోనా సోకినప్పటికీ వారిలో లక్షణాలు లేకపోవడంతో దానికి సంబంధించిన ఘటనలు పెద్దగా బయటకు రాలేదు. కరోనా వారికి ఎప్పుడు వచ్చిందో.. ఎప్పుడు పోయిందో తెలిసే అవకాశం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు.

గత ఏడాది చిన్న పిల్లల్లో 1 శాతంమందికి కరోనా సోకితే, ఈసారి 1.2 శాతంమందికి సోకినట్లు చెబుతున్నారు. శాతాల్లో చూస్తే తక్కువగానే కనిపించినా.. ఇది చాలా ఎక్కువేనంటున్నారు. ప్రభ్వుత్వం పిల్లల్లో కరోనాకు సంబంధించి ఎలాంటి అధికారిక గణాంకాలు విడుదల చేయడం లేదని వైద్యులు చెబుతుండడం విశేషం.

డబుల్ మ్యూటెంట్ కారణమా..

కరోనా సెకండ్‌వేవ్‌లో పిల్లలకు కరోనా సోకడానికి డబుల్ మ్యూటెంట్ కారణమని వైద్య నిపుణులు భావిస్తున్నారు. ఈ వైరస్‌కు త్వరగా వ్యాప్తి చెందే లక్షణంతో పాటుగా రోగనిరోధక వ్యవస్థను నిర్వీర్యం చేసే సామర్థ్యం కూడా ఉంది. దీంతో పిల్లల్లో సులభంగా సోకుతోంది. కరోనా తగ్గిన తర్వాత రెండు నుంచి నాలుగు వారాల్లో వచ్చే ఎంఐఎస్‌సీ (మల్టీ సిస్టమ్ ఇన్‌ఫ్లమేటరీ సిండ్రోమ్ ఇన్ చిల్డ్రన్) వ్యాధితో చాలామంది పిల్లలు తమ దగ్గరకు వచ్చినట్లు కోల్‌కతాకు చెందిన పీడియాట్రిషన్ డాక్టర్ జయదేవ్ రే తెలిపారు. అంతేకాకుండా కొవిడ్ సోకిన పిల్లల్లో 40-50 శాతంమంది గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడుతున్నట్లు ఆయన వెల్లడించారు.

ప్రస్తుతం పిల్లలకు వ్యాక్సిన్ లేదు. అమెరికాకు చెందిన ఫైజర్ తమ వ్యాక్సిన్ 12 నుంచి 15 ఏళ్ల వయసు వారిపై కూడా సమర్ధంగా పని చేస్తుందని వెల్లడించింది. అలాగే హైదరాబాద్‌కు చెందిన భారత్ బయోటెక్ 5 నుంచి 18 ఏళ్ల మధ్య వారిపై ప్రయోగాలు మొదలుపెట్టింది.



ఊపిరితిత్తుల్లో తీవ్ర ఇన్‌ఫెక్షన్

కరోనా సెకండ్‌వేవ్ 2021 ఏప్రిల్, మే, జూన్ నెలల్లో భారత్‌లో విశ్వరూపం ప్రదర్శించింది.. లక్షల్లో కొత్త కేసులు, వేలల్లో మరణాలతో భీతావహ పరిస్థితులను సృష్టించింది. కరోనాతో ఆసుపత్రి పాలైన వారికి ఆక్సిజన్ అందించాల్సి రావడం తప్పనిసరిగా మారింది. దాంతో దేశంలో ఆక్సిజన్ కొరత ఏర్పడింది. దీనికంతటికీ కారణం సెకండ్‌వేవ్‌లో రూపాంతరం చెందిన కరోనా మహమ్మారి మానవ ఊపిరితిత్తులను లక్ష్యంగా చేసుకోవడమే. బాధితులకు వైద్యులు సీటీ స్కాన్ పరీక్షలు సిఫారసు చేయాల్సి వచ్చింది. చాలామంది రోగుల ఊపిరితిత్తులు అత్యధిక మొత్తంలో ఇన్‌ఫెక్షన్‌కు గురైనట్టు ఆ సీటీస్కాన్‌ల ద్వారా వెల్లడైంది. కొందరి ఊపిరితిత్తుల్లో 50 శాతం కరోనా వైరస్ ప్రభావానికి గురవడమే కాదు, వారిలో ఆక్సిజన్ స్థాయిలు 85కి పడిపోయాయి. ఇదంతా ఒక్కరోజులోనే జరిగిపోయేదని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కరోనా మొదటిదశలో సీటీస్కాన్ తీయించుకున్న కరోనా రోగుల హెచ్‌ఆర్ సీటీ స్కోరు 25 పాయింట్లకు 6 నుంచి 8 పాయింట్ల వరకు నమోదైతే, సెకండ్‌వేవ్‌లో అది 12 నుంచి 14 వరకు నమోదైందని నిపుణులు వెల్లడించారు. ఈ తరహా లక్షణాలు గతంలో వృద్ధుల్లో ఎక్కువగా కనిపిస్తే, సెకండ్‌వేవ్‌లో యువత కూడా కరోనా కారణంగా తీవ్ర స్థాయిలో ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌కు గురైంది..

ఐదారు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, ప్రభుత్వ అధికారులు, డాక్టర్లు, నర్సులు, ఫ్రంట్‌లైన్ వర్కర్లు అనేకమంది కొవిడ్ బారినపడ్డారు. కొవిడ్ పరీక్షల కోసం జనం బారులు తీరారు. ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద ఆరుబయటే ప్రాణాలు విడిచినవాళ్ల దృశ్యాలు కలచివేశాయి. వాళ్లను ఆస్పత్రిలో చేర్చుకునేందుకు పడకలు ఖాళీగా లేకపోవడం

విషాదకరం. బెడ్స్ లేవంటూ రెండు ఆసుపత్రులు తన తల్లిని చేర్చుకోలేదని ఓ ప్రభుత్వ ఆసుపత్రి బయట ఒక యువతి కన్నీళ్లు పెట్టుకుంది. "పడకలు లేవని వారు చెబుతున్నారు. కనీసం రోగిని ఆస్పత్రిలో చేర్చుకుని నేల మీదైనా పడుకోబెట్టి కొంత చికిత్స అందించండి. నాలాంటి వాళ్లు ఎంతోమంది ఉన్నారు. దయచేసి నా తల్లికి చికిత్స అందించండి" అంటూ ఆ యువతి విలపించింది. కానీ సహాయం చేయడానికి ఎవరూ రాలేదు. ఇలా ఎందరో!

మెట్రో నగరాల్లో పరిస్థితి ఘోరం.. ఆసుపత్రుల్లో వెయిటింగ్ లిస్టులు

దిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, అహ్మదాబాద్.. ఇలా ఏ మెట్రో నగరంలో చూసినా ఆసుపత్రుల వద్ద పదులకొద్దీ అంబులెన్సులు కనిపించాయి. చాలామంది బెడ్స్ దొరక్క వాటిలోనే ఆక్సిజన్ పెట్టుకుని బెడ్ కోసం ఎదురుచూస్తూ కనిపించారు. కొన్ని ఆసుపత్రులు వెయిటింగ్ లిస్టు పెట్టేశాయి. ఎవరైనా బెడ్ కోసం వస్తే ఫోన్ నంబరు, వివరాలు తీసుకుని.. ఖాళీ అయితే చెబుతామని చెప్పి పంపేశాయి. దీంతో బాధితుల బంధువులు ఆసుపత్రుల బయట నిరీక్షిస్తూ కనిపించారు. దిల్లీలో కారులో కూర్చుని ఆక్సిజన్ మాస్క్ పెట్టుకుని ఉన్న ఒక పెద్దాయన ఫొటో అందరినీ కలచివేసింది. ఆయన కుమారులు ఆయన్ను ఒక ఆసుపత్రి నుంచి మరొక ఆసుపత్రికి తిప్పినా బెడ్ దొరకలేదు. మర్నాడు ఒక ఆసుపత్రిలో బెడ్ దొరికింది. అప్పటికే పరిస్థితి విషమించడంతో ఆయన చనిపోయారు.

రిటైర్డ్ జడ్జి రమేష్‌చంద్ర సోషల్ మీడియాలో పెట్టిన ఓ పోస్టును వందలమంది షేర్ చేశారు. కరోనాతో మరణించిన భార్య మృతదేహాన్ని తమ ఇంటి నుంచి తీసుకువెళ్లమని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు. కానీ ఎవరూ సహాయం చేయడానికి ముందుకు రాలేదు. దాంతో ఆయన స్వహస్తాలతో ఒక లేఖ రాసి దాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'నాకు, నా భార్యకు కూడా కరోనా పాజిటివ్ వచ్చింది. నిన్న పొద్దున్నుంచి ప్రభుత్వ హెల్ప్‌లైన్ నంబర్లకు కనీసం 50 సార్లు కాల్ చేసి ఉంటాను. మాకు మందులు ఇవ్వడానికిగానీ, మమ్మల్ని ఆసుపత్రికి తీసుకెళ్లడానికిగానీ ఎవరూ రాలేదు. ప్రభుత్వం స్పందించని కారణంగా ఇవాళ పొద్దున్న నా భార్య చనిపోయింది' అని ఆ లేఖలో రాశారు.

ప్రధాని మోదీ నియోజకవర్గం వారణాసిలో 70 ఏళ్ల నిర్మలా కపూర్ కరోనాతో ఒక ఆసుపత్రిలో మరణించారు. ఆమె కుమారుడు విమల్ కపూర్ బీబీసీ వార్తా సంస్థతో మాట్లాడుతూ 'పరిస్థితి చాలా భయంకరంగా ఉంది. చాలామంది అంబులెన్సుల్లోనే చనిపోవడం నా కళ్లారా చూశాను. పడకలు లేవని రోగులను ఆసుపత్రుల నుంచి పంపించేస్తున్నారు. మెడికల్ షాపుల్లో మందులు దొరకట్లేదు. ఆక్సిజన్ దొరకడం గగనమైపోయింది' అని తెలిపారు. తన తల్లిని శ్మశానవాటికకు తీసుకెళితే అక్కడ శవాలు కుప్పలుగా పడి ఉన్నాయని విమల్ చెప్పారు. చితి పేర్చేందుకు వాడే కలప ధర మూడు రెట్లు పెరిగింది. దహన సంస్కారాల కోసం 5-6 గంటలు నిరీక్షించాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితిని నేను ఇంతకుముందెప్పుడూ చూడలేదు. ఎక్కడ చూసినా అంబులెన్సులు, శవాలే

కనిపిస్తున్నాయి అని విమల్ చెప్పారు. కొవిడ్ మృతుల కథలు, దానివల్ల నాశనమైన కుటుంబాల వెతల మధ్య కరోనా ఊహించని వేగంతో వ్యాపించింది. మేనెలలో ఉత్తర్‌ప్రదేశ్‌లో అత్యధికంగా 30,596 రోజువారీ కొవిడ్ కేసులు నమోదయ్యాయి. తగినన్ని పరీక్షలు చేయకుండా, ప్రైవేటు ల్యాబ్‌ల డాటా కలుపుకోకుండా, కావాలనే కొవిడ్ కేసుల సంఖ్యను, మరణాల సంఖ్యను తక్కువగా చూపిస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపించినా ప్రభుత్వాలు పెద్దగా స్పందించనేలేదు.

మరణ ధ్రువీకరణ పత్రాల్లో మాయ

కిట్లు లేవంటూ చాలామందికి పరీక్షలు చేసేవారుకాదు. పాజిటివ్ వచ్చిన తరువాత కూడా వారి డాటాను ప్రభుత్వ వెబ్‌సైట్‌లోకి ఎక్కించలేదు. లఖ్‌నవూకు చెందిన 62 ఏళ్ల అజయ్‌సింగ్ తన భార్యకు పాజిటివ్ వచ్చినట్లు రిపోర్టులు చూపించారు. కానీ ప్రభుత్వ రికార్డులలో ఆమె వివరాలు ఎక్కడా కనిపించలేదు. ఒకవేళ కొవిడ్ పాజిటివ్ లిస్ట్‌లో పేర్లు ఉన్నా వారి మరణ ధ్రువీకరణ పత్రాల్లో కరోనా వైరస్ ప్రస్తావన ఎక్కడా కనిపించేదికాదు. ప్రభుత్వ గణాంకాలపై మీడియా కూడా సందేహాలు వ్యక్తం చేసింది. మీడియా రిపోర్టుల ప్రకారం.. హైదరాబాద్ సహా చాలా మెట్రో నగరాల్లోని శ్మశానవాటికల్లో దహనమవుతున్న మృతదేహాల సంఖ్యకు, ప్రభుత్వ గణాంకాల్లో నమోదైన కొవిడ్ మరణాల సంఖ్యకు పొంతన లేదనే వార్తలెన్నో వెల్లువెత్తిన కాలమది.

నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రభుత్వాలు

'రెండో వేవ్‌లో పరిస్థితి అసాధారణంగా మారిపోయింది. దేశంలో ఆరోగ్య వ్యవస్థ కుప్పకూలిపోవడమేకాక డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆరోగ్య కార్యకర్తలు

అనేకమంది కరోన బారిన పడ్డారు. 200 శాతం పని చేయాల్సిన చోట, 100 శాతం కూడా చేయలేకపోయాం. ఎందుకంటే ఆరోగ్య రంగం మొత్తం మ్యాన్‌పవర్ మీదే ఆధారపడి ఉంటుంది' అని ఒక ప్రైవేటు ఆసుపత్రిలోని మెడికల్ ఆఫీసర్ తెలిపారు. సెకండ్ వేవ్ ప్రభావాన్ని అంచనా వేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి. మొదటిదశ దాటాక 2020 సెప్టెంబరు, ఫిబ్రవరి మధ్య పరిస్థితి కొంత మెరుగైన సమయంలో వైద్య సదుపాయాలను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాల్సిందని ఎంతోమంది విశ్లేషకులు ప్రభుత్వాలను తప్పుపట్టారు. ఆక్సిజన్ బ్యాంకులు ఏర్పాటు చేయడంతోపాటూ మందులను నిల్వ చేసి ఉండొచ్చు. అవేమి చేయకుండా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించాయి. ఫలితంగా పరిస్థితి చేయి దాటిపోయింది.

అంతమంది రోగుల్ని ఎప్పుడూ చూడలేదు..

'మా ఆసుపత్రిలో ఆక్సిజన్ అందక 25 మంది చనిపోయారు.. ఏమీ చేయలేకపోయాను'.. ఐసీయూలో పనిచేసే ఓ నర్సు వాపోయారు. "హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో కొవిడ్ వార్డు ఐసీయూలో నేను నర్స్ ఇన్‌ఛార్జీని. కరోనా వ్యాప్తి మొదలైన తర్వాత చాలామంది నర్సులు ఉద్యోగాలు మానేశారు. మా జీతం చాలా తక్కువ, మాకొచ్చే జీతానికి ఇంత పెద్ద రిస్క్ తీసుకోలేమని వారు చెప్పారు. సెకండ్ వేవ్‌తో ఆసుపత్రులకు రోగులు పోటెత్తారు. మా ఆసుపత్రిలో కూడా పడకలు ఖాళీ లేక చాలామంది రోగులను తిప్పి పంపాల్సి వచ్చింది. మా పనిభారం ఐదు రెట్లు పెరిగింది. వైద్యులు, నర్సులు అందరూ అదనపు సమయం పనిచేయాల్సి వచ్చింది. నేను 22 ఏళ్లుగా నర్సుగా పనిచేస్తున్నాను. గతంలో పెద్దసంఖ్యలో రోగులను ఎమర్జెన్సీ వార్డుల్లో చేర్చే అనేక విపత్కర పరిస్థితుల్లో నేను పనినిచేశాను. కానీ ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితులను మాత్రం ముందెన్నడూ చూడలేదు. బాగా అలసిపోయేవాళ్లం. ఆసుపత్రికి వచ్చే రోగుల్లో చాలా భయం కనిపించేది. మేమే వాళ్లకు ధైర్యం చెప్పేందుకు ప్రయత్నించేవాళ్లం.

ఎవరైనా చనిపోతే చాలా బాధ కలుగుతుంది

కరోనా మొదటి వేవ్ సమయంలో వృద్ధులు ఎక్కువ మంది ఆసుపత్రికి వచ్చేవారు. సెకెండ్‌వేవ్‌లో మాత్రం 15-17 ఏళ్ల చిన్నవయసు వాళ్లు కూడా ఇన్‌ఫెక్షన్‌తో రావడం.. కొందరు చనిపోవడం చాలా బాధ కలిగించింది. ప్రతి రోగినీ కాపాడేందుకు చివరి వరకూ శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తాం. ఎవరైనా రోగి కోలుకుంటే చాలా సంతోషం కలిగేది. ఎవరైనా చనిపోతే చాలా బాధ అనిపించేది. చిన్న వయసువారు చనిపోతే ఇంకా ఎక్కువ బాధ. అలాంటివారు చనిపోయిన ప్రతిసారీ నా గుండె తరుక్కుపోయేది. ఇటీవల నా కూతురి ఫ్రెండ్ తండ్రి చనిపోయారు. ఆయన యువకుడు. ఎంతో బాధపడ్డాను. ఆయన

కుటుంబాన్ని ఓదార్చడం తప్ప నేను చేయగలిగింది ఏముంది? ఆక్సిజన్ ప్రెజర్ పడిపోయి మా ఆసుపత్రిలో 25 మంది చనిపోయారు. ఏమీ చేయలేని నిస్సహాయత నాది. భారతీయురాలిగా ఎప్పుడూ గర్వించేదాన్ని. కానీ దేశంలో అప్పుడు జరిగింది చూశాక గుండె బద్దలైపోయింది. నాయకులే దీనికి బాధ్యులు. వాళ్లకు కావాల్సిందల్లా ఎన్నికల్లో గెలవడమే. కొవిడ్ మహమ్మారి నా ఉద్యోగాన్ని టెన్షన్‌తో కూడిన ఉద్యోగంగా మార్చేసింది. దీనివల్ల నా జీవితంలో ఒత్తిడి పెరిగిపోయింది. నా భర్త ఒక ప్రభుత్వ ఉద్యోగి. రెండు వారాలుగా ఆయన అనారోగ్యంతో ఉన్నారు. దీంతో ముగ్గురు పిల్లలను, ఇంటి పనులను ఒక్కదాన్నే చూసుకోవాల్సి వస్తోంది. ఇంతలో 60 ఏళ్ల మా అత్తగారికి కరోనా సోకడం, ఆమెను ఆసుపత్రిలో చేర్చాల్సి రావడం, వెంటిలేటర్‌పై ఉంచడం నాకు చాలా ఆందోళన కలిగించాయి. దేవుడిదయ వల్ల ఆమె కోలుకొని ఇంటికి చేరుకున్నారు" అని చెప్పారు.

దేశ రాజధానిలో మృత్యుఘోష!

కరోనా వైరస్ మహమ్మారి ధాటికి దేశ రాజధాని దిల్లీ వణికిపోతోంది. నిత్యం రికార్డు స్థాయిలో కొవిడ్ మరణాలు సంభవిస్తున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం ఒక్కరోజే అక్కడ 380 మంది కొవిడ్ రోగులు ప్రాణాలు కోల్పోయారు. ఒకేరోజు ఇంతమంది చనిపోవడం ఇదే తొలిసారని దిల్లీ ఆరోగ్యశాఖ వెల్లడించింది. మృతుల అంత్యక్రియలు నిర్వహించడానికి శ్మశాన వాటికలు సరిపోవడం లేదంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కర్ఫ్యూ వంటి ఆంక్షలు అమలు చేస్తున్నప్పటికీ కరోనా ఉధృతి అదుపులోకి రావడం లేదు. నిత్యం 20,000కు పైగా కొత్తగా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. పాజిటివిటీ రేటు 30శాతానికి పైగా నమోదైంది. మే నెలలో ఆ నగరంలో 92,358 క్రియాశీల కేసులు ఉన్నాయి.

ఆక్సిజన్ కొరత.. దిల్లీ హైకోర్టు ఆగ్రహం

కొవిడ్ మహమ్మారి విలయతాండవం చేస్తున్న వేళ.. దిల్లీలోని ఆసుపత్రులు తీవ్ర ఆక్సిజన్ కొరతను ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా ఆక్సిజన్ సిలిండర్లను నల్లబజారులోలో అమ్ముతున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వీటిపై దిల్లీ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆక్సిజన్‌ను బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతున్న వారిపై కఠిన చర్యలు తీసుకురావాలని దిల్లీ ప్రభుత్వానికి సూచించింది.

రికార్డుస్థాయిలో మరణాలు.. అంత్యక్రియలకు కటకట..

దిల్లీలో కరోనా మరణాల సంఖ్య తీవ్ర కలవరానికి గురిచేసింది. ఒక్కరోజైతే ఏకంగా 380మంది ప్రాణాలు కోల్పోయారు. అలా మే నాటికి దిల్లీలో కరోనా మరణాల సంఖ్య 14,628కి చేరింది. రోజురోజుకి మృతుల సంఖ్య పెరిగిపోతుండటంతో శ్మశానవాటికలపై తీవ్ర

ఒత్తిడి పెరిగింది. ఉన్నవి సరిపోక.. వాటికి పక్కనే ఉండే పార్కులు, పార్కింగ్ స్థలాలు, రోడ్డు పక్కనున్న ఖాళీ స్థలాల్లోనూ చితులు ఏర్పాటు చేశారు. ప్రతి శ్మశానవాటికలోనూ అన్ని చితులూ నిరంతరం కాలుతుండడంతో అంత్యక్రియల కోసం శవాలతో బంధువులు నిరీక్షిస్తున్న దృశ్యాలు దేశాన్ని కలచివేశాయి. తప్పనిసరి పరిస్థితుల్లో వీలున్నచోట కొత్తగా చితిమంటల వేదికలు నిర్మించారు.

ప్రతిరోజూ కొత్తగా నాలుగున్నర లక్షల కేసులు

దేశంలో ఏప్రిల్, మే నెలల్లో కరోనా వైరస్ ఉద్ధృతి కొనసాగింది. గరిష్ఠంగా రోజూ కొత్తగా నాలుగున్నర లక్షల పైచిలుకు కేసులు బయటపడ్డాయి. మరో 3,000 మంది పైచిలుకు మరణాల సంఖ్య నమోదైంది. భారత్‌లో కరోనా మృతుల సంఖ్య రెండున్నర లక్షలు దాటింది.

కొత్త వేరియంట్లతో కలకలం..

దేశంలో కొత్తగా కొన్ని వేల రకాల కొవిడ్ వైరస్ వేరియంట్లు పుట్టుకొచ్చాయి. బ్రెజిల్ వేరియంట్ కాకుండా పి1 అనే కొత్త వేరియంట్ వైరస్‌లను కూడా గుర్తించారు. యూకే వేరియంట్ లేదా కెంట్ వేరియంట్‌గా పిలిచే (బి.1.3.5.1.) రకం వైరస్ ప్రస్తుతం బ్రిటన్లో ఎక్కువగా ఉంది. ఈ వైరస్ ఇప్పటికే 50 దేశాలకు వ్యాపించి మరింత పరివర్తన చెందుతున్నట్లు వెల్లడైంది. దక్షిణ ఆఫ్రికా వేరియంట్ (బి.1.3.5.1.) యూకే సహా మరో 20 దేశాలలో కనిపించింది. కొత్త వేరియంట్‌లు పుట్టుకు రావడం మామూలేనని నిపుణులు చెబుతున్నారు. వ్యాప్తి క్రమంలో వైరస్‌లు పరివర్తన చెందుతూ తమ నమూనాలను తయారు చేసుకుంటూ ఉంటాయి. కాకపోతే వీటి లక్షణాలు కొన్ని అనూహ్యంగా ఉన్నాయి. అయితే, ఈ కొత్త వేరియంట్లు సోకిన వారిలో ఎక్కువమంది తీవ్రంగా జబ్బు పడినట్లు ఆధారాలు లేవు. వృద్ధులకు, ఇతర దీర్ఘకాలిక వ్యాధుల వారికి మాత్రం ఇన్ఫెక్షన్ ముప్పు తీవ్రమైంది. యూకే వేరియంట్‌తో మరణించే అవకాశాలు 30 శాతం ఎక్కువని పరిశోధనలు తేల్చిచెప్పాయి. కొత్త వేరియంట్లు పాత వాటి కంటే వేగంగా వ్యాప్తి చెందుతున్నట్లు కనిపించడంతో మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

యూకే, సౌత్ ఆఫ్రికా, బ్రెజిల్ వేరియంట్లు త్వరగా వ్యాప్తి చెందుతున్నాయి. వాటిలో శరీరంలోని కణాలకు అతుక్కునే స్పైక్ ప్రోటీన్‌లో చాలా మార్పులు జరిగాయి. దీంతో ఇన్ఫెక్షన్ చాలా వేగంగా వ్యాప్తి చెందుతుంది. సెప్టెంబరులో కనిపించిన యూకే, కెంట్ స్ట్రెయిన్ 70 శాతం ఎక్కువగా వ్యాప్తి చెందే లక్షణం ఉంది. అక్టోబరులో సౌత్ ఆఫ్రికా వేరియంట్ కనిపించింది. ఈ స్పైక్ ప్రోటీన్‌లో ప్రముఖమైన మార్పులు కనిపించాయి. ఆందోళన కలిగించే మార్పులతో యూకే వేరియంట్‌తో కొన్ని కేసులు వచ్చినట్లు నిపుణులు తెలిపారు. అందులో కీలకమైన కె484కె అనే మ్యుటేషన్ ఉంది. ఇది వైరస్‌తో పోరాడగలిగే రోగ నిరోధక శక్తి, యాంటీ బాడీల మీద దాడి చేస్తుంది. జూలైలో కనిపించిన బ్రెజిల్ వేరియంట్‌లో కూడా కె484కె మ్యూటేషన్ కూడా ఉంది.

రోగనిరోధక శక్తి పెంచుకోండి

మాస్క్ ధరించడం, భౌతికదూరం పాటించడంతో పాటు తగిన పోషకాహారాన్ని తీసుకోవడం ఈ సమయంలో ఎంతో ముఖ్యంగా మారింది. రోగనిరోధక శక్తిని ఇనుమడింప జేసుకోవడం ద్వారా కరోనా బారినుంచి కొంతవరకు మనల్ని మనం కాపాడుకోవచ్చని నిపుణులు పదేపదే టీవీలు, పత్రికల ద్వారా వెల్లడించారు. పండ్లు, ఆకుకూరలు, మాంసం వంటి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంతో పాటు వ్యాయామం చేయడం, సరిపడా నిద్ర,

ఒత్తిడిని తగ్గించుకొనే మార్గాలను అనుసరించడం మేలు చేస్తాయి. ఈ క్లిష్ట సమయంలో ముఖ్యంగా సమతుల ఆహారం తీసుకోవడంపై దృష్టిపెట్టాలి. రోగనిరోధక శక్తిని పెంచే విటమిన్ ఎ, బి, సి, డి, ఈ, జింక్ వంటి విటమిన్‌లు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా వైరస్ ముప్పును తగ్గించుకోవచ్చని తెలిపారు.

అత్యవసరమైతే తప్ప బయటకెళ్లొద్దు..

అత్యవసరమైతే తప్ప అనవసరంగా బయటకు వెళ్లవద్దని వైద్యులు పదేపదే హెచ్చరిస్తున్నారు. రెండోదశలో కీలక పరిణామం ఏమిటంటే.. డబుల్ మాస్క్ పెట్టుకోవడం మేలని వైద్యులు సూచించారు. పెళ్లిళ్లు, పార్టీలు, ఇతర వేడుకలకు దూరంగా ఉండాలని.. స్నేహితులు, బంధువుల బాగోగులను ఫోన్‌లోనే తెలుసుకోవాలని.. భయంతో బంధాల్ని దూరం చేసుకోవద్దని నిపుణులు సూచించినా కరోనా మహమ్మారి అనుబంధాలను, మానవ సంబంధాలను దిగజార్చేసింది. ఇంటికి అవసరమయ్యే సరకుల కోసం ప్రతిసారీ తిరిగే అవసరం లేకుండా 15 రోజులు/ నెలకు సరిపడా తెచ్చి ఇంట్లో పెట్టుకోవడం మంచిదని ఎప్పటిలాగే శతపోరినా చాలామంది ఏదో ఒక వంకన బయటకు వస్తూనే ఉన్నారు. మొదటిదశలో మాదిరిగా కఠిన లాక్‌డౌన్‌లు అమల్లో లేకపోవడం కూడా వ్యాప్తికి కొంత కారణమనే వాదన ఉంది. దిల్లీ, మహారాష్ట్ర, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర అనేక రాష్ట్రాల్లో స్థానిక ప్రభుత్వాలే పూర్తి లేదా పాక్షికి లాక్‌డౌన్‌లను అమలు చేసినా కట్టడి అంతగాలేకపోవడం పరిస్థితిని దిగజార్చింది. .





శవ ప్రవాహం..
కన్నీరు పెడుతున్న పావనగంగ

ఇన్నిరకాల విషయాల గురించి మాట్లాడుకుంటున్నాం కదా..

భారతావనికే వన్నె తెచ్చిన.. తరతరాలుగా భారతీయులకు సద్గతులు ప్రసాదిస్తున్న పావన గంగానది గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

గంగ.. వేదాల్లో ఉంది. ఉపనిషత్తుల్లో ఉంది. రామాయణంలో ఉంది.

భారతంలో ఉంది. భాగవతంలో ఉంది. భగవద్గీతలో ఉంది. అనగనగా కథల్లో ఉంది. జానపద గాథల్లో ఉంది. పల్లెపాటల్లో ఉంది. పామరుల నమ్మకాల్లో ఉంది.

అయినా, గంగ లేనిదెక్కడ? గంగ సమస్త భారతీయుల హృదయాంగన. గంగ అనంతవాహిని. గంగ అంతర్వాహిని.

గుడి దగ్గరి కోనేటిలో గంగ.. గూళ్లో తీర్థంలో గంగ.. మేఘం కరిగి నీరైతే వానై కురిసేది గంగ.. పాతాళాన్ని శోధిస్తే పెల్లుబికేది గంగ.

ఈ భూమండలం మీద మూడొంతులు గంగే.. మన ఒంట్లో మూడొంతుల మేర ఉన్నదీ గంగే. నవ్వినా ఏడ్చినా కన్నీరై పెల్లుబికేది గంగ.. కాయకష్టం చేసినప్పుడు, ఒంట్లోంచి చెమట ధారై పొంగేది గంగే!

బతుకునిస్తుంది గంగ.. బతకనిస్తుంది గంగ.. ప్రాణాధారం గంగ. పతితపావని గంగ.

రోజుకు కనీసం పాతిక లక్షలమంది గంగలో మునుగుతారు. రోజూ కొన్ని కోట్లమంది పూజలోనో, వ్రతంలోనో, యజ్ఞంలోనో, పితృకార్యంలోనో గంగను

venku1968@gmail.com

తలంచుకుంటారు.

'గంగ పుట్టింది మొదలు సముద్రంలో కలిసేదాకా.. ప్రతి అడుగూ భారతీయులకు పవిత్రమే. ఆ ఒడ్డున ఎన్ని నాగరికతలు పుట్టాయి! ఎన్ని సామ్రాజ్యాలు వెలిశాయి! ఎన్నెన్ని మట్టి కొట్టుకుపోయాయి! మానవ వికాస చరిత్రకు గంగా ప్రవాహమే సాక్ష్యం' అంటూ వర్ణించారు పండిట్ నెహ్రూ తన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'లో..

గంగ చుట్టూ అల్లుకున్న కథలూ గాథలూ ఐతిహ్యాలూ పురాణ ప్రాశస్త్యాలూ.. ప్రతి కథా.. గంగ మీదున్న గంపెడు ప్రేమకు సాక్ష్యమే. ప్రతి ఐతిహ్యం ఆ తల్లికి పట్టే మంగళహారతే.

గంగ పుట్టుక వెనుక గొప్ప ఇతిహాసం ఉంది. వామనుడి రూపంలో వచ్చిన విష్ణుమూర్తి బలి చక్రవర్తిని మూడడుగుల నేల అడిగాడు. బలి సవినయంగా సమర్పించుకున్నాడు. ఒక అడుగు భూమిని ఆక్రమించింది. రెండో అడుగు.. ఇంతై ఇంతింతై బ్రహ్మలోకం దాకా విస్తరించింది. సాక్షాత్తు విష్ణుమూర్తి పాదం.. గడపదాకా రావడమంటే, ఎంత అదృష్టం! భక్తితో కాళ్లు కడిగి, ఆ నీటిని నెత్తిన చల్లుకున్నాడు బ్రహ్మ. ఆ తీర్థమే సురగంగగా అవతరించింది. భగీరథుడి కృషితో భూలోకానికి వచ్చింది. భారతీయుల హృదయ గంగై ప్రవహించింది. పాతాళానికీ చేరింది.. 'త్రిపథ'గా నిలిచింది.

గంగ ఇప్పటిది కాదు. వేదకాలం నాటికే ప్రవహించింది. కానీ అప్పట్లో సింధు, సరస్వతి నదులకే ప్రాధాన్యం. రుగ్వేద రుక్కులు ఆ రెండు నదుల్నే కీర్తించాయి. ఓచోట 'గంగ' ప్రస్తావన ఉన్నా, ఆ మాట నీటికి సంబంధించిందో, ఏటికి సంబంధించిందో స్పష్టంగా తెలియదు. రుగ్వేదానంతర కాలంలో గంగ ప్రాధాన్యం పెరిగింది. వేదర్షులు గంగానదిని 'జాహ్నవి' అని పిలిచారు. రామాయణం నాటికి గంగకు పూజనీయ స్థానం లభించింది.

గంగావరతరణం గురించి తలంచుకోగానే భగీరథుడు గుర్తుకొస్తాడు.

ఒకప్పుడు సగరుడు అనే సూర్యవంశ రాజు ఉండేవాడు. ఆయనకు వైదర్భి, శైబ్య అనే ఇద్దరు భార్యలు. శైబ్యకు అసమంజసుడనే కుమారుడు, వైదర్భికి 60 వేలమంది కుమారులు. సగరరాజు అశ్వమేధయాగం తలపెట్టగా ఇంద్రుడు ఆ అశ్వాన్ని దొంగిలించి, కపిల మాహర్షి ఆశ్రమం దగ్గర కట్టేస్తాడు. దానిని వెతుకుతూ వెళ్లిన రాకుమారులు ఆశ్రమంలో గుర్రాన్ని చూసిన కపిలుడే దానిని బంధించాడని భావించి, ఆయనపై దాడి చేయబోతారు. మహర్షి ఆగ్రహించగా.. ఆ కోపాగ్ని రాజకుమారులందరినీ భస్మీపటలం చేస్తుంది.

సగర చక్రవర్తి రెండో భార్య కుమారుడు అసమంజసుడు.. అతడి కొడుకు అంశుమంతుడు పినతండ్రుల జాడ వెతుకుతూ అక్కడికి చేరుకుంటాడు. కపిల మహర్షి ఆశ్రమం దగ్గర బూడిదకుప్పలను చూడగానే విషయం అర్థమైపోతుంది. తమ పినతండ్రుల తప్పును మన్నించి శాంతించమని, శాపవిమోచన చెప్పమని వేడుకున్నాడు. శాంతించిన మహర్షి.. దేవలోకం నుండి గంగను భూమి మీదకు తేగలిగితే, రాకుమారుల ఆత్మలు శాంతిస్తాయని, వారికి సద్గతులు ప్రాప్తిస్తాయని చెప్పాడు. అంశుమంతుడు ప్రయత్నించినా నెరవేరలేదు. అతడి తరం ముగుస్తుంది. అతడి కొడుకు దిలీపుడి తరం కూడా గడచిపోతుంది. గంగను రప్పించడం ఎవరితరమూ కాదు. దిలీపుని కొడుకు భగీరథుడి ప్రయత్నం మొదలవుతుంది. అతను బ్రహ్మ అనుగ్రహం కోసం ఘోరతపస్సు చేస్తాడు. బ్రహ్మ ప్రత్యక్షం కాగానే తమ పూర్వీకులకు సద్గతుల కోసం గంగను వదిపెట్టమని వేడుకోగా.. "గంగ దూకుడును తట్టుకునే శక్తి భూమికి లేదని... మధ్యలో ఒడిసిపట్టుకోడానికి పరమశివుడికే సమర్థుడు కాబట్టి శంకరుడి గురించి తపస్సు చేయమంటాడు. భగీరథుడు శివుణ్ని ప్రార్థించగా గంగను శిరసున భరించడానికి ముక్కంటి ఒప్పుకుంటాడు. మహోద్ధృతంగా దుమికి వచ్చిన గంగను శివుడు తన జటాఝూటంలో బంధిస్తాడు.. భగీరథుడు మరోసారి వేడుకోగా గంగను కిందకు జారవిడుస్తాడు. అలా గంగావతరణ మొదలవుతుంది.

హిమాలయాల్లోని బిందు సరోవర ప్రాంతంలో గంగ భూమిని తాకి అక్కడి నుంచి ఏడు పాయలుగా విడిపోతుంది. తూర్పువైపున.. హ్లాదిని, పావని, నళిని. పశ్చిమ దిక్కున.. సుచక్షు, సీత, సింధు. మెత్తం ఆరుపాయలు. ఏడోపాయ మాత్రం భగీరథుడి రథం వెనకాలే అనుసరిస్తుంది. దారిలో జహ్ను మహర్షి ఆశ్రమం వస్తుంది. గంగా ప్రవాహానికి మునివాటికలన్నీ కొట్టుకుపోతాయి. మహర్షి ఆగ్రహోదగ్రుడవుతాడు. గంగను దోసిట్లో పట్టేసుకుని తీర్థంలా తాగేస్తాడు. విడుదల చేయమని భగీరథుడు వేడుకుంటాడు. లోకకల్యాణార్థం మహర్షి సరేనంటాడు. చెవిలోంచి బయటికి వదిలేస్తాడు. తిరిగి భగీరథుడి వెంట ప్రవహించి అతడి పితృదేవతల భస్మరాసుల మీదుగా ప్రవహించి వారికి సద్గతులు కల్పిస్తుంది. తర్వాత ఎత్తుపల్లాల్ని దాటుతూ..

ఎగుడుదిగుడుల్ని అధిగమిస్తూ... అపుడపుడూ ఉద్ధృతంగా.. అక్కడక్కడా మందగమనంతో.. ప్రవహించి ప్రవహించి భరతఖండాన్ని పావనం చేసింది గంగ.

భగీరథ ప్రయత్నం వల్ల భువికి దిగి వచ్చింది కాబట్టి భాగీరథి అయ్యింది. జహ్ను ముని చెవిలోంచి పుట్టి జాహ్నవిగా పరిచయమైంది. నింగి, నేల, పాతాళం-మూడులోకాలు. తూర్పు, పడమర, దక్షిణం-మూడు దిక్కులు. ముచ్చటగా మూడువైపులా పారి, 'త్రిపథగ' అనే పేరునూ సార్థకం చేసుకుంది. ఆ ప్రవాహం పుణ్యమాని సగరులు ముక్తులయ్యారు. భూమి మురిసిపోయింది. దేవతలు పులకించారు. మానవులు పరవశించారు. జలచరాలు జయజయధ్వానాలు చేశాయి. పచ్చని పంటలు ప్రాణంపోసుకున్నాయి. భూమి స్వర్గమైంది. ఆ వైభోగం ముందు, అసలు స్వర్గం చిన్నబోయింది. గంగ భూమికి దిగొచ్చినరోజే, మకర సంక్రాంతి!

క్రాంతి అంటే మార్పు. భరతజాతి చరిత్రలో గంగావతరణాన్ని మించిన, గొప్ప మార్పేముంది? వ్యవసాయక దేశంలో జలవనరులు నిండుగా మెండుగా పొంగిపొర్లిన నాడే నిజమైన పండగ. అందుకే, పచ్చని పంటలిచ్చిన గంగమ్మ ప్రత్యక్ష దైవమైంది. ఆ ఒడ్డునే పుణ్యక్షేత్రాలు వెలిశాయి. నగరాలు పుట్టాయి. సామ్రాజ్యాలు ప్రాణంపోసుకున్నాయి. నాగరికత పరిఢవిల్లింది.

దివిజగంగ భువికి దిగివచ్చిన తీరు అద్భుతం. అదో అపురూప ఘట్టం. 'రఘువంశం'లో కాళిదాసు పదప్రవాహం గంగారుధిరిని గుర్తుకుతెస్తుంది. ఉత్పలవారి 'గంగావతరణం' మాత్రం తక్కువా?

"హృషీకేశ హరిద్వార రుష్యాశ్రమ ముక్తేశ్వర పుణ్యపదములెల్ల దాటి పొంగులెత్తి వచ్చెగంగ".. ఆ పద్యపాదాల్లో గంగమ్మ అడుగుల సవ్వడి వినిపిస్తుంది. బాపు, రమణల 'సీతాకల్యాణం'.. గంగావతరణను వెండితెర మీద హృద్యంగా ఆవిష్కరించింది. సినారె ఆ క్రతువుకు కలంసాయం అందించారు. రవివర్మ నుంచి వడ్డాది వారి దాకా..

venku1968@gmail.com

ఎంతోమంది చిత్రకారులు ఆ అద్భుత దృశ్యానికి రంగులద్దారు.

మహాబలిపురంలోని గంగావతరణ శిల్పం.. రాతితో మలచిన రమణీయ కావ్యం. కెవిన్ పెర్స్ అనే ఆస్ట్రేలియా చిత్రకారుడైతే.. ఆరేళ్లు శ్రమించి, మెత్తం 21 చిత్రాలలో గంగాప్రవాహాన్ని కాన్వాస్ మీద సృష్టించాడు. "ఆ సౌందర్యాన్ని వర్ణించడానికి వేయి బొమ్మలైనా సరిపోవు. వంద రంగులున్నా చాలవు. నా ప్రయత్నం చంద్రుడికో నూలుపోగే" అని వినయంగా చెప్పుకున్నాడు కెవిన్.

ఆది గంగ...

రామావతారంలో తాను గంగానది ఒడ్డునే పుడతానని విష్ణువు దివిజగంగకు మాటిచ్చాడు. సీతారామలక్ష్మణులు అరణ్యవాసానికి వెళ్తున్నప్పుడు గుహుడు దాటించింది గంగానదినే. ఇక భారతమైతే గంగ ప్రవేశంతోనే గొప్ప మలుపు తిరుగుతుంది. శంతన మహారాజు అద్భుత సౌందర్యరాశి అయిన గంగ మీద మనసుపడతాడు. వరాలిచ్చి మనువాడతాడు. ఆ జంటకు పుట్టిన బిడ్డే భీష్మపితామహుడు.

మహాభారతంలో.. అంపశయ్య మీది నుంచే భీష్ముడు గంగ మహత్తును వివరిస్తాడు. ఒక్క గంగాస్నానంతో.. యజ్ఞయాగాదులు చేసినంత పుణ్యం, పూజలూ వ్రతాలూ చేసినంత ఆధ్యాత్మిక సంపత్తి సంప్రాప్తిస్తాయనేది వేదోక్తి. గంగ ఒడ్డున పిండప్రదానాలు, గంగలో అస్థికల నిమజ్జనం చేస్తే పితృదేవతలు పుణ్యలోకాలు పొందుతారనీ పురాణాలు చెబుతున్నాయి. గంగ లేని దేశం.. సోమం లేని యజ్ఞమట! చంద్రుడు లేని రాత్రిలాంటిదట. పూలు పూయని చెట్టులాంటిదట.

నదీ తీరాల్లో నాగరికతలు పుట్టాయి. అంతరించాయి. రాజ్యాలు వెలిశాయి. మట్టికొట్టుకుపోయాయి. నదులు వర్తక వాణిజ్యాలకు కేంద్రాలయ్యాయి. పుణ్యక్షేత్రాలకు నిలయాలయ్యాయి. పాడిపంటలకు మూలమయ్యాయి. మనిషి మనుగడను మలుపుతిప్పిన నదీనదాలు చాలానే ఉన్నాయి. కానీ, అవన్నీ గంగానదులు కాలేకపోయాయి. భారతీయుల హృదయాల్లో గంగకున్న స్థానం వేరు. పుట్టుక నుంచి కడదాకా, ఆమాటకొస్తే మరణం తర్వాత కూడా.. భారతీయుల జీవితాలు గంగతోనే ముడిపడ్డాయి. బిడ్డ పుట్టగానే గొంతులో ఓ చుక్క గంగతీర్థం పోయడం కొన్ని ప్రాంతాల్లో ఆచారం.

పూజాది క్రతువులకు ముందు "గంగేచ, యమునేచైవ గోదావరీ సరస్వతీ.." అంటూ పురోహితులు గంగమ్మను కలశంలోకి ఆహ్వానిస్తారు. ఆ పిలుపు వినిపించగానే, సర్వనదుల ప్రతినిధిగా.. సురగంగ బిరబిరా తరలివస్తుంది.

భారతీయులు తమ జీవితకాలంలో ఒక్కసారైనా పావనగంగలో మునిగితీరాలనుకుంటారు. ఆ స్పర్శతో సకలపాపాలూ హరించుకుపోతాయన్నది వారి నమ్మకం. అందుకే పితృదేవతలు పైలోకాల్లోంచి మనం గంగలో ఎప్పుడు

మునకలేస్తామా అని ఎదురుచూస్తుంటారట. పెద్దలకు అర్ఘ్యం, తర్పణాలు వదిలేది గంగతోటే. జీవిత చరమాంకంలో, మృత్యుఘడియ దగ్గరపడుతున్నప్పుడు.. పవిత్ర గంగాజలంతో తులసి తీర్థాన్ని గొంతులో పోస్తే వారు నేరుగా పుణ్యలోకాలకు చేరుకుంటారన్నది హిందువుల నమ్మకం.

గంగ మహత్యానికి కొన్ని శాస్త్రీయమైన కారణాలూ ఉన్నాయి. ఆ నీటికి కఫాన్ని తగ్గించే గుణం ఉంది. గంగలో ఆక్సిజన్ స్థాయిలు ఎక్కువని.. గంగాజలానికి కొన్నిరకాల సూక్ష్మక్రిములను, వివిధ వ్యాధుల దుష్ప్రభావాన్ని తగ్గించే గుణం ఉందని పరిశోధనలు చెబుతున్నాయి. గంగోత్రి నుంచి బయలుదేరి 2,510 కిలోమీటర్ల సుదీర్ఘ పయనంలో ఎన్నో మూలికలను గ్రహిస్తుంది. ఎన్నో అరుదైన ఖనిజాలను తనలో కలుపుకుని ఔషధీయ గుణాలను పుణికిపుచ్చుకుంటుందని ఆయుర్వేద నిపుణులు చెబుతారు. అన్నిటికీ మించి, గంగ మీదున్న నమ్మకం, అచంచలమైన భక్తి.. ఆ నీటికి అంత మహత్తునిచ్చింది.

2,510 కి.మీ. సారవంతమైన ఈ గంగా మైదానం

ముక్తినిచ్చే తల్లి భుక్తిని మాత్రం ఇవ్వకుండా ఉంటుందా? గంగ, దాని ఉపనదుల పుణ్యమాని పరీవాహక ప్రాంతమంతా పచ్చదనమే. వరి, మిరప, చెరకు, జనపనార.. తదితర పంటలు పుష్కలంగా పండుతాయి. పర్యాటకులతో పుణ్యక్షేత్రాలతో కళకళలాడే ఆ నదీతీరాలు.. ఎంతోమందికి ఉపాధినిస్తున్నాయి. ఎన్నో పరిశ్రమలకు గంగనీరే దిక్కు. గంగా నది పొడవు 2,510 కి.మీ. సారవంతమైన ఈ గంగా-యమునా మైదానం ఉత్తర భారతదేశం, బంగ్లాదేశ్‌లలో విస్తరించి ఉంది. మనదేశంలో అత్యంత పొడవైనది ఇదే. ప్రపంచ జనాభాలో 8.5 % ప్రజలకు ఈ మైదానం నివాసస్థానం. పరిస్థితులను బట్టి సర్దుకుపోవడం ఎలాగో గంగను చూసే నేర్చుకోవాలి. ఉద్ధృత గంగా

ప్రవాహం.. అవసరాన్ని బట్టి అక్కడక్కడా మందగిస్తుంది. పరిస్థితులకు తలవొగ్గి, నిశ్శబ్దంగా ముందుకెళ్తుంది. నదీప్రవాహంలోనే కాదు, జీవన ప్రవాహంలోనూ పట్టువిడుపులుండాలన్న గొప్పపాఠమది. గంగ స్నేహానికి ప్రాణమిస్తుంది. ఎలాంటి ప్రాశస్త్యమూ లేని మామూలు వాగుల్నీ వంకల్నీ చిన్నాచితకా నదుల్నీ ప్రేమగా తనలో కలిపేసుకుంది. వాటికి పవిత్రతను కల్పించింది. గంగాజలాన్ని ఒక చిన్న పాత్రలో ఇంటిలో ఉంచుకోవడం శుభప్రదమని భావిస్తారు భారతీయులు. గంగా తీరాన కుంభమేళ, ఛత్‌పూజ వంటి ఉత్సవాలు జరుగుతాయి. కుంభమేళ ప్రపంచంలోనే అతిపెద్ద జనసమూహం కూడుకొనే ఉత్సవం. హరిద్వార్, త్రివేణి సంగమం, వారాణాసి హిందువులకు పరమ పవిత్ర పుణ్యక్షేత్రాలు.

మనిషి గంగనే మింగేస్తాడా?

మనిషి భస్మాసుర అంశ. లేకపోతే, వరాలతల్లికే ఉరి బిగిస్తాడా? దివి నుంచి దిగివచ్చిన దేవతనే అవమానిస్తాడా? స్వార్థంతో గంగనే మింగేస్తాడా? వ్యర్థాల్నీ రసాయనాల్నీ కాష్ఠాల్నీ కాలుష్యాల్నీ భరించలేక జాహ్నవి బేజారెత్తిపోతోంది. పరిశ్రమల వ్యర్థాల కారణంగా వేలవేల జలచరాలు కనుమరుగవుతున్నాయి. అమృతగంగ మృతకళేబరాలకు నిలయమైపోయింది. గంగలో కలుపుతున్న పూలూ అస్తికలూ బూడిదలూ.. జీవరాశిని బలిగొంటున్నాయి. మరింత కాలుష్యాన్ని పోగుచేస్తున్నాయి. ఇది చాలదన్నట్టు.. ప్లాస్టిక్ వ్యర్థాలు, పారిశ్రామిక వ్యర్థాలు. ఒకప్పుడు, సకలరోగాల నుంచి విముక్తి కలిగించిన ఔషధ గంగ... ఇప్పుడు, సర్వరోగాలకూ కారణం అవుతోంది. ఈ దుస్థితిని చూడలేక, ఆ దుర్వాసన భరించలేక నదీమతల్లిని దేవతగా ఆరాధించే భక్తుల కళ్లలో గంగ పొంగుకొస్తోంది. ఇప్పుడు కరోనా వేళ ఏకంగా శవ ప్రవాహమే సాగుతోంది గంగలో..

గంగానది అంటే భారతీయులకు అత్యంత పవిత్రమైన నది. అయినవాళ్లు ఎవరైనా మరణిస్తే వారి అస్థికలను గంగలో నిమజ్జనం చేయడం వల్ల వారికి సద్గతులు ప్రాప్తిస్తాయని హిందువులు నమ్ముతారు. వారణాసి, ప్రయాగ్‌రాజ్ తదితర ప్రాంతాల్లో నిత్యం వందలాది మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు. అప్పుడప్పుడు సగం కాలిన దేహాలను గంగలోకి తోసేస్తారనే అపప్రద కూడా ఉంది. ఈసారి కరోనా మహమ్మారి సాక్షిగా పదులకొద్దీ శవాలు గంగలో ప్రవహించిన ఉదంతాలు అంతర్జాతీయంగా కూడా తీవ్ర దుమారాన్ని లేపాయి. బిహార్, ఉత్తర్‌ప్రదేశ్‌లలో 2021 మేనెలలో గంగానదిలో శవాలు తేలిన ఘటనలు దేశ ప్రజలను విస్మయానికి గురిచేశాయి. కొవిడ్ ఉధృతి, మరణాల తీవ్రతకు ఈ ఉదంతం నిదర్శనంగా నిలిచింది. ఉత్తర్‌ప్రదేశ్‌లో కాన్పూర్, ఉన్నావ్, ఫతేపుర్, ప్రయాగ్‌రాజ్, తదితర ప్రాంతాలలో గంగానది ఒడ్డున ఇసుకలో పాతిపెట్టిన వందలాది మృతదేహాలు రోజు కోచోట కుప్పలు తెప్పలుగా బయటపడుతుండడం కలకలం సృష్టించింది. ఇవన్నీ కొవిడ్ మృతులవేనని స్థానికులు ఆరోపించారు.

బిహార్‌లోని బక్సర్ జిల్లాలో గంగా నదిలో కిలోమీటర్ పరిధిలో 48 మృతదేహాలను గుర్తించారు. కరోనా మృతులను నదిలో పడేసినట్లుగా పోలీసులు భావిస్తున్నారు.

ఉత్తర్‌ప్రదేశ్ ఉన్నావ్‌లోని గంగానది ఒడ్డున పెద్ద సంఖ్యలో కాకులు, గద్దలు ఎగురుతూ కనిపించడంతో గ్రామస్థులు దగ్గరకు వెళ్లి చూడగా ఒళ్లు గగుర్పొడిచే దృశ్యం కనిపించింది. నది ఒడ్డున ఇసుకలో అనేక మృతదేహాలను పాతిపెట్టగా వాటిలో కొన్ని శవాలు బయటకి వచ్చేశాయి. వాటిని కుక్కలు పీక్కు తింటున్నాయి. ఉన్నావ్‌లోని శుక్లాగంజ్‌లో గంగానది ఒడ్డున ఘాట్‌లకు దగ్గర్లో నది ఒడ్డున ఇసుకదిబ్బలు కూడా శ్మశానవాటికలుగా మారిపోయాయి. ఘాట్లలో విపరీతమైన రద్దీ, శవదహనాలు చాలా ఖరీదైపోవడంతో పేద ప్రజలు మృతదేహాలను ఇసుకలో పూడ్చడం మొదలుపెట్టారు. కొన్ని గ్రామాల్లో శవాలను పాతిపెట్టే సంప్రదాయం ఉంది. కాని ఇంత పెద్ద సంఖ్యలో ఖననాలు జరగడం మామూలు

విషయం కాదు. జంతువుల బారిన పడకుండా ఉండేందుకు మృతదేహాలను లోతుగా పూడ్చిపెట్టాల్సి ఉన్నా అది కూడా జరగలేదు. చనిపోయినవారికి గౌరవంగా అంతిమసంస్కారాలు జరిపించాలి.. ప్రస్తుత సంక్షోభంలో అది గగనమైపోయింది.

బిల్హార్ ఖేరేశ్వర్ గంగాఘాట్‌లో ఇసుకలో కనిపించిన మృతదేహాల గురించి కాన్పూర్ అధికారులు ఎవరూ పెదవి విప్పలేదు. కొద్దిరోజుల్లోనే ఈ గ్రామాల్లో ఎన్ని చావులు జరిగాయంటే దహన సంస్కారాలు చేయడానికి స్థలంగానీ, సమయంగానీ దొరకలేదని, అందుకే ఇలా ఇసుకలో పాతిపెట్టేశారని తెలుస్తోంది. ఉన్నావ్, ఫతేపూర్ జిల్లాల్లో ఒక్క నెల రోజుల్లో జ్వరం, శ్వాస అందకపోవడం కారణంగా అనేకమంది మరణించారని ఉన్నావ్‌లో అంతిమ సంస్కారాలు నిర్వహించే పురోహితుడు విజయ్ శర్మ తెలిపినట్లు బీబీసీ వార్తాసంస్థ పేర్కొంది. గంగానది ఒడ్డున ఘాట్లలో అంతకుముందు 10-12 మందికి అంతిమ సంస్కారాలు జరిపేవారు. కాని 2021 ఏప్రిల్ నెలలో రోజుకు 100 కన్నా ఎక్కువమందికి దహన సంస్కారాలు జరిగాయి. వారంతా కరోనాతో మరణించారో లేక ఇతర కారణాల వల్ల మరణించారో తేల్చేవారేలేరని బీబీసీ రిపోర్ట్ చేసింది.

వందేళ్లనాడు కూడా.. శవాలతో ఉప్పొంగిన గంగానది..

వందేళ్ల క్రితం.. 1918 జూన్‌లో మొదటి ప్రపంచ యుద్ధం నుంచి బొంబాయికి ఓడల్లో తిరిగి వచ్చిన సైనికులు తెలియకుండానే తమతోపాటు ఓ మహమ్మారిని వెంటపెట్టుకుని వచ్చారు. అదే బొంబాయి ఫ్లూ లేదా స్పానిష్ ఫ్లూ. ఆ ప్రాణాంతక ఫ్లూ భారతదేశాన్ని అతలాకుతలం చేసింది. ఇది 1.7 కోట్ల నుంచి 1.8 కోట్ల మంది భారతీయులను బలితీసుకుంది. మొదటి ప్రపంచయుద్ధంలో చనిపోయిన వారి సంఖ్య కన్నా ఇది ఎక్కువ అంటే దీని తీవ్రత అర్థం చేసుకోవచ్చు. భారత జనాభాలో 6 శాతం మంది చనిపోయారు. పోషకాహార లోపం.. అపరిశుభ్రమైన నివాసాల కారణంగా మహిళలే ఎక్కువమంది చనిపోయారు. ఈ వ్యాధి రెండోసారి అదే సంవత్సరం సెప్టెంబరులో దక్షిణ భారతదేశం మీద పంజా విసిరి తీరప్రాంతమంతా విస్తరించింది. ఆ మహమ్మారి ప్రపంచంలో మూడోవంతు ప్రజలకు సోకిందని భావిస్తారు. దానివల్ల మొత్తంగా 5 నుంచి 10 కోట్ల మంది వరకూ చనిపోయారని అంచనా.

మహమ్మారి బారిన పడిన మహాత్ముడు

గుజరాత్‌లో మహాత్మాగాంధీ నెలకొల్పిన సబర్మతీ ఆశ్రమాన్ని కూడా స్పానిష్ ఫ్లూ మహమ్మారి చుట్టుముట్టింది. గాంధీకి కూడా అది సోకింది. అప్పుడు ఆయన వయసు 48 ఏళ్లు. దక్షిణాఫ్రికా నుంచి తిరిగివచ్చి నాలుగేళ్లయింది. ఆయన జీవితంలో అది సుదీర్ఘంగా సాగిన తొలి జబ్బు. ద్రవాహారానికి మాత్రమే పరిమితమై విశ్రాంతి తీసుకున్నారు. ఆ ప్రాణాంతక వ్యాధితో పోరాడుతున్న ఆయన 1918లో ఆశ్రమంలో తనను కలిసిన ఒక

సన్నిహితుడితో "జీవితం మీద ఆసక్తి పూర్తిగా చచ్చిపోయింది" అన్నారట. గాంధీ, ఆశ్రమంలో ఆయనతో పాటు ఈ వ్యాధి బారిన పడిన సహచరులు అదృష్టవశాత్తూ కోలుకున్నారు. ఆ మహమ్మారి కారణంగా ఉత్తర భారతదేశపు గ్రామీణ ప్రాంతంలో ప్రఖ్యాత హిందీ కవి సూర్యకాంత్ త్రిపాఠి తన భార్యను, కొందరు కుటుంబ సభ్యులను కూడా కోల్పోయారు. 'రెప్పవాటులో నా కుటుంబం అదృశ్యమైంది. గంగానది శవాలతో ఉప్పొంగి పోయింది' అని ఆయన రాశారు.

స్పానిష్ ఫ్లూ మరణాలతో శవాలు కుప్పలుగా పేరుకుపోయాయి. వాటిని దహనం చేయటానికి సరిపడేంతగా కట్టెలు లేవు. ఈ పరిస్థితుల్లో వర్షాలు ముఖం చాటేశాయి. పంటలు పండలేదు. కరవు పరిస్థితులు తలెత్తాయి. జనానికి సరైన తిండి లేదు. మరింత బలహీనంగా మారారు. దీంతో పని కోసం, తిండి కోసం నగరాల బాట పట్టారు. అటువంటి పరిస్థితుల్లో మహమ్మారి మరింత వేగంగా విస్తరించింది. అప్పటికి యాంటీబయాటిక్స్ వంటి వాటిని కనుక్కోలేదు.. అత్యంత తీవ్రంగా జబ్బుపడిన వారికి చికిత్స అందించటానికి సరిపడా వైద్య పరికరాలే లేవు. పాశ్చాత్య ఔషధాలను భారతదేశంలో అంతగా ఆమోదించేవారు కాదు కూడా. చాలామంది జనం దేశీయ మందుల మీదే ఆధారపడ్డారు.

1918 జూలై ఆరంభం నాటికి స్పానిష్ ఫ్లూ కారణంగా రోజుకు 230 మంది చనిపోయారు. జూన్ చివరిలో రోజు వారీ మరణాల కన్నా దాదాపు మూడు రెట్లు పెరిగాయి. "తీవ్రమైన జ్వరం, ఒళ్లు నొప్పులు ప్రధాన లక్షణాలు. మూడు రోజుల పాటు ఇవి కొనసాగుతాయి. బొంబాయిలో దాదాపు ప్రతి ఇంట్లో కొంతమంది జ్వరంతో మంచాన పడ్డారు" అని **టైమ్స్ ఆఫ్ ఇండియా** రాసింది. జనం బయటకు రావద్దని, ఇళ్లలోపలే ఉండాలని ఆ పత్రిక సూచించింది. ఈ వ్యాధికి "ముఖ్యమైన పరిష్కారం.. మంచం మీద పడుకోవటం.. ఆందోళన చెందకుండా ఉండటం" అని పేర్కొంది. 'ఈ వ్యాధి సోకినవారి ముక్కు, నోటి నుంచి కారే ద్రవాల ద్వారా.. ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి వ్యాపిస్తోంది' అని వివరించింది.

"ఈ వ్యాధిబారిన పడకుండా ఉండటానికి జనం ఎక్కువగా గుమికూడే అన్ని ప్రదేశాలకూ దూరంగా ఉండాలి. సంతలు, పండుగలు, థియేటర్లు, స్కూళ్లు, సమావేశ మందిరాలు, సినిమాలు, పార్టీలు, రద్దీగా ఉన్న రైల్వే బోగీలు వంటి ప్రాంతాలకు దూరంగా ఉండాలి" అని ఆ పత్రిక రాసింది. జనం గాలీవెలుతురు సరిగా లేని గదుల్లో కాకుండా ఆరుబయట నిద్రించాలని, పోషకాహారం తీసుకోవాలని, వ్యాయామం చేయాలని సలహా ఇచ్చింది. "అన్నిటికీ మించి ఈ జబ్బు గురించి అంతగా ఆందోళన చెందవద్దు" అని చెప్పింది. అత్యవసర కాలంలో అధికారులు కొండల్లోనే ఉండిపోయారని.. బ్రిటిష్ ప్రభుత్వం ప్రజలను వారి ఖర్మకు వదిలివేసిందని పత్రికలు ఆరోపించాయి. చివరికి స్వచ్ఛంద సంస్థలు, స్వచ్ఛంద సేవకులు ఈ మహమ్మారిని ఎదుర్కోవటానికి చేయి కలిపారు. తాత్కాలిక చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశారు. మృతదేహాల దహనాలకు ఏర్పాట్లు చేశారు. చిన్న చిన్న

ఆస్పత్రులు తెరిచి రోగులకు చికిత్స అందించారు. దుస్తులు, మందులు పంచటానికి సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు. "విద్యావంతులు, సమాజంలో మెరుగైన స్థానంలో ఉన్నవారు తమకన్నా పేదవారైన తమ సోదరులకు తీవ్ర కష్టకాలంలో సాయం చేయటానికి ఇంత పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చిన ఉదంతం బహుశా భారతదేశ చరిత్రలో అంతకుముందు ఎన్నడూ లేదు" అని ప్రభుత్వ నివేదిక ఒకటి తెలిపింది.

ఇప్పుడు దేశం మరొక ప్రాణాంతక మహమ్మారితో పోరాడుతోంది.
వైరస్ వ్యాప్తిని నియంత్రించటంలో.. ఓ శతాబ్దం కిందటి లాగానే
పౌరులదే కీలక పాత్ర. నా బిడ్డలంతా
గుర్తుంచుకోవాల్సిన విషయం ఇది.

దేశవ్యాప్తంగా జీనోమ్ సీక్వెన్సింగ్

దేశంలో కరోనా వైరస్ రెండోదశ ఉధృతి వేళ పలు రాష్ట్రాల్లో ప్రభావం ఎలా ఉందనే విషయాన్ని తెలుసుకునేందుకు కేంద్ర ఆరోగ్యశాఖ దేశవ్యాప్తంగా ఎప్పటికప్పుడు జీనోమ్ సీక్వెన్సింగ్ చేపట్టింది. ఉత్తరాది రాష్ట్రాల్లో యూకే రకం ప్రభావం అధికంగా ఉందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో డబుల్ మ్యుటెంట్ రకం ప్రాబల్యం ఎక్కువగా ఉందని జాతీయ అంటువ్యాధుల నియంత్రణ కేంద్రం (ఎన్‌సీడీసీ) పేర్కొంది. దేశవ్యాప్తంగా మే నెల వరకు 18,053 నమూనాలకు జీనోమ్ సీక్వెన్సింగ్ చేపట్టామని ఎన్‌సీడీసీ డైరెక్టర్ సుజీత్ సింగ్ వెల్లడించారు. భారత్‌లో బి1.1.7గా పిలుస్తోన్న యూకే రకం ప్రభావం అధికంగా ఉన్నప్పటికీ జూన్ తర్వాతి నుంచి చాలా ప్రాంతాల్లో వీటి విస్తృతి తగ్గినట్లు తెలిపారు. పంజాబ్, దిల్లీ, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో యూకే రకం ప్రభావం అధికంగా ఉన్నట్లు సుజీత్‌సింగ్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కొత్త వేరియంట్‌లకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అన్ని రాష్ట్రాలకు పంపిస్తున్నామని ఎన్‌సీడీసీ చీఫ్ వెల్లడించారు. ఫిబ్రవరిలో రెండుసార్లు, మార్చిలో నాలుగుసార్లు, ఏప్రిల్ నెలలో నాలుగుసార్లు వీటికి సంబంధించిన సమాచారాన్ని అన్ని రాష్ట్రాలతో పంచుకున్నట్లు తెలిపారు. బి1.617గా పిలిచే డబుల్ మ్యుటెంట్ వైరస్ ప్రభావం మహారాష్ట్రలో అధికంగా ఉందని ఎన్‌సీడీసీ పేర్కొంది. మహారాష్ట్రతో పాటు పశ్చిమబెంగాల్, దిల్లీ, గుజరాత్ రాష్ట్రాల్లో డబుల్ మ్యుటెంట్ వ్యాప్తి అధికంగా ఉన్నట్లు తెలిపింది. దక్షిణాఫ్రికాలో వెలుగుచూసిన కొత్త రకం కరోనా (బి.1.315) ప్రభావం తెలంగాణ, దిల్లీ రాష్ట్రాల్లో కనిపించిందని ఎన్‌సీడీసీ వెల్లడించింది. ఇక బ్రెజిల్ రకం (ఎస్‌పి1జెడ్) మాత్రం

మహారాష్ట్రలో స్వల్పంగానే ఉన్నట్లు ఎన్‌సీడీసీ తెలిపింది.

కుప్పకూలిన ఆరోగ్య వ్యవస్థ

భారతదేశం పూర్తిగా రోగగ్రస్తమైపోంది. 'నా పిఏ, సిబ్బంది అందరూ కరోనాకు గురయ్యారు' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఒకరు చెప్పారు. సుప్రీంకోర్టులో సగంమంది సిబ్బంది, ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో పాటు కొందరు న్యాయమూర్తులు, సిబ్బంది కరోనా బారినపడ్డారు. దేశంలో ఆరుగురు ముఖ్యమంత్రులు, అనేకమంది మంత్రులు రాజకీయ నేతలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆసుపత్రుల పాలయ్యారు. అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వాలను, కేంద్రాన్ని హైకోర్టులు ప్రశ్నించాయి. 'పరిశ్రమల నుంచి ఆక్సిజన్‌ను ఆసుపత్రులకు మళ్లించండి..' అని ఢిల్లీ హైకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. దేశంలో ఆరోగ్య మౌలిక సదుపాయాలు ప్రస్తుత పరిస్థితిని తట్టుకోలేనంత బలహీనంగా మారాయని కోర్టు అభిప్రాయపడింది. పరిస్థితి దుర్భరంగా మారిందని, వ్యవస్థలను కరోనా ముంచెత్తుతున్నట్లు కనిపిస్తోందని నీతీ ఆయోగ్ సభ్యుడు వికేపాల్ అంతక్రితమే హెచ్చరించారు. కరోనాపై ప్రధానమంత్రి ఏర్పాటు చేసిన అత్యున్నత స్థాయి బృందంలో ఆయన కూడా ఒకరు.

'మేము ఇప్పటి వరకు ఇన్ని శవాలను ఎన్నడూ చూడలేదు. శవాల కుప్పల మధ్య శ్మశానంలో కాలు పెట్టలేకలేపోతున్నాం' అని లఖనవూ ముక్తిధామ్ శ్మశానవాటికలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి చెప్పాడు. ప్రధానమంత్రి నియోజకవర్గమైన వారణాసి, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రాంతమైన గోరఖ్‌పూర్ పాటు లఖనవూ, అలహాబాద్‌లలో లాక్‌డౌన్ విధించాలని అలహాబాద్ హైకోర్టు ఆదేశించినప్పటికీ యూపీ ప్రభుత్వం అందుకు అంగీకరించలేదు. లఖనవూలో ఒక మాజీ జడ్జి భార్యకు మూడు రోజుల పాటు ఆసుపత్రిలో బెడ్ వసతి లభించక మృతి చెందారు. వారణాసిలో ఒక వ్యక్తి వారం రోజుల పాటు ఆసుపత్రిలో అడ్మిషన్ లభించక మరణించాడు. ఆ తర్వాత శవాన్ని తరలించేందుకు కూడా

అంబులెన్స్ లభ్యం కాకపోవడంతో అతడి భార్య ఈ-రిక్షాలో తీసుకువెళ్లిన వైనం పత్రికల దృష్టి కెక్కింది. వారణాసి హరిశ్చంద్రఘాట్‌లో కుప్పలు తెప్పలుగా అంత్యక్రియలు జరుగుతున్నాయని పత్రికల్లో వార్తలు వచ్చాయి.

వైద్య సిబ్బందిపైనా దాడి

పశ్చిమ బెంగాల్‌లో బహిరంగసభల్లో, రోడ్ షోలలో విస్తృతంగా పాల్గొని జై శ్రీరామ్ అంటూ నినాదాలు ఇచ్చి అక్కడ అభివృద్ధి అధ్వాన్నంగా ఉన్నదని చెప్పిన యోగి ఆదిత్యనాథ్ స్వయంగా కరోనాకు గురయ్యారు. దిల్లీలోని ఎయిమ్స్‌లో దాదాపు 40 శాతం వైద్య సిబ్బంది కరోనాకు గురయ్యారు. డాక్టర్లకు కూడా ఆక్సిజన్, బెడ్స్ దొరకని పరిస్థితి ఏర్పడింది. దిల్లీలో కరోనా టెస్ట్ చేయించుకున్న ప్రతి నలుగురిలో ఒకరికి కచ్చితంగా కరోనా సోకినట్లు తేలింది. ఫోన్ ఎత్తితే చాలు కనీసం ఒక బెడ్ అయినా ఏదో ఒక ఆసుపత్రిలో ఇప్పించమని అభ్యర్థన వస్తోంది. దిల్లీ వాట్సాప్ గ్రూప్‌ల్లో కరోనా మరణ వార్తలు వెల్లువెత్తాయి. దేశ రాజధానిలో దాదాపు వారం రోజుల పాటు కర్ఫ్యూ విధించడం ఆ తర్వాత దానిని లాక్‌డౌన్‌గా మార్చడం పరిస్థితికి అద్దం పట్టింది. సరిగ్గా ఏడాది క్రితం దేశంలో నెలకొన్న పరిస్థితులు పునరావృతమయ్యాయి. దిల్లీలోని ఆనంద్ విహార్ టర్మినల్, రైల్వేస్టేషన్లు వేలాది వలస కూలీలతో కిక్కిరిసిపోయాయి.

ప్రకటనల ఆర్భాటమే..

భారతదేశంలో నాయకులకు తాము ప్రకటించిన చర్యలు, విధానాలు నిజంగా అమలు అవుతున్నాయా లేదా అన్న విషయంలో పెద్దగా ఆసక్తి ఉండదు. పెద్ద ఎత్తున చర్యలను, సంక్షేమ కార్యక్రమాలను అందమైన పేర్లతో ప్రకటించి చేతులు దులుపుకోవడమే కాదు, ప్రచారం చేసుకోవడం, ఆఖరుకు కరోనా వాక్సిన్ సర్టిఫికెట్‌పై కూడా ఫోటోలు వేసుకోవడం వారికి బాగా తెలుసు. ఒక సంవత్సర కాలంగా ప్రధానమంత్రి దేశంలో ఆరోగ్య మౌలిక సదుపాయాల గురించి సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూనే ఉన్నారు. బడ్జెట్‌లో ఆరోగ్యానికి భారీ ఎత్తున కేటాయించినట్లు ఊదరగొట్టారు. విచిత్రమేమంటే దేశంలో గత ఏడాదికీ ఈ ఏడాదికీ ఆరోగ్య రంగంలో పరిస్థితులు పెద్దగా మారలేదన్న విషయం కరోనా రెండోదశలో తలెత్తిన సంక్షోభాన్ని బట్టి వెల్లడైంది.

దేశంలో పదివేలమంది జనాభాకు కేవలం 8.5 పడకలు, 8 మంది వైద్యులే ఉన్నారని ఒక నివేదిక వెల్లడించింది. 68 శాతంమందికి ఇంకా కనీస ఔషధాలు అందుబాటులో ఉండడం లేదని ఆ నివేదిక పేర్కొంది. ఏడాది తర్వాత కూడా ఇంకా దేశంలో ఆసుపత్రి పడకల కోసం, ఆక్సిజన్ కోసం, మందుల కోసం, రెమ్‌డెసివిర్ వంటి ఇంజక్షన్ల కోసం జనం పడిగాపులు గాయాల్సి వచ్చింది. చివరికి మరణాల రేటు కూడా 10.2 శాతం పెరిగిపోయింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 162 ఆక్సిజన్ ప్లాంట్లలో 33 మాత్రమే

నెలకొల్పగలిగామని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. మరి ఏం మారినట్లు?

ఇటు విలయం.. అటు ఉద్ధృతంగా ఎన్నికల ప్రచారం

కొవిడ్ విషమ పరిస్థితులకు తగ్గట్లుగా ప్రజలు ప్రవర్తించడం లేదని ఎయిమ్స్ డైరెక్టర్ గులేరియా అన్నారు కాని ఈ దేశంలో నాయకులు మాత్రం కొవిడ్ పట్ల అప్రమత్తతతో ప్రవర్తించారా? పశ్చిమబెంగాల్‌లో మిగతా పార్టీలన్నీ తమ ఎన్నికల ప్రచారాన్ని కుదించుకున్నప్పటికీ వెనక్కు తగ్గని భారతీయ జనతాపార్టీ ఆరు దశల ప్రచారం ముగిసిన తర్వాత 500 కంటే ఎక్కువమంది పాల్గొనే సభలను నిర్వహించబోమని ప్రకటించింది. కరోనా వ్యాప్తికి ఎన్నికలను నిందించలేమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అంతకుముందు చెప్పడం విశేషం. విచిత్రమేమంటే దేశంలో కరోనా విలయతాండవం చేస్తున్న సమయంలో ప్రధాని మోదీ స్వయంగా పశ్చిమ బెంగాల్‌లో ఉద్ధృతంగా ప్రచారం నిర్వహించారు. లక్షలాది మంది మాస్కులు లేకుండా సభల్లో, ప్రచారాల్లో పాల్గొన్నప్పటికీ భాజపా నేతలు ఆ విషయం పెద్దగా పట్టించుకోలేదు.

కరోనా పరిస్థితి విషమిస్తున్న దృష్ట్యా మిగిలిన నాలుగు దశలను ఒకే దశలో నిర్వహించాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేసిన విజ్ఞప్తిని కేంద్ర ఎన్నికల కమిషన్ తిరస్కరించింది. మమతా బెనర్జీ ప్రచారాన్ని ఒకరోజు పాటు నిలిపివేసేందుకు చూపిన ఉత్సాహం ఎన్నికల కమిషన్ ఎన్నికల ప్రచారాన్ని కరోనా నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడంలో చూపలేదు. కరోనా రీత్యా తాము ఎన్నికల ప్రచారంలో పాల్గొనబోమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ప్రకటనను భాజపా నేతలు ఎద్దేవా చేశారు. దేశంలో అందరికీ వాక్సిన్ ఇచ్చే ప్రయత్నం చేయాలని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ లేఖ రాసినందుకు కాంగ్రెస్ నేతలు రాజకీయాలు చేస్తూ తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారని ఆరోగ్యమంత్రి హర్షవర్ధన్ దాడి చేశారు.

కుంభమేళాకు ఆహ్వానిస్తూ ప్రధానమంత్రి చేసిన అభ్యర్థనలు పోస్టర్ల రూపంలో ఉత్తరాఖండ్ అంతటా వెలిశాయి. అందరికీ పక్కాగా కొవిడ్ పరీక్షలు నిర్వహించాకనే కుంభమేళాలో పాల్గొనడానికి అనుమతిస్తామని ఉత్తరాఖండ్ ప్రభుత్వం ప్రకటించింది. కానీ కొవిడ్ పరీక్షలన్నీ దారుణమైన ఉల్లంఘనలతో, తప్పుడు నివేదికలతో జరిగాయని ఆ తర్వాత వెల్లడైంది. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

ఉన్నట్లుండి ఏమైందో కానీ కరోనాపై రెండో యుద్ధం తీవ్రతరం చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. మే 1 నుంచి 18 ఏళ్లు పైబడిన వారందరికీ వాక్సిన్ ఇవ్వనున్నట్లు తెలిపింది. దేశంలో ఆరోగ్య వ్యవస్థ కుప్పకూలిపోతోందని నీతీ ఆయోగ్ సభ్యుడు ప్రకటించిన 20 రోజుల తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ఆక్సిజన్ సిలిండర్లు, వెంటిలేటర్లు, పడకలు ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించి సమీక్షా సమావేశాలు నిర్వహించారు.

లాక్‌డౌన్‌పై రాష్ట్రాలకే అధికారం

కరోనా తొలి విడత కంటే రెండో విడత ఉధృత రూపం దాల్చడంతో మరోసారి ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడక తప్పదని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. విచిత్రమేమంటే గత సంవత్సరం (2020) దేశవ్యాప్తంగా వెయ్యి కేసులు కూడా లేనిరోజుల్లో ప్రధానమంత్రి మోదీ స్వయంగా ప్రజల ముందుకువచ్చి లాక్‌డౌన్‌ను ప్రకటించారు. చప్పట్లు కొట్టించారు.. దీపాలు వెలిగించారు.. తర్వాత దశలవారీగా లాక్‌డౌన్‌ను నెలల తరబడి కొనసాగించారు. 'కోయి రోడ్‌పర్ నా నికలే' (ఎవరూ రోడ్లపైకి రాకూడదు) అనే స్లోగన్‌ను ప్రదర్శించారు. కాని ఇప్పుడు కేంద్రం ఆ విషయంలో చేతులు ఎత్తేసి రాష్ట్రాలకే నిర్ణయాధికారాన్ని వదిలేసింది. మళ్లీ లాక్‌డౌన్ విధించే అవకాశం లేదని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ దేశ పారిశ్రామికవేత్తలకు నిర్దిష్టమైన హామీ ఇవ్వాల్సి వచ్చింది. గతంలో లాక్‌డౌన్ తర్వాత ప్యాకేజీల పేరిట దేశంలోని బ్యాంకులను, ప్రభుత్వరంగ సంస్థలను అమ్మకానికి పెట్టి, రాష్ట్రాలను అప్పులు చేసుకోమని చెప్పడం మినహా ఏమీ చేయని కేంద్రం ఇప్పుడు రాష్ట్రాలకే కట్టబెట్టింది. రోజుకు నాలుగు లక్షల కొవిడ్ కేసులు నమోదవుతున్న వేళ లాక్‌డౌన్‌ను చిట్టచివరి అవకాశంగానే భావించాలంటూ ప్రధాని మోదీ రాష్ట్ర ప్రభుత్వాలకు హితవు పలకడం కేంద్ర ప్రభుత్వ నిష్క్రియాపరత్వానికి పరాకాష్ఠ అనే విమర్శలు వెల్లువెత్తాయి.

విధాన లోపాలెన్నో..: కె.సుజాతారావు

గత ఏడాది (2020) మార్చిలో ప్రకటించిన దేశవ్యాప్త లాక్‌డౌన్ ఆర్థికంగా, సామాజికంగా, మానసికంగా ప్రజల జీవితాలను ఛిన్నాభిన్నం చేసిందని.. ఆ సమయంలో అంత తీవ్ర నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి లేదని కేంద్ర ఆరోగ్య శాఖ మాజీ కార్యదర్శి కె.సుజాతారావు అభిప్రాయపడ్డారు. తగినంత శాస్త్రీయంగా వ్యవహరించకపోవడంతో

ఆశించిన ఫలితాలు రాలేదని స్పష్టంచేశారు. "విపత్తులను ఎదుర్కొనేందుకు తగినంత సాధన సంపత్తి భారత్‌కు ఉంది. కానీ, కొవిడ్ విషయానికొచ్చేసరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంత కంటే మెరుగ్గా వ్యవహరించి ఉండొచ్చనే అభిప్రాయం అన్ని వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. గతేడాది (2020) మార్చిలో లాక్‌డౌన్ పెట్టడం తొందరపాటు. క్లస్టర్లవారీగా కంటెయిన్‌మెంట్ జోన్లు పెట్టుంటే సరిపోయేది. ఈ విషయంలో తైవాన్, దక్షిణకొరియా లాంటి దేశాలు మంచి ఫలితాలను సాధించాయి. మన దగ్గర తగినన్ని పీపీఈ కిట్లు, వెంటిలేటర్లు, ఆక్సిజన్ బెడ్లు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక సదుపాయాలు లేకపోవడంతోపాటు వైద్యసిబ్బంది కొరత తీవ్ర ప్రభావాన్ని చూపింది. డేటా స్వీకరణ, విశ్లేషణ విషయంలోనూ సరైన విధానాలు పాటించలేదు. సమర్థులైన నిపుణుల కమిటీ కూడా తప్పుడు నివేదికలు ఇవ్వడం విచారకరం. ఆయా రాజకీయ పార్టీల నాయకులు సైతం కొవిడ్‌ను తరిమికొట్టామని ప్రకటనలు చేశారు. కేవలం 30 శాతం జనాభాకే వైరస్‌సోకిన దశలో 'హెర్డ్ ఇమ్యూనిటీ' వచ్చిందని ప్రకటనలు చేశారు. మూడు నెలలపాటు అలసత్వం వహించడంతో రెండో దశలో పరిస్థితులు తీవ్రంగా దిగజారాయి. తొలుత వ్యాక్సిన్‌లు ఎగుమతి చేయడంతో ఆ తర్వాత తీవ్ర కొరత తప్పలేదు. ప్రభుత్వ విధానాల్లో లోపాలను గమనించి సూచనలు ఇవ్వాల్సిన ప్రతిపక్ష పార్టీలు, పార్లమెంటరీ కమిటీలు మిన్నకుండిపోయాయి. రాజ్యాంగ వ్యవస్థలు మరింత జవాబుదారీతనంతో వ్యవహరించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయి" అని సుజాతారావు పేర్కొన్నారు.

మళ్లీ విదేశీ సాయం

కరోనా కాలంలో భారత్ మళ్లీ విదేశాల నుంచి సాయానికి చేతులు చాచాల్సిన దుస్థితి ఎదురైంది. విదేశాల నుంచి సాయం పొందడాన్ని గతంలో భారత ప్రభుత్వం నిలిపివేసింది. కానీ, మహమ్మారి కారణంగా మారిన పరిస్థితుల్లో మళ్లీ విదేశీ సాయం కోరడం మొదలు పెట్టింది. "అసలు మనమే ఇతరులకు సాయం చేసే పరిస్థితిలో ఉన్నప్పుడు, ఇతరుల ముందు చేయి చాచడం ఎందుకు?" అన్నది 2000 సంవత్సరం నుంచి వివిధ సందర్భాల్లో ప్రభుత్వం చెబుతూ వచ్చింది.. 2004 సునామీ సమయంలో భారత్ కూడా విపత్తును ఎదుర్కొన్నా, విదేశాల నుంచి సాయం పొందకపోగా, తానే వాటికి సాయం చేసింది. "సునామీ అనేక దేశాలలో వినాశనం సృష్టించింది. అయినా, ఎవరినీ చేయిచాచి అడగవద్దని ప్రభుత్వం నిర్ణయించింది. అవసరమైతే మనమే సాయం చేద్దామని అంది. అన్నట్లుగానే ఆగ్నేయాసియా దేశాలకు సాంకేతిక సహాయం కూడా చేసింది. సునామీ హెచ్చరికల టెక్నాలజీని కూడా అందించింది. విదేశాల నుంచి వచ్చిన సహాయంపై 2020 మే 8న విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ ట్విటర్‌లో చేసిన కామెంట్లు దేశపు నిస్సహాయతకు నిదర్శనమని సోషల్ మీడియా యూజర్లు విమర్శించారు. "అమెరికా నుంచి సింగపూర్, జర్మనీ, థాయ్‌లాండ్ వరకు, ప్రపంచమంతా భారత్‌కు అండగా నిలుస్తోంది" అని విదేశాంగ శాఖ ప్రతినిధి అరిందం బాగ్చి ట్వీట్ చేశారు. "రెమ్‌డెసివిర్, ఆక్సిజన్ సిలిండర్లు, ఆక్సిజన్ ప్లాంట్లు, కాన్సన్‌ట్రేటర్ వంటి సహాయం సెకండ్ వేవ్‌పై పోరాటం కోసం భారత్‌కు చేరుకుంటోంది" అని మరో ట్వీట్‌లో పేర్కొన్నారు. దీంతో భారత్ ఒకప్పుడు ఇతర దేశాలకు సాయం చేసిందని, ఇప్పుడు విదేశాల నుంచి సహాయం తీసుకుంటోందని కొందరు నెటిజన్లు

ఆగ్రహం వ్యక్తం చేశారు. "అవును, అమెరికా నుంచి థాయ్‌లాండ్ వరకు చాలా దేశాలు భారత్‌కు సాయం చేస్తున్నాయి. ఎందుకంటే ఇక్కడి ప్రభుత్వాలు ప్రజలకు ఏమీ చేయడం లేదు" అని దీక్షా రౌత్ అనే యూజర్ విమర్శించారు. విదేశాల నుంచి సాయం కోరడం భారత గౌరవాన్ని దెబ్బతీయడమేనని చాలామంది ట్వీట్లు చేశారు.

ప్రపంచ ప్రఖ్యాత మెడికల్ జర్నల్ 'లాన్సెట్' విమర్శలు

కరోనా మహమ్మారి సెకండ్ వేవ్ ప్రభావం ఎంత దారుణంగా ఉందో విదేశీ మీడియా చూపిస్తోంది. దేశ ఆరోగ్య వ్యవస్థ పతనం అంచున ఉందని వ్యాఖ్యానిస్తోంది. శ్మశానాల్లో శవాల గుట్టలు ఉన్నాయని, రోజంతా చితిమంటలు రగులుతూనే ఉన్నాయని విదేశీ మీడియా రాసింది. రోగులు ఆక్సిజన్ కోసం, ఐసీయూ బెడ్ల కోసం అల్లాడుతున్నారని, వైద్య సహాయం అందక చాలామంది చనిపోతున్నారని, మృతదేహాలు నదులలో కనిపిస్తున్నాయని విదేశీ పత్రికల్లో కథనాలు వచ్చాయి.. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఎన్నో దేశాలు వైద్య సహాయాన్ని పంపుతున్నాయని పేర్కొన్నాయి. ప్రపంచ ప్రఖ్యాత మెడికల్ జర్నల్ 'లాన్సెట్' తన సంపాదకీయంలో ప్రధాని మోదీని విమర్శించింది. 'సంక్షోభాన్ని ఆపడంపై దృష్టి పెట్టడానికి బదులు, విమర్శకులను అణచి వేయడానికి మోదీ ప్రభుత్వం ఎక్కువ సమయం కేటాయిస్తోంది' అని లాన్సెట్ అన్నది. "డ్రోన్లు గాలిలో తిరుగుతూ నదుల్లో తేలుతున్న మృతదేహాలను చిత్రిస్తుంటే, అది భారత్‌కు మంచి ఇమేజ్‌ను ఎలా ఇస్తుంది?" అని ఎన్నారైలు వాపోతున్నారు.

వ్యాక్సిన్ ఫ్రెండ్‌షిప్ స్కీమ్

అంతర్జాతీయ వ్యవహారాల విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, 2004లో భారత్ విదేశీ సహాయం తీసుకోవడం నిలిపి వేయగా, ఇప్పుడు దాన్ని పునరుద్ధరించింది. కొన్ని నెలల

క్రితం వరకు పేద దేశాలకు సహాయం చేస్తున్న పెద్ద దేశాలలో భారత్ కూడా ఉంది. మహమ్మారిని ఎదుర్కోవడానికి 2020 సంవత్సరంలో భారత్ 100కి పైగా దేశాలకు ఔషధాలు పంపింది. పొరుగు దేశాలకు సులభమైన నిబంధనలతో రుణాలు ఇచ్చింది. అయితే, 2021 ఏప్రిల్ ఆరంభంలో కరోనా రెండో వేవ్ కారణంగా ఏర్పడ్డ దారుణమైన పరిస్థితులను ఎదుర్కోవడానికి మోదీ ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోలేదని ప్రజలు భావిస్తున్నారు. "ఈ రోజు మనం ఇతర దేశాల నుండి ఎందుకు సాయం పొందాల్సి వచ్చింది?" అని మోదీ ప్రభుత్వాన్ని కొందరు నిలదీస్తున్నారు.

ఈ గ్లోబల్ వ్యాక్సిన్ ప్రచారంలో భాగంగా భారత ప్రభుత్వం చేసిన సాయానికి "వ్యాక్సిన్ ఫ్రెండ్‌షిప్" అని పేరు పెట్టారు. డజన్ల కొద్దీ దేశాలకు భారత్ వ్యాక్సిన్‌ను సరఫరా చేసింది. దేశంలోని 135 కోట్ల జనాభాకు ఎంత వ్యాక్సిన్ లభిస్తుందనే దానిపై కేంద్రం జాగ్రత్తలు తీసుకోలేదని దిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా విమర్శించారు. "విదేశాలకు పంపడానికి కేంద్రం దగ్గర 6.5 కోట్ల వ్యాక్సిన్లు ఉన్నాయి. రాష్ట్రం 3.5 లక్షలు మాత్రమే అడిగింది. ఇక్కడ మనుషులు చనిపోతున్నా విదేశాలకు వ్యాక్సిన్లు సరఫరా చేయాలని బీజేపీ ప్రభుత్వం చెప్పదలుచుకుందా?" అని సిసోడియా ప్రశ్నించారు. అయితే, గతంలో జరిగిన నిర్ణయాల ఆధారంగానే విదేశాలకు వ్యాక్సిన్ పంపిణీ జరుగుతోందని ప్రభుత్వం తెలిపింది. టీకా మన అవసరాలకు సరిపడా లేని సమయంలోనే సెకండ్ వేవ్ దేశాన్ని ఊపేసింది. టీకాల కర్మాగారమైన భారతదేశ ప్రతిష్ఠ మసకబారింది.

భారత్ ప్రపంచాన్నే రక్షించిందన్న మోదీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాన్ని స్వావలంబన దిశగా నడిపించారని దేశ ప్రజలు చాలామంది నమ్మారు. దేశంలో రెండు వ్యాక్సిన్‌లు తయరు చేసిన తర్వాత ఆ నమ్మకం బలపడింది. ప్రస్తుత సంక్షోభానికి దీటుగా భారత్ స్వయంగా పోరాడుతుందని కూడా చాలామంది అనుకున్నారు. ఇదేసమయంలో 'వ్యాక్సిన్ ఫ్రెండ్‌షిప్' స్కీమ్ గురించి ప్రధాని విస్తృతంగా ప్రచారం చేశారు. భారత్ ఇకపై కేవలం ఒక దేశం కాదని, అంతర్జాతీయ శక్తి అని ప్రకటించారు. కరోనా బారి నుంచి ప్రపంచాన్ని భారత్ రక్షించిందని దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో మోదీ ప్రకటించారు. కొవిడ్‌ను ఎదుర్కోవడానికి తమ ప్రభుత్వం బలమైన ఆరోగ్య వ్యవస్థను రూపొందించిందని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు ఆయన మాటలను అంగీకరించాయి. మోదీ ప్రచారాన్ని ఎక్కువగా ఇష్టపడతారని, గొప్పలు చెప్పుకుంటారనే విమర్శలు చాలానే ఉన్నాయి. "మన్మోహన్‌సింగ్ ఏ పని చేసినా గుంభనంగా ఉండేవారు. అప్పట్లో సునామీ వచ్చినా, ఇతర దేశాలకు సాయం చేశారు. మాటల ద్వారా కాకుండా చేతలలో నిరూపించారు" అంటూ సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అయ్యాయి. కొందరు సోనూసూద్ ఫొటోను, ప్రధాని మోదీ ఫొటోను పక్కపక్కన పెట్టి.. "నటుడెవరు? నాయకుడెవరో చెప్పండి?" అంటూ పోస్టులు పెట్టడం కనిపించింది.

71 దేశాలకు వ్యాక్సిన్లు సరఫరా

మన శాస్త్రవేత్తల కృషి పుణ్యమా అని భారత్‌లో రెండు కరోనా వ్యాక్సిన్లు అందుబాటులోకి వచ్చాయి. వాటిలో ఒకటి హైదరాబాద్‌కు చెందిన కొవాగ్జిన్ కాగా.. మరొకటి పుణెకు చెందిన కొవిషీల్డ్.. ఈ రెండు వ్యాక్సిన్లు సురక్షితమేనని తేలింది. కరోనాకు టీకాలను తయారు చేయడం ద్వారా ప్రపంచంలో భారత ప్రతిష్ఠ పెరిగింది. తన పొరుగుదేశాలకు కూడా ఇండియా వ్యాక్సిన్ ఉచితంగా అందించింది. దాదాపు 150కి పైగా దేశాలు టీకా సరఫరా ఇండియాను కోరుతున్నాయి. భారత్ 71 దేశాలకు వ్యాక్సిన్లు సరఫరా చేసింది. ఇవన్నీ మార్చి 15 లోగా చేసుకున్న ఒప్పందాల ప్రకారం సరఫరా చేసినట్టు ప్రభుత్వం రాజ్యసభలో ప్రకటించింది. భారత్ తన టీకాలతో ప్రపంచానికి రక్షణగా నిలిచిందనే మొదట్లో అనిపించింది.

ప్రశంసలు- విమర్శలు

ప్రపంచంలో ప్రతి దేశ నాయకుడిపైనా పొగడ్తలు, విమర్శలు రెండూ ఉంటాయనేది నిజమే. సంక్షోభ సమయంలో ఇతర దేశాలతో ఎలా వ్యవహరించాలో మొదటి వేవ్ సందర్భంగా మోదీ ప్రపంచానికి చూపించారు. ఈ విధానాన్ని ప్రపంచం మొత్తం అంగీకరించింది. మొదటివేవ్‌లో కరోనా ఫ్రంట్‌లైన్ వారియర్లకు మద్దతుగా లైట్లు ఆర్పేసి దీపాలు వెలిగించమన్న మోదీ పిలుపును రాజకీయంగా ఆయనను వ్యతిరేకించిన ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెదేపా అధినేత చంద్రబాబు కూడా పాటించారు. సెకండ్ వేవ్ కారణంగా భారత్, ప్రధాని మోదీల ఇమేజ్‌లకు ఎంత నష్టం జరిగిందనే దానిపై ప్రజల్లో భిన్నమైన అభిప్రాయం ఉండొచ్చు. కానీ, విస్తృతంగా చూస్తే, 2020 మార్చి నుండి 2021 మార్చి మధ్య కాలంలో ఆయన తాను చేయగలిగింది చేశారని ఎవరూ అనడం లేదు.

కార్యాచరణ కొరవడి..

కొవిడ్ రోగుల కోసం దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఆధ్వర్యంలోని రెండువేల పైచిలుకు ఆసుపత్రుల్లో 4.68 లక్షల పడకలున్నట్లు మోదీ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు నివేదించింది. చికిత్సల కోసం మూడంచెల వ్యవస్థల్ని ఏర్పాటు చేశామంటున్నా- దాదాపు 35 లక్షల క్రియాశీల కేసుల తాకిడితో ప్రజారోగ్య రంగమే కుదేలైపోయింది. ఆసుపత్రుల్లో పడకల్లేక, ఆక్సిజన్ అందుబాటులోకి రాక, ప్రాణాధార ఔషధాలూ దొరకక నిస్సహాయంగా వేలమంది అభాగ్యులు నేలరాలిపోవడం- నిశ్చయంగా మానవ కల్పిత మహా విషాదం. కరోనాపై హాస్యాస్పద వ్యాఖ్యలతో వ్యక్తిగతంగా అభాసుపాలైతేనేం- దేశాధ్యక్షుడిగా ట్రంప్ 'వార్ప్ స్పీడ్' పేరిట వ్యాక్సిన్ల పరిశోధన, ఉత్పత్తి కోసం కేటాయించిన 2000 కోట్ల డాలర్ల నిధుల వల్లే అమెరికా ఆ తర్వాత గట్టెక్కిందన్నది నిజం. కొవిడ్ నియంత్రణకు టీకాలే శరణ్యమన్న ముందుచూపుతో 2020 మే నెలలోనే తయారీ సంస్థలకు ముందస్తు చెల్లింపులు చేసేసిన ఇజ్రాయెల్ వంటి దేశాలు నేడు ధీమాగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా 116 కోట్ల వ్యాక్సిన్ డోసుల్ని వినియోగించగా, దేశ జనాభాలో ఎంత శాతానికి టీకా అందిందన్న ప్రాతిపదిక జాబితాలో ఇండియా 74వ స్థానంలో ఉంది. 2021 జులై దాకా టీకాలకు కటకట తప్పకపోవడం- నేతలకు ముందుచూపు కొరవడిన ఫలితమే! ఆక్సిజన్ సహా ప్రాణాధార మందుల కోసం రోగుల హాహాకారాలు మిన్నంటుతుంటే- పాతిక విమానాల్లో దిల్లీకి చేరిన 300 టన్నుల అత్యవసర ఔషధ సామగ్రి రోజుల తరబడి విమానాశ్రయంలోనే పడి ఉండటం, సగటు పౌరులను విస్మయపరచింది!

నిర్లక్ష్యమే కొంప ముంచింది.. డాక్టర్ జయప్రకాశ్ నారాయణ

"అయిదారు దశాబ్దాలుగా కేంద్రంలోని ప్రభుత్వాల వైఫల్యాలను కరోనా ఎత్తిచూపింది. నిర్లక్ష్యమే కొంప ముంచింది. పేలవమైన వైద్య వ్యవస్థలో లక్షల మంది మృత్యువాతపడ్డారు. ఓట్లు రాల్చే అంశాలపైనే ప్రభుత్వాలకు శ్రద్ధ.. ఆసక్తి. ప్రజలకు మేలు చేసే విధానాలు పట్టవు. బలమైన ఆరోగ్య వ్యవస్థ అవసరం. ఇందుకు ఏటా రూ. లక్షన్నర కోట్లు వెచ్చించాలి. జాతీయ ఆదాయంలో మనం చేస్తున్న ఖర్చు కేవలం ఒక్క శాతమే. వ్యాక్సిన్ల విషయంలో జాతీయ విధానమే సరైనది. ఎన్నికల నిర్వహణలో వ్యూహాత్మకంగా వ్యవహరించకపోవటంలో ఎన్నికల సంఘాన్ని తప్పు పట్టాల్సిందే" అని లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ 'ఈనాడు'తో అన్నారు. "కొవిడ్ విషయంలో ప్రధాన మంత్రి స్థాయిలో హర్డ్ ఇమ్యూనిటీని నమ్ముకోవటం తప్పు. వ్యాక్సిన్ల

అవసరం లేకుండా వైరస్‌ను ఎదుర్కొంటామని వ్యాఖ్యానించారంటే మనకు ఏమీ కాదులే అన్న భరోసానే. చివరకు ఏమైంది? ఆక్సిజన్, పడకల కొరత విషయంలో అప్రమత్తం కాలేదు. ఫలితాన్ని చూస్తున్నాం. మన దేశంలో వ్యాక్సిన్లు ఉత్పత్తి చేసే శక్తి ఉంది. ఇలాంటి అరుదైన సందర్భాల్లో ప్రభుత్వ పెట్టుబడులు అవసరం. మార్కెటింగ్ లేక నష్టం వచ్చినా భరిస్తామని భరోసా ఇవ్వాలి. ఎన్ని రకాలుగా మొత్తుకున్నా ప్రభుత్వం సమయానికి, సానుకూలంగా స్పందించలేదు.. అని ఆయన పేర్కొన్నారు.

80 శాతం మంది ఇట్టే కోలుకుంటున్నారు

వివిధ సర్వేలు, వైద్య శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం కొవిడ్ సోకిన వారిలో దాదాపు 80-85 శాతం మంది సులభంగానే కోలుకుంటున్నారు. కేవలం 10-15శాతం మందికి మాత్రమే ఆస్పత్రిలో వైద్యం అందించాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. వీరిలోనూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, వయోధికులు ఎక్కువగా ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. కరోనా వైరస్ సోకిన వారిలో ప్రధాన సమస్య ఊపిరితిత్తులు సరిగా పని చేయకపోవడం, అకస్మాత్తుగా ఆక్సిజన్ స్థాయిలు పడిపోవడం. అందువల్ల కొవిడ్ సోకినవారు ఆక్సిజన్ లెవల్స్ పడిపోకుండా చూసుకోవాలి. దీనికోసం కాస్త చెట్లున్న ప్రదేశంలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవడమో, నడవడమో లాంటివి చేయాలి. పల్స్ ఆక్సీమీటర్‌తో ఎప్పటికప్పుడు ఆక్సిజన్ స్థాయిలను తెలుసుకోవాలి. 94 పాయింట్ల కంటే తక్కువగా ఉంటేనే ఆస్పత్రికి వెళ్లాలి. లేదంటే ఆ అవసరం లేదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ఎన్నికల ప్రచార ఫలితమేనా!

అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో కొవిడ్ కేసులు ఎక్కువగా ఉన్నా లెక్కచేయకుండా అప్పట్లో డొనాల్డ్ ట్రంప్ ర్యాలీలు, సభలు నిర్వహించారు. జోబైడెన్ వివేకంతో వ్యవహరిస్తూ సాధ్యమైనంత వరకు వర్చువల్ సమావేశాలకే పరిమితం అయ్యారు. బాధ్యతగా వ్యవహరించి.. మార్గదర్శిగా నిలిచారు. అమెరికా రాజకీయాలకు భారత రాజకీయాలు పూర్తిగా భిన్నమైనవి. ఇక్కడ పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అస్సాం తదితర ఎన్నికల్లో పోటీలు పడి ర్యాలీలు నిర్వహించారు. చాలా సందర్భాల్లో నాయకులు కనీసం మాస్క్‌తో కూడా కనిపించలేదు. ఇది వారి అనుచరులకు ఏమి సంకేతాలు ఇస్తుందనే విషయాన్ని నేతలు పట్టించుకోలేదు. తొలిసారి లాక్‌డౌన్ విధించిన సమయంలో ప్రజలను రోడ్లపైకి రావద్దన్న పాలకులే.. బెంగాల్‌లో భారీ జనసందోహంతో ర్యాలీలు నిర్వహించారు. పశ్చిమబెంగాల్‌లో 8 విడతల పోలింగ్ నిర్వహించటంతో రాష్ట్రంలోని ఏ ప్రాంతాన్ని వదలకుండా అన్ని పార్టీల నాయకులు ర్యాలీలతో హోరెత్తించారు. ఆ ఫలితాన్ని ఇప్పుడు ఆ రాష్ట్రం అనుభవిస్తోంది. అయినా నేతల తీరులో మార్పులేదు. "బాధ్యతారహితంగా నిర్ణయాలను తీసుకుని కొవిడ్-19 వ్యాప్తికి కారకులైనందుకు ఎన్నికల కమిషన్‌పై హత్యకేసు పెట్టాలని" చెన్నై హైకోర్టు వ్యాఖ్యానించింది.

ప్రచారాలతో 15 రెట్లు పెరిగిపోయి..

పశ్చిమబెంగాల్‌లో 2021 మార్చి 11న 3,110 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఆ సంఖ్య ఏప్రిల్ 20 నాటికి 53,000కు చేరిందంటే ఎన్నికల ప్రభావం అర్థం చేసుకోవచ్చు. దాదాపు

15 రెట్లు పెరిగిపోయాయి. కేసుల పెరుగుదలకు చాలా కారణాలు ఉన్నా.. అతిపెద్ద కారణం మాత్రం భారీ సభలే. దీనికి ఎవరో ఒకరిని నిందించలేని పరిస్థితి.. అన్ని పార్టీలు అదే స్థాయిలో సమావేశాలు నిర్వహించాయి. ఎన్నికల దశలు ముగిసే కొద్దీ ఆయా జిల్లాల్లో కేసులు పెరిగిపోయినట్లు లెక్కలు చెబుతున్నాయి. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రత్యర్థులు రాష్ట్రంలో కొవిడ్‌ను వ్యాప్తి చేస్తున్నారని ఆరోపించారు. కానీ, ఆమె ర్యాలీల్లో జనం వేల సంఖ్యలో ఉంటున్నారు. కొవిడ్ వ్యాప్తిని దృష్టిలో పెట్టుకొని తాను ఎన్నికల ప్రచారంలో పాల్గొనని కాంగ్రెస్ నేత రాహుల్ ప్రకటించారు. అదే రోజు ఆయన పార్టీ నేత అధిర్ రంజన్ చౌధిరి ఓ భారీ ర్యాలీలో పాల్గొన్నారు.

వియత్నాం విజ్ఞత.. పార్లమెంట్ ఎన్నికలు వాయిదా

విచిత్రమేమిటంటే.. కొవిడ్ విజృంభిస్తున్న వేళ ఎన్నికలు నిర్వహించడం భావ్యం కాదని వియత్నాంలాంటి చిన్న దేశం కూడా ఎంతో విజ్ఞతతో నిర్ణయం తీసుకుంది. కొవిడ్ కారణంగా పార్లమెంట్ ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. 500 స్థానాలు ఉన్న వియత్నాం నేషనల్ అసెంబ్లీకి 2021 మేలో ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే కొవిడ్ మహమ్మారి తీవ్రంగా ఉన్న నేపథ్యంలో వాయిదా వేసేందుకే మొగ్గు చూపారు. ఈ ఎన్నికల్లో పోటీకి సుమారు 866 మంది అభ్యర్థులు ఖరారు కాగా, సుమారు 6.92 కోట్ల మంది ఈ ఎన్నికల్లో ఓటు వేయడానికి నమోదు చేసుకున్నారు.

ముప్పు గురించి మార్చిలోనే చెప్పాం..

ప్రధాని మోదీకి తెలియదంటే మేం నమ్మం..

సీసీఎంబీ) మాజీ డైరెక్టర్ రాకేశ్ మిశ్ర

కరోనా సెకెండ్ వేవ్ ముప్పు తీవ్రంగా ఉంటుంది.. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే కరోనా మహమ్మారి వేలమందిని, లక్షలమందిని బలిగొనే ప్రమాదం ఉందని దేశంలోని అత్యున్నతస్థాయి శాస్త్రవేత్తలు రెండు నెలల క్రితమే హెచ్చరించారు! వారి ఆందోళనపై ప్రధాని మోదీకి కూడా సమాచారం అందింది. అయినప్పటికీ.. శాస్త్రవేత్తల ఆందోళనను, సూచనలను ప్రభుత్వ పెద్దలు పూర్తిగా పెడచెవిన పెట్టారు. నిర్లక్ష్యంగా ఎన్నికల ర్యాలీలు, సభలు నిర్వహించారు. కుంభమేళా నిర్వహణకు అనుమతిచ్చారు.

సెకండ్ వేవ్ ముప్పు భయంకరంగా ఉండబోతుంది. కొత్త వేరియంట్లే ఇందుకు కారణం. దీనిపై మేం మార్చిలోనే ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాం. కాని మా హెచ్చరికలను పట్టించుకోలేదు. ఈ విషయం ప్రధానికి తెలియదంటే నమ్మలేం. ఈ మాటలన్నది మామూలు వ్యక్తి కాదు. బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న ఓ సీనియర్ శాస్త్రవేత్త. ప్రఖ్యాత జర్నలిస్టు కరణ్ థాపర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులార్ బయాలజీ (సీసీఎంబీ) మాజీ డైరెక్టర్ రాకేశ్ మిశ్ర చేసిన వ్యాఖ్యలివి. ఈ మాటలు చాలు సర్కారీ పెద్దల వ్యవహారం అర్థంచేసుకోవడానికి.

డాక్టర్ రాకేశ్ మిశ్ర మేనెలలో వార్తాసంస్థ 'ద వైర్'కు ఇచ్చిన ఇంటర్వ్యూతో ఇది మహమ్మారికి అడ్డుకట్ట వేయాలంటే.. మరిన్ని కఠిన చర్యలు.. భారీ లాక్‌డౌన్‌లాంటి

చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రాకేశ్ మిశ్ర తేల్చిచెప్పారు.

"సద్దుమణిగిందనుకున్న కరోనా మహమ్మారి.. రూపు మార్చుకుని కొత్త వేరియంట్ల రూపంలో విరుచుకుపడే ప్రమాదం చాలా ఎక్కువగా ఉంది.. తస్మాత్ జాగ్రత్త" అంటూ మార్చి మొదటివారంలోనే వైద్యనిపుణులు కేంద్రాన్ని హెచ్చరించారు! కొత్త వేరియంట్ల గురించి అప్పటికి ఏమీ తెలియదు కాబట్టి.. సెకండ్ వేవ్ ముప్పు భయంకరంగా ఉండబోతోందని, ప్రమాదం దిశగా వెళ్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. కానీ.. ఆ సూచనలను.. ఆందోళనలను.. కేంద్రప్రభుత్వం పూర్తిస్థాయిలో పెడచెవిన పెట్టింది! సరి కదా.. ఎన్నికల ర్యాలీలకు.. కుంభమేళా వేడుకలకు.. అడ్డగోలుగా అనుమతులిచ్చేసింది! కరోనా కరాళ నృత్యానికి బాటలు పరిచింది. ప్రభుత్వానికి ఈ హెచ్చరిక చేసిన ఇన్సాకాగ్ నిపుణుల బృందంలో రాకేశ్ మిశ్ర. కూడా సభ్యుడు. దేశం మొత్తాన్నీ ప్రమాదంలో పడేసిన మోదీ సర్కారు ప్రాణాంతక నిర్లక్ష్యానికి ప్రత్యక్షసాక్షి. మరిన్ని కొత్త వేరియంట్లు దేశంలో వ్యాపిస్తున్నాయని.. వాటివల్ల దేశవ్యాప్తంగా కొవిడ్ కేసులు, మరణాలు భారీగా పెరిగిపోయే ప్రమాదం చాలా ఎక్కువగా ఉందని తాము హెచ్చరించామని ఆయన వెల్లడించారు. 'మనం ప్రమాదం దిశగా వెళ్తున్నామనే హెచ్చరిక అది' అని ప్రముఖ జర్నలిస్టు కరణ్‌థాపర్ (ద వైర్ వార్తాసంస్థ)కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

వైరస్ ఉద్ధృతంగా వ్యాపించే ముప్పు ఉందంటూ తమ ఆందోళనను నేరుగా ఎన్‌సీడీసీ (నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్) డైరెక్టర్ డాక్టర్ సుజీత్‌కుమార్ సింగ్‌కు వెల్లడించామని మిశ్ర తెలిపారు. "మా ఆందోళన కేంద్ర ఆరోగ్య కార్యదర్శికి చేరి ఉంటుందని భావించాను" అని పేర్కొన్నారు. "ఇన్సాకాగ్ అనేది దేశవ్యాప్తంగా ఉన్న పది ప్రభుత్వ ల్యాబొరేటరీలతో కూడిన కన్సార్షియం. దానికి నోడల్ ల్యాబ్.. ఎన్‌సీడీసీ. అది ఆరోగ్య శాఖకు సంబంధించింది. ఈ కన్సార్షియానికి నిధులు అందిస్తున్నది బయోటెక్నాలజీ విభాగం. అంటే.. ఇది పూర్తిగా ప్రభుత్వ వ్యవహారమే. రోజు విడిచి రోజు మేమంతా సమావేశమయ్యేవాళ్లం. దేశంలో కరోనా పరిణామాలపై చర్చించి, ఆ నివేదికలను ఎప్పటికప్పుడు సమర్పించేవాళ్లం. ఆ సమావేశాలకు బయోటెక్నాలజీ విభాగం ప్రతినిధులు, ఎన్‌సీడీసీ ప్రతినిధులు, పది ల్యాబ్‌ల ప్రతినిధులు.. అంతా కలిపి 20-30 మంది హాజరయ్యేవాళ్లం. జరుగుతున్న పరిణామాలన్నీ మా అందరికీ తెలుసు. మా సమావేశంలో జరిగిన చర్చల సారాంశమంతా ఎన్‌సీడీసీ ద్వారా కేంద్ర ఆరోగ్య శాఖకు అందేది. అంటే.. ప్రతిదశలోనూ సమాచారం ఇన్సాకాగ్ నుంచి ప్రభుత్వానికి నిరంతరం అందేది" అని స్పష్టం చేశారు. శాస్త్రవేత్తల బృందం ఈ విషయాన్ని నిజంగానే మార్చి మొదటివారంలో ప్రభుత్వానికి తెలియజేసిందా అని కరణ్ థాపర్ మరోసారి ప్రశ్నించగా.. కొత్త వేరియంట్లను గుర్తించగానే దానిపై తమ ఆందోళనను ప్రభుత్వానికి తెలియజేశామని రాకేశ్ మిశ్ర పునరుద్ఘాటించారు.

విమానాశ్రయంలో ఒకరి నుంచి సేకరించిన నమూనాల్లో, బయట.. యూకే వేరియంట్‌ను గుర్తించామని స్పష్టం చేశారు. తమ సమావేశాల మినట్స్ అన్నీ కేంద్ర ఆరోగ్య శాఖకు తెలుసని చెప్పారు. దీనిపై థాపర్ మరింత గుచ్చిగుచ్చి ప్రశ్నించగా.. ప్రధానికి దీనిపై సమాచారం అందలేదంటే నమ్మలేమని వ్యాఖ్యానించారు. ఇన్సాకాగ్‌ను ఏర్పాటు చేసిందే ప్రభుత్వమని.. ప్రభుత్వానికి సమాచారం అందించడమే దాని పని అని, అలాంటిది ఇంతటి ప్రమాదకరమైన సూచన గురించి సమాచారం ప్రభుత్వాధినేతకు అందలేదంటే నమ్మడం కష్టమని అభిప్రాయపడ్డారు. ఇన్సాకాగ్ స్పష్టంగా దేనిగురించి ఆందోళన చెందిందని ప్రశ్నించగా.. అన్ని వేరియంట్లూ విస్తృతంగా వ్యాపిస్తాయని తాము ఆందోళన చెందామని, మరణాలు పెద్ద సంఖ్యలో ఉంటాయని అంచనా వేశామని చెప్పారు. వ్యాప్తి ఎంత ఎక్కువగా ఉంటే వైరస్‌లో అంత ఎక్కువగా ఉత్పరివర్తనాలు జరిగి కొత్త వేరియంట్లు పుట్టుకొచ్చే ప్రమాదం ఉందని.. ఫలితంగా అవి ఎక్కువగా వ్యాప్తి చెందే గుణాన్ని కలిగి ఉండడమే కాక, రోగనిరోధక శక్తికి లొంగని గుణం కూడా కలిగి ఉంటాయని ఊహించామని చెప్పారు. దీనివల్ల టీకా కార్యక్రమానికి కూడా ముప్పు ఉంటుందని భావించామని.. కానీ, అదృష్టవశాత్తూ అలా జరగలేదని చెప్పారు. ఎందుకంటే.. ఒక డోసు తీసుకున్నవారికి వైరస్ సోకినప్పుడు అది రక్షణ వ్యవస్థలను ఛేదించడానికి ప్రయత్నిస్తుందని, మెజారిటీ సందర్భాల్లో వైరస్ విఫలమైనా, కొన్నిసార్లు సఫలమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే.. ఇప్పటికే మొదటి దశలో వైరస్ సోకి యాంటీబాడీలు తయారైనవారికి కొత్త వేరియంట్లు సోకితే, అవి కూడా రోగ నిరోధక వ్యవస్థను దాటి ఇన్ఫెక్ట్ చేయడానికి ప్రయత్నిస్తాయని.. అలాంటి సందర్భాల్లో పుట్టే కొత్త వేరియంట్లు మరింత ప్రమాదకరంగా మారే ముప్పు ఉందని తెలిపారు.



మూడో వేవ్ వస్తే..
కేసుల సంఖ్య అంచనా వేయడమూ కష్టమే

సైన్స్ అనేది.. రుజువుల ఆధారిత విధానాల రూపకల్పనను కోరుకుంటుంది. అంతే తప్ప.. విధానాల ఆధారిత రుజువుల తయారీని కాదు. దీన్ని మనం ఎప్పటికీ మర్చిపోకూడదు. ప్రస్తుతం పరిస్థితి అంతా గందరగోళంగా ఉంది. ఇక చెప్పడానికి ఏమీ లేదు. ఇది పూర్తిగా వ్యవస్థ వైఫల్యమే.

- షాహిద్ జమీల్, ఇన్సాకాగ్ మాజీ ప్రధాన సలహాదారు

ముంచుకొస్తున్న కరోనా రెండో వేవ్ ముప్పు గురించి ఈ ఏడాది మార్చిలోనే హెచ్చరించినా.. ప్రభుత్వం పట్టించుకోలేదంటూ సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ (సీసీఎంబీ) మాజీ డైరెక్టర్ రాకేశ్ మిశ్ర ఆవేదన వ్యక్తం చేశారు గుర్తుందా! దేశంలో వైరస్ కొత్త మ్యుటేషన్లపై అధ్యయనం చేసే ఇన్సాకాగ్ (ఇండియన్ సార్స్ కొవ్ 2 కన్సార్షియం ఆన్ జీనోమిక్స్) నిపుణుల బృందంలో ఆయన సభ్యుడు కూడా. అలాంటి ఇన్సాకాగ్‌కు సలహాలు ఇచ్చే అడ్వయిజరీ గ్రూప్‌లో ప్రధాన సలహాదారు షాహిద్ జమీల్ కూడా.. తమ పరిశోధనల ఫలితాలను పట్టించుకోని ప్రభుత్వ తీరుకు నిరసనగా రాజీనామా చేశారు! అది కూడా.. ఇన్సాకాగ్ సమావేశం జరుగుతుండగా.. ఉన్నట్టుండి తాను ప్రధాన సలహాదారు పదవి నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించారు! ఈ విషయాన్ని ఆ భేటీలో పాల్గొన్న ఆయన సహచర శాస్త్రవేత్త తెలిపారు. కరోనా సెకండ్ వేవ్‌ను నిరోధించే విషయంలో ప్రభుత్వ ఉదాసీనత.. విధానాల రూపకల్పనకు రాజకీయ నాయకుల నుంచి

వ్యక్తమైన మొండి వ్యతిరేకతతో విసిగిపోయినందువల్లే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారనే అభిప్రాయం తోటి శాస్త్రజ్ఞుల్లో వినిపిస్తోంది. నాయకుల మొండి వ్యతిరేకతపై.. అంతకుముందు కొద్దిరోజుల క్రితమే ఆయన ఒక వార్తాసంస్థకు రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. మహమ్మారి నియంత్రణలో విఫలమైన ప్రభుత్వ వ్యవహారశైలిపై ఆ వ్యాసంలో ఆయన పలు పరోక్ష విమర్శలు చేశారు. అంతేకాదు.. ఏం చేస్తే భారతదేశం ఈ ముప్పు నుంచి బయటపడుతుందో తెలిపే అమూల్యమైన సూచనలు కూడా చేశారాయన. వ్యాక్సినేషన్ ఇలాగే కొనసాగితే.. అందునా, ఇప్పుడున్నంత భారీస్థాయిలో వైరస్ వ్యాప్తి చెందుతున్న దశలో ఇంత నెమ్మదిగా టీకాలు వేస్తే వైర్‌సను అడ్డుకోవడం కష్టమని ఆందోళన వెలిబుచ్చారు. రోజుకు 75 లక్షల నుంచి కోటి మందికి టీకాలు ఇస్తే తప్ప ఈ ముప్పు నుంచి తప్పించుకోలేమని తేల్చిచెప్పారు. "నా పరిశీలన ప్రకారం.. ప్రస్తుతం దేశంలో తీవ్ర ఇన్‌ఫెక్షన్లకు కారణమయ్యే వేరియంట్లు విస్తృతంగా వ్యాపిస్తున్నాయి.

ఈ ముప్పును ఎదుర్కోవడంతో పాటు భవిష్యత్తులో వచ్చే మరిన్ని వేవ్‌లను తట్టుకోవాలంటే.. వ్యాక్సినేషన్ ఇప్పుడున్న వేగంతో (రోజుకు 20 లక్షల డోసులు) చేస్తే సరిపోదు. మనదేశంలో వైరస్ ఈ ఏడాది మొదటి నుంచి మ్యుటేట్ అవుతూ వస్తోంది. మరింత తీవ్ర ఇన్‌ఫెక్షన్లకు కారణమయ్యే వేగంగా వ్యాప్తి చెందే లక్షణాలను, వ్యాక్సిన్ ద్వారా గానీసహజ ఇన్‌ఫెక్షన్ ద్వారా గానీ కరోనా వైర్‌సపై పోరాడగల ఇమ్యూనిటీని తప్పించుకునే సామర్థ్యాన్ని సంతరించుకోవడమే ఈ మ్యుటేషన్ల లక్ష్యం." అని పేర్కొన్నారు. వ్యాక్సిన్ వేయించుకున్నవారికి వైరస్ సోకితే దాన్ని బ్రేక్ త్రూ ఇన్‌ఫెక్షన్ అంటారు. ప్రస్తుతం దేశంలో బి.1.617.2 వేరియంట్‌కు ఆ లక్షణం ఉన్నట్టుగా శాస్త్రజ్ఞులు అనుమానిస్తున్నారు. దేశంలో మూడో వేవ్ అంటూ వస్తే పతాకస్థాయిలో ఎన్నికేసులు వస్తాయో అంచనా వేయడం కూడా కష్టమేనని, అదే తనకు ఆందోళన కలిగిస్తోందని జమీల్ పేర్కొన్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలను కాపాడే ప్రధాన ఉపకరణాలు.. టీకాలేనని జమీల్

తేల్చిచెప్పారు. వ్యాక్సినేషన్ ఎంత వేగంగా చేస్తే కరోనా వ్యాప్తి అంత గణనీయంగా తగ్గుతుందని ఆయన పేర్కొంటున్నారు. అయితే.. వ్యాక్సీన్లు ఇన్‌ఫెక్షన్ల తీవ్రతను తగ్గిస్తాయే తప్ప ఇన్‌ఫెక్షన్ రాకుండా అడ్డుకోలేవని గుర్తుంచుకోవాలి. మరీ ముఖ్యంగా.. వైరస్ వ్యాప్తి అత్యధికస్థాయిలో ఉన్న ప్రస్తుత దశలో ఇన్‌ఫెక్షన్లను నిరోధించడం కష్టమే. వ్యాక్సీన్ రక్షణను సైతం తప్పించుకోగల సామర్థ్యం కొత్త వేరియంట్లకు ఉంటోందనే వాదనలు వినిపిస్తున్నాయి. టీకాలు వేయించుకున్నవారిలోనూ బ్రేక్ త్రూ ఇన్‌ఫెక్షన్లు రావడంలో అవే కీలకపాత్ర పోషిస్తున్నాయని జమీల్ స్పష్టం చేశారు. ముప్పు నుంచి తప్పించుకోవడానికి ఏమి చేయాలనేదానిపై ఆయన పలు సూచనల చేశారు. ..

దేశవ్యాప్తంగా పరీక్షల సంఖ్య భారీగా పెంచాలి. పాజిటివ్‌గా తేలినవారిని త్వరగా ఐసోలేట్ చేయాలి. దేశంలో చాలా రాష్ట్రాలు ఇప్పటికే లాక్‌డౌన్‌లో ఉన్నాయి. దీనివల్ల వైరస్ వ్యాప్తి నిలకడగా ఉంటుంది. ఆరోగ్య సంరక్షణ విభాగాలు, టీకా, ఔషధాల సరఫరా విభాగాలు మళ్లీ శక్తిని ప్రోది చేసుకోవడానికి ఈ సమయం ఉపయోగపడుతుంది. ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచుకోవడం వల్ల కూడా ప్రాణాలను కాపాడవచ్చు. దేశంలో పెద్ద ఎత్తున తాత్కాలిక ఆసుపత్రులను ఏర్పాటు చేయడం ద్వారా పడకలను అందుబాటులోకి తేవాలి.

పదవీవిరమణ చేసిన వైద్యులను, నర్సులను మళ్లీ రంగంలోకి దింపాలి. కీలకమైన ఔషధాలు, ఆక్సిజన్‌కు సంబంధించిన సరఫరా చెయిన్‌ను బలోపేతం చేయాలి. ఇవన్నీ ఒక పక్కన చేస్తూనే.. వ్యాక్సినేషన్ వేగాన్ని పెంచాలి. ఇప్పుడున్న వేగంతో టీకా కార్యక్రమాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ కొనసాగించరాదు. ఎట్టిపరిస్థితుల్లోనూ.. రోజుకు 75 లక్షల నుంచి కోటి మందికి వ్యాక్సీన్ వేసి తీరాలి. ఇందుకోసం టీకాల సరఫరాను పెంచుకోవాల్సి ఉంటుంది. డెలివరీ పాయింట్లను రెట్టింపు చేసుకోవాలి. అంతేకాదు.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా దాదాపు 50 వేల వ్యాక్సీన్ కేంద్రాలే ఉన్నాయి. వాటి సంఖ్యను బాగా పెంచాల్సిన అవసరం ఉంది. వీటిలోనూ ప్రైవేటు కేంద్రాలు కేవలం 3 శాతమే ఉన్నాయి. వాటి సంఖ్యను కూడా పెంచాలి.

అదో సమస్య..

దేశంలో వైరస్ ఉధృతికి అడ్డుకట్ట వేయడానికి తాను చేసిన ఈ సూచనలన్నింటికీ తన తోటి శాస్త్రజ్ఞులందరి మద్దతూ ఉందని జమీల్ పేర్కొన్నారు. వైరస్‌కు సంబంధించిన సమాచారాన్ని తమకు అందుబాటులో ఉంచాలని.. మరింత అధ్యయనం చేసి, రాబోయే ప్రభంజనాలను అంచనా వేసి, వైరస్ వ్యాప్తికి అడ్డుకట్ట వేయొచ్చంటూ 800 మంది భారత శాస్త్రజ్ఞులు ప్రధాని మోదీకి 2021 ఏప్రిల్ 30న లేఖ రాసిన విషయాన్ని కూడా ఆయన వెల్లడించారు. కానీ.. అందుబాటులో ఉన్న రుజువుల ఆధారంగా విధానాలు రూపొందించడానికి (రాజకీయ నాయకత్వం నుంచి) మొండి వ్యతిరేకతను వారు

ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. అంతేకాదు.. సమాచారం ఆధారంగా నిర్ణయాలు తీసుకోలేకపోవడం ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న మరో అతి పెద్ద సమస్య అని కూడా జమీల్ పేర్కొన్నారు. .

భారత దేశం ఇంకా ఎన్నాళ్లు బాధపడాలి?

"దేశంలోనే అత్యుత్తమ వైరాలజిస్టుల్లో ఒకరైన డాక్టర్ షాహిద్ జమీల్ రాజీనామా దురదృష్టకరం. ఎలాంటి బెరుకూ లేకుండా, ఎవరిపట్లా పక్షపాత ధోరణితో వ్యవహరించకుండా స్వేచ్ఛగా మాట్లాడే వృత్తినిపుణులకు మోదీ ప్రభుత్వంలో చోటు లేదు" అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ ట్వీట్ చేశారు. 'ఈ అజ్ఞానం వల్ల భారత దేశం ఇంకా ఎన్నాళ్లు బాధపడాలి?" అని కాంగ్రెస్ పార్టీ ట్విటర్ ద్వారా కేంద్రాన్ని నిలదీసింది. రాబోయే విపత్తుపై ఇన్సాకాగ్ మార్చిలోనే ప్రధానిని హెచ్చరించినా పట్టించుకోలేదని, ప్రభుత్వం సైన్స్‌ను పరిగణనలోకి తీసుకోవట్లేదని జమీల్ స్పష్టంగా చెప్పారని.. మోదీ సైంటిఫిక్ నిరక్షరాస్యతకు మనం మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ధ్వజమెత్తారు.

నాటి త్యాగధనులను మరవకండి.. ఉత్తేజం విడవకండి

అది 1921వ సంవత్సరం! అప్పుడే లోకం పోకడలు తెలుసుకుంటున్న 15 ఏళ్ల చంద్రశేఖర్ తివారీ నాపై విపరీతమైన 'తల్లిప్రేమ' పెంచుకున్నాడు!! తెల్లవారిని దేశం నుంచి తరిమి వేయాలనే ఉద్దేశంతో సత్యాగ్రహ పోరాటం తీవ్రంగా జరుగుతోంది. ఈ సత్యాగ్రహం మోక్షక్షేత్రమైన వారణాసిలో కూడా ఉధృతమైంది. అక్కడే నా ముద్దు బిడ్డ ఈ చంద్రశేఖర్ అంత చిన్న వయసులో బ్రిటిషువారికి వ్యతిరేకంగా 'వందేమాతరం' అన్నాడు. ముక్కు పచ్చలారని ఆ బాలుణ్ని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు.

నీ పేరేమిటి?.. గర్జించాడు మెజిస్ట్రేట్
ఏ మాత్రం తొణకకుండా 'ఆజాద్' (స్వతంత్రుడు) అన్నాడు.
నీ తండ్రి పేరు ఏమిటో చెప్పగలవా?
స్వాధీన్...! అన్నాడు ఏ మాత్రం తడుముకోకుండా!
నీ చిరునామా! ఇస్తావా?

జైలుఖానా! అంటూ జడ్జిని నివ్వెపరిచాడు చంద్రశేఖర్. అంతే ఆనాటి నుండి నా ముద్దుబిడ్డడు 'చంద్రశేఖర్ ఆజాద్'గా పేరొందాడు. ఉత్తేజకర ఉదంతాలు నన్ను దాస్యశృంఖలాల నుంచి విముక్తం చేసే సమయంలో జరిగాయి!!

venku1968@gmail.com

"జిస్ మర్‌నే తే జగ్ డరే మేరే మన్ ఆనంద్
మర్‌న్ తేహి పాయే పూరణ్ పరమానంద్"

'ప్రపంచాన్ని భయపెట్టే మృత్యువు నా మనసుకు ఆనందాన్ని ఇస్తుంది. మరణం ద్వారానే పరమా నందం కలుగుతుంది' అన్న సంత్ కబీర్ మాటను భగత్‌సింగ్ పునరుద్ఘాటించి నా కోసం ప్రాణం విడిచి పెట్టాడు! ఎంత త్యాగం!

'మీ రక్తం నాకు ఇవ్వండి మీకు స్వాతంత్ర్యం నేను ఇస్తాను' అంటూ చలో ఢిల్లీకి పిలుపునిచ్చిన మరో ముద్దు బిడ్డ నేతాజీ సుభాస్‌చంద్రబోస్!

'స్వాతంత్ర్యం మీరు ఇచ్చేదేంటి! అది నా జన్మ హక్కు' అని నిర్భీతిగా ప్రకటించిన లోకమాన్య బాల గంగాధర తిలక్ వృద్ధాప్యంలో కూడా మాండలే జైలులో శిక్ష అభవించిన దృశ్యం తలచుకుంటే నా కళ్ల నుండి ఆశ్రువులు ఆగడం లేదు.

సత్యం, అహింస అనే రెండు ఆయుధాలను చేతిలో ధరించి రవి అస్తమించని బ్రిటిషు సామ్రాజ్యం ధ్వంసం చేద్దామని కొల్లాయికట్టిన గాంధీ మీకు మహాత్ముడైతే.. నాకు ముద్దబిడ్డడు. గాంధేయవాదం పేరుతో ఆయన ఆదర్శం ఇప్పటికీ ఈ దేశానికే కాదు ప్రపంచానికే తారకమంత్రమైంది.

ఇలాంటి గొప్ప చైతన్యమూర్తులు ఉద్భవించిన నేల ఇది.. ఇప్పటి కల్లోలానికి కకవికలమైపోవడం నాకు బాధ కలిగిస్తోంది..

కుటుంబాలకు కుటుంబాలనే తుడిచిపెట్టేస్తున్న వేళ మీరంతా ధైర్యం కూడగట్టుకోవాలనేదే నా ఆశ..

కుటుంబాల్లో కరోనా కల్లోలం

ఏండాల్లేవు.. పితృకార్యాల్లేవు.. నోట్లో తులసి తీర్థం పోసేవాళ్లు లేనేలేరు.. చివరి చూపు లేదు.. కడసారి వీడ్కోలు అసలే లేదు.. పాడె మోసే పెద్దల్లేరు.. దింపుడు కళ్లం ఆశల్లేవు.. అందరూ ఉన్నా అనాథశవాల్లా అంత్యక్రియలు!

పిల్లల్ని బాగా చూసుకుంటాం నువ్వు ప్రశాంతంగా ఉండు.. అంటూ చెవిలో చెప్పేవారు లేరు.. ఎవరైనా చనిపోతే అయినవాళ్ల రాక కోసం శవాన్ని ఫ్రీజర్ బాక్సులో భద్రపరచి రెండు రోజులైనా ఎదురుచూసే పరిస్థితి లేదు.

'చిన్నోడు చివరి చూపు కోసం రాలేదని పెద్దాయన ఆత్మ ఘోషిస్తోంది.. అందుకే కాకులు పిండం ముట్టడంలేదనే' ఓదార్పు మాటల్లేవు..

కరోనా కల్లోలం రేపుతోంది. వైరస్ విరుచుకుపడుతోంది.

కుటుంబాలను ఛిద్రం చేస్తోంది.. మానవ సంబంధాలను మాయం చేసేస్తోంది.

venku1968@gmail.com

కుటుంబాలకు కుటుంబాలే వైరస్ బారిన పడి ఒకరు ఆసుపత్రిలో ఉంటే మరొకరు ఇంట్లో ఉంటే.. ఎవరు కన్నుమూసినా మరొకరికి చెప్పలేని పరిస్థితి. ఈ కబురు తెలిస్తే వారి పరిస్థితి దిగజారుతుందేమోననే అనుమానంతో రక్తసంబంధీకులకు, పేగుతెంచుకు పుట్టినవాళ్లకు కూడా చెప్పకుండానే.. నవమాసాలు మోసిన తల్లికి బిడ్డలు పాడేమోసే వీలు లేక.. పది కాలాలు పెంచిన నాన్నను కడపటి వీడ్కోలు పలికేదారి లేక.. అయినవాళ్లెవరూ లేకుండానే అంత్యక్రియలు చేయాల్సి వస్తోంది. భర్త మృతి చెందితే భార్యకు, భార్య చని పోతే భర్తకు.. తండ్రి కాలంచేస్తే కొడుక్కు తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు. కట్టుకున్న భర్త, కన్న కొడుకు దగ్గర లేకుండానే.. అసలు వారికి తెలియకుండానే అన్నీ ముగించేస్తు న్నారు. కరోనా కమ్మేసిన విషాదాల్లో ఇదో కోణం.

నాన్న చనిపోయినా అమ్మకు చెప్పలేక..

హన్మకొండకు చెందిన రాజు (78), పుష్ప (75) దంపతులకు మేనెల 9న కరోనా నిర్ధా రణ అయింది. ఇంట్లోనే చికిత్స తీసుకుంటుండగా 19న పుష్పకు ఆయాసం రావడంతో ఆసు పత్రిలో చేర్పించారు. అదేరోజు సాయంత్రం రాజు సైతం ఆయాసం ఎక్కువ కావడంతో మరో ఆసుపత్రిలో చేర్పించారు. కొద్ది గంటల్లోనే ఆయన మృతిచెందారు. వేరే ఆసుపత్రిలో ఉన్న పుష్పకు చెప్పకుండానే కుటుంబ సభ్యులు అంత్యక్రియలు పూర్తి చేశారు. ఆమె రోజూ తన భర్త ఆరోగ్యం ఎలా ఉంది? భోజనం చేశారా అంటూ ఆరా తీసేవారు. ఏమీ చెప్పలేక కన్నబిడ్డలు.. బాగానే ఉన్నారంటూ నమ్మించారు. కనీసం అమ్మనైనా కాపాడుకోవాలని ఎంతగానో ఆరాటపడ్డారు. కొవిడ్ విజృంభిస్తున్న నేపథ్యంలో పెద్దసంఖ్యలో జనం ఆసుప త్రులకు పరుగులు తీశారు. కరోనా నిర్ధారణ పరీక్షలు చేయించుకునేందుకు బారులు తీరేవారు. కొవిడ్ నిర్ధారణ కేంద్రంలో సరైన వసతులు లేక బాధితులు అవస్థలు వర్ణనాతీతం.. పడకల కొరతతో కొందరు నేలపైనే సేదతీరాల్సి వచ్చింది. ఒకే మంచంపై

ఇద్దరు, ముగ్గురికి ఆక్సిజన్ అందిస్తున్న దృశ్యాలు బయటికొచ్చాయి. గత ఏడాదికి భిన్నంగా కుటుంబంలో ఒకరి నుంచి ఒకరికి వేగంగా కరోనా వ్యాపించడం రెండోదశలో స్పష్టంగా కనిపించిందని వైద్యులు తెలిపారు. కరోనా మ్యుటేషన్ జరగడంతో ఈ సమస్య పెరిగిందని అన్నారు. ఇంట్లో అందరూ జాగ్రత్తలు పాటించినప్పటికీ పిల్లలు స్కూళ్లకు వెళ్లిన సమయంలో వారి ద్వారా ఎక్కువగా వ్యాపించిందనే అనుమానాలున్నాయి. ఇంట్లో యాంటీ బాడీస్ తక్కువగా ఉన్నవారు మొదట ప్రభావితులయ్యారు. వారి ద్వారా మిగిలిన వారికి ఈ సమస్య వచ్చింది. మొదటివేవ్‌లో ఒకరికి సమస్య వచ్చినా అదే ఇంట్లో ఐసోలేషన్‌లో ఉంటే మిగిలిన వారికి ఇబ్బంది ఉండేది కాదు. కానీ, ఈసారి అలా జరగలేదు. ఆసుపత్రిలో చేరినవారిలో కూడా దగ్గరి బంధువులు, సంబంధీకులే ఎక్కువగా ఉన్నారు. కేసుల చెయిన్ లింకు స్పష్టంగా కనిపించింది. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రంలో కరోనా పంజాకు ఒకరి తర్వాత ఒకరు.. అయిదు రోజుల వ్యవధిలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. బోథ్‌లో మే 1న కుటుంబ పెద్ద మెరుగు నర్సయ్య(65) బలికాగా, ఆయన చిన్న కుమారుడు మెరుగు చిన్ననర్సయ్య(34) నిర్మల్‌లో చికిత్స పొందుతూ మరణించారు. ఈ విషాదం నుంచి కోలు కోక ముందే నర్సయ్య భార్య మెరుగు లక్ష్మి(58) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణిం చారు. చిన్ననర్సయ్య భార్య సైతం కరోనా బారిన పడి నిర్మల్‌లో చికిత్స పొందారు.

కుటుంబాన్ని వెంటాడిన కరోనా

విశాఖ జిల్లా పెదగంట్యాడ మండలంలోని నెల్లిముక్కు ఉక్కు నిర్వాసితకాలనీలోని ఓ కుటుంబంలో నలుగురు చనిపోయారు. బెల్లాల రమణమ్మ(89)కు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఏప్రిల్ 8న రమణమ్మ రెండో కోడలు వరలక్ష్మి (54) కొవిడ్‌తో కన్ను మూశారు. 26న రమణమ్మ మృతిచెందారు. స్టీల్‌ప్లాంటులో సీనియర్ ఫోర్‌మెన్‌గా పనిచేసే

మూడో కుమారుడు శ్రీరామయ్యగుప్తా(52) ఏప్రిల్ 29న, ఉక్కు కోకొవెన్ విభాగంలో పని చేసే పెద్ద కుమారుడు శ్రీరామలింగేశ్వరరావు(59) శనివారం చనిపోయారు. రమణమ్మ పెద్ద కుమార్తె జానకి(65) ఆగస్టులో కొవిడ్‌తోనే మృతి చెందారు.

భవనంపై నుంచి దూకి ఉపాధ్యాయుడి ఆత్మహత్య

విజయవాడ వాంబే కాలనీలోని కొవిడ్ కేర్ కేంద్రంలో చికిత్స పొందుతున్న ఓ ఉపాధ్యాయుడు అదే భవనం పైఅంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పశ్చిమగోదావరి జిల్లా టి.నరసాపురం మండలం బొర్రంపాలెం వాసి మంతెన శ్రీధర్(38) జంగారెడ్డిగూడెం మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. కరోనా పాజిటివ్ రావడంతో వాంబే కాలనీలోని కొవిడ్ కేర్ సెంటరులో చేరారు. కేంద్రం పైఅంతస్తు నుంచి కిందకు దూకాడు. తలకు బలమైన గాయం కావడంతో శ్రీధర్ అక్కడిక్కడే చనిపోయాడు. కొవిడ్ సోకిందనే మనస్తాపంతోనే శ్రీధర్ చనిపోయినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. శ్రీధర్ ఉపాధ్యాయ శిక్షణ కోర్సు పూర్తిచేశారు. తొలుత కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక య్యారు. ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో కష్టపడి చదివి ఉద్యోగం సాధించారు.

తండ్రికి కరోనా.. ప్రేమ ఆగునా!

కరోనా.. కళ్లముందే ప్రాణాలు పోతున్నా ఏమీ చేయలేని నిస్సహాయులను చేస్తోంది. ఓ అమ్మాయి కొవిడ్ సోకి.. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న కన్నతండ్రిని చూసి తల్లడిల్లిపోయింది. తల్లి వారిస్తున్నా.. తానే వెళ్లి గొంతులో గుక్కెడు నీళ్లు పోసింది. ఆ వెంటనే ఆయన మృతిచెందారు. ఈ హృదయవిదారక ఘటన శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలంలో జరిగింది. జగన్నాథవలస పంచాయతీ కొయ్యానపేటకు చెందిన అసిరినాయుడు(44) విజయవాడలో కూలి పనులు చేసుకునేవారు. అక్కడ పరీక్ష చేయించుకోగా కరోనా పాజి

టివ్ అని తేలింది. కుటుంబసభ్యులతో స్వగ్రామానికి వచ్చేశారు. స్థానికులు వాళ్లను ఊరికి దూరంగా ఉన్న ఓ కల్లంలో ఉండాలని సూచించారు. ఇంతలో అసిరినాయుడు పరిస్థితి విషమించింది. కిందపడి కొట్టుమిట్టాడాడు. ఎవరూ దగ్గరకు వెళ్లలేకపోయారు. కరోనా భయంతో తల్లి ఎంత వద్దంటున్నా.. కన్నతండ్రి మీద ప్రేమను చంపుకోలేక కుమార్తె వెళ్లి ఆయన గొంతులో నీరు పోసింది. ఆ వెంటనే ఆయన తుదిశ్వాస విడిచాడు.

రోగులను కాపాడుతూ... సీనియర్ ఆచార్యుడి మృతి

కొవిడ్ బారినపడిన వందల మంది రోగులకు సేవలందించిన ఆచార్యుడు చివరికి ఆ మహమ్మారి బారినపడి సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడం అందర్నీ కలిచివేసింది. గుంటూరు సర్వజనాసుపత్రి జనరల్ మెడిసిన్ విభాగంలో సీనియర్ ఆచార్యునిగా పనిచేస్తున్న టి.వి.ఆదిశేషబాబు(55) రెండు వారాలు కరోనాతో పోరాడుతూ కన్నుమూశారు. ఆయన స్వగ్రామం బాపట్ల. భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత ఏడాది కొవిడ్ నోడల్ అధికారిగా పనిచేస్తూ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పలు సమావేశాలకు హాజరై రోగులకు ఏవిధంగా చికిత్స అందించాలో సూచించారు. బోధనా నిపుణుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వహించారు.

పెళ్లి జరగాల్సిన ఇంట్లో తండ్రి, కుమారుడి మృతి

పచ్చని పందిళ్లు వేయాల్సిన ఇంట కరోనా కరాళ నృత్యం చేసింది. తూర్పుగోదావరి జిల్లా పి.గన్నవరం మండలం ముంగడకు చెందిన ఓ ఉపాధ్యాయుడు అమలాపురంలో కొవిడ్ చికిత్స పొందుతూ ఏప్రిల్ 30న తనువు చాలించారు. ఇతని భార్య, పెద్ద కుమారుడు విశాఖపట్నంలో కరోనాకు చికిత్స పొందుతుండగా.. పెద్దబ్బాయి (27) మృతి చెందారు. ఇతనికి జూన్ 3న పెళ్లి జరగాల్సి ఉంది. అప్పటికే ఇంటికి రంగులు వేసి అలంకరించారు. భర్త, కుమారుడు ఇక లేరన్న సంగతి ఆమెకు తెలపకుండానే చికిత్స అందించారు. ప్రధానోపాధ్యాయుడి సోదరుడు ఇటీవల చెన్నైలో కరోనాతో చనిపోగా, పరామర్శించేందుకు వెళ్లి అక్కడ వైరస్ బారిన పడ్డారు.

కుమారుడి కళ్ల ముందే ఆగిన తండ్రి ఊపిరి

విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో సరిపడా పడకలు అందుబాటులో లేకపోవడంతో కరోనా లక్షణాలతో వచ్చిన కొంతమంది రోగులు ఆవరణలోనే కన్నుమూయడం విషాదకరం. మచిలీపట్నం బచ్చుపేట ప్రాంతం నుంచి అనారోగ్యంతో ఉన్న శ్రీనివాసు అనే వ్యక్తిని అతని కుమారుడు ఇక్కడికి తీసుకొచ్చారు. పడకలు లేవని.. వేచి ఉండమని చెప్పడంతో అదే ఆవరణలో ఉన్నారు. మర్నాటి ఉదయం వరకు ఆసుపత్రిలో చేర్చుకోలేదు. ఊపిరాడక ఇబ్బం

దిపడుతున్న తండ్రి ఆవేదన చూడలేక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళదామని అంబులెన్స్‌లు, ఆటోల కోసం ప్రయత్నించినా కరోనా భయంతో ఎవరూ ముందుకు రాలేదు. వైద్యులు ఎవరైనా బయటకు వచ్చి తన తండ్రిని చూడాలని వేడుకున్నా ఫలితం కనిపించలేదు. అప్పటివరకు మాట్లాడిన తండ్రి ఒక్కసారిగా ఉలుకుపలుకు లేకుండా ఉండటంతో 'నాన్నా మాట్లాడు.. నీళ్లు తాగు' అని కుమారుడు విలపిస్తుండగా అక్కడే ఉన్న రెడ్‌క్రాస్ వాలంటీరు వచ్చి గుండెపై అదిమి చూసి ప్రాణం పోయిందని చెప్పాడు. ఆసుపత్రిలో బెడ్ ఇస్తే తన తండ్రి బతికేవాడంటూ కుమారుడు రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

తల్లీ కుమారుడి మృతి.. ఆసుపత్రిలో తండ్రీ తనయుడు

విశాఖ జిల్లా అనకాపల్లికి చెందిన తల్లీకుమారుడిని కరోనా పొట్టన పెట్టుకుంది. ఎన్జీకాలనీకి చెందిన పొలమేర వరుణ్‌కుమార్(26) సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా ఇంటి నుంచే పనిచేస్తున్నారు. ఏప్రిల్ 27న వరుణ్‌కు కరోనా నిర్ధారణ అయింది. అనకాపల్లిలో ఆక్సిజన్ పడక కోసం ప్రయత్నించగా దొరకలేదు. హోం ఐసొలేషన్‌లో చికిత్స తీసుకుంటూ 29న చనిపోయాడు. వరుణ్ తల్లి పద్మకు కూడా వైరస్ సోకగా.. ఆమె ప్రైవేటు ఆసుపత్రిలో చేరి కొంత కోలుకున్నారు. మళ్లీ అస్వస్థతకు గురైన ఆమెను ఎన్టీఆర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా పడక దొరకలేదు. కాసేపటికే పద్మ మృతిచెందారు. ఆమె భర్త, చిన్న కుమారుడు కూడా కరోనా బారిన పడినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

బంధాలను బతికించుకునేందుకు

'ఓ వ్యక్తి ప్రైవేటు సంస్థలో ఉద్యోగి. నెలకు రూ.25వేల వేతనం. భార్య, ఇద్దరు పిల్లలు, తల్లితో మణికొండలో ఉంటున్నారు. ఇటీవల కరోనా బారిన పడ్డాడు. ఆరోగ్యం క్షీణించ

టంతో గచ్చిబౌలిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఐసీయూలో చేర్చిన రోజు రూ.1.50 లక్షలు కట్టించుకున్నారు. ఐదు రోజుల వ్యవధిలో సుమారు రూ.3 లక్షల వరకూ చెల్లించారు. మరో రూ.2 లక్షలు ఉంటేనే అతడు క్షేమంగా బయట పడతారని ఆసుపత్రి సిబ్బంది బాధితుడి భార్యకు తేల్చిచెప్పారు. కూతురు కోసం చేయించిన ఆభరణాలు తాకట్టుపెట్టి ప్రస్తుతం వైద్యం అందించారు. ఆరోగ్య బీమా ఉన్నప్పటికీ నగదు కావాలని ఆసుపత్రి యాజమాన్యం డిమాండ్ చేయటంతో తప్పలేదంటూ ఆమె ఆవేదన వెలిబుచ్చారు.

'ప్రదీప్ పాతికేళ్ల యువకుడు. మంచి ఉద్యోగం. ఆరోగ్యంగా ఉండేవాడు. పెళ్లిచేసేందుకు సంబంధాలు చూస్తున్నారు. మేనెల 20న దగ్గు, జ్వరం వచ్చినా సాధారణంగానే భావించాడు. 23న రక్తంలో ఆక్సిజన్ స్థాయులు భారీగా పడిపోవటంతో అప్పటికప్పుడు సిద్దిపేట నుంచి అంబులెన్స్‌లో హైదరాబాద్‌కి తీసుకొచ్చి ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. 8 రోజులకే సుమారు రూ.11 లక్షల వరకూ ఖర్చు చేశారు. సొంతూళ్లో ఉన్న పొలాన్ని తనఖా పెట్టి రూ.9 లక్షలు తెచ్చినట్టు బాధితుడి తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు.

ఆసుపత్రులు అందినంతా గుంజాయి

కొవిడ్ బారిన పడి ఆసుపత్రి గుమ్మం తొక్కిన బాధితుల పరిస్థితి దయనీయంగా మారింది. మెరుగైన వైద్యం కోసం మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ, తెలంగాణ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అత్యవసర వైద్యం కోసం హైదరాబాద్‌కు వరుస కట్టారు చాలామంది. కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు రోగులను అక్కున చేర్చుకుని ఊపిరి పోసినా.. అధికశాతం కార్పొరేట్/ప్రైవేటు ఆసుపత్రులు రోగుల ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా అందినంతా గుంజాయి. దూద్‌బౌలి ప్రాంతానికి చెందిన చిరుద్యోగి కుటుంబంలో తండ్రి(30) కూతురు(4), కుమారుడు(7నెలలు) మహమ్మారి బారినపడ్డారు. అప్పటికే రోజుకు రూ.30 వేలు ఖర్చుచేస్తున్న బాధితుడు మున్ముందు ఇంకెంత అవుతుందనే ఆందోళన వ్యక్తం చేశాడు. బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రి ఇటీవల రూ.1.50 లక్షల ఖర్చుతో కొవిడ్ రోగి కోలుకుంటాడని చేర్చుకున్నారు. తరువాత అత్యవసర వైద్యమంటూ రూ.6 లక్షల బిల్లు చేతికిచ్చారంటూ బోడుప్పల్‌కు చెందిన శేఖర్ వాపోయాడు. మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వాళ్లం.. ఎవరికి ఫిర్యాదు చేయలేం. మరెవరినీ నిందించలేం.. అంటూ పలువురు తమ నిస్సహాయత వ్యక్తంచేశారు.

ప్రతిదానికీ ఓ లెక్కుంది

ఐసీయూలో చేరి వెంటిలెటర్‌పై రోగి చికిత్స పొందుతున్నాడంటే లక్షలు కుమ్మరించాల్సిందేనంటూ నాచారం ప్రాంతానికి చెందిన ఓ వైద్యనిపుణుడు తెలిపారు. ఊపిరితిత్తులు, గుండె, మూత్రపిండాలు తదితర వైద్యనిపుణులు ఒక్కొక్కరు రోగిని ఒక్కసారి చూసి వెళ్లినందుకు రూ.750-1000 వరకూ ఫీజుగా కునేవారు. రోగిని చూసి వచ్చేందుకు పీపీఈ కిట్లు,

శానిటైజర్లు, గ్లౌజుల ఖర్చు కూడా రోగి బిల్లులోనే వేస్తామని ప్రముఖ వైద్యుడొకరు వివరించారు. కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు వైద్యులకూ లక్ష్యాలను నిర్దేశించినట్లు సమాచారం. ఆర్ ఎంపీలు, స్థానికంగా వైద్యం అందించే వైద్యుల ద్వారా రోగులను చేర్చుకుంటే కొంతమేర కమీషన్ ఇస్తామంటూ ఒప్పందం చేసుకునే ఆసుపత్రులు కొన్ని. నగర శివార్లలో ఓ ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యం.. గతేడాది కోల్పోయిన నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు ఇదే అనువైన సమయమంటూ అంతర్గత సమావేశంలో చర్చించటం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం..

జంకుతున్న సొంత మనుషులు

గాలి ద్వారానూ వైరస్ అంటుకుంటుందనే ప్రచారం సాగుతుండటంతో కొవిడ్ బాధితుల సమీపంలోకి వెళ్లేందుకు సొంత మనుషులూ, బంధువులు బెదిరిపోయారు. దాంతో కరోనా రోగుల పరిస్థితి దుర్భరంగా మారింది. ఇంట్లో చిన్నపిల్లలు ఉంటే మరింత దారుణం. కనీస అవసరాలు తీర్చేవారు ఉండటంలేదు. మొదటిదశలో కుటుంబంలో ఒకరికి లక్షణాలు కనిపించగానే మిగతా వారు జాగ్రత్తపడేవారు. దాంతో కనీసం ఒకరిద్దరయినా కరోనా బారినపడకుండా మిగిలేవారు. వారు బాధితుల తీర్చగలిగేవారు. రెండోదశలో ఆ పరిస్థితి లేదు. కుటుంబం మొత్తాన్ని వైరస్ చుట్టేసేది. చాలామంది కనీసం పరీక్షలు సకాలంలో చేయించుకోలేకపోయేవారు. సలహాలు తీసుకునేందుకు వైద్యులు అందుబాటులో లేక తల్లడిల్లినవారు ఎందరో.. అటు పలుకుబడి, ఇటు ఆర్థిక స్థోమత లేని చాలా కుటుంబాల వారు ఇలాంటి సమస్యలతోనే సతమతమైపోయాయి.

చుట్టుపక్కల వాళ్లు ముఖం చాటేశారు

ఓ కార్పొరేట్ సంస్థలో పనిచేస్తున్న ప్రశాంత్‌కు తొలుత జ్వరం వచ్చింది. మర్నాడు ఆయన తల్లి, భార్య, ఇద్దరు కుమార్తెలకూ లక్షణాలు కనిపించాయి. పరీక్షల కోసం ఎన్ని ల్యాబ్‌లకు ఫోన్ చేసినా రెండు, మూడు రోజుల తర్వాత కాని నమూనా సేకరణకు ఇంటికి రాలేమన్నారు. దాంతో ఆయనే ఏదోవిధంగా తంటాలు పడి ప్రైవేటు ల్యాబ్‌లో నమూనాలు ఇచ్చారు. అందరికీ పాజిటివ్‌గా తేలింది. ఓ రోజు అర్ధరాత్రి ప్రశాంత్ తల్లికి ఊపిరాడకపోవడంతో ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. ఎంతమందికి ఫోన్లు చేసినా అంబులెన్సులు రాలేదు. చివరకు తన సమీప బంధువును బతిమాలి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. విషయం తెలియడంతో చుట్టుపక్కల ఇళ్లలో ఉండేవారు కనీసం పలకరించేందుకూ వెనుకాడారు. మర్నాడు ప్రశాంత్‌కూ ఊపిరి సమస్య తలెత్తింది. చేర్చుకునేందుకు ఏ ఆసుపత్రీ అంగీకరించలేదు. కొన్ని గంటలపాటు నరకయాతన అనుభవించిన ప్రశాంత్ ఎట్టకేలకు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. మరోపక్క భార్య, పిల్లలు తీవ్రమైన జ్వరం, ఒళ్లునొప్పులతో సతమతమయ్యారు. వారికి కనీసం భోజనం, మందులు సమకూర్చేవారు ఎవరూ లేకపోవడంతో తల్లడిల్లారు. తెలిసిన వారిని బతిమాలుకొని భార్య, పిల్లల అవసరాలు తీర్చగలిగారు.

వారం రోజులపాటు నరకం చూశానని, ఇలాంటి పరిస్థితి ఎవరికీ రావద్దని కన్నీళ్లు పెట్టుకున్నారు.

పరీక్ష కోసం గంటలకు గంటలు

ఎల్బీనగర్ ప్రాంతానికి చెందిన ఓ చిరుద్యోగి భార్యకు కరోనా లక్షణాలు కనిపించాయి. మూడు గంటలు నిలబడితే కాని ప్రైవేటు ల్యాబ్‌లో పరీక్ష చేయించలేకపోయారు. మర్నాడు పాజిటివ్ అని తేలిన తర్వాత వైద్య సలహాల కోసం అనేక ప్రైవేటు ఆసుపత్రుల చుట్టూ తిరిగారు. ఎట్టకేలకు సాయంత్రానికి ఓ వైద్యుడు దొరకడంతో అతని సలహా మేరకు మందులు తెచ్చుకున్నారు. కాని అప్పటికే లక్షణాలు కనిపించి రెండు రోజుల దాటడంతో పరిస్థితి కాస్త క్షీణించింది.

చిన్నారిని ఎవరూ దగ్గరకే తీసుకోలేదు

ప్రైవేటు ఉద్యోగం చేసుకునే రామకృష్ణకు కరోనా సోకింది. మర్నాడు ఆయన భార్యకూ పాజిటివ్ వచ్చింది. వాళ్ల నాలుగేళ్ల కుమార్తెకు ఎలాంటి లక్షణాలు లేవు. కాని ఆ చిన్నారిని తమవద్ద ఉంచుకునేందుకు బంధువులు ఎవరూ సాహసించలేదు. నిరంతరం తల్లిని అంటిపెట్టుకొని ఉండే ఆ పాపకు తమ వల్ల ఎక్కడ కరోనా అంటుకుంటుందోనని తల్లిదండ్రులిద్దరూ హడలిపోయారు. వీరికి కావాల్సిన మందులు, ఆహారం తెచ్చుకోవడం మరో సమస్యగా మారింది. కనీసం పాల పాకెట్ కోసం కూడా బయటకు రాలేని దుస్థితి. కరోనా రోగులను పరీక్షించేందుకు సమీపంలోని ప్రైవేటు వైద్యులు నిరాకరించడంతో పరిచయస్థుల ద్వారా ఫోన్లో సలహాలు తీసుకుంటూ, మందులు వేసుకుంటూ కాలం గడిపారు.

ఒకే మంచంపై మృతదేహం, బాధితుడు

అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కొవిడ్ విభాగంలో ఒకే మంచంపై ఇద్దరు రోగులను పడుకోబెట్టి ప్రాణవాయువు అందిస్తున్నారు. కణేకల్లు మండలానికి చెందిన సుంకన్న అనే వృద్ధుడు కొవిడ్ లక్షణాలతో ఊపిరాడని స్థితిలో ఆసుపత్రిలో చేరాడు. ఈయనకు పడక లేక ఓ యువకుడు ఉన్న పడకపైనే ఆక్సిజన్ పెట్టి చికిత్స అందించారు. కొద్ది గంటల్లోనే ఆ వృద్ధుడు మృతిచెందాడు. మృతదేహం ఉన్న పడకపైనే యువకుడు రెండు గంటల పాటు ఆక్సిజన్‌తో చికిత్స పొందిన దయనీయ పరిస్థితి.

18 రాష్ట్రాల్లో 'కొత్తరకం' కరోనా

కరోనావైరస్‌లో కొత్త రకం శరీరంలో ఎన్ని మార్గాలు ఉంటే అన్ని మార్గాల్లోంచి సులువుగా ప్రయాణిస్తున్నట్లు ఇంపీరియల్ కాలేజ్ లండన్‌కు చెందిన ప్రొఫెసర్ వెండీ బార్క్లే తెలిపారు. ఈ కొత్త రకం ఇతర కరోనా వైరస్ రకాలకన్నా 50% నుంచీ 70% వేగంగా వ్యాప్తి చెందుతున్నదని భావిస్తున్నారు. పిల్లల్లో ఎక్కువగా వ్యాపిస్తుందన్నది నిజమైతే, ఈ కొత్త రకం కరోనావైరస్ ఇంత త్వరగా ఎలా వ్యాప్తి చెందుతున్నదనే దానికి జవాబు దొరుకుతుందని ప్రొఫెసర్ ఫెర్గుసన్ అన్నారు. అయితే, కొత్త రకం వైరస్ పిల్లలపై ఎక్కువ ప్రభావం చూపిస్తుందనడానికి ఇప్పటివరకూ కచ్చితమైన రుజువులు ఏమీ దొరకలేదని యూనివర్సిటీ ఆఫ్ లివర్‌పూల్‌కు చెందిన జూలియాన్ హిస్కాక్స్ తెలిపారు.

మ్యుటేషన్లే కారణం!

దేశంలో కరోనా వైరస్ సెకండ్ వేవ్ ఆందోళన కొనసాగుతున్న వేళ.. కొత్తరకం స్ట్రెయిన్‌లు కలవరపెడుతున్నాయి. ఇప్పటివరకు దేశంలో 18 రాష్ట్రాల్లో కొత్తరకం స్ట్రెయిన్‌లను గుర్తించినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. వీటిలో విదేశాల్లో బయటపడిన కొత్తరకాలే కాకుండా మరిన్ని స్ట్రెయిన్‌లు ఉన్నట్లు పేర్కొంది. పలు రాష్ట్రాల్లో కరోనా వైరస్ విజృంభణకు ఈ కొత్తరకం స్ట్రెయిన్‌లే కారణమని చెప్పే సమాచారం మాత్రం వెల్లడికాలేదని తెలిపింది. విదేశాలనుంచి భారత్ వస్తోన్న ప్రయాణికుల్లో పాజిటివ్ వచ్చిన వారి నమూనాలకు జీనోమ్ సీక్వెన్సింగ్ చేస్తోన్న విషయం తెలిసిందే. ఇలా దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 10,787 పాజిటివ్ శాంపిళ్లను కేంద్ర ఆరోగ్యశాఖ

ఏర్పాటుచేసిన విభాగం విశ్లేషించింది. వీటిలో 736 శాంపిళ్లలో బ్రిటన్ రకం, 34 శాంపిళ్లలో దక్షిణ ఆఫ్రికా రకం, బ్రెజిల్‌కు చెందిన రకాన్ని ఒక నమూనాలో గుర్తించినట్లు పరిశోధనలో వెల్లడైంది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల్లో ఈ కొత్తరకాలు వెలుగుచూసినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ ప్రకటించింది. 2020 డిసెంబరులో మహారాష్ట్రలో విశ్లేషించిన నమూనాలతో పోల్చి చూస్తే, మ్యుటేషన్ల నమూనాల్లో గణనీయమైన పెరుగుదల కనిపించినట్లు కేంద్రం తెలిపింది. రోగనిరోధకతను తట్టుకొని వైరస్ తీవ్రత పెరుగుదలకు ఇలాంటి మ్యుటేషన్లు కారణమవుతాయని కేంద్రం అభిప్రాయపడింది. వైరస్ తీరుతెన్నులను ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు పది జాతీయ పరిశోధనా కేంద్రాలతో కూడిన 'ది ఇండియన్ సార్స్-కోవ్-2 కన్సార్టియం ఆన్ జినోమిక్స్'ను కేంద్ర ఆరోగ్యశాఖ గతేడాది ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా, దేశంలో వ్యాపిస్తున్న కొవిడ్-19 వైరస్‌లను విశ్లేషిస్తున్న ఈ సంస్థ వాటి జినోమ్ సీక్వెన్సింగ్‌ను చేపడుతోంది.

ఉత్తర భారత్, తెలంగాణలో బ్రిటన్ రకం ఉద్ధృతి

ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో బ్రిటన్ రకం ఉద్ధృతి ఎక్కువగా ఉందని జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం డైరెక్టర్ సుజీత్ సింగ్ చెప్పారు. మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్‌లో జంట ఉత్పరివర్తనల రకం చెలరేగిపోతోందన్నారు. "పంజాబ్ (482 నమూనాలు), దిల్లీ (516)లో బ్రిటన్ రకం ఉద్ధృతంగా ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో తెలంగాణ (192), మహారాష్ట్ర (83), కర్ణాటక (82) ఉన్నాయి" అని సుజీత్ చెప్పారు. ఈ మేరకు 18,053 నమూనాలను విశ్లేషించినట్లు చెప్పారు.

కన్నీటికి చితిమంటలారునా!

మే నెలలో హైదరాబాద్‌లోని శ్మశానవాటికలకు వెళ్లినవారికి నమ్మశక్యం కాని సంఖ్యలో శవాలను చూసి కళ్లు చెదిరిపోయాయి. ఎర్రగడ్డ, అంబర్‌పేట, బన్సీలాల్‌పేట.. ఇలా ఎక్కడికి వెళ్లినా అవే దృశ్యాలు. ఇంత పెద్ద సంఖ్యలో శవాలు కాలడం ఎప్పుడూ లేదు. ఆసుపత్రులలో రోగుల బంధువులు ఆక్సిజన్, ఐసీయూ, బెడ్లు, వెంటిలేటర్లు, మందుల కోసం పరుగులు పెడుతున్న దృశ్యాలు విస్తృతంగా కనిపిస్తుండగా శ్మశాన వాటికల్లో మృతుల బంధువులు అనుమతి కోసం ఎదురుచూపులు.. కట్టెల కోసం వెతుకులాటలు, అంతిమ క్రతువును సంతృప్తికరంగా చేయలేకపోయామనే వేదనతో కూడిన రోదనలు కనిపించాయి. ఆసుపత్రిలో బెడ్‌ల కోసం వెతుక్కోవలసి రాగా, ఇక్కడ చితి వెలిగించడానికి ప్లాట్‌ఫారం కోసం ఆగాల్సి వస్తోంది. పదుల సంఖ్యలో వస్తున్న శవాలను కాల్చడానికి స్థలం సరిపోక కరీంనగర్‌లో మానేరు నది ఒడ్డున చితులు పేర్చి తాత్కాలిక శ్మశానవాటికలుగా మార్చినట్లు వార్తలు వచ్చాయి. ఇంత పెద్ద సంఖ్యలో.. అదీ ఒకేసారి అన్నేసి శవాలు కాలుతుండగా చూడటం ఎవరికైనా అదే మొదటిసారి. హైదరాబాద్‌లోని అనేక శ్మశానవాటికల్లో ఇదే పరిస్థితి నెలకొంది. నగరంలో ఆరేడు శ్మశానాల్లోనే కొవిడ్ మృతుల అంత్యక్రియలు జరుగుతున్నాయి. శ్మశానాల వద్ద మృతదేహాలు వరుస కట్టాయి. అంత్యక్రియల కోసం నిరీక్షణ తప్పడంలేదు. ఆ నిరీక్షణ ఎన్ని గంటలపాటు కొనసాగుతుందో తెలియదు. కొన్నిచోట్ల 10-12 గంటల పాటు నిల్చున్నా కూడా దహనక్రియలకు అవకాశం రావడంలేదు. అప్పటికి ఏడ్చిఏడ్చి కళ్లలో నీరింకిపోయి.. మనసు వికలమైపోయి.. నిస్పృహలో మునిగిపోయిన ఆప్తుల గుండెలను ఈ ఎడతెగని నిరీక్షణ దహించివేస్తోంది. హైదరాబాద్‌లో ఇప్పుడు చావుల బాధను మించి అంత్యక్రియల నిర్వహణే ఏడిపిస్తోంది. కొవిడ్ మరణాలు

పెరుగుతుండటంతో శ్మశానవాటికలపై ఒత్తిడి పెరుగుతోంది. నేరుగా రావొద్దని.. ముందుగా సంప్రదిస్తే తాము సమయం ఇస్తామని నిర్వాహకులు చెబుతున్నారు. విద్యుత్తు దహన వాటికల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నగరంలో కొవిడ్ శ్మశానవాటికలు పరిమితంగా ఉండటమే దీనికి కారణం. నగరంలో ఈఎస్ఐ, మహాప్రస్థానం, పంజాగుట్ట, అంబర్‌పేట, బన్సీలాల్‌పేట, కవాడిగూడ, జల్‌పల్లి ఖబ్రస్థాన్‌లలో కొవిడ్ మృతుల అంత్యక్రియలను నిర్వహిస్తున్నారు. అంబర్‌పేట, పంజాగుట్ట, బన్సీలాల్‌పేట, మహాప్రస్థానంలో విద్యుత్తు దహన వాటికలున్నాయి. హిందూ శ్మశానవాటికల్లో కొవిడ్ మృతదేహాల కోసం తక్కువ ఫ్లాట్‌ఫారాలనే కేటాయించారు. వాటికి మించి వస్తే అంత్యక్రియల నిర్వహణ కుదరదని చెప్పేస్తున్నారు. అంబర్‌పేట హర్రాస్‌పెంటలోని శ్మశానవాటికలో 92 ప్లాట్‌ఫామ్‌లు ఉన్నాయి. ఇందులో 17 కొవిడ్ మృతదేహాల కోసం కేటాయించినా రోజుకు మూడు నుంచి నాలుగు కంటే ఎక్కువ దహనం చేయడం లేదు. అప్పటికే దహనం చేసిన మృతదేహాల తాలూకు అస్థికలు, బూడిద ఉన్నాయని, అందుకే ఎక్కువ చేయలేకపోతున్నట్లు చెబుతున్నారు. విద్యుత్తు దహనవాటికల్లో యంత్రం కూలింగ్ కోసం కొంత సమయం ఖాళీ ఉంచాల్సి వస్తోంది. వాటిలోనూ రోజుకు 8 నుంచి 10 మృతదేహాలనే దహనం చేస్తున్నారు. అంబర్‌పేటలోని దహనవాటికకు కొవిడ్ మృతదేహంతో కొందరు వెళ్లగా అప్పటికే అక్కడ వరుస పెట్టి శవాలు ఉన్నాయి. నిర్వాహకులు.. ఏడెనిమిది గంటలు వేచి ఉండాలని చెప్పారు. ఎందుకింత ఆలస్యం? అని ప్రశ్నిస్తే.. విద్యుత్తు దహనవాటిక యంత్రం నిరంతరాయంగా పనిచేస్తే పాడయ్యే ప్రమాదం ఉందని.. అందుకే పరిమిత సంఖ్యలో దహనాలు చేస్తున్నామని చెప్పారు. బన్సీలాల్‌పేట, పంజాగుట్ట విద్యుత్తు దహనవాటికల వద్దా ఇలాంటి పరిస్థితే ఉంది. బన్సీలాల్‌పేటలో యంత్రం పనిచేయడంతో రెండురోజులు అక్కడ అంత్యక్రియలు నిలిచిపోయాయి.

దహనాలకు లభించని ఎండు కలప

మృతదేహాల్ని దహనం చేసేందుకు అవసరమైన కట్టెలకూ కొరత వచ్చింది. చాలాచోట్ల ఎండు కట్టెలు అందుబాటులో లేక పచ్చి వాటినే వినియోగిస్తున్నారు. దీంతో అవి కాలేందుకు కిరోసిన్, పెట్రోల్, డీజిల్ వంటివి అధిక పరిమాణంలో వాడుతున్నారు. సమీప ప్రాంతాల నుంచి వచ్చి నగరంలోని ఆసుపత్రుల్లో కొవిడ్ చికిత్స పొందుతూ మరణిస్తే వారి మృతదేహాల్ని మళ్లీ సొంతూరుకు తీసుకువెళ్లడం పెద్ద ప్రయాసగా మారడం, రవాణా ఇబ్బందికరంగా, ఖర్చుతో కూడినది కావడంతో చాలామంది స్థానిక శ్మశానవాటికలకు తరలిస్తున్నారు. దీంతో అక్కడ గతంతో పోలిస్తే రెట్టింపు సంఖ్యలో దహనాలు జరుగుతున్నాయి. ఆ స్థాయిలో కట్టెల సరఫరా లేకపోవటంతో కొరత ఏర్పడుతోంది. సాధారణ రోజుల్లో ఎప్పుడూ ఎండు కట్టెలు నిల్వ ఉండేవని.. ఇప్పుడు కట్టెల లోడు ఇలా తెప్పిస్తే అలా ఖాళీ అయిపోతోందని నిర్వాహకులు చెబుతున్నారు. కట్టెల ధర పెరిగి.. ఆ మేరకు అంత్యక్రియల ఖర్చులూ పెరిగిపోతున్నాయి.

నాలుగు రెట్లు పెరిగిన కట్టెల వినియోగం

ఒక్కో మృతదేహాన్ని దహనం చేసేందుకు సగటున 200-300 కిలోల ఎండు కట్టెలు అవసరం. పచ్చివైతే 300-400 కిలోల వరకూ అవసరమవుతాయి. విశాఖపట్నం జ్ఞానాపురం సమీపంలోని ఓ శ్మశానవాటికలో గతంలో రోజుకు సగటున 10 మృతదేహాలను దహనం చేస్తుంటే.. ప్రస్తుతం ఆ సంఖ్య 40కి చేరింది. దీంతో ఉదయం ఆరు టన్నుల కట్టెలు తెప్పించి ఉంచితే మధ్యాహ్నానికే ఖాళీ అయిపోతున్నాయని శ్మశానవాటిక నిర్వాహకులు తెలిపారు. 'గతంలో టన్ను కట్టెలు రూ.రెండున్నర వేలకు వచ్చేవి. ప్రస్తుతం ఎండు కట్టె లభించట్లేదు. పచ్చి కట్టెకే టన్నుకు రూ.5 వేల వరకూ కొనుగోలు చేయాల్సి వస్తోంది'' అని విజయవాడ గుణదలలోని ఈఎస్ఐ శ్మశాన వాటిక నిర్వాహకుడు దత్తూ చెప్పారు. విశాఖలో

కొన్నిచోట్ల ఎలక్ట్రిక్ పద్ధతిలో అంత్యక్రియలు జరుపుతున్నా ఆ సదుపాయం లేనిచోట మాత్రం కట్టెలతోనే దహనం చేయాల్సి వస్తోంది.

అపరకర్మలకూ కష్టం

రామాయణంలో అరణ్యవాసంలో ఉన్న రాముడు తన తండ్రి దశరథుడు మరణించారని తెలిసి అక్కడే రాముడితో యుద్ధం చేసి గాయపడిన కబంధుడు తాను మరణించాక దేహానికి అంత్యక్రియలు చేయాలని కోరడంతో రాముడు మన్నించి అతడి శరీరానికి దహన సంస్కారాలు నిర్వహించడం, అలాగే సీతను అపహరించుకుపోతున్న రావణుడిని ప్రతిఘటిస్తూ అతడి చేతిలో గాయపడిన జటాయువుకు రాముడు అంత్యేష్ఠి నిర్వహించడం వంటి ఘట్టాలు అంత్యక్రియల ప్రాధాన్యానికి నిదర్శనాలు.

గ్రీకుల ఇతిహాసం ఆధారంగా తెరకెక్కిన 'ట్రాయ్' ఆంగ్ల సినిమాలో ప్రధాన పాత్రధారులైన హెక్టార్, అకిలిస్ మధ్య జరిగే చారిత్రక యుద్ధం ఆరంభానికి ముందు.. హెక్టార్ ఒక ప్రతిపాదన చేస్తాడు. ఇద్దరిలో ఎవరు చనిపోయినా శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించడానికి గెలిచిన వ్యక్తి అనుమతించాలని కోరతాడు.

ఆ యుద్ధంలో హెక్టార్ చనిపోతాడు. ఆవేశంలో ఉన్న అకిలిస్.. హెక్టార్ మృతదేహాన్ని రథానికి కట్టుకుని తన స్థావరానికి ఈడ్చుకుపోతాడు. ఆ తర్వాత హెక్టార్ తండ్రి.. శత్రు శిబిరంలోకి వచ్చి అకిలిస్‌ని బతిమిలాడి తన కుమారుడి మృతదేహాన్ని తీసుకెళ్లి కోటలో శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహిస్తాడు.

అంతిమ సంస్కారాలకు ఇచ్చే ప్రాధాన్యానికి ఆ దృశ్యం అద్దం పడుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో జీవుడు ఉన్నత గతులకు చేరాలనే లక్ష్యంతో శాస్త్రోక్తంగా నిర్వహించే అంతిమ సంస్కారాలకూ అవకాశం లేని పాషాణ పరిస్థితులను కరోనా మహమ్మారి సృష్టించింది. ఎవరైనా మరణిస్తే కుటుంబ సభ్యులు, ఆ వంశస్థులు, గోత్రీకులు అంతిమ సంస్కారాలకు

హాజరై నువ్వులు, నీళ్లతో 'తిలోదకాలు' ఇవ్వటం కొందరిలో సంప్రదాయంగా ఉంది. మృతుడితో అనుబంధం ఉన్న వారు.. బియ్యం, నీళ్లతో 'ధర్మోదకాలు' ఇస్తుంటారు. ప్రస్తుతం తిలోదకాలు ఇవ్వాల్సిన కుటుంబ సభ్యులే వేళ్లమీద లెక్కించే సంఖ్యలో వస్తున్నారని, ధర్మోదకాలు ఇచ్చేందుకు ఎవరూ రావడంలేదని పురోహితుడు రామయ్యశర్మ వివరించారు.

ఆసుపత్రి నుంచే అంబులెన్స్‌లో శ్మశానవాటికకు

కరోనాతో మృత్యువాత పడిన వారిని కుటుంబసభ్యులు కనులారా చివరి చూపు చూసుకోలేని పరిస్థితి నెలకొంది. ఆసుపత్రి నుంచే అంబులెన్స్‌లో శ్మశానవాటికకు తరలిస్తున్నారు. ఇలా వస్తున్న మృతదేహాల్లో మూడింట ఒకవంతు వాటికే శాస్త్రోక్త క్రతువులు జరుగుతున్నాయని పురోహితులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో కుటుంబ సభ్యుల ప్రమేయం లేకుండానే సంస్కారాలు నిర్వహించాల్సి వస్తోంది. హైదరాబాద్‌లో కరోనా మృతులకు కేటాయించిన శ్మశానవాటికల్లో రోజుకు 25కు పైనే మృతదేహాల దహనం చేస్తున్నట్లు ఓ అధికారి చెప్పారు. ఈ క్రమంలో సాధారణ సందర్భాల్లో 2-3 గంటలు నిర్వహించే శాస్త్రోక్త సంస్కారాలను పది నిమిషాల్లో మమ అనిపిస్తున్నారు. చాలా సందర్భాలో తొలిరోజు నిర్వహించే సంస్కారాలకు తిలోదకాలు ఇస్తున్నారు. అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు తొలిరోజు అవకాశం లేని వారు రెండోరోజు ఆ కార్యక్రమాలను ఇంటివద్దే నిర్వహిస్తున్నారు. కుటుంబ సభ్యులు కూడా కరోనా బారిన పడితే 9 నుంచి 11 రోజుల్లో చేస్తున్నారు. అప్పటికీ అవకాశం లేని వారు.. 'కాలం చేసిన రోజు నాటి నక్షత్రం' మరోదఫా వచ్చేలోగా క్రతువు పూర్తికి ప్రయత్నిస్తున్నారు. ఏడాదిలోగా ఎప్పుడు సంస్కారాలు నిర్వహించినా మరణించిన వారు ఉన్నత గతులకు చేరేందుకు అవకాశం ఉంటుందని రామయ్యశర్మ చెప్పారు.

మరుభూమిలో బతుకు సమరం

"కడుపు చించుకు పుట్టిందొకరు.. కాటికి నిన్ను మోసేదొకరు..
తలకు కొరివి పెట్టేదొకరు.. ఆపై నీతో వచ్చేదెవరు..!"

జీవితగమనం మొత్తాన్ని నాలుగే ముక్కల్లో ఇంత గొప్పగా చెప్పారు ఆచార్య ఆత్రేయ.

ప్రస్తుత కరోనా కల్లోల సమయంలో మానవ సంబంధాలు కొడిగట్టిపోతున్నాయి.. రక్తసంబంధాలు దూరమవుతున్నాయి.. మనసు పీకుతున్నా వైరస్ భయంతో మృతదేహాలను తాకాలంటే కుటుంబసభ్యులైనా ముందుకురాని పరిస్థితి. మరి వాటి తరలింపు ఎలా? కాష్టం పేర్చేదెవరు? తలకొరివి పెట్టేదెవరు?! మరోవైపు.. కరోనా అన్నిరకాల ఉపాధులనూ ఊడ్చేసింది.. బడులు మూతపడి.. వ్యాపారాలు తడబడి.. ఉపాధి కొరవడి అలోలక్షణా అంటున్నవారు ఎందరో! ఇలాంటి పరిస్థితుల్లో శవాలను తరలిస్తూ.. చితిమంటలు వెలిగిస్తూ కాష్టాలపురిలోనే కొందరు ఉపాధి పొందుతున్నారు. తాత్కాలికంగా కాటికాపరులుగా మారిపోయారు. పిల్లలకు పాఠాలు నేర్పిన ప్రైవేటు పాఠశాల

ఉపాధ్యాయుడొకరు కొవిడ్ మృతుల శవాలను కాలుస్తున్నారు. పాకశాల నిపుణుడు చితికి కట్టెలు పేరుస్తున్నారు. క్రెడిట్ కార్డులు, బ్యాంకు రుణాలు ఇప్పించే సేల్స్‌మేన్లు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లుగా పనిచేసిన చిరుద్యోగులు, నిరుద్యోగులు కొందరు అంబులెన్సులతో జతకట్టి మృతదేహాలను తరలిస్తున్నారు. వీరంతా శ్మశానవాటికలు, శవాల గదికి పూర్తిగా కొత్తవారే. చాలామందికి పాడె మోసిన అనుభవమైనా లేదు. అలాంటిది.. కరోనా కల్లోలంలో లాక్‌డౌన్ సృష్టించిన విపత్తుకు తలొగ్గి తాత్కాలికంగా కాటికాపరుల అవతారమెత్తారు. వైద్య సిబ్బంది కూడా తాకడానికి ఇష్టపడని కుళ్లిన శవాలకూ అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నారు

అస్థికలు ఏరేదీ వీరే..

హైదరాబాద్‌లోని ఈఎస్ఐ, పంజాగుట్ట, బన్సీలాల్‌పేట, కాచిగూడ, మెహిదీపట్నం, తదితర శ్మశానవాటికల్లో కొవిడ్ అంత్యక్రియలు జరుగుతున్నాయి. ఈఎస్ఐ శ్మశానవాటిక అయితే నిత్యం రద్దీగా ఉంటోంది. ఒక సమయంలో రోజుకు 40కి పైగా శవాలను అక్కడ కాల్చుతున్నారు.. ఉదయం 5.30 గంటల నుంచి ఏర్పాట్లు మొదలవుతున్నాయి. ముందురోజు రాత్రి కాల్చిన చితుల వద్ద పొగలు కక్కుతున్న బూడిదలోంచి అస్థికలను తీసి కుండల్లో భద్రపరచడంతో పని మొదలవుతుంది. సాధారణంగా అయితే తలకొరివి పెట్టినవారే మూడోరోజున వచ్చి అస్థికలు సేకరించి పుణ్యనదుల్లో నిమజ్జనం చేస్తుంటారు. ఇప్పుడా పనిని నిర్వాహకులే చేస్తున్నారు. తర్వాత ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసి కొత్తగా కట్టెలు పేర్చుతారు. ఉదయం 7 గంటలకు మొదలయ్యే దహనాలు రాత్రి 9 వరకు కొనసాగుతుంటాయి. శ్మశానవాటికల్లో విధులు నిర్వహిస్తున్నవారు అక్కడే భోజనం చేస్తారు. ఇలాంటివారు ఒక్కో శ్మశానవాటికలో 30 నుంచి 60 మంది వరకు ఉంటున్నారు. నిరుద్యోగ యువత, రకరకాల చిరుద్యోగులు ఈ పనిచేస్తున్నారు. స్వచ్ఛంద సంస్థల వాహనాల

సాయంతో మరో 100 మంది అంతిమయాత్ర వాహనాలు నడిపిస్తున్నారు.

ఎక్కడి అస్థికలు.. అక్కడే!

రెండో దశ కరోనా కొన్ని వేల కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. బంధువులకు, ఆప్తులకు దూరం చేసింది. అయినవారికి కడసారి చూపుకూడా నోచుకోలేని పరిస్థితి దాపురించింది. కాలం చేసిన వారికి శాస్త్రోక్తంగా సాగనంపే ప్రక్రియకు ఈ మహమ్మారి చరమ గీతం పాడింది. కుటుంబ సభ్యులకు చితి మంటలే చివరి చూపుగా మారాయి. ఈ నేపథ్యంలో మృతుల చితాభస్మాన్ని కుటుంబసభ్యులకు అందించడానికి గుణదల శ్మశానవాటిక నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. చిన్నకుండ తెచ్చి ఇస్తే దానిపై పేరు రాసి, అస్థికల్ని భద్రపరుస్తున్నారు. తర్వాత దానిని కుటుంబ సభ్యులకు అందజేస్తున్నారు. హైదరాబాద్ శ్మశాన వాటికల్లోని అస్థికల లాకర్లన్నీ నిండిపోయాయి. కొత్తవాటిని నేలపైనే భద్రపరుస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చనిపోయిన వ్యక్తుల కుటుంబ సభ్యులు కరోనాతో చికిత్స పొందుతుండటం లేక క్వారంటైన్‌లో ఉండటమే ఇందుకు కారణం. "అంత్యక్రియలు పూర్తయ్యాక వారం, పది రోజుల్లో వచ్చి అస్థికలు తీసుకెళ్తామని అంటారు కొందరు. ఆ తర్వాత వాటి సంగతే మరిచిపోతున్నారు. మరికొందరు మేము తాము తీసుకెళ్లలేమని చెప్పేస్తున్నారు. గతేడాది నుంచి ఇక్కడే ఉండిపోయినవాటిని హుస్సేన్‌సాగర్ లేదా ఇతర జలాశయాల్లో కలిపేస్తున్నాం. ప్రస్తుత పరిస్థితుల్లో కరోనాతో కాకుండా వృద్ధాప్యం, ఇతర కారణాలతో చనిపోయిన వారి అంత్యక్రియలకు కూడా కుటుంబీకులు హాజరు కావడం లేదు" అని నిర్వాహకులు చెబుతున్నారు.

మరణాల రేటు అంచనాలో కొత్త పద్ధతి

కరోనా మహమ్మారి రెండోదశ ఉధృతి కారణంగా చాలామంది రోగులు ఉన్నట్టుండి ఒక్కసారిగా తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. హఠాత్తుగా వెంటిలేటర్ పైకి చేరుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఒక ప్రాంతం నుంచి వస్తున్న రోగుల్లో కరోనా తీవ్రతను గుర్తించి మరణాల రేటును అంచనా వేసే విధానాన్ని ట్రిపుల్ ఐటీ పరిశోధకులు అభివృద్ధి చేశారు. దీనివల్ల అక్కడి నుంచి వస్తున్న రోగుల మరణావకాశాన్ని ముందుగానే గుర్తించి అవసరమైన చికిత్సను అందించి, రోగి ప్రాణాలు కాపాడే వీలవుతుందని వారు చెబుతున్నారు. ఇంటెల్ సంస్థ, ఐజీఐబీ సహకారంతో ట్రిపుల్ ఐటీలోని సెంటర్ ఫర్ కాంపిటేషనల్ నాచురల్ సైన్సెస్ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్ (సీసీఎన్ఎస్బీ) ఈ పరిశోధన చేపట్టింది. ఆచార్యుడు ప్రొ.దేవ ప్రియకుమార్ ఆధ్వర్యంలో అక్షయ కార్తికేయన్, అల్లి షణ్ముఖ్ మెషిన్ లెర్నింగ్ సాయంతో దీన్ని అభివృద్ధి చేశారు. దీంతో కరోనా తీవ్రతను గుర్తించి రోగి మరణాన్ని 16 రోజుల ముందే అంచనా వేసి, అవసరమైన వైద్య సదుపాయాలు అందించవచ్చని అంటున్నారు. ఈ సాంకేతికత చైనాలోని వూహాన్‌లోని కొవిడ్-19 రోగులపై 96 శాతం కచ్చితత్వంతో సమాచారం అందించింది. ప్రస్తుతం మరణాల రేటును అంచనా వేసేందుకు చైనా లేదా అమెరికాలోని రోగుల వద్ద ఉన్న సమాచారంపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఆయా దేశాల్లోని జనాభా, ఆసుపత్రుల్లోని సౌకర్యాలు, వైరస్ రకాల ఆధారంగా అంచనాలు మారుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ట్రిపుల్ఐటీ పరిశోధకులు భారతీయులపై ప్రత్యేక అధ్యయనం చేశారు. దిల్లీలోని మ్యాక్స్ ఆసుపత్రి నుంచి సేకరించిన సమాచారం ప్రకారం కరోనా మొదటి దశలో కొవిడ్-19 సోకిన 544 మంది రోగులపై అధ్యయనం

చేశారు. ప్రస్తుతం వచ్చిన ఫలితాల ఆధారంగా త్వరలో మరిన్ని పరిశోధనలు చేపట్టేందుకు ట్రిపుల్ఐటీ పరిశోధకులు సిద్ధమవుతున్నారు. మెషిన్‌లెర్నింగ్ సాయంతో జన్యు క్రమాలను విశ్లేషించే పనిలో నిమగ్నమయ్యారు. సీసీఎన్ఎస్‌బీ ఆచార్యుడు ప్రొ. పీకే వినోద్ నేతృత్వంలో వైరస్ జన్యుక్రమాలతోపాటు కొవిడ్‌తో చనిపోయిన రోగుల్లోని వైరస్ డీఎన్ఏను విశ్లేషించే పనిలో ఉన్నారు.

మృతుల హక్కుల పరిరక్షణకు చట్టం: ఎన్‌హెచ్ఆర్‌సీ సూచన

కరోనా వ్యాప్తితో దేశంలో పెద్ద సంఖ్యలో మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో మృతుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చట్టం చేయాలని జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్ఆర్‌సీ) సూచించింది. ఈ మేరకు కేంద్ర హోం శాఖ, ఆరోగ్య శాఖ, కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్ర ప్రభుత్వాలకు పలు సిఫార్సులతో నోటీసులు జారీ చేసింది. రాజ్యాంగం లోని 21వ అధికరణం ప్రజల జీవించే హక్కు, సరైన చికిత్స పొందే హక్కును కల్పించ డంతో పాటు మృతి చెందిన వారి హక్కులను పరిరక్షిస్తుందని పేర్కొంది. అందువల్ల చని పోయిన వారి హక్కులు, గౌరవ పరిరక్షణకు ప్రత్యేక చట్టం చేయాల్సి ఉందని తెలిపింది. ప్రస్తుత పరిస్థితుల్లో తాత్కాలిక శ్మశానాలు ఏర్పాటు చేసి, గౌరవప్రదంగా అంత్యక్రియలు జరి పించాలని పేర్కొంది. కుటుంబ సభ్యులు అందుబాటులో లేనప్పుడు స్థానిక పాలన సంస్థలు వారి మత, ఆచారాలకు అనుగుణంగా అంత్యక్రియలు నిర్వహించాలని తెలిపింది. పెద్ద సంఖ్యలో దహనాలు చేయడం వలన కాలుష్యం పెరిగే అవకాశం ఉన్నందున సాధ్యమైనంత మేరకు విద్యుత్తు దహనవాటికల్లో అంత్యక్రియలు చేపట్టాలని సిఫార్సు చేసింది.

భారత్‌లో కల్లోలం.. ప్రపంచానికి కలవరం

భారతదేశంలో కొవిడ్ బాధితులు అనుభవిస్తున్న కష్టాలను ప్రతిబింబించే చిత్రాలు, వీడియోలు ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేస్తున్నాయి. ఈ సంక్షోభం ఒక్క భారతదేశానిది మాత్రమే కాదు. ఇది ప్రతి ఒక్కరికి ముప్పే. 'వైరస్‌కు ఎల్లలు లేవు.. ఏ దేశం, ఏ మతం, ఆడా? మగా? వంటివేమీ చూడదు' అని ప్రపంచ ఆరోగ్య సంస్థ చీఫ్ సైంటిస్ట్ సౌమ్య స్వామినాథన్ అన్నారు.

ఇప్పుడు భారతదేశంలో నెలకొన్న పరిస్థితిని ప్రపంచంలో చాలా దేశాలు ఇప్పటికే చవిచూశాయి. ప్రపంచం మొత్తం ఎలా కనెక్ట్ అయి ఉందో ఈ మహమ్మారి చూపించింది. ఏదైనా ఒక దేశంలో ఇన్‌ఫెక్షన్ స్థాయి తీవ్రంగా ఉంటే అది కచ్చితంగా ఇతర దేశాలకూ వ్యాపిస్తోంది. పరీక్షలు, క్వారంటైన్ లాంటి నిబంధనలు ఉన్నా కూడా ఇన్‌ఫెక్షన్ మాత్రం వ్యాప్తి చెందుతూనే ఉంది. ఇటీవల దిల్లీ నుంచి హాంకాంగ్ వెళ్లిన విమానంలో 50 మంది ప్రయాణికులకు కొవిడ్ పాజిటివ్ అని తేలింది.

భారతదేశంలో ఉన్న కొవిడ్ వేరియంట్ గురించి మరో ఆందోళన ఉంది. బి.1.617 అనే ఈ కొత్త వేరియంట్ వైరస్ ఉపరితలంపై రెండు రకాల కీలకమైన మ్యుటేషన్లు ఉండటంతో దీనిని కొందరు డబుల్ మ్యుటెంట్ అంటున్నారు. ఇది చాలా వేగంగా వ్యాప్తి చెంది వైరస్ నిరోధించేందుకు యాంటీబాడీలకు కష్టంగా మారుతుందని ల్యాబ్ ఆధారాలు చెబుతున్నాయి. దేశంలో కేసులు పెరిగేకొద్దీ కొత్త వేరియంట్‌లు పెరిగే అవకాశం కూడా ఉంది. ఎందుకంటే ప్రతి ఇన్‌ఫెక్షన్ వల్ల వైరస్ మరింత వృద్ధి చెంది కొత్త మ్యుటేషన్లు వచ్చే అవకాశం ఉంది. వీటి వలన వ్యాక్సిన్ల ప్రభావం తగ్గిపోతుందేమో అనే భయం కొంత ఉంది.

వైరస్ వృద్ధి చెందకుండా చూడటం వల్ల ఈ కొత్త వేరియంట్లు పుట్టకుండా చూడవచ్చు. "ప్రస్తుతానికి రోగాన్ని అరికట్టడం ద్వారా వేరియంట్లను అరికట్టవచ్చు" అని కొవిడ్ 19 జెనోమిక్స్ యూకే కన్సార్టియం (సిఓజి -యూకె) డైరెక్టర్ ప్రొఫెసర్ షారన్ పీకాక్ అన్నారు. లాక్‌డౌన్లు, భౌతిక దూరం పాటించడం ద్వారా వైరస్ చాలా వరకు అరికట్టవచ్చు. కానీ, వైరస్ అరికట్టేందుకు వ్యాక్సినేషన్ కీలక పాత్ర వహిస్తుంది. భారతదేశంలో వ్యాక్సినేషన్ ప్రక్రియ చాలా నెమ్మదిగా కొనసాగుతోంది. ఇప్పటి వరకు తొలి డోసు వ్యాక్సిన్ 10 శాతం మంది తీసుకోగా, రెండు డోసుల వ్యాక్సిన్‌ను 2 శాతం కంటే తక్కువ మంది తీసుకున్నారు.

ప్రపంచంలోనే అత్యధికంగా వ్యాక్సిన్ ఉత్పత్తి చేస్తున్న సీరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఇక్కడే ఉండటం వల్ల కూడా ఇక్కడ పెరుగుతున్న కేసుల సంఖ్య ప్రపంచ దేశాల మీద ప్రభావం చూపిస్తుంది.

మార్చి నెల నుంచి దేశంలో ఇన్ఫెక్షన్లు పెరుగుతూ ఉండటంతో అధికారులు ఆస్ట్రాజెనెకా-ఆక్స్‌ఫర్డ్ వ్యాక్సిన్ ఎగుమతులను నిలిపివేశారు. అందులో అల్పాదాయ, మధ్య స్థాయి ఆదాయ దేశాలకు 'కోవాక్స్' పథకం కింద అందించాల్సిన వ్యాక్సిన్లు కూడా ఉన్నాయి. అందుకే భారత్ ఎగుమతుల్ని ఆపేయడం చాలా దేశాల్లో వ్యాక్సిన్ నిర్వహణ కార్యక్రమంపై ప్రభావం చూపిస్తోంది. ప్రస్తుతానికి భారతదేశంలో తయారయ్యే వ్యాక్సిన్లలో ముందుగా దేశీయ వాడకానికే ప్రాధాన్యమిస్తారు.

భారత్ స్ట్రెయిన్ ఆందోళనకరం: డబ్ల్యూ హెచ్‌వో

భారత్‌లో కొవిడ్ పరిస్థితులు తీవ్ర ఆందోళనకరంగా ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ అధినేత టెడ్రోస్ అధనోమ్ పేర్కొన్నారు. పలు రాష్ట్రాల్లో కేసులు, మరణాలు పెరుగుతున్నాయని, చాలామంది బాధితులకు ఆసుపత్రుల్లో చేరాల్సిన అవసరం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కష్ట సమయంలో అనేక దేశాలు భారత్‌కు తోడుగా నిలుస్తున్నాయంటూ

ధన్యవాదాలు తెలిపారు. భారత్ కొవిడ్ స్ట్రెయిన్ (బి-1617)ను ఆందోళనకర రకంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ హెచ్‌వో) వర్గీకరించింది. ఈ సంస్థ కొవిడ్ విభాగ సాంకేతిక నిపుణురాలు డా. మరియా వాన్ కెర్‌ఖోవ్ "భారత్‌లో వెలుగుచూసిన ఈ వైరస్ వ్యాప్తి తీవ్రతపై స్థానికంగా, విదేశాల్లో జరుగుతున్న అధ్యయనాలను పరిశీలిస్తున్నాం. పరిశోధన, ప్రయోగశాలల నుంచి వివరాలు సేకరిస్తున్నాం. ఈ స్ట్రెయిన్ వ్యాప్తి తీవ్రంగా ఉందని, ఇది ప్రపంచానికి ఆందోళనకరమని గుర్తించాం. ప్రస్తుతానికి మాకు ప్రాథమిక సమాచారమే లభ్యమైంది. ఈ స్ట్రెయిన్ జన్యుక్రమాన్ని, మరిన్ని లోతైన వివరాలను తెలుసుకోవాల్సి ఉంది. భవిష్యత్తులో మరిన్ని రకాల కరోనా వైరస్‌లను, ఆందోళనకర స్ట్రెయిన్‌లను చూడాల్సి వస్తుంది. వాటి వ్యాప్తిని అరికట్టడం, వ్యాధి తీవ్రతను తగ్గించడం, మరణాలకు అడ్డుకట్ట వేయడం మనముందున్న కర్తవ్యం. మన చుట్టూ ఏ వైరస్‌లు ఉన్నా, మనం ఎక్కడున్నా... జాగ్రత్త పడాల్సింది ఒక్కటే. ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వడం-అనారోగ్యం బారిన పడకుండా చూసుకోవడం. ఇది ఎవరికి వారు వ్యక్తిగతంగా పాటించాల్సిన నియమం. మాస్కు ధరించాలి. ఇతరులకూ, గుంపులకూ దూరంగా ఉండాలి" అని మరియా చెప్పారు

టీకాల పంపిణీలో అసమానతలు: ఐరాస సెక్రటరీ-జనరల్ గుటెరస్

భారత్, దక్షిణ అమెరికా, తదితర ప్రాంతాల్లో ఇటీవల విజృంభిస్తున్న కొవిడ్ కారణంగా ప్రజలు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరవుతున్న పరిస్థితి కళ్లముందు కనిపిస్తోందని ఐక్యరాజ్య సమితి (ఐరాస) సెక్రటరీ-జనరల్ ఆంటోనియో గుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు. మహమ్మారి తీవ్రస్థాయిలో ఉత్పరివర్తన చెందుతోందని ఆయన హెచ్చరించారు. 2021 మే నెలలో ప్రపంచ ఆరోగ్య సదస్సును ఉద్దేశించి ఆయన మాట్లాడారు. "నేను కొవిడ్ ప్రారంభం నుంచీ చెబుతున్నాను.. ప్రతిఒక్కరూ సురక్షితమని తేలేదాకా ఎవరూ సురక్షితం కాదు. టీకాలు, పరీక్షలు, ఔషధాలు, ఆక్సిజన్ సరఫరా వంటివాటి విషయంలో అసమానతలున్నాయి. దీంతో పేద దేశాలు ఇక మహమ్మారి దయపైనే ఆధారపడాల్సిన పరిస్థితులున్నాయి" అని పేర్కొన్నారు. 'కొవాక్స్' కార్యక్రమం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఇంతవరకు 17 కోట్ల (170 మిలియన్ల) డోసుల టీకాలను పంపిణీ చేయాల్సి ఉండగా.. టీకా జాతీయవాదం, పరిమిత వ్యాక్సిన్ ఉత్పత్తి, నిధుల కొరత కారణంగా ఆ సంఖ్య 6.5 కోట్లకే పరిమితమైందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి చేసిన టీకా డోసుల్లో 82 శాతం సంపన్న దేశాలకే వెళ్లాయని.. అల్పాదాయ దేశాలకు 0.3 శాతం మాత్రమే దక్కాయని అన్నారు.

అపార్ట్‌మెంట్లలో అంతా గోప్యం

కారిడార్‌లో, పార్కులో పిల్లల ఆటపాటలు.. గృహిణుల ముచ్చట్లు.. పురుషుల ఉదయపు నడక.. జిమ్‌లో కసరత్తులతో సందడిసందడిగా ఉండే చిన్న అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లోని భారీ అపార్ట్‌మెంట్లలో కరోనా రెండో దశ దెబ్బకు నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. 30, 40కి పైగా ఫ్లాట్లుండే అపార్ట్‌మెంట్లలో ప్రతి ఫ్లోర్‌లో కనీసం ఒకరు కరోనా బారిన పడ్డవి పలుచోట్ల కనిపిస్తున్నాయి. పనిమనుషులను బంద్ చేయించి గప్‌చుప్‌గా ఉంటున్నారు. ఎక్కువమంది తమకు కరోనా వచ్చిన విషయం పక్కవారికి, అసోసియేషన్లకు చెప్పడంలేదు. కొవిడ్ వచ్చినవారి కుటుంబ సభ్యులు బయట తిరుగుతుండటంతో.. కరోనా రానివారే భయంభయంగా ఉండాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. చిన్నపిల్లల్ని తల్లిదండ్రులు కనీసం కారిడార్‌లోకి పంపించట్లేదు. కింద ఫ్లోర్‌లో వస్తే పైఫ్లోర్ వారికే కాదు.. కొన్నిచోట్ల పక్క ఫ్లాట్ వారికి చాలా రోజుల వరకు తెలియని పరిస్థితులు అక్కడక్కడా ఉన్నాయి. అసోసియేషన్లు ముందుచూపుతో వ్యవహరించినచోట మాత్రం కరోనా కట్టడి సత్ఫలితాలు ఇస్తోంది. సనత్‌నగర్‌లో ఓ వ్యక్తికి కరోనా సోకగా పక్క ఫ్లాట్ వాళ్లు భయంతో ఊరెళ్లిపోయారు. గతంలో ఎవరికి పాజిటివ్ వచ్చినా వారి వివరాలు వైద్య, మున్సిపల్, పోలీసు, రెవిన్యూ సిబ్బందికి తెలిసేది. చుట్టుపక్కలవారిని అప్రమత్తం చేసేవారు. అపార్ట్‌మెంట్లు, కాలనీచుట్టు.. కంటైన్‌మెంట్ జోన్ల ఏర్పాటు, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, సోడియం హైపోక్లోరైడ్ చల్లడం వంటి చర్యలతో కరోనా కట్టడి చర్యలు ఉండేవి. ఆ రోగులు ఇంట్లోనే ఉన్నారా? ఎక్కడికైనా వెళుతున్నారా? అనే నిఘా ఉండేది. వారి చేతిమీద హోంక్వారంటైన్ ముద్ర ఉండేది. ఇప్పుడా ఊసేలేదు. ప్రస్తుతం పోలీస్‌స్టేషన్ల వారీగా కరోనా మృతుల వివరాలు మాత్రమే వస్తున్నాయి.

venku1968@gmail.com

అభాగ్యులు, దీనులకు దిక్కెవరు!

దేశవ్యాప్తంగా కొవిడ్ టీకాల పంపిణీ కార్యక్రమం కుంటుతూనో, దేకుతూనో నడుస్తోంది. అందరికీ ఉచిత వ్యాక్సిన్లంటూ ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వాలు మెల్లగా ఈ కార్యక్రమాన్ని ప్రైవేటులోకి నెట్టేస్తున్నాయి.

ఈ విషయంలో మనదేశంలోని ప్రజా ప్రభుత్వాలు చాలా తెలివిగా వ్యవహరిస్తుంటాయి. డబ్బులు పెట్టి కొనుక్కోండి అని నేరుగా ఎవరికీ చెప్పవు కాని.. ప్రభుత్వ ఆధ్వర్యంలోని సౌకర్యాలను, పంపిణీని క్రమంగా తగ్గించేస్తాయి లేదా పరిమితం చేసేస్తాయి. అదీకాకుంటే ఈ ప్రక్రియను జటిలంగా మార్చేస్తాయి. చేసేదిలేక జనం ప్రైవేటు సేవల కోసం పరుగులు తీస్తారు. అలా ఇప్పటికే ప్రైవేటులో రూ. 1250 తీసుకుని టీకాలు వేస్తున్నారు. బెంగళూరులో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉచితంగా వేయాల్సిన టీకాలను బ్లాక్‌లో రూ. 900కు విక్రయిస్తూ అడ్డంగా దొరికిపోయిందొక ముఠా. అనుగ్రహ విఠల ఆసుపత్రిలో జరిగిన ఈ తతంగంలో భాజపా ఎమ్మెల్యే రవి సుబ్రహ్మణకు రూ. 700 కమీషన్‌గా వెళ్తున్నాయనే ఆరోపణలు వచ్చాయి.

సరే.. స్తోమతు ఉన్నవారు ఎంతోకొంత వెచ్చించి టీకాలు వేయించుకుంటారు కాని ఆ మాత్రం వెచ్చించే సామర్థ్యంలేని బడుగులు, అభాగ్యుల పరిస్థితి ఏమిటి? దిల్లీ, కోల్‌కతా, ముంబయి, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ తదితర నగరాల్లో నిరాశ్రయులైనవారు ఎందరో! అందరిలా వాళ్లకి అయినవారు లేరు. ఆత్మీయ పలకరింపు కరవు. డబ్బు ఉండదు. ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకోలేని దుస్థితి వారిది. వారిలో అనారోగ్యం, శారీరక, మానసిక వైకల్యం, ఇతరత్రా సామాజిక రుగ్మతలతో బాధపడేవారు ఎందరో! అలాంటి ఆపన్నులకు చేయూతనిచ్చేది ఎవరు?. విపత్కర పరిస్థితుల్లో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్న అభాగ్యు

లకు.. కొవిడ్ పరీక్షలు చేయించడం.. టీకా వేయించడంలో చొరవ చూపేదెవరు? దేశవ్యాప్తంగా ఇలాంటివారి సంఖ్య కోట్లలోనే ఉంటుంది. మరి వారికి టీకాలు వేయించకపోతే సూపర్ స్ప్రెడర్లుగా మారరా? వారి ద్వారా ఇతరులకు వ్యాప్తిచెందే అవకాశలు ఉండవా?

హైదరాబాద్ పరిధిలో 12 చోట్ల నిరాశ్రయుల కేంద్రాలు ఉన్నాయి. అందులో 2 వేల మంది దాకా ఉంటారు. అంతకు పదింతలు కాలిబాటలు, దేవాలయాలు, ఇతర ప్రార్థనా మందిరాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, రద్దీ ప్రాంతాల్లో ఉంటారు. చిన్నపాటి పని చేసుకుని చిరుతిళ్లతో జీవితాన్ని లాక్కెళ్తున్న వారు కొందరు. భిక్షమెత్తుకుంటూ బతికేవారు మరికొందరు. ఇంట్లో నుంచి పారిపోయి నగరానికి వచ్చిన చిన్నారులు, కుటుంబ సభ్యుల వివక్షను భరించలేక, దాడులను తట్టుకోలేక పరుగుతీసిన వారు, కుటుంబ కలహాలు, మానసిక వైకల్యం, అనారోగ్యం, పేదరికం, ఇతరత్రా సామాజిక సమస్యలతో నగరాలకు చేరిన వారూ ఉంటారు. బస్టాపులు, కాలిబాటలనే ఆవాసంగా మార్చుకుని జీవనం సాగిస్తున్నారు. అలాంటి వారందరినీ నిరాశ్రయుల కేంద్రాలకు తరలించి, మానసిక వికాసం కల్పించే బాధ్యత జీహెచ్ఎంసీది. అదేమీ అసలు పట్టించుకోవట్లేదు. హైదరాబాద్‌లో మొత్తం 12 కేంద్రాల్లో ఇప్పటి వరకు రెండు కేంద్రాల్లోనే కొవిడ్ పరీక్షలు జరిగాయి. టీకా కార్యక్రమాలనూ చేపట్టలేదు. ఇదేంటని అడిగితే 45 ఏళ్లకు పైబడి వయసున్న వారు ఒకరిద్దరే ఉన్నారని, కొందరికి ఆధార్ కార్డులు లేవని అధికారులు చెబుతున్నారు. .

నిరాశ్రయుల కేంద్రాల నిర్వహణ అధ్వాన్నంగా మారుతోంది. జీహెచ్ఎంసీ ఆర్థిక సాయం చేయట్లేదని ఎన్జీవోలు.., అంతా ఎన్జీవోలే చూసుకోవాలని బల్దియా చేతులు దులిపేసుకుంటున్నాయి. మహానగరాల్నింటిలోనూ ఇంచుమించుగా ఇదే దుస్థితి!

ఆక్సిజన్ హత్యలు

కరోనా చికిత్సకు రూ.లక్షలు అడ్వాన్సుగా కట్టించుకుంటున్న కొన్ని ప్రైవేటు, కార్పొరేటు ఆసుపత్రులు ప్రాణవాయువు లేదంటూ చేతులెత్తేస్తున్నాయి. తాము ఆక్సిజన్ అందించినా గుండెపోటుతో మరణిస్తున్నారంటూ చెప్పి తప్పించుకుంటున్నాయి.

దేశవ్యాప్తంగా వివిధ ఆసుపత్రుల్లో సకాలంలో ఆక్సిజన్ అందని కారణంగా ఏప్రిల్ 13 నుంచి మే 11 వరకు 178 మంది మృతిచెందినట్లు 'వైర్' వెబ్‌సైట్ లెక్క తేల్చింది. అనధికారికంగా ఈ అంకెలు ఇంకా ఎక్కువే ఉండవచ్చు కూడా!

హైదరాబాద్ ఎస్సార్‌నగర్‌లోని ఓ ఆసుపత్రిలో ఆక్సిజన్ సరఫరా తగినంత లేక మూడు రోజుల్లోనే ఆరుగురు మరణించారు. సనత్‌నగర్‌లో ఉంటున్న ఓ యువకుడు ఏప్రిల్ 21న తన తండ్రికి కరోనా సోకడంతో ఆసుపత్రిలో చేర్పించాడు. నాలుగు రోజులయ్యాక సాధారణ వార్డుకు తెచ్చారు. 27న శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా అనిపించడంతో ఐసీయూలోకి మార్చారు. ఈలోగా ఆసుపత్రిలో ఆక్సిజన్ నిల్వలు అడుగంటాయి. ఐసీయూలో ఉన్న రోగులకు పరిమితంగా అందజేశారు. ఏప్రిల్ 28 అర్ధరాత్రికి కూడా ఆక్సిజన్ రాలేదు. దీంతో ఆరోగ్య పరిస్థితి కాస్త బాగున్న బాధితులకు కొద్దిసేపు ఆక్సిజన్ తీసేశారు. వారిలో ఈ యువకుడి తండ్రి ఒకరు. పరిస్థితి విషమించి 29వ తేదీ తెల్లవారుజామున మరణించారు.

దశాబ్దాల తరబడి అరకొర ఆరోగ్య వ్యవస్థలతోనే నెట్టుకువస్తున్న భారతదేశంలో సామర్థ్యానికి మించిన అవసరం రావడంతో లోపాలన్నీ బయటపడ్డాయి. పడకలు, వసతులు, సిబ్బంది, సాధనాలు, ఔషధాలు.. అన్నీ ఒక్కసారిగా ప్రియమయిపోయాయి. రెండో విడత కరోనా విజృంభిస్తుందని నిపుణులు హెచ్చరించినా అధికారపక్షాలు ఎన్నికల మత్తులోనే

మునిగితేలాయి, జనసందోహాల జాతరలకు అనుమతులిచ్చాయి. కొద్దిగా ముందు మేల్కొంటే, సర్దుబాటు చేసుకోగలిగే సంక్షోభం, ఇప్పుడు చేయి దాటిపోయింది.

బాధ్యతారహితంగా నిర్ణయాలను తీసుకుని కొవిడ్-19 వ్యాప్తికి కారకులైనందుకు ఎన్నికల కమిషన్‌పై హత్యకేసు పెట్టాలని చెన్నై హైకోర్టు వ్యాఖ్యానించింది. అలహాబాద్ హైకోర్టు మరొక తీవ్రమైన వ్యాఖ్య చేసింది. ప్రాణవాయువు కొరత కారణంగా జరుగుతున్న మరణాలను న్యాయమూర్తులు 'జాతిహననం'తో పోల్చారు. "కేవలం ఆక్సిజన్ లభించకపోవడం వల్ల కొవిడ్ రోగులు మరణించే పరిస్థితులకు కారకులు కావడం అనేది జాతిహననానికి ఏ మాత్రం తక్కువ కాని నేరం ఇది" అని న్యాయమూర్తులు అజిత్ కుమార్, సిద్ధార్థ వర్మ వ్యాఖ్యానించారు. సామాజిక మాధ్యమాలలో రోగుల బంధువులు ఆక్సిజన్ సిలండర్ల కోసం ప్రాధేయపడుతూ అభ్యర్థనలు పెట్టడం హృదయవిదారకంగా ఉన్నదని న్యాయమూర్తులు ప్రస్తావించారు. మరోపక్క ఆక్సిజన్‌ను అక్రమంగా నిల్వ చేసే అమానుష వ్యాపారం సాగుతోందని వారు పేర్కొన్నారు.

స్వతంత్ర పాత్రికేయానికి పేరు పొందిన 'ది వైర్' వెబ్‌సైట్‌లో దేశవ్యాప్త ఆక్సిజన్ మరణాల లెక్కలను క్రోడీకరించి, సంఖ్యను 178 గా తేల్చారు. ఎక్కడ, ఏ ఆసుపత్రిలో ఆ మరణాలు జరిగాయో కూడా అధికారిక ధ్రువీకరణ తీసుకుని మరీ వెల్లడించారు. మరో 78 మరణాలను ఆక్సిజన్ కొరత కారణంగా జరిగినవని బంధువులు చెబుతుండగా, అధికారులు నిర్ధారించడం లేదు. కనీసం 200 మరణాలు ఆక్సిజన్ అందకపోవడం వల్లనే జరిగాయంటే, ఎంతటి దారుణం? నల్లబజారుకు ఆక్సిజన్‌ను తరలించడం వల్ల కొన్ని మరణాలు జరిగి ఉంటాయి కానీ, మొత్తం మీద సమస్య, ఆక్సిజన్ అవసరాన్ని అంచనావేసి ముందుజాగ్రత్తలు తీసుకోకపోయిన కేంద్రప్రభుత్వ తీరు వల్లనే ఏర్పడింది. ఒక రాష్ట్రం అనేముంది, అంతటా ఒకే సంక్షోభం, అనేకచోట్ల అదే నిర్లక్ష్యం, నిర్లిప్తత. ఈ నేపథ్యంలో న్యాయస్థానాలే పరిస్థితిని గమనిస్తూ, ప్రభుత్వాలను అదిలిస్తూ, అవసరమైన ఆదేశాలిస్తూ ఆశ కలిగిస్తున్నాయి.

రోగులందరికీ వైద్యం అందించాలని దిల్లీ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

పౌరుల ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని దిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. కొవిడ్ రోగులకు వైద్యం, ఔషధాలు, ఆక్సిజన్, ఐసీయూ పడకలు, వెంటిలేటర్ సదుపాయం కల్పించాలని ఆదేశించింది. తన శరీరంలో ఆక్సిజన్ స్థాయి పడిపోతున్నా ఐసీయూ పడక లభించడం లేదంటూ 53 ఏళ్ల వ్యక్తి దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన ధర్మాసనం.. పిటిషనర్ ఒక్కరికే కాకుండా.. దిల్లీలో కరోనా బారినపడిన వారందరికీ. . ప్రాణ రక్షణకు అవసరమైన అన్ని సదుపాయాలూ అందేలా చూడాలని స్పష్టం చేసింది. వైద్య సదుపాయాల లేమిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజకీయాలు పక్కన పెట్టి పౌరుల ప్రాణాల రక్షణకు కృషి చేయాలని జస్టిస్ విపిన్ సంఘి, జస్టిస్ రేఖా పల్లిలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది..

ఉత్పత్తి అంతంతే.. ఇప్పటికీ ఆక్సిజన్ కొరతే

ఆసుపత్రి పడకలు, ఆక్సిజన్ సిలిండర్లు, వెంటిలేటర్లు దొరక్క రోగులు అల్లాడుతున్నారు. నిజానికి ఆక్సిజన్, ఆసుపత్రి పడకలకు కొరత ఏర్పడనుందని పార్లమెంటరీ కమిటీ నిరుడు నవంబరులోనే హెచ్చరించినా, సర్కారు సకాలంలో మేల్కొనలేదు. తీరా ముప్పు మీదపడ్డాక, కొన్ని పరిశ్రమలకు ఆక్సిజన్ సరఫరాను నిషేధించి, ఆ ప్రాణ వాయువును ఆస్పత్రులకు మళ్లిస్తున్నట్లు ప్రకటించింది. తీవ్ర కొరతతో సతమతమవుతున్న దిల్లీ, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాలకు ఆక్సిజన్ సరఫరా కోసం రైల్వే శాఖ యుద్ధప్రాతిపదికన రైళ్లను నడపడం మొదలుపెట్టింది. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీతో సహా దేశంలోని వివిధ ఉక్కు కర్మాగారాల్లో తయారయ్యే ఆక్సిజన్‌ను రైళ్లలో తరలించడం మొదలుపెట్టారు..

కరోనా మొదటి ఉధృతితో పోలిస్తే రెండో ఉధృతి నాటికి దేశంలో ఆక్సిజన్ వినియోగం 188% మేర పెరిగినా ఉత్పత్తి 62 శాతం మాత్రమే పెరిగిందని కేంద్ర వాణిజ్యశాఖ విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. 2020 సెప్టెంబరు 29న కేసులు గరిష్ఠ సంఖ్యకు చేరినప్పుడు దేశంలో 3,095 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ విక్రయం జరిగింది. 2021 మే 6వ తేదీ నాటికి అది 8,920 మెట్రిక్ టన్నులకు చేరింది. అప్పట్లో ఉత్పత్తి 5,800 టన్నుల మేర ఉండగా, డిమాండ్ అందులో 54% మాత్రమే ఉండేది. ఇప్పుడు 9,446 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతుండగా అందులో 95% మేర డిమాండ్ ఉన్నట్లు తేలింది. ఈ 9 నెలల కాలంలో ఆక్సిజన్ వినియోగం దాదాపు 200% పెరిగినప్పటికీ దేశవ్యాప్తంగా ఉత్పత్తి 62% మాత్రమే వృద్ధి చెందింది.

ఏప్రిల్ 22 నుంచి పారిశ్రామిక అవసరాలకు ఆక్సిజన్ వినియోగాన్ని నిషేధించడం వల్ల అదనంగా వెయ్యి మెట్రిక్ టన్నులు అందుబాటులోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం, డీఆర్‌డీవో, పెట్రోలియం సంస్థలు కలిపి దేశంలోని వివిధ ఆసుపత్రులకు 1,594 ఆక్సిజన్ ప్లాంట్లు మంజూరుచేయగా, మే నాటికి 74 ప్లాంట్ల (4.646%) ఏర్పాటు మాత్రమే పూర్తయింది.

మిగతావి జూన్ నాటికి పూర్తవుతాయి. పీఎం కేర్స్ నిధుల నుంచి మార్చి, ఏప్రిల్ నెలల్లో మంజూరుచేసిన ప్లాంట్లు అందుబాటులోకి రావడానికి మరో 3 నెలలు పట్టనుంది.

ఆక్సిజన్ సరఫరాలో ప్రభుత్వం ఎందుకు విఫలమవుతోంది

దేశ రాజధాని దిల్లీ సహా దేశంలోని చాలా ప్రాంతాల్లో లిక్విడ్ ఆక్సిజన్ కొరత తీవ్రంగా ఉంది. ఎల్ఎన్‌జేపీ లాంటి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి సరోజ్, ఫోర్టిస్ లాంటి ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ ఆక్సిజన్ కొరత కనిపిస్తోంది. దిక్కుతోచని స్థితిలో ఉన్న కొన్ని ఆసుపత్రులు సాయం కోసం కోర్టుల వైపు చూస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో కొన్ని ఆసుపత్రుల బయట 'ఆక్సిజన్ అవుటాఫ్ స్టాక్' అనే బోర్డులు పెట్టారు. లఖ్‌నవూలోని ఆసుపత్రులు తమ వద్దకు వచ్చే రోగులను వేరే ఆసుపత్రులకు వెళ్లమని చెబుతున్నాయి. దిల్లీలోని చిన్నా పెద్ద ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్స్ కూడా అదే చెబుతున్నాయి. చాలా నగరాల్లో రోగుల బంధువులు స్వయంగా సిలిండర్లు తీసుకుని రీ ఫిల్లింగ్ సెంటర్ల దగ్గర క్యూల్లో ఉండడం కనిపిస్తోంది. హైదరాబాద్‌లోని ఒక ఆక్సిజన్ ప్లాంట్ బయట గుమిగూడిన జనాలను అదుపు చేయడానికి బౌన్సర్లను కూడా పిలిపించాల్సి వచ్చింది. సోషల్ మీడియాలో ఆక్సిజన్ సిలిండర్ కావాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. అయినా, ఆక్సిజన్ కోసం ఇంత భయానక పరిస్థితి ఎందుకు ఏర్పడింది? ఆక్సిజన్ డిమాండ్ ఇంతలా ఎందుకు పెరిగింది? "సాధారణంగా మా దగ్గర ఆసుపత్రులకు తగినంత ఆక్సిజన్ దొరికేది. కానీ, గత 15 రోజులుగా రోగులకు శ్వాస అందించడం కష్టంగా ఉంది. 22 ఏళ్ల యువకులకు కూడా ఆక్సిజన్ సపోర్ట్ అవసరమవుతోంది" అని పుణెలో కొవిడ్ ఆసుపత్రి నిర్వహించే డాక్టర్ సిద్ధేశ్వర్ షిండే బీబీసీతో అన్నారు. కరోనా పరిస్థితి తీవ్రంగా ఉండడంతో జనం భయపడి ఆసుపత్రుల్లో చేరుతున్నారు. ఫలితంగా హై-ఫ్లో ఆక్సిజన్ డిమాండ్ పెరుగుతోంది. దాంతో, గత ఏడాది కంటే ఈసారి ఎక్కువ సరఫరా చేయాల్సి వస్తోంది.

కేంద్ర-రాష్ట్రాల పరస్పర ఆరోపణలు

ఇతర రాష్ట్రాల నుంచి దిల్లీ వచ్చే ఆక్సిజన్ ట్రక్కులను అడ్డుకుంటున్నారని ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తమకు తగినంత ఆక్సిజన్ ఇవ్వడం లేదని కూడా అన్నారు. దిల్లీ ప్రభుత్వం అడిగినదానికంటే ఎక్కువ కోటాను ఇచ్చామని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ చెప్పారు. ఆక్సిజన్ రవాణాలో ఎలాంటి అంతరాయం సృష్టించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. దిల్లీలోని ఆసుపత్రులు కూడా ఆక్సిజన్ కోసం దిల్లీ హైకోర్టుకు వెళ్లాయి. అక్కడ కూడా దిల్లీ ప్రభుత్వం ఇదే వాదనలు వినిపించింది. దిల్లీ, మహారాష్ట్ర సహా మిగతా రాష్ట్రాల హైకోర్టులు కూడా ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు అక్షింతలు వేశాయి. పరిస్థితిని నియంత్రించాలని ఆదేశించాయి.

ఉరిశిక్ష విధిస్తామన్న కోర్టు

కేంద్ర, రాష్ట్ర అధికారులు లేదా స్థానిక అదికారులు ఎవరైనా ఆక్సిజన్ రవాణాకు అంతరాయం కలిగిస్తే ఉరి శిక్ష విధిస్తామని దిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. కరోనా రోగుల ఆక్సిజన్ కొరతను దిల్లీలోని మహారాజా అగ్రసేన్ ఆసుపత్రి హైకోర్టు దృష్టికి తీసుకెళ్లినపుడు విచారణ చేపట్టిన కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. "మీరు దిల్లీకి రోజూ 480 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ సరఫరా చేస్తామని ఏప్రిల్ 21న చెప్పారు అది ఎప్పుడవుతుంది" అని కేంద్రాన్ని ప్రశ్నించింది.

ఆక్సిజన్ ఉత్పత్తి ఎలా జరుగుతుంది

లిక్విడ్ ఆక్సిజన్ తేలికపాటి నీలి రంగులో ఉండే వాయువు. చాలా చల్లగా ఉండే ఇది క్రయోజెనిక్ గ్యాస్. ఇది -183 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలో ఉంటుంది. దీనిని ప్రత్యేక సిలిండర్లలో, ట్యాంకర్లలో నిల్వ చేస్తారు. భారత్‌లో దాదాపు 500 పరిశ్రమలు గాలి నుంచి ఆక్సిజన్ తయారీ, శుద్ధి చేస్తున్నాయి. తర్వాత దానిని ద్రవ రూపంలోకి మార్చి ఆసుపత్రులకు పంపిస్తాయి. దీనిని ఎక్కువగా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఆసుపత్రుల్లోని ఆక్సిజన్ ట్యాంకర్లలో దీనిని నింపి రోగుల పడకల వరకూ పైపుల ద్వారా సరఫరా చేస్తారు.

ప్రభుత్వం ఉత్పత్తి పెంచే ప్రయత్నం చేసిందా

దేశంలో ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ 2020 అక్టోబర్‌లో బిడ్స్ ఆహ్వానించింది. భారత్‌లో కరోనా వచ్చి అప్పటికే 8 నెలలకు పైనే అయింది. ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామంటూ కేంద్రానికి ఎన్నో ప్రతిపాదనలు వచ్చాయి. 162 సంస్థలకు అనుమతులు కూడా ఇచ్చింది. కానీ, ఇప్పటివరకూ 33 ప్లాంట్లు

మాత్రమే ఏర్పాటయ్యాయని, ఏప్రిల్ చివరికల్లా 59 ప్లాంట్లు, మే చివరికి 80 ప్లాంట్లు సిద్ధమవుతాయని కేంద్రం చెబుతోంది. దేశంలో ఆక్సిజన్ కొరత, వేగంగా పెరుగుతున్న కరోనా కేసుల దృష్ట్యా విదేశాల నుంచి మెడికల్ ఆక్సిజన్ దిగుమతి చేసుకోవాలని కేంద్రం నిర్ణయించింది. మరో మూడు నెలలపాటు ఆక్సిజన్, దానికి సంబంధించిన పరికరాల దిగుమతులపై పన్ను మినహాయింపు ఇచ్చింది.. 50 వేల మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ దిగుమతులకు చర్యలు తీసుకుంది. దేశంలోని తొమ్మిది పరిశ్రమలు మినహా మిగతావి ఆక్సిజన్ వినియోగించడంపై ప్రభుత్వ ఎంపవర్డ్ గ్రూప్-2 నిషేధం విధించింది. దీంతోపాటూ, 162 పీఎస్ఏ మెడికల్ ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటుచేయడానికి అవసరమైన నిధులు కూడా అందించింది. వేగంగా ఆక్సిజన్ సరఫరా చేసేందుకు కేంద్ర 'ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్' రైళ్లు కూడా నడుపుతోంది. ఖాళీ కంటైనర్లను త్వరగా ప్లాంట్ దగ్గరకు చేర్చడానికి వైమానిక దళం సాయం కూడా తీసుకుంటోంది.

ప్రాణాలు పైప్‌లైన్లలో!

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆక్సిజన్ సరఫరాలో తలెత్తుతున్న సాంకేతిక, పర్యవేక్షణ సమస్యలతోపాటు అధికారుల బాధ్యతారాహిత్యం పలువురి ప్రాణాలు తీస్తోంది. కొవిడ్ బాధితులకు పైపులైన్ల ద్వారా ఆక్సిజన్ సరఫరా చేసేందుకు పీడనాన్ని (ప్రెషర్) పెంచుతుండగా అందుకు అనుగుణంగా పైపులైన్ల సామర్థ్యం ఉండడంలేదు. అనూహ్యంగా కేసులు పెరుగుతుండడంతో ఈ పరిస్థితులు నెలకొన్నాయి. ఓ జిల్లా ఆసుపత్రి వైద్యుడు మాట్లాడుతూ "అర్ధరాత్రి బాధితుల నుంచి అభ్యంతరాలు రాకుండా ఉండేందుకు సిబ్బంది పీడనం పెంచుతున్నారు. తమ నిద్రకు భంగం కలగకుండా చూసుకునేందుకు ఇలా చేస్తున్నారు. ఇది సరైన విధానం కాదు. అర్ధరాత్రి ఆక్సిజన్ సరఫరా అధికంగా ఉంటోంది" అని తెలిపారు.

యుద్ధనౌకల్లో భారత్‌కు ఆక్సిజన్ సిలిండర్లు

భారత నౌకాదళం తొమ్మిది యుద్ధనౌకల్లో ఆక్సిజన్ సిలిండర్లు, భారీ ఆక్సిజన్ ట్యాంకర్లు, కొన్ని రకాల వైద్య పరికరాలను భారతదేశానికి తీసుకువచ్చింది. సముద్రసేతు-2 పేరుతో కొవిడ్ సహాయ చర్యలను చేపట్టింది. ఆక్సిజన్ కొరత తీర్చడానికి పర్షియన్ గల్ఫ్, ఆగ్నేయాసియా ప్రాంతాల్లోని భారత స్నేహపూర్వక దేశాలు ముందుకు వచ్చాయి. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఎన్నో నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. . .

షార్ నుంచి ఇస్రో ఆక్సిజన్

కరోనా రోగుల కోసం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఆక్సిజన్‌ను సమకూరుస్తోంది. తన ప్రయోగ కేంద్రం షార్ నుంచి దేశవ్యాప్తంగా ఉన్న తమ కేంద్రాల నుంచి ఆసుపత్రులకు ప్రాణవాయువును పంపింది. జీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగంలో క్రయోజనిక్ ఇంజిన్ కోసం లిక్విడ్ ఆక్సిజన్ (లాక్స్)ను ఆక్సిడైజర్‌గా ఉపయోగిస్తారు. దీన్ని కాస్త మార్పు

చేసి కొవిడ్ బాధితులకు అందించింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ సమీప ఆసుపత్రుల్లో ఆక్సిజన్ కొరతను అధిగమించేందుకు అక్కడి స్పేస్ అప్లికేషన్ సెంటర్‌లో ఉన్న సుమారు 1.65 లక్షల లీటర్ల లిక్విడ్ నైట్రోజన్ ట్యాంకులను ద్రవ ఆక్సిజన్ ట్యాంకులుగా మార్చింది. మెడికల్ ఆక్సిజన్ లభ్యతపై సంక్షోభాన్ని తగ్గించేందుకు తాము రూపొందించిన వెంటిలేటర్లపై పరీక్షలను వేగవంతం చేసింది. కేరళలోని తుంబా వద్దనున్న విక్రమ్ సారాబాయ్ స్పేస్ సెంటర్ కేరళ, తమిళనాడు ప్రభుత్వాలకు 150 టన్నుల లిక్విడ్ ఆక్సిజన్‌ను సరఫరా చేసింది.

వైమానిక దళం చొరవ

తేజస్ యుద్ధ విమానం కోసం డీఆర్‌డీఓ రూపొందించిన ఆన్ బోర్డ్ ఆక్సిజన్ జనరేషన్ టెక్నాలజీని ప్రైవేటు సంస్థలకు అందించింది. ఆకాశంలో ఎంతో ఎత్తుకు ఎగిరే తేజస్ పైలట్లకు విమానంలోనే ఆక్సిజన్ తయారు చేసి అందించే టెక్నాలజీ ఇది. నిమిషానికి వెయ్యి లీటర్ల ఆక్సిజన్ తయారు చేసే ప్లాంట్‌ను తేజస్‌లో అమర్చుతారు. ఇలాంటి నాలుగు ప్లాంట్ల కోసం ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ప్రైవేటు రంగానికి ఆర్డర్ ఇచ్చింది. ఆక్సిజన్ కొరత తీర్చడంలో భారత వైమానిక దళం కీలక పాత్ర పోషిస్తోంది. ఇప్పటికే సింగపూర్ నుంచి నాలుగు భారీ అతిశీతల కంటైనర్లలో ద్రవరూప ఆక్సిజన్‌ను తీసుకొచ్చిన వాయుసేన జర్మనీ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచీ భారీ ఆమ్లజని ట్యాంకర్లను తరలించింది. ద్రవరూప ఆక్సిజన్‌ను వాయు రూపంలోకి మార్చి సిలిండర్లలోకి ఎక్కించి ఆస్పత్రులకు సరఫరా చేస్తారు.

ముందే హెచ్చరించిన ప్రత్యేక కమిటీ

దేశంలో ప్రస్తుత కరోనా కల్లోలాన్ని, రోజువారీ కేసుల సంఖ్యను కేంద్రం ఏర్పాటుచేసిన ప్రత్యేక కమిటీ ముందే అంచనా వేసింది. సకాలంలో నివారణ చర్యలు తీసుకోకుంటే.. వైరస్ రెండో దశలో విలయం సృష్టిస్తుందంటూ 2021 మార్చి 9నే కేంద్రాన్ని హెచ్చరించింది. మే నెల ప్రారంభానికి రోజువారీ కేసులు 3.8 లక్షల నుంచి 4.4 లక్షలకు చేరుకుంటాయని ఆనాడే చెప్పింది. మే మధ్యకాలానికి క్రియాశీల కేసుల సంఖ్య 33-35 లక్షలకు చేరుతాయని అంచనా వేసింది. అయితే కేంద్రం ఈ విషయాన్ని పెద్దగా పరిగణనలోకి తీసుకోలేదని ఇప్పుడు స్పష్టమవుతోంది. రెండో దశ వ్యాప్తిని కొట్టిపారేసే తరహాలోనే వ్యవహరించింది. కరోనా నియంత్రణకు మార్గదర్శకాలు రూపొందించేందుకు కేంద్ర శాస్త్ర, సాంకేతిక విభాగం.. 2021 ప్రారంభంలోనే ఏడుగురు నిపుణులతో 'నేషనల్ కొవిడ్-19 సూపర్ మోడల్ కమిటీ'ని నియమించింది. ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ ఎం.విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కమిటీలో ఐఐటీ ఖరగ్‌పుర్ ప్రొఫెసర్ ఎం.అగర్వాల్, వెల్లూర్ క్రిస్టియన్ మెడికల్ కాలేజీ వైరాలజీ ప్రొఫెసర్ గగన్‌దీప్ కాంగ్ తదితరులున్నారు. ఈ కమిటీ ఇప్పటికే మనుగడలో ఉంది. రెండో దశ వ్యాప్తిపై మార్చి 9న ఈ కమిటీ కేంద్రాన్ని అప్రమత్తం చేసింది. అప్పటికే మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కేరళలో రెండో దశ ప్రారంభమైందని, తక్షణమే నివారణ చర్యలు తీసుకోకుంటే దేశవ్యాప్తం అవుతుందని హెచ్చరించింది. మే నాటికి రోజువారీ కేసులు 4 లక్షలకు చేరుతాయని సరిగ్గానే లెక్క కట్టింది. అయితే హరిద్వార్‌లో జరిగిన కుంభమేళా, 4 రాష్ట్రాలు, ఓ కేంద్ర పాలిత ప్రాంతంలో జరిగిన ఎన్నికలకు కరోనా రెండోదశ వ్యాప్తికి సంబంధం ఉంటుందని ఆ కమిటీ చెప్పలేదు.

అంగీకరించని అధికారులు

కొవిడ్-19 సూపర్ మోడల్ కమిటీ హెచ్చరికను కేంద్రం పెడచెవిన పెట్టిందనడాన్ని.. కేంద్ర శాస్త్ర, సాంకేతిక విభాగం అధికారులు అంగీకరించడం లేదు. "ముందే హెచ్చరించడం, కేసుల వ్యాప్తి పరిధిని అంచనా వేయడంలో వ్యత్యాసం ఉంది. ఏదోక సమయంలో రెండో వేవ్ వస్తుందని అందరికీ తెలిసినప్పటికీ.. ఈ స్థాయిలో కేసులు పెరుగుతాయని ఎవరూ అంచనా వేయలేదు" అని ఓ అధికారి చెప్పారు. ప్రస్తుత పరిస్థితిపై కమిటీ సభ్యుడొకరు స్పందించారు. "దేశంలో ఎన్నికల ప్రచారానికి ముందే.. కొవిడ్ కేసులు పెరగడం మొదలైంది. మార్చి 11న కుంభమేళా మొదలయ్యేసరికే రెండో దశ వ్యాప్తి దేశాన్ని చుట్టుముట్టింది. ప్రజలు నిబంధనల్ని పెడచెవిన పెట్టడం ఎక్కువైంది. నిర్లక్ష్యంగా, గుంపులుగా తిరగడం, పెళ్లిళ్లు వంటి శుభకార్యాలు ఎక్కువగా జరగడం కూడా వైరస్ వ్యాప్తికి కారణమైంది" అని వివరించారు.

సర్కారులో అప్రమత్తత ఏది?

ఆక్సిజన్ కొరత రాబోతోందని పార్లమెంటరీ కమిటీ ముందే హెచ్చరించినా జాగ్రత్త పడలేకపోయిన కేంద్ర ప్రభుత్వం- వెంటిలేటర్ల విషయంలోనూ అదే అజాగ్రత్త ప్రదర్శించింది. ఇస్రో 2020లో రూపొందించిన మూడు రకాల వెంటిలేటర్లు ప్రయోగ దశలో ఉండగానే, మొదటి దశ కొవిడ్ సద్దుమణగడంతో ఆ కార్యక్రమం మందగించింది. కొవిడ్ రెండోదశ విజృంభిస్తున్న దృష్ట్యా వెంటిలేటర్ల పని మళ్లీ ఊపందుకుంది. మేకిన్ ఇండియా కింద వెంటిలేటర్ల తయారీని పెద్దయెత్తున ప్రోత్సహించిన ప్రభుత్వం, తీరా అవి సిద్ధమయ్యాక వాటిని కొనలేదు. స్వదేశీ వెంటిలేటర్ల తయారీకి నిరుడు కేంద్రం రూ.2,000 కోట్లు కేటాయించి, మొత్తం 50,000 వెంటిలేటర్లను కొంటానన్నది. వాటి నాణ్యతపై ప్రైవేటు ఆస్పత్రులు పెదవి విరవడంతో చివరకు కేవలం 35,179 వెంటిలేటర్లను మాత్రమే కేంద్రం సేకరించగలిగింది. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) 30,000 వెంటిలేటర్లను తయారు చేయగా- ఏగ్వా హెల్త్ కేర్, మారుతి కార్ల సంస్థ భాగస్వామ్యంతో 10,000 వెంటిలేటర్లను తయారుచేసింది. ఏగ్వా వెంటిలేటర్లలో సగం మాత్రమే కేంద్రం కొనుగోలు చేయడంతో- ఆ సంస్థ ఉత్పత్తి నిలిపేసింది. ఆపద ముంచుకొచ్చినప్పుడు పరుగులు తీయడం కాకుండా ముందు నుంచే అప్రమత్తంగా వ్యవహరించాలనే సంగతిని సర్కారు విస్మరించింది.

ఆక్సిజన్ కొరతతో ఎవరూ చనిపోలేదన్న కేంద్రం

కరోనా రెండో ఉద్ధృతి సమయంలో ఆక్సిజన్ కొరత కారణంగా కొవిడ్ బాధితులెవరూ మృతి చెందలేదని కేంద్ర ప్రభుత్వం 2021 జులైలో రాజ్యసభకు తెలిపింది. ఇలాంటి మర

ణాలు చోటుచేసుకున్నట్టు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలేవీ నివేదించలేదని పేర్కొంది. రెండోదశలో ప్రాణవాయువు లభించక రోడ్లపైనా, ఆసుపత్రుల్లోను కొవిడ్ బాధితులు భారీ సంఖ్యలో చనిపోయారా? అన్న ప్రశ్నకు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ, సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవార్ సమాధానమిచ్చారు. మరణాలు దాచిపెట్టాల్సిన అవసరమేమీ లేదని చెప్పారు. "కొవిడ్ మరణాలను గుర్తించే విషయంలో కేంద్ర ఆరోగ్యశాఖ రాష్ట్రాలకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేసింది. రాష్ట్రాలు ఇస్తున్న లెక్కల్నే కేంద్రం క్రోడీకరిస్తోంది. ఆ విషయంలో మా పాత్ర అంతవరకే. మరణాలను, కేసుల్ని తగ్గించి చూపాల్సిందిగా మేం ఎవరికీ చెప్పలేదు. అలాంటి అవసరమే లేదు" అని ఆయన వివరించారు.

అక్సిజన్ కొరత సిగ్గుచేటన్న ప్రతిపక్షాలు

కొవిడ్ మహమ్మారిని ఎదుర్కోవడంలో కేంద్రం ఘోరంగా విఫలమైందని విపక్షాలు మండిపడ్డాయి. ప్రాణవాయువు అందక రోడ్లపైనే ఎంతోమంది ప్రాణాలు విడిచారని, 21వ శతాబ్దంలో కనీసం ఆక్సిజన్‌ను సమకూర్చుకోలేకపోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటని దుయ్యబట్టాయి. "కరోనాను భారత్ ఎదుర్కొంటున్న తీరును 'లాన్సెట్'తో పాటు సుప్రీంకోర్టు, పలు హైకోర్టులు, బ్రెజిల్, కెనడా, బ్రిటన్‌లు సైతం విమర్శించాయి" అని తృణమూల్ సభ్యుడు శాంతను సేన్ పేర్కొన్నారు. ఆక్సిజన్ కొరత కారణంగా ఎవరూ ప్రాణాలు కోల్పోలేదని కేంద్రం పార్లమెంటులో ప్రకటించడంపై కాంగ్రెస్, శివసేన, ఆమ్ ఆద్మీ పార్టీలు తప్పుపట్టాయి. ఒకపక్క వైరస్ ఉధృతి ఉన్నా కేంద్రం మాత్రం ఆక్సిజన్ ఎగుమతుల్ని 700% మేర పెంచడం, దేశీయ రవాణాకు ట్యాంకర్లు సమకూర్చకపోవడం వల్ల మరణాలు సంభవించాయని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆరోపించారు.

త్యాగధనుల పురిటిగడ్డపై రాబందుల రెక్కల చప్పుళ్లా!?

పురాణకాలం నుంచి చూస్తే ప్రేమ, దానం, త్యాగం భారతీయ సంస్కృతిలో భాగం. దధీచి మహర్షి, బలిచక్రవర్తుల కథలు మీకు తెలిసినవే..

నిన్నమొన్నటి కాలాన్నే తీసుకున్నా స్వాతంత్ర్య పోరాటంలో ఎందరు మహనీయులు, ముద్దుబిడ్డలు నా కోసం సర్వస్వం త్యాగం చేశారో కదా! గిరీంద్ర చంద్రశేఖర్ బోస్, నానా సాహెబ్, లాలాలజపతిరాయ్, రాంప్రసాద్ బిస్మిల్, వాసుదేవ బలవంత్ ఫడ్కే, అనంత లక్ష్మణ, మదన్‌లాల్ ధింగ్రా, బాజీ ప్రభు, యతీంద్రనాథ్ దాస్, సర్దార్ ఉద్యంసింగ్, అరవింద్ ఘోష్, ఝన్సీలక్ష్మీబాయి, తాంతియా తోపే, అస్ఫఖుల్లాఖాన్, అల్లూరి సీతారామరాజు, వీర పాండ్యకట్ట బ్రహ్మన వంటి ఎందరో నా ముద్దు బిడ్డలు తమ ప్రాణాలను, ఆస్తిపాస్తులను ఈ జాతి కోసం.. ఈ దేశం కోసం తృణప్రాయంగా వదిలిపెట్టారు.

అలాంటి జాతికి వారసులుగా పుట్టినవారు నేటి కరోనా సంక్షోభంలో ప్రాణాధార మందులను, ప్రాణవాయువును కూడా నల్లబజారులో అమ్ముకోవడాన్ని చూస్తే నా కడుపు తరుక్కుపోతోంది. రోగుల అవసరాన్ని ఆసరా చేసుకుని ధనార్జనే పరమధ్యేయమన్నట్లు వ్యవహరిస్తున్న వైద్యశాలలు.. 'వైద్యో నారాయణో హరిః' అంటూ వైద్యుణ్ని నారాయణుడితో పోల్చిన గడ్డ మీద అదే పవిత్ర వైద్యవృత్తిలో ఉన్న కొందరు పీడిస్తున్న తీరు చూస్తే నాకు మళ్లీ దుఃఖం కలుగుతోంది.

venku1968@gmail.com

జపాన్‌లో సునామీ బీభత్సం తర్వాత ఒక ముసలామె అత్యవసరమైన కొన్ని వస్తువులను కారు చౌకగా అమ్ముతూ బీబీసీ రిపోర్టరుకు కనిపించిందట!

అంత తక్కువకు ఎందుకు.. ఎలా అమ్ముతున్నావని అడిగితే.. దానికా ముసలామె.. "నేను మార్కెట్‌లో హోల్‌సేల్ ధరకు కొంటాను. కొంత లాభం వేసుకుని అమ్ముకుంటూ ఉంటాను. ఇప్పుడు ఆపద సమయం కనుక అవసరమైనవాళ్లకు అసలు ధరకే సరకు అమ్ముతున్నాను" అని చెప్పిందట.

"ఆపదలో ఉన్న నా దేశానికి నేను చేయగలిగిన సహకారమిది" అని అందట.

అదీ దేశభక్తి అంటే! అదీ సాటివారి మీద సానుభూతి, భూతదయ అంటే!

కాని మన దేశంలో మాత్రం పరిస్థితి దారుణం.

వానొచ్చినా వరదొచ్చినా.. ఏదైనా ఆపద ముంచుకొచ్చినా.. దానిని ఎలా సొమ్ము చేసుకుందామా అనేదే చాలామంది దుర్బుద్ధి! అంతెందుకు ఉత్తరాఖండ్‌లో వరదల వేళ యాత్రికులు నానా అవస్థలు పడుతుంటే వాటర్ బాటిల్ కూడా 500 రూపాయలకు అమ్మిన ఘనత మనది.

ప్రభుత్వాలు, ప్రజలు కూడా ఎవరు ఎలా పోతే నాకేంటి అనేలా తయారవడం దారుణం. ఈ పుణ్యభూమిలో అడుగడుగునా మోసాలే! పైకి కనిపించకపోవచ్చు కాని అవసరంలో పక్కవాడిని దోచుకుని తిందామనుకునే ఠక్కులు, పిండారీలు మన మధ్య ఎందరో!

ఒకవైపు దేశంలో శవాల గుట్టలుగా పోగుపడుతుండగా, మాంసఖండాలు పీక్కుతినేందుకు ఆబగా వాలే రాబందుల గుంపుల్ని ఎప్పుడైనా చూశారా? కొవిడ్ మహమ్మారి పడగ నీడన ప్రాణాధార మందుల్ని, ప్రాణవాయువును కూడా నల్లబజారులతో అమ్ముతున్న పిండారీలను చూస్తే అలాంటి రాబందులే కనిపిస్తున్నాయి.

దేశంలో రెండోదశలో రోజుకు నాలుగు లక్షల మేర కొవిడ్ కేసులు విజృంభిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి నాలుగు కొవిడ్ మరణాల్లో ఒకటి ఇక్కడే నమోదవుతోంది. అమె

రికా, మెక్సికో, బ్రెజిల్ తరవాత ఇండియాలోనే మరణాలు ఎక్కువగా ఉంటున్నాయి. పలు రాష్ట్రాల్లో ఔషధాలకు కొరత ప్రజానీకాన్ని వేధిస్తోంది. గిరాకీని సొమ్ము చేసుకునే ముఠాలు పుట్టుకొచ్చాయి. దేశ రాజధానిలో మందుల బ్లాక్ మార్కెట్‌పై మండిపడ్డ దిల్లీ ఉన్నత న్యాయస్థానం 'మీరు చేతులు కట్టుక్కూర్చున్నారు!' అంటూ కేజ్రీవాల్ సర్కారుపై ఆగ్రహం వ్యక్తంచేసింది.

అసలు ప్రాణాధార మందుల్ని, ప్రాణవాయువును కూడా దారిమళ్లించి సులభార్జన వనరులుగా మలచుకుంటున్నవాళ్లు మనుషులేనా? మరణించిన రోగి వద్ద మిగిలిపోయిన ఇంజక్షన్లనూ కక్కుర్తిగా సొమ్ము చేసుకుంటున్న వాళ్లను మనుషులని అనగలమా!

రోగుల అవసరాన్ని, వారి బంధువులు మిత్రులు సంబంధీకుల ఆందోళనను అవకాశంగా మలచుకుని అక్రమార్కులు అందినకాడికి దండుకుంటున్నారు. కరోనా వైరస్ లోడ్ అధికంగా ఉన్నవారికి సూచిస్తున్న రెమ్‌డెసివిర్ ఇంజక్షన్, ఊపిరితిత్తులు దెబ్బతిన్నవారికి వినియోగించాల్సిన కొవిఫిరావిర్ ఔషధం.. డబ్బు జబ్బు ముదిరిపోయినవాళ్లకు గొప్ప ఆదాయవనరులుగా పరిణమించాయి. రూ.40 వేల మేర గరిష్ఠ చిల్లర ధర కలిగిన టొసిలిజూమాబ్ ఇంజక్షన్ ఇప్పుడు కొన్నిచోట్ల లక్షన్నర నుంచి మూడు లక్షల రూపాయల దాకా ధర పలుకుతోంది! ఔషధాలకు, అత్యవసర వైద్యసామగ్రి ధరలు పెంచేసి అడ్డగోలుగా దోచుకుంటున్న ప్రబుద్ధుల్ని కాసుల రాబందులని కాకుండా ఇంకేం అనగలం?

లక్ష రూపాయలు చెల్లిస్తేనే దవాఖానాలో ప్రవేశం

'దయచేసి వెంటనే ఆస్పత్రిలో చేర్చుకోండి..' అని ప్రాధేయపడే కొవిడ్ రోగులు, వారి సంబంధీకులు ఎవరైనా తారసపడితే- దళారి బృందాలకు పండగే పండగ. ఒకరోజు చికిత్సకు ఐసొలేషన్‌లో అయితే రూ.4000, ఐసీయూలో అయితే ఏడున్నర వేలు, వెంటిలేటర్‌పై సేవలకు రూ.9000 వంతున వసూలు చేయాలన్న సర్కారీ ఆదేశాలను ప్రైవేటు ఆస్పత్రులు

ఏమాత్రం పట్టించుకోవడంలేదు. రోగుల పట్ల ఉదారంగా వ్యవహరించాలన్న భారతీయ వైద్య సంస్థ (ఐఎమ్ఏ) విజ్ఞప్తినీ తుంగలో తొక్కుతున్నాయి. కనీసం లక్ష రూపాయలు చెల్లిస్తేనే దవాఖానాలో ప్రవేశం దక్కుతోంది. ఆరోగ్య బీమా ఉన్నప్పటికీ అంగీకరించేదే లేదని, నగదు మాత్రమే చెల్లించాలన్న షరతుపైనే ఆసుపత్రిలో పడకను కేటాయిస్తున్నాయి.

కొవిడ్ ధాటికి వణుకుతున్న 12 రాష్ట్రాల ఆక్సిజన్ అవసరాలకు మూడింతల మేర ట్యాంకుల నిల్వలున్నట్లు కేంద్రప్రభుత్వం ఇటీవలే సుప్రీంకోర్టుకు నివేదించింది. మరి రాష్ట్రాలవారీగా ఆక్సిజన్ కొరత నెలకొందంటూ ఆందోళన ఎందుకు చెలరేగుతున్నదంటే, సరైన సమాధానం దొరకదు. ఒక్కో ఆక్సిజన్ సిలిండర్‌కు లక్ష రూపాయల దాకా డిమాండు చేస్తున్నారన్న వార్తల్ని తీవ్రంగా పరిగణించిన దిల్లీ హైకోర్టు- అక్రమ విక్రయాలకు పాల్పడుతున్నవాళ్లను తమ ఎదుట ప్రవేశపెట్టమనేసరికి, యంత్రాంగం కిక్కురుమంటే ఒట్టు! ఇష్టారాజ్యంగా రేటు పెంచేసి నల్లబజారులో కాసుల వేట సాగిస్తున్న భాగ్యనగర వాసులిద్దరి వద్ద 57 ఆక్సిజన్ సిలిండర్లు పట్టుకున్నారు. ఒక్క ముక్కలో, దేశవ్యాప్తంగా మూడు సిలిండర్లు ఆరు నోట్ల కట్టలుగా నల్ల వ్యాపారం పచ్చగా వర్ధిల్లుతోంది!

శ్మశానవాటికకు తరలించడానికి పాతిక వేలు

ఆసుపత్రిలో ప్రవేశానికి, మందులకు, చికిత్సకు అప్పోసప్పో చేసి భారీగా బిల్లు చెల్లించినా అయినవారిని దక్కించుకోలేక గొల్లుమంటున్న కుటుంబీకుల అవస్థలు అక్కడితో ముగియడం లేదు. ప్రైవేటు ఆసుపత్రిలో కొవిడ్‌తో చనిపోతే, మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించడానికి పాతిక వేల రూపాయల వరకు బాదుడుకు సిద్ధపడాల్సిందేనని అంబులెన్సుల మురాలు పట్టుబడుతున్నాయి. శవాలపై కాసులేరుకునే దళారుల బరితెగింపు విస్మయపరుస్తోంది. మానవత్వం దుర్మార్గపు చితిమంటల్లో తగలబడుతున్న దిగ్భ్రాంతకర దృశ్యాన్ని కళ్లకు కడుతోంది. ఏ కారణంగానైనా మృతదేహం తరలింపు ఆలస్యమైతే, ఫ్రీజర్

సేవలకూ వేలల్లో చెల్లించాల్సిందేనంటూ కరాఖండీగా చెప్పి వసూలు చేసుకుంటున్న వాళ్లు మరోరకం.. జాతికే పెనువిపత్తు దాపురించిన వేళ, ఎందరిలోనో మానవత్వం కానరాకుండా పోతున్న దుస్థితిపై ఎవరికి నివేదించుకోవాలి?

రసాయన సంస్థలు, కొన్ని కార్పొరేటు ఆసుపత్రులు మహారాష్ట్ర, గుజరాత్‌లోని భావనగర్, జునాగఢ్ ప్రాంతాల నుంచి ఆక్సిజన్ సిలిండర్లను తెప్పించుకుంటున్నాయి. అక్కడి కిందిస్థాయి ఉద్యోగుల అత్యాశ కారణంగా అవి అక్రమార్కులకు చేరుతున్నాయి. 10 కిలోల ఆక్సిజన్ సిలిండర్ రూ.4,500 అసలు ధర కాగా.. కిందిస్థాయి ఉద్యోగులు రూ.5,500 నుంచి రూ.6,500 వరకూ విక్రయిస్తున్నారు. వీటిని తీసుకున్న అక్రమార్కులు రూ.10 వేల నుంచి రూ.11 వేలకు అమ్మేస్తున్నారు. రోజూ ఒక్కో కంపెనీకి నాలుగైదు లారీల ఆక్సిజన్ సిలిండర్ల లోడ్లు వస్తుండటం, వాటి లెక్కలు చూసేవారు కిందిస్థాయి ఉద్యోగులకు బాధ్యత అప్పగించడంతో ఇదంతా జరుగుతోందని సమాచారం.

టొసిలీజుమాబ్.. రూ. 2 లక్షలు

టొసిలీజుమాబ్ ఇంజక్షన్ అత్యవసర పరిస్థితుల్లో కరోనా రోగులకు వినియోగిస్తుంటారు. వీటి ఖరీదెక్కువ. విదేశాల నుంచి ముంబయికి, అక్కడి నుంచి వివిధ రాష్ట్రాలకు దిగుమతి చేసుకుంటారు. ఈ మందును సాధారణంగా కీళ్లనొప్పులకు వాడతారు. అయితే, కొవిడ్ సమయంలో ఇది ప్రాణాలను కాపాడే మందుగా క్లినికల్ ట్రయిల్స్‌లో తేలింది. ప్రస్తుతం ఇది మార్కెట్లోంచి పూర్తిగా మాయమైపోయింది. ఎక్కడా దొరకట్లేదు.

టొసిలీజుమాబ్ 400 మిల్లీగ్రాముల ఇంజక్షన్ ఎంఆర్‌పీ ధర రూ.35 వేలుగా ఉండగా కొందరు రూ. 90 వేల నుంచి రూ. 2 లక్షలు పెట్టి కొనాల్సి వచ్చింది. రెమెడిసివీర్, టోసిలిజుమాబ్ మందులు కావాలని అభ్యర్థిస్తూ అనేకమంది సోషల్ మీడియాలో పోస్టులు పెరిగిపోయాయి. ఈ మందులు చూపే ప్రభావం గురించి ప్రపంచవ్యాప్తంగా అనేక చర్చలు

జరుగుతున్నప్పటికీ భారతదేశంతో సహా మరికొన్ని దేశాల్లో ఈ ఔషధాల అత్యవసర వినియోగానికి అనుమతి ఇచ్చారు. యాంటీవైరల్ ఔషధం రెమెడిసివీర్ వాడమని చాలామంది డాక్టర్లు సూచిస్తున్నారు. దాంతో ఈ మందులకు డిమాండ్ బాగా పెరిగింది.

హెటెరో ఫార్మా మేనేజరు బ్లాక్‌లో

ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రెమెడిసివీర్ ఉత్పత్తిని భారీగా పెంచనున్నట్లు హెటెరో ఫార్మా సంస్థ తెలిపింది. హైదరాబాద్‌లో స్వయంగా కొన్ని కేంద్రాలు నెలకొల్పి రోగి అడ్మిట్ కార్డు, డాక్టరు ప్రిస్క్రిప్షన్ చూపిస్తే అసలు ధరకే ఇంజక్షను అందజేసింది. కాని స్వయంగా ఆ కంపెనీ మేనేజరు ఒకరు ఈ ఇంజక్షన్లను బ్లాక్‌లో విక్రయిస్తూ మిర్యాలగూడలో పట్టుబడడం విశేషం. రెమెడిసివీర్ 100 మి.గ్రా సీసా రూ.24,000కు అమ్ముతున్నారు. భారత ఆరోగ్య శాఖ సూచనల ప్రకారం.. ఒక రోగికి 100 మి.గ్రా రెమెడిసివీర్ ఆరు డోసులు అవసరమవుతాయి. కొన్ని కేసుల్లో ఎనిమిది డోసులు తీసుకోవాల్సి వస్తుంది. ఈ మందును బ్లాక్ మార్కెట్లో ఆరు నుంచి ఎనిమిది డోసులు కొనుక్కోవడం మధ్యతరగతి వారికి తలకు మించిన భారమైంది. అంతేకాదు.. అది ఎక్కడ దొరుకుతుందో తెలీక వందలకొద్దీ కాల్స్ చేయాల్సి వచ్చింది. దొరుకుతుందో లేదో అని ఒకటే టెన్షన్... భయం.. ఆందోళన. యాంటీ వైరల్ డ్రగ్గా ప్రాచుర్యంలో ఉన్న రెమిడెసివిర్ మందును మూడే కంపెనీలు ఈ మందును మార్కెట్ చేస్తుండటంతో కొరత తీవ్రంగా ఉంది.

ప్రధాన న్యాయమూర్తికి లేఖ

దేశం నలుమూలలా ఎన్నోచోట్ల కీలకమైన మందులు, ఆక్సిజన్ నల్లబజారుకు తరలిపోతున్నాయని, నిర్దేశించిన ధరలకు పదింతలకు పైగా దండుకుంటున్న అక్రమ నిల్వదారులూ దళారులపై తగిన చర్యలు తీసుకునేలా చూడాలంటూ న్యాయశాస్త్ర విద్యార్థులు భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. హైదరాబాద్, విజయవాడ, గుంటూరు సహా ఇండోర్, రాయపూర్, జలంధర్, ఘజియాబాద్, రూర్కీ, హరిద్వార్ తదితర ప్రాంతాల్లో నల్లబజారులో రెమ్‌డెసివిర్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.. రెమ్‌డెసివిర్ సీసాపై లోగో అలాగే ఉంచి లోపల నీటిని ఇతర పదార్థాలను నింపి 'అసలు సరకు'గా అంటగడుతున్న బాగోతాలూ, కరోనా మందుల పేరిట విచ్చలవిడిగా అక్రమ వ్యాపారాలు సాగుతున్నాయి. చికిత్స పొందుతూ మరణించిన రోగికి సంబంధించి మిగిలిపోయిన ఇంజక్షన్లనూ కక్కుర్తిగా సొమ్ము చేసుకుంటున్న వాళ్లను మనుషులని అనగలమా!

బ్లాక్‌లో కొవిడ్ వ్యాక్సిన్?

ఇన్నాళ్లు కరోనా మందులను బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకున్న రాబందులు ఇప్పుడు వ్యాక్సిన్లను కూడా దారిమళ్లిస్తున్నారు. వ్యాక్సిన్ వేయించుకొని కరోనా

మహమ్మారి బారినుంచి తప్పించుకుందామనుకునేవారికి టోకరా వేస్తున్న కేటుగాళ్లు వ్యాక్సిన్ వేయడంలోనూ కక్కుర్తిని ప్రదర్శిస్తున్నారు. ప్రజలకు టీకా వేసే సమయంలో తక్కువ మోతాదులో వేసి వయల్స్‌ను దాచి అధిక ధరకు విక్రయిస్తున్న విషయం ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరంలో వెలుగుచూసింది. విజయవాడ సత్యనారాయణపురం ప్రాంతంలో కారులో వచ్చి కొందరు వ్యాక్సిన్ వేయడం చూసి స్థానికులు పోలీసులకు తెలపగా.. వారు ఆ కారును వెంబడించి పట్టుకున్నారు. అందులో ఉన్నవారు భీమవరానికి చెందిన వారుగా గుర్తించారు. ఈ సమాచారం అందుకున్న భీమవరం తహసీల్దార్ కొవిడ్ వ్యాక్సినేషన్లో తెరవెనుక ఏదో జరుగుతుందన్న అనుమానంతో విచారణ జరిపారు. ఓ సెంటర్లో వందమందికి టీకాలు వేసినట్లు గుర్తించారు. అక్కడ 10 మందికి ఒకటి చొప్పున 10 వయల్స్ వినియోగించాలి.. కానీ అక్కడ 8.5 వయల్స్ మాత్రమే ఉపయోగించినట్లు గుర్తించారు. మిగిలిన ఒకటిన్నర వయల్‌ను ఏం చేశారనే దానిపై విచారణ మొదలుపెట్టారు. దీంతో వ్యాక్సినేషన్ సిబ్బంది కావాలనే తక్కువ మోతాలో వ్యాక్సిన్ వేసి మిగతాది బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్నారని అర్థమవుతోంది.. ప్రభుత్వ లెక్కల్లో మాత్రం ఎలాంటి అనుమానం రాకుండా అన్ని ఖాళీ వయల్స్‌ను తిప్పి పంపిస్తున్నారు. దారి మళ్లించిన వ్యాక్సిన్‌ను బ్లాక్ మార్కెట్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి.

స్టాఫ్‌నర్సులే విక్రేతలు..

ఖమ్మం, వరంగల్‌లలో స్టాఫ్ నర్సులే విక్రేతల అవతారం ఎత్తారు. ఖమ్మంలో అయితే ఏకంగా అక్కడి ప్రభుత్వ ఆసుపత్రి నుంచే రెమ్‌డెసివిర్ ఇంజక్షన్లు బయటకు పోతున్నాయి. కొవిడ్-19 రోగులకు ఉపయోగించాల్సిన ఇంజక్షన్లను బయటకు తీసుకెళ్తుండగా టాస్క్‌ఫోర్సు పోలీసులు ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఇద్దరు కాంట్రాక్టు ఉద్యోగులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 6 ఇంజక్షన్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నల్లబజారులో ఒక్కో

బాటిల్‌ను రూ.38 వేలకు విక్రయించడానికి వారు సిద్ధమయ్యారని పోలీసులు తెలిపారు.

బ్లాక్ మార్కెట్ ఏమాత్రం మానవత్వం కాదు.. దిల్లీ హైకోర్టు

కొవిడ్-19 రోగుల చికిత్సలో వాడే కీలక ఔషధాలు, ఆక్సిజన్ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్ నిరోధించడంలో ఢిల్లీ ప్రభుత్వం విఫలమైందని ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆక్సిజన్ సిలిండర్లు, మందులు బ్లాక్ మార్కెట్‌కు తరలివెళుతుంటే ఆప్ సర్కార్ యంత్రాంగం వాటిని నిరోధించడంలో విఫలమైందని జస్టిస్ విపిన్ సంఘి, జస్టిస్ రేఖ పల్లితో కూడిన కోర్ట్ ఆక్షేపించింది. రాబందులు సొమ్ము చేసుకునేందుకు ఇది సమయం కాదని, బ్లాక్ మార్కెటింగ్ ఏమాత్రం మానవత్వం కాదని కోర్టు హితవు పలికింది.

శవాల మీద దుస్తులూ వదలట్లేదు!

కరోనా రోగుల నుంచి వైద్యం పేరిట ఆసుపత్రులు దోచుకోవడం చూశాం. కొన్నిచోట్ల బాధితుల ఆభరణాలు మాయమైన ఘటనల గురించి విన్నాం. కానీ ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఈ ముఠాది కొత్త దందా! కరోనాతో మరణించిన వారి దుస్తులు దొంగిలించడం, వాటిని ఉతికి మళ్లీ విక్రయించడం వీరి పని! ఈ విధంగా శ్మశానవాటికల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఏడుగురు సభ్యుల ముఠాను బాగ్‌పట్ పోలీసులు అరెస్ట్ చేశారు. కొవిడ్ మృతదేహాలపై కప్పిన ముసుగులు సహా, చీరలు, కుర్తాలు, బెడ్‌షీట్లు, ఇతర వస్తువులను ఈ ముఠా చోరీ చేస్తున్నట్లు గుర్తించారు. వీరి నుంచి మొత్తం 520 బెడ్‌షీట్లు, 127 కుర్తాలు, 52 చీరలు స్వాధీనం చేసుకున్నారు. ఈ దుస్తులను బాగా ఉతికి, ఇస్త్రీ చేసి కొత్త లేబుళ్లు వేసి విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. ఈ కరోనా కాలంలో ఇంకెన్ని దారుణాలు చూడాలో!!

సందట్లో సైబర్ నేరగాళ్లు

ప్రజల కరోనా కష్టాలు సైబర్ నేరగాళ్లకు వరంలా మారాయి. వాక్సిన్ మొదలు అవసరమైన సేవలన్నీ అందిస్తామంటూ సైబర్ వల విసురుతున్నారు. ఆసుపత్రుల్లో ఎక్కడా పడకలు దొరక్క, ఆక్సిజన్ అందుబాటులో లేక అల్లాడుతున్న వారి అవసరాన్నే తమ ఆయుధంగా మార్చుకొని మోసాలకు పాల్పడుతున్నారు. కరోనా మొదటిదశ మొదలై, లాక్‌డౌన్ అమలులోకి వచ్చినప్పుడే సైబర్ నేరాల విజృంభణ మొదలైంది. కరోనా కేసులు విపరీతంగా పెరుగుతుండటం, ఆసుపత్రులు ఖాళీ లేకపోవన్ని అవకాశంగా మలచుకుంటున్నారు.

- ఓ స్వచ్ఛంద సంస్థ ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను కొనుగోలు చేసేందుకు గూగుల్‌లో వెతికింది. ఓ కంపెనీ తయారు చేస్తుందని తెలుసుకుని కస్టమర్ కేర్ నంబరుకు కాల్ చేశారు. అవతలివైపు వ్యక్తి కంపెనీ మేనేజర్ అంటూ పరిచయం చేసుకున్నాడు. ముందే డబ్బులు చెల్లించాలని స్పష్టం చేశాడు. రెండింటి కోసం సదరు సంస్థ నిర్వాహకులు రూ. 1.14 లక్షలు మేనేజర్ సూచించిన ఖాతాలో చేశారు. ఆ తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయినట్లు తెలుసుకుని పోలీసులను ఆశ్రయించారు.
- సామాజిక మాధ్యమాల్లో ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను డోర్ డెలివరీ చేస్తామంటూ ఓ సంస్థ ఇచ్చిన ప్రకటన సిద్దిఅంబర్ బజార్‌కు చెందిన ఓ వ్యకికి కనిపించింది. అక్కడ పేర్కొన్న నంబర్లకు కాల్ చేసి మూడింటి కోసం రూ. 2.73 లక్షలు సదరు వ్యక్తులు సూచించిన ఖాతాలో జమ చేశాడు. వారం గడిచినా డెలివరీ కాకపోవడంతో అనుమానమొచ్చి ఆరా తీయగా మోసపోయినట్లు తెలుసుకుని పోలీసులను ఆశ్రయించాడు.
- నాగోల్ ప్రాంతానికి చెందిన ఒక యువకుడికి వాట్సప్ మెస్సేజ్ వచ్చింది. క్లిష్టపరిస్థితుల్లో ఉన్న కరోనా రోగులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థను స్థాపించామని, అవసరమైన

వారు ఫోన్ చేస్తే ఆసుపత్రుల్లో ఐసీయూ పడకలు ఇప్పిస్తామన్నది దాని సారాంశం. దీన్ని నిర్ధారించుకునేందుకు ఆ సందేశంలో ఉన్న నంబర్‌కు ఫోన్ చేశాడు. పడక ఇప్పిస్తాం కాని అడ్వాన్సు కింద రూ.పదివేలు కట్టాలని చెప్పడంతో యువకుడికి అనుమానం వచ్చింది. ఇలాంటి సందేశాలు ఇప్పుడు చాలా గ్రూపుల్లో వస్తున్నాయి.

- ఎల్బీనగర్ ప్రాంతానికి చెందిన ఓ విలేకరి చావుబతుకుల మధ్య ఆసుపత్రిలో ఉంటే అతనికి చికిత్స చేయించాలంటూ వాట్సప్ గ్రూప్‌ల్లో ప్రచారం చేసి, పెద్దఎత్తున విరాళాలు పోగేసిన జంట అదృశ్యమైంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.
- "కొవిడ్ వ్యాక్సిన్ పొందడం కోసం ఈ యాప్ ద్వారా మీ పేరు నమోదు చేసుకోండి. ఇందుకు ఈ లింక్‌ను క్లిక్ చేయండి" అంటూ స్మార్ట్ ఫోన్లకు నకిలీ మెసేజ్‌లు వస్తున్నాయి. తద్వారా దుండగులు ఆయా ఫోన్లలోకి చొరబడి వాటిలో ఉన్న ఫోన్ నంబర్లను, డేటాను కాజేస్తున్నట్టు సైబర్ నిఘా అధికారులు గుర్తించారు.

★ ★ ★

మనుషుల్లో మానవత్వం పుట్టుకతో ఉంటుంది. దాన్ని బయటకు తీయడానికి మహాత్ములు ఎన్నో విధాల శ్రమించారు. ధర్మశాస్త్రాలు అందించారు. వ్యక్తిత్వం అంటే వ్యక్తిలోని లక్షణాల సమగ్రస్వరూపం. చదువు, సంస్కారం, ప్రవర్తన, ప్రాపంచిక సంబంధాలు, ముఖ్యంగా జీవితంలోని ఆటుపోట్లకు తట్టుకోగల స్థిరబుద్ధి.. వ్యక్తిత్వ ప్రతిభను వెల్లడిస్తాయి. సద్భావనలు వ్యక్తిత్వాన్ని, మానవత్వాన్ని పరిమళింపజేస్తాయి. ఈ లక్షణాలన్నీ కలిగి ఉండడమే మానవత్వం. ఈ ఉత్తమ లక్షణాలతో కూడిన వ్యక్తిత్వంగలవారు.. ఆలోచనలను ఆశయాలుగా, ఆశయాలను వాస్తవాలుగా మార్చుకుంటారు. జాతిరత్నాలుగా ప్రకాశిస్తారు.

★ ★ ★

ఏ రంగులో ముంచిన వస్త్రం ఆ రంగునే పొందినట్లుగా.. తపస్వి, దుష్టుడు, దొంగ.. ఇలా ఎవరి సహచర్యంలో గడిపితే వారి గుణాలే మనిషికి అబ్బుతాయి. క్రమక్రమంగా వారిలోని భావనలు మార్పు చేర్పులకు గురవుతాయి. అందుకే ఏ మనిషికైనా సజ్జనసాంగత్యం అవసరం. సజ్జన సాంగత్యంతో మంచి లక్షణాలు అలవడుతాయి. అందరినీ ఆదరించే గుణం ప్రకాశిస్తుంది. ఎదుటివారిని మనం అభిమానించకుండా మనల్ని అందరూ అభిమానించి గౌరవించాలనుకోవడం సంకుచితత్వానికి స్వార్థపూరిత మనో ప్రవృత్తికి నిదర్శనం. మనం ప్రశాంతంగా జీవించాలనుకుంటే.. అందుకు ఎదుటివారు మారాలనుకోకూడదు. వారిని మార్చాలనీ ప్రయత్నించకూడదు. మనమే మారాలి. కాళ్లకి ఏమీ గుచ్చుకోకుండా ఉండాలంటే.. రహదారి అంతా తివాచీ పరచడం కన్నా మనమే చెప్పులు వేసుకోవడం మేలైన పని కదా!! నా మాటలు గుర్తుపెట్టుకుంటారు కదూ..

బ్లాక్ ఫంగస్ దాడి

కరోనా నుంచి ఎలాగో కోలుకుని బయటపడిన వారిపై ఫంగల్ ఇన్‌ఫెక్షన్ దాడి చేస్తుండడం మరో వైపరీత్యం. దీనిని బ్లాక్ ఫంగస్ (మ్యూకర్ మైకోసిస్)గా వైద్యులు చెబుతున్నారు. దీనివల్ల అనేక ఆనారోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా ప్రాణాలు సైతం కోల్పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా కొన్ని వందల కేసులు బయటపడ్డాయి. కొంతమంది చూపును సైతం కోల్పోయారు. వీరంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఫంగస్ కూడా ప్రాణాంతకమే కావడంతో ప్రజల్లో భయాందోళన నెలకొంది. సకాంలో గుర్తిస్తే దీనిని చికిత్స ద్వారా నయం చేయవచ్చని, ఆలస్యమైతే చూపు కోల్పోయే ప్రమాదం ఉందని, మరికొన్నిసార్లు ఏకంగా ప్రాణాలకే ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. బ్లాక్ ఫంగస్ అనేది కొత్తది కాదు. ముందు నుంచి ఉంది. దీన్నే మ్యూకర్ మైకోసిస్ అంటారు. ఇది చాలా అరుదుగా వస్తుంది. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారితో పాటు దీర్ఘకాలిక రోగాలు ఉన్న వారికి సోకుతుంది. ఈ ఫంగస్ వచ్చినవారిలో మరణశాతం ఎక్కువగా ఉంది.

కరోనా పేషెంట్లలోనే ఎందుకు..?

బ్లాక్ ఫంగస్ కరోనా పేషెంట్లలోనే ఎక్కువగా కనిపించడానికి గల కారణాన్ని ఢిల్లీలోని సర్ గంగారామ్ హాస్పిటల్‌లోని ఈఎన్‌టీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డాక్టర్ అజయ్ స్వరూప్ వివరించారు. కరోనా పేషెంట్లలో ఎక్కువమంది డయాబెటిస్‌తో బాధపడుతుండడం, వారికి కరోనా ట్రీట్‌మెంట్‌లో అందించే ఔషదాల ప్రభావం వెరసి ఈ ఫంగస్ బారిన పడడానికి ఓ కారణంగా వివరించారు. డయాబెటిస్, కిడ్నీ సమస్యలు, గుండె సంబంధిత సమస్యలు, క్యాన్సర్ వంటి వ్యాధులతో బాధపడేవారిలో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెప్పారు.

గతేడాది కూడా ఈ ఫంగస్ బారిన అనేకమంది పడ్డారని ఆసుపత్రి ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ మనీష్ ముంజల్ వెల్లడించారు. ముఖ్యంగా రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో ఈ ఫంగస్ ఎక్కువగా దాడి చేసే అవకాశాలుంటాయని తెలిపారు.

ఎలా వస్తుంది?

అమెరికాకు చెందిన సెంటర్ ఫర్ డిసీజెస్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) ప్రకారం.. మ్యూకర్ మైకొసిస్ అనే ఫంగి ద్వారా ఈ ఇన్‌ఫెక్షన్ బాధితుల్లోకి ప్రవేశిస్తుంది. ఇది చుట్టూ వాతావరణంలోనే ఉంటుంది. ఇది సైనస్ లేదా ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుంది. చర్మం తెగినా, కాలినా, ఇతర చర్మ సంబంధిత గాయాల్లోనూ ఈ ఫంగి కనిపిస్తుంది. ఆ రోగ్య సమస్యలతో బాధపడుతున్నవారిపై ఇది ప్రధానంగా ప్రభావం చూపుతుంది. ఇది వ్యాధికారకాలతో పోరాడే సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. చక్కెర స్థాయి నియంత్రణలో లేనివారు, కిడ్నీ మార్పిడి వంటి శస్త్రచికిత్సల్లో భాగంగా రోగనిరోధక శక్తిని అణిచిపెట్టే మందులు వాడి నవారిలో ఈ వ్యాధి బయటపడుతోంది. తాజాగా కరోనా చికిత్సలో భాగంగా స్టిరాయిడ్స్ ఎక్కువగా వాడుతున్న కొందరిలో దీన్ని గుర్తిస్తున్నారు. ఇతర ఆరోగ్య సమస్యలున్నవారి లోనూ ఇది వెలుగుచూస్తోంది. కరోనా మొదటి దశలో చికిత్సలో స్టిరాయిడ్స్ వాడకం పెద్దగా లేనందున బ్లాక్ ఫంగస్ కనిపించలేదని వైద్యులు చెబుతున్నారు.

లక్షణాలు ఏంటి?

సాధారణంగా కొవిడ్ నుంచి కోలుకున్న తర్వాత 2-3 రోజుల్లోనే ఈ ఫంగస్ లక్షణాలు కనిపిస్తాయి. మొదట సైనస్‌లో, తర్వాత కళ్లలో దీని లక్షణాలు కనిపిస్తాయి. ఈ ఫంగస్ ముక్కులో ఉన్నప్పుడు ఏదో అడ్డం ఏర్పడినట్లు ఉంటుంది. నలుపు రంగులో ముక్కులో కణితలు ఏర్పడతాయి. కళ్లలోకి చేరేసరికి కళ్లు, చెంపల వాపుకు కారణమవుతుంది.

ఎలా ఎదుర్కోవాలి:

ముఖంలో వాపు కనిపించడం, తలనొప్పి, ముక్కుదిబ్బడ, జ్వరం, నోటిపై భాగంలో నల్లటి గాయాల మాదిరిగా కనిపించి తీవ్రమైన బాధ కలిగిస్తూ పెద్దవవుతుంటాయి. ఈ లక్షణాలను గుర్తించిన వెంటనే బయాప్సీ చేయించుకోవాలి. అలాగే వైద్యుల సలహాతో యాంటీ-ఫంగల్ థెరపీ చేయాలని, లేకపోతే తర్వాతి 24 గంటల్లో మెదడు వరకూ కూడా ఇది వెళ్లవచ్చని వైద్యులు హెచ్చరించారు.

కొవిడ్ చికిత్సలో భాగంగా విచ్చలవిడిగా స్టిరాయిడ్స్ ఇస్తున్నారు. వాటి దుష్ప్రభావాల కారణంగా మ్యూకర్ మైకోసిస్ దాడి చేస్తోందని నిపుణులు చెబుతున్నారు. రోజుకు 6 ఎం.జి. పరిమితిలోనే స్టిరాయిడ్స్ వాడాల్సి ఉండగా చాలా ఆసుపత్రుల్లో 30 ఎంజీ వరకు వినియోగిస్తున్నట్లు తేలింది. దీనివల్ల కొవిడ్ బాధితుల్లో రక్తంలో చక్కెర శాతం

పెరిగిపోతోంది. స్టిరాయిడ్స్ వాడకం వల్ల రోగనిరోధకశక్తి క్షీణిస్తోంది. ఫలితంగా బ్లాక్, వైట్, ఎల్లో ఫంగస్‌లు దాడి చేస్తున్నాయి.

ఆక్సిజన్‌కు ఉపయోగించే హ్యుమిడిఫయర్లూ కారణమేనా!

ఆక్సిజన్ అందించేప్పుడు స్టెరైల్ నీటికి బదులు సాధారణ నీటిని హ్యుమిడిఫయర్ (తేమ అందించే పరికరం) ద్వారా అందించడం కూడా బ్లాక్ ఫంగస్‌కు కారణమవుతోందని కొందరు నిపుణులు చెబుతున్నారు. ఈ అంశంపై అహ్మదాబాద్‌కు చెందిన సీనియర్ హృద్రోగ చికిత్స నిపుణులు డాక్టర్ అతుల్ అభ్యంకర్ మాట్లాడుతూ.. "బ్లాక్ ఫంగస్ వ్యాప్తికి మరొక ప్రధాన కారణం.. ఆక్సిజన్‌కు ఉపయోగించే హ్యుమిడిఫయర్లే. వాటిలో స్టెరైల్ నీటినే ఉపయోగించాలి. కానీ, ప్రైవేటు ఆసుపత్రులు, కొవిడ్ ఐసోలేషన్ కేంద్రాలు, ఇళ్లలో ఉండి చికిత్స పొందుతున్నవారు సాధారణ నల్లా నీటిని వాడేస్తున్నారు. అందులో రకరకాల సూక్ష్మజీవులు ఉంటాయి. వాటి కారణంగా శరీరంలో ఫంగస్ ఏర్పడుతోంది. 24 గంటల్లో రెండుసార్లు నీటిని మార్చాలి. ఎప్పటికప్పుడు హ్యుమిడిఫయర్‌ను శుభ్రం చేయాలి" అని సూచించారు.

ఒక్కో పేషెంట్‌కు 12 నుంచి 36 వయల్స్!

బ్లాక్ ఫంగస్‌కు సాధారణంగా లైపోజోమల్, ఆంఫోటెరిసిన్ బి ఇంజక్షన్లు వాడుతుంటారు. పేషెంట్ కండిషన్ బట్టి వారం నుంచి 6 వారాల వరకు వీటిని వినియోగిస్తారు. ఒక్కో ఇంజక్షన్ వయల్ రేటు రూ. వెయ్యి నుంచి రూ. 7 వేల వరకు ధర ఉంది. పేషెంట్లకు ఇలాంటి ఇంజక్షన్లు 12 నుంచి 36 వయల్స్ వాడాల్సి వస్తుందని డాక్టర్లు ప్రిస్క్రైబ్ చేస్తున్నారు. బ్లాక్ ఫంగస్ అరుదైన వ్యాధి కావడంతో మార్కెట్‌లో ఎక్కువ స్టాక్ పెట్టుకోలేదని పంజాగుట్టలోని ఓ ప్రముఖ మెడికల్ షాప్ ఓనర్ తెలిపారు.

లైపోజోమల్, ఆంఫోటెరిసిన్‌బి మన దగ్గర ఐదారు బ్రాండ్ పేర్లతో దొరుకుతాయి.

బ్లాక్ ఫంగస్ ఇంజక్షన్ల బ్లాక్‌దందా

నిన్నమొన్నటి వరకు రెమ్‌డెసివిర్, టొసిలిజుమాబ్ ఇంజక్షన్ల బ్లాక్ దందా నడిచింది. ఇంకా కొంత నడుస్తూనే ఉంది. ఇపుడు పోస్ట్ కరోనా సైడ్ ఎఫెక్ట్‌గా వస్తున్న బ్లాక్ ఫంగస్ కేసులు ఎక్కువవుతుండటంతో ఆ ట్రీట్‌మెంట్‌కు అవసరమయ్యే మందుల దందా ఎక్కువైంది. మార్కెట్‌లో ఎక్కడా కూడా బ్లాక్ ఫంగస్ ట్రీట్‌మెంట్‌కు వాడే ఇంజక్షన్లు దొరకట్లేదు. ఫంగస్ కేసులు కనిపించిన తొలి రోజుల్లో అందుబాటులోని మందులతో డాక్టర్లు ట్రీట్‌మెంట్ చేశారు. కేసులు పెరగడంతో ఇంజక్షన్ల కొరత మొదలైంది. వారంలోనే అవి మార్కెట్‌లో కనిపించకుండా పోయాయి. రూ. 4 వేల రేంజ్‌లో ఉన్న ఒక ఇంజక్షన్‌ను మినిస్టర్ రోడ్‌లోని కార్పొరేట్ హాస్పిటల్‌లో ట్రీట్‌మెంట్ పొందుతున్న ఓ పేషెంట్ బంధువులు రూ. 8 వేలకు కొన్నారు. తాజాగా ఒక రకం బ్రాండ్ ఇంజక్షనే కావాలని డాక్టర్ చెప్పడంతో రూ. 7 వేల మందును రూ. 50 వేలకు కొనాల్సి వచ్చింది.

అధిక యాంటీబయాటిక్సే కారణం!

కరోనా రోగుల్లో బ్లాక్ ఫంగస్ సమస్య తలెత్తడానికి కారణం స్టిరాయిడ్స్‌ను విచక్షణార హితంగా వినియోగించడమేనని పలువురు వైద్యనిపుణులు పేర్కొంటున్న నేపథ్యంలో ఇప్పుడో కొత్త అధ్యయనం వెలుగులోకి వచ్చింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన మహాత్మాగాంధీ స్మారక వైద్య కళాశాలలో మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ వీపీ పాండే 210 మంది బ్లాక్ ఫంగస్ రోగులపై చేసిన అధ్యయన వివరాలను రాజీవ్ జయదేవన్ అనే వైద్యుడు ట్విటర్‌లో పెట్టారు. ఈ అధ్యయనం ప్రకారం బ్లాక్ ఫంగస్ సోకినవారిలో 14% మంది స్టెరాయిడ్స్ ఉపయోగించలేదు. 21% మందికి మధుమేహం లేదు. 36% మంది హోం ఐసోలేషన్‌లోనే ఉన్నారు. 52% మంది రోగులు మాత్రమే బయటి నుంచి ఆక్సిజన్ తీసుకున్నారు. జింక్ వినియోగంపై ఇందులో అధ్యయనం చేయలేదని తెలిపారు. బ్లాక్ ఫంగస్ సోకిన రోగుల్లో 100% మంది యాంటీబయాటిక్స్ తీసుకున్నట్లు అధ్యయనంలో తేలింది. "దీన్నిబట్టి చూస్తే ఈ ఇన్‌ఫెక్షన్ తలెత్తడానికి స్టెరాయిడ్స్, మధుమేహానికి మించి ఇతరత్రా కారణాలున్నట్లు అనిపిస్తోంది. రోగులకు సూచించిన మందుల్లో అజిత్రోమైసిన్, డాక్సీసైక్లిన్, కార్బాపెనెమ్స్ లాంటివి కనిపించాయి. అందువల్ల ఫంగల్ ఇన్‌ఫెక్షన్ పెరగడానికి యాంటీ బయాటిక్సే కారణంగా కనిపిస్తోంది" అని జయదేవన్ అభిప్రాయపడ్డారు.

అనాథలైన లక్షలమంది చిన్నారులు!

కరోనా విలయంలో మరో హృదయవిదారక కోణమిది. ఎన్నో కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసిన ఈ మహమ్మారి.. ఎంతోమంది చిన్నారులకు కన్నవారిని దూరం చేసింది. లక్షలమంది పిల్లలను దిక్కులేనివారిని చేసింది. కొవిడ్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా 15 లక్షలమందికి పైనే చిన్నారులు తల్లిదండ్రులు, సంరక్షకులను కోల్పోయినట్లు లాన్సెట్ వెల్లడించింది. 10 లక్షలమంది తల్లిదండ్రుల్ని కోల్పోయి అనాథలయ్యారని లెక్కతేల్చింది. ఒక్క భారత్‌లోనే 1.19 లక్షల మంది పిల్లలపై కరోనా కాఠిన్యం చూపించింది. 2020 మార్చి నుంచి 2021 ఏప్రిల్ వరకు 14 నెలల కాలంలో ప్రపంచవ్యాప్తంగా 21 దేశాల్లో 15,62,000 మంది చిన్నారులు తల్లిదండ్రులు, సంరక్షకుల్లో (బామ్మా తాతయ్యలు లేదా ఇతర బంధువులు) కనీసం ఒకరిని కోల్పోయినట్లు 2021 జులైలో **లాన్సెంట్** నివేదిక వెల్లడించింది. ఇందులో 10,42,000 మంది తల్లీ/తండ్రీ లేదా ఇద్దరినీ కోల్పోయినట్లు తెలిపింది. తల్లుల కంటే నాన్నలను కోల్పోయిన చిన్నారులు ఐదు రెట్లు అధికంగా ఉన్నారు. అత్యధికంగా మెక్సికోలో 1.41 లక్షల మంది పిల్లలు అమ్మానాన్నలు లేదా ఇతర సంరక్షకులను కోల్పోయారు. బ్రెజిల్, భారత్, అమెరికా దేశాల్లోనూ ఈ సంఖ్య లక్షకు పైనే ఉంది. మహమ్మారి కారణంగా భారత్‌లో 1,19,000 మంది చిన్నారులు తల్లిదండ్రుల్లో ఎవరో ఒకర్ని లేదా సంరక్షకుల్లో ఒకరిని కోల్పోయినట్లు లాన్సెట్ పేర్కొంది. ఇందులో 1.16లక్షల మందికి తల్లీ/తండ్రీ లేదా ఇద్దరినీ దూరం చేసినట్లు తెలిపింది. భారత్‌లో 25,500 మంది పిల్లలు తల్లులను కోల్పోగా.. 90,751 మంది చిన్నారులు తండ్రి ప్రేమకు దూరమయ్యారు. "ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న ప్రతి

రెండు కరోనా మరణాలకు.. ఒక చిన్నారి తల్లిదండ్రులు లేదా సంరక్షకులను కోల్పోతుండటం విషాదకరం. ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి ప్రపంచవ్యాప్తంగా 30 లక్షల కొవిడ్ మరణాలు సంభవించగా.. 15 లక్షలమంది పిల్లలకు కన్నవారు/సంరక్షకులు దూరమయ్యారు" అని అమెరికా సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ లీడ్ ఆథర్ డాక్టర్ సూసన్ హిల్లీస్ లెక్కతేల్చారు.

కొవిడ్ కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను ఆదుకోవడం కోసం ఒక్కొక్కరికీ 10 లక్షల ఫండ్ కేటాయించనున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. ఆ పిల్లలకు 18 ఏళ్లు వచ్చిన తరువాత ప్రతీ నెలా స్టయిపెండ్ కింద కొంత సొమ్ము అందిస్తారు. 23 ఏళ్లు వచ్చిన తరువాత 10 లక్షల ఫండ్ అందిస్తారు. అయితే అంతవరకు వారి ఆలనాపాలనా చూసేది ఎవరు అనేది పెద్ద ప్రశ్న. సాధారణంగా అనాథలైన చిన్నారులను పిల్లలు లేనివారికి దత్తత తీసుకునే ప్రక్రియ ఉన్నా అదొక పెద్ద ఫార్స్‌గా మారిపోయింది. రెండు దశాబ్దాల క్రితం హైదరాబాద్ కేంద్రంగా పిల్లల అమ్మకాల విషయం బయట పడ్డాక దత్తత చట్టాలను (కారా) ప్రభుత్వం కఠినతరం చేసింది. ఇది పిల్లల సంరక్షణకు ఉద్దేశించిందే అయినా.. దత్తత తీసుకోవాలనుకునేవారికి పెద్ద ప్రతిబంధకంగా మారిందనే చెప్పాలి. ప్రతి రాష్ట్రంలోనూ పిల్లల రక్షణ, సంక్షేమం చూసే వ్యవస్థ (చైల్డ్ ప్రొటెక్షన్ అండ్ వెల్‌ఫేర్ కమిషన్) ఉంటుంది. ఇది జిల్లాల్లో అధికారులను నియమిస్తుంది. అనేక ఎన్జీఓలు ఆపదలో ఉన్న పిల్లలను కనుగొనడంలో కమిషన్‌కు సహాయపడతాయి. అలాగే దత్తత కోసం జాతీయ స్థాయిలో ఒక వెబ్‌సైట్ ఉంది. తల్లిదండ్రులు అందులో రిజిస్టర్ చేసుకోవాలి. అవసరమైన తనిఖీలు చేశాక, రాష్ట్ర శిశు సంక్షేమ కమిటీ చట్టబద్ధంగా దత్తతకు అర్హులైన పిల్లలను రిజిస్టర్ చేసుకున్నవారికి అప్పగిస్తుంది. ఇన్ని ప్రతిబంధకాల కారణంగా దేశంలో అధికారికంగా పిల్లలను దత్తత తీసుకునేవారి సంఖ్య చాలా తక్కువ.

కొవిడ్ సెకండ్ వేవ్‌లో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల సంఖ్య బాగా పెరిగిపోయిందని పిల్లల హక్కుల సంరక్షణ కమిషన్ దిల్లీ శాఖ చైర్‌పర్సన్ అనురాగ్ కుందు తెలిపారు. "ఇంత తక్కువ సమయంలో ఇంతమంది ప్రాణాలు కోల్పోవడం ఎప్పుడూ చూడలేదు. వీరందరి పిల్లలు అనాథలుగా మారి ఉంటారు. ఇదొక జాతీయ విపత్తు" అని కుందు అన్నారు. కొవిడ్ వల్ల అనాథలైన పిల్లలను దత్తత తీసుకోండి అనే అభ్యర్థనలు సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్నాయి. చైల్డ్ ట్రాఫికింగ్ పెరిగే ప్రమాదం ఉందని బాలల హక్కుల సంరక్షకులు ఆందోళ చెందుతున్నారు. "పిల్లలను దత్తతకు ఇచ్చే ఒక ఫేస్‌బుక్ పేజీ కూడా కనిపించిందని కుందు చెప్పారు. "మా సిబ్బందిలో ఒకరు ఆ ఫేస్‌బుక్ పేజీలో ఇచ్చిన ఫోన్ నంబర్‌కు కాల్ చేశారు. ఒక్కొక్క పిల్ల/పిల్లవాడి ధర సుమారు 5 లక్షలు అని చెప్పారు. మేము వెంటనే పోలీసులకు సమాచారం అందించాం" అని తెలిపారు. అనాథ పిల్లలను సెక్స్‌వర్కర్లుగా లేదా శ్రామికులుగా, బిచ్చమెత్తుకునేవారిలాగో అసాంఘిక శక్తులుగానో మార్చేవారు విజృంభిస్తారేమో అనేది ఇప్పుడు అందరి ఆందోళన.

ప్రపంచానికే జ్ఞానాన్ని పంచిన విజ్ఞాన భాండాగారం భారతావని

ఏదైనా ఒక కల్లోలం నుంచే కొత్త ఆలోచన పుడుతుంది. ఉపద్రవం వచ్చినప్పుడే మన ఆలోచనలు కేంద్రీకృతమవుతాయి.. మనిషి అంతర్ముఖుడైతేనే నవ చైతన్యం ఉత్తేజితమవుతుంది. అసలు మన జీవన విధానాన్ని, మూలాలను వదిలేసి పాశ్చాత్య విధానాలకు అలవాటుపడడమే ఇంతటి కల్లోలానికి కారణమనే ఆలోచన నా బిడ్డల్లో మొదలు కావడం సంతోషంగా ఉంది సుమా! సనాతన ఆరోగ్య సూత్రాలను, యోగా ఆయుర్వేదం వంటివాటికి దూరంగా జరిగిపోవడం ఎన్నో అనర్థాలకు కారణమైంది అంటున్నారు ఇప్పుడు చాలామంది.

అన్నట్లు ఆయుర్వేదం ప్రస్తావన వచ్చింది కనుక ఇదే క్రమంలో మిగతా శాస్త్రాలనూ.. నాటి విజ్ఞాన ప్రకర్ష గురించీ చెబుతా వినండి..

భారతీయ వైద్య విధానాన్ని ఆయుర్వేదం అంటారు. ఆయుర్వేదం అతి పురాతనమైన వేల ఏండ్ల చరిత్ర కలిగిన వైద్యవిధానం. ఆయుర్వేద శాస్త్ర గ్రంథాలు సంస్కృత భాషలో ఉన్నాయి. అవి క్రీస్తుపూర్వం 200 నుంచి క్రీస్తుపూర్వం 600 సంవత్సరాల మధ్య రాసినవి. అధర్వణ వేదానికి ఉపవేదంగా తరతరాలుగా వైద్యసేవలు అందిస్తున్నది. చరకుడు, సుశ్రుతుడు మొదలు ధన్వంతరి దాకా ఎంతోమంది ఇక్కడ లభ్యమయ్యే

వనమూలికలతో ఆయుర్వేదాన్ని వృద్ధి చేశారు. ఈ వైద్య విధానం ఎన్నో దీర్ఘకాలిక, భయంకర వ్యాధుల నుంచి ఉపశమనం కలిగించింది. మనశరీరంలో మూడు రకాల దోషాలు ఉంటాయని ఆయుర్వేద విధానం చెబుతుంది.

వీటిలో మొదటిది కఫం. అది చల్లగా ఉంటుంది. బరువుగా, తీపిగాను ఉంటుంది. రెండోది వాతం. ఇది పొడిగా, చల్లగా, తేలికగా ఉంటుంది. మూడోది పిత్తం. ఇది వేడిగా, పులుపుగా, ఘాటు వాసనను కలిగి ఉంటుంది.

శరీరం సక్రమంగా పని చేయాలంటే ఈ మూడు దోషాలు సరైన మోతాదులో ఉండాలి. వీటిలో ఏది తగ్గినా, పెరిగినా ఆరోగ్యం చెడుతుంది. అవి ఉండవలసిన చోటు కాక, మరొక చోట పెరిగితే వ్యాధి కలుగుతుంది. చర్మాన్ని పరీక్షించి, నాడిని చూచి వ్యాధిని గుర్తించడం భారతీయ వైద్యంలోని చాలా ముఖ్యమైన అంశం. మందులతోపాటు మర్దన, ప్రత్యేక ఆహారాలు, పత్యం ఆధారంగా శరీరాన్ని మళ్లీ ఆరోగ్యంలోకి మరల్చడం ఆయుర్వేద విధానం.

వైద్య గ్రంథాలలో సుశ్రుతుడు రాసిన గ్రంథంలో శస్త్రచికిత్స వివరాలు కనిపిస్తాయి. ఎంతో సున్నితమైన శస్త్రచికిత్సలు చేయడం గురించి ప్రాచీన కాలంలోనే ఈ గ్రంథాల ఆధారంగా తెలిసింది. కళ్లలో శుక్లాలను తొలగించే ఆపరేషన్‌లను కూడా ఆనాడే చేసినట్లు సుశ్రుతుడు తెలియజేశాడు. సన్నని సూదులను కనుగుడ్డులో గుచ్చి శుక్లాన్ని ఒక పక్కకు లాగినట్టు వివరం రాసి ఉంది. శరీరంలోని మరొక ప్రాంతం నుంచి చర్మాన్ని తీసి గాయం తగిలిన చోట అమర్చడం కూడా సుశ్రుతుడు, మరి కొందరు వైద్యులు తమ రచనలలో వివరించారు. భారతదేశంలో ఇస్లాం వ్యాప్తి తరువాత కొత్త వైద్య పద్ధతులు అమలులోకి వచ్చాయి. యునాన్ అంటే గ్రీసు దేశం. అక్కడి నుంచి వచ్చిన వైద్య విధానాన్ని యునానీ వైద్యం అన్నారు.

చరకుడు

ఆయుర్వేద శాస్త్రానికి సుశ్రుతుడు గుండెకాయ అయితే చరకుడు వెన్నెముక వంటివాడు. భారతీయ ఆయుర్వేదానికి అనితరసాధ్యమైన పరిపూర్ణత సాధించి పెట్టిన చరకుడు క్రీ.పూ.8 వ శతాబ్దానికి చెందినవారు. మన పురాణాలలో 'చరకులు' అంటే సంచరిస్తూ వైద్యం చేసేవారు అని అర్థం ఉంది. చరకుడు తన శిష్యవైద్యులతో గ్రామాలు తిరుగుతూ అక్కడి ప్రజలకు అవసరమైన వైద్యసేవలు అందించేవాడని అధ్యయనాలు చెబుతున్నాయి. చరకుడు కశ్మీరానికి చెందినవాడు. ప్రాచీన ఆయుర్వేద గ్రంథాలలో చరకుని గురించి ఒక ఆసక్తిదాయకమైన కథ ఉంది. క్షీరసాగర మథనంలో పుట్టిన ధన్వంతరి మొదటగా ఆయుర్వేద విజ్ఞానాన్ని సర్పరాజైన ఆదిశేషుడికి ఉపదేశించాడు. ఒకసారి ఆయన భూలోకానికి వచ్చి తీవ్రమైన వ్యాధికి గురయ్యాడు. కదలడానికి కూడా కష్టమైపోయింది. ఈ విచిత్ర పరిస్థితిలో తన వ్యాధిని పోగొట్టుకోవాలంటే ముని కుమారునిగా జన్మించిన ఆదిశేషుడే చరకుడని చెబుతారు. 'చర' అంటే భూమి మీద సంచరించేవి అని అర్థం.

ఆయుర్వేద శిఖామణి

చరకుడు గొప్ప ఆయుర్వేద శిఖామణి. సుశ్రుతుడి లాగానే చరకుడు కూడా 'చరక సంహిత' అనే గొప్ప ఆయుర్వేద సమగ్ర విజ్ఞాన గ్రంథాన్ని రచించాడు. చరకుని ఆయుర్వేద పరిజ్ఞానం మహోత్కృష్టమైనది. 'చరక సంహిత' వెలువడిన కొన్ని శతాబ్దాల తరువాత కూడా అనేకమంది వైద్య శాస్త్రవేత్తలు దానిని మళ్లీ మళ్లీ తిరగరాసి ఎన్నో వ్యాఖ్యానాలు రాశాడు. వాళ్లలో కాశ్మీకరుడు, ధ్రువబాల మొదలైన వారు ముఖ్యులు. 'చరకసంహిత'ను క్రీ.శ. 987లో అరబ్, పర్షియన్ భాషల్లోకి అనువదించారు.

శరీరానికి కలిగే వ్యాధులు ముఖ్యంగా వాత, పిత్త, కఫ లేదా శ్లేష్మ దోషాల వల్లే కలుగుతాయని సిద్ధాంతీకరించాడు చరకుడు. ఆయుర్వేద వైద్యుల చిట్టాలో ముఖ్య ఔషధాలలో ఒకటైన ఉసిరికాయ, తానికాయ, కరక్కాయలతో తయారైన త్రిఫల చూర్ణం చరకుడు ప్రసాదించినదే! అలాగే వ్యాధికి జరిపే చికిత్స కంటే ముందు వ్యాధి కారణాలను కనుగొనడం ముఖ్యమని ప్రతిపాదించాడు చరకుడు. క్యాన్సర్ కణాలకు, పక్షవాతం, మూర్ఛ, కుష్టువ్యాధి, చూపు మందగించటం లేదా పూర్తిగా పోవడం వంటి వ్యాధులకు అతి సులభమైన నివారణోపాయాలను చరకుడు తన చరకసంహితలో పొందుపరిచాడు.

మనిషి రోగాన్ని తగ్గించే శక్తి పాదరసానికి ఉందని ప్రపంచానికి చాటి చెప్పాడు. ఎన్నో మొండి రోగాలకు పాదరసాన్ని పుటం పెట్టి చరకుడు వైద్య ప్రయోగం చేసి రోగం నయం చేసిన తీరు పెద్ద పెద్ద వైద్య ప్రముఖుల్ని సైతం విస్మయానికి గురి

చేసింది. మానసిక, శారీరక, ఆరోగ్యాలు రెండూ సరిగా ఉండటమే నిజమైన సంపూర్ణ ఆరోగ్యస్థితి అని ఆయుర్వేద వైద్య శాస్త్రం అనాడే పేర్కొంది. భౌతిక పదార్థాలైన వృక్ష, జంతు, ఖనిజ, రసాయన సంబంధమైన ఔషధాలు శారీరక రుగ్మతల్ని తగ్గిస్తే కొన్ని రకాలైన మంత్రోచ్చాటనను ఒక క్రమపద్ధతిలో చేయటం వల్ల మానసిక రుగ్మతలు ఉపశమిస్తాయని చరకుడు ప్రతిపాదించాడు. ఇప్పుడు ఆధునిక వైద్యులు చేస్తున్న 'ఆల్టాసోనిక్' వైద్య చికిత్సా విధానానికి చరకుని సిద్ధాంతమే ప్రేరణ.

చరకుడు తన శిష్యులతో సంచరిస్తూ, అంటే పల్లెపల్లె తిరుగుతూ అవసరమైనవారికి వైద్య సహాయం అందించాడు. చరకుని వల్ల ఆయుర్వేదం భారతదేశంలో బహుళ వ్యాప్తి పొందింది. ఆయుర్వేద వైద్యం దేశంలోని గ్రామస్థాయికి విస్తరించి, ప్రతి ఊళ్లోనూ ఒక ఆయుర్వేద వైద్యుడు ఉండేలా చేయడంలో చరకుడు - ఆయన శిష్యులు అవిరళ కృషి చేశారని చరిత్ర సాక్ష్యాలు నిరూపిస్తున్నాయి.

చరకసంహిత

చరక సంహిత క్రీ.శ.3-2 శతాబ్దాల మధ్య కాలంలో రచించినట్లుగా ఆధారాలు లభిస్తున్నాయి. ఈ చరక సంహిత 'అష్టాంగ స్థానాలు'గా ఉంటుంది. ఇందులో మొత్తం 120 అధ్యాయాలున్నాయి. ఇందులో చికిత్స స్థానంలో 17 అధ్యాయాలు, కల్పస్థానం, సిద్ధిస్థానాలు పూర్తిగా క్రీ.శ. వ శతాబ్దానికి చెందిన ధృవబాల అనే ఆయుర్వేద శాస్త్రవేత్త రచించి కలిపినట్లుగా చరిత్రకారుల అభిప్రాయం. మనిషి ఎప్పుడూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని, శారీరక మానసిక దృఢత్వాన్ని కలిగి ఉండాలని, మంచి ఆలోచనలు మంచి ఆరోగ్యాన్నిస్తాయని, ఆహార విహారాదుల విషయంలో పరిశుభ్రత విధిగా పాటించినప్పుడే శారీరక ఆరోగ్యం స్థిరంగా ఉంటుందని సిద్ధాంతీకరించాడు. కేవలం శరీరం ఆరోగ్యంగా ఉండటం సాధ్యం కాదని, మానసిక ఆరోగ్యం, శారీరక ఆరోగ్యం రెండూ బాగున్నప్పుడే మనిషి పరిపూర్ణ ఆరోగ్యవంతుడవుతాడని ఎన్నో వేల సంవత్సరాల క్రితమే చరకుడు స్పష్టం చేశాడు. చరకుని వైద్యగ్రంథం 'చరకసంహిత' మీద మరిన్ని ఎక్కువ పరిశోధనలు విస్తృతంగా జరగవలసి ఉంది. అప్పుడే సర్వమానవాళికీ ఆయుర్వేదం ఆరోగ్యప్రదాయనిగా పరిఢవిల్లుతుంది.

పెరటి వైద్యం పనికిరాదా?

ఓ కవైపు కరోనా సెకెండ్ వేవ్ దేశాన్ని కల్లోల పరుస్తున్న వేళ.. కొవిడ్ రోగులకు సంజీవని' మాదిరిగా అనూహ్యంగా వార్తల్లోకి వచ్చిన ఆయుర్వేద ఔషధం కృష్ణపట్నం మందు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో ఓ వ్యక్తి మూలికలతో తయారుచేసిన మందుల్ని కరోనా రోగులకు పంపిణీ చేయడం మొదలుపెట్టారు. వేలమంది కృష్ణపట్నానికి పరుగులు తీశారు.

అప్పటికే ఆసుపత్రుల్లో బెడ్లు దొరకక.. దొరికితే మందులు అందక.. ఆక్సిజన్ లేక ప్రాణాలు పోతున్న సమయంలో ఆనందయ్య ఔషధం సామాన్యులకు సంజీవనిలా కనిపించింది.

ఈ వ్యవహారంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు మాత్రం సమర్థనీయంగా లేదంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ సాగింది. అల్లోపతి మాత్రమే అన్ని రోగాలకూ ద్వివ్యౌషధంగా మన సమాజంలో నాటుకుపోయిన వేళ సంప్రదాయ ఔషధం వెలుగురేఖలా కనిపిస్తున్నా దాని పట్ల వ్యవహరించిన విధానం కరోనా కాలంలో చరిత్రలో నిలిచిపోతుందనే చెప్పాలి. ఆ తర్వాత తీరిగ్గా మందు పంపిణీని ప్రారంభించినా ఈ సందర్భంగా జరిగిన పరిణామాలు మన దేశీయ ఔషధ విధానంపై మరోసారి చర్చను రేకెత్తించడం ఆహ్వానించదగ్గదే.

వేలమంది ప్రాణాలు పోతున్న వేళ ఒక చిన్న ఆశాదీపంలా కనిపించిన ఆయుర్వేద ఔషధం గురించి జనం రాష్ట్రాలు దాటి ఎల్లలు మరచి ఆ గ్రామానికి పరుగులు తీసినా.. ఈ మందు గురించి ఉన్నపళంగా రంగంలోకి దిగి పరిశోధించి మంచి చెడులేంటో తేల్చి.. పనికివచ్చేదైతే జనానికి అందుబాటులోకి తెచ్చి ప్రాణాలు కాపాడుకోవాలనే స్పృహ అటు

venku1968@gmail.com

కేంద్ర ప్రభుత్వానికి కానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వానికి కానీ వెంటనే కలగకపోవడం విశేషం.

ప్రస్తుతానికి ఈ మందు పనిచేస్తుందా లేదా అన్నది ఇంకా శాస్త్రీయంగా రుజువు కాలేదు. కానీ ప్రభుత్వం హడావుడిగా రంగప్రవేశం చేసి ఆ మందు పంపిణీని నిలిపివేయడం.. కొందరు నేతలు ఆయనతో రహస్యంగా మందు తయారుచేయించి బకెట్లకు బకెట్లు పట్టుకుపోయారనే ఆరోపణలు రావడం.. దీని ఫార్ములాను తమకు చెప్పాలంటూ అధికారులు బెదిరిస్తున్నారని స్వయంగా ఆనందయ్యే కోర్టును ఆశ్రయించడం విషాదకరం.

ఇంతకీ ఎవరీ ఆనందయ్య?

ఆయన పేరు బొరిగి ఆనందయ్య. వారి కుటుంబం వంశపారంపర్యంగా ఆయుర్వేద వైద్యం చేస్తుంటుంది. కరోనా సెకెండ్ వేవ్ మొదలైన దశలోనే.. శ్రీరామనవమి నుంచి ఆనందయ్య కరోనాకు మందు పంపిణీ మొదలుపెట్టారు. మొదట్లో పదుల సంఖ్యలోనే జనం వచ్చేవారు. నమ్మకం పెరగడంతో తర్వాత ఆ సంఖ్య వేలకు చేరింది.. 70 వేలమందికి మందులు అందించినట్టు ప్రచారం జరిగింది. అవి అసలు పనిచేస్తాయా లేదా అనేదాని గురించి ప్రజలకు ఆసక్తి లేదు. నలుగురూ చెబుతున్న మాటనే ఎక్కువమంది విశ్వసించారు..

'కృష్ణపట్నం కరోనా మందు' వాడిన వారంతా కరోనా నుంచి కోలుకున్నారనే ప్రచారం జరిగింది. వైద్యులు తమ వల్ల కాదంటూ చేతులెత్తేసిన కేసులను సైతం ఈ మందు బతికించిందని స్థానికులు చెప్పారు.. కరోనా రాని వారికి కూడా వైరస్ సోకకుండా అడ్డుకునే బ్రహ్మాస్త్రంగా ప్రచారంలోకి వచ్చిన ఈ మందు ప్రాణాలపై ఆశను పెంచింది. రద్దీ పెరిగిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందులో జోక్యం చేసుకోవలసి వచ్చింది. ఈ మందు శాస్త్రీయతపై అనుమానాలు వ్యక్తం చేస్తూ పంపిణీని నిలిపివేసింది. పనికి వస్తుందో లేదో పరిశోధించాక.. అవసరమైతే ప్రభుత్వ ఆధ్వర్యంలోనే పంపిణీ చేపడతామని చెప్పింది.

ఆయుష్ ల్యాబ్, కేంద్ర ఆయుర్వేద వైజ్ఞానిక పరిశోధన మండలి (సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్- సీసీఆర్ఏఎస్) దీనిపై అధ్యయనం చేశాయి.

శాస్త్రీయంగా తేల్చాలి..

మందు వల్ల నష్టమా కాదా అన్నది కాదు తేలాల్సింది. అసలు మందు పనిచేస్తుందా లేదా అన్నది తేలాలని కొందరు అల్లోపతి వైద్యులు డిమాండ్ చేశారు. "మందంటూ పనిచేస్తే, అప్పుడు సైడ్ ఎఫెక్ట్స్ గురించి ఆలోచించవచ్చు. సేఫ్టీ కంటే ఎఫికసీని ముందు ప్రూవ్ చేయాలి. కాబట్టి ఆ మందు వల్ల నష్టం జరుగుతుందా అన్న టాపిక్ పక్కన పెట్టి, ముందు అసలు ఆ మందు పనిచేస్తుందా లేదా అన్నది శాస్త్రీయంగా తేల్చాలి" అని కర్నూలుకు చెందిన వైద్యులు, జన విజ్ఞాన వేదిక సభ్యులు డా.బ్రహ్మారెడ్డి డిమాండ్ చేశారు. కానీ ప్రస్తుతం మనం వాడే అల్లోపతి మందులు ప్లాసిబో టెస్ట్‌లూ, డబుల్ బ్లైండ్ మెథడ్స్ వంటివన్నీ అనుసరించి, శాస్త్రీయమైన పద్ధతిలో పరీక్షించి పారదర్శకంగా అప్రూవ్ చేసినవేనని అమాయకంగా నమ్ముతున్నాం కదా.. కానీ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ మెడిసిన్, స్టాటిస్టిక్స్ ప్రొఫెసర్ జాన్ లాండిస్. ఒక పరిశోధన కోసం పరిశీలించిన 60,000 క్లినికల్ ట్రయల్స్‌లో కేవలం 7% మాత్రమే నాణ్యమైనవని నిర్ధారించారన్న విషయం చాలామందికి తెలీదనే చెప్పాలి. అంటే తొంభై శాతం క్లినికల్ టెస్టుల ఫలితాలు మందుల ఎఫికసీని, పనితనాన్ని నిర్ధారించటానికి ఏ మాత్రం పనికిరావని అర్థమన్నమాట. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న క్లినికల్ ట్రయల్స్‌లో సగానికి పైగా అసలు ఫలితాలనే పబ్లిష్ చెయ్యటం లేదంటే నమ్మగలరా!

చాలామంది అల్లోపతి వైద్యులు ఆనందయ్య మందు పనిచేయదని కచ్చితంగా చెబుతున్నారు. చుక్కల మందు తీసుకున్న తరువాత కూడా కొందరు వివిధ కారణాలతో తిరిగి ఆసుపత్రిలో చేరారు. అల్లోపతి వైద్యుల గొంత పెరగడానికి ఇదొక కారణమైంది. ఇదే విషయమై ఆనందయ్య అనుచరులను ప్రశ్నిస్తే, ఆ రోగులు మందు పూర్తి డోసులు (ఫుల్ కోర్సు) తీసుకోలేదని తెలిపారు. చుక్కల మందు తీసుకున్న తరువాత కూడా మరో మూడు రోజుల పాటూ ఆనందయ్య ఇచ్చే వేరే మందులు వాడాలి. అలా వాడనివారే తిరిగి అనారోగ్యం పాలై ఉండొచ్చు అని బీబీసీతో అన్నారు పాండురంగయ్య అనే వ్యక్తి. కృష్ణపట్నానికి చెందిన ఆయన ఆనందయ్య దగ్గర వాలంటీరుగా పనిచేశారు.

ఫార్మా కంపెనీల మోసాలు తెలీనివా?

ఏదైనా అల్లోపతి మందుల మాయాజాలం గురించి ఇప్పుడు అందరూ అర్థం చేసుకోవలసిన సమయం వచ్చింది. అల్లోపతి మందులంటేనే పెద్ద మాయాజాలం. ఏదైనా

మందు ఎఫికసీ పరీక్షించటానికి జరిగే ట్రయల్స్‌లో కొన్ని ఫలితాలు అది బాగానే పని చేస్తుందని అనుకూలంగా వస్తాయి. కొన్ని నెగెటివ్‌గా వస్తాయి. అయితే ఫార్మా కంపెనీలేం చేస్తాయి? నెగెటివ్ ఫలితాలను దాచిపెడతాయి. ఎక్కువ పాజిటివ్, అతి తక్కువ నెగెటివ్ ఫలితాలను కలిపి అప్రూవల్ కోసం అవసరమైన స్టాటస్టికల్ వాల్యూ వచ్చేలా డాటా సృష్టిస్తాయి. ఈ అబద్ధాలనే మెడికల్ మ్యాగజీన్లూ, జర్నల్స్ ప్రచురిస్తాయి. వీటి మీద అధిక సంఖ్యలో పీర్ రివ్యూలు రాయిస్తాయి. ఇవే నిజమని ప్రభుత్వాలను, డాక్టర్లను, పరిశోధకులను నమ్మిస్తాయి. తమ మందులు యథేచ్ఛగా అమ్ముకుంటాయి. ఎప్పటికో నిజం బయటపడేలోపు జరగవలసిన నష్టం జరిగిపోతుంది. ఇంత జరుగుతున్నా పెరటి చెట్టు వైద్యానికి పనికిరాదనే మనం నమ్ముతుండడమే విషాదం.

ఆనందయ్య ఎన్ని రకాల మందులు తయారు చేస్తారు? అసలు ఆ మందుల కోసం ఏమేమి వస్తువులు వాడతారో చూద్దాం.

1. **ఊపిరితిత్తుల కోసం:** ఈ మందు పాజిటివ్ ఉన్న వారు, లేనివారు వాడవచ్చు. దీన్ని వాడితే ఊపిరితిత్తులు శుభ్రమై శక్తి పుంజుకుంటాయి. తెల్లజిల్లేడు, మారేడు ఇగురు, నేరేడు ఇగురు, వేప ఇగురు, దేవర్‌దంగి (ఆడ, మగ) ఐదు వంతులు, నల్లజీలకర్ర, పట్టా, పసుపు, పిప్పళ్లు (తోక మిరియాలు), పచ్చకర్పూరం, ఫిరంగి చెక్క, అన్నింటినీ కలిపి పొడిచేసి తేనెలో నాలుగు గంటలపాటు ఉడికించాలి. పాజిటివ్ రోగులకు దీన్ని రోజుకు రెండుసార్లు చొప్పున మూడు రోజులు ఇవ్వాలి. కరోనా సోకని వారు ఒకరోజు వాడితే చాలు.

2. **పాజిటివ్ రోగుల కోసం:** పుప్పింటాకు, మిరియాలు, నల్లజీలకర్ర, పట్టా, పసుపు, పిప్పిల్ల చెక్క, జాజికాయ, తేనె మిక్సీలో వేసి పొడిచేయాలి. తేనెలో 4 గంటలు ఉడికించాలి.

దీన్ని కరోనా రోగులకు భోజనంతోపాటు ఒకసారి చొప్పున రెండురోజులు ఇవ్వాలి.

3. పాజిటివ్ రోగుల కోసం: నేల ఉసిరి, గుంటగరగర ఆకు, మిరియాలు, నల్ల జీలకర్ర, పట్టా, పసుపు, పిప్పిల్ల చెక్క, జాజికాయ, తేనె కలిపి పొడి చేసి 4 గంటల పాటు తేనెలో ఉడికించాలి. పాజిటివ్ రోగులకు పైన తెలిపిన రెండు మందులను ఇచ్చిన నాలుగు గంటల తరువాత ఒకసారి చొప్పున రెండు రోజులు ఇవ్వాలి.

4. పాజిటివ్ రోగుల కోసం: పెద్దపల్లేరు కాయ, మిరియాలు, నల్ల జీలకర్ర, పట్టా, పసుపు, పిప్పిల్ల చెక్క, జాజికాయ, తేనె అన్నీ కలిపి పొడిచేసిన మిశ్రమాన్ని తేనెలో 4 గంటు ఉడికించాలి. రోజుకు ఒకసారి చొప్పున రెండు రోజులు వాడాలి.

5. పాజిటివ్ రోగులకోసం: ఒక కేజీ తేనె, 100 గ్రాముల పిప్పళ్లు (తోక మిరియాలు), చారెడు ముళ్ల వంకాయ గుజ్జు. తయారీ విధానం. తేనె వేడి చేసి అందులో తోక మిరియాలు, ముళ్ల వంకాయ గుజ్జు వేయాలి. ఈ ద్రావణాన్ని ఆక్సిజన్ స్థాయినిబట్టి ఒక్కో కంటిలో ఒక్కో డ్రాప్ చొప్పున వేయాలి.

ప్రమాణాలకు లోబడే: ఆయుష్ ల్యాబ్

ఆనందయ్య కరోనా మందును పరీక్షల నిమిత్తం ప్రభుత్వం ఆయుష్ ల్యాబ్‌కు పంపించగా అవి హానికరం కావని తేలింది. ప్రమాణాలకు లోబడి ఉన్నాయని కూడా స్పష్టమైంది. ఔషధం కోసం మొత్తం 18 మూలికలు వాడినట్లు ఆయుష్ కమిషనర్ రాములు వెల్లడించారు. "70 నుండి 80 వేల మందికి పైగా ఇప్పటి వరకు మందులు ఇచ్చామని నిర్వాహకులు చెబుతున్నారు. మందులో వాడే పదార్థాలన్నీ ఆయుర్వేదం అంగీకరించినవే. కానీ, ఆయుర్వేద ముందుగా గుర్తించాలంటే కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. క్లాసికల్

ఆయుర్వేదిక్ మెడిసిన్ పుస్తకాల్లో లేని మందు ఏదైనా క్లినికల్ ట్రయల్స్ నిర్వహించాల్సి ఉంటుంది. ఆయుర్వేద ఔషధంగా గుర్తించే అవకాశం లేదు. కొవిడ్‌కు మందుగా పరిగణించలేం. 'నాటు మందు' అని అవమానించే అవసరం లేదు. ఆ మందు వల్ల ఉపయోగం ఉంది" అని రాములు వివరించారు.

సీసీఆర్ఏఎస్‌కు నివేదిక..

ఆయుష్ తర్వాత ఆయుర్వేద వైద్య బృందం విచారణ జరిపింది. ఈ నివేదికను సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్ (సీసీఆర్ఏఎస్)కు పంపింది. రాష్ట్ర ప్రభుత్వం ఐసీఎంఆర్‌తో పాటు ఆయుర్వేద వైద్య నిపుణులతో కమిటీ వేసింది. దీనిపై తిరుపతి ఎస్వీ ఆయుర్వేద కళాశాల, విజయవాడ ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ సంయుక్తంగా కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ సీసీఆర్ఏఎస్‌కు నివేదికను పంపించింది. నివేదికను పరిశీలించిన అనంతరం సీసీఆర్ఏఎస్ ఆదేశాల కోసం ఆయుర్వేద వైద్య బృందం కొన్నాళ్లు ఎదురుచూడాల్సి వచ్చింది. ఈ కమిటీ సభ్యులు ఆనందయ్య వద్ద మందు తీసుకున్న 570 మంది వివరాలను సేకరించి 380 మందితో మాట్లాడారు. దాదాపు అంతా సానుకూలంగా స్పందించారు. కరోనా రాకుండా ఉండేందుకు, పాజిటివ్ వచ్చాక మందు తీసుకున్న వారు, ఆక్సిజన్ లెవల్స్ పడిపోయిన తరువాత మందు తీసుకున్న వారితో వివరంగా మాట్లాడారు.

ఆనందయ్య మందు పరిశోధన పురోగతిపై ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి కిరణ్ రిజిజు, ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ ప్రొ.బలరాం భార్గవ్‌కు ఫోన్ చేసి ఆరా తీశారు. మందును వాడిన వారి నుంచి వివరాలు సేకరించి, పరిశోధన

జరుపుతున్నామని కేంద్రమంత్రి వివరించారు. స్వయంగా ఉపరాష్ట్రపతే జోక్యం చేసుకున్నా ఈ మందు నిగ్గు తేల్చడంలో యథావిధిగా ఆలస్యం జరిగింది. సకాలంలో తేల్చి ఉంటే మరికొన్ని ప్రాణాలైనా నిలబడి ఉండేవనేది నెటిజన్ల ఆవేదన.

ఈ మందు వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు లేవంటున్నప్పుడు, ఔషధాన్ని ఉచితంగా ఇస్తున్నప్పుడు పంపిణీకి అభ్యంతరం ఎందుకు అని చినజీయర్ స్వామి ప్రశ్నించారు. ఓ మందు ప్రాణాలు నిలబెడుతుంటే వివాదం ఎందుకు? అని ఆయన ప్రశ్నించారు.. అల్లోపతి వైద్యాన్ని వ్యవస్థ అంగీకరించిన మాట వాస్తవమే. కానీ మంచిని ఎక్కడి నుంచైనా తీసుకోవచ్చని ఆయన వివరించారు. ఈ మందు విషయంలో రాష్ట్ర ప్రభుత్వ తీరు అనేక విమర్శలకు తావిచ్చింది. ఆయన చుట్టూ పోలీసు వలయం ఏర్పాటుచేయడం.. కొన్నాళ్లపాటు రహస్యంగా అదుపులోకి తీసుకుని విచారించడం.. ఆయన ఎక్కడ ఉన్నారో చెప్పాలంటూ గ్రామస్థులే అందోళనకు దిగడం విశేషం. ఆయనను రహస్యంగా ఒక ప్రాంతంలో ఉంచి ప్రభుత్వ, రాజకీయ పెద్దల కోసం పెద్ద ఎత్తున మందు తయారీ చేయించారనే ఆరోపణలు వచ్చాయి.. కార్లలో బకెట్లతో మందు ఎత్తుకెళ్లినట్లు మీడియాలో ప్రచారమైంది. ఆ కార్లలో మందు తీసుకెళ్లింది.. కృష్ణా జిల్లాకు చెందిన ఓ మంత్రి అని పత్రికలు, టీవీల్లో మోతమోగింది. ఓ వైపు ప్రభుత్వం ఎప్పుడెప్పుడు అనుమతి ఇస్తుందా? కృష్ణపట్నం ఎప్పుడు వెళ్దామా? అని లక్షలాదిమంది జనాలు వేచి చూస్తున్న సమయంలోనే కొందరు పెద్దలు ఆయనతో రహస్యంగా మందు తయారుచేయించి కార్లలో వచ్చి తీసుకెళ్లడంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి.

హైకోర్టులో ఆనందయ్య సంచలన పిటిషన్

తాను తయారుచేసిన ఆయుర్వేద మందు ఫార్ములాను చెప్పాలని కొందరు అధికారులు వేధిస్తున్నారని ఆనందయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం ఈ ఎపిసోడ్‌లో

పరాకాష్ఠ. మందులో వాడిన దినుసులు, ఫార్ములా వివరాలను చెప్పాలని అధికారులు వేధిస్తున్నారంటూ ఈ పిటిషన్ వేశారు. ప్రజా సంక్షేమం దృష్ట్యా ఉచితంగా ఆయుర్వేద మందు పంపిణీ చేసేందుకు తగిన రక్షణ కల్పించేలా ఆదేశించాలని కోరారు. చివరకు ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఆనందయ్య మందు సరఫరా మొదలుపెట్టినా అది ఆశించినంతగా ఆదరణ పొందిన దాఖలాలు లేకపోవడం విశేషం.

మందులేని మాయరోగం

- ఆయుర్వేద మందు గురించి ఇంత రద్ధాంతం జరుగుతుండడంతో అసలు అల్లోపతి వైద్యవిధానంలోని లోపాలను నిపుణులు ఎత్తిచూపడం మొదలుపెట్టారు.
- మొదట్లో కరోనాకు హైడ్రాక్సీ క్లోరోక్విన్ అన్నారు.. తర్వాత రెమ్‌డెసివిర్ సంజీవని అంటూ తెగవాడేశారు.. మధ్యలో ఫావిపిరావిర్.. ఇప్పుడు మరొకటి.. ఇంకొకటి!
- అసలు కొవిడ్ రోగులకు ఇష్టానుసారం స్టెరాయిడ్స్ వాడడం వల్లనే వారిలో రోగనిరోధక శక్తి తగ్గిపోయి మ్యూకర్ మైకోసిస్ (బ్లాక్ ఫంగస్) విజృంభిస్తోందని నిపుణులు ఇప్పుడు సెలవిస్తున్నారు. మరి అల్లోపతికి లేని అవరోధాలు ఆయుర్వేదానికే ఎందుకు వచ్చాయనేది సంప్రదాయవాదుల ప్రశ్న.
- ఏ కొత్త మందునైనా కనుగొనడానికి ఏళ్లూపూళ్లూ పడుతుంది కాబట్టి, ఇతర రోగాలకు వాడుతున్న మందులనే కొద్దిపాటి మార్పుచేర్పులతో కొవిడ్ చికిత్సకు ఉపయోగిస్తున్నారనేది బహిరంగ రహస్యం. .
- ప్రపంచవ్యాప్తంగా సంభవించే మరణాలకు మందుల సైడ్ ఎఫెక్ట్స్.. అడ్వర్స్ డ్రగ్ రియాక్షన్లు ఒక ప్రధానమైన కారణం. ఒక్క అమెరికాలోనే ఏటా లక్షా ఎనభై వేలమంది 'నివారించదగిన వైద్య లోపాల వల్ల' చనిపోతున్నారని సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (సీడీసీ) అంచనా వేసింది.
- 2009, 2014 మధ్య ఐదేళ్ల కాలంలో అమెరికాలోని పది అతి పెద్ద ఫార్మా కంపెనీలు తాము పాల్పడ్డ మోసాలకు కట్టిన జరిమానాలు అక్షరాలా 14 బిలియన్ డాలర్లు. కొవిడ్ 19ను ప్రస్తుతానికి మందులేని మాయరోగమనే చెప్పాలి.

కొవిడ్ చికిత్సపై ఎన్ని కుప్పిగంతులో!

కొవిడ్ నుంచి కోలుకున్న వ్యక్తుల రక్తం సేకరించి దానినుంచి ప్లాస్మాను వేరు చేసి కొవిడ్ రోగులకు ఇస్తే వారు త్వరగా తేరుకుంటారని మొదట్లో భావించారు. కొన్ని వందల, వేలమందికి ప్లాస్మా చికిత్స చేశారు. కానీ దీనివల్ల ఉపయోగం లేదని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) సరిగ్గా ఏడాది తర్వాత నిర్ధారించింది. పైగా, ఈ ప్లాస్మా చికిత్స వల్ల కరోనా వైరస్ వేగంగా రూపాంతరం చెందుతోందని శాస్త్రజ్ఞులు హెచ్చరించారు.

● ఎబోలా వైరస్‌ను అరికట్టడం కోసం రూపొందించిన రెమ్‌డెసివిర్ మందును కొవిడ్‌పై ప్రయోగించడం మొదలుపెట్టారు. దీంతో ఈ మందు బ్లాక్ మార్కెట్‌కు చేరి లక్ష రూపాయల వరకు ధర పలికింది. ప్రభుత్వాలు ఉత్పత్తిని పెంచమని కంపెనీలను అభ్యర్థించాయి. ఈ ఔషధం తయారీ, పంపిణీని కేంద్ర ప్రభుత్వం తన పర్యవేక్షణలో ఉంచుకుని రాష్ట్రాల అవసరాల మేరకు పంపకాలు చేయాల్సి వచ్చింది. ఇంత జరిగిన తర్వాత.. ఏడాదిపాటు ఉపయోగించాక రెమ్‌డెసివిర్ ఇంజక్షన్ వల్ల పెద్దగా ఉపయోగం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ చావు కబురు చల్లగా చెప్పింది. అయినా భారత్‌లో స్వల్ప, మధ్యస్థ లక్షణాలున్న కొవిడ్ రోగులకు దీన్ని ఇస్తునే ఉన్నారు.

● జపాన్‌లో ఫ్లూ వ్యాధి నివారణకు రూపొందించిన ఫావిపిరావిర్‌ను కూడా కరోనా రోగులకు చికిత్స కోసం ఉపయోగిస్తున్నారు. ఇది భారత్‌లో ఏప్రిల్‌లో అత్యధికంగా అమ్ముడైన మందుగా రికార్డులకెక్కింది. ఇప్పుడు ఈ మందు కూడా పనికిరాదని చెబుతున్నారు.

● కోర్టికోస్టెరాయిడ్ డెక్సామిథేసోన్ తీవ్ర లక్షణాలున్న కొవిడ్ రోగులపై బాగా

పనిచేస్తోందని చెబుతున్నారు. వెంటిలేటర్ల మీద ఉన్న రోగుల్లో మరణాలను 30 శాతం, ఆక్సిజన్ అవసరమైన రోగుల్లో మరణాలను 20 శాతం మేరకు తగ్గిస్తోందనేది సమాచారం. స్వల్ప లక్షణాలున్న రోగులకు దీన్ని ఇవ్వడం హానికరం.

● రుమటాయిడ్ ఆర్థరైటిస్ (కీళ్లవాపు)కు వాడుతున్న టోసిలిజుమాబ్, సారిలుమాబ్ మందులు విషమ స్థితికి చేరిన కొవిడ్ రోగుల్లో మరణాలను 24 శాతం తగ్గించగలుగుతాయని అమెరికన్ పరిశోధకులు తేల్చారు. దీంతో ఈ ఇంజక్షన్ల ధర బ్లాకులో రూ. 4 లక్షల వరకు పలుకుతున్నట్లు వార్తలు వచ్చాయి.

● ఇవికాక ఇతర వ్యాధుల చికిత్సకు వాడుతున్న నైక్లోసమైడ్, కోల్చిసైన్, క్లోర్ ప్రోమజైన్ మందులను కొవిడ్ చికిత్సకు ఉపయోగించే విషయమై పరిశోధన జరుపుతున్నాయి. బద్దె పురుగు (టేప్ వర్మ్) చికిత్సకు వాడే నైక్లోసమైడ్‌కు వైరస్ సంహార శక్తితోపాటు శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచే సత్తాకూడా ఉందని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. కరోనా వైరస్ శరీరంలో ప్రవేశించాక రోగ నిరోధక యంత్రాంగాన్ని అతిగా ప్రేరేపించడం వల్ల వాపు, మంటలు (ఇన్‌ఫ్లమేషన్), సైటోకైన్ తుపాను ఏర్పడుతాయి. దీని వల్ల ఊపిరితిత్తులు, ఇతర అవయవాలు దెబ్బతింటాయి. ప్రస్తుతం ఇన్‌ఫ్లమేషన్, గౌట్‌ల చికిత్సకు వాడుతున్న కోల్చిసైన్‌కు కొవిడ్ ఇన్‌ఫ్లమేషన్‌నూ తగ్గించే శక్తి ఉందా అని శాస్త్రజ్ఞులు శోధిస్తున్నారు.

● ఒంటి నొప్పులకు వాడే ఐబుప్రోఫెన్ మాత్రలూ ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి కాబట్టి అవి కొవిడ్ చికిత్సకు ఉపకరిస్తాయా అనీ పరిశీలిస్తున్నారు.

● నైక్లోసమైడ్, కోల్చిసైన్, క్లోర్ ప్రోమజైన్ మందులపై సీఎస్ఐఆర్, ఐఐసీటీల ప్రయోగాలు కొనసాగుతున్నాయి.

● రక్తాన్ని పలచబరిచే కొన్ని రకాల బ్లడ్ థిన్నర్ మందులు కొవిడ్ చికిత్సకు ఉపయోగపడతాయా అనీ శోధిస్తున్నారు. కరోనా రోగి ఆసుపత్రిలో చేరిన 24 గంటల్లోనే వీటిని ఇస్తే మరణాన్ని నివారించవచ్చునని కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి.

● మధుమేహులకు ఇచ్చే సిటాగ్లిప్టిన్ కూడా కొవిడ్ మరణాలను తగ్గించి, రోగి త్వరగా కోలుకోవడానికి తోడ్పడుతున్నట్లు శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు.

● మోల్నుపిరావిర్ అనే యాంటీ వైరల్ మందు కొవిడ్‌ను తొలిదశలో అరికట్టడానికి తోడ్పడుతుందని క్లినికల్ ప్రయోగాలు సూచిస్తున్నాయి.

● హృద్రోగానికి వాడే నైట్రిక్ ఆక్సైడ్ బిళ్లలు రక్తనాళాలను వెడల్పు చేసి ఆయాసం తగ్గిస్తాయనీ, వైరస్‌ల వృద్ధికి పగ్గాలు వేస్తాయనీ సూచిస్తున్నాయి.

● భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీఓ) గతంలో క్యాన్సర్ చికిత్స కోసం రూపొందించిన 2డిజి పొడిని కొవిడ్ నియంత్రణకు విడుదల చేసింది. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్‌తో కలసి డీఆర్డీఓ రూపొందించిన ఈ మందు ఒక మోస్తరు నుంచి తీవ్ర లక్షణాలతో ఆస్పత్రిలో చేరిన కొవిడ్ రోగులు వేగంగా కోలుకోవడానికి తోడ్పడుతుంది. ఇది వైరస్ బారిన పడిన శరీర కణాల్లోకి చొచ్చుకుపోయి వైరస్ వృద్ధిని అరికడుతుంది. రోగికి ఆక్సిజన్ అవసరాన్ని తగ్గించి త్వరగా కోలుకోడానికి సాయపడుతుందని భావిస్తున్నారు.

మరో కొత్త మందు

అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు కొవిడ్ సోకినప్పుడు వాడిన యాంటీబాడీ మిశ్రమం అమెరికా, ఐరోపాలో విస్తృత ప్రాచుర్యం పొంది, తాజాగా భారతదేశంలోనూ అందుబాటులోకి వచ్చింది. రోషే కంపెనీ తయారు చేసిన ఈ మిశ్రమంలో క్యాసిరివిమాబ్, ఇండెవిమాబ్ అనే రెండు యాంటీబాడీలు ఉంటాయి. భారతదేశంలో మొట్టమొదటిసారిగా హర్యానాకు చెందిన 84 ఏళ్ల వృద్ధ కొవిడ్ రోగికి ఈ మిశ్రమాన్ని ఇవ్వగా, ఆయన వెంటనే కోలుకున్నారు. కొవిడ్ లక్షణాలు స్వల్పంగా లేక ఒక మోస్తరుగా ఉన్నప్పుడే దీన్ని ఇస్తే, రోగం ముదిరిపోకుండా నివారించవచ్చు. దీనివల్ల ఆసుపత్రిలో చేరికలు, మరణాలు 70 శాతం తగ్గిపోతాయి. ప్రస్తుతం తీవ్ర ఆందోళనకరంగా తయారైన బి1.617.2 తరహా కరోనా

వైరస్ మీద రోషే మిశ్రమం సమర్థంగా పనిచేస్తోంది. ఈ మిశ్రమం ధర ఒక రోగికి రూ. 59,750. ఒక ప్యాకెట్ మిశ్రమం ఇద్దరికి సరిపోతుంది. అయితే ప్యాక్ ను తెరచిన 48 గంటల్లోనే రెండో రోగికి ఇవ్వాలి. రోషే మిశ్రమం ఒకే ఒక ఇంజెక్షన్ ఇస్తే సరిపోతుంది. తీవ్ర కొవిడ్ లక్షణాలతో ఆసుపత్రిలో చేరినవారికీ, ఆక్సిజన్ స్థాయులు బాగా పడిపోయినవారికీ ఈ మందును ఇవ్వకూడదు.

● అమెరికాలో ఎమొరీ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు కనిపెట్టిన ఇఐడిడి 2801 పలు రకాల కరోనా వైరస్‌ల వృద్ధిని అరికడుతున్నట్లు తేలింది. మాత్ర రూపంలో తీసుకునే ఈ మందుపై క్లినికల్ పరీక్షలు జరుగుతున్నాయి.

● ఇవన్నీ కొవిడ్‌కు ప్రత్యామ్నాయ మందులుగా యథేచ్ఛగా వాడేస్తున్నారు. ఎప్పుడో కొన్నాళ్లకు ఇవి పనికిరావని తేలవచ్చు. లేదా అద్భుతంగా పనిచేస్తాయని నిరూపణ కావచ్చు. మరి ఈలోపే వీటన్నింటినీ వాడడంలేదా? ఆనందయ్యమందుకే ఎందుకు ఇన్ని ఆటంకాలు సృష్టిస్తున్నారనేదే ఇప్పుడు సంప్రదాయవాదుల ప్రశ్న.

అవినీతిమయమైన సైంటిఫిక్ రీసెర్చ్

ఆనందయ్య మందు విషయంలో జరిగిన చర్చల్లో ఈ మందుకి శాస్త్రీయ ప్రామాణికత లేదనీ, శాస్త్రబద్ధంగా పరీక్షించి నిర్ధారించిన అల్లోపతి మందులూ, పద్ధతులే ప్రామాణికమైనవన్న వాదనలు వినిపించాయి.

● 2011లో డాన్ పోల్డర్‌మీన్స్ అనే ఒక డచ్ డాక్టర్‌ను శాస్త్రీయ దుష్ప్రవర్తన అనే ఆరోపణల మీద పదవి నుండి తొలగించారు. నాన్ కార్డియాక్ సర్జరీలలో బీటాబ్లాకర్స్ వాడవచ్చని నిర్ధారిస్తూ అతను పబ్లిష్ చేసిన ఫలితాలన్నీ తప్పుడు పరిశోధనలని తేలడమే దీనికి కారణం. ఆ పరిశోధనలను ప్రామాణికంగా చేసుకొని జరిగిన సర్జరీల వల్ల ఒక్క

యూరోప్‌లోనే 8 లక్షలమంది చనిపోయినట్టు లెక్క తేల్చారు.

● ఒక్క మందులకే పరిమితం కాదిది. సర్జికల్ ప్రొసీజర్స్, డయాగ్నస్టిక్ ఎక్విప్‌మెంట్, థెరపీలు వంటి మార్కెట్ విలువ ఉన్న ప్రతి అంశాన్నీ పబ్లికేషన్ బయాస్ అనే ఈ జాడ్యం భ్రష్టు పట్టించింది .కార్పొరేట్ సంస్థలు, అకడెమిక్ ఇనిస్టిట్యూషన్లూ, ప్రభుత్వ సంస్థలూ, డాక్టర్లూ సైంటిస్టుల భాగస్వామ్యంలో మొత్తం మెడికల్ సైన్సు ప్రామాణికతనే ప్రశ్నార్థకంగా మార్చివేసిన భారీ కుట్ర ఇది. 2017లో దీనిగురించి నియమించిన పీటర్ విమ్‌షర్స్ట్ కమిటీ బ్రిటిష్ పార్లమెంట్‌కు సమర్పించిన నివేదికలో ఇవి వ్యవస్థీకృత నేరాలంటూ తీవ్రంగా విమర్శించడం గమనార్హం.

● మోడర్న్ సైన్స్ చాలా విజయాలే సాధించింది. కాదనటంలేదు. కానీ మనిషిని ఓడించింది. మనిషి జీవితకాలాన్ని పెంచింది కానీ మానవజాతి ఆయుర్దాయాన్ని తగ్గించింది. మనిషిప్పుడొక అంతరించిపోయే ప్రాణి. బతకటానికి నానా చావు చస్తున్నాడు. నిజానికి సగటు మనిషికి సిద్ధాంతాల జంఝాటాలు ఏనాడూ లేవు. ఇప్పుడైతే ఎట్లాగైనా ప్రాణాలు దక్కించుకోవాలన్న తపన తప్ప వేరే ప్రయారిటీలు అసలే ఉండవు. ఏం తప్పుందందులో? ఆస్తులు కోల్పోయి కూడా ప్రేమించిన మనుషుల్ని కాపాడుకోలేని నిస్సహాయ పరిస్థితిలో కళ్లముందు ఏ సన్నటి వెలుగురేఖ కనిపించినా ఆశగా చూస్తున్నాడు. అది మన సంప్రదాయ ఆయుర్వేద వైద్యమే కావచ్చని ఆశిద్దాం!





వైజ్ఞానిక వైభవం.. భారతీయ వారసత్వం

అణుబాంబు విస్ఫోటనం చూసి.. దాని అంతరార్థాన్ని భగవద్గీతలోని (II/12 II/32) శ్లోకాలలో చెప్పిన రాబర్ట్ జ్యూలియస్ ఓపన్ హామర్ గురించి ఎంతమందికి తెలుసు! 16 జూలై 1945లో మాన్‌హట్టన్ ప్రాజెక్టులో ప్రముఖంగా పనిచేసి అణుబాంబు పరీక్షల అనుభవాన్ని గీతాతత్వంతో అన్వయించుకున్న ఈ పాశ్చాత్య శాస్త్రవేత్త భగవద్గీత గొప్పతనాన్ని తన జీవిత చరిత్రలో నమోదు చేసుకున్నాడు. శ్రీరామకృష్ణుల మహా సమాధి తర్వాత అనేక కష్టాలు పడి అమెరికాకు వెళ్లాడు స్వామి వివేకానంద. 1893 సెప్టెంబరు 11 నాటి సర్వమత సమ్మేళనంలో స్వామి ఉపన్యాసం తర్వాత పాశ్చాత్య ప్రపంచంలోని సింహభాగం మనకు తలవంచారు. వారంతా స్వామి వివేకానందను గురించి ప్రచార సాధనాల్లో చెబితేగాని మనకు స్పహలేదు. అలాగే ఈరోజు పాశ్చాత్యులు ఎందరో మన ప్రాచీనత్వాన్ని గురించి పరిశోధన చేస్తుంటే, మనం మాత్రం అవన్నీ కాలం చెల్లినవనే భ్రమలో ఇరుక్కుపోతున్నాం.

భూమి గుండ్రంగా ఉందని మొదటిసారి చెప్పింది ఎవరు? అనగానే కోపర్నికస్, గెలీలియో అని ఠక్కున చెప్పేస్తాం. కానీ రుగ్వేదం (1.33.8) మంత్రంలో 'భూమి వృత్తపు అంచున ఉన్నవారు' అని స్పష్టంగా భూమి గోళాకారాన్ని గురించి చెప్పిన విషయం మర్చిపోతాం. 16వ శతాబ్దంలో జీవించిన కోపర్నికస్ భూమి గుండ్రంగా ఉందని చెప్పాడంటే అది విజ్ఞాన శాస్త్రం అంటాం. క్రీ.శ 476 ప్రాంతంలోని ఆర్యభట్ట

భూవృత్తాకారాన్ని, భూవ్యాసాన్ని వర్ణించాడు. వరాహమిహిరుడైతే 'పంచ భూతాత్మకమైన గుండ్రని భూమి, పంజరంలో వేలాడే ఇనుప బంతిలాగా ఖగోళంలో తారల మధ్య నిలిచి ఉంది' అంటాడు. క్రీ.శ 1543లో మొదటిసారి 'సౌరవ్యవస్థకు సూర్యుడు కేంద్రంగా ఉంటే గ్రహాలన్నీ, భూమి సహా సూర్యుగా చుట్టూ తిరుగుతున్నాయి' అని కోపర్నికస్ చెప్పకముందే, నవగ్రహాల మధ్యలో సూర్యుణ్ణి పెట్టి ఆరాధించే భారతీయ సంస్కృతి మరెంత గొప్పదో చూడండి.

● ఛార్లెస్ డార్విన్- జీవ పరిణామ సిద్ధాంతానికి ఆధునిక కాలంలో విశేష ప్రాచుర్యం ఉందని మనకు తెలుసు. కానీ పతంజలి మహర్షి అంతకుముందే తన ఆత్మ యోగ సిద్ధాంతం ద్వారా 'మానవ జీవ పరిణామవాదం' అందించాడు. మనిషి ప్రవృత్తులను యోగ విద్య ద్వారా దివ్యంగా మార్చే అపూర్వ సిద్ధాంతాన్ని పునఃస్థాపన చేసాడు. పశువులా జీవించే మనిషిని దివ్య మానవుడిగా ఎదిగించే రహస్యం మనకు అందించాడు. గురుత్వాకర్షణ సిద్ధాంతం- ఆపిల్- న్యూటన్ కథ వినగానే, భూమ్యాకర్షణ సిద్ధాంతం అని చదివిన మనం 'యురేకా! అంటూ పరుగులు పెడతాం. కానీ క్రీ.శ 505లో జీవించిన వరాహమిహిరుడు తన 'పంచ సిద్ధాంతి' అనే గ్రంథంలో భూతలంలోని ఏ భాగంలో అయినా.. అన్ని జ్వాలలు పైకెగుస్తాయి. పైకి వేసిన వస్తువు కిందకు పడుతుంది' అని స్పష్టంగా చెప్పాడు. అలాగే బ్రహ్మగుప్తుడు (క్రీ.శ-591), భాస్కరాచార్యుడు (క్రీ.శ 1114) ఇదే విషయాన్ని దృఢపరిచారు. ఇదంతా సైన్సు కాదా?

● అలాగే గణితశాస్త్రంలోని అంక గణితం, రేఖా గణితం, బీజ గణితం, భూగోళ శాస్త్రం, ఖగోళ శాస్త్రం కలగలిపి మన ప్రాచీనులు అభివృద్ధి చేశారు. వేదకల్ప సూత్రాల్లోని శుల్బ సూత్రాలు, యజ్ఞవేదికల నిర్మాణాల విషయాలు అత్యంత ప్రాచీనమైనవి. క్రీ.శ. 6వ శతాబ్దానికి చెందిన బ్రహ్మగుప్తుడు చక్రీయ చతుర్భుజ విస్తీర్ణాన్ని, దాన్ని వికర్ణాన్ని కనుగొనడంలో విశేష కృషి చేశాడు. శూన్యాంశం (సున్న) వర్గమూలం (స్క్వేర్‌రూట్) ఘనమూలం (క్యూబ్‌రూట్)లను భారతీయులే కనుగొని ప్రపంచంలోనే మొదట గణిత విప్లవం సృష్టించారు.

● భూమి సూర్యుని చుట్టూ తిరగడానికి 365.2587 రోజులు పడుతుందని కచ్చితమైన గణితంతో చెప్పిన భాస్కరాచార్యుడు ఎంత గొప్ప గణితవేత్త. 1962లో మురళీ మనోహర్ జోషి ఉత్తరప్రదేశ్ పాఠ్యాంశ నిర్ణాయక కమిటీ ముందు బోధాయనుని ప్రమేయం గురించి చెబితే అందరూ వ్యతిరేకించారు. అప్పుడు జోషి ఎడ్వర్డ్ టేలర్‌కు సంబంధించిన 'సింప్లిసిటీ అండ్ ద సైన్స్' పుస్తకాన్ని వారి ముందు పెట్టి అందులో పేర్కొన్న బోధాయన ప్రమేయం మూలాలను చూపించాడు. ఎడ్వర్డ్ టేలర్ హైడ్రోజన్ బాంబు తయారీలో పాత్రధారి. నోబెల్ బహుమతి విజేత. పైథాగరస్ పేర్కొన్న ప్రమేయాలకు బోధాయనుడి సూత్రాలే మూలం అన్నాడు. అదే విషయాన్ని తర్కబద్ధంగా వాళ్ల ముందు పెడితే చివరికి దానికి పైథాగరస్ బోధాయన ప్రమేయంగా'

పేరు పెట్టారట! ఎంత విచిత్రం!!

● రస విద్య మన దేశంలో ఎంతో ప్రాచీనమైంది. నాగార్జునుడిని గొప్ప రస విద్య తెలిసిన వ్యక్తిగా ప్రాచీన రసాయన గ్రంథాలు పేర్కొన్నాయి. రాగి, సీసం, బంగారం, తుత్తునాగం, వెండి వంటి వాటిని శుద్ధిచేసే విధానం ఈ దేశంలో అత్యంత ప్రాచీన కాలంలోనే ఉందని దాదాపు 50 ప్రాచీన రస గ్రంథాలు తెలియజేస్తున్నాయి. రస విద్య ద్వారా సప్తధాతువుల్లో ఓజస్సు తగ్గకుండా ఎలా ఉండాలనేదానిపై భారతీయ ప్రాచీన శాస్త్రవేత్తలు విశేష పరిశోధన చేశారు. ఆచార్య నాగార్జునుడి మార్గంలోనే ఐజక్ న్యూటన్ పరిశోధనలు చేసి రస విద్య అంతు చూడాలనుకున్నాడు. తన సహచర పరిశోధక మిత్రుడు రాబర్ట్ బోయల్‌తో కలిసి భారతీయ రస విద్య ఆధారంగానే హేమ తారక విద్యను తెలుసుకోవాలనుకొన్నా.. మిత్రుడు మరణించడం, పెంపుడు కుక్క కొవ్వొత్తిని తన్నడంతో ప్రయోగశాల బుగ్గి పాలైందని చెబుతారు. న్యూటన్ రసవాదంపై చేసిన అంశాలు ఇప్పటికీ డీకోడ్ చేయలేకపోతున్నారని అనేక గ్రంథాలు ఆధారం ఇస్తున్నాయి. వేల ఏళ్లనాడే అనేకానేక పరిశోధనలకు నెలవైన భారత రసాయన విద్య ఎందుకు మధ్యలో లుప్తమైందో ఆలోచించాలి!

● కాంతి వేగాన్ని క్రీ.శ. 1675లో రోమర్ లెక్కించాడని అంటారు. కానీ భారతీయ ప్రాచీనమైన రుగ్వేదానికి సాయణాచార్యులు 14వ శతాబ్దంలోనే భాష్యం రాశారు. వారు కాంతి వేగం గురించి వ్యాఖ్యానిస్తూ- 'అర నిమిషానికి 2,202 యోజనాల దూరం ప్రయాణించు ఓ కాంతి కిరణమా! నీకు నమస్కారం' అంటారు. ఆ తర్వాత కొన్ని శతాబ్దాలకు 20వ శతాబ్దానికి చెందిన శాస్త్రవేత్తలు మెకీల్‌సన్స్, మోర్లే కాంతి వేగాన్ని సెకనుకు 1,86,300 మైళ్లు అని పేర్కొన్నారు. సాయణులు చెప్పిన విషయాన్ని క్రీ.శ. 1890లో మాక్స్‌ముల్లర్ సంకలనం చేసిన 'రుగ్వేదం' అనే ఆంగ్ల గ్రంథంలో కూడా ప్రస్తావించారు.

● అనంతమైన కాలగణనను చేతి వేళ్ల మీద చెప్పే పంచాంగం, జ్యోతిష విజ్ఞానాన్ని వదలిపెట్టి చిలకశాస్త్రాలు, జ్యోస్యాలకు అలవాటుపడిన నేటి తరానికి మన ప్రాచీనుల పరిజ్ఞానం ఎలా అర్థమవుతుంది? సంస్కృతంలో కాలగణనకు చెప్పే 'హోర' హవర్‌గా మారడం ఎలా సాధ్యమైందో తెలిస్తే మన ప్రాచీనుల కాలచక్రం నేడు గ్రహించగల్గుతారు మీరంతా!

● మీ పూర్వీకుడైన బాలరాజు మహర్షి గొప్పతనాన్ని ఎవరో జర్మన్‌వాళ్లు చెప్పాక గాని మీ అందరికీ తెలిసిరాలేదు. 'ఔషధం కాని మొక్కలేదు' అన్న ఆయన సూత్రం ప్రకారం మన ప్రాచీన వైద్య గ్రంథాలలో 1,50,000 ఔషధ మొక్కల వివరాలు ఉన్నాయంటే మీరు నమ్మగలమా! ప్రాచీన కాలంలోనే మరుగుజ్జు వృక్షాలను (బోన్సాయ్ మొక్కలు) గురించి చరకుడు తన చరక సంహితలో 'వామన తనువృక్షాది విద్య' ప్రత్యేక ప్రకరణలో పేర్కొని ఆచరణలో పెట్టాడు.

● స్త్రీ అండాన్ని, పురుషుని శుక్ర కణాన్ని టెస్ట్ ట్యూబ్‌లో కలుపుతారు. ఫలదీకరణం జరిగాక పిండాన్ని స్త్రీ గర్భంలో ప్రవేశపెడతారు. ఇది ఆధునిక కాలంలో జరుగుతున్న ప్రక్రియ. 5,000 ఏళ్ల క్రితమే వ్యాసమహర్షి గాంధారి గర్భంలోని పిండాన్ని నూటొక్క కుండల్లో ప్రవేశపెట్టి కౌరవ సంతానోత్పత్తికి ఆద్యుడయ్యాడు. గర్భ మార్పిడి, వీర్యదానం వంటి విషయాలను పిండోత్పత్తి శాస్త్రంగా ఆనాడు అభివృద్ధి పరిచారు. ఇది ఎందరికి తెలుసు?

● ప్రముఖ శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ తన చివరి ముప్పై ఏళ్లలో సాధించిన సాపేక్ష సిద్ధాంతం ప్రపంచానికి కొత్త వెలుగైనా మానవ జీవన మూల్యాలను చెప్పే భారతీయ తత్వశాస్త్రాలవైపు మొగ్గు చూపాడు. అందుకే సున్నాను కనుగొన్న భారతీయులకు ప్రపంచం రుణపడి ఉందన్నాడు ఐన్‌స్టీన్.

● అలాంటి మహోన్నత భారత వారసత్వాన్ని అనుసరించిన నా మరో ముద్దుబిడ్డడైన ఎ.పి.జె.అబ్దుల్ కలాం కూడా భారతీయ అణు విజ్ఞానం మన రక్షణకేగాని ఇతరులపై ప్రయోగానికి కాదు అన్నాడు.

● అత్యంత ప్రాచీన కాలంలోనే భారతీయులు ఈ విషయాలను వాళ్ల కాలానికి తగినట్లుగా ఆచరణలో పెట్టారు. ఇప్పుడు గొప్ప విజ్ఞాన దేశాలుగా చెప్పేవి పుట్టని కాలంలోనే ఇలాంటి తొలి అడుగు వేసిన భారతీయ శాస్త్రవేత్తలను గుర్తించేదాకా నేటి తరానికి పోరాటం తప్పదు.

ఇదీ టీకా.. తాత్పర్యం!

అందరూ కోరుకున్నట్టుగానే, అనతికాలంలోనే 18 ఏళ్లు పైబడ్డవారికీ కొవిడ్-19 టీకా అందుబాటులోకి వచ్చింది. కరోనా మీద వీలైనంత త్వరగా, సమర్థంగా విజయం సాధించటంలో ఇది అత్యంత కీలక పరిణామం. మనదేశంలో యువతీ యువకుల సంఖ్య ఎక్కువ. ఇలాంటి చిన్న వయసువారంతా టీకాలు తీసుకుంటే కరోనా పీచమణచటానికి ఎంతో సమయం పట్టదు. సరైన అవగాహనతో, తగు జాగ్రత్తలతో టీకా తీసుకోవటమే ఇప్పుడందరి కర్తవ్యం కావాలి. కాకపోతే తెలిసో తెలియకో కొందరు కొవిడ్-19 టీకా విషయంలో ఇప్పటికీ అనేక రకాలుగా సందేహిస్తుండటం విచారకరం. ఇది తగదు. తప్పుడు ప్రచారాల మూలంగా భయాల్లో మునిగిపోవటం ఎంతమాత్రం మంచిది కాదు.

ఒకవైపు రోజురోజుకీ ఎక్కువవుతున్న కొవిడ్-19 కేసులు. మరోవైపు పెరిగిపోతున్న మరణాలు. ఆసుపత్రుల్లో రద్దీ పెరగటం.. సదుపాయాలు, చికిత్సలు సత్వరం అందకపోవటం వంటి దృశ్యాలు భయానక పరిస్థితికే అద్దం పడుతున్నాయి. ఇంతటి భీతావహ వాతావరణంలోనూ టీకా ఒక్కటే ఆశాజనకంగా, తిరుగులేని బ్రహ్మాస్త్రంలా అభయమిస్తోంది. నిజానికి టీకా సైతం కొవిడ్-19 కారక సార్స్-కోవీ2 లాంటిదే. కాకపోతే ప్రమాదకరం కాదు. ఎలాంటి హాని చేయకుండానే మనలో రోగనిరోధకశక్తిని ఉత్తేజితం చేస్తుంది. యాంటీబాడీలు పుట్టుకొచ్చేలా చేసి ముమ్ముందు ఇన్‌ఫెక్షన్ బారినపడకుండా.. ఒకవేళ ఇన్‌ఫెక్షన్ తలెత్తినా ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లకుండా కాపాడుతుంది. అయితే ఆరోగ్యవంతుల దగ్గర్నుంచి మధుమేహం, అధిక రక్తపోటు, ఆస్థమా, అలర్జీల వంటి దీర్ఘకాల సమస్యలతో బాధపడేవారి వరకూ అందరి మనసుల్లోనూ ఒకటే ప్రశ్న. టీకా తీసుకోవాలా?

venku1968@gmail.com

వద్దా? తీసుకుంటే ఏమవుతుంది? ఇప్పటికే మనదగ్గర దాదాపు 16 కోట్ల మంది టీకాలు తీసుకున్నారు. అయినా ఇంకా సందేహాలు ఎందుకు? ఏదైనా అనుమానం ఉంటే నివృత్తి చేసుకొని, ముందుకు సాగటమే తక్షణం చేయాల్సిన పని.

అలర్జీలు, ఆస్థమా బాధితులు తీసుకోవచ్చా?

చిన్న చిన్న అలర్జీ సమస్యలకు, ఆస్థమాకు భయపడాల్సిన పనిలేదు. నిరభ్యంతరంగా టీకా తీసుకోవచ్చు. టీకాలో వాడే నిల్వ పదార్థాల వల్ల రియాక్షన్ వస్తేనే దాన్ని తీవ్రంగా పరిగణిస్తారని తెలుసుకోవాలి. కొందరు 'నాకు ఈ మందు పడదు, ఆ మందు పడదు' అని భయపడుతున్నారు. ఇలాంటివారు టీకా కేంద్రంలో సిబ్బందికి ముందే విషయాన్ని తెలియజేయాలి. అయితే గతంలో స్టీవెన్స్ జాన్సన్ సిండ్రోమ్ వంటి తీవ్ర అలర్జీ తలెత్తినవారు గానీ ఇంతకుముందు ఇతరత్రా టీకాలు వేసుకున్నప్పుడు అలర్జీలు తలెత్తినవారు గానీ టీకాకు దూరంగా ఉండటం మంచిది. స్టీవెన్స్ జాన్సన్ సిండ్రోమ్ గలవారి విషయంలోనూ టీకా తీసుకోవటం వల్ల కలిగే ప్రయోజనం, వేసుకోకపోతే వచ్చే నష్టం బేరీజు వేసి డాక్టర్లు నిర్ణయం తీసుకుంటారు.

క్యాన్సర్‌తో బాధపడుతుంటే?

క్యాన్సర్ బాధితులు, క్యాన్సర్ చికిత్స తీసుకునేవారికి రోగనిరోధకశక్తి తక్కువగా ఉంటుంది. ఇలాంటివారికి కరోనా ముప్పు ఎక్కువ. కాబట్టి మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బులతో బాధపడేవారి మాదిరిగానే వీరికీ ముప్పు ఎక్కువగానే ఉంటుంది. కాబట్టి వయసుతో నిమిత్తం లేకుండా టీకా తీసుకోవాలి.

రక్తాన్ని పలుచబరచే మందులేసుకుంటే?

ప్రస్తుతం ఎంతోమంది చిన్న వయసులోనే రక్తాన్ని పలుచబరచే యాస్ప్రిన్, క్లోపిడెగ్రెల్ మందులు వేసుకుంటున్నారు. వీటిని వేసుకుంటున్నా కూడా వయసుతో నిమిత్తం లేకుండా టీకా తీసుకోవచ్చు. కాకపోతే రక్తం గడ్డలు ఏర్పడకుండా చూసే మాత్రలు (యాంటీ కొయాగ్యులెంట్లు) వేసుకునేవారు పీటీఐఎన్ఆర్ పరీక్ష చేసుకొని, ఫలితాలను బట్టి వేయించుకోవాలి. పీటీఐఎన్ఆర్ ఎక్కువగా ఉంటే ఇంజెక్షన్ ఇచ్చిన చోట రక్తం గూడు కట్టే ప్రమాదముంది.

నెలసరి సమయంలో టీకా తీసుకోవచ్చా?

యుక్తవయసు అమ్మాయిలకు టీకా అనగానే నెలసరి సమయంలో తీసుకోవచ్చా? అనే చాలామంది అడుగుతున్నారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో అపోహలూ రాజ్యమేలు తున్నాయి. వీటిల్లో ప్రధానమైంది నెలసరితో రోగనిరోధకశక్తి మందగిస్తుందని.. అందువల్ల నెలసరి రావటానికి ఐదు రోజుల ముందు, నెలసరి అవుతున్నప్పుడు, తర్వాత టీకా తీసుకోవద్దని. ఇందులో ఏమాత్రం నిజం లేదు. నెలసరి మీద, రుతుస్రావం మీద టీకా ఎలాంటి విపరీత ప్రభావం చూపదు. అంతర్జాతీయ వైద్య సంస్థలన్నీ ఈ విషయాన్నే గట్టిగా

పేర్కొంటున్నాయి. అందువల్ల నెలసరి సమయాన్ని బట్టి టీకా తేదీని మార్చుకోవటం వంటివేవీ చేయొద్దు. నెలసరితో సంబంధం లేకుండా 18 ఏళ్లు దాటిన మహిళలంతా తప్పకుండా టీకా తీసుకోవాలి.

గర్భిణులు, పాలిచ్చే తల్లులు తీసుకోవచ్చా?

మనదగ్గర ప్రస్తుతానికి గర్భిణులకు, పాలిచ్చే తల్లులకు టీకా వద్దనే ప్రభుత్వం సూచిస్తోంది. ఒకవేళ తెలియకుండా పొరపాటున తీసుకున్నా ఏమీ కాదు. భయపడాల్సిన పనేమీ లేదు.

కొత్తగా పెళ్లయినవారు తీసుకోవచ్చా?

గర్భధారణకు ప్రయత్నించేవారు, కొత్తగా పెళ్లయిన యువతులు టీకా తీసుకోవద్దని ప్రభుత్వ మార్గదర్శకాలు పేర్కొంటున్నాయి. టీకా తీసుకున్న సమయంలో గర్భం ధరించినా ఇబ్బందులేవీ తలెత్తటం లేదనే అంతర్జాతీయ అధ్యయనాలు చెబుతున్నప్పటికీ మనదగ్గర దీని విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

గర్భసంచిలో తిత్తులుంటే?

అవివాహిత అమ్మాయిలు, యువతులు నిరభ్యంతరంగా టీకా తీసుకోవచ్చు. పెళ్లయినా కాకున్నా నెలసరి సమయంలో రుతుస్రావం ఎక్కువ, తక్కువ అయ్యేవారు.. గర్భసంచిలో నీటితిత్తుల వంటి సమస్యలు గలవారు కూడా టీకా తీసుకోవచ్చు. ఎలాంటి ఇబ్బందీ ఉండదు.

రక్తహీనతతో బాధపడుతుంటే?

మనదేశంలో రక్తహీనత ఎక్కువ. మూడింట రెండొంతుల మంది మహిళలు దీంతో బాధపడుతున్నవారే. దీనికి, టీకాకు సంబంధమేమీ లేదు. రక్తహీనత ఉన్నా కూడా టీకా విధిగా తీసుకోవాలి.

సంతాన సమస్యలేవైనా వస్తాయా?

సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న మరో పెద్ద అపోహ ఇది. టీకాలోని పదార్థాలు మాయలోని ప్రొటీన్‌కు హాని కలిగిస్తాయని కొందరు వెనకాడుతున్నారు. వీటిల్లో ఎలాంటి నిజమూ లేదు. టీకాల్లో మన శరీరానికి హాని చేసే పదార్థాలేవీ ఉండవని తెలుసుకోవాలి. ఇవి ఎలాంటి సంతాన సమస్యలను కలగజేయవు. గర్భిణులు రకరకాల టీకాలు తీసుకోవటం చూస్తున్నదే. వీటితో పుట్టుకొచ్చే యాంటీబాడీలు గర్భస్థ శిశువుకూ చేరుకుంటాయి. కాన్పు తర్వాత తల్లిపాల ద్వారా శిశువులకూ అందుతాయి. కొవిడ్-19 టీకా విషయంలోనూ ఇలాంటి ఫలితమే కనిపిస్తున్నట్టు అంతర్జాతీయ అధ్యయనాలు పేర్కొంటున్నాయి. కాబట్టి సంతాన సమస్యలపై ఎలాంటి అపోహలు, భయాలు పెట్టుకోవద్దు. అయితే సంతాన చికిత్సలు తీసుకునేవారు.. అండాన్ని సేకరించటానికి, గర్భంలో పిండాన్ని ప్రవేశపెట్టటానికి మూడు రోజుల ముందు, మూడు రోజుల తర్వాత

టీకా తీసుకోవటం తగదు. అలాగని టీకా హాని చేస్తుందనీ కాదు. టీకా తీసుకున్నాక జ్వరం వంటి ఇబ్బందులు తలెత్తితే అవి టీకాతోనా? సంతాన చికిత్సల దుష్ప్రభావాలా? అనేవి తెలుసుకోవటం కష్టమవుతుంది కాబట్టే.

సోరియాసిస్ గలవారు?

సోరియాసిస్ వంటి చర్మ సమస్యలు గలవారు రోగనిరోధకశక్తిని అణచిపెట్టే కొన్నిరకాల మందులు వాడుతుంటారు. ఇలాంటివారు టీకా తీసుకుంటే యాంటీబాడీల ప్రతిస్పందనలు అంత ఎక్కువగా ఉండకపోవచ్చు. రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్, ఎస్ఎల్ఈ వంటి స్వీయ రోగనిరోధక జబ్బులతో బాధపడేవారు డాక్టర్‌ను సంప్రదించి టీకా తీసుకోవాలి. అవసరమైతే జబ్బు తీవ్రతను బట్టి డాక్టర్లు మందుల మోతాదు కొంతవరకు తగ్గిస్తారు. దీంతో టీకా సామర్థ్యం పెరిగేలా చేసుకోవచ్చు. మందుల మోతాదు తగ్గించే అవకాశం లేకపోయినా టీకా తీసుకోవటమే మంచిది. ఎంతోకొంత టీకా రక్షణ లభించే అవకాశం లేకపోలేదు.

రెటీనా రక్తనాళంలో గడ్డ ఉంటే?

ప్రధాన రెటీనా రక్తనాళంలో రక్తం గడ్డ (సెంట్రల్ రెటీనల్ ఆర్టరీ అక్లూజన్) గలవారు రక్తం గడ్డలు ఏర్పడకుండా చూసే మందులు వేసుకుంటుంటారు. ఇలాంటివారు కొవిషీల్డ్‌కు బదులు కొవాగ్జిన్ టీకా వేసుకోవటం మంచిది. కొవిషీల్డ్‌తో కొందరికి రక్తం గడ్డలు ఏర్పడే అవకాశముంటున్నట్టు బయటపడింది. కాబట్టి డాక్టర్ పర్యవేక్షణలో తగు టీకా తీసుకోవాలి.

ఇతరత్రా టీకాలు వేయించుకుంటే?

ఫ్లూ, న్యుమోనియా వంటి ఇతరత్రా టీకాలు వేయించుకున్నవారు రెండు వారాల తర్వాతే కొవిడ్-19 టీకా వేయించుకోవాలి.



వ్యాక్సినే బ్రహ్మాస్త్రం..

కరోనాపై యుద్ధంలో టీకాయే బ్రహ్మాస్త్రం. టీకా వేసుకోవడం ద్వారా ప్రాణ నష్టాన్ని తగ్గించవచ్చని ఇప్పటికే అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. టీకా వేసుకున్న తర్వాత కరోనా పాజిటివ్‌గా వస్తున్నప్పటికీ తీవ్రత తక్కువగా ఉంటోంది. అందుకే వైద్యరంగ నిపుణులతో పాటు ప్రభుత్వాలు కూడా పెద్ద ఎత్తున టీకాలు వేయించుకోవాలని ప్రజలకు పదే పదే విజ్ఞప్తి చేస్తున్నాయి. టీకా వేసుకుంటే కరోనా రాదనే భరోసా లేనప్పటికీ ఆసుపత్రిపాలయ్యే అవకాశాలు మాత్రం తక్కువ. ఇప్పటికే దేశ వ్యాప్తంగా కొవిషీల్డ్, కొవాగ్జిన్ టీకాల పంపిణీ పెద్ద ఎత్తున జరుగుతోంది. ఇటీవల స్పుత్నిక్ వీ టీకాకు భారత ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కొవిషీల్డ్, కొవాగ్జిన్ ఈ రెండూ కరోనా తీవ్రత నుంచి కాపాడటంలో సమర్థంగా పని చేస్తున్నాయి.

రోగనిరోధక శక్తి పెంచుకోండి

మాస్క్ ధరించడం, భౌతికదూరం పాటించడంతో పాటు శరీరానికి తగిన పోషకాహారాన్ని తీసుకోవడం ఈ సమయంలో ఎంతో ముఖ్యం. రోగనిరోధక శక్తిని ఇనుమడింప జేసుకోవడం ద్వారా కరోనా బారినుంచి కొంతవరకు మనల్ని మనం కాపాడుకోవచ్చు. పండ్లు, ఆకుకూరలు, మాంసం వంటి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంతో పాటు వ్యాయామం చేయడం, సరిపడా నిద్ర, ఒత్తిడిని తగ్గించుకొనే మార్గాలను అనుసరించడం మేలు చేస్తాయి. ఈ క్లిష్ట సమయంలో ముఖ్యంగా సమతుల ఆహారం తీసుకోవడంపై దృష్టిపెట్టాలి. రోగనిరోధక శక్తిని పెంచే విటమిన్ ఎ,బి,సి,డి,ఈ,

జింక్ వంటి విటమిన్‌లు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా వైరస్ ముప్పును తగ్గించుకోవచ్చు.

భారత్‌కు టీకానే దీర్ఘకాలిక పరిష్కారం: ఫౌచీ

ప్రజలందరికీ టీకాలు ఇవ్వడమే భారత్‌లోని ప్రస్తుత కొవిడ్-19 విజృంభణకు దీర్ఘకాలిక పరిష్కారమని అమెరికాకు చెందిన ప్రముఖ అంటువ్యాధుల నిపుణులు ఆంటోనీ ఫౌచీ స్పష్టం చేశారు. ఆయన ఏబీసీ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. దేశీయంగా, ప్రపంచ వ్యాప్తంగా టీకాల ఉత్పత్తిని వేగవంతం చేయాలని ఆయన సూచించారు. " ప్రజలకు టీకాలు ఇవ్వడంతోనే ప్రస్తుత సంక్షోభానికి ముగింపు లభిస్తుంది. భారత్ ప్రపంచంలోనే అత్యధిక వ్యాక్సీన్లను ఉత్పత్తి చేసే దేశం. వారు టీకాలకు అవసరమైన మెటీరియల్‌ను దేశీయంగా తయారు చేసుకోవడంతోపాటు బయట నుంచి కూడ పొందాలి. లేకపోతే వారి వద్దే భారీ కంపెనీలు ఉంటే వందల మిలియన్ల టీకాలను ఉత్పత్తి చేయాలి" అని పేర్కొన్నారు.

భారత్ తక్షణమే దృష్టి సారించాల్సిన అంశాలు కూడా ఉన్నయని ఫౌచీ స్పష్టం చేశారు. వైరస్ వ్యాప్తిని అరికట్టడం, లాక్‌డౌన్‌లు విధించడం వంటి అంశాలను ఆయన పునరుద్ఘాటించారు. "టీకాలు వేయడం ఒక పరిష్కారం మాత్రమే. లాక్‌డౌన్ విధించడం కూడా చాలా అవసరం. ఈ విషయాన్ని గతంలో కూడా చెప్పాను. ఇప్పటికే భారత్‌లోని చాలా రాష్ట్రాలు ఈ పనిచేశాయి. మీరు వైరస్ వ్యాప్తిని అడ్డుకోవాలంటే మాత్రం ఇదే మార్గం" అని ఫౌచీ నొక్కి చెప్పారు. గత వారం పీటీఐకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో కూడా ఫౌచీ ఈ అంశాలను ప్రస్తావించారు.

యాంటీబాడీస్ ఉంటే వైరస్ మళ్లీ సోకదా?

దేశంలో కరోనా వైరస్ సోకినవారి సంఖ్య 30 లక్షలు దాటింది. వ్యాధిగ్రస్తుల సంఖ్యలో భారత్ ప్రపంచంలో మూడో స్థానానికి చేరుకుంది. అయితే ఒకవైపు వైరస్ సోకిన వారి సంఖ్య పెరుగుతుండగా, చికిత్స తర్వాత వ్యాధి నుంచి బైటపడిన వారి సంఖ్య కూడా బాగానే పెరుగుతోంది. రెండో విడత సెరో సర్వే నివేదికను దిల్లీ ప్రభుత్వం విడుదల చేసింది. దిల్లీ ఆరోగ్యశాఖా మంత్రి సత్యేందర్ జైన్ విడుదల చేసిన ఈ సర్వే ఫలితాలలో దేశ రాజధానిలో 29 శాతానికి పైగా ప్రజల్లో యాంటీబాడీస్ ఉన్నట్లు తేలింది. అంటే వీరందరికీ ఇన్‌ఫెక్షన్ సోకగా, వారి శరీరం వాటిని తట్టుకునే యాంటీబాడీస్‌ను వృద్ధి చేసుకోగలిగింది. ఆగస్టు 1 నుంచి 7 వరకు ఈ సెరో సర్వే కోసం నమూనాలు తీసుకున్నామని దిల్లీ ఆరోగ్య మంత్రి సత్యేందర్ జైన్ వెల్లడించారు. మొత్తం 29.1 శాతం మందిలో యాంటీబాడీస్‌ను గుర్తించామని మంత్రి తెలిపారు. జూలైలో జరిగిన మొదటి సెరో సర్వేలో దిల్లీలో నాలుగింట ఒకవంతుమందికి ఈ వ్యాధి సోకినట్లు గుర్తించారు. అప్పటి సర్వే కోసం 21,387 శాంపిల్స్

తీసుకున్నారు. వీరిలో 23.48 శాతం మందిలో యాంటీబాడీస్ డెవలప్ అయ్యాయి.

రెండో సర్వేలో శాంపిల్ సైజ్‌ను 15,000 మందికి పరిమితం చేశారు. రెండో సర్వే ప్రకారం 32.2 శాతం మంది స్త్రీలలో, 28 శాతం మంది పురుషులలో యాంటీబాడీలు అభివృద్ధి చెందాయి. రెండు కోట్ల జనాభా ఉన్న రాజధానిలో వైరస్ వ్యాప్తి తర్వాత దాదాపు ఆరు లక్షలమంది దీన్నుంచి కోలుకున్నారని స్పష్టమయింది. అయితే హెర్డ్ ఇమ్యూనిటీని వృద్ధి చేసుకోడానికి ఢిల్లీకి ఇంకా చాలా సమయం పట్టే అవకాశం ఉంది. ఒక ప్రదేశంలో 40 నుంచి 70 శాతం మందిలో యాంటీబాడీస్ వృద్ధి అయితే అక్కడ హెర్డ్ ఇమ్యూనిటీ పెరుగుతుందని ఆరోగ్యమంత్రి జైన్ తెలిపారు. ముంబై, పుణెలలో జరిపిన సెరో సర్వేలో 40 శాతం మందిలో యాంటీబాడీస్ ఉన్నట్లు గుర్తించారు.

రెండోసారి వైరస్ సోకి యాంటీబాడీస్ వృద్ధి కావా?

రెండోసారి వైరస్ సోకుతుందో లేదో తెలియదు. కానీ ఒకసారి వైరస్ సోకిన వారిలో కొందరికి యాంటీబాడీస్ వృద్ధి చెందాయి" అని ఐసీఎంఆర్‌లోని ఎపిడెమాలజీ అండ్ కమ్యూనికబుల్ డిసీజెస్ విభాగంలో పని చేస్తున్న డాక్టర్ నివేదితా గుప్తా అన్నారు. శరీరంలో యాంటీబాడీస్ తయారైన వారు సురక్షితమని మేం భావిస్తున్నాము. కానీ వారు మళ్లీ వ్యాధిబారిన పడే అవకాశం ఉంది. అయితే ప్రపంచవ్యాప్తంగా దీనికి సంబంధించి ఇప్పటి వరకు ఆధారాలు లభించ లేదు. వస్తుందని కచ్చితంగా చెప్పలేము" అన్నారు నివేదితా గుప్తా. సెరో సర్వే ఫలితాలలో ఎవరు వ్యాధిబారినపడ్డారు, ఎవరికి నయమైంది అన్నది మాత్రమే తెలుస్తుంది. ఇన్‌ఫెక్షన్ అంటే ఏంటో ముందు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు ప్రొగ్రెసివ్ మెడికోస్ అండ్ సైంటిస్ట్స్ ఫోరం జాతీయ అధ్యక్షులు డాక్టర్ హర్జిత్ సింగ్ భట్టి.

శరీరభాగాలకు, శరీరానికి హాని కలిగించే ఒక ఫారిన్‌బాడీ (బయటి వస్తువు లేదా జీవి) శరీరంలోకి ప్రవేశిస్తే దానినే ఇన్‌ఫెక్షన్ అంటారు. ఆ పరిస్థితుల్లో మన శరీరం వాటిని నిరోధించే శక్తిని సంపాదించుకుంటే ఆ ఫారిన్‌బాడీ వల్ల మనకు ఇబ్బంది ఉండదు" భట్టి చెప్పారు. శరీరంలో యాంటీబాడీస్‌ను వృద్ధి చేసుకున్న వారికి ఇన్‌ఫెక్షన్ సమస్య ఉండదు. వారిపై ఏదైనా వైరస్ దాడి చేస్తే వారిలోని యాంటీబాడీస్ యాక్టివేట్ అవుతాయి. వైరస్‌ను అడ్డుకుంటాయి" అని హర్జీత్ సింగ్ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 180కి పైగా దేశాలకు విస్తరించిన ఈ కరోనా, ఇప్పటి వరకు ఉన్న సమాచారం ప్రకారం అనేక రూపాలను మార్చుకుంటూ వెళుతోంది.

అలా పరివర్తనం చెందుతున్నప్పుడు యాంటీబాడీస్ మనల్ని ఎంత వరకు రక్షించగలవు? అయితే అసలు ఎలా పరివర్తనం చెందుతుందో కూడా తెలియని పరిస్థితి ఉందని డాక్టర్ నివేదితా గుప్తా అంటున్నారు. ప్రస్తుతం ఇది కొత్త వైరస్‌ని, రెండోసారి వైరస్ సోకుతుందా లేదా అన్నదానిపై పూర్తి సమాచారం లేదని డాక్టర్ హర్జీత్ సింగ్ భట్టి తెలిపారు. దీనిపై

ఇంకా పరిశోధనలు సాగుతున్నాయన్నారు. ।ఈ వైరస్ పరివర్తన గురించి ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి. అయితే ఈ మార్పే నిజమైతే దీనితో చాలా ప్రమాదం. ఎందుకంటే దీని కోసం తయారు చేసిన మందులు కొంతకాలమే పని చేస్తాయి. ఇప్పటి వరకు కరోనా జంతువుల నుంచి మనుషులకు నాలుగుసార్లు మాత్రమే పరివర్తన జరిగింది అని భట్టి తెలిపారు. మొదటి సర్వే అంత శుభసూచకంగా లేదని, రెండోసర్వే కాస్త ఉపశమనం కలిగించేలా ఉందని వెల్లూర్ క్రిస్టియన్ మెడికల్ కాలేజీలో వైరాలజీ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ టి. జాకబ్ అన్నారు. ।కరోనా వైరస్ మనం ఊహించన విధంగానే పని చేస్తోందని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయి. దానిలో ఎలాంటి పరివర్తన కనిపించలేదు। అని జాకబ్ అన్నారు. కరోనా టీకా రెండో డోసు తీసుకోవడం కాస్త ఆలస్యమైనా గాబరా పడొద్దని దిల్లీ ఎయిమ్స్ డైరెక్టర్ రణ్‌దీప్ గులేరియా పేర్కొన్నారు. ఆలస్యమైనా అది పనిచేస్తుందని, ఎవరూ మానొద్దని సూచించారు.

పిల్లలకూ టీకా రక్షణ అవసరం

చిన్నారులకు కొవిడ్-19 టీకా వేసే అంశం ఇటీవల విస్తృతంగా చర్చనీయాంశమైంది. 12-15 ఏళ్ల మధ్యవారికి వ్యాక్సిన్ వేసేందుకు ఈ నెల 5న కెనడా ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఆ వెంటనే అమెరికాకు చెందిన ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (ఎఫ్‌డీఏ) కూడా ఇదే నిర్ణయాన్ని తీసుకుంది. ఇతర దేశాలూ ఈ మార్గాన్ని అనుసరించే అవకాశం ఉంది. అంతేకాదు.. 12 ఏళ్ల కన్నా తక్కువ వయసువారికీ టీకాలు వేసే అంశం ఆయా చోట్ల పరిశీలనలో ఉంది. నైతిక విలువల నిపుణులు ఆంటోనీ స్కెలిటన్ (వెస్ట్రన్ యూనివర్సిటీ, కెనడా), లీసా ఫోర్స్‌బర్గ్ (ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం, బ్రిటన్) దీన్ని స్వాగతిస్తున్నారు. కౌమారప్రాయులు, చిన్నారుల్లో ఎక్కువ మందికి టీకా వేయకుంటే కొవిడ్-19 నుంచి సమాజాన్ని రక్షించడం అసాధ్యమని వారు పేర్కొన్నారు. వ్యాక్సిన్ల పట్ల సంకోచం, ఇతర అపోహల వల్ల ఈ లక్ష్యసాధనలో సవాళ్లు ఎదురుకావొచ్చని తెలిపారు. తమ సంతానానికి టీకాలు వేయించని తల్లిదండ్రులకు జరిమానాలు విధించడం, సామాచ్కీజిజిక కార్యక్రమాల్లో పాల్గొనకుండా ఆంక్షలు పెట్టడం వంటి చర్యలను ప్రభుత్వం తీసుకోవచ్చని, అవి నైతికంగా సబబేనని ఆంటోనీ, లీసాలు తెలిపారు. చిన్నారులకు వ్యాక్సిన్లను సమర్థిస్తూ వారు మూడు తార్కిక కారణాలను తెరపైకి తెచ్చారు. .

వారికి టీకాలు వేయకుంటే అంతరించి పోతారు

అసలే అంతరించే ముప్పు ముంగిట ఉన్న గిరిజన తెగలు... కరోనాతో కనుమరుగయ్యే ప్రమాదముందని జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఆందోళన వ్యక్తం చేసింది. వీరిలో 50 వేల లోపు జనాభా ఉన్న తెగల్లోని వారందరికీ 60 రోజుల్లో కొవిడ్

టీకాలు వేయాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సిఫార్సు చేసింది. దేశంలోని 177 గిరిజన జిల్లాల్లో 705 గిరిజన తెగలు ఉండగా అందులో లక్షలోపు జనాభాతో 75 తెగలు అంతరించే ముప్పును ఎదుర్కొంటున్నాయని గుర్తుచేసింది. ఈ తెగల్లో కరోనా మరింతగా వ్యాపిస్తే వాటి మనుగడే ప్రశ్నార్థకమవుతుందంటూ.. రక్షణకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ పలు సూచనలు చేసింది. "ఆయా తెగల నివాసాల వద్దకు వెళ్లి తరచూ ఆర్టీ-పీసీఆర్ పరీక్షలు నిర్వహించాలి. సంచార బృందాలను పంపి 50 వేల లోపు ఉన్న తెగల్లోని వారందరికీ 60 రోజుల్లోపు వ్యాక్సినేషన్ పూర్తిచేయాలి. వారికి కొవిడ్ మెడికల్ కిట్లు అందజేయాలి. ఆ తెగల సమీపంలోని వారికి కరోనాపై స్థానిక భాషల్లో అవగాహన కల్పించాలి. మెడికల్ కిట్లు అందించే క్రమంలో ఇతరుల నుంచి కరోనా వ్యాప్తి చెందకుండా డ్రోన్లను వినియోగించాలి. వారు నివసిస్తున్న ప్రాంతాలకు దగ్గరలో ప్రత్యేకంగా వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలి. ఆయా తెగల నివాస ప్రాంతాల్లోకి ఇతరుల రాకపోకలు లేకుండా కఠినమైన ఆంక్షలు అమలు చేయాలి. మహమ్మారి తీవ్రతపై ఆయా తెగల పెద్దలు, వారిలో అక్షరాస్యత కలిగిన వారికి, వారి దగ్గరకు వెళ్లే వాలంటీర్లు, ఆశా కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులకు అవగాహన కల్పించాలి. ఇళ్ల వద్దకు రేషన్, ఆహార బుట్టలు పంపించాలి. వారికోసం 24 గంటలు పని చేసేలా జిల్లా కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలి. వీటి అమలుకు జిల్లాల కలెక్టర్లను నోడల్ అధికారులుగా నియమించాలి" అని ఎన్‌హెచ్‌ఆర్‌సీ సూచించింది. ఈ సిఫార్సుల అమలుపై నివేదిక ఇవ్వాలని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖను ఆదేశించింది.

టీకాలు లేనప్పుడు 'చిరాకెత్తించే' ఆ డయలర్ టోన్ ఎందుకు?

ప్రజలు టీకాలు వేయించుకోవాలన్న కేంద్ర ప్రభుత్వ డయలర్ టోన్‌పై దిల్లీ హైకోర్టు మండిపడింది. "సెల్‌ఫోన్‌తో ఎవరికైనా కాల్ చేసినప్పుడు 'చిరాకెత్తించే' ఈ సందేశం వస్తోంది. సరిపడా వ్యాక్సిన్లు లేనప్పటికీ ఈ సందేశాన్ని ఇస్తున్నారు" అని జస్టిస్ విపిన్ సంఘి, జస్టిస్ రేఖా పల్లిలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. టీకాలే లేనప్పుడు ప్రజలు వాటిని ఎలా పొందగలరని ప్రశ్నించింది. "వ్యాక్సిన్లను అందరికీ ఇవ్వాలి. డబ్బు తీసుకొనైనా అందించాలి. చిన్నపిల్లలను అడిగినా అదే చెబుతున్నారు" అని వ్యాఖ్యానించింది. ఒకటే సందేశం కాకుండా మరిన్ని సందేశాలను పెట్టాలని సూచించింది. ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు, సిలిండర్లు, టీకాలు వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చిన్నపాటి టీవీ కార్యక్రమాలను రూపొందించాలని యాంకర్లకు సూచించింది. వాటిని అన్ని చానళ్లలో ప్రసారం చేయాలంది. ఇందుకోసం అమితాబ్ బచ్చన్ వంటి ప్రముఖుల సాయం తీసుకోవాలని సూచించింది.

వ్యాక్సిన్ పాస్‌పోర్ట్ ఉండాల్సిందే!

వ్యాక్సిన్ పాస్‌పోర్ట్ అంటే వ్యాక్సినేషన్ తీసుకున్నట్లు ఇచ్చే ఓ సర్టిఫికెట్ మాత్రమే.. దీన్ని పాస్‌పోర్ట్, వీసాతో పాటు ఎయిర్‌పోర్టుల్లో చూపించాల్సి ఉంటుంది. కరోనా వ్యాక్సిన్ వచ్చిన తర్వాత ఈ పదాన్ని మనం ఎక్కువగా వింటున్నాం కానీ ఈ సర్టిఫికెట్ విధానం ఎప్పటి నుంచో ఉంది. సాధారణంగా ఆఫ్రికా దేశాలకు చెందిన వ్యక్తులు అమెరికా, లేదా భారత్ వంటి దేశాలకు రావాలనుకుంటే అక్కడి ప్రజలకు ఎక్కువగా వచ్చే ఎల్లోఫీవర్ వంటి వ్యాధులు రాకుండా వ్యాక్సిన్ వేయించుకున్నట్లు సర్టిఫికెట్ చూపించాల్సి ఉంటుంది. ఇప్పుడు ప్రపంచంలోని చాలా దేశాలు తమ దేశంలోకి ఇతర దేశాల వ్యక్తులను అనుమతించే ముందు తప్పక అడుగుతున్న డాక్యుమెంట్ వ్యాక్సిన్ పాస్‌పోర్ట్. ఇజ్రాయెల్ మొట్టమొదటగా ఈ సర్టిఫికేషన్‌ని తీసుకొచ్చింది. వ్యాక్సిన్ తీసుకున్న వారు ఈ డాక్యుమెంట్‌ని చూపించడం ద్వారా కొన్ని ఈవెంట్లకు హాజరు కావడం, కొన్ని సౌకర్యాలు పొందేందుకు వీలుంటుంది. ఇజ్రాయెల్ రెస్టారెంట్లు, జిమ్స్, హోటల్స్ వంటివాటికి అనుమతి కోసం తమ దేశంలోని వ్యక్తులు ఇతర దేశాలకు ప్రయాణం చేయడం కోసం ఈ వ్యాక్సిన్ పాస్‌పోర్ట్‌ని అందించడం ప్రారంభించింది. సర్టిఫికెట్ రూపంలో లేదా డిజిటల్ డాక్యుమెంట్ రూపంలో ఉంటుంది. ఈ పాస్‌పోర్ట్ చూపిస్తే చాలా దేశాలు ఇప్పుడు క్వారంటైన్ అవసరం లేదని చెబుతున్నాయి.

మనకు ఎలాంటి పాస్ పాస్‌పోర్ట్ అందుబాటులో ఉన్నాయి?

ఇజ్రాయెల్ ప్రభుత్వం అందిస్తోన్న సర్టిఫికెట్లలా చాలా సంస్థలు, ఎన్ జీవోలు అంతర్జాతీయ ప్రయాణాల కోసం వ్యాక్సీన్లు వేసి వ్యాక్సిన్ పాస్‌పోర్ట్‌లను అందిస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా ఎయిర్‌లైన్స్ ని అనుసంధానం చేసే ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ ట్రావెల్ పాస్ పేరుతో ఓ యాప్‌ని తయారుచేస్తోంది. ఎయిర్ లైన్స్, ఏవియేషన్ ఇండస్ట్రీలో పనిచేసే ప్రతి వ్యక్తికి తమ వ్యాక్సినేషన్ ప్రూఫ్‌ని, దాని వాలిడిటీని చూపించేందుకు ఒక కామన్ యాప్ అందుబాటులోకి వస్తుంది. దీని ద్వారా ప్యాసెంజర్ వ్యాక్సినేషన్ రికార్డును యాప్ రూపంలో తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. వాషింగ్టన్ పోస్ట్ కథనం ప్రకారం న్యూయార్క్, బోస్టన్, లండన్, హాంగ్‌కాంగ్ వంటి ప్రదేశాలకు వెళ్లేందుకు కామన్ పాస్ టెస్టింగ్‌ని వెరిఫికేషన్‌గా చాలామంది ప్రయాణికులు ఉపయోగించారట.

ఇవి ఎవరికి ఉపయోగపడతాయి?

వ్యాక్సిన్ పాస్ పోర్టుల ముఖ్యోద్దేశం టూరిజం, హోటల్ పరిశ్రమలకు సహాయపడడమే. కరోనా లాక్‌డౌన్ వల్ల ఈ రెండు రంగాలు చాలా ప్రభావితమయ్యాయి. అంతర్జాతీయ ప్రయాణాలు, హోటల్ బుక్సింగ్ అన్నీ తగ్గిపోయాయి. ఈ వ్యాక్సిన్ పాస్‌పోర్ట్ ద్వారా ఇవి ఉన్నవారిని దేశాలు తమ దేశంలోకి అడుగుపెట్టేందుకు అవకాశం కల్పిస్తే ఈ రంగాలు కోలుకునే అవకాశం ఉంది. అయితే ప్రతి దేశానికీ ఈ వ్యాక్సిన్ పాస్‌పోర్టులు అందించేందుకు తమదైన ప్రత్యేక వ్యవస్థ ఉండడం, వాటికి తగినట్లే ఆధారాలను అందించడం ద్వారా అవి వేరే దేశాలు ఒప్పుకోకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

దీనిపై అభ్యంతరాలూ ఉన్నాయి..

అంతర్జాతీయ ప్రయాణాలు చేసేందుకు ప్రూఫ్‌గా వ్యాక్సిన్ పాస్‌పోర్టులను ఉపయోగించడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తోంది. ప్రస్తుతం వ్యాక్సిన్ ఎంత ప్రభావవంతంగా పనిచేస్తుందన్న విషయం మనకు పూర్తిగా తెలీదు. వ్యాక్సిన్ వేసుకోవడం వల్ల వారి నుంచి ఇతరులకు ఆ వైరస్ వ్యాపించదు అన్న సంకేతాలు ఇంకా శాస్త్రవేత్తల నుంచి రాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ వ్యాక్సిన్ పాస్‌పోర్ట్‌లను అంతర్జాతీయ ప్రయాణాల కోసం ఇతర దేశాల నుంచి దేశంలోకి అడుగుపెట్టేందుకు, తమ దేశం నుంచి ఇతర దేశాలకు వెళ్లేందుకు తప్పనిసరి చేయడం వల్ల ఫలితాలు ఎలా ఉంటాయో ఊహించలేం. దీనితో పాటు ప్రస్తుతం వ్యాక్సిన్ల లభ్యత చాలా తక్కువగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో అంతర్జాతీయ ప్రయాణాలకు వెళ్లేందుకు వీటిని తీసుకోవడం ప్రారంభిస్తే అవి నిజంగా అవసరమైన వ్యక్తులకు అందడం ఆలస్యం అవుతుంది. హైరిస్క్ ఉన్నవారికి అవి అందడం ముందుగా జరగాల్సిన ప్రక్రియ. పైగా ఇవి కేవలం డిజిటల్ మోడ్ లో ఇవ్వడం వల్ల వివిధ సంస్థలు ప్రయాణికులు ఎక్కడెక్కడికి వెళ్లారు అన్న విషయం తెలుసుకునే వీలుంటుంది కాబట్టి దీనివల్ల ప్రైవసీ సమస్యలు వచ్చే అవకాశం ఉందని కూడా నిపుణులు భావిస్తున్నారు.

నిరుద్యోగ సమస్యకు ఆజ్యం

కరోనా సంక్షోభంలో అనేక సంస్థలు ఆర్థిక ఒడుదొడుకులను ఎదుర్కొంటూ, తీవ్ర నష్టాలను చవిచూస్తున్నాయి. భారాన్ని తగ్గించుకోవడానికి ఉద్యోగులను తొలగించడం, వేతనాల్లో కోత విధించడంవంటి చర్యలు చేపడుతున్నాయి. ఇప్పటికే దేశాన్ని పట్టి పీడిస్తున్న నిరుద్యోగ సమస్యకు- ఈ పరిస్థితి ఆజ్యం పోస్తోంది. ప్రభుత్వం పేదవారి ఆకలి తీర్చడానికి ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా కొన్ని నిత్యావసర సరకులను అందజేస్తున్నప్పటికీ, అవి అందరికీ సరిపోవడంలేదు. పిల్లల చదువులు, వైద్య ఖర్చులు వంటి అవసరాలకు సరిపడా ఆర్థిక వనరులు లేక తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. కొన్ని నెలలుగా మెల్లగా కోలుకుంటున్న ఉపాధిరంగంపై- కొవిడ్ రెండో దశ వ్యాప్తితో తీవ్ర ప్రతికూల ప్రభావం కనిపిస్తోంది. అనేక రాష్ట్రాల్లో అమలు చేస్తున్న కఠినతరమైన కొవిడ్ నిబంధనలు, పాక్షిక లాక్‌డౌన్‌లతో నిరుద్యోగం కనీసం పదిశాతం మేర పెరిగినట్లు అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

నైపుణ్య శిక్షణ అవసరం

అసంఘటిత రంగంలో పనిచేసే లక్షలాది ప్రజల ఆర్థిక పరిస్థితిలో గత ఏడాది కాలంగా పురోగతి లేకపోగా, తిరోగమనం కనిపిస్తోంది. కేంద్ర కార్మిక శాఖ లెక్కల ప్రకారం ఈ ఏడాది మార్చి తొమ్మిదో తేదీ వరకు ఉద్యోగ అవకాశాలను ప్రోత్సహించడానికి ప్రారంభించిన ఆత్మనిర్భర్ భారత్ ద్వారా సుమారు 16.5 లక్షలమంది కార్మికులు లబ్ధి పొందారు. పీఎంజీకేవై కింద 38.82 లక్షల మంది ఉద్యోగుల ఈపీఎఫ్ ఖాతాల్లో రూ.2,567.66 కోట్లు జమ చేసినట్లు ప్రకటించారు. ఉపాధి హామీ పథకం సైతం కరోనా కష్టకాలంలో గ్రామీణ

ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించడంలో కీలక పాత్ర పోషించింది. ఈ పథకం ద్వారా నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను పెద్దయెత్తున చేపడితే నిరుద్యోగ సమస్యను కొంతవరకు ఎదుర్కోవచ్చు. 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ' అంచనాల ప్రకారం భారత్‌లో 4.40 కోట్లమంది నిరుద్యోగులు ఉన్నారు. వీరిలో 2.80 కోట్ల మంది ఉపాధి కోసం నిత్యం ప్రయత్నాలు చేస్తున్నారు. మిగతావారు ఉపాధిని కోరుకుంటున్నా దానికోసం తీవ్రంగా ప్రయత్నించడంలేదు. ప్రస్తుతం ఉన్న నిరుద్యోగుల్లో 3.80 కోట్లమంది యువకులే. పట్టణాల నుంచి గ్రామాలకు వెళ్లే శ్రామికుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ ఉండటంతో నిరుద్యోగ సమస్య మరింత జటిలమయ్యే ప్రమాదమూ ఉంది.

ఈ సంక్షోభ సమయంలో నిరుద్యోగులను ఆదుకోవడానికి ప్రత్యేకమైన కార్యక్రమాలు చేపట్టవలసిన అవసరం ఉంది. ప్రభుత్వ శాఖల్లో అన్ని రకాల ఉద్యోగాల ఖాళీలనూ వేగంగా భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. ప్రైవేటు రంగంలో ఉపాధి కల్పనకు అవసరమైన ప్రోత్సాహకాలను ఇవ్వాలి. స్వయం ఉపాధి కోసం ప్రయత్నించే నిరుద్యోగులకు ఆర్థిక సహాయం అందించాలి. అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, శిక్షణను కల్పించాలి. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి స్వయం ఉపాధికోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై విస్తృతమైన అవగాహన కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంది. స్వయం ఉపాధిని పెంపొందించే పనులకు పెద్ద పీట వేయాలి. నూతన ఆవిష్కరణలకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి. ఉపాధి కల్పన పెరిగితే దేశ ఆర్థికాభివృద్ధి రేటు సైతం ఆశించినదానికన్నా మెరుగ్గా ఉంటుంది. వలస కార్మికులకు సంబంధించిన పూర్తి స్థాయి వివరాల్ని స్థానిక ప్రభుత్వాలు విధిగా నమోదు చేసి, ప్రభుత్వ రికార్డుల్లో పొందుపరచాలి. దీనివల్ల శ్రామికులకు అవసరమైన సహాయాన్నినేరుగా అందించడానికి అవకాశం ఉంటుంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరకులు అందరికీ అందేలా చూడాలి. గత సంవత్సరం కరోనా సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి- జన్‌ధన్ ఖాతా కలిగిన మహిళలకు ఆర్థిక సహాయాన్ని ప్రకటించినట్లుగానే... ఇప్పుడూ ఆర్థిక సహాయాన్ని సమకూర్చాలి. ప్రజలందరికీ టీకా వేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి.

ఏప్రిల్‌లో 73.5 లక్షల ఉద్యోగాలు హుష్‌కాకి

కొవిడ్ లాక్‌డౌన్‌ల కారణంగా ఏప్రిల్ నెలలో నిరుద్యోగ రేటు 8 శాతానికి చేరిందని సీఎమ్ఐఈ (సెంటర్ ఫర్ మోనటరింగ్ ఇండియన్ ఎకానమీ) పేర్కొంది. మార్చిలో ఇది 6.5 శాతంగా ఉంది. కార్మిక సిబ్బంది సంఖ్య 11 లక్షలు తగ్గి 42.46 కోట్లకు చేరగా.. ఉద్యోగుల సంఖ్య 73.5 లక్షలు తగ్గి 39.8 కోట్ల నుంచి 39.079 కోట్లకు పరిమితమైనట్లు సీఎమ్ ఐఈ తెలిపింది. నిరుద్యోగుల (పనిచేయడానికి సిద్ధంగా ఉన్నా.. ఎటువంటి పనీ దొరకని వారు) సంఖ్య మార్చితో పోలిస్తే 62 లక్షల పెరిగి 3.39 కోట్లకు చేరుకుందని వివరించింది.

వైద్యరంగంపై ప్రజల ఖర్చు రూ. 3 లక్షల కోట్లు!

ప్రభుత్వ లెక్కల ప్రకారం దేశ జనాభాలో కొవిడ్ సోకినవారు 2 శాతం ఉండవచ్చు అనుకుంటే ఆ సంఖ్య 2 కోట్ల 60 లక్షలు. చాలామంది ఆసుపత్రుల్లో లక్షలకు లక్షలు బిల్లు చెల్లించినవారున్నారు. సగటున రూ. 5 లక్షల వరకు ఖర్చు చేసిన బాధితులు 20 శాతంమంది ఉండొచ్చు అనుకుంటే వారి సంఖ్య 52 లక్షలు. అంటే వీరంతా వైద్యం కోసం 2.6 లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఉంటారన్నమాట.

వీరుకాక మిగిలిన 80 శాతం రోగులు 2 కోట్ల 8 లక్షలమంది. వారంతా సగటున మందుల కోసం పది వేల రూపాయలైనా ఖర్చు చేసి ఉంటారని అంచనా వేస్తే ఆ మొత్తం ముప్పై వేల కోట్ల రూపాయలు! అంటే మొత్తంగా.. మూడు లక్షల కోట్ల రూపాయల సొమ్ము ప్రజల జేబుల్లోంచి వైద్య రంగం వైపు మళ్లి ఉండొచ్చనేది అనధికారిక అంచనా.!

ద్రవ్యోల్బణం.. ధరలపై ప్రభావం

కరోనా ఫలితంగా ధరల పెరుగుదల, ఆసుపత్రులు, వైద్య ఖర్చుల కారణంగా ఈ ఏడాది ప్రజలపై రూ.66 వేల కోట్ల మేర అదనపు భారం పడనున్నట్లు ఎస్‌బీఐ ఆర్థిక పరిశోధనా విభాగం అంచనా వేసింది. ద్రవ్యోల్బణం పెరుగుదల కారణంగా ధరలపై ప్రభావం చూపి రూ.15 వేల కోట్లు, ఆసుపత్రుల కోసం రూ.35 వేల కోట్లు, ఆదాయం తగ్గిపోవడం వల్ల రూ.16 వేల కోట్ల భారాన్ని ప్రజలు భరించాల్సి వస్తున్నట్లు తెలిపింది. 2020 ఆర్థిక సంవత్సరంలో వైద్యఖర్చు రూ.6 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 11% అదనం అని అభిప్రాయపడింది. వైద్యఖర్చులు పెరగడంతో సాధారణ వినియోగ ధరల సూచిలో వైద్య ద్రవ్యోల్బణం

సగటు వాటా పెరుగుతుంది. కొవిడ్ కారణంగా ఆసుపత్రుల్లో చేరేవారి సంఖ్య బాగా పెరిగింది. ప్రస్తుతం నడుస్తున్న సరళిని బట్టి, వైరస్ బారిన పడ్డ వారిలో కనీసం 30% మంది ఆసుపత్రుల్లో చేరుతున్నారు. అందులో కనీసం 30% మంది ప్రైవేటు ఆసుపత్రులను ఎంచుకుంటున్నారు. ఇందులో ఒక్కోరికి కనీసం రూ.1.50 లక్షల ఖర్చయినట్లు పరిగణలోకి తీసుకున్నప్పటికీ మొత్తం భారం రూ.35వేల కోట్ల మేర ఉంటుంది. కరోనా కారణంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోవడంవల్ల కుటుంబ తలసరి ఆదాయం దాదాపు రూ.8,637 మేర తగ్గతున్నట్లు అంచనా వేసింది. ప్రైవేటు, అసంఘటిత రంగ కార్మికులపై దీని ప్రభావాన్ని కనిష్ఠస్థాయిలో లెక్కించినా రూ.16వేల కోట్లమేర ఆదాయం కోల్పోయినట్లు కనిపిస్తోంది. 2020 ఆర్థిక సంవత్సరంలో పీఎఫ్‌సీఈ (ప్రైవేటు ఫైనాన్షియల్ కన్సంప్షన్ ఎక్స్‌పెండీచర్) వాటాను పరిగణనలోకి తీసుకొని, దాన్ని ప్రస్తుత వినియోగధరల సూచీతో సర్దుబాటుచేసి చూస్తే కనీసం దాదాపు రూ.15వేల కోట్ల అదనపు భారం పడుతున్నట్లు కనిపిస్తోంది. ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. ఇప్పటికే ఖర్చులు పెరిగిన కుటుంబాలపై ఈ ఆదాయ నష్టం అదనపు భారం. దీనివల్ల ఈ కుటుంబాలు ఇతర ఖర్చులను తగ్గించుకొని ఆ మొత్తాన్ని వైద్య ఖర్చుల కోసం మళ్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇమ్యూనిటీ కోసమే రూ. 15 వేల కోట్లు?

ఎస్‌బీఐ అంచనాలు అలా ఉండగా మరికొన్ని రిపోర్టులు మరొకలా ఉన్నాయి. అసలు మందుల కోసంమే ప్రజలు ఎన్నడూ లేనంతగా ఖర్చుపెట్టారని తెలుస్తోంది. దేశ ప్రజలు 2020 జూన్ నుంచి 2021 మే మధ్య కాలంలో రోగనిరోధక శక్తి పెంపుదలకు ఉపయోగించే విటమిన్స్ తదితర మందుల కోసం రూ. 14,587 కోట్లు వెచ్చించారు. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇది 20 శాతం అదనం అని 'ఎకనామిక్స్ టైమ్స్' పత్రిక అంచనా వేసింది. అలాగే ఫావిపిరావిర్ మందు కోసం రూ. 1,220 కోట్లు, రెమ్‌డెసివిర్ ఇంజక్షన్ల కోసం రూ. 833 కోట్లు ఖర్చుపెట్టారు. అజిత్రోమైసిన్ అమ్మకాలు రూ. 992 కోట్ల మేర జరిగాయి. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇది 38 శాతం అదనం.

లాక్‌డౌన్ కాలంలో 56 లక్షల మంది రోగనిరోధకశక్తిని పెంచుకోవడం కోసం ఇంటర్నెట్‌లో ఆరోగ్య సంబంధమైన సమాచారం కోసం వెతికారు.

అప్పుల కోసం పడిగాపులు!

పెద్దగా ఆర్థిక ఇబ్బందులు లేకున్నా.. బ్యాంకు ఖాతాలో నిల్వలు ఫర్వాలేదనిపించినా.. జనం అప్పుల కోసం పరుగులు తీస్తున్నారు. కరోనా సృష్టిస్తోన్న కల్లోలంలో రేపటి గురించిన ఆందోళన పెరుగుతోంది. కుటుంబ అవసరాలకు డబ్బు ఉన్నా.. భవిష్యత్ కలవర పెడుతోంది. ముమ్ముందు అప్పు దొరకదనే ఉద్దేశంతో కొన్ని చోట్ల మధ్యతరగతి కుటుంబాలు రుణాల బాట పడుతున్నారు. అబిడ్స్‌లోని కార్పొరేట్ బ్యాంకులో వ్యక్తిగత/తాకట్టు రుణాలు

ఏప్రిల్‌లో 10-15 శాతం వరకూ పెరిగినట్లు బ్యాంక్ ఏజెంట్ తెలిపారు. 'మొన్నటి వరకూ ఫోన్ చేసి వ్యక్తిగత రుణం కావాలా.. అని అడిగితే చిరాకు పడిన ఖాతాదారులు కూడా దరఖాస్తు చేస్తున్నార'ంటూ ఫిలింనగర్‌కు చెందిన బ్యాంకు మేనేజర్ ఒకరు తెలిపారు.

దీపక్ భవన నిర్మాణ సంస్థలో ఉన్నత ఉద్యోగి. వార్షిక వేతనం రూ.8-9 లక్షల వరకూ వస్తుంది. సొంతూర్లో తల్లిదండ్రుల బాధ్యతతో పాటు కూతురు(8), కుమారుడు(2) ఉన్నారు. గతేడాది కరోనాతో తండ్రి కూతుళ్లు హోం ఐసోలేషన్ చికిత్స తీసుకుని బయట పడ్డారు. క్షేత్రస్థాయి విధులు కావటంతో రోజూ తప్పనిసరిగా కార్మికులు, ఇంటి యజమానులతో మాట్లాడాల్సిందే. ఇంట్లో పిల్లలు ఉన్నారనే ఉద్దేశంతో తాను వేరే గది తీసుకుని ఉంటున్నాడు. రెండేళ్ల క్రితమే ఇల్లు కొనుగోలు చేయటంతో బ్యాంకు రుణానికి నెల వాయిదాలు తప్పనిసరిగా మారాయి. ప్రస్తుతం నెలకొన్న ప్రతికూల పరిస్థితులను అధిగమించేందుకు భార్య నగలు తాకట్టు పెట్టి రూ.4 లక్షల వరకూ అప్పు పొందారు. కొన్ని కళాశాలలు వచ్చే విద్యా సంవత్సరం ఫీజులు ముందుగానే చెల్లించమంటూ ఒత్తిడి ప్రారంభించాయి. బోడుప్పల్‌కు చెందిన చిరుద్యోగి అంజన్నకు పదోతరగతి పూర్తి చేసిన కూతురును ఇంటర్‌లో చేర్చేందుకు సిద్ధమయ్యాడు. గతేడాది కొవిడ్ నుంచి బయటపడేందుకు చేసిన రూ.2.5 లక్షలు అప్పు తీర్చకుండానే మళ్లీ పిల్లల చదువు కోసం ప్రావిడెంట్ ఫండ్/బ్యాంకు రుణానికి దరఖాస్తు చేసినట్లు తెలిపారు. 'వడ్డీ చెల్లింపు అదనపు భారమైనా ముమ్ముందు ఎలా ఉంటుందనేది అంచనా వేయలేం. అప్పుడు ఆపద ముంచుకొస్తే దిక్కులు చూడాల్సి ఉంటుంద'నే ఉద్దేశంతోనే భారమైనా రుణం తీసుకున్నట్లు తెలిపారు. కొవిడ్ ఎటు వైపు నుంచి మీద పడుతుందోననే అయోమయంలో ఆర్థిక కష్టాలను అధిగమించేందుకు అప్పుల కోసం పరుగులు తీస్తున్నారు.

అత్యవసర వైద్యం కోసమే?

'రెండు నెలలుగా వ్యక్తిగత రుణాలు కావాలనే వారు పెరిగారు. క్షేత్ర స్థాయిలో తనిఖీకు వెళ్లినపుడు వివాహం/ గృహ మార్పుల కోసమంటూ ఖాతాదారులు చెబుతున్నారు. నేను పరిశీలించిన కొన్ని చోట్ల.. కొవిడ్‌కు గురై ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన వారు ఉన్నారని' ఓ బ్యాంకు ఉద్యోగి వివరించారు. 2-3 రోజుల వ్యవధిలో సొమ్ములు చేతికొచ్చే అవకాశం వ్యక్తిగత రుణాలకే ఉంటుంది. బ్యాంకు ఖాతాదారుల్లో అధిక శాతం మెడికల్ ఎమర్జెన్సీ కోసమే రుణానికి దరఖాస్తు చేస్తున్నారని తెలిపారు. ప్రతి నెలా బ్యాంకు తనకు ఇచ్చిన లక్ష్యాన్ని మించిన రుణాలు మార్చి, ఏప్రిల్ నెలల్లో ఇప్పించానంటూ కార్పొరేట్ బ్యాంకు ఏజెంట్ ఒకరు తెలిపారు. విలువైన ఆభరణాలు, భూములు ఉన్న వారు.. తనఖా రుణాలు తీసుకుంటున్నారు.

వివాహాలకూ.. వ్యాపారాలకూ బ్రేక్

మూఢం వెళ్లిపోయింది.. కానీ మహమ్మారి ఇక్కడే తిష్ఠవేసింది. ముహూర్తాలు వచ్చేశాయి. కానీ కరోనా వాటికంటే ముందే వచ్చేసింది. చలువ పందిళ్లు... మామిడాకుల తోరణాలు... చేతులకు గోరింటాకులు.. బాజా భజంత్రీలు.. ఇవేవీ ఇప్పట్లో కనిపించేలా లేవు. ఇంట్లో పెళ్లికళ వస్తుందని ఎదురుచూస్తున్న వారంతా హతాశులవుతున్నారు. పెళ్లిళ్లు కుదుర్చుకుని వివాహ వేదికలు సిద్ధం చేసుకున్నవారు అయోమయంలో ఉన్నారు.

కరోనా రెండోదశ కేసులు పెరిగిపోతూ ప్రమాదకర వాతావరణం ఏర్పడటంతో శుభకార్యాలకు అనిశ్చితి ఏర్పడింది. 2021 మే, జూన్ నెలల్లోనే రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో పెళ్లిళ్లున్నాయి. మరోవైపు గృహ ప్రవేశాలు, ఉపనయనాలు, ఆలయాల ప్రతిష్ఠలు ఇలా ఎన్నో కార్యక్రమాలు అనిశ్చితిలో ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. శుభకార్యాలపై ఆధారపడ్డ రూ. వందల కోట్ల వ్యాపారం, వీటిపై ఆధారపడిన వాళ్లంతా మళ్లీ ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్ 30తో మూఢం వెళ్లిపోయింది. ఆ తర్వాత మూడు రోజులు ముహూర్తాలు లేవు. ఆ తర్వాత నుంచి ముహూర్తాలు ఉన్నాయని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పురోహితులు సుదర్శనం వేంకట జనార్ధనాచార్యులు చెప్పారు. మధ్యలో కొన్నిరోజులు కత్తెర ఉన్నా జులై 12 వరకు ముహూర్తాలు ఉన్నాయన్నారు. ఈనెల 13, 26, 29, జులై 4 చాలా బలమైన ముహూర్తాలని ఆయన చెప్పారు.

ఇప్పటికే పెళ్లిళ్లు కుదుర్చుకుని మూహూర్తాలు నిర్ణయించుకుని వేదికలకు అడ్వాన్సులు ఇచ్చినవారు మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పెళ్లిళ్లకు ప్రభుత్వాలు ఏ స్థాయిలో అనుమతిస్తాయో అర్థం కావడం లేదని అనేకమంది వాపోతున్నారు. పశ్చిమగో

దావరి జిల్లా భీమవరం సమీపంలోని ఒక రైతు కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ముల పిల్ల లకు ఈనెల 23, 29 తేదీల్లో పెళ్లిళ్లు జరగాల్సి ఉంది. ఒకటి భీమవరంలో, మరొకటి హైద రాబాద్‌లో అనుకుని... భారీగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పుడేం చేయాలో అర్థం కావ ట్లేదని వారు చెబుతున్నారు. ఆ సమయానికి కరోనా తగ్గుతుందా, ఇంకా పెరుగుతుందా అన్న ఆందోళనతో ఉన్నారు. కిందటి ఏడాది నవంబరులో పెళ్లిళ్లు కొంతవరకు ఇబ్బందులు లేకుండా జరిగాయి. తర్వాత మూఢం వచ్చి అన్నీ ఆగిపోయాయి. మూఢం వెళ్లాక చేద్దా మని.. కొందరు తల్లిదండ్రులు మే నెలకు తమ పిల్లల పెళ్లిళ్లు వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు అంతకుమించి మరీ ఇబ్బందులు ఉన్నాయని చెబుతున్నారు. స్థానికంగా జరిగే పెళ్లిళ్లు తక్కువ మంది అతిథులతో జరిగిపోతాయని, అమెరికా సంబంధాల విషయంలోనే బాగా ఇబ్బంది ఉందని, అక్కడి నుంచి వచ్చి ఇక్కడ పెళ్లిళ్లు చేసుకునేందుకు ఏర్పాట్లు చేసు కున్నవారు వాయిదా వేసుకుంటున్నారని రెండు తెలుగు రాష్ట్రాల్లో పెళ్లిళ్లు కుదిర్చే ఒక మ్యారేజి బ్యూరోలో సేవలందించే స్రవంతి చెప్పారు. .

సామాజిక మాధ్యమాలే వేదిక!

'కొవిడ్ ఆంక్షల నేపథ్యంలో నా వివాహానికి ఎవర్ని ఆహ్వానించడం లేదు. బంధుమి త్రులు, శ్రేయోభిలాషులు.. సామాజిక మాధ్యమాల వేదికగా పెళ్లిచూసి ఆశీర్వదించండి' - పెళ్లిపీటలు ఎక్కనున్న ఓ వరుడు.. ఫేస్‌బుక్‌లో చేసిన పోస్ట్ ఇది. అతనొక్కడే కాదు.. చాలామంది ఈ విధంగానే పెళ్లి తంతు జరిపించేందుకు సిద్ధమయ్యారు. కొన్నిచోట్ల రెవెన్యూ, పోలీసు అధికారులు శుభకార్యాలపై ఓ కన్నేసి ఉంచారు. దీంతో పెళ్లింటివారు. . సాంకేతికత బాటపడుతున్నారు. యూట్యూబ్, ఫేస్‌బుక్, జూమ్ తదితర వేదికలపై వేడు కలను వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. బంధుమిత్రులకు సంబంధిత లింకులు పంపుతు న్నారు. పరిస్థితులు కుదుటపడ్డాక విందు చేసుకుందామని సూచిస్తున్నారు.

అబ్బాయిది ఆంధ్ర, అమ్మాయిది తెలంగాణ. ఇద్దరూ అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా కోటగిరికి చెందిన కొత్తపల్లి కృష్ణారావు, వాణిశ్రీ దంపతుల కుమార్తె కొత్తపల్లి తనూజ, గుంటూరుకు చెందిన రవి, పద్మ దంపతుల కుమారుడు కృష్ణ తేజ.. అమెరికాలో ఎంఎస్ చేసి ఇద్దరూ అక్కడే స్థిరపడ్డారు. ఇరు కుటుంబాల వారు తనూజ, కృష్ణతేజలకు వివాహం జరిపించేందుకు నిర్ణయించారు. కానీ కరోనా వైరస్ వ్యాప్తితో అంతర్జాతీయ విమానాలు తిరిగే పరిస్థితి లేకపోవడంతో వధూవరులు స్వదేశానికి రాలేకపోయారు. అయినా అనుకున్న ముహూర్తానికే అమెరికాలోని ఇండియన్ కాన్సులేట్ సెంటర్‌లో ఆదివారం జరిగిన వివాహ వేడుకల్లో వధూవరులు ఒక్కటయ్యారు. ఈ వివాహాన్ని వధూవరుల తల్లిదండ్రులు, బంధుమిత్రులు ఎల్ఈడీ స్క్రీన్‌ప్లే ఈ వేడుకను వీక్షించి ఆశీర్వదించారు.

అక్కడ పూజారి.. ఇక్కడ అబ్బాయి, అమ్మాయి

మెదక్ జిల్లా పాపన్నపేట మండలం సోంలా తండాకు చెందిన మంజులకు.. టేక్మాల్ మండలం బీంలా తండాకు చెందిన మోహన్‌కు ఇచ్చి పెళ్లి చేసేందుకు ముహూర్తం నిర్ణయించారు. సోంలా తండాలో ఓ వ్యక్తి కరోనాతో మృతి చెందడంతో అక్కడ పెళ్లి చేయడానికి పాపన్నపేటకు చెందిన పురోహితుడు దిగంబరాచార్యులు నిరాకరించారు. ఈ క్రమంలో వారంతా చర్చించుకొని అదే రోజు ప్రత్యామ్నాయ మార్గంలో వివాహం చేసేందుకు ముందుకొచ్చారు. వివాహ వేదికను బీంలా తండాకు మార్చారు. పురోహితుడు తన ఇంటి నుంచి చరవాణిలో వీడియో కాల్ ద్వారా పెళ్లి మంత్రాలు చదవగా.. అది వింటూ వధూవరులు పెళ్లి తంతు పూర్తి చేశారు.

మహమ్మారి భయంతో మళ్లీ బాల్యవివాహాలు

కరోనా మహమ్మారి భవిష్యత్తుపై ఆశలను చిదిమేస్తోంది. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేయాలన్న చిన్నారుల ఆశలు అడియాసలవుతున్నాయి. ఒకవైపు కరోనా భయం.. మరోవైపు లాక్‌డౌన్‌లతో కుటుంబ ఆర్థిక పరిస్థితులు తలకిందులు కావడంతో పేద తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్నతనంలోనే పెళ్లిపీటలు ఎక్కిస్తున్నారు. ఒకప్పుడు మూఢనమ్మకాలు, లేదా కన్యాశుల్కం.. అదీకాదంటే మధ్యయుగాల నాటి అరాచకాలు, అత్యాచారాల కారణంగా మనదేశంలో బాల్య వివాహాలు ఎక్కువగా జరిగేవి. కరోనా మహమ్మారి మళ్లీ అలాంటి తీవ్రమైన పరిస్థితులను తీసుకువచ్చినట్లు కనిపిస్తోంది. ఈ వైరస్ ఒకరికి సోకితే చాలు కుటుంబాలకు కుటుంబాలే కల్లోలంలో చిక్కుకోవడం.. లేదా కుటుంబ పెద్దలు కన్నుమూస్తున్న పరిస్థితులు గ్రామీణంలోని పేద, బడుగువర్గాల వారిని మళ్లీ బాల్యవివాహాల వైపు తరుముతున్నాయి. తాము లేకపోతే పిల్లల పరిస్థితి ఏమిటనే

ఆందోళనతో చాలామంది గ్రామీణులు పసివయసులోనే ఆడపిల్లలను పెళ్లి పీటల మీదకు ఎక్కిస్తున్న దయనీయ పరిస్థితులు కనిపిస్తున్నాయి. గత ఏడాది కాలంలో బాల్యవివాహాలపై నమోదైన కేసులే ఇందుకు నిదర్శనం! పరిమిత సంఖ్యలో బంధువుల సమక్షంలో శుభకార్యాలు చేయాలన్న నిబంధన కూడా ఉండడంతో తక్కువ ఖర్చుతో బాధ్యతల నుంచి బయటపడవచ్చనే ఉద్దేశంలో కొందరు ఇప్పుడే పెళ్లిళ్లు చేసేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు చూడలేక, తల్లిదండ్రుల మాటను కాదనలేక చిన్నారులు తలవంచుతున్నారు. 2017 ఆగస్టు నుంచి 2019 అక్టోబరు వరకు దాదాపు రెండేళ్లలో 157 కేసులు మాత్రమే నమోదు కాగా 2020 ఏప్రిల్ నుంచి 2021 మార్చి వరకు ఏడాది కాలంలోనే 693 బాల్య వివాహాల కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది. ముఖ్యంగా వెనుకబడిన జిల్లాలైన వనపర్తి, గద్వాల, వికారాబాద్, నాగర్ కర్నూలు, నారాయణపేటలలో ఇలాంటి కేసులు ఎక్కువగా నమోదైనట్లు గణాంకాల ద్వారా తెలుస్తోంది.

కరోనా కారణంగా పాఠశాలలు మూతపడ్డాయి. ఆన్‌లైన్ చదువులున్నా పేదలకు అందుబాటులో లేవు. మున్ముందు పరిస్థితులు ఎలా ఉంటాయోనన్న భయంలో కొందరు తల్లిదండ్రులు చదువుకునే సమయంలోనే.. 18 ఏళ్లు నిండకముందే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసేస్తున్నారు. ఇలాంటివి చాలావరకు గుట్టుచప్పుడు కాకుండానే జరిగిపోతున్నాయి. అంగన్‌వాడీ, బాలల సంరక్షణ కమిటీల దృష్టికి రానీయకుండా జాగ్రత్త పడుతున్నారు. చదువుకోవాలన్న ఆశతో కొందరు బాలికలో లేదా ఇరుగుపొరుగున ఉండేవారో ఫిర్యాదు చేస్తే కానీ ఇలాంటివి వెలుగుచూడడంలేదు.

అన్నీ రాసి పెట్టుకుంటే మేలు!

ఎంత జాగ్రత్తగా ఉన్నా.. కరోనా మహమ్మారి ఎటునుంచి వచ్చి మీద పడుతోందో అర్థం కావడం లేదు. రెండో దశలో విజృంభిస్తోన్న ఈ వైరస్ కారణంగా ఎన్నో కుటుంబాలు తమ పెద్ద దిక్కును కోల్పోయాయి. లక్షల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. మరోపక్క.. కుటుంబంలోని కీలకమైన వ్యక్తికి కొవిడ్ సోకినప్పుడు.. ముఖ్యమైన బ్యాంకు ఖాతాల వివరాలు, బీమా పాలసీల పత్రాలు ఎక్కడున్నాయో తెలియక చిక్కుల్లో పడుతున్న కుటుంబ సభ్యులూ ఉన్నారు. అందుకే, ప్రతి పెట్టుబడి.. పాలసీ.. బ్యాంకు ఖాతా.. వీటన్నింటితో ఒక జాబితా సిద్ధం చేసి పెట్టుకోవడం ఎప్పుడూ అవసరం..

కరోనా ఆరోగ్యాన్నే కాదు.. ఆర్థికంగానూ దెబ్బతీస్తోంది. చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్తే.. ఎన్ని లక్షల రూపాయలు ఖర్చయ్యాయో లెక్కే ఉండటం లేదు. ఏళ్లుగా సంపాదించిన మొత్తాన్ని ఈ మహమ్మారి రోజుల్లోనే ఖాళీ చేస్తోంది. ఇలాంటి పరిస్థితులో ఆరోగ్య బీమా, జీవిత బీమా పాలసీలు ఎంతో ప్రధానంగా మారిపోయాయి. దీంతోపాటు ప్రతి ఒక్కరూ అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవడమూ ముఖ్యం. బీమా పాలసీలు ఉంటే.. ఆసుపత్రి ఖర్చులను తట్టుకోవడంతోపాటు, జరగరానిది జరిగితే... కుటుంబ సభ్యులకు ఆర్థికంగా అండగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

ఆర్థికంగా ఎంతో క్రమశిక్షణతో ఉన్నవారూ.. ఒక విషయాన్ని విస్మరిస్తుంటారు. చాలామంది ఒకటికి మించిన బ్యాంకు ఖాతాలు నిర్వహిస్తుంటారు. స్థిరాస్తులు, షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, బాండ్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు.. ఇలా అనేక పెట్టుబడి పథకాల్లో మదుపు చేస్తుంటారు. జీవిత, ఆరోగ్య బీమా పాలసీలనూ తీసుకుంటారు. తనకూ.. తన

కుటుంబానికీ ఆర్థికంగా భవిష్యత్తులో ఎలాంటి ఆర్థిక ఇబ్బందులూ రాకూడదనే ఏర్పాటే ఇదంతా.. కానీ.. ఈ వివరాలను కుటుంబ సభ్యులకు చెప్పడం అంత అవసరమా అన్నట్లు భావిస్తుంటారు. ఇలాంటి ఆలోచనలను ఇప్పుడు మార్చుకోకతప్పదు.

ఎక్కడెక్కడ..

కష్టపడి సంపాదించిన మొత్తాన్ని.. ఎన్నో చోట్ల మదుపు చేస్తుంటాం.. అవన్నీ ఎక్కడెక్కడ ఉన్నాయన్న సంగతి పెట్టిన వారికి తప్ప మూడో కంటికి తెలియకపోవడం ఎప్పుడూ ప్రమాదమే. కాబట్టి, ఈ లాక్‌డౌన్‌లో ఈ విషయాన్ని ఆలోచించండి. బ్యాంకు ఖాతా వివరాలు.. షేర్లు, మ్యూచువల్ ఫండ్ల పెట్టుబడులు, స్థిరాస్తి పత్రాలు.. ఇలా పెట్టుబడులన్నీ ఎక్కడెక్కడ ఉన్నాయి.. వాటి ప్రస్తుత విలువ ఎంత తదితర వివరాలన్నీ నమోదు చేయండి.

పాలసీల సంగతి..

తీసుకున్న జీవిత బీమా పాలసీ విలువ ఎంత? ఆన్‌లైన్‌లో తీసుకున్నారా? ఏజెంటు ద్వారా తీసుకున్నారా? ఆ పత్రాలు ఎక్కడున్నాయో ఒకసారి చూసుకోండి. లేకపోతే.. బీమా సంస్థను వెంటనే సంప్రదించండి. అన్ని పాలసీలకూ ప్రీమియం చెల్లింపు జరిగిందా.. బకాయి ఉన్నారా పరిశీలించండి. ముఖ్యంగా ఆ పాలసీలకు నామినీ ఉన్నారా చూడండి. లేకపోతే వెంటనే బీమా సంస్థకు ఆ విషయాన్ని తెలియజేయండి. క్లెయిం చేసుకోవాల్సిన సందర్భం వస్తే.. ఎవరిని, ఎలా సంప్రదించాలి? అవసరమైన పత్రాలు ఎక్కడున్నాయన్నదీ కుటుంబ సభ్యులకు తెలిసి ఉండాలి. ఉద్యోగులు తమ ఈపీఎఫ్ వివరాల్లో నామినీ పేరు ఉందా లేదా తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలి.

వీలునామా ఉంటే..

చాలామంది తమ తదనంతరం ఆస్తుల పంపకం ఎలా ఉండాలనే విషయంలో వీలునామా రాస్తుంటారు. దీన్ని రాసేందుకు ప్రత్యేక ఏర్పాటు ఏమీ అవసరం లేదు. తెల్ల కాగితంపైనా ఆస్తుల వివరాలు, ఎవరికి చెందాలి అని రాసినా సరిపోతుంది. ఇ-విల్లు సేవలను అందించే సంస్థలూ ఉన్నాయి. లాయర్‌తో రూపొందించి, ఇద్దరు సాక్షి సంతకాలతో బలపర్చవచ్చు. కుటుంబ పెద్ద తదనంతరం తన వారసులకు ఆస్తి సులభంగా బదిలీ అయ్యేందుకు ఇది తోడ్పడుతుంది. వీలునామాను ఎన్నిసార్లయినా మార్చుకునేందుకు వీలుంటుందని గుర్తుంచుకోండి.

సకల శాస్త్రాలకు పుట్టినిల్లు భారతావని



క్రీస్తుపూర్వం 6వ శతాబ్దం నుండి క్రీస్తుశకం 12 వ శతాబ్దం వరకు భారతదేశం అంతర్జాతీయ అభ్యాస ప్రదేశంగా వెలుగొందింది.

ప్రపంచంలో తొలి విశ్వవిద్యాలయం నలంద భారతదేశంలో ఉండటం మీకందరికి గర్వ కారణం కదా.

భారతీయ వైజ్ఞానిక విశేషాలను ప్రత్యేకంగా గమనించవలసిన అవసరం ఉంది. ముఖ్యంగా గణితం, ఖగోళ శాస్త్రాలలో వీరి పరిశోధనలు ఎంతో ప్రభావవంతంగా ప్రపంచాన్ని అబ్బురపరచాయి. లోహాల నుంచి బంగారాన్ని తయారుచేసే రస విద్య గురించి దేశంలో ఒకప్పుడు ఎన్నో పరిశోధనలు జరిగాయి.

పదార్థ నిర్మాణానికి పంచభూతాలు ఆధారమని నా బిడ్డలు నమ్మారు. భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశం అనేవి పంచభూతాలని గుర్తించారు.

తక్షశిల, నలంద, విక్రమశిల వంటి గొప్ప అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు ఇక్కడ ఉండేవి. మధ్యయుగ ప్రారంభ కాలంలో ఈ విశ్వవిద్యాలయాలు కుప్పకూలిన తరువాత కూడా భారతదేశం ప్రపంచానికి గణితం, సంగీతం, చదరంగం, ఆయుర్వేద, రసాయన శాస్త్రం, జ్యోతిష శాస్త్రం, పంచతంత్ర సహా మరెన్నో హిందూ గ్రంథాలను ప్రపంచానికి అందజేసింది. అంతర్జాతీయ అభ్యాస దేశంగా విలసిల్లింది.

వోల్టేర్, పియరి డి సోన్నెరేట్, షెలింగ్, జాన్ హోల్వెల్ వంటి ఐరోపాలోని చాలామంది ప్రముఖ మేధావులు భారతదేశాన్ని "నాగరికతకు పుట్టిల్లు" అని

venku1968@gmail.com



పిలిచేవారు.

భారతదేశం ప్రపంచంలోని దాదాపు ప్రతి పురాతన, మధ్యయుగ నాగరికతతో మేధో సంబంధాలను పంచుకుంది. ప్రపంచంలోని ఇతర దేశాలతో పోల్చితే భారతదేశం జ్ఞానార్జనలో ఎంతో పురోగమించింది. పశ్చిమాన మధ్యధారా సముద్రం నుండి తూర్పున చైనా సముద్రం వరకు ఉన్న అనేక దేశాల విద్యార్థులు భారతదేశంలో చదువుకోవడానికి వచ్చారు.

భారతదేశ చరిత్రలో స్వర్ణయుగంగా పేర్కొనే గుప్తుల కాలంలో శాస్త్రవిజ్ఞానం గణనీయంగా వృద్ధి చెందింది. అన్ని శాస్త్రాలకు మూలం గణితం. బీజగణితం. రేఖాగణితం.. ఇవన్నీ గుప్తరాజు కుమార గుప్తుని కాలంలో క్రీ.శ. 427 నుంచి 450 నాటికి పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాయి.. పదివేలకు పైగా విద్యార్థులు, రెండు వేలమంది అధ్యాపకులతో నలంద విశ్వవిద్యాలయం కళకళలాడుతూ ఉండేది.

అలెగ్జాండర్ దండయాత్ర నాటికే తక్షశిల గొప్ప విద్యాకేంద్రంగా ప్రసిద్ధి చెందింది. ఉజ్జయిని మరొకటి. దక్షిణాన నాగార్జున కొండ విశ్వవిద్యాలయం క్రీ.శ. 200 ప్రాంతంలో అభివృద్ధి చెందింది. అన్నింటిలోకి నలంద విశ్వవిద్యాలయం శిఖరోన్నతం. హర్షవర్ధనుడికాలంలో సమున్నత విద్యాశిఖరంలా విలసిల్లిన ఈ విశ్వవిద్యాలయం.

నలం అంటే సంస్కృతంలో పద్మం అని అర్థం. ఇది జ్ఞానానికి గుర్తు. ద అంటే ఇవ్వడం. వెరసి.. జ్ఞానాన్ని అందించేది నలందా అని అర్థం. గుప్తరాజులలో చివరివాడైన బాలాదిత్యుడు నలందా విశ్వవిద్యాలయానికి ప్రారంభోత్సవం చేశాడు. ఉత్తరాదిని పాలించిన రాజులందరూ నలందను ఆదరిస్తూనే వచ్చారు. హర్షవర్ధనుడు వారిలో అగ్రగణ్యుడు. విద్యార్థులకు భోజన, వసతి సౌకర్యం కలిగించిన తొలి విశ్వవిద్యాలయం నలంద. అలా ప్రపంచానికి తొలుత విద్యాదానం చేసింది మన భారతదేశమే!

ఈ విశ్వవిద్యాలయంలో పదివేలమంది చదువుకునే అవకాశం ఉండేది. దేశ దేశాల

విద్యార్థులు, పండితులు ఇక్కడ చేరేవారు. అదొక అంతర్జాతీయ విశ్వవిద్యాలయం. బౌద్ధతత్వశాస్త్రంతోపాటు, సాంఖ్యా, వైశేషిక, యోగ, తర్క మీమాంసాది దర్శన శాస్త్రాలన్నింటికి ఇక్కడ ఆచార్య పీఠాలు ఉండేవి. వ్యాకరణానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉండేది.

దూర ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చి విద్య అభ్యసించేవారు. విద్యలను 'అష్టాదశ' విద్యలుగా చెప్పేవారు. రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలు, శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జోతిషం, కల్ప, మీమాంస, న్యాయం, పురాణం, ధర్మశాస్త్రం మొదలైన వాటితో కలిసి 14 విద్యలు. వీటికి ఆయుర్వేదం, ధనుర్వేదం, గాంభీర్యం, అర్థశాస్త్రాలను జోడిస్తే అష్టాదశ విద్యలు అవుతాయి.

నలందా విశ్వవిద్యాలయ ద్వారపాలకులు సైతం మహాపండితులే. విద్యార్థులను మొదట వారే పరీక్షించేవారు. రేయింబవళ్లు వాద ప్రతివాదాలతో, చర్చలతో ఈ విశ్వవిద్యాలయం ప్రతిధ్వనిస్తుండేది. స్థిరమత, ధర్మపాల, వసుభంధు, శీలభద్ర వంటి వారు ఇక్కడ ఆచార్యులుగా ఉండేవారు. నాగార్జుని రచనలు ఎన్నో ఇక్కడి ఉండేవి. తర్వాత అవి టిబెట్ చేరుకున్నాయి. నలందలో ఎనిమిది కళాశాలలు ఉండేవి. సుమిత్రా పాలకుడు, బలపుత్రదేవుడు నిర్మించిన కళాశాలలో రత్నసాగర, రత్నోదధి, రత్నరంజిక అనే మూడు గ్రంథాలయాలు ఉండేవి. చైనా, కొరియా, టిబెట్, ఇండోనేషియా, పర్షియా, టర్కీ, సుమిత్ర, జావా, సింహళ, మధ్య ఆసియా నుండి వేలాదిమంది విద్యార్థులు ఇక్కడకు తరలి వచ్చేవారు. లక్షా యాభైవేల చదరపు మీటర్లకు పైగా వ్యాపించి, ఎనిమిది ప్రత్యేక ప్రాంగణాలు, పది ప్రార్థనా మందిరాలు, ఉద్యానవనాలు, చెరువులు, మరెన్నో అపురూప కట్టడాలు ఇక్కడ ఉండేవి. వేలమంది అధ్యాపకులు, విద్యార్థులు ఉండేవారు.

పలు ముష్కర దాడుల్లో నలంద శిథిలమైపోయింది. ముస్లిం దండయాత్రలలో

ఇక్కడి ఆచార్యులను, విద్యార్థులను దొరికినవారిని దొరికినట్లు వధించి, తొమ్మిది అంతస్తులలో ఉండే గ్రంథాలయానికి నిప్పుపెడితే కొన్ని నెలలపాటు దగ్ధమైందంటే దాని వైభవం ఎలా ఉండేదో మనం ఊహించుకోవచ్చు. ఎన్నో విలువైన గ్రంథరాజాలు అగ్నికి ఆహుతైపోయాయి. విజ్ఞాన ప్రకర్ష బూడిదైపోయింది.

1197లో టర్కీ రాజు భక్తియార్ ఖిల్జీ ఈ ప్రాంతంపై దాడి చేసి ఈ విశ్వవిద్యాలయాన్ని ధ్వంసం చేశాడు.

ఇక్కడి మన విద్యా విశిష్టత గురించి కొంత తెలుసుకుందాం!

గణితశాస్త్రంలో భారతీయులు చేసిన కృషిని ప్రపంచమంతా అంగీకరించింది. ప్రస్తుతం అరబిక్ అంకెలుగా గుర్తింపు పొందిన 1, 2, 3 పద్ధతి అంకెలు భారతదేశానివే. మధ్యప్రాచ్యం గుండా అవి ప్రపంచానికి అందాయి. ఒకటి ఉన్నది, ఒకటి లేదు అన్న భావాలకు మధ్యన ఏమీ లేదు అన్న భావం ఒకటి ఉండాలని ఆలోచించినది భారతీయులే. అంటే 0 అనే శూన్యాన్ని ప్రపంచానికి అందించినది మన దేశమే. అంకెలకు స్థానాన్ని బట్టి విలువ ఉంటుందని భారతీయులు గుర్తించి ప్రపంచానికి తెలియజేశారు. ఉదాహరణకు 116 అన్న అంకె చివరలో ఉన్న ఆరు ఒకట్లను, రెండో స్థానంలో ఉన్న ఒకటి పదులను, మూడో స్థానంలో ఉన్న ఒకటి వందలను సూచిస్తుందని భారతీయ పరిశోధకులు ఏనాడో గుర్తించారు. ఆ విజ్ఞానం భారతదేశం నుండి అరబ్ దేశాల మీదుగా యూరప్‌కు వెళ్లింది. స్థానాల విలువ పద్ధతి లేకుంటే అంకెలను రాయడం చాలా గజిబిజి అయ్యేది. ఏడో శతాబ్దానికి చెందిన భారతీయ గణిత నిపుణుడు బ్రహ్మగుప్తుడు గణితంలో సంచలనాన్ని సృష్టించాడు. ఆకారాలలోని పరిమాణాన్ని గుర్తించడానికి సులభ మార్గాలను సూచించినది బ్రహ్మగుప్తుడే. సున్నాను మొట్టమొదటిగా లెక్కలలో వాడిందీ ఈయనే. సున్నను సున్నాతో హెచ్చవేస్తే వచ్చేది శూన్యమే అని కూడా భారతీయులు సూచించారు. శూన్యం నుంచి శూన్యాన్ని తొలగిస్తే కూడా శూన్యం మిగులుతుందని భారతీయులు చెప్పారు. ఈ లెక్కకు గణితంలోనే కాక తత్వశాస్త్రంలో కూడా ఎంతో ప్రభావం వుంది. బ్రహ్మగుప్తుని తర్వాత 500 సంవత్సరాలకు భాస్కరాచార్యుడు, లీలావతి వంటి వారు గణితంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారు. వీరు సూచించిన సిద్ధాంతాలు లేకుంటే ప్రపంచంలో నేడు ఆధునిక గణితం అభివృద్ధి వీలయ్యేది కాదు.

క్రీ.శ. 476లో పాటలీపుత్రం (నేటి పట్నా)లో ఆర్యభట్టు జీవించాడు. ఆయన ప్రసిద్ధ ఖగోళ శాస్త్రజ్ఞుడు. భూమి తన చుట్టూ తను తిరుగుతూ సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తుందని మొదటగా చెప్పినవాడు ఆయనే. గ్రహణాలను లెక్కగట్టాడు. దశాంశ గణిత పద్ధతి ప్రవేశపెట్టాడు. నక్షత్రాలు, సూర్య చంద్రుల కదలికలను గురించి భారతీయులు కచ్చితమైన లెక్కలు వేశారు. ఉజ్జయినిలోని నక్షత్ర పరిశోధనశాల ఆనాడే ఎంతో నిశితమైనన పరిశోధనలు చేయగలిగింది. క్రీ.శ. 505లో

వరాహమిహిరుడు ఈ రంగంలో ఎంతో కృషి చేశాడు. ప్రాచీన సమాచారాన్ని సేకరించి కృషి కొనసాగించి ఎన్నో కొత్త అంశాలను కనుగొన్నాడు. తర్వాతి కాలంలో ఢిల్లీలోను, జైపూర్‌లోనూ ఏర్పాటు చేసిన ఖగోళ పరిశోధన నిర్మాణాలు ఈనాటికీ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. భారతీయుల పంచాంగ పద్ధతి కూడా ఎంతో నిశితమైందని ప్రపంచమంతా అంగీకరించింది. గ్రహాలు, నక్షత్రాలు, సూర్యచంద్రుల కదలికలను ప్రాచీన కాలంలోనే భారతీయులు కచ్చితంగా గుర్తించగలిగారు. మన దేశంలో ఇప్పటికీ కాలగణనకు చాంద్రమానం, సౌరమానం అనే రెండు పద్ధతులూ అమలులో ఉండడం తెలిసిందే. భారతీయుల దృష్టిలో విశ్వం, భూమి ఎంతో పురాతనమైనవి. నక్షత్ర శాస్త్రంలో 43,20,000 సంవత్సరాల క్రమం ఒకటి ఉందని నాటి భారతీయులు గుర్తించారు. మహాభారతంలో ఇందుకు ఆధారాలు కనిపిస్తాయి.

వరాహమిహిరుడు ప్రకృతి విజ్ఞాన శాస్త్రాల గురించి ఎంతో పరిశోధించి నూతన విషయాలు వెలికి తెచ్చాడు. చరకుడు, సుశ్రుతుడు అంతకుముందే ఉన్నారు. వైద్యశాస్త్రం, గుప్తరాజుల కాలంలో బాగా అభివృద్ధి చెందింది. రసాయన, భౌతిక, విజ్ఞాన శాస్త్రాలు లేనిదే వైద్య శాస్త్రంలేదు. సింధు ప్రాంతం నుండి అరబ్ వర్తకులు, శాస్త్రజ్ఞులు భారతీయ వస్తువులతోపాటు, ఇక్కడి విజ్ఞానాన్ని, తత్వశాజ్ఞాన్ని బాగ్దాద్‌కు చేరవేశారు. భారతీయ వైద్యులు ఎంతోమంది క్రీ.శ. 900లో, బాగ్దాద్‌లో హరూన్ అల్ రషీద్ ఆస్థానంలో ఉండేవారు. అరేబియన్ నైట్స్ కథలు ఈ రాజు ఆస్థానంలోనే ఉద్భవించాయి.



విద్యార్థులకు రెండేళ్లు హుష్‌కాకి..

కరోనా విద్యారంగాన్ని పెద్ద దెబ్బే కొట్టింది.

వైరస్ ఉద్ధృతి కారణంగా రెండేళ్లుగా పిల్లలు ఇళ్లకే పరిమితమయ్యారు.

తరగతి పాఠాలు కాస్తా ఆన్‌లైన్ బాట పట్టాయి.

కరోనా తీవ్రత కారణంగా 2019-2020 విద్య సంవత్సరంలో పలు రాష్ట్రాలు పరీక్షలు రద్దు చేసి- విద్యార్థులను పైతరగతులకు ప్రమోట్ చేశాయి. 2021లో బడులు తెరుద్దామనుకున్నా రెండో దశ ఉద్ధృతి, వైరస్ కొత్త స్ట్రెయిన్ల విజృంభణ అడ్డుకట్టవేశాయి.

ఇజ్రాయెల్, సౌత్ కొరియా, సింగపూర్ దేశాలు కరోనా కట్టడి కాకముందే బడులు ప్రారభించాయి. కొద్దిరోజులకే విద్యార్థులు వైరస్ బారిన పడడంతో మళ్లీ మూసివేశాయి. భౌతిక దూరం పాటించడం, మాస్కులు ధరించడం, చేతులు శుభ్రపరచడం అనే మూడు మూల సూత్రాలను పాటించడానికి మన బడులు, మన తరగతి గదులు అంత అనుకూలం కాదని అందరికీ తెలిసిందే. అలాగని చూస్తే ఆన్‌లైన్ అభ్యసనం మరో సమస్యగా మారుతోంది. దీనివల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పలు అధ్యయనాల్లో తేలింది. ముఖ్యంగా డిజిటల్ సాధనాలు లేక, ఇంటర్నెట్ సౌకర్యం లేక, క్షేత్రస్థాయి పర్యవేక్షణ లోపించడం, బోధనను కొందరు విద్యార్థులు అర్థం చేసుకోలేకపోవడం వంటివి ప్రధాన సమస్యలు. ఆన్‌లైన్ క్లాసుల కోసం ట్యాబ్స్ లేక మొబైల్ ఫోన్లు కొని ఇవ్వలేక అనేకమంది పేద తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో కొందరు చిన్నారులు ఆత్మహత్యలకు పాల్పడడం అత్యంత విషాదకరం.

విశేషమేమిటంటే.. ఆన్‌లైన్ క్లాసులతో సరిపెడుతున్నా విద్యాసంస్థలు ఫీజులను మాత్రం

venku1968@gmail.com

పూర్తిస్థాయిలో వసూలు చేస్తున్నాయి. ఇప్పటికే ఆర్థికంగా చితికిన అనేకమంది స్కూలు ఫీజులు కట్టేందుకు నానాతంటాలు పడ్డారు. ఆదాయాలు పడిపోయిన తల్లిదండ్రులు లక్షలకు లక్షలు కట్టలేక ఆందోళన, ఆవేదన చెందినా ప్రభుత్వాలు ఏమీ చేయలేకపోయాయి. కరోనా వైద్యం పేరుతో కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీ మాదిరిగానే విద్యాసంస్థలూ ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నాయి. కష్టకాలంలో సైతం లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలు టీచర్లకు జీతాల చెల్లింపులో మాత్రం పంగనామాలు పెట్టడం విశేషం.

తూతూమంత్రంగానే ఆన్‌లైన్ పాఠాలు కొనసాగించినా పరీక్షల నిర్వహణ ఎలా అన్నది మరో సమస్యగా మారింది. విస్తృత చర్చలు, సంప్రదింపుల అనంతరం కేంద్ర విద్యాశాఖ ప్రత్యక్ష పద్ధతిలో పరీక్షలను నిర్వహించనున్నట్లు మొదట ప్రకటించింది. పరీక్షల కాల పట్టికనూ విడుదల చేశారు. దీనికనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలు పది, ఇంటర్ బోర్డు పరీక్షల షెడ్యూళ్లు ప్రకటించాల్సి ఉంది. కానీ చివరకు మూడో ఉద్ధృతి హెచ్చరికల నేపథ్యం.. సుప్రీంకోర్టు సూచనల మేరకు అన్ని రాష్ట్రాలూ పరీక్షలను రద్దు చేశాయి.

ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు పరీక్షలు లేకుండా విద్యార్థులను ఉత్తీర్ణులుగా ప్రకటించడంలో ఇబ్బంది లేకున్నా 10, 12 తరగతులకు మాత్రం ఇబ్బందే.

విద్యార్థి విషయ పరిజ్ఞానాన్ని పరిశీలించడమే కాక- విశ్లేషణాత్మక జ్ఞానం, తార్కిక నైపుణ్యాలను అంచనా వేయడంలో పరీక్షలు చాలా కీలకం. విద్యార్థి క్రమశిక్షణకు బీజం వేస్తూ, పఠనంపై ఆసక్తి కలగజేస్తాయి. పరీక్షల్లో వచ్చిన మార్కులు విద్యార్థికి ప్రోత్సాహాన్నివ్వడమే కాక పాటు అభ్యసనంలోని లోపాలను సరిదిద్దుకునే అవకాశం కల్పిస్తాయి. అందుకే విద్యా ప్రణాళికలో పరీక్షలు అంతర్భాగంగా ఉంటాయి. పరీక్షలకు ఆధారం సిలబస్. దీన్ని పూర్తి చేయడానికి విద్యాసంవత్సరంలో నిర్దిష్టమైన పని దినాలుంటాయి. ముఖ్యంగా పది, ఇంటర్‌లలో మంచి మార్కులు సాధించడం ప్రత్యక్ష బోధనతోనే సాధ్యమని నిపుణుల అభిప్రాయం. స్థానిక పరిస్థితులను బట్టి రాష్ట్ర ప్రభుత్వాలు బడులు ప్రారంభించుకోవచ్చని గతంలోనే కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. కానీ, చాలా రాష్ట్రాలు కరోనా తీవ్రత దృష్ట్యా విముఖత వ్యక్తం చేశాయి. మరికొన్ని రాష్ట్రాలు పాఠశాలలు ప్రారంభించినప్పటికీ- విద్యార్థుల హాజరు శాతం ఆశించిన స్థాయిలో లేదు. కరోనా సెకండ్‌వేవ్ కాలంలో దేశంతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ వందలాదిమంది ఉపాధ్యాయులు మృత్యువాత పడ్డారు. ఏప్రిల్ 30 వరకూ పాఠశాలకు హాజరు కావడం, పరిషత్ ఎన్నికలు, అసెంబ్లీ, ఎంపి ఉప ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల విధుల్లో పాల్గొనడంతో అనేకమంది కరోనా సోకి మృత్యువాతపడ్డారు. థర్డ్ వేవ్ ముప్పు వారిని మరింత కలవర పెడుతోంది. పిల్లలను ఈ మహమ్మారి నుంచి ఎలా కాపాడుకోవాలా అని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఆన్‌లైన్ చదువులతో విద్యార్థులు పరీక్షలను ఎదుర్కోవడంలో ఎన్నో ప్రతిబంధకాలు. పరీక్షలను రద్దు చేసి పై తరగతికి పంపడంవల్ల ఉన్నత విద్యాకోర్సుల్లో ప్రవేశాలకు,

ఉద్యోగావకాశాలకు అవరోధంగా మారే ప్రమాదం ఉందని విద్యారంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా విద్యాసంస్థల్లో వార్షిక పరీక్షలకు ముందు విద్యార్థులు పలు మోడల్ పేపర్లు రాసేవారు. వీటిద్వారా ప్రిపరేషన్ లోపాలను సరిదిద్దుకొని పాఠాలను పునశ్చరణ చేసుకొనేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. పాఠశాల నిర్వహిస్తేనే కొత్త పద్ధతి, పరీక్షల సరళిపై అవగాహన ఉంటుంది. కానీ పిల్లలు ఇళ్లకే పరిమితం కావడం వల్ల అయోమయంలో ఉన్నారు. ఇంటిపట్టునే ఉంటున్న పిల్లలను సముదాయించడం పెద్దలకూ కష్టంగా మారింది. ఆన్‌లైన్ క్లాసుల వల్ల మానసిక ఎదుగుదల అన్నది లేకుండా పోవడం ఒక సమస్య అయితే.. కొందరు కొత్తగా మానసిక, శారీరక సమస్యల బారిన పడడం మరో సమస్య.

తరగతి గదిలో చెప్పే పాఠాలు కొన్నింటిని ఆన్‌లైన్ ద్వారా చెప్పడం కష్టమనీ, సమీక్ష అవసరమని యూజీసీ, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్(ఎస్సీఈఆర్టీ) ఇప్పటికే చెప్పాయి. పాఠాలు చెప్పడమే తప్ప, కింది స్థాయిలో విద్యార్థి ఏమేరకు నేర్చుకున్నాడనే విషయమై సరైన సమీక్ష ఇప్పటికీ జరగలేదు. కేంద్రీయ పాఠశాలల్లో సాగుతున్న ఆన్‌లైన్ బోధన నాణ్యతపై ఎన్‌సీఈఆర్టీ జరిపిన సర్వేలో 35 శాతం విద్యార్థులకు పాఠాలు అర్థం కావడం లేదని తేలింది. 21 శాతం పిల్లలకు కంప్యూటర్, ల్యాప్‌టాప్, స్మార్ట్ ఫోన్లు లేవు. కరెంటు సమస్యలు, ఇంటర్నెట్ లోపాలతోపాటు చిన్న స్క్రీన్లతో కంటి చూపు సమస్యలు తలెత్తుతున్నాయి. చదవకుండా, పరీక్షలు రాయకుండా బంగారు భవిష్యత్‌ను ఆశించలేం. కేరళ కమ్యూనిటీ విద్యా విధానం దేశానికే ఆదర్శంగా నిలిచింది. టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలు పేద విద్యార్థులకు అందుబాటులోకి తేవడంతో అక్కడ సత్ఫలితాలు వచ్చాయి. టెన్త్ పరీక్షలూ సజావుగా జరిగాయి.

విచిత్రమేమిటంటే.. కరోనాతో దెబ్బతిన్న విద్యారంగం విషయంలో జాతీయస్థాయి విధానాలు అవలంబించేలా చేయడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందనే చెప్పాలి. పరీక్షల నిర్వహణ అన్నది ఎవరికి వారుగా ఆయా రాష్ట్రాలు తమకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం.. ఆ క్రమంలో తలెత్తిన గందరగోళం దేశంలోని విద్యావిధానంలోని లోపాలను చాటిచెప్పాయి. తెలంగాణలో పది, ఇంటర్ పరీక్షలను రద్దుచేసి ఫలితాలను ప్రకటించారు. ఏపీలో పరీక్షలపై చాన్నాళ్లపాటు అయోమయం నెలకొంది. పబ్లిక్ పరీక్షలను తప్పనిసరిగా నిర్వహిస్తామని ప్రభుత్వం మొదట ప్రకటించింది. ఎప్పుడు నిర్వహిస్తారనేది మాత్రం స్పష్టంగా చెప్పలేకపోయింది. పరీక్ష తేదీలను తరచూ మార్చుకుంటూ పోయింది. ఇది పిల్లలను, తల్లిదండ్రులను గందరగోళంలోకి నెట్టేసింది. ఈ అంశం కోర్టుకు చేరడం.. సుప్రీంకోర్టు పిల్లల భద్రతపై ఆందోళన వ్యక్తంచేస్తూ తరచి తరచి ప్రశ్నించడంతో చివరకు టెన్త్, ఇంటర్ పరీక్షలను కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దేశంలో సీబీఎస్ఈ సహా మెజారిటీ రాష్ట్రాలు పదో తరగతి, 12 బోర్డు పరీక్షలు రద్దు చేశాయి.

అసలు దేశవ్యాప్తంగా ఒకే విధానం ఉండివుంటే విద్యార్థులకు ఇలాంటి గందరగోళం

తప్పేది. ఒక్కో రాష్ట్రం ఒక్కోవిధంగా వ్యవహరించడం ఘోరంగా మారింది. ప్రైవేట్, కార్పొరేట్ విద్యావ్యవస్థను నియంత్రించకుంటే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం అసాధ్యమని ఇప్పటికే తేలిపోయింది. పేద, ధనిక తేడా లేకుండా అందరికీ సమాన విద్య కోసం కలసి నిర్ణయాలు తీసుకోవలసి ఉందని కరోనా సంక్షోభం చాటిచెప్పింది. విద్యకు కనీసం 20 శాతం నిధులు కూడా కేటాయించాల్సి ఉంది.

జీరో విద్యా సంవత్సరంగా ప్రకటించాలనే సూచనలు కూడా వస్తున్నా కేంద్ర మానవ వనరుల అభివృద్ధి సంస్థ కానీ, రాష్ట్ర విద్యాశాఖ కానీ ప్రభావశీల నిర్ణయాలు తీసుకోవడంలో విఫలమయ్యాయి. అవి చేసిందల్లా విద్యార్థులను ప్రమోట్ చేయడమే. తరగతి గదికి ప్రత్యామ్నాయం లేదు. ఆన్‌లైన్ విద్య అందరికీ సౌలభ్యం కాదు. నగరాలు, గ్రామాలకు చాలా తేడా ఉంటుంది. నగరాలు, పట్టణాల్లోని తల్లిదండ్రులు ఆర్థికభారమైనా తమ పిల్లల భవిష్యత్ కోసం ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను సమకూర్చగలిగారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల తల్లిదండ్రుల ఆర్థిక, సామాజిక నిస్సహాయస్థితి మూలంగా ఆన్‌లైన్ బోధన సాగలేదు. ఈ సంక్షోభంలో మరో పెద్ద ప్రమాదం పొంచి ఉంది. పేద, బడుగు బలహీన వర్గాల పిల్లలు కరోనా సంక్షోభంతో పెనం నుండి పొయ్యిలోకి పడ్డట్టయింది. బడులు లేని కారణంగా వారు బాల కార్మికులుగా మారుతున్నారు. ఆరోగ్య సంక్షోభంతోపాటు బాలల హక్కుల సంక్షోభాన్ని కూడా ప్రభుత్వాలు అంతే పకడ్బందీగా ఎదుర్కోవాలి.

గురువుల గోస..

దేశవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ప్రైవేటు పాఠశాలల్లో 12 కోట్ల మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. లక్షలమంది బోధన, బోధనేతర సిబ్బంది వాటిలో పనిచేస్తున్నారు. కరోనా వల్ల విద్యాసంస్థలు మూతపడడంతో వారంతా ఉపాధి కోల్పోయారు. 2020 సెప్టెంబరు అనంతరం కరోనా కొంత తగ్గుముఖం పట్టడంతో ప్రత్యక్ష బోధన ప్రారంభించినప్పటికీ,

రెండోదశ విజృంభణతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. యాజమాన్యాలు కొంతమంది ఉపాధ్యాయులతోనే అన్ని తరగతులకు ఆన్‌లైన్‌లో బోధన చేయిస్తుండటంతో మిగిలిన వారి ఉపాధికి గండి పడింది.

తీవ్రమైన పనిఒత్తిడి, అధిక పని గంటలు, అరకొర సెలవులు, వేతనాల్లో కోతలు, కచ్చితంగా ఇంతమంది పిల్లలను చేర్పించాలన్న లక్ష్యాలతో ప్రైవేటు ఉపాధ్యాయులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడ ఏమి తేడా వచ్చినా యాజమాన్యాలు వీరిని అర్ధాంతరంగా ఉద్యోగాల నుంచి తొలగించేస్తూ ఉంటాయి. ఇలాంటి వాటినుంచి ప్రైవేటు విద్యా సంస్థల సిబ్బందికి వ్యవస్థాపరమైన రక్షణ లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1994లో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం విద్యార్థుల నుంచి వసూలు చేసే రుసుముల్లో 50 శాతం ఉపాధ్యాయుల జీతాలకు, 30 శాతం పాఠశాల నిర్వహణ- అభివృద్ధికి, 15 శాతం ఉపాధ్యాయుల పదవీ విరమణ ప్రయోజనాలకు వినియోగించాలి. 5 శాతం యాజమాన్య లాభంగా పరిగణించాలి. కానీ, ఇది ఎక్కడా అమలు కావడంలేదు. ఇప్పుడు అసలు వేతనాలే లేకపోవడంతో ప్రైవేటు ఉపాధ్యాయుల వేదన వర్ణనాతీతం. కుటుంబ పోషణ కోసం ఎంతోమంది హమాలీలుగా, కూరగాయల వ్యాపారులు, తాపీ మేస్త్రీలు, కార్పెంటర్లు, పెయింటర్లు, ఆటో డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఉపాధి హామీ నుంచి వ్యవసాయ కూలీ పనుల వరకు అన్నింటికీ వెళ్తున్నారు. అప్పుల భారం అధికమై కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. టీచర్లే కాదు.. పాఠశాలల నిర్వాహకులు కూడా కొందరు ఆత్మహత్యలకు పాల్పడడం విషాదకరం.

హైదరాబాద్‌లోని ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయుల స్థితిగతులపై స్వచ్ఛంద సంస్థ 'భారత్ దేఖో' ఒక అధ్యయనం చేసింది. 2020 లాక్‌డౌన్‌తో 85.7 శాతం ఉపాధ్యాయులు ఆదాయాన్ని పూర్తిగా కోల్పోయారని నివేదించింది. యాభై శాతం ఉపాధ్యాయులు రుణాల మీద బతుకుబండిని నెట్టుకొస్తున్నారని గుర్తించింది. 64.3 శాతం ఉపాధ్యాయులు అద్దె ఇళ్లలో ఉంటున్నారు. వీరిలో 90 శాతం అద్దెలు చెల్లించలేకపోతున్నారు. 81 శాతానికి ఆరోగ్య బీమా లేదు. బాధిత ఉపాధ్యాయుల్లోని మహిళలు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్న విషయమూ వెలుగుచూసింది. ప్రైవేటు కళాశాలల సిబ్బంది సైతం ఇలాంటి దుస్థితిలోనే ఉన్నారు.

ఈ క్లిష్ట పరిస్థితుల్లో తెలంగాణ ప్రభుత్వం ప్రైవేటు విద్యాలయాల గురువులకు నెలకు రెండు వేల రూపాయల ఆర్థిక సాయం, 25 కిలోల బియ్యం అందజేస్తుండడం కొంత ఊరట.

100 ఏళ్ల చిత్ర పరిశ్రమ విలవిల

"కృష్ణానగరే మామ.. లైఫంతా పస్తురా మామ" అంటూ హీరో పాడే పాట అప్పట్లో చాలా ఫేమస్.. కృష్ణానగర్‌లో నివాసం ఉండే ప్రతి సినీ కార్మికుడికీ ఆ పాట బాగా కనెక్ట్ అయింది. సినిమా కార్మికులకు ఇన్ని కష్టాలు ఉంటాయా అని రవితేజ నటించిన 'నేనింతే' సినిమా ద్వారా దర్శకుడు పూరీ చక్కగా వివరణ ఇచ్చాడు. ఆ పాట సరిగ్గా ఇప్పటి పరిస్థితికి సరిపోతుందనిపిస్తుంది. కరోనా మహమ్మారి కారణంగా కుదేలైన రంగాల్లో సినీ పరిశ్రమ ఒకటి. మిగిలినవాటితో పోలిస్తే ఈ రంగానికి వచ్చిన నష్టం చాలా ఎక్కువ. కరోనా సంక్షోభం ముగిసిన తర్వాత కూడా పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించలేకుండా ఉందని సినీ రంగానికి సంబంధించిన ప్రముఖ విజువల్ ఎఫెక్ట్స్ సంస్థ **'శ్రీనిధి విజువల్ ఐకాన్'** సీఈఓ **చందు ఆది** అన్నారు. కరోనా భయం నేపథ్యంలో మునుపటిలా జనాలు థియేటర్లకు వస్తారా అనే సందేహం అటు నిర్మాతల నుంచి ఇటు థియేటర్ యజమానుల వరకు అందరిలో నెలకొంది. ఇప్పటికే సినిమాలు, షూటింగులు నిలిపేసి ఏడాది దాటేసింది. కరోనా కనీవినీ ఎరుగని ఆర్థిక నష్టాన్ని కలుగజేస్తోంది. ఈ ప్రభావం సినీరంగంపై కూడా తీవ్ర స్థాయిలో పడింది. భారతీయ సినీ పరిశ్రమ ఏకంగా రకొన్ని వేల కోట్లు నష్టపోయిందని విశ్లేషిస్తున్నారు. ఒక్కో వీకెండ్‌కు ఇండియన్ సినిమాకు రూ.500 కోట్ల చొప్పున నష్టం కలుగుతోందట. బాలీవుడ్ భారీ బడ్జెట్ చిత్రాలు కూడా కరోనా కారణంగా వాయిదా పడ్డాయి. ఇప్పటికే పూర్తయినవి కొన్ని ఓటీటీ ప్లాట్‌ఫారం ద్వారా విడులయ్యాయి. భారత్‌లో పరిస్థితి కొంత సద్దుమణిగినప్పటికీ ఓవర్సీస్‌లో పరిస్థితులు ఎలా ఉంటాయో చెప్పలేం. ఆమెరికాతోపాటు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఫిజీ వంటి దేశాల్లో మునుపటిలా థియేటర్లు,

మాల్స్ తెరుచుకునే పరిస్థితులు కనిపించడం లేదు.

రెండు తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 1600 థియేటర్లు ఉన్నాయి. ఇందులో 800 వరకు మల్టీ ప్లెక్స్ లే. ఒక్కో థియేటర్‌కు నెలకు సగటున రూ.3 లక్షల అద్దె ఉండగా.. కార్మికుల జీతాలకు రూ.లక్షన్నర వరకు వెచ్చిస్తారు. థియేటర్ల మూతతో కార్మికులు కూడా ఆదాయం కోల్పోయారు. మొదటిదశ తర్వాత కొన్నాళ్లు సగం సీట్లతో సినిమా థియేటర్లకు అనుమతి వచ్చినా.. మునుపటిలా జనం థియేటర్లకు రాలేదు. అంతలోనే రెండో వేవ్ కమ్మేసింది..

పలు చిన్న సినిమాలు పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయాయి. పూర్తిస్థాయిలో థియేటర్లు ప్రారంభమైన తర్వాత కూడా జనం సినిమాలు చూడటానికి భయపడే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఏం చేయాలా అని పరిశ్రమకు చెందిన పెద్దలు సమాలోచనలు చేస్తున్నారు. కొంతకాలంగా తెలుగు సినిమాలకు ఓవర్సీస్ మంచి ఆదాయ వనరుగా మారింది. తెలుగు అగ్ర హీరోలందరికీ ఓవర్సీస్ మార్కెట్ భారీ కలెక్షన్లు అందిస్తోంది. ముఖ్యంగా అమెరికాలో తెలుగు సినిమాలు రికార్డు స్థాయిలో వసూళ్లు సాధిస్తున్నాయి. అయితే ఓవర్సీస్ మార్కెట్ ఇప్పట్లో కోలుకునే సూచనలు కనిపించడం లేదు. కరోనా కారణంగా భారీ నష్టం మూటగట్టుకున్న అమెరికాలో ఇప్పట్లో సినిమా థియేటర్లు తెరుచుకునే పరిస్థితులు లేవు. నిర్మాతలకు, డిస్ట్రిబ్యూటర్లకు కొన్ని వేల కోట్ల నష్టం వాటిల్లుతోంది. అన్నిటికంటే అతి పెద్ద ఎంటర్‌టైన్మెంట్ రంగమైన సినీ రంగం ఈ విధంగా కుప్పకూలిపోతుందని ఎవ్వరూ ఊహించి ఉండరేమో!

సి సి సి ద్వారా సినీ కార్మికులకు సహాయం

సినిమా రంగం అంతా కుదేలు అయిపోవడంతో, సినీ కార్మికులు నానా అవస్థలు పడుతున్నారని గ్రహించి, వారికి ఎంతోకొంత మేలు చేయాలని తెలుగు సినీ రంగానికి చెందిన పెద్దలు నడుం బిగించారు. ఈ విషయంలో దేశంలోని మిగతా భాషల తారలతో పోలిస్తే తెలుగు హీరోలు సహాయం చెయ్యడం విషయంలో కొంచెం ముందే ఉన్నారు. సినీ కార్మికుల కోసం పెద్ద ఎత్తున విరాళాలు సేకరించడం మొదలెట్టారు. "కరోనా క్రైసిస్ చారిటీ" (సి సి సి) అనే నిధిని ఏర్పాటు చేశారు. మెగాస్టార్ చిరంజీవి అధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాల్ని నడిపిస్తున్నారు. సాయం కావాల్సిన కార్మికులందరూ తమ పేర్లను ఫిలిం ఛాంబర్, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, 24 క్రాఫ్ట్స్‌కు చెందిన సినీ సంస్థల వద్ద నమోదు చేసుకోవాలి. అలా అన్ని సినీ క్రాఫ్ట్స్‌కు చెందిన కార్మికుల వివరాలు సేకరించి.. వారికి ఎలక్ట్రానిక్ గుర్తింపు కార్డులు ఇస్తున్నారు.

దేశాన్ని వణికించిన 'డెల్టా' వేరియంట్

దేశాన్ని వణికించిన సెకండ్ వేవ్ ఉధృతికి ఏ కరోనా వేరియంట్ కారణం తెలుసుకునేందుకు ఇండియన్ సార్స్ కరోనా వైరస్ జీనోమిక్ కన్సార్టియా (ఐఎన్ఎస్ఏసీఓజీ), నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్సీడీసీ) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అధ్యయనంలో కీలక విషయం వెలుగుచూసింది. 'డెల్టా' వేరియంట్ (బి.1.617.2) సెకండ్‌వేవ్‌లో అత్యంత వేగంగా వ్యాపించి కొవిడ్ కేసులు భారీగా పెరగడానికి దారితీసిందని శాస్త్రవేత్తలు గుర్తించారు. బ్రిటన్‌లోని కెంట్ కౌంటీ పరిధిలో గుర్తించిన 'ఆల్ఫా' వేరియంట్ (బి.1.1.7) కంటే డెల్టా వ్యాప్తిరేటు 50 శాతం ఎక్కువని, ఇది అత్యంత ప్రమాదకరమైందని వెల్లడించారు. అయితే కరోనా ఇన్ఫెక్షన్ తీవ్రత పెరగడానికి, మరణాలు పెరగడానికి డెల్టా వేరియంటే కారణం అనేందుకు తగిన ఆధారాలు లేవన్నారు. ఇప్పటివరకు దేశంలోని 29,000 కొవిడ్ కేసుల శాంపిళ్ల జన్యుక్రమాల (జీనోమ్ సీక్వెన్సింగ్)ను విశ్లేషించగా 8,900 శాంపిళ్లలో డబుల్ మ్యుటెంట్ (బి.1.617) కరోనా వేరియంట్‌ను గుర్తించినట్లు వివరించారు. డెల్టా వేరియంట్ అనేది డబుల్ మ్యుటెంట్ ఉపవర్గానికి చెందినది. మొత్తం 8,900 డబుల్ మ్యుటెంట్ శాంపిళ్లలో 1000కిపైగా డెల్టా వేరియంట్ శాంపిళ్లు ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. సెకండ్ వేవ్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ రాష్ట్రాల్లో కరోనా కేసులు భారీగా పెరగడంలో డెల్టా వేరియంట్ పాత్ర కూడా ఉందన్నారు. కరోనా వ్యాక్సిన్ తీసుకున్న పలువురికి సోకిన వైరస్ రకాలపై అధ్యయనం జరపగా, ఈ వేరియంటే టీకా లబ్ధిదారులకు ఎక్కువగా సోకిందని గుర్తించడం గమనార్హం. ఇప్పటివరకు జరిపిన జన్యుక్రమాల విశ్లేషణ ప్రకారం దేశంలో 12,200కుపైగా కరోనా వేరియంట్లు వ్యాప్తిలో ఉన్నాయని చెప్పారు. సెకండ్ వేవ్ మొదలైనప్పటి నుంచి వీటన్నింటి కంటే డెల్టా వేరియంట్ వ్యాప్తిరేటు గణనీయంగా పెరిగిందన్నారు. ఇక ఫైజర్ కంపెనీ కరోనా టీకాను తీసుకున్న వారిలో డెల్టా వేరియంట్‌ను నిర్వీర్యం చేసే యాంటీబాడీలు సాధారణ స్థాయి కంటే ఐదువంతులు తక్కువగా విడుదలవుతున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. బ్రిటన్‌లోని ఫ్రాన్సిస్ క్రిక్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు 250 మంది ఫైజర్ టీకా లబ్ధిదారుల రక్త నమూనాలను సేకరించి, వాటిపైకి వేర్వేరుగా ఐదు కరోనా వైరస్ వేరియంట్లను ప్రవేశపెట్టారు. దీనికి ప్రతిస్పందనగా యాంటీబాడీలు ఎంతమోతాదులో విడుదలయ్యాయి అనేది నమోదుచేశారు. రక్త నమూనాలు డెల్టా వేరియంట్ ప్రభావానికి లోనైనప్పుడు.. యాంటీబాడీల విడుదల ఐదు వంతులు తగ్గడాన్ని గుర్తించారు. వయసు పెరిగే కొద్దీ యాంటీబాడీల విడుదల భారీగా తగ్గిందని, ఇవి చాలా త్వరగా నశించాయని పేర్కొన్నారు. ఈ వివరాలతో 'ద లాన్సెట్' జర్నల్‌లో పరిశోధనా పత్రం ప్రచురితమైంది.

4 లక్షలు దాటిన కరోనా మరణాలు

59% రెండో ఉద్ధృతిలోనే

దేశంలో కరోనా మహమ్మారి బారిన పడి ప్రాణాలు కోల్పోయినవారి సంఖ్య జులై 3, 2021 నాటికి 4 లక్షలు దాటింది. గత ఏడాది మార్చిలో కొవిడ్‌తో తొలి మరణం సంభవించగా ఇంతవరకు 4,00,312 మంది బలైపోయారు. గత 24 గంటల్లో 46,617 కొత్త కేసులు బయటపడగా.. 853 మంది కొవిడ్ బాధితులు మృతి చెందారు. దేశవ్యాప్తంగా ఇంతవరకు నమోదైన మొత్తం కేసుల సంఖ్య 3,04,58,251కి చేరింది. ఒక్క రోజులో 59,384 మంది కోలుకోగా.. క్రియాశీలక కేసుల సంఖ్య 5,09,637 (1.67%)కి తగ్గింది. కొవిడ్ బారిన పడినవారిలో మొత్తంగా 2,95,48,302 మంది కోలుకున్నారు. రికవరీ రేటు 97.1%కి పెరిగింది. దేశవ్యాప్తంగా గురువారం 18,80,026 కొవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. రోజువారీ పాజిటివిటీ రేటు 2.48%గాను, వారపు సగటు పాజిటివిటీ రేటు 2.57%గాను ఉంది.

ప్రపంచంలో 4 లక్షలకు పైగా కొవిడ్ మరణాలు సంభవించిన దేశాల్లో అమెరికా (6.2 లక్షలు), బ్రెజిల్ (5.2 లక్షలు)ల తర్వాత భారత్ చేరింది. దేశంలో ఇంతవరకు నమోదైన మరణాల్లో 59.41% (2,37,844) ఈ ఏడాది ఏప్రిల్ 1 తర్వాతే సంభవించాయి. శుక్రవారం నాటికి మొత్తం మరణాల రేటు 1.31%కి చేరింది. కొవిడ్ రెండో ఉద్ధృతిలో మరణాల రేటు 1.92%గా ఉంది. కేసులతో పోలిస్తే మరణాల తీవ్రత రెండో ఉద్ధృతిలో అధికంగా ఉన్నట్లు గణాంకాలు స్పష్టంగా చెబుతున్నాయి. భారత్‌లో తొలి కొవిడ్ మరణం గత ఏడాది మార్చి 10న సంభవించగా రెండు రోజులకు ప్రభుత్వం ధ్రువీకరించింది. మొత్తం మరణాల్లో 30% మహారాష్ట్రలోనే నమోదయ్యాయి. ఈ ఒక్క రాష్ట్రంలోనే లక్ష మందికి పైగా మృతి చెందారు.

venku1968@gmail.com

ఆపత్కాలంలోనూ రాజకీయాలేనా?

గంగానదిలో పదుల సంఖ్యలో మృతదేహాలు తేలుతున్నాయి. కరోనా చికిత్స కోసం వచ్చిన వారిలో కొందరు అక్కడికక్కడే కుప్పకూలిపోతున్నారు. ఆక్సిజన్ అందని అభాగ్యుల ఆర్తనాదాలు రోజూ ప్రతిధ్వనిస్తున్నాయి. ఆసుపత్రి పడకల కోసం జనం పడిగాపులు పడుతున్నారు. అవసరమైన ఆసరా దొరకక ఆక్రందనలు చేస్తున్నారు. ఔషధాలు లేక, సరైన వైద్యసేవలు లభించక వేలమంది విగతజీవులుగా మారి వల్లకాటికి వరస కడుతున్నారు. శ్మశానాలు 'హౌస్ ఫుల్' బోర్డులు పెడుతున్నాయి. ఎప్పుడో ఒకసారి వయసు మీరడం వల్లో, ప్రమాదాల్లోనో ఆప్తులు మరణించినట్లు వార్తలు తెలిసేవి. ఈ కరోనా విలయంతో వాటిని తరచూ వినాల్సి వస్తోంది. ఇది యుద్ధంకంటే ప్రమాదకరమైన పరిస్థితి. ఈ సమయంలో రాజకీయంగా పరస్పర విమర్శలు చేసుకోవడం వల్ల ప్రయోజనం ఏముంటుంది? ఎదుటి వారి తప్పులెన్నుతూ కూర్చుంటే పరిస్థితులు చక్కబడతాయా? ప్రజలకు ఉపశమనం అందుతుందా? కేంద్రం మొదలు రాష్ట్రాల వరకు అన్ని చోట్లా కరోనా కల్లోలంపై రాజకీయాలే నడుస్తున్నాయి. నాయకులు సున్నితత్వాన్ని, సందర్భోచిత విచక్షణను కోల్పోయారేమో అనే అనుమానాలు కలుగుతున్నాయి!

విపత్తు తీవ్రతపై సరైన శాస్త్రీయ అంచనాలు లేకపోవడం, నిర్లక్ష్యం, ప్రపంచ పరిణామాలను విస్మరించడం, తొందరపాటు విజయోత్సవాలు, రాజకీయ ప్రయోజనాలు వంటి ఎన్నో కారణాలు కలగలిసి ఇప్పుడు ప్రజల ప్రాణాలకు ఏమాత్రం భరోసా లేని విపత్కర పరిస్థితులు నెలకొన్నాయి. అలా అని ఇప్పుడు కారణాలను విశ్లేషిస్తూ, కారకులను విమర్శిస్తూ కాలం గడపటమూ సమంజసం కాదు. తగిన పరిష్కారానికి అందరూ ఏకమై కదలాలి. సాక్షాత్తు సుప్రీంకోర్టు సూచించినట్లు రాష్ట్రాలు రాజకీయాలు వదిలి కేంద్రానికి సహకరించాలి. కేంద్ర నాయకత్వమూ రాజకీయ ఏకీకరణకు చొరవ చూపాలి. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో, నేతలతో సమావేశం నిర్వహించి మూడు ప్రధానమైన సూచనలు చేస్తూ ప్రధానికి లేఖ రాశారు. 12 ప్రతిపక్షాలు కలిసి తొమ్మిది అంశాలతో మరో లేఖను ప్రభుత్వానికి పంపాయి. కేంద్ర సర్కారు నుంచి ఇలాంటి వాటికి ఎలాంటి స్పందన ఉండటం లేదు. సోనియా లేఖకు మాత్రం భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా పార్టీపరంగా స్పందించారు. అందులో ఆయన కాంగ్రెస్‌ను దుమ్మెత్తిపోయడమే ప్రధానలక్ష్యంగా పెట్టుకున్నారు. సోనియా సూచనలను సరైన రీతిలో ప్రస్తావించలేదు. వివరణా ఇవ్వలేదు. అసలు ఈ సంక్షోభ సమయంలో అఖిల పక్షం నిర్వహించి, అందరితో కలిసి చర్చించి సమగ్ర కార్యాచరణ రూపొందించుకోవడం దేశానికి తక్షణ అవసరం. రాజకీయాలను పక్కన పెట్టాలని అధికార, ప్రతిపక్షాల నాయకులు అందరూ అదే పనిగా ప్రకటి

స్తున్నారు. కానీ ఆచరణలోకి వచ్చేసరికి రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారు! ప్రతిపక్షాల సూచనలు, సలహాలు, డిమాండ్ల సాధ్యాసాధ్యాలను పరిశీలించి అనువైన వాటి అమలుకు సిద్ధమవుతున్నట్లు లేదా ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించినట్లు ప్రభుత్వం కనీస సంకేతాలు ఇచ్చిన దాఖలాలు లేవు. బాధ్యతాయుతమైన జవాబు ఏదీ కేంద్రం నుంచి రాన ప్పుడు రాజకీయ ఐకమత్యం ఎలా సాధ్యమవుతుంది?

అన్ని నిర్ణయాలు తన సారథ్యంలోనే సాగాలనుకొనే ప్రధాని ఏకపక్ష ధోరణి ఈ విప త్కర పరిస్థితులను ఇంకా సంక్లిష్టం చేస్తోంది. దీనివల్లే ప్రతిపక్షాలు, రాష్ట్రాలు కేంద్రానికి దూరంగా ఉండిపోతున్నాయి. అధికారులూ ప్రభుత్వానికి సరైన మార్గనిర్దేశం చేసే సాహ సానికి పూనుకోలేకపోతున్నారు. నాయకత్వ పారదర్శకత లోపించడం సైతం కరోనాను ఎదు ర్కోవడంలో భారత్ వైఫల్యానికి కారణమని ప్రఖ్యాత అంతర్జాతీయ మెడికల్ జర్నల్ లాన్సెట్ పేర్కొనడం గమనార్హం. ప్రపంచాన్నే రక్షిస్తామని ప్రకటించిన పరిస్థితి నుంచి, ఆ ప్రపంచ దేశాలే మన రక్షణకు వరస కట్టాల్సిన దుస్థితికి భారత్ చేరిందనే వాస్తవాన్ని గ్రహిం చాలి. రాజకీయ లక్ష్యాల కోసం కేంద్రమే టీకాలు ఇస్తుందని రాష్ట్రాలను మొదట నియంత్రిం చడం- కాదు.. సొంతగా కొనుక్కొమ్మని మళ్లీ మాట మార్చడం వంటి అస్థిర విధానాలను వదిలిపెట్టాలి. లాక్‌డౌన్ వద్దని ఒకసారి, కావాలని మరోసారి అనడం, సెంట్రల్ విస్టా పనులు నిలిపేయాలని, విధాన ప్రణాళికలకు రూపకల్పన చేయకుండా రాజకీయ ప్రచారా లకే మోదీ ప్రభుత్వం పరిమితమవుతోంది. శత్రువులు దండెత్తి వస్తే దేశం మొత్తం ఏకమై నట్లు, కొవిడ్‌ను జయించాలంటే అంతకు మించిన రాజకీయ ఐకమత్యాన్ని ప్రదర్శించాలి. కొవిడ్ కట్టడిలో అక్కరకొచ్చే ఏ చిన్న సలహానైనా కేంద్ర ప్రభుత్వం అందిపుచ్చుకోవాలి. అలాంటి నిర్మాణాత్మక సూచనలను అందించడానికి ప్రతిపక్షాలూ చొరవ చూపాలి. రోజు వారీ రాజకీయాలను పక్కనపెట్టి, అభిప్రాయ భేదాలకు అతీతంగా అన్ని పార్టీలూ ఏకమై తేనే- ఈ ఘోర విపత్తు నుంచి దేశం వీలైనంత త్వరగా కోలుకుంటుంది.

న్యూజిలాండ్.. కరోనా వైరస్ ఉనికే లేదు

అనుకోని విపత్తు వచ్చినప్పుడు ప్రజల్ని ఎలా కాపాడుకుంటుందన్న అంశంపైనే.. ఆ ప్రభుత్వం సమర్థత తెలిసొస్తుంది. ఈ విషయంలో అగ్రరాజ్యమూ విఫలమై.. ఆందోళన చెందిన సమయంలో ఓ చిన్న దేశం వైరస్‌కు ముకుతాడు వేసింది. నియంత్రణ చర్యల్లో వేగం పెంచింది. నిబంధనలపై కఠినంగా వ్యవహరించింది. ఖజానా నిండుకుంటోందని తెలిసినా.. ఆంక్షలు సడలించలేదు. ప్రజల సంరక్షణ కోసం పోరాటం చేసింది. అందులో ప్రజల్నీ భాగస్వాములను చేసింది. చివరికి నిలిచి గెలిచింది. ఆ దేశమే... 50 లక్షల జనాభా ఉన్న న్యూజిలాండ్. ఇప్పుడక్కడ కరోనా వైరస్ ఉనికే లేదు. అక్కడి ప్రజలు మాస్కులు ధరించాల్సిన పని లేదు. భౌతిక దూరంతో అంతకన్నా పని లేదు. అసలు అక్కడ వైరసే లేదని...ఎప్పటిలాగే స్వేచ్ఛగా సంచరించవచ్చని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది.

ఉదారులూ ఉన్నారు..

కరోనా మహమ్మారి మానవత్వాన్ని మంటగలిపేస్తోంది. కళ్లెదుటే ఊపిరాడక గిలగిలా కొట్టుకుంటున్నా చూస్తూ ఉండటమే తప్ప ఏం చేయలేని పరిస్థితి. చికిత్స చేయిద్దమంటే బెడ్డు దొరకడం లేదు. సరే ఏదో ఒకటి చేసి బెడ్డు సంపాదించామంటే.. ఆసుపత్రిలో ఆక్సిజన్ ఉండటం లేదు. ప్రాణవాయువు కోసం బాధితుల బంధువులు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీకావు. పెద్ద పెద్ద నాయకులకు, బడా వ్యాపారవేత్తలకే ఆసుపత్రిలో చోటు దక్కడం లేదంటే ఇక సామాన్యుడి గురించి చెప్పక్కర్లేదు. అలాంటి పరిస్థితే ఎదురైంది గుడ్‌గావ్‌కు చెందిన విశాల్ సింగ్‌కు. 80 ఏళ్ల వాళ్ల నాన్నకు కరోనా సోకింది. ఆసుపత్రిలో చేర్పిద్దామంటే ఎక్కడా ఖాళీ లేదు. ఆలస్యం చేస్తే ప్రాణాలకే ముప్పు అని గ్రహించి ఏం చేశారో తెలుసా?

విశాల్ సింగ్.. దిల్లీ ఎన్‌సీఆర్ రీజియన్‌లో ఇండస్ వ్యాలీ పబ్లిక్‌స్కూల్ అధినేత. మరో రెండు దిల్లీ పబ్లిక్ స్కూళ్లనూ నడుపుతున్నారు. సహారా గ్రేస్‌లోని సెక్టార్ 28లో నివాసం ఉంటున్నారు. వాళ్ల నాన్నకు ఇటీవల కరోనా సోకింది. వయోభారం కారణంగా పరిస్థితి కాస్తా విషమించింది. దిల్లీలోని దాదాపు అన్ని ఆసుపత్రులకు తిప్పారు. ఎక్కడా బెడ్లు దొరకలేదు. తమకున్న పరిచయాలన్నింటినీ ఉపయోగించారు. అయినా లాభం లేకపోయింది. ఆసుపత్రుల చుట్టూ తిరిగి సమయం వృథా చేసే కంటే ఇంటి వద్దే వైద్యమందిస్తే ఫలితముంటుందనుకున్నాడు. కావాల్సిన పరికరాలు కొనుగోలు చేసి, ఇంట్లోనే వైద్యసేవలు అందించారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు. అయితే, ఈ పరిస్థితి విశాల్ సింగ్‌ను కదిలించింది. కాస్త స్థోమత ఉన్న తమకే ఇలా ఉంటే ఇక సమాన్యుల పరిస్థితి ఏంటనుకున్నాడు. విశాల్ నివాసముండే హౌసింగ్ కమ్యూనిటీలో దాదాపు 200 వరకు ఇళ్లుంటాయి. అందులో 60 మందికి కరోనా సోకినట్లు తెలుసుకున్నాడు. దాదాపు అందరిదీ అదే పరిస్థితి బెడ్లు దొరకడం లేదు, ఒక వేళ దొరికినా ఆక్సిజన్ కొరత.

ఒక్కరోజులోనే..

వీరందరికీ సాయం చేసేందుకు తానే ఒక కొవిడ్ కేర్ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాడు. మరుసటి రోజు ఉదయం లేచిన వెంటనే ఆ హౌసింగ్ కమ్యూనిటీ ప్రెసిడెంట్, రిటైర్డ్ ఆర్మీ అధికారి జనరల్ వీకే నారులా, రిటైర్డ్ డాక్టర్ నాగ్రాలను సంప్రదించాడు. తన మనసులో ఉన్న మాటను బయటపెట్టాడు. తన అపార్టుమెంటును ఖాళీ చేసి ఇస్తానని కూడా చెప్పాడు. దీంతో వారిద్దరు కూడా ముందుకొచ్చారు. కావాల్సిన ఏర్పాట్లన్నీ ఒక్క రోజులోనే పూర్తి చేశారు. కొవిడ్ కేర్ ఫెసిలిటీ సెంటర్‌కు కావాల్సిన పరికరాలు, బెడ్లు, ఆక్సీమీటర్లు, ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు, పీపీఈ కిట్లు ఇలా అన్నీ

సమకూర్చుకున్నారు. తాము కొనుగోలు చేసిన సామగ్రితో అత్యవసర పరిస్థితుల్లో ఆక్సిజన్ అందించేందుకు వీలుగా 5 బెడ్లను సిద్ధం చేశారు. వీటన్నిటికీ దాదాపు రూ.20 లక్షలకు పైగా ఖర్చయిందట.

ఇది ఆసుపత్రి కాదు

కొవిడ్ కేర్ ఫెసిటిలీ సెంటర్‌లో చేరిన వారికి అక్కడే పౌష్టికాహారం అందించేందుకు ఏర్పాట్లు చేశారు. దీని కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. ఇద్దరు అనుభవజ్ఞులైన నర్సులతోపాటు, బయటి నుంచి ఏవైనా తెచ్చేందుకు ఇంకొకరు వారికి నిత్యం అందుబాటులో ఉంటారు. అయితే దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, బీపీ, ఆస్తమా లాంటి వ్యాధులు ఉన్న వారు సంబంధిత డాక్టర్లను సంప్రదించి వారే మందులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. 'ఇది ఆసుపత్రి కాదు. కేవలం రిలీఫ్ సెంటర్ మాత్రమే. అత్యవసర పరిస్థితుల్లో ఆక్సిజన్ అందించడంతోపాటు వైద్యుల పర్యవేక్షణలో ఉన్నామన్న భరోసా కల్పించడం కోసమే దీనిని ఏర్పాటు చేశా'మని విశాల్ అంటున్నారు. ఏప్రిల్ 24 ఉదయం 9 గంటలకు కేర్ ఫెసిలిటీ సెంటర్‌ను ప్రారంభించగా 10 గంటలకు తొలి బాధితుడొకరు వచ్చారు. ఆరోగ్యం విషమంగా ఉన్న ముగ్గురు ఇప్పుడక్కడ చికిత్స పొందుతున్నారు. మరో రెండు బెడ్లు ఖాళీగా ఉన్నాయి. అయితే హోం క్వారంటైన్‌లో ఉండి కోలుకునే అవకాశం ఉన్న వారిని, ఆక్సిజన్ లెవెన్స్ సాధారణంగా ఉండేవారిని ఇందులో చేర్చుకోరు. ఆక్సిజన్ స్థాయులు 90శాతం కంటే తక్కువ ఉన్నవారికే ప్రాధాన్యత ఇస్తారు. వాళ్లు కోలుకున్న తర్వాత డిశ్ఛార్జి చేసి కొత్తవారిని చేర్చుకుంటున్నారు. ఆసుపత్రుల్లో బెడ్లు దొరక్క ఇబ్బంది పడేవాళ్లకు ఇది ఎంతగానో ఉపయోగపడుతోందని విశాల్ చెప్పుకొచ్చారు.

తుది మజిలీలో.. తోడుగా

'

ఎంత మురిపెంగా చూసుకున్నాను నిన్ను... చిన్న పని చెప్పడానికే ఆలోచించేదాన్ని. అలాంటిది... నువ్వీ వృత్తిని ఎలా ఎంచుకోగలిగావ్?' అంటూ కన్నీరు పెట్టుకుందా తల్లి..

'జీవితంలో ఎవరికైనా ఇదే తుది మజిలీ. నువ్వూ, నేనూ కూడా ఇక్కడికే రావాలి. తప్పేంటమ్మా' అందా కూతురు..

ఇంతకీ ఆ తల్లిని అంతగా బాధపెట్టి... ఆ కూతురు ఎంచుకున్న వృత్తి ఏంటో తెలుసా? శ్మశానవాటిక నిర్వహణ. అది ఆమెకు ఉద్యోగం కాదు... సేవ!! ఆ మానవతామూర్తి ఎస్తేర్‌శాంతి. కొవిడ్ కాలంలో కూడా చెన్నైలో శ్మశానవాటిక నిర్వహణ విధులు నిర్వర్తిస్తోంది.

"మా అమ్మ మనోరంజితం టీచర్. నాన్న గురుస్వామి కమర్షియల్ టాక్స్ ఆఫీసర్. మేం నలుగురు పిల్లలం. నాకు ఇద్దరక్కలు, ఓ సోదరుడు. మాది చెన్నై. నా చిన్నప్పుడే నాన్న అనారోగ్యంతో చనిపోయారు. ఎన్నో కష్టాలకోర్చి మమ్మల్ని చదివించింది అమ్మ. ఇంటర్ అవగానే నాకు శరవణన్‌తో పెళ్లైంది. ఆయన ప్రోత్సాహంతో బీకాం పాసయ్యా. చదువుతూనే ఓ స్వచ్ఛంద సంస్థలో చేరి.. వేశ్యల పిల్లలకు, వీధిబాలలకు చదువు చెప్పేదాన్ని. నాలుగేళ్ల తర్వాత ఒక రోజు ఎన్జీవో నిర్వాహకులు పిలిచారు. ఓటేరిలో 12 ఎకరాల విస్తీర్ణంలో ఒక శ్మశానవాటిక ఉంది. దాని బాధ్యతలు తీసుకుంటారా? అని అడిగారు. వెంటనే ఒప్పేసుకున్నా. అప్పటికే నాకు ముగ్గురు చిన్నపిల్లలు. మావారు ఏమంటారో అనుకున్నా. కానీ ఆయనా ప్రోత్సహించారు. చిక్కంతా అమ్మతోనే. ఆమెకు చెప్పడానికి భయపడి ఈ విషయాన్ని తన దగ్గర దాచాను.

నేను ఎంచుకున్న పని అంత సులువేమీ కాదని తర్వాత అర్థమైంది. తాగుబోతులు,

జులాయిలు ఆ శ్మశానవాటికను అడ్డాగా మార్చుకున్నారు. వాళ్లను వెళ్లగొట్టడానికి ఎక్కడ లేని ధైర్యాన్నీ పోగేసుకోవాల్సి వచ్చింది. మరోపక్క... ఆ రోజే అంత్యక్రియల కోసం ఓ శవాన్ని తీసుకొచ్చారు. వాళ్ల బంధువులు ఏడుస్తుంటే నాకూ ఏడుపొచ్చింది. ఇంటికెళ్లి కూడా ఏడ్చాను. ఆయన 'ఇష్టం లేకపోతే ఈ పని మానేయ్' అన్నారు. కానీ అది అయిష్టత కాదు, అవతలివారి బాధ నన్ను కదిలించింది. క్రమేపీ మనసును గట్టి చేసుకోవడం నేర్చుకుని అక్కడ వ్యవహారాలు కట్టుదిట్టం చేయడంతో తాగుబోతులు ఆ ప్రాంతానికి రావడం మానేశారు.

ఎనిమిదేళ్లుగా ఇక్కడే పనిచేస్తున్నా. కొవిడ్ మాత్రం ఎన్నడూ చూడని అనుభవాల్ని మిగుల్చుతోంది. క్షణం తీరిక లేని పరిస్థితి. ఉదయం ఏడుకు మొదలవుతున్న పని... రాత్రి ఎనిమిదిన్నరకు పూర్తవుతోంది. రోజంతా పీపీఈ కిట్ ధరించి పని చేయడం కష్టంగానే ఉంటుంది. బంధువులున్నా, కరోనా కారణంగా లోపలకి ప్రవేశం ఉండదు. మృతదేహాలను తరలించడం మొదలు, మిషన్‌లో ఉంచేవరకూ పూర్తి బాధ్యతను నేనే తీసుకుంటున్నా. ఇది ప్రమాదం కదా అని చాలామంది అడుగుతుంటారు. అలా అనుకుంటే మానవత్వానికి విలువేముంది అంటాను. ఓ రోజు అమ్మకు విషయం తెలిసి... ఫోన్ చేసి...'చిన్నపని కూడా చెప్పకుండా పెంచాను. నువ్వా పని ఎలా చేస్తున్నావంటూ' భోరుమంది. ఆవిడ చనిపోయేంత వరకూ నా పనిని వ్యతిరేకించింది. కొందరైతే 'మీకు నిద్ర ఎలా పడుతుందండీ?' అంటారు. 'మనమూ ఏదో ఒకరోజున ఇక్కడకు రావాల్సిన వాళ్లమే కదా' అంటాను!!

ఆ మధ్య ఎదురైన ఓ సంఘటన ఎప్పటికీ మర్చిపోలేను. అమెరికాలో ఉంటున్న ఓ అబ్బాయి అమ్మానాన్నలు కొవిడ్‌తో ఒకేరోజు చనిపోయారు. అతనేమో రాలేదు. వాళ్ల అంత్యక్రియలు జరిపి... వీడియోకాల్‌లో ఆ అబ్బాయికి చూపించాను. ఏళ్లుగా ఇవన్నీ చేస్తున్నా ఆ రోజు ఎంతో దుఃఖం వచ్చింది. మరో సంఘటన... ఓ కుర్రాడు నాతో కలిసి పనిచేసేవాడు. పొద్దునే ఇంటింటికీ పేపర్లు వేసి, పాలు పోసి డబ్బు పోగేశాడు. వాళ్లమ్మని బాగా చూసుకోవాలని తన కోరిక. ఆమె కోసం బట్టలు, నగలు కొన్నాడు. ఆవిడను ఇక్కడకు రమ్మన్నాడు. బస్టాండుకి వెళ్లి అమ్మని తీసుకురావడమే తరువాయి. వెళ్తూ.. దారిలోనే యాక్సిడెంట్ అయి చనిపోయాడు. ఆ కుర్రాడికి నేనే అంత్యక్రియలు చేశాను. వాళ్ల అమ్మ బాధ్యతలూ తీసుకున్నా. ఇలాంటివే ఎన్నో అనుభవాలు. నేనేదో సేవ చేస్తున్నానని ఎన్జీవోలు అవార్డులవీ ఇస్తూంటాయి. వాటి కోసం నేనీ పని చేయడం లేదు. నా మనసుకి తృప్తి నిచ్చే పని ఇది. అందుకే చేస్తున్నా.

ఏడాదిగా ఒకటే లక్ష్యం

కొవిడ్ తొలి దశలో నిర్ధారణ పరీక్షలు ఎలా చేయాలో తెలియని స్థితి. ఆ దశలో మొదటగా సీసీఎంబీలోనే రోజుకు వెయ్యి పరీక్షల సామర్థ్యంతో ఆర్‌టీ-పీసీఆర్ పరీక్షలు చేపట్టారు. ఆనాటి నుంచి వైరస్‌తో సహవాసం చేస్తున్నారు. దేశంలోనే తొలిసారి ఇక్కడి ల్యాబ్‌లో కృత్రిమ వైరస్‌ను పెంచారు. కొవిడ్ మందులు, టీకాలు వైరస్‌పై ప్రభావం చూపుతున్నాయో లేదో పరీక్షించడం ప్రారంభించారు. వైరస్‌లో మార్పులు, కొత్త రకాలను, ఉత్పరివర్తనాలను నిత్యం గమనిస్తూ, పరిశోధనలు కొనసాగిస్తున్నారు. చౌక ధరలో, సులభంగా చేసే డ్రైస్వాబ్ కొవిడ్ కిట్లను అభివృద్ధి చేశారు. మొత్తం 200 మందికి పైగా శాస్త్రవేత్తలు, పరిశోధక విద్యార్థులు, ఇతర సిబ్బంది షిఫ్టులవారీగా వేర్వేరు బృందాల్లో పనిచేస్తున్నారు. వైరస్‌పరంగా చోటుచేసుకొనే జన్యుపర మార్పులు, కొమ్ములతో విరుచుకుపడే స్వభావాన్ని అంచనా వేస్తున్నారు. ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ పరిశోధనలు సాగిస్తున్నారు సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ) శాస్త్రవేత్తలు, పరిశోధక విద్యార్థులు. సెలవులు, పండగలు, లాక్‌డౌన్ అనే తేడా లేకుండా అలుపెరగక శ్రమిస్తున్నారు. మందులు, టీకాల తయారీకి కృత్రిమ వైరస్‌ను సృష్టించారు. కదలికలను సునిశితంగా పరిశీలిస్తున్నారు.

వైరస్‌లో మార్పులపై నిఘా

- దివ్యతేజ్, యువ శాస్త్రవేత్త, జన్యుక్రమ ఆవిష్కరణ

వైరస్ మనదేశంలోకి ప్రవేశించిన తొలినాళ్ల నుంచే జన్యుక్రమ ఆవిష్కరణ ప్రక్రియ మొదలైంది. 2020 మార్చి ఆఖరులో ప్రారంభించాం. తొలుత పరిశోధక విద్యార్థుల్లో స్వచ్ఛం

దంగా ముందుకొచ్చినవారితో టెస్టింగ్ ఇతరత్రా ప్రక్రియలు కొనసాగించినా.. ఆ తర్వాత ఒక్కో విభాగంలో పదుల సంఖ్యలో పరిశోధనల్లో పాల్గొంటున్నారు. నిర్ధారణ పరీక్షలు, వైరస్‌ను పెంచడం, ఔషధాలు పనిచేస్తున్నాయో లేదో పరీక్షించడం, జన్యుక్రమ ఆవిష్కరణ వరకు నాలుగు రకాల పరిశోధనలు సాగుతున్నాయి. ల్యాబ్‌లోని సగం మంది శాస్త్రవేత్తలు, పరిశోధక విద్యార్థులు పాలుపంచుకుంటున్నారు.

అన్నీ పక్కనపెట్టి ఏడాదికిపైగా కొవిడ్‌పైనే దృష్టిపెట్టాం. దేశవ్యాప్తంగా వేర్వేరు రాష్ట్రాల నుంచి వస్తున్న వైరస్ నమూనాలను జన్యుక్రమ ఆవిష్కరణ ద్వారా వాటి రకాలు, వస్తున్న మార్పులను అధ్యయనం చేస్తున్నాం. దేశవ్యాప్తంగా వస్తున్న నమూనాలను ప్రాసెస్ చేసి వారంలో ఒకేసారి 500 వరకు జన్యుక్రమ ఆవిష్కరణ చేపడుతుంటాం. వేగంగా వీటి జన్యుక్రమాన్ని కనుగొని, విశ్లేషించాలనే లక్ష్యంతో నిరంతరం పనిచేస్తున్నాం. తొలి దశలో బృందంలో కొందరు వైరస్ బారిన పడ్డారు. మా పరిశోధన వైరస్ ఆర్‌ఆర్‌ఏపై కాబట్టి పెద్దగా భయపడింది లేదు. అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటూ వచ్చాం. ఎంత ప్రమాదమో తెలుసు కాబట్టి బయట ఉన్నా జాగ్రత్తగా ఉంటాం.

భయం పోగొట్టేందుకు సమయం పట్టింది

- యువ శాస్త్రవేత్త డాక్టర్ కార్తీక్ భరద్వాజ్, టెస్టింగ్, వైరస్ జన్యుక్రమ ఆవిష్కరణ

మొదట్లో కొవిడ్ వైరస్ గురించి ఎవరికీ ఏమీ తెలియదు. మాకూ భయం ఉండేది. ల్యాబ్‌తో సంబంధం లేకపోయినా అప్పట్లో ఇద్దరికి కరోనా సోకడంతో భయం మరింత పెరిగింది. నిజానికి ల్యాబ్‌లోనే సురక్షితం. పకడ్బందీగా రక్షణ చర్యలు తీసుకుంటాం కాబట్టి వైరస్ సోకే అవకాశం ఉండదు. ప్రభుత్వ, ప్రైవేటు సిబ్బందికి శిక్షణ ఇస్తూ.. పరీక్షలు కొనసాగిస్తూ.. జన్యుక్రమ ఆవిష్కరణలో పాలుపంచుకునేవాళ్లం. మలి దశలో కొందరు రెండోసారి కరోనా బారిన పడినా ధైర్యం కోల్పోకుండా పనిచేస్తున్నాం. 14 నెలలుగా ఒక్క రోజు సెలవు తీసుకోలేదు. ప్రస్తుతమున్న అవసరమే మమ్మల్ని నడిపిస్తోంది. నిత్యం 300 వరకు ఆర్‌టీ-పీసీఆర్ పరీక్షలు చేస్తున్నాం. గంటల తరబడి పీపీఈ కిట్లు ధరించడం కొంత అసౌకర్యమే అయినా, పరిశోధనల రీత్యా ఇది అనివార్యం. కిట్ల కొరత వేధిస్తున్న సమయంలో తక్కువ ఖర్చుతో, సత్వర ఫలితమిచ్చే డ్రైస్వాబ్ కిట్లు ఎంతో ఉపయోగం. వీటితో పాటు సీసీఎంబీ అభివృద్ధి చేసిన ఆటోమెటిక్ ఆర్‌ఎన్‌ఏ ఎక్స్‌ట్రాక్షన్ నిర్ధారణ పరీక్ష వేగంగా చేసేందుకు ఉపయోగపడుతోంది. ఒకేసారి పదివేల పరీక్షలు చేసే సాంకేతికత అభివృద్ధి చేసినా నమూనాల సేకరణ, ఫలితాల వెల్లడిలో ఆలస్యం జరుగుతోంది. వీటిని కమ్యూనిటీల్లో కొవిడ్ వ్యాప్తి ఏ విధంగా తెలుసుకునేందుకు ఉపయోగించుకోవచ్చు.

ఏడాది పాటు సెలవు తీసుకోని డాక్టర్

కొవిడ్ తొలి వేవ్ నుంచి ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా వైద్యరంగంలో ఉన్న వారు విశేషంగా సేవలు అందిస్తున్నారు. వైరస్ సోకిన వారి దగ్గరకు వచ్చేందుకు సొంత వారే సంకోచిస్తున్న సమయంలో అన్నీ తామై విధులు నిర్వహించిన వారు కూడా ఉన్నారు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్ శేఖర్ అలాంటి వారిలో ఒకరు.

ఏడాది కాలంగా ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా నిరంతరాయంగా కొవిడ్ విధులు నిర్వహిస్తూ బాధితులకు అండగా నిలుస్తున్నారు.

సొంత పనులకు కూడా ఆయన సమయం వెచ్చించింది చాలా తక్కువని, పూర్తి సమయం ఆసుపత్రిలోనే గడిపారని ఆయన గురించి తెలిసిన వారు చెబుతున్నారు.

లాక్‌డౌన్ కారణంగా చాలా రకాల వృత్తులకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది విధులకు దూరమయ్యారు. కొందరు వర్క్‌ఫ్రమ్ హోమ్‌కు పరిమితమైతే...అత్యధికులు ఇళ్లలోనే ఉండాల్సి వచ్చింది.అలాంటి సమయంలో వైద్య సిబ్బంది సహా ఫ్రంట్‌లైన్ వారియర్స్ పూర్తి స్థాయి విధుల్లో ఉన్నారు. సిబ్బందిలో ధైర్యం నింపేందుకే తాను విధుల్లో ముందుండటం అలవాటు చేసుకున్నట్టు డాక్టర్ విజయ శేఖర్ చెబుతున్నారు.

2019 మార్చి 21 నుంచి ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా ఆయన విధుల్లో ఉన్నారని తూర్పుగోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ గౌరీశ్వరరావు బీబీసీతో అన్నారు. వాస్తవానికి కొవిడ్ విధులు నిర్వహించిన వైద్యులకు వారంలో రెండు రోజుల నుంచి అవసరాన్ని బట్టి మరిన్ని రోజులు క్వారంటైన్‌కు అవకాశం ఇచ్చారు. సాధారణంగా ఐదు రోజులు కొవిడ్ బాధితులకు సేవలందించిన వారికి రెండు రోజుల విరామం దక్కేది. అంతేగాకుండా ఇతర వీక్లీ ఆఫ్‌లతో పాటు..నవంబరు తర్వాత కొవిడ్ కాస్త తగ్గుముఖం పట్టడంతో సెలవులు తీసుకునేందుకు కూడా కొందరికి అవకాశం దక్కింది. కానీ, విజయ శేఖర్ మాత్రం సెలవులు తీసుకోకుండానే, విధులు నిర్వర్తించారు. వారాంతాల్లో కూడా ఆసుపత్రికి వచ్చి రోగులను చూసి, సేవలందించడం సుమారు ఏడాది కాలంగా తన దైనందిన కార్యక్రమంగా మార్చుకున్నారు విజయ శేఖర్.

విజయ శేఖర్ ఇతర వైద్యులు, సిబ్బందితో సమన్వయం చేసుకోవడంతో పాటు పీడియాట్రిషియన్‌గా బాధ్యతలను నిర్వహిస్తుంటారు. వీటితో పాటు కొవిడ్ సమయంలో బాధితులకు ఉపశమనం కల్పించేందుకు అవసరమైతే కొందరు బాధితుల ఇళ్లకు వెళ్లి, వారితో మాట్లాడి వారిలో కొవిడ్ భయాన్ని తగ్గించే ప్రయత్నం చేశారు.

ఊరంతా వృద్ధులున్నా కరోనా అడుగుపెట్టలేదు

కరోనా కేసులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న గుజరాత్‌లో కొన్ని ప్రాంతాలకు ఇప్పటివరకూ అసలు మహమ్మారి చొరబడనే లేదు! ఇందుక్కారణం... వైరస్‌ను అడ్డుకునేలా ప్రజలు వ్యక్తిగత ప్రవర్తనను మార్చుకుని, కఠినంగా దాన్ని అనుసరించడం. అలాంటిదే.. మెహ్సానా జిల్లా, బేచరాజీ తాలుకాలోని చాందని గ్రామం. ఇక్కడి యువకులంతా ఉపాధిని వెతుక్కుంటూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోవడంతో ప్రస్తుతం ఇక్కడ ఎక్కువ మంది వృద్ధులే ఉంటున్నారు. వైరస్ రెండో దశ ఉద్ధృతి రాష్ట్రంలో తీవ్రంగా ఉన్నా... ఈ పల్లెలో ఒక్క కేసు కూడా లేదంటే విశేషమే మరి!

ఎలా సాధ్యమైందంటే...

ఈ గ్రామంలో సుమారు 100 మంది వృద్ధులున్నారు. కొవిడ్ మార్గదర్శకాలను వీరంతా కచ్చితంగా, సరైన విధానంలో పాటిస్తున్నారు. గ్రామవాసులు ఎవరూ ఇతర ప్రాంతాలకు వెళ్లడం లేదు. ఇతర ప్రాంతాల వారిని తమ గ్రామంలోకి రానివ్వడం లేదు. అందరూ మాస్కులను సరైన విధానంలో ధరిస్తున్నారు. దూరం పాటిస్తున్నారు. శానిటైజర్లను విని యోగిస్తున్నారు. ఎవరి ఇళ్లలో వాళ్లే ఉంటున్నారు. గ్రామంలో ఉంటున్నవారంతా ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఎవరికీ ఏ రుగ్మత లేకుండా చూసుకుంటున్నారు. పైగా... పెద్ద వాళ్లంతా రెండు డోసుల కొవిడ్ వ్యాక్సిన్ వేయించుకున్నారు. ఇప్పుడు అక్కడ కనీసం ఒక్కరికి కూడా జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు లేనే లేవు!

బాగోకుంటే పునమ్ భాయ్ వచ్చేస్తాడు..

ఒకవేళ గ్రామంలో ఎవరికైనా ఆరోగ్యం బాగోకపోతే... పూనమ్ భాయ్ అనే వ్యక్తి వెంటనే వస్తాడు. సదరు వ్యక్తిని తన వాహనంపై ఎక్కించుకుని సమీపంలో ఉన్న బెచరాజి పట్టణంలో ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం ఇప్పిస్తాడు. మహమ్మారిని ఎదుర్కొనేందుకు చాందని గ్రామ ప్రజలు చూపుతున్న శ్రద్ధ, వారు అనుసరిస్తున్న విధానాల పట్ల ఇతర ప్రాంతాల వారు ఆసక్తి చూపుతున్నారు.

5 లక్షల బెడ్లు.. లక్షన్నర డాక్టర్లు కావాలి

కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు భారత్‌కు అదనంగా మరో 5 లక్షల ఐసీయూ పడకలు, 3.5 లక్షల వైద్య సిబ్బంది అవసరమని ప్రముఖ సర్జన్, నారాయణ హెల్త్ వ్యవస్థాపకుడు డాక్టర్ దేవీ ప్రసాద్ శెట్టి చెప్పారు. ఇటీవల పుణెలోని సింబయాసిస్ గోల్డెన్ జూబ్లీ లెక్చర్ సిరీస్‌లో వర్చువల్‌గా పాల్గొన్న ఆయన.. దేశంలో వైద్య సిబ్బంది కొరతను అధిగమించేందుకు కొన్ని విలువైన సూచనలు చేశారు. "ఐసీయూ పడకలు మాత్రమే కాపాడవు. డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది ఉండాలి. మనదేశంలో వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. రాబోయే రోజుల్లో 2 లక్షల నర్సులు, 1.5 లక్షల మంది డాక్టర్ల అవసరం ఉంది. మన దేశంలో దాదాపు 2.20 లక్షల మంది నర్సింగ్ విద్యార్థులు తమ కోర్సులు పూర్తిచేసుకుని పరీక్షల కోసం సిద్ధమవుతున్నారు. వారిని కొవిడ్ ఐసీయూ వార్డుల్లో ఏడాది పాటు విధుల్లోకి తీసుకుని ఆ తర్వాత గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్లు ఇవ్వాలి. ఆ తర్వాత ప్రభుత్వ ఉద్యోగాల్లో వీరికి ప్రాధాన్యమివ్వాలి. యువ వైద్య సిబ్బంది కొవిడ్‌ను ధైర్యంగా ఎదుర్కోగలరు. 1.30 లక్షల మంది యువ డాక్టర్లు వృత్తి చేపట్టకుండా పీజీ కోర్సుల కోసం నీట్‌కు సిద్ధమవుతున్నారు. వెంటనే ఆన్‌లైన్‌లో నీట్ పరీక్ష పెట్టి ఫలితాలు ప్రకటించాలి. అందులో 35 లక్షల మంది ఎంపికైనా.. మిగతా దాదాపు లక్ష మంది డాక్టర్లు ఉంటారు. వారికి కొవిడ్ ఐసీయూల్లో పనిచేస్తే వచ్చే ఏడాది పీజీ ఎంపిక ప్రక్రియలో ప్రత్యేక అవకాశం కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వాలి. ఇక 90 వేలమంది డాక్టర్లు విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసినవారున్నారు. ప్రతిభావంతులను ఎంపిక చేసి కొవిడ్ వార్డుల్లో పనిచేస్తే శాశ్వత రిజిస్ట్రేషన్ కల్పిస్తామని చెప్పాలి. నర్సులను, వైద్యులను అందుబాటులోకి తీసుకొస్తే కొవిడ్ యుద్ధంలో మనం తప్పకుండా గెలుస్తాం" అని డాక్టర్ శెట్టి విశ్వాసం వ్యక్తం చేశారు. కేవలం రోగులను ఆసుపత్రిలో చేర్చుకుని వారిని ఆక్సిజన్ ఇచ్చినంత మాత్రాన వారి ప్రాణాలను కాపాడలేమని, రోగులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఆరోగ్య సంరక్షణ చేపట్టేందుకు జూనియర్ వైద్యులు చాలా అవసరమని అభిప్రాయపడ్డారు.

సెకండ్ వేవ్‌లో 776 మంది డాక్టర్లు మృతి: ఇండియన్ మెడికల్ అసోసియేషన్

కోవిడ్ సెకండ్ వేవ్‌లో భారత్‌లో 776 మంది డాక్టర్లు చనిపోయారని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలిపింది. బీహార్‌లో 115 మంది, ఢిల్లీలో 109 మంది వైద్యులు కన్నుమూశారు. ఉత్తరప్రదేశ్‌లో 79 మంది, పశ్చిమబెంగాల్‌లో 62 మంది, తమిళనాడులో 50 మంది, రాజస్థాన్‌లో 44 మంది డాక్టర్లు చనిపోయారు. కోవిడ్ మొదటి వేవ్‌లో దేశవ్యాప్తంగా 753 మంది డాక్టర్లు మృత్యువాతపడ్డారు.

దేశ రాజధానిలో యువ నేత సేవలు

కొవిడ్ మహమ్మారి వేధిస్తున్న కాలంలో దేశ రాజధానిలో అత్యంత ఆపదలో ఉన్నవారికి అవసరమైన సాయం చేస్తూ యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్ సామాజిక మాధ్యమాల్లో హీరోగా మారారు. దేశవ్యాప్తంగా పరిస్థితులు గంభీరంగా మారడంతో కొవిడ్ గుప్పిట్లో చిక్కి, ఎక్కడా ఎవరూ ఆదుకోలేని పరిస్థితిలో ఉన్న బాధితులు సామాజిక మాధ్యమాల ద్వారా శ్రీనివాస్‌ను అర్థిస్తున్నారు. ఎస్‌వోఎస్‌ఐవైసీ ట్విట్టర్ హ్యాండిల్‌కు బాధితులు తమ వేదనను ట్యాగ్ చేసి సాయం కోరుతున్నారు. ఈ జాబితాలో అతి సామాన్యుల నుంచి డాక్టర్లు, పాత్రికేయులు, విదేశీ రాయబార కార్యాలయాల సిబ్బంది కూడా ఉండటం విశేషం. కర్ణాటకలోని శివమొగ్గకు చెందిన 39 ఏళ్ల శ్రీనివాస్ క్రికెటర్. తన క్రికెట్ కెరీర్‌కు స్వస్తి పలికి యూత్ కాంగ్రెస్‌లో చేరారు. గతేడాది ఈ మహమ్మారి మొదలైన తొలి నాళ్లలో యూత్ కాంగ్రెస్‌లోని వాలంటీర్ల ద్వారా ఎస్‌వోఎస్‌ఐవైసీ పేరుతో ట్విట్టర్ హ్యాండిల్ ప్రారంభించి సేవలకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వెయ్యిమంది వాలంటీర్లతో అత్యంత క్లిష్ట సమయంలో అడిగిన వారికి చేతనైనంత సాయం చేస్తూ వస్తున్నారు. నేరుగా ఫోన్లు, వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌లాంటి మాధ్యమాల ద్వారా వచ్చే కేసులను సమస్యలవారీగా విభజించి బాధితులకు వేగంగా సాయం అందేలా చర్యలు తీసుకొంటున్నారు. ఒక్క దిల్లీలోనే వందమందితో పనిచేస్తున్నారు. ఆసుపత్రులు, మందులు, ఆక్సిజన్, ప్లాస్మా పంపిణీ కోసం వేర్వేరు జట్లు ఏర్పాటుచేసి వారి ద్వారా నిరంతరం వనరులను సమకూర్చుకొని బాధితులకు అందిస్తున్నారు. ఆసుపత్రుల్లో పడకలు, ఆక్సిజన్ కోసం చాలామంది వీరిని అర్థిస్తున్నారు. చివరకు దిల్లీలోని ఫిలిప్పైన్స్, న్యూజిల్యాండ్ ఎంబసీలు కూడా కొవిడ్ బారినపడిన తమ సిబ్బందికి ఆక్సిజన్ కోసం ట్విట్టర్ ద్వారా శ్రీనివాస్‌ను అర్థించడం విశేషం. అడిగిన

వెంటనే సాయం చేసినందుకు ఆ రాయబార కార్యాలయాలు ఆయనకు మళ్లీ ధన్యవాదాలు కూడా చెప్పాయి. దీంతో కష్టకాలంలో భారత విదేశాంగశాఖ చేతులెత్తేయడం వల్లే విదేశీ కార్యాలయాలు చివరకు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిని ఆశ్రయించాల్సి వచ్చిందన్న విమర్శలు వెల్లువెత్తాయి. శ్రీనివాస్ మాత్రం వాటికి అతీతంగా పనిచేసుకుంటూ పోతున్నారు. ఎలాంటి ఆర్భాటాలు లేకుండా రాహుల్‌గాంధీ, ఎస్‌వోఎస్‌ఐవైసీ అని ముద్రించి ఉన్న తెల్లటి టీషర్ట్‌లు ధరించి ఈ టీం సేవా కార్యక్రమాల్లో నిమగ్నమవుతోంది. దిల్లీ బయటి రాష్ట్రాల నుంచి వచ్చే విజ్ఞప్తులను ఆయా రాష్ట్రాల యూత్ కాంగ్రెస్ టీంలకు పంపి సాయం అందిస్తున్నారు. ఇటీవల దిల్లీలోని ఓ ఆసుపత్రిలో భర్తకు ఆక్సిజన్ సిలిండర్ సమకూర్చడానికి భార్య దగ్గర డబ్బులు లేకపోతే సిలిండర్ ఇచ్చిన వ్యక్తి సెక్యూరిటీ డిపాజిట్‌గా ఆమె ఫోన్‌ను తన దగ్గరే ఉంచుకున్న విషయం సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న శ్రీనివాస్ వెంటనే అక్కడికి చేరుకొని ఆమెకు ఫోన్ వెనక్కు ఇప్పించారు. రోగులకు సేవ చేస్తున్న డాక్టర్ దంపతులు కరోనా బారినపడి ప్లాస్మా అర్థిస్తే అందించి వారి ప్రాణం కాపాడారు. దిల్లీ యూనివర్శిటీకి చెందిన ఓ ప్రొఫెసర్ అనారోగ్యం బారినపడిన తన మూడేళ్ల కొడుక్కి ఆక్సిజన్ కోసం అర్థిస్తే ఆగమేఘాల మీద అందించి ఆదుకున్నారు. అనాథ భౌతికకాయాలకు అంత్యక్రియలు కూడా వీరే చేస్తున్నారు. కర్ఫ్యూ కారణంగా పనులేక పస్తులుంటున్న పేదల కోసం రోజూ ఆహారం సరఫరా చేస్తున్నారు. శ్రీనివాస్ బృందం సేవలు జాతీయ, అంతర్జాతీయ మీడియాల్లో కథనాలుగా మారాయి.

ఊపిరి నిలుపుతున్న 'ఆక్సిజన్ సిస్టర్స్'

నందూర్‌బార్ ఆసుపత్రిలో విజయగాథ

పరిమితంగా ఉన్న వనరులతో గరిష్ఠ ప్రయోజనాలను పొందడంలోనే సామర్థ్యం బయటపడుతుంది. ఇలాంటి సందర్భాల్లోనే నూతన ఆలోచనలు వెలుగు చూస్తాయి. రాజధాని దిల్లీలో ప్రాణవాయువు లేక జనం అల్లాడుతుంటే ఎక్కడో మహారాష్ట్రలో మారుమూల గిరిజన జిల్లా అయిన నందూర్‌బార్‌లో ఎలాంటి చీకూచింతా లేకుండా ఉండడానికి కారణం ఇలాంటి నూతన ప్రయోగమే. అక్కడి జిల్లా ఆసుపత్రిలోని నర్సులకే 'ఆక్సిజన్ సిస్టర్స్'గా కొత్త బాధ్యతలు అప్పగించడంతో ప్రాణవాయువు సమస్యన్నదే కనిపించడం లేదు. స్వయంగా వైద్యుడైన జిల్లా కలెక్టర్ డాక్టర్ రాజేంద్ర భారుడ్, స్థానిక అధికారుల చొరవే ఈ ప్రయోగానికి కారణం. తగినంతగా ఆక్సిజన్‌ను నిల్వ చేయడంకన్నా.., ఉన్న దాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలన్నదానిపై తొలుత ఆలోచనలు జరిపారు. అందులో భాగంగా ఆక్సిజన్ ఎలా వృథా అవుతోందో గుర్తించారు. రోగికి ప్రతిసారీ ఒకేస్థాయిలో ఆక్సిజన్ ఇవ్వాల్సిన అవసరం లేదు. కొన్నిసార్లు తక్కువ మోతాదులో ఇస్తే సరిపోతుంది. అలాంటప్పుడు మీటను కొంచెం తిప్పితే తక్కువ మొత్తంలో ఆక్సిజన్ వెళ్లే అవకాశం ఉంది. ఆ విధంగా ఆక్సిజన్‌ను మిగుల్చుకోవచ్చు. రోగి భోజనం చేస్తున్నప్పుడో, మూత్రశాలకు వెళ్లినప్పుడో ఆక్సిజన్ సిలిండర్‌ను ఆపు చేయడం లేదు. ఇలా కూడా మరికొంత వృథా అవుతోంది. ఇలాంటి చిన్న చిన్న జాగ్రత్తలతోనే ఆక్సిజన్‌ను పొదుపు చేసి, అవసరమైన వారి కోసం వాడుకోవచ్చని అంచనా వేశారు.

20 పడకలకు ఒక నర్సు పర్యవేక్షణ: ఇలా ఆక్సిజన్ వృథా కాకుండా చూసే బాధ్యతలను కొందరు నర్సులకు అప్పగించారు. వారికి 'ఆక్సిజన్ సిస్టర్స్' అని పేరు పెట్టారు. 20 పడకలకు ఒక నర్సును కేటాయించారు. రోగికి ఎంత ఆక్సిజన్ అవసరమో అంతే సరఫరా అయ్యేలా చూడడం వారి విధి. వీరి పనితీరును జిల్లా ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ రఘునాథ భోయే పర్యవేక్షిస్తుంటారు. నందుర్‌బార్ జిల్లా ఆసుపత్రిలో 240 పడకలు ఉండగా, అందుకు తగ్గట్టుగా 'ఆక్సిజన్ సిస్టర్స్'ను నియమించారు.

గూగుల్ ఉద్యోగులకు 'హైబ్రిడ్ వర్క్ వీక్'

సెర్చింగ్ దిగ్గజం గూగుల్ తన ఉద్యోగులకు 'హైబ్రిడ్ వర్క్ వీక్' అనే సరికొత్త విధానాన్ని అమలు చేస్తోంది. ఈ పద్ధతిలో గూగుల్ ఉద్యోగులు వారంలో కేవలం మూడు రోజులు కార్యాలయానికి వస్తే సరిపోతుంది. మిగతా రెండు రోజులు రిమోట్ వర్క్ చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు గూగుల్, అల్ఫాబెట్ సీఈవో సుందర్ పిచాయ్ ప్రకటించారు. కరోనా తగ్గుముఖం పట్టి ఈ ఏడాది చివరి నాటికి గూగుల్ కార్యాలయాలను తిరిగి తెరిచినా 20 శాతం ఉద్యోగులు ఇంటి నుండే పని చేస్తారని, 60 శాతం మందికి హైబ్రిడ్ వర్క్ వీక్ పద్ధతిలో పని చేసే అవకాశముంటుందని తెలిపారు.

ఈ ఏడాది మొదటి త్రైమాసిక గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా గూగుల్ సంస్థలో 1.40 లక్షల మంది వరకు పూర్తిస్థాయి ఉద్యోగులు పని చేస్తున్నారు. ఒక్క భారతదేశంలోనే దాదాపు 4 వేల మంది ఉద్యోగులుంటారని అంచనా. వీరిలో ఎక్కువమంది బెంగళూరు, హైదరాబాద్, ముంబై, గురుగ్రామ్‌లలో పని చేస్తున్నారు. రిమోట్ ప్రాంతం నుండి పనిచేసే ఉద్యోగులు మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 20 శాతం వరకు ఉంటారని గూగుల్ చెబుతోంది.

అమెరికా దిగ్గజ కంపెనీలపై ప్రభావం...

భారత్‌లో కరోనా కేసులు వేగంగా పెరుగుతున్నాయి. ఇప్పటి వరకు దేశంలో 2.14 కోట్లకు పైగా కేసులు నమోదు కాగా, 2.34 లక్షల మరణాలు సంభవించాయి. మరోవైపు దేశ ఆర్థిక వ్యవస్థ దారుణంగా దెబ్బతింది. ఇక భారత ఐటీ నగరం బెంగళూరు ఇటీవల వెలవెలబోతోంది. కరోనాకు ముందు కళకళలాడిన బెంగళూరు ఇప్పుడు వెలవెలబోతోంది. గోల్డ్‌మన్ శాక్స్ గ్రూప్ ఇంక్, యూబీఎస్ గ్రూప్ ఏజీ వంటి దిగ్గజాలు రిస్క్ మేనేజ్‌మెంట్

మొదలుకుని కస్టమర్ సర్వీసెస్, కాంప్లయెన్స్ వరకు కీలక పాత్ర పోషించాయి. ఇప్పుడు మాత్రం బెంగళూరులో చాలా భవనాలు ఖాళీగా ఉన్నాయి. దశంలో ఇటీవల కరోనా కేసుల సంఖ్య మరింత వేగంగా పెరుగుతున్న క్రమంలో వాల్ స్ట్రీట్ బ్యాక్ ఆఫీస్ కార్యకలాపాలు నెలల తరబడి వర్క్ ఫ్రమ్ హోంకు పరిమితమయ్యాయి. ఈ పరిస్థితి ఇంకా ఎంతకాలంపాటు కొనుసాగుతుందన్నది ఇదమిద్ధంగా తెలియడంలేదు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మరింత ఊరట

కరోనా తీవ్రత నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మరింత ఊరట కల్పిస్తూ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. కొన్ని వర్గాలకు పూర్తిగా ఇంటి నుంచి పనిచేసే వెసులుబాటు కల్పించింది. గర్భిణీ స్త్రీలు, వికలాంగ ఉద్యోగులు పూర్తిగా ఇంటి నుంచే పని చేసే అవకాశం ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ-డీఓపీటీ ఉత్తర్వులు విడుదల చేసింది. కంటైన్‌మెంట్ జోన్‌లో నివసించే ఉద్యోగులు, అధికారులు కూడా ఇంటి నుంచే పనిచేసేందుకు అనుమతించింది. కార్యాలయంలో విధులకు హాజరయ్యే అధికారులు, ఉద్యోగులు కొవిడ్ నిబంధనలను తప్పక పాటించాలని సూచించింది. మే 31 వరకు ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయని పేర్కొంది.

ఇప్పటికే కరోనా వైరస్ విజృంభణ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఉన్న 50 శాతం మంది ఉద్యోగులు ఇంటి నుంచే బాధ్యతలు నిర్వర్తించేందుకు అనుమతినిస్తూ కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 19న ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని మరింత విస్తరిస్తూ తాజా ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలు అన్ని కేంద్ర ప్రభుత్వ శాఖలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే సంస్థలలో పనిచేసే గ్రూప్ బీ, గ్రూప్ సీ స్థాయి ఉద్యోగులకు వర్తిస్తాయి. కాగా గ్రూప్ ఏ స్థాయి అధికారులకు పనిగంటల్లో వెసులుబాటు లభిస్తోంది.

ఇంటి నుంచి పని.. వెన్నుకు హాని

కరోనా మహమ్మారి విజృంభణ మొదలైన తరువాత చాలామంది ఇళ్ల నుంచి పని చేస్తున్నారు. ఇళ్లకే పరిమితమైన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులలో ఇప్పటికే చాలామంది వెన్ను సమస్యలతో ఆన్‌లైన్ కన్సల్టేషన్లు తీసుకుంటున్నారు. ఎక్కువ సేపు ల్యాప్‌టాప్‌ల ముందు గడపడం, వెన్నుకు సరిపడా మద్దతునందించే కుర్చీ లేకపోవడం, కూర్చునే భంగిమ వంటి అంశాలు ఈ వెన్ననొప్పికి కారణాలుగా డాక్టర్లు అభివర్ణిస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని ఓ ఆస్పత్రిలో సేవలనందిస్తోన్న కుమార్ మాట్లాడుతూ తన దగ్గరకు వస్తోన్న వారిలో అధికశాతం మంది మెడ, వెన్ను సమస్యలతో వస్తున్న వారే ఉంటున్నారని చెబుతున్నారు. వాస్తవానికి ఆఫీసులో డెస్క్‌లపై ఉన్న సౌకర్యం ఇంట్లో లభించదని, చాలామంది వేళ్ల నొప్పులు, వెన్ననొప్పి సమస్యలతో వస్తున్నారన్నారు. అది పోవాలంటే సౌకర్యవంతంగా కుర్చీలో కూర్చుని, వెన్ను కుర్చీ వెనుకకుతాకుతూ, చెవులు రెండు భుజాల మీద ఉంటూనే ల్యాప్‌టాప్‌ను నేరుగా చూడగలిగేలా ఉండాలని సూచించారు. ఇలా కాకుండా మరీ మెడ కిందకు వంచితే అది మెడ, భుజాల నొప్పులకు కారణమవుతుందన్నది డాక్టర్ల భావన. ఈ నవతరం యువత పనిమీద ఉన్న శ్రద్ధ తమ ఒంటిమీద ఎక్కడా చూపదని యోగా శిక్షకులు రవి ప్రశ్నిస్తున్నారు. సింపుల్ యోగా, లేదంటే స్ట్రెచ్‌తో వెన్ను సమస్యలకు దూరంగా ఉండొచ్చన్నారు. బ్యాక్ లేదంటే నెక్ పెయిన్ లాంటి వాటి బారిన పడకుండా ఉండాలంటే ముఖ్యంగా మూడు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నది నిపుణుల మాట. అందులో మొదటిది పోశ్చర్ (భంగిమ) అయితే రెండవది పొజిషన్ (స్థానం) మార్పులు. మూడవది కూర్చునే ఆసనం ఎత్తు. ఈ మూడు సరిగా ఉంటే వెన్ననొప్పి బారిన పడే అవకాశాలు కూడా తక్కువగా ఉంటాయి.

మూడో ముప్పు తప్పదా?

దేశంలో 2021 మార్చిలో గుర్తించిన కరోనావైరస్ కొత్త వేరియంటే సెకండ్ వేవ్‌కు కారణం కావచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. కేసులు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో బి.1.617 వేరియంట్, డబుల్ మ్యూటెంట్ ఉన్న శాంపిళ్లు లభించాయి. ఒకే వైరస్‌లో రెండు మ్యూటెంట్లు ఉంటే దానిని డబుల్ మ్యూటెంట్ అంటారు. దేశంలో మూడో వేవ్ కూడా రావడం ఖాయమని ప్రభుత్వ శాస్త్రీయ సలహాదారు కె.విజయ్ రాఘవన్ హెచ్చరించారు. 'అది ఎప్పుడు వస్తుందనేది స్పష్టంగా చెప్పలేం. కొత్త వేవ్‌ను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి' అని అన్నారు. 2021 సెప్టెంబరు, అక్టోబరులో కరోనా మూడో ఉధృతి దేశాన్ని చుట్టుముట్టవచ్చని రెండు కీలక సంస్థలు కేంద్రాన్ని హెచ్చరించాయి. దాదాపు రెండు లక్షల ఐసీయూ పడకలను సిద్ధం చేసుకోవాలని జాతీయ ప్రకృతి వైపరీత్య నిర్వహణ సంస్థ(ఎన్ ఐడీఎం), నీతి ఆయోగ్ కేంద్రాన్ని అప్రమత్తం చేశాయి. హోంమంత్రిత్వశాఖ అధీనంలోని ఎన్ఐడీఎం.. కరోనా మూడోదశ ముప్పుపై తన నివేదికను ప్రధానమంత్రి కార్యాలయానికి సమర్పించింది. ఇందులో కొవిడ్-19 ముప్పుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. నీతి ఆయోగ్ కూడా కీలక వ్యాఖ్యలు చేసింది. మూడో ఉధృతిలో ఆసుపత్రుల్లో 23 శాతం మంది చేరతారని, దాదాపు రెండు లక్షల ఐసీయూ పడకలను కేంద్రం సిద్ధం చేసుకోవాలంది. .

రానున్న 2 నెలలే కీలకం

కొవిడ్-19 పోరులో భారత్‌కు సెప్టెంబరు, అక్టోబరు నెలలు కీలకం కానున్నాయని జాతీయ ప్రకృతి వైపరీత్య నిర్వహణ సంస్థ తన నివేదికలో స్పష్టం చేసింది. వైరస్‌లో

venku1968@gmail.com

మార్పులు అధికమైతే సెప్టెంబరులోనే రోజుకు 5 లక్షల కేసులు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. పరిస్థితులను బట్టి సెప్టెంబరు నుంచి అక్టోబరు చివరినాటికల్లా ఎప్పుడైనా దేశంలో మూడో ఉధృతి కనిపించవచ్చని పేర్కొంది. చిన్నారులపై ఎక్కువ ప్రభావం కనిపిస్తుందని చెప్పే ఆధారాలు ఎక్కడా లేవని స్పష్టంచేసింది. ఒకవేళ వస్తే మాత్రం పిల్లలకు సరిపడా వైద్యసౌకర్యాలు దరిదాపుల్లో కూడా లేవని ఆందోళన వ్యక్తంచేసింది. వ్యాక్సిన్ కార్యక్రమం మందకొడిగా సాగడంపై కూడా ఈ నివేదిక చర్చించింది. ప్రస్తుతం 7.6 శాతం మంది మాత్రమే పూర్తిస్థాయిలో టీకాలు వేసుకున్నారని, ఈ సంఖ్య పెరగకపోతే రోజుకు ఆరు లక్షల కేసులు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది.

ప్రముఖ నిపుణులందరూ దేశంలో మూడో వేవ్ తథ్యమని చెబుతున్నారు. ఇన్‌ఫెక్షన్ ద్వారాకానీ, వ్యాక్సినేషన్ ద్వారాకానీ రోగనిరోధకశక్తి పెంచుకొని సామూహిక రోగనిరోధకశక్తిని సాధిస్తేనే కరోనాకు ముగింపు సాధ్యమని అంటువ్యాధుల నిపుణులు పేర్కొంటున్నారు. ఇదివరకు 67%మంది దేశ ప్రజలకు ఇలాంటి శక్తి వస్తేనే హెర్డ్ ఇమ్యూనిటీ సాధ్యమవుతుందన్నారు. అయితే ఇప్పుడు వైరస్‌లో ఉత్పరివర్తనాలు పెరిగి, అందులో కొన్ని వ్యాక్సిన్ల నుకూడా తప్పించుకోగలుగుతాయని చెబుతున్నందున హెర్డ్ ఇమ్యూనిటీ అన్నది ఇప్పుడు సంక్లిష్టంగా మారింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో 80-90% మంది రోగనిరోధకశక్తి సాధిస్తేనే హెర్డ్ ఇమ్యూనిటీ సాధ్యమయ్యే పరిస్థితి నెలకొంది. వైరస్ నిరంతరం పరివర్తనం చెందుతూపోతుంది కాబట్టి పిల్లలకు వ్యాక్సిన్ అందుబాటులోకి రాకపోతే పెద్ద సవాల్‌గా మారే ప్రమాదం ఉంటుంది. వైద్యఆరోగ్యశాఖ సమాచారం ప్రకారం ఇప్పటివరకు కొవిడ్ కారణంగా ఆసుపత్రుల్లో చేరిన పిల్లల్లో 60-70% మంది అనారోగ్యసమస్యలు, తక్కువ రోగనిరోధశక్తి ఉన్నవారే. ఒకవేళ మూడో వేవ్‌లో పెద్ద సంఖ్యలో పిల్లలు ఇన్‌ఫెక్షన్‌కు గురైతే అందుకు సరిపడా డాక్టర్లు, సిబ్బంది, వెంటిలేటర్ల తరహా పరికరాలు, అంబులెన్సులు దేశవ్యాప్తంగా ఎక్కడా లేవు. మూడో వేవ్ వస్తే అది తొలుత వ్యాక్సిన్ తీసుకోని పిల్లలపైనే ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అందువల్ల పాఠశాలల నిర్వహణ అన్నది కచ్చితతంగా డేటా, భద్రతా చర్యల ఆధారంగా తీసుకోవాలన్న డబ్ల్యూహెచ్‌వో సూచనలను పరిగణనలోకి తీసుకోవాలి. థర్డ్‌వేవ్‌ను ఎదుర్కోవడానికి ఇప్పటినుంచే సమాయత్తం కావడం మంచిది'' అని నివేదిక పేర్కొంది.

కొత్త వేరియంట్ వస్తేనే...

డెల్టా కంటే ప్రమాదకరమైన వేరియంట్ వస్తే.. అది సెప్టెంబరు ఆఖరికి క్రియాశీలకంగా ఉంటే.. మూడో ఉధృతి నవంబరులో గరిష్ఠస్థాయికి చేరుకుంటుందని ఐఐటీ కాన్పూర్‌కు చెందిన శాస్త్రవేత్త మణీంద్ర అగర్వాల్ తెలిపారు. కొత్త వేరియంట్ రాకపోతే మూడో వేవ్ ఉండకపోవచ్చని పేర్కొన్నారు.

జాతీయ, అంతర్జాతీయ కంపెనీల ఉదారత

కొవిడ్-19 కేసులతో ప్రపంచంలోనే భారత్ తీవ్రంగా ఇబ్బంది పడుతోంది. కొవిడ్‌పై పోరుకు దేశీయ కార్పొరేట్ దిగ్గజాలతో సహా అంతర్జాతీయ పారిశ్రామిక సంస్థలూ తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు ముందుకొస్తున్నాయి. ఇతర దేశాల నుంచి అవసరమైన వైద్య పరికరాలను వాయు మార్గంలో భారత్‌కు చేర్చడం దగ్గర్నుంచి, మెడికల్ ఆక్సిజన్‌ను తయారు చేయడం, ప్రజారోగ్య వ్యవస్థకు తోడ్పాటుగా ఆసుపత్రుల్ని ఏర్పాటు చేయడం వంటి అనేక కార్యక్రమాలను చేపడుతున్నాయి.

- అమెజాన్, గూగుల్ వంటి అంతర్జాతీయ కంపెనీలు, టాటా సన్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ గ్రూప్ వంటి దేశీయ దిగ్గజ సంస్థలు ప్రత్యేకంగా కొవిడ్ ఆసుపత్రుల్ని నిర్మించాయి. మెడికల్ ఆక్సిజన్ సరఫరాలో కీలకమైన క్రయోజెనిక్ ట్యాంకర్లను ఇతర దేశాల నుంచి వాయు మార్గంలో భారత్‌కు తరలించాయి. ఇవే కాకుండా ఆర్థిక సాయాన్ని కూడా ప్రకటించాయి.
- గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ 18 మిలియన్ డాలర్ల విరాళం ప్రకటించారు.
- అమెజాన్ 1,000 మెడ్‌ట్రానిక్ వెంటిలేటర్లను భారత్‌కు పంపించనున్నట్లు తెలిపింది.
- 1,000 వెంటిలేటర్లు, 25,000 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ పరికరాలను భారత్‌కు అందించడంలో పాలు పంచుకుంటున్నామని మైక్రోసాఫ్ట్ వెల్లడించింది.
- వాల్‌మార్ట్ ఫౌండేషన్ 20 ఆక్సిజన్ జనరేటర్ ప్లాంట్లను, 20 క్రయోజెనిక్ కంటెయినర్లను సరఫరా చేసింది.
- ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ తమ చమురు రిఫైనరీల్లో రోజుకు 1,000 టన్నులకు పైగా మెడికల్ ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసి సరఫరా చేస్తోంది. మొత్తం

దేశంలో ఉత్పత్తి అవుతున్న ఆక్సిజన్‌లో ఇక్కడి నుంచే 11 శాతానికి పైగా ఉంది. ప్రతి 10 మంది రోగుల్లో ఒకరికి ఈ ఆక్సిజనే అందుతోంది. అలాగే 1,875 పడకలతో జామ్‌నగర్‌లో కొవిడ్ ఆసుపత్రి నిర్మించి సేవలు అందిస్తోంది. ఆక్సిజన్ సరఫరా కోసం 24 ఐఎస్‌ఓ కంటెయినర్లను కూడా వాయుమార్గంలో తీసుకొచ్చింది.

● జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ఉక్కు ఉత్పత్తుల్ని నిలిపివేసి ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేయడమే కాకుండా, తమ ప్లాంట్ల చుట్టూ కొవిడ్ కేర్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది.

● విప్రో, అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్‌లు పుణెలోని ఐటీ కేంద్రాన్ని 430 పడకల ఇంటర్మీడియరీ కేర్ కొవిడ్ ఆసుపత్రిగా మార్చేశాయి.

● నారాయణ హెల్త్‌తో కలిసి ఇన్ఫోసిస్ బెంగళూరులో 100 గదుల కొవిడ్ ఆసుపత్రిని నిర్మించి పేద వారికి ఉచితంగా సేవలు అందిస్తోంది.

● ఐసొలేషన్ వార్డు ఏర్పాటులో సిప్లా మహారాష్ట్ర ప్రభుత్వానికి సహకారం అందించింది.

● దిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతంలో ఓ ఫీల్డ్ ఆసుపత్రిని వేదాంతా నిర్మిస్తోంది.

● గుజరాత్‌లో అదానీ ఫౌండేషన్ ఆసుపత్రుల్ని ఏర్పాటు చేస్తోంది. అహ్మదాబాద్‌లో ఉన్న అదానీ విద్యా మందిర్ పాఠశాలను అత్యవసర కొవిడ్ కేర్ కేంద్రంగా మార్చింది. ఇక్కడ రోగులకు ఆక్సిజన్, ఆహార ఇబ్బందులు లేకుండా చూస్తోంది.

● టాటా గ్రూప్ తమ కంపెనీల ద్వారా కొవిడ్ బాధితుల కోసం 5,000 పడకల్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రులకు రోజుకు 900 టన్నుల ఆక్సిజన్‌ను సరఫరా చేసేందుకు 1,000 క్రయోజెనిక్ కంటెయినర్లను దిగుమతి చేసుకుంది.

● ఐటీసీ 200 పడకలతో పశ్చిమ బెంగాల్‌లోని కిశోర్ భారతీ స్టేడియంలో 72 గంటల్లోనే తాత్కాలిక ఆసుపత్రిని సిద్ధం చేసింది.

● స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) దేశ వ్యాప్తంగా 1,000 పడకల తాత్కాలిక ఆసుపత్రులు, 250 ఐసీయూ పడకలు, 1,000 ఐసొలేషన్ పడకల్ని సిద్ధం చేసింది.

● కోల్ ఇండియా 750 ఆక్సిజన్, 70 ఐసీయూ పడకలతో సహా 2,000 పడకల్ని కొవిడ్ బాధితుల కోసం సిద్ధం చేసింది. తమ రెండు అనుబంధ సంస్థల ద్వారా 2 ఆక్సిజన్ జనరేటింగ్ ప్లాంట్లను ఏర్పాటు చేయించింది.

● అదానీ గ్రూప్ 48 క్రయోజెనిక్ ట్యాంకులను సౌదీ అరేబియా, థాయ్‌లాండ్, సింగపూర్, తైవాన్, యూఏఈల నుంచి కొనుగోలు చేసింది.

● టెక్ మహీంద్రా 20 ఆసుపత్రులకు వైద్య పరికరాలను అందించింది.

● ఎల్‌అండ్‌టీ గ్రూప్ 22 ఆక్సిజన్ జనరేటర్లను సరఫరా చేసింది.

● తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంఈఐఎల్ గ్రూప్ డీఆర్‌డీఓ, ఐటీసీ భద్రాచలంతో ఒప్పందాలు చేసుకుని, రోజుకు 35 లక్షల లీటర్ల మెడికల్ ఆక్సిజన్ తయారు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

అరవయ్యేళ్ల వృద్ధుడికి కరోనా సోకింది.. ఆసుపత్రిలో చేర్చారు. ఉన్నట్టుండి ఆక్సిజన్ లెవెల్స్ పడిపోయాయి. నాలుగురోజులపాటు ఐసీయూలో ఉంచి వెంటిలేటర్ మీద కృత్రిమంగా ఆక్సిజన్ అందించాల్సి వచ్చింది.

వైద్యుల కృషి ఫలించింది.. ఆయనకు బాగైంది.

ఇంటికి పంపేరోజున బిల్లు చేతిలో పెట్టారు.. చూడగానే ఆయన గుండె గుబిల్లుమంది!

రూ. 5 లక్షల బిల్లు.. వెంటిలేటర్ ఖర్చే లక్ష!

అది చూసి ఆయన భోరున ఏడ్చాడు.

డాక్టరుకు జాలేసింది.

"పోనీలే.. డబ్బు లేకపోతే కట్టకండి. తర్వాత చూసుకుందాం" అని సముదాయించాడు.

దానికి ఆ వృద్ధుడు చెప్పింది విన్నాక, ఆశ్చర్యపోవడం ఆయన వంతైంది. .

ఇంతకీ ఆ వృద్ధుడు ఏమన్నాడో తెలుసా?

అరవయ్యేళ్ల పాటు ఈ ప్రకృతి ఇచ్చిన గాలిని ఉచితంగా పీల్చి హాయిగా బతికేశాను. ఒక్కరోజు కూడా కృతజ్ఞతలు చెప్పలేదు.

నాలుగురోజులపాటు డాక్టర్లు సాయంతో వెంటిలేటర్ మీద ఉండి ఊపిరి తీసుకున్నందుకు నేను కష్టపడి కూడబెట్టినదంతా చెల్లించాల్సి వస్తుందంటే దాని విలువ ఎంతో అర్థమవుతోంది అన్నాడు.

★ ★ ★

మీకు తెలుసా..

ఒకరోజు మీ ఊపిరితిత్తులు చేసే పనిని వెంటిలేటర్ చేస్తే కనీసం రూ. లక్ష ఖర్చు.

మీ మూత్రపిండాలు చేసే పనిని డయాలిసిస్ యంత్రం చేస్తే రూ. పది వేల నుంచి పాతికవేలు.

మీ గుండెకు బదులు కృత్రిమంగా రక్తాన్ని పంప్ చేసే యంత్రాన్ని తాత్కాలికంగా అమర్చితే రోజుకు లక్షల్లోనే ఖర్చు. ఇంకా మెదడుకు ప్రత్యామ్నాయమైన సూపర్ కంప్యూటర్లో మరొకటో రాలేదు.. వస్తే గంటకు కోట్లలో ఖర్చుపెట్టాలేమో!

అంటే రోజుకు కొన్ని లక్షల విలువైన పనిని మీ దేహం, మీ ఒంట్లోని అవయవాలు చేస్తున్నాయి.

లక్షల విలువైన ప్రాణవాయువును మనిషి సహా జీవులన్నీ ఉచితంగా

పీల్చుకుంటున్నాయి. అమూల్యమైన జలాన్ని ఉపయోగించుకుంటున్నాయి..

ఆ సృష్టికర్తకు, ప్రకృతికి కృతజ్ఞతలు చెప్పటానికి ఇంతకంటే బలమైన కారణం కావాలా? అందుకే అనుక్షణం ఆ విధాతకు, ప్రకృతికి కృతజ్ఞులై ఉండాలి. సర్వప్రాణుల పట్ల భూతదయతో మెలగాలి.

బతికితే దేవుడు ఉన్నాడు అంటారు మనుషులు.. చస్తే దేవుడు లేడని నిందిస్తారు. కానీ చంపేది కూడా దేవుడే అని అర్థం చేసుకోకపోవడమే అజ్ఞానం..

ఎప్పుడైనా చూశారా, ఇలాంటి విపత్తును?

నేనే గొప్ప, నా కులమే గొప్ప, నా మతమే గొప్ప అనే వాళ్లతో సహా అందరినీ ప్రాణభీతితో ముక్కు మూయించి మూలన కూర్చోబెట్టింది ప్రకృతి. ఇప్పుడు వచ్చిన ఈ విపత్తు.. అభివృద్ధి పేరుతో మనిషి సాగించిన అరాచకానికి పరాకాష్ఠ. ఆధునికత పేరుతో నేర్చుకున్న విచ్చలవిడి వ్యవహారాలకు ఫలితం.

★ ★ ★

అభివృద్ధి పేరు చెప్పి చంద్రమండలంలోకి పోయే సత్తా మనుషులకుంటే.. గడప దాటకుండా ఇంట్లో కూర్చోబెట్టే శక్తి ప్రకృతికి ఉంది.

ఒకప్పుడు మీకు గుర్తుందా.. ఆరు బయట పడుకొని ఆకాశంలోకి చూస్తే.. లెక్కలేనన్ని చుక్కలు కనపడేవి. పాలపుంతల కాంతి లతాంతులు కనిపించేవి.

గుడ్డి దీపం వెలుతురులో సైతం నేల మీద అమ్మ పెట్టిన చుక్కల ముగ్గు కనిపించేది. ఇప్పుడు వెయ్యి వాట్ల లైట్ల వెలుతురులో కూడా కంటి అద్దాలు లేకుండా కనీసం ఎదుటి మనిషిని, వారి మనసును చూడలేని దుస్థితిలో ఉన్నాడు మనిషి!

మనిషి మనుగడకు గొడ్డలిపెట్టు అవుతున్న ఈ అభివృద్ధి దేనికోసం? ఎవరికోసం?

తినే తిండి కల్తీ.. తాగే నీరు కల్తీ.. వాతావరణంలో కాలుష్యం.. మాటల్లో మాలిన్యం.. ఆలోచనల్లో చాంచల్యం.. చేసే పనుల్లో వైఫల్యం..

ఏ ఆయుష్షు పెంచడానికి ఉపయోగపడని ఆదాయం ఏం చేసుకుంటారు?

అభివృద్ధి పేరుతో మనిషి వదిలిన మకిలిని అప్పుడప్పుడు తనకు తానుగా శుభ్రం చేసుకుంటుంది ప్రకృతి.

ఆఖరిగా ఒక మాట??

ప్రకృతికి లోబడి ఉంటేనే జీవితం. భారతీయుల జీవన విధానమే ప్రకృతితో ముడిపడి ఉంది. సనాతన ధర్మశాస్త్రాలు, వేద వేదాంగాలు ప్రకృతిని, పంచభూతాలను, సకల జీవరాశులను పూజనీయం చేశాయి అందుకే. చెట్టును, పుట్టను పూజించడం అజ్ఞానం కాదు.. ప్రకృతి పట్ల కృతజ్ఞతను ప్రకటించడం.

అలాకాకుండా మూర్ఖంగా ముందుకుసాగితే ఎలా కోత వేయాలో కచ్చితంగా చేసే తీరుతుంది ప్రకృతి. పాపభారం ఎక్కువైన ప్రతిసారి భూమాత దానిని

వదిలించుకుంటుంది.

ఈ మాటలు గుర్తుంచుకోండి.

ప్రకృతిని, సాటి మనుషులను గౌరవించనివాడు నుదుట నామాలు పెట్టిన హిందువు అయితే ఏంటి? గడ్డం పెంచి టోపి పెట్టిన ముస్లిం అయితే ఏంటి? మెడలో శిలువ ధరించిన క్రైస్తవుడైతే ఏంటి??

ప్రకృతి కన్నెర్ర చేసిన రోజున మతాలు కొట్టుకుపోయి మానవ కళేబరం మాత్రమే మిగులుతుంది!!

తస్మాత్ జాగ్రత్త.. జాగ్రత్త.. జాగ్రత్త!!

★ ★ ★

గౌహ శాంతిః అంతరిక్ష శాంతిః
పృథివి శాంతిః ఆపహ్ శాంతిః
ఔషధయ శాంతిః వనస్పతయ శాంతిః
విశ్వేదేవా శాంతిః బ్రహ్మ శాంతిః
సర్వం శాంతిః శాంతిరేవ శాంతిః

వేదర్షులు చెప్పిన పంచశాంతి మంత్రాల్లో ఇదొకటి.. విశ్వశాంతిని కోరే మంత్రమిది. "ఆకాశం శాంతితో ఉండుగాక..; వాయుమండలం శాంతితో ఉండుగాక..; పృథివి అంటే సమస్త భూమండలం శాంతితో ఉండుగాక..; జలం శాంతితో ఉండుగాక..; ఔషధాలు శాంతి కలిగించుగాక; వృక్షాలు శాంతితో ఉండుగాక; సమస్తం శాంతిమయంగా ఉండుగాక; శాంతి కూడా శాంతితో ఉండుగాక; లౌకికంలో, పదార్థాలలో శాంతితో ఉండుగాక; శాంతి ఉండుగాక!!

★ ★ ★

సర్వేజనా సుఖినోభవంతు..

ఇట్లు... మీ.. భారతమాత

మహమ్మారిపై ఉమ్మడి సమరం

భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు

'ఈనాడు'కు ప్రత్యేక వ్యాసం

ఇవాళ కొవిడ్ ఒక పెను తుపానులా, సునామీలా మన జీవితాలను అల్లకల్లోలం చేస్తోంది. మానవ మనుగడకే సవాలు విసురుతోంది. గడచిన వందేళ్లలో కనీవినీ ఎరుగని ఘోర విపత్తు ఇది. ఈ అసాధారణ సంక్షోభాన్ని అసాధారణ రీతిలోనే ఎదుర్కోవాలి. యథా లాప వ్యవహారశైలిని వీడి కొవిడ్‌పై కలిసికట్టుగా పోరాడాలి. ఆరునూరైనా ఈ పోరులో మనం గెలుపొంది తీరాలి. మన మానసిక, భౌతిక శక్తులన్నీ కూడదీసుకుని చురుగ్గా కదనరంగంలోకి దిగాలి. మహమ్మారిని ఓడించాలనే దృఢ సంకల్పాన్ని అణువణువునా నింపుకోవాలి. కొవిడ్ మొదటి దశను మనం సమర్థంగా ఎదుర్కొన్నాం. పీపీఈ కిట్లు, శానిటైజర్లు, వెంటిలేటర్ల ఉత్పత్తిని ఎన్నో రెట్లు పెంచాం. అన్నింటినీ మించి టీకాల తయారీని యుద్ధప్రాతిపదికన చేపట్టాం. మన వనరులు, సామర్థ్యాలను మోహరించి టీమిండియా మాదిరిగా ఏకతాటిపై కార్యోన్ముఖులమయ్యాం. వసుధైక కుటుంబకమనే ఆర్యోక్తిని పాటించి ఇతరుల మేలు కోసమూ పాటుపడ్డాం. ప్రపంచంలో పలు దేశాలకు కొవిడ్ టీకాలు, మందులు, ఇతర సామగ్రి అందించాం. మొదటి దశలో మనం ప్రదర్శించిన స్నేహ, సుహృద్భావాలు కొవిడ్ రెండోదశ విస్తృతి సందర్భంగా మనకు ఎంతో అక్కరకొచ్చాయి.. అప్పట్లో మన సహాయ

venku1968@gmail.com

సహకారాలు పొందిన ప్రపంచ దేశాలు ఇప్పుడు తమవంతుగా ఆక్సిజన్ సిలిండర్లు, మందులు, ఇతర సామగ్రిని పంపుతున్నాయి. కొవిడ్ చెలరేగుతున్న ఈ దశలో నిరాశా నిస్పృహలకు, పరస్పర నిందారోపణలకు తావివ్వరాదు. సంయమనాన్ని కోల్పోకూడదు.

నిర్విరామ కృషి

ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న శత్రువు కంటికి కనబడని మహమ్మారి. మనుషులను నిర్వీర్యం చేస్తూ వేగంగా వ్యాపిస్తోంది. దీన్ని మన జీవితాల నుంచి పారదోలడానికి ప్రధాని నరేంద్ర మోదీ అవిశ్రాంతంగా పోరాడుతున్నారు. ఈ సమరంలో విజయం సాధించడానికి మోదీ నాయకత్వంలో ప్రభుత్వం వివిధ వ్యూహాలను రచించి అమలు చేస్తోంది. ఆక్సిజన్ సరఫరాలను వేగంగా పెంచడానికి, రోగుల చికిత్సకు ఆస్పత్రుల సామర్థ్యాన్ని ఇనుమడింప జేయడానికి శతవిధాల కృషి చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు రంగ పరిశ్రమలు, కార్పొరేట్ అధినేతలు, పౌర సంస్థలతో కలిసి కొవిడ్ బాధితుల ప్రాణాలు కాపాడటానికి కేంద్రం నిర్విరామ కృషి జరుపుతోంది. ఈ కొవిడ్ కాళరాత్రి అంతమై వెలుగు రేఖలు పొడసూపక మానవు. మనం స్థిమితం కోల్పోకుండా మహమ్మారిపై పోరాడుతూ ఉంటే ఆ రోజు రానే వస్తుంది. గడ్డు పరిస్థితుల్లో గట్టివాడే నిలిచి గెలుస్తాడు. కాబట్టి ప్రతి కూల భావనలను దరిచేరనివ్వకుండా స్థిర చిత్తంతో పోరాడుతూ ముందుకెళ్లినప్పుడు మాత్రమే విజయం వరిస్తుంది. అజేయ భారతీయ చైతన్యంతో మనం మొదటి దశ కొవిడ్ విజృంభణను తట్టుకుని గట్టెక్కాం. రెండో దశను కూడా అదే స్ఫూర్తితో అధిగమించాలి. గడచిన సంవత్సర కాలంగా మన వైద్యులు, నర్సులు, ఇతర సహాయక సిబ్బంది మొక్కవోని స్థైర్యంతో, నిరుపమాన దీక్షాదక్షతలతో కొవిడ్‌పై పోరాడుతున్నారు. రెండో దశలోనూ అదే ఊపు ప్రదర్శిస్తున్నారు. వారికి కావలసిన సాధన సంపత్తిని మనం ఎప్పటికప్పుడు అందిం చాలి. ఆక్సిజన్ సరఫరాలను, అత్యవసర మందులను నిత్యం అందుబాటులో ఉంచాలి. దీని కోసం జాతి యావత్తూ సమైక్యంగా ముందుకు కదులుతోంది. భారత స్టీల్ ప్రాధికార సంస్థ (సెయిల్) ఆక్సిజన్ ఉత్పత్తిని ఎన్నో రెట్లు పెంచడం దీనికి ఉదాహరణ. ఏప్రిల్ రెండో వారంలో 500 టన్నుల ద్రవరూప ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసిన సెయిల్ ఇప్పుడు రోజుకు 1100 టన్నులు ఉత్పత్తి చేస్తోంది. భారతీయ రైల్వే శాఖ 27 ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల ద్వారా 1,585 టన్నుల ద్రవరూప ఆక్సిజన్‌ను రవాణా చేస్తోంది.

సవాలు పెద్దదే...

ఊహకందని సంక్లిష్టతతో మనల్ని చుట్టుముట్టిన కొవిడ్ మహమ్మారిని మొక్కవోని సై ్థర్యంతో ఎదుర్కోవలసిన తరుణమిది. వక్రీకరణలకు, వ్యర్థ విమర్శలు, నిందారోపణలకు సమయం కాదిది. సవాలు పెద్దదే కానీ, దాన్ని చూసి భీతిల్లరాదు. కొవిడ్ ప్రమాదాన్ని అధి

గమించడానికి కావలసిన టీకాలు, సమర్ధ వైద్య సిబ్బంది, రవాణా సౌకర్యాలు మనకు న్నాయి. మన శక్తిని మనమే శంకించుకుంటూ కూర్చోకుండా కార్యసాధనలోకి దూకినట్ల యితే కొవిడ్ కష్టనష్టాలను కనీస స్థాయికి తగ్గించవచ్చు, అమూల్య ప్రాణాలను కాపాడ వచ్చు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న ప్రధానమంత్రి, ఆయా రాష్ట్రాల ముఖ్యమం త్రులు సమన్వయీకృతంగా సంక్షోభాన్ని అధిగమించడానికి సకలవిధాల కృషి చేస్తున్నారు. ఇది జాతీయ ఆరోగ్య విపత్తు కాబట్టి, దాన్ని అధిగమించడానికి జాతి యావత్తూ ముందుకు కదలాలి. అంతా ప్రభుత్వాల మీదనే వదలి వేయకుండా ప్రతి ఒక్కరూ తమ జాగ్రత్తలో తాముంటూ, అవసరమైన సందర్భాల్లో చేయూచేయూ కలిపి పోరాడాలి. అన్ని ప్రభుత్వ విభా గాలు పరస్పర అనుసంధానతతో సమస్యను ఢీకొనాలి. మన లోపాలను మననం చేసు కుంటూ నిస్తేజితులం కాకుండా మన బలాల నుంచి అనుక్షణం స్ఫూర్తి పొందాలి. తప్పు లెన్నుతూ కూర్చుంటే పని కాదు. నిపుణుల సలహాలు స్వీకరిస్తూ, కొవిడ్‌పై పోరాడే వైద్య సిబ్బంది అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకొంటూ సంక్షోభాన్ని అధిగమించే వ్యూహాలను రూపొందించి అమలు చేయాలి. వ్యక్తులు, సంస్థలు తమ నైపుణ్యాలను, అనుభవాన్ని మేళ వించి కలిసికట్టుగా కొవిడ్‌ను జయించాలి. మన బంధుమిత్రులెవరైనా కొవిడ్ బారిన పడినా, ఆ వ్యాధి వల్ల మరణించినా విషాదంతో కుంగిపోవడం సహజం. అలాగని ఎల్లకాలం నిరా శావాదంలో, భయాందోళనల్లో కూరుకుపోవడం సరికాదు. అటువంటి ప్రతికూల భావనలను కలిగించే వార్తలు, వీడియోలను తలకెక్కించుకోకుండా సంక్షోభంపై పోరుకు సమాయత్తం కావాలి. తీవ్ర కష్టనష్టాల నుంచి బయటపడే సత్తా మనకుంది. కేవలం కొన్ని నెలల క్రితం, అంటే మొదటి దశ కొవిడ్ కేసులను తగ్గించడంలో మనం సఫలమైన సంగతిని గుర్తుకు తెచ్చుకొని, రెండో దశ అదుపునకు చొరవగా ముందుకు కదలాలి. కరోనా అదుపులో కృత కృత్యమైన ఇతర దేశాల నుంచి స్ఫూర్తి పొందాలి. చీకటి వెనుక వెలుగు ఉంటుందనే సత్యాన్ని నిరంతరం మదిలో నింపుకోవాలి.

'కష్టాల కడలిలోనూ మనో స్థైర్యాన్ని కోల్పోకూడదు' అని రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రబో ధించారు. 'నీ గమ్యం చేరేంతవరకు విశ్రమించవద్దు, అకుంఠిత దీక్షతో ముందుకు కదులు' అంటూ స్వామి వివేకానంద ఇచ్చిన ధైర్యాన్ని మనసులో ప్రతిష్ఠించుకోవాలి. కొవిడ్ రెండో దశ తరవాత కూడా మరిన్ని విషమ దశలు వచ్చే ప్రమాదం ఉంది. వాటిని అధిగమించ డానికి సర్వవిధాల సమాయత్తం కావాలి. టీకాలు వేయించుకొని, చేతులు తరచూ శుభ్రం చేసుకుంటూ, మాస్కులు ధరిస్తూ, భౌతిక దూరం పాటిస్తూ కొవిడ్ మహమ్మారిని పారదో లాలి.



సర్వేజనా సుఖినోభవంతు
లోకా సమస్తా సుఖినోభవంతు

venku1968@gmail.com

M.S.R.Venkata Ramana,
H.No: 5-4-1564/P-19WP,
Sharada Nagar Phase -IV,
Bhagyalata Colony, Vanasthalipuram,
HYDERABAD - 70